దేవిదేవతలు

వచన

శివాంజనేయము


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ లో eBOOK(PDF) అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంధాలయం ఉండాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) సహాయంతో ఇవ్వడం జరిగింది.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

http://ebooks.tirumala.org



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

SIVAANJANEYAMU

(History of Sri Anjaneya Swamy)

శివాంజనేయము



"అష్టైశ్వర్య ప్రదాత - ఉష్ట్రారూఢ మారుతి"

- డాక్టర్. పెండికట్ల శివరామకృష్ణారావు

Dr. Pendikatla Siva Rama Krishna Rao

Cell : 94405 95837



ది. 30.4.1997న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్,
శ్రీమతి పెద్ది అనంతలక్ష్మి, శ్రీ రెడ్డి గోవిందరావు గార్ల నుండి "కనువిప్పు" నాటిక
ఉత్తమ దర్శకునిగా ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న "డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది. 14.7.2000న తాళ్ళరేవులో రాష్ట్ర సహకారశాఖామాత్యులు
శ్రీ చిక్కాల రామచంద్రరావు గారిచేత సన్మానించబడుచున్న
"డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది.15.2.2005న కాకినాడ బాలా త్రిపురసుందరి గుడిలో
బ్రహ్మస్తుతి పారాయణ చేయిస్తున్న
"డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది. 5.10.2005న కాకినాడలో జిల్లా పరిషత్తు ఛైర్మన్
శ్రీ దున్నా జనార్దనరావు, శ్రీమతి వంగాగీత, శ్రీ ఎం.ఆర్. ప్రసన్నకుమార్, డి.ఇ.ఒ. గార్ల నుండి
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరిస్తున్న "డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది. 5.11.2005న తాళ్ళరేవులో మండలాధ్యక్షులు
శ్రీ మందాల గంగా సూర్యనారాయణ, శ్రీ విజయ థామస్, ఎం.పి.డి.ఒ. గార్లచే
సన్మానించబడుతున్న "డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది. 30.3.2006న కాకినాడలో శ్రీ వ్యయ ఉగాది కవి సమ్మేళనంలో
జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ దున్నా జనార్దనరావు గారిచే సన్మానింపబడుచున్న
"డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది. 19.3.2007న కాకినాడలో "సర్వజిత్" ఉగాది కవి సమ్మేళనంలో
కవయిత్రి శ్రీమతి బండి అనూరాధ పరశురామ్ గారిచే సన్మానించబడుచున్న
"డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"



ది. 1.7.2007న కాకినాడ గాంధీభవన్‌లో శ్రీ ఎం. బ్రహ్మయ్య, జస్టిస్ ఆఫ్ పీస్
శ్రీ జాన్ జోసఫ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గార్లచే సన్మానింపబడుచున్న
"డా॥ పెండేకట్ల శివరామకృష్ణారావు"

SIVAANJANEYAMU

(History of Sri Anjaneya Swamy)

DR., PENDIKATLA SIVA RAMA KRISHNA RAO, D.A.M.,

శివాంజనేయము

డాక్టర్, పెండికట్ల శివరామకృష్ణారావు













Hindu Cultural Series : *Book No.3*
First Edition : *December 2007*
Copies : *1000*

Publisher and Book Seller :-
Smt, V. Devi Sri Valli, B.A (Litt)
7-8-29/1, Up Stairs, Velamuri Vari Street,
Ramaraopeta, Kakinada - 533 004.
Phone : 9440595837.

Price :- Rs.108/-

On behalf of :-
Dr. PEN' DIKATLA SIVARAMAKRISHNARAO

Founder :-
Sri Lakshmi Narasimha Adhyaathmika Sahithya Parishad,
Panduranga Swamy Temple, Narasanna nagar
Kakinada - 533 004.

Permanent Address :-
Dr. P. Siva Rama Krishna Rao
8-43, Padmavathi Campus,
Pendikatla Vari Street,
Korukonda - 533 289.

Emblem designer :-
Suresh, Artist
Tallarevu - 533463.

Printed by Padmanabha Offset Printers,
Nageswara rao Street,
Kakinada
Ph : 6588013

SIVAANJANEYAMU

DR., PENDIKATLA SIVA RAMA KRISHNA RAO, *D.A.M.,*

శివాంజనేయము

పారాయణ గ్రంథము

(శ్రీఆంజనేయ స్వామివారి చరిత్ర సుందరకాండతో సహా)

రచన, సంకలనం

డాక్టర్॥ పెండికట్ల శివరామకృష్ణారావు

ఎమ్.కామ్., ఎమ్.ఎ., ఎమ్.యిడి.,

ఆయుర్వేద వైద్య విద్వాన్



ప్రచురణ కర్త :

వంకాయులపాటి దేవి శ్రీవల్లి, B.A.(litt.) పిఠాపురం

శ్రీలక్ష్మీనరసింహ ఆధ్యాత్మిక సాహిత్య పరిషత్తు

కోరుకొండ. H.O., 533289

కాకినాడ. B.O 533004

SRI LAKSHMI NARASIMHA

"లక్ష్మీనరసింహ మమ దేహి కరావలంబమ్"

ADHYAATMHIKA SAHITYA PARISHAD

Estd.: 2004 * KAKINADA-533 004.

శ్రీలక్ష్మీ నరసింహ ఆధ్యాత్మిక సాహిత్య పరిషత్తు

కాకినాడ - 533 004, కోరుకొండ - 533289.

రామాయణము, మహాభారతము, ఉపనిషత్తులు మొదలయిన మహత్తర గ్రంథములలోని ఆణిముత్యాల వంటి సన్నివేశములను, బ్రహ్మాస్తుతి వంటి పారాయణ శ్లోకములను, భావసందర్భాలతో సమగ్రంగా వివరించి మీకు అందించడమే శ్రీ లక్ష్మీనరసింహ ఆధ్యాత్మిక సాహిత్య పరిషత్తు యొక్క ఆశయము.

మీ హృదయ పూర్వక ఆర్థిక సహకారాన్ని కోరుతున్నాము. శ్రీ విష్ణుసహస్రనామములు, శ్రీలలితా సహస్రనామములు, దండకములు, రఘువీరగద్యము. వివిధ సుప్రభాతములు, చిన్ని పుస్తకములలో ముద్రించి మీ ఆర్డరుపై వివాహాది శుభకార్యములలో పంచుకొనుటకు సిద్ధంచేసి యివ్వగలము. ఇది స్వలాభాపేక్షలేని సేవాసంస్థ.

శ్రీ ఆర్. రామచంద్రరావు

అధ్యక్షులు

పాండురంగస్వామి గుడి

వరసన్న నగర్, కాకినాడ


డాక్టర్ పెండికట్ల శివరామకృష్ణారావు


వైద్యవిద్వాన్

ఫౌండర్

సెల్ : 94405-95837

శ్రీ వేంకటేశ్వరుని శుభాశీస్సులతో





శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల వారి
ఆర్థిక సహాయముతో ముద్రింపబడినది.

శివాంజనేయము

రచన, సంకలనం

డాక్టర్॥ పెండికట్ల శివరామకృష్ణారావు

ఎమ్.కామ్., ఎమ్.ఎ., ఎమ్.యిడి.,

ఆయుర్వేద వైద్య విద్వాన్

అంతరంగ స్పందన

"శివాంజనేయము" అనే ఈ గ్రంథములో శ్రీ ఆంజనేయస్వామి వారి చరిత్ర కొంత వరకు మాత్రమే అందించగలిగాము. మార్కండేయ మహర్షి, అశ్వత్థామ, ఆంజనేయస్వామివారు వీరంతా చిరంజీవులు.

శ్రీరామావతారానికి ఒక జననము, రావణాది రాక్షస సంహారము, రాజ్య పట్టాభిషేకము, లవకుశ జననము, చివరలో రామావతార పరిసమాప్తి వుంటాయి. అలాగే ద్వాపర యుగములో శ్రీకృష్ణపరమాత్మ జననము, బాల్యక్రీడలు, అష్టభార్యల సంప్రాప్తి, పాండవ సమాగమము, కురుక్షేత్రము, యదువంశనాశము శ్రీ కృష్ణ నిర్యాణము వుంటాయి. అవన్నీ శ్రీమహావిష్ణువు అవతారములు.

కాని జననమే గాని మరణంలేని చిరంజీవి హనుమ. ఆయనే భావి బ్రహ్మ. వారిది ఎంత వ్రాసినా తరుగని చరిత్ర. సమాప్తి వుండదు. వివిధ గ్రంథముల నుండి సేకరించి ఒక కథగా మీకు అందించే మహాద్భాగ్యం స్వామివారి కృపాకటాక్ష వీక్షణం వలన నాకు ప్రసాదించబడినది. యిందులో ఎంత వరకు కృతకృత్యుడను అయ్యాననే విషయం పాఠకులుగా మీరు చెప్పాలి. దోషములేవైనా వుంటే లిఖిత పూర్వకముగా తెలియజేయండి. మలి ముద్రణలో సవరించుకుంటాను.

సర్వదా
భగవద్భక్తుల సేవలో
డాక్టర్ పెండికట్ల శివరామకృష్ణారావు
వైద్యవిద్వాన్

కాకినాడ
వైకుంఠ ఏకాదశి
ది. 20-12-07

శివాంజనేయము

వచన కావ్యమునకు విషయ సంగ్రహము

శ్రీరామునికి చంద్రునితో సాదృశ్యము. వెన్నెలతో జనులందరిని ఆహ్లాదపరిచేది నెలరాజయితే, తన ధర్మవర్తనతో సర్వ మానవాళికి ఆదర్శప్రాయుడైనది శ్రీరాముడు. చంద్రునికి పదహారు కళలు, రామచంద్రునికి పదహారు ధర్మగుణములు. ఇవి విశదీకరించే వ్యాసము "శ్రీరామచంద్రుడు".

శ్రీమహాలక్ష్మి అవతారమే సీతాసాధ్వి. రామచంద్రునికి జన్మతః ఏ చుట్టరికము లేదు. కాని వారికి రూపసాదృశ్యం వుండటం విశేషము. "విరోధము లేకుండానే యితరుల ప్రాణాలు తియ్యటం రౌద్రవ్యసనము. అది మీరు చేస్తున్నారేమో ఆలోచించుకోండి", అని రామునికి ఉపదేశిస్తుంది అర్ధాంగిగా సీతాదేవి. ఆమె దశకంఠుని చేత అపహరింపబడి మితిమీరిన నిర్వేదానికి గురై ఆత్మహత్యాయత్నం చేస్తుండగా హనుమ శింశుపావృక్షం మీద నుండి రామకథ వినిపిస్తాడు. జీవితం మీద పునరాసక్తి కలుగుతుంది. మానవుడు ఎన్ని కష్టాలు ఎదురైనా జీవించి వుంటే నూరేండ్లకయినా ఆనందం లభిస్తుందనే మౌన సందేశాన్ని లోకానికందించి లోకమాత అనిపించుకుంటుంది సీతాసాధ్వి. ఇది ఆశావాద శుభసందేశము.

ఋక్షకుడు అనే రాతిగుండె గల బోయవాడు సప్తఋషుల అనుగ్రహం

పొంది 'మరా' మంత్రాన్ని పఠించి నారద మహర్షి కృప వలన జ్ఞానం పొంది, అప్రయత్నంగా పొందిన దుఃఖానుభవంలో శ్లోకాన్ని గానం చేసి ఆదికవియై రామాయణాన్ని వ్రాసి జన్మను ధన్యత చేసుకున్న కథాంశవ్యాసము రమణీయము.

రాక్షస సంహారం కోసం తొలిప్రయత్నంగా సర్వదేవతలు సృష్టించిన మహావీరుడు శ్రీఆంజనేయస్వామివారు. ఆయన కేసరి, అంజనలకు పుట్టి సూర్యగోళాన్ని ఫలంగా భావించి వజ్రాయుధ ప్రహరణం చేత "హనుమంతుడు" అవుతాడు. రామాయణంలో హనుమది సుందరకాండ. దానికి ఆయనే కథానాయుకుడు. విడిపోయిన సీతారాముల్ని తిరిగి ఒకటి చేసినది ఆయనే. సుందరకాండ యదాతథంగా వాల్మీకి రామాయణం నుండి అనువదింపబడినది.

హనుమ యుద్ధకాండలో చేసిన సాహసకృత్యాలు కూడా వివిధ వ్యాసాలలో కథాంశాలుగా చిత్రీకరించబడ్డాయి. ఆంజనేయుడు చిరంజీవి. ద్వాపరయుగంలో ధర్మరాజు రాజసూయ యాగం చేయటం; భోజనశాలల్లో అశౌచాన్ని తొలగించే ప్రయత్నంలో భీమసేనుడు పురుషమృగాన్ని తేవటం కోసం దేవలోకానికి ప్రయాణము చేయటము, మార్గమధ్యంలో హనుమ తన సోదరుని పరిక్షించి ఉగ్రాకారూఢుడై విశ్వరూపం చూపించి కార్యసాఫల్యానికి ఉపాయం బోధించడము, భీమసేనుడు పురుషమృగము చేత కబళించబడటము, ధర్మరాజు పక్షపాతరహితంగా తీర్పుచెప్పి ఆ మృగం యొక్క మెప్పుపొందటం, చివరకు భీమసేనుని కోరిక మేరకు పురుషమృగము యాగశాలలోని అపరిశుభ్రతలను తొలగించటం "శివాంజనేయము" అనే కావ్యములోని అంశము. సీతారాములు, ఆంజనేయస్వామి వార్ని గురించి యింత చదివిన పాఠకునికి పూజ, ధ్యానము చేసుకునేందుకు వీలుగా ఆయా అంశములు చివరలో యివ్వబడినాయి. మంగళము.

- పెండేకట్ల శివరామకృష్ణారావు

సర్వే జనాస్సుఖినో భవన్తు

శ్రీ వేంకటేశ్వరుడు అందరికి దేవుడు

ఆధార గ్రంథములు
BIBLIOGRAPHY

1. సుందరకాండము (వాల్మీకి రామాయణము) :- తాత్పర్యకర్త: శ్రీమాన్ చలమచర్ల వేంకట శేషాచార్యులుగారు, హైదరాబాదు
2. శ్రీ సుందర హనుమద్వైభవము :- బ్రహ్మశ్రీ శిష్టా చంద్రమౌళిశాస్త్రిగారు, శ్రీసత్యసాయిబాబావారి ఆస్థాన పండితులు, పెదపాడు, పశ్చిమ గోదావరిజిల్లా.
3. హనుమచ్చరిత్ర (వచనము) :- శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తిగారు భాగవత మందిరము - రాజమహేంద్రి.
4. శాంతిశ్రీ సుందరకాండ (వచనము) :- శాంతిశ్రీ బొత్సకవిగారు రాజమహేంద్రి.
5. కాకినాడ, రామారావుపేటలో - శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భముగా ది.09-03-2003న దేవస్థానంవారు ప్రచురించిన బుక్‌లెట్ గ్రంథనామంగాని రచయిత పేరుగాని ప్రచురింపబడలేదు. ఈ కార్యక్రమంయావత్తు పదకొండు మంది పండితుల పర్యవేక్షణలో జరిగినది.
6. శ్రీమద్ భగవద్గీత :- వ్యాసమహర్షి మహాభారతం నుండి.
7. శ్రీమద్రామాయణము - శ్రీమాన్ చలమచర్ల వేంకట శేషాచార్యులు తాత్పర్యకర్త.
8. రామాయణము :- **Sri C. Raja Gopalachari; First Indian Governor General of India.**
9. రామాయణము (వాల్మీకి) :- వచనకర్త : స్వర్గీయ "ఉషశ్రీ"గారు.
10. హనుమత్ప్రభంజనము :- గ్రంథకర్త : శ్రీపోలంరాజు శ్రీరామమూర్తిగారు.

కృతజ్ఞతలు

"శివాంజనేయము" గ్రంథ ముద్రణకు రూ. 20000/- (అక్షరాల యిరవై వేలు) ఆర్థిక సహాయము ప్రకటించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి, గ్రంథ రచనకు ప్రోత్సహించిన శ్రీ పీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వాముల వారికి(కాకినాడ), శ్రీ విజయ దుర్గాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ గండ్ వారికి (వెదురుపాక) ప్రత్యేక కృతజ్ఞతలు. ఒంటె వాహనము పై శ్రీ ఆంజనేయస్వామి వారి చిత్రము వేసి యిచ్చిన యువ చిత్రకారుడు శ్రీ సురేష్ గారికి (తాళ్ళరేవు) ప్రూఫ్ రీడింగ్‌లో సహకరించిన శ్రీమతి పెండికట్ల వరలక్ష్మి, బి.ఎ గారికి మరియు శ్రీవంకాయలపాటి వెంకట సూర్య కామేశ్వర ప్రసాద్, అడ్వకేట్ గారికి, డి.టి.పి. చేసిన శ్రీ సాయిత్రిపురా గ్రాఫిక్స్, శ్రీ పి. అచ్చిబాబు గారికి, సత్యగ్రాఫిక్స్ శ్రీ ప్రసాద్ గారికి సకాలములో అందముగా గ్రంథము ముద్రించి యిచ్చిన పద్మనాభ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అధినేత శ్రీ వై.ఎ.పి. రామమూర్తి (పద్మనాభం) గారికి పుస్తకావిష్కరణకు సహకరించిన పెద్దలకు బంధు మిత్రులకు సర్వదా కృతజ్ఞతలు.

మా సంస్థకు పేపరు సరఫరా చేస్తున్న నానీ కృష్ణా ఎంపోరియం శ్రీ జాలుమూరి రాజశేఖర్ గారికి కృతజ్ఞతలు

కాకినాడ

పెండికట్ల శివరామకృష్ణా రావు

వైకుంఠ ఏకాదశి

ది.20-12-2007

శివాంజనేయము

పారాయణ గ్రంథము

(శ్రీఆంజనేయ స్వామివారి చరిత్ర సుందరకాండతో సహా)

కిష్కింధాకాండము

సుందరకాండము

యుద్ధకాండ సన్నివేశములు

పూజా విధానములు

ద్వాపరయుగమున శ్రీ ఆంజనేయస్వామివారు

ద్వావమ్భసి నివేష్టవ్యౌ . గలే బద్ధ్వా దృఢాం శిలామ్

ధనవన్త మదాతారం, దరిద్రం చాతపస్వినమ్

ధనముండి దానము చేయనివానిని, దరిద్రుడై యుండి తపస్సు (రామనామస్మరణము) చేసికొనని వానిని, ఈ యిద్దరిని మెడకు బండకట్టి నీటిలో పడవేయవలెను.

-విదురనీతి

సమాప్తము

1. దేవతా ప్రార్థనలు



1. శ్రీ గణేశ ప్రార్థన :-

అంబికా హృదయానందం
మాతృభిః పరివేష్టితమ్,
భక్తప్రియం మదోన్మత్తం
వందేహం గణనాయకమ్ !!.

పార్వతీదేవి యొక్క మనస్సుకుమహదానందాన్నిచ్చేవాడు; బ్రాహ్మీ, మహేశ్వరి, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, ఇంద్రాణీ, చాముండా, అనే ఏడుగురు మాతృమూర్తుల చేత అల్లారుముద్దుగా చూడబడుతున్నవాడు; నిరంతరము మిక్కిలి సంతోషముతో వుండే నిత్యతృప్తుడు; తనను ఆరాధించే భక్తులకు ప్రియమైనవాడు అయిన శ్రీవిఘ్నేశ్వరునికి నేను నమస్కరించుచున్నాను.



2. శ్రీ సూర్యదేవ ప్రార్థన :-

నమః సవిత్రే జగదేక చక్షుసే
జగత్ప్రసూతి స్థితి నాశ హేతవే,
త్రయీ మయాయ త్రిగుణాత్మకారిణే
విరించి నారాయణ శంకరాత్మనే !!

లోకములకు ఒకే నేత్రమైనవాడు, విశ్వము యొక్క పుట్టుకకు, ఉనికికి, నాశనమునకు కారణమైనవాడు, వేదత్రయ స్వరూపుడు, త్రిగుణాత్మకుడు, బ్రహ్మవిష్ణు మహేశ్వర స్వరూపుడు అయిన సూర్యదేవునికి నమస్కారము.



3. శ్రీమహావిష్ణువు ప్రార్థన :-

నమామి నారాయణ పాద పంకజం
కరోమి నారాయణ పూజనం సదా,
వదామి నారాయణ నామ నిర్మలం
స్మరామి నారాయణ తత్త్వ మవ్యయమ్.

ఎఱ్ఱ తామర పువ్వుల వంటి సుందరములైన శ్రీమన్నారాయణుని పాదములకు నమస్కరింతును. ఎల్లప్పుడు శ్రీహరికి పూజ చేయుదును. నిర్మలమైన నారాయణుని నామస్మరణ చేయుచుందును. నాశరహితమైన శ్రీమన్నారాయణుని రూపమును ధ్యానించుచుందును.

4. శ్రీఉమామహేశ్వర ప్రార్థన :-

వాగర్థావివ సంపృక్తౌ
వాగర్థ ప్రతి పత్తయే
జగతః పితరౌ వన్దే
పార్వతీ పరమేశ్వరౌ.



శబ్దార్థముల వలె నిత్య సంబంధము కలవారు. సర్వ జీవరాశులకు జననీజనకులు అయిన పార్వతీ పరమేశ్వరులను, పదములు వాటి భావములు లెస్సగా తెలుసుకొనుటకు నమస్కరింతును.

5. శ్రీధన్వంతరి ప్రార్థన :-



నమామి ధన్వంతర్యాది దేవం
సురాసురైర్వందిత పాద పద్మౌ,
లోకే జరారుక్ భయ మృత్యునాశం
దాతా రమేశం వివిదౌషధీనామ్.

లోకములందలి జనులకు కలిగే రోగభయము, వృద్ధాప్యము, మృత్యువులను, వివిధ ఔషధములు ప్రసాదించి తొలగించువాడు, లక్ష్మీదేవి భర్త శ్రీమహావిష్ణువు అంతటి ఘనమైనవాడు, దేవరాక్షసయక్ష కిన్నెరకింపురుషాది గణముల చేత నమస్కరించబడేవాడు, ఆదిదేవుడు అయిన ధన్వంతరి దేవుని పాదపద్మములకు నమస్కరించుచున్నాను.

6. శ్రీకృష్ణ ప్రార్థన :-



బాలాయ నీలవపుషే నవకింకిణీక
జాలాభిరామ జఘనాయ దిగమ్బరాయ !
శార్దూల దివ్యనఖభూషణ భూషితాయ
నందాత్మజాయ నవనీతముషే నమస్తే !

పసిబాలుడు, నల్లని దిగంబర శరీరుడు, మొలకు బంగారు మువ్వలు కట్టినవాడు, శౌర్యచిహ్నమైన పులిగోరు ఆభరణాన్ని అలంకరించుకున్నవాడు, వెన్నదొంగ, నందుని కుమారుడు అయినట్టి శ్రీకృష్ణునకు నమస్కరించుచున్నాను.

7. శ్రీ లక్ష్మీనృసింహ ప్రార్థన :-



శ్రీమత్పయోనిధి నికేతన ! చక్రపాణే !
భోగీంద్ర భోగమణిరాజిత పుణ్యమూర్తే !
యోగీశ ! శాశ్వత ! శరణ్య ! భవాబ్ధిపోత !

లక్ష్మీనృసింహ ! మమ దేహి కరావలంబమ్.

పాలకడలి యందు నివసించు ఓ లక్ష్మీనరసింహమూర్తీ! చేతియందు చక్రాయుధమును ధరించినవాడా! ఆదిశేషుని పడగలయందలి మాణిక్యములచేత ప్రకాశించుచున్న పుణ్య విగ్రహముగలవాడా! యోగులలో శ్రేష్ఠుడా! శాశ్వతమైనవాడా! శరణాగత రక్షకుడా! సంసార సాగరమును దాటుటకు తోడ్పడే దివ్యమైన నౌక వంటివాడా! నాకు చేయూత నిచ్చి కాపాడుము.

8. శ్రీహయగ్రీవ ప్రార్థన :-



జ్ఞానానందమయం దేవం
నిర్మల స్ఫటికాకృతిమ్,
ఆధారం సర్వవిద్యానాం
హయగ్రీవ ముపాస్మహే !

జ్ఞాన స్వరూపుడు, ఆనంద స్వరూపుడు, పారదర్శకమైన స్ఫటికమువలె నిర్మల స్వరూపుడు, అన్ని విద్యలకు ఆధారమైనవాడు, భగవంతుడు అయిన శ్రీహయగ్రీవ దేవుని ధ్యానించుచున్నాను.

9. శ్రీలలితాదేవి ప్రార్థన :-



ప్రాతః స్మరామి లలితావదనారవిందం
బింబాధరం పృథుల మౌక్తిక శోభినాసమ్
ఆకర్ణ దీర్ఘనయనం మణికుండలాఢ్యం
మందస్మితం మృగమదోజ్జ్వల ఫాలదేశమ్

దొండపండు వంటి ఎఱ్ఱని పెదిమలు, పెద్దముత్యము పొదగబడిన ముక్కెరతో శోభిల్లు ముక్కు, చెవుల వరకు విస్తరించిన విశాలమైన నేత్రములు, మణిఖచిత మకర కుండలములు, చిరునగవు, కస్తూరితో ప్రకాశించే విశాల ఫాలభాగము గల శ్రీలలితామాత ముఖకమలమును వేకువ ఝామునే తలంతును.

10. శ్రీసరస్వతీదేవి ప్రార్థన :-



యా కుందేందు తుషార హార ధవళా, యా శుభ్రవస్త్రావృతా
యా వీణా వరదండ మండితకరా యా శ్వేత పద్మాసనా,
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభి ర్దేవైః సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా.

ఏ సరస్వతీదేవి మల్లెలు, చంద్రుడు, మంచు, ముత్యాలహారముల వలె తెలని

కాంతులతో ప్రకాశించుచున్నదో, ఏదేవి క్షీరమువలె తెల్లనైన వస్త్రములు ధరించినదో, ఏదేవి కమల హస్తములందు మాణిక్య వీణను అలంకారముగా ధరించియున్నదో, ఏ శారదాదేవి తెల్లతామరను ఆసనముగా చేసుకొని సుఖాసీనురాలై యున్నదో, ఏ వాగ్దేవతాదేవి బ్రహ్మావిష్ణు మహేశ్వరులచేత నిరంతరము పూజించబడుచున్నదో, ఆ సరస్వతీ జగదంబ సకల సంసారబంధనములు క్లేశముల నుండి నన్ను రక్షించి కాపాడును గాక!

11. శ్రీసీతారాముల ప్రార్థన :-



చ. సిరులిడ సీత, పీడలెగ జిమ్ముటకున్ హనుమంతు, డార్తిసో
దరుడు సుమిత్రసూతి, దురితంబులు మానుప రామనామము
కరుణ దలిర్ప మానవుల గావగ నెన్నిన వజ్రపంజరో
త్కరముగదా భవన్మహిమ, దాశరథి కరుణా పయోనిధి !!

దశరధుని కుమారుడు, దయపాలసముద్రమనే అంతరంగముగల వాడవు అయిన ఓ శ్రీరామచంద్రమూర్తీ! మాకు ధనరాశులిచ్చుటకు సీతాదేవి, తస్కర వ్యాధిపీడలు బాపుటకు శ్రీ అంజనేయస్వామివారు, భయదుఃఖాదులచే ఆర్తిగొన్న మాకు రక్షణ నిచ్చుటకు నీ భ్రాత లక్ష్మణస్వామివారు, మేము చేసిన పాపములను రూపుమాపుటకు నీ దివ్య "రామ" నామము, యివన్నీ మానవజాతిని ఉద్ధరించుటకు నీవు నిర్మించిన వజ్ర పంజరావాసములే కదా ప్రభూ! నీ మహిమలు అమోఘములు.

2. శ్రీరామాయణము – నామౌచిత్యము

రామాయణం – అనే పదంలో రామకథను సూచించే శబ్దంలేదు. ఇందులో రెండు మాటలున్నాయి. రామ, అయనం. రామ శబ్దం భగవన్నామం అని భావిస్తే అయనం అన్న మాటను పరిశీలిద్దాము.

అయనము : 1.గతి, 2.త్రోవ, 3.ప్రదేశము, 4.ఆశ్రమము, 5.సైన్య వ్యూహమున ప్రవేశించు ద్వారము, 6.సూర్యుడు దక్షిణోత్తర దిశలకు పోవుట, 7.సూర్యుని యొక్క దక్షిణోత్తర దిగ్గమనమునకు పట్టుకాలము. దానినే మనం ఉత్తరాయణము, దక్షిణాయనము అని పిలుస్తున్నాము. 8.మోక్షము అనే అర్థాలు సూర్యరాయ ఆంధ్ర నిఘంటువు చెపుతోంది.

సందర్భోచితంగా ఎంచుమించు అన్ని అర్థాలు రామాయనమునకు వర్తిస్తాయి. ఈ ప్రయాణాలన్ని చేసిన వానికి చివరి అర్థం మోక్షం సిద్ధిస్తుందని విశ్వసించవచ్చు. రామస్య అయనం రామాయనం. రాముని యొక్క ప్రయాణం రామాయనము. అయనములో వున్నది 'న' యే గాని 'ణ' కాదు. కాని రామ శబ్దంలో 'ర' కారం వున్నందువల్ల అయనంలో 'న' 'అక్షరం' 'ణ'గా మారి "రామాయణం" అయింది. రామ+అయనం రెండు మాటల వల్ల యేర్పడిన సమాసం యిది. రాముని యొక్క అయనం అని అర్థం చెప్పుకుంటే షష్ఠీ తత్పురుష సమాసం అవుతుంది. షష్ఠీ విభక్తి ప్రత్యయం "యొక్క" రెండు నామవాచకాలకు గల సంబంధం మాత్రమే చెపుతుంది. క్రియతో దీనికి సంబంధం లేదు. స్వతంత్రంగా కర్తృత్వాన్ని, భోక్తృత్వాన్ని సమర్థించగల రెండు నామ రూపాలకు అవినాభావ సంబంధాన్ని కూర్చటమే షష్ఠీ విభక్తి సాధించే ప్రత్యయ పరమార్థం. ఇలాంటి విభక్తితో యేర్పడిన తత్పురుష సమాసం "రామాయణం". వ్యాకరణ పరిభాషను రామాయణం అనే పద సమూహం రామ శబ్దాన్ని అయనంతో అన్వయింపజేసే సమర్థ పదవిధి అని స్పష్టమవుతుంది.

రామ శబ్దం 'రమ్' అనే సంస్కృత ధాతువు నుండి యేర్పడింది. రమ్ అనగా రమించుట, ఆనందపడుట, ఆనంద పెట్టుట, హాయిని గొల్పుట అని అర్థం. అయన శబ్దం 'ఇ' అనే ధాతవునుండి పుట్టినది; కదలుట, నడచుట, పయనించుట అనే అర్థాలున్నాయి దీనికి. కనుక రామాయణం అంటే రాముని యొక్క ప్రయాణం, రాముని యొక్క నడవడి, రాముని యొక్క కదలిక యిలా అర్థాలు చెప్పుకోవచ్చు. ఏ అర్థం చెప్పుకున్నా మొత్తం గ్రంథ సారాంశం ఆ అర్థంలో యిమిడి పోతుంది. అదే ఈ పేరులోని పెన్నిధి. కాబట్టి రామాయణం కేవలం రాముని కథ కాదని, అది రాముని అయనాన్ని సూచిస్తుందని తేలింది. రామ శబ్దంలోని రమణీయతకు "అయన" శబ్దం కమనీయమైన గమనాన్ని వేగాన్ని జోడిస్తుంది.

ప్రపంచంలో రెండు శక్తులున్నాయి. అవి 1.స్థితిజశక్తి, (Potential Force) 2.గతిజశక్తి (Kinetic Force). ఈ రెంటి సమ్మేళనమే రామాయణం. ఉపనిషత్తుల్లో 1.తదేజతి, 2.తన్నైజతి - అది చలిస్తుంది, చలించదు అనే సూక్తి కూడా రామాయణ శబ్దంలో ధ్వనిస్తుంది. పారమార్థికంగా చూస్తే "రమంతే యోగినః అస్మిన్ ఇతి రామః" యోగులు ఎవని యందు ఆనందించుచుందురో అతడు రాముడు. "రమయతి ఇతి రామః" సర్వజీవులను ఆనందింపచేయువాడు రాముడు. ఆనంద స్వరూపుడు, ఆనందము నిచ్చేవాడు, ఆనందము కలవాడు రామచంద్రుడే.

రామాయణ మహాయనంలో సీతారాములు సమాన భాగస్వాములు. రామాయణ మనే పేరులోనే ఈ రహస్యం నిబిడీకృతమై వుంది.

రామము = అందమైనది, సొగసైనది. అన్న అర్థాలున్నాయి. సీత సౌందర్యవతి. సాక్షాత్తు లక్ష్మీ స్వరూపిణి. సీతాదేవిని 'రామ' 'రామా' అని వాల్మీకి అనేక సందర్భాలలో సంబోధించారు. దశరథునితో సుమంత్రుడు అన్న మాటలివి:-

బాలేన రమతే సీతా బాలచంద్ర నిభాననా,

రామ రామే హ్యదీనాత్మ విజనే2 పి వనేసతీ.

బాలచంద్రుని వంటి మోముతో శోభిల్లుతున్న సీతమ్మ బాలాత్రిపుర సుందరిలా మహారణ్యాన్ని మధువనంగా భావించి విహరిస్తున్నది. ఆమెకు యింత గుండె నిబ్బరం, సంతోషం ఎక్కడ నుంచి వచ్చాయి. రామ (సీత) ప్రక్కన రాముడుంటే దిగులెందుకు? అంటాడు వాక్య విశారదుడైన వాల్మీకి. ఇక్కడ రామశబ్దం (రాముడు) రామా శబ్దం (సీత) జంటగా కనిపిస్తాయి. అందువల్ల లోకంలో అంత ప్రచారం లేకపోయినా, 'రామ' శబ్దం సీతకు రూఢి కాకపోయినా ఆ పదం సీతకు వర్తిస్తుందనటంలో సందేహం లేదు.

రామ+అయనం అన్నా; రామా+అయనం అన్నా రామాయణమే అవుతుంది. రామాయణ శబ్దంలోని చమత్కారం యిదే. స్త్రీ దేవతను మాతగా జోడించి చెప్పుకునే సంప్రదాయం విశిష్టాద్వైతులది. అది మహోన్నతమైనది. రాముడు లేని సీతగాని, సీతలేని రామభద్రుడు కాని ఆరాధ్యులుకారు. వారుభయులది; విడదీయ రాని బంధం. మాతా పితరులు వారు సర్వజగత్తుకూ! అందువల్లనే మనం "శ్రీరామ" అనాలి. శ్రీరామ అని జపించాలి. రామ శబ్దానికి ముందు కచ్చితంగా చేర్చవలసిందే శ్రీ = అంటే లక్ష్మి అమ్మవారు. శ్రీయుక్తమైన రాముడు సర్వశుభంకరుడు. లోకరక్షకుడు. అందువల్లనే "శ్రీరామ జయరామ జయ జయ రామ" అన్నది తారక మంత్రమైనది. ఈ శ్రీరామ శబ్దానికి ముందు వెనుకలు ఏ పదాలు చేర్చినా వీలైనంత వరకు రామాయణ పరమైన శబ్దాలనే చేర్చి ముక్తి పొందండి. ఉదాహరణకు సీతారామ, జానకిరామ,

దశరథరామ, అయోధ్య రామ, సాకేత రామ ఇలాంటి పద నిర్మాణం ప్రాచీనమైనది. రామాయణ పరమైనది. శబ్దం శరంలా మన ఆరాధ్య దైవాల పాదాలను చేరుకోవాలి. గురువు మనకు మోక్షప్రదాతకాడు. ఆయనను ఒక గురువుగా మాత్రం గౌరవిస్తే చాలు. ఏ మానవ శరీరమైనా తిరిగి మరో జన్మ ఎత్తవలసినదే. గురువు పరమాత్మకు ప్రత్యమ్నాయం కాజాలదు. పరమాత్మను చేరుకునే మార్గం మాత్రమే చూపగలదు. సీతారాముల సంయోగాన్ని విడదీయరాదు. వారిని కలిసి పూజించినా స్మరించినా మనకి పూర్ణమైన ఫలం లభిస్తుంది. అందువల్ల రామాయణం అన్న పదంలోనే ఇది సీతారాముల పవిత్ర చరిత్ర; పరమోత్తమైన నడవడి, ఆదర్శప్రాయమైన దాంపత్యం, యిన్ని అర్థాలు యిమిడివుండటం శబ్దవైచిత్రి; భాషాచమత్కారం, అనేక భావసంకలనం. వాల్మీకి మహర్షి తన రచనకు పెట్టుకున్న పేరులోనే ఈ పరమ రహస్యం వుంది. చివరిగా చెప్పేది శ్రీరామ శబ్దమే సర్వశుభంకరమైనదని. మీకు ఇహ పరలోకాలవాంఛలు, వీటికతీతమైన మోక్షం శ్రీరామ శబ్ద శరణాగతివల్లనే సిద్ధిస్తాయి.

ఇక రామాయణ నామౌచిత్యాన్ని కథాపరంగా విహంగ వీక్షణం చేద్దాము.

నిజానికి రామచంద్రుడు లక్ష్మణ భరత శత్రుఘ్నులతో పుట్టినది మొదలు తిరిగి అయోధ్యలో శ్రీరామ పట్టాభిషేకం జరిగే వరకు అంతా హడావిడే! రామచంద్రుని జీవితమే ఒక అయనం. ఈ అయనత్వం నిరంతర, నిర్విరామ నియమ నిష్ఠలతో ధర్మబద్ధంగా కనిపిస్తుంది. వాల్మీకి రామ జననాన్ని వర్ణించగానే, అదే సర్గలో విశ్వామిత్ర ఆగమనాన్ని సూచిస్తాడు. వృద్ధ దశరథుడు మితిమీరిన ప్రేమతో పెంచుకొంటున్న రామచంద్రునికి పదహారేండ్ల ప్రాయంలోనే వనగమనం. రామలక్ష్మణులు యాగరక్షణార్థం క్రూరరాక్షస సంహారం, తిరుగు ప్రయాణంలో అహల్యా శాపవిమోచనం, శివధనుర్భంగం, పరశురామ ప్రతిఘటన, సీతాస్వయంవరం, సీతారామ కళ్యాణం, పెండ్లి చేసుకుని అయోధ్యలో కొంత కాలం గడపగానే దశరథుడు చేసిన రామభద్రుని పట్టాభిషేకం యోచన అది విఫలమై వనగమనం, సీతాలక్ష్మణులతో రాముడు పదమూడేళ్ళు సుమారుగా అడవిలో వున్నాక, ఖరదూషణాదులతో వైరం వస్తుంది. శూర్పణఖ వారిజీవితాల్లో కల్లోలానికి మూలకారణం. రావణుడు సీతనపహరించాడు. సుగ్రీవమైత్రి, వాలీసంహారం, సీతాన్వేషణం, సేతుబంధనం, లంకాయాత్ర, రావణకుంభకర్ణ సంహారం. ఇలా సీతారాముల జీవితం ఒక్క క్షణం కూడా స్థాయి, హాయి లేకుండా గడిచింది. పడరాని పాట్లు పడినా వారు సత్యధర్మాలను అతిక్రమించలేదు. ఎక్కడా శ్రీలక్ష్మీనారాయణుల దివ్య శక్తులు ప్రదర్శించలేదు. జీవితంలో ఎన్ని సంక్షోభాలు ఎదురైనా జానకీ రాములు ధైర్యంగా నిలబడ్డారు. సీతమ్మ యిన్ని కష్టాలు అనుభవించినా చివరకు భర్త చేత శంకించబడి అగ్ని పరీక్షకు సిద్ధమైంది. అగ్ని అగ్నిని కాల్చలేదుకదా! ఆమెలోకపావని, పతివ్రతా శిరోమణి అందువల్ల రామ

పరీక్షకు నిలబడి ప్రపంచ నారీలోకానికి శిగబంతి అయింది. రామచంద్రునికి మార్గదర్శకురాలు సీతాసాధ్వి ఇంతటి చరిత్ర కావ్యంగా మలచిన మహాశిల్పి వాల్మీకి.

అందుకే -

"కూజంతం రామ రామేతి

మధురం మధురాక్షరం

ఆరుహ్య కవితా శాఖా

వందే వాల్మీకి కోకిలమ్" అన్నారు పెద్దలు.

"వాల్మీకి అనే కోకిల కవిత్వమనే కొమ్మలెక్కి 'రామ.........రామ' అని మధురంగా, మధురాక్షరాలు శ్రావ్యంగా కూయుచున్నది. ఆ వాల్మీకి కోకిలకు నేను నమస్కరించుచున్నాను.

వాల్మీకేర్ముని సింహస్య

కవితావన చారిణః

శృణ్వన్ రామకథా నాదం

కోన యాతి పరాం గతిమ్ ?

"వాల్మీకి ముని సింహం కవిత్వమనే అరణ్యంలో సంచరిస్తున్నది. ఆ మృగరాజు రామకథానాదం అనే గర్జన చేస్తున్నది. ఆ నాదమును విన్న వాడెవడు పరలోక గతిని పొందడు? అంటే మోక్షాన్ని పొందుతాడు అని భావం. ఆ రామాయణ మహాకావ్యాన్ని మీరూ పఠించి ఆయురారోగ్య ఐశ్వర్యాలు పొందుదురు గాక! స్వస్తి.

విజ్ఞాన శాస్త్రం

ఎక్కడ పాంచభౌతిక ప్రపంచం ఆగిపోతుందో, అక్కడ ఆధ్యాత్మిక విషయాలు ప్రారంభమవుతాయి. విజ్ఞానశాస్త్ర పురోగతి ఎంత పరాకాష్ఠకు చేరుకున్నా ఆధ్యాత్మిక విశ్వాసానికి ఒక మెట్టు క్రిందనే ఆగిపోతుంది. —— **Pen, dikatla** ——

మాట - మంచితనం

మన మనసు ఎంత మంచిదో మనకు తెలుసు. కాని దాని స్వరూపాన్ని ఇతరులు మన మాటల ద్వారానే అంచనా వేస్తారని గ్రహించండి.

ధైర్యంగా వుండండి, సంతోషంగా వుండండి, కాని అప్రమత్తంగా వుండండి.

BE BRAVE, BE HAPPY, BUT BE ALERT.



3. ఆది కవి వాల్మీకి

వాల్మీకి అసలు పేరు ఋక్షుడు. భృగు వంశోద్భవుడు. రాజస, తామస ప్రవృత్తి గలవాడు. గజదొంగ. అరణ్య మార్గంలో ప్రయాణించే బాటసారుల ద్రవ్యాభరణాలను భయపెట్టో బాధపెట్టో దోచుకుని జననీజనకులను, దారాపుత్రులను పోషించేవాడు. కమండలాలు, జటావల్కలాలు ధరించి, భగవన్నామం చేసుకుంటూ ఆ మార్గంలో వెడుతున్నారు సప్త ఋషులు.

"ఏయ్! సాములు. ఆగండి. మీ దగ్గర యేముందో యిచ్చి వెళ్ళండి!" గద్దించాడు ఋక్షుడు.

"ఎవరు నాయనా నువ్వు?"

"మాటలు కట్టిపెట్టి మీ కాడనున్న వస్తువులు యిక్కడ పెట్టి కదలండి".

"మా దగ్గరేముంది బాబు ఈ కమండలాలు, కృష్ణాజినాలు తప్ప".

"ఆ మూటల్లో ఏముంది".

"విభూతి"

"అంతే" అంటూ దగ్గరకు వచ్చి ఓ మూట యిప్పి చూసి – "చస్" బూడిద.

"ఇంతకంటె విలువైనవి ఏమీలేవా?"

"అన్నిటి కంటె విలువైన అష్టాక్షరి మంత్రం వున్నది".

"చస్.....మంత్రాలు మారేడుకాయలు నాకెందుకు నగానట్ర వుంటే యివ్వండి, కాసులుంటే యివ్వండి". అవన్నీ మాకెందుకు నాయనా! అయినా నారాయణమంత్రం జపించుకునే మునులము మాకు వాటితో పనేమిటి?"

"అయితే వచ్చిన తోవనే ఎల్లండి. తిరిగి మల్లా వచ్చేటప్పుడేమన్నా తేకపోయారో మీ తలలు పగుల గొడుతా! పోండి! అంటూ హుంకరించాడు ఋక్షుడు. వాడి క్రూరత్వానికి, అమాయకత్వానికి స్వాములకు జాలికలిగింది. నవ్వుకున్నారు. ఒకాయన–

"నాయనా! యిలా దగ్గరకు రా!"

"యేం! సెప్పు యేంగావాల్నంట"

"సర్వసంగపరిత్యాగులము భగవన్నామము దగ్గరుండగా మాకేమి అక్కరలేదు. నీకు మంచి చేద్దామని".

"అదేదో నామం అంటున్నారు. అది వుండగా యింకేం అక్కర్లేదా! అది నాకిత్తారా దగ్గర కొత్తాను".

"భగవన్నామం కావాలా!"

"అదేదో అన్నింటికన్నా గొప్ప దంటున్నారుగాందా! సూద్దావని"

"అది కంటికి కనిపించే వస్తువుకాదునాయనా?"

"ఉరె....ఉరె....ఉరె..... అన్నింటికంటె గొప్పదంటున్నావు, కనపడదంటావు.... నీ కాదున్నాదంటావు. దగ్గర కొత్తే యిత్తానంటావు. అంతా కల్లబొల్లి మాటలే! పైగా గడ్డాలు పెంచిన సాములు. ఎల్లెల్లెహె! నాతో అబద్దాలెందుకు!"

"అసత్యం కాదు నాయనా! భగవన్నామం అన్నిటి కన్న గొప్పది. అది నీకు యివ్వగలము. అయితే నువ్వో పని చెయ్యాలి.

"ఏటది!" అంటూ ముందు కొచ్చాడు. చెవి గోక్కుంటూ "సెప్పు! నా తస్సారవల ఈ గద బుజానేసుకుంటే నే సెయ్యలేనిదేముంది సెప్పు" సిటికెలో సేసేత్తాను". అంటూ మీసం దువ్వి చిటికె వేసి సవాలు చేస్తూ గద భుజాన వేసుకు నిలబడ్డాడు.

"నువ్వు రోజూ చేసే ఈ దొంగ పనులు పాపమని నీకు తెలియదా!

"తెలుస్సామీ అయితే పొట్ట నింపుకోడానికి మరో బతుకు తెరువు నాకు తెలవదే!"

"ఈ సొమ్ములు, ఆభరణాలు ఎవరి కోసం దొంగిలిస్తున్నావు."

"తస్సారవలా! మీరేమో సూత్తే పెళ్ళిపెటాకులు లేని సన్నాసోళ్ళు. మరి నాకు పెల్లయింది, పెల్లాం బిడ్డలున్నారు. అమ్మానాన్నా వున్నారు. మరాల్లందరికి బువ్వెట్టొద్దా!"

"పెట్టాలి"

"అందుకే ఈ పన్జేత్తున్నా"

"మరి నువ్వు చేసే ఈ పాపంలో పాలు పంచుకుంటారేమో వాళ్ళనెప్పుడైనా అడిగేవా?"

"లేదు. అయినా నా సొమ్ముతినేటోల్లు నాకు పాపవొత్తే పంచుకోరంటావా సామీ!"

"ఆ విషయమే వెళ్ళి వాళ్ళనడిగిరా"

"నేవెళ్ళి సిటికెలో వత్తా! మీరంతా సెట్టు నీడ్నికూకోని జపం సేసుకోండి"

"అలాగే వెళ్ళిరా" పరుగు పరుగున వెళ్ళి తన యింటిలో భార్యను కలిసాడు.

"యివాళ యేం నగలు తెచ్చారు." అంది నవ్వులొలకబోస్తూ, పట్టు చీర సింగారంగా సవరించుకుంటూ.

"అవన్నీ తరవాత గానీ, నువ్వు నా పాపంలోబాగం పంచుకుంటావా?"

"యేందయ్యో! పాపం అంటన్నావు. నన్ను కట్టుకున్నోడివి పోసించే బరువునీది. నిన్ను సుకపెట్టి పిల్లల్ని కని సాకుతున్నాను. నువ్వు పాపవే చేస్తన్నావో, పున్నెమే సేత్తన్నావో నాకేం అక్కరలేదు."

మరి నేచేసిన పాపఫలం నేనే అనుభవించాలా".

"నిన్ను పాపాలు చెయ్యమని నేను సెప్పలేదే! కట్టపడి కూలిజేసి మాకింత జొన్నకూడు పెడితే మాత్రం నేకాదంటానా? కట్టపడి సంపాదించటం చేత గాక దొంగతనాలు సేత్తన్నది నువ్వు నేసెయ్యమన్లా! నాపెళ్లినాటికే నువ్వీ దొంగపన్లుసేన్తన్నావు" వెటకారంగా దెప్పి పొడిచింది. అవాక్కయిపోయాడు. ఆశ్చర్యపోయాడు. వళ్ళంతా గగుర్పొడిచి ఒక్కసారిగా చెమటలు పట్టాయి. వెంటనే అరుగుమీద కూర్చున్న తల్లితండ్రుల దగ్గరకెళ్ళి నమస్కరించాడు.

"అమ్మా నాన్నలారా! నను కనిపెంచిపోసించిన దేవుళ్ళారా! నేచేస్తున్న పాపాల్లో పాలు పంచుకుంటారా?" తల్లిదండ్రులు ఒకరి ముఖాలు ఒకరు చూచుకుంటున్నారు.

"సెప్పయ్యా!........ అమ్మా నువ్వైనా సెప్పు నేసేత్తున్న పాపాల్లో మీరు వంతుంటారా?" యిద్దరూ మందహాసం చేస్తూ కూమారుని వంక చూస్తున్నారు.

"బిడ్డా! నిన్ను కనిపెంచి పెద్దజేసి ఓ యింటి వాణ్ణి చేసాము. మా వయస్సయిపోయి వృద్ధాప్యం దాపురించింది. మాకన్న బిడ్డవు గనుక నువ్వే మమ్మల్ని ఆదరించి అన్నం పెట్టాలి. అది నీ ధర్మం. పాపమే చేస్తున్నావో పుణ్యమే చేస్తున్నావో మాకు తెలీదు. అదంతా నువ్వనుభవించవలసిందే" అన్నాడు తండ్రి గంభీరంగా నొసలుచిట్లించి - బుక్షుని తలపై పిడుగు పడ్డట్లయింది. రొప్పుకుంటూ రోజుకుంటూ ఎదురైన పుట్టల్ని గుట్టల్ని తన్నుకుంటూ దాటుకుంటూ ముళ్ళ పొదలు కాళ్ళను చీరేసి రక్తం కారుతున్నా పట్టించుకోకుండా పరుగు పరుగున వచ్చి సప్తఋషుల పాదాలపై వ్రాలిపోయాడు. అతని తల నిమిరి పైకి లేవదీసారొక మునివర్యుడు.

"మునులారా! నా భార్యగాని, అమ్మా నాన్నలుగానీ నా పాపంలో పాలు పంచుకోనన్నారు. నా గతేమిటి? మీరే కాపాడాలి".

"అందర్నీ కాపాడేవాడు ఆ శ్రీమన్నారాయణుడే నాయనా! నీకు అష్టాక్షరి మంత్రం ఉపదేశిస్తున్నాను". "ఓం నమో నారాయణ" అను అన్నాడు ముని. బుక్షుడు పలక లేకపోయాడు మళ్ళీ మళ్ళీ అనిపించినా. మరొకాయన ముందుకు వచ్చి అతని తలపై తన దక్షిణ హస్తముంచి - "రామ.... అను "రామ" అను అన్నారు.

"మరి..... మ..... రా..... మ...... రా" అన్నాడు కష్టపడి నాలుకను నొక్కిపట్టి - మునులు మందహాసం చేస్తూ అలాగే అంటూ యిక్కడే కూర్చో - అని ఉ పదేశించి వారి త్రోవన వారు వెళ్ళిపోయారు. బుక్షుడు మరా.... మరా.... మరా అంటూ అక్కడే చతికిలపడిపోయాడు. ఒక అనిర్వచనీయమైన శక్తి అతనిలో ప్రవేశించినట్లయింది. ఆకలి దప్పులు, నిద్రాహారాలు మానివేసి అలుపు సొలుపెరుగక అలాగే రామమంత్రం జపిస్తున్నాడు. అతని చుట్టూ చీమలు చేరాయి. పుట్టలు

పెడుతున్నాయి. పాములు వళ్ళంతా పాకుతున్నాయి. శిరస్సు దాకా పుట్టలు పెరిగాయి. తుప్పల్లో కూరుకుపోయాడు. అయినా రామ మంత్రం అలాగే వినిపిస్తోంది. అడవిలో ప్రతి పొద, ప్రతి పుట్ట, చెట్టు రామనామం వింటున్నాయి.

సనకసనందనాదులనే ఋషులు శ్రీమహావిష్ణువు దర్శనార్ధం వైకుంఠ ద్వారం వద్దకు వచ్చారు. జయవిజయులనే ద్వార పాలకులు పహరా కాస్తున్నారు. వీర్ని అడ్డగించారు.

"జయవిజయులారా! విష్ణుదర్శనం కోరి ఎంతో ప్రయాసపడి వచ్చాము. మాకు ప్రవేశం కల్పించండి అని వేడుకున్నారు.

"స్వామివారు మాత మహాలక్ష్మితో సరససల్లాపాలాడుతూ ఉల్లాసంగా వున్నారు. ఇది తగిన సమయం కాదు. మరలి పొండి. మరెప్పుడైనా రండి" జయుడు వార్ని తన బాహువులతో అడ్డుకుని హుంకరించాడు". సర్వసంగపరిత్యాగులం మాకు స్వామి దర్శనం చేసుకోడాన్కి సమయా సమయాలుండవు. తప్పుకోండి" అన్నారు మునులు.

"నెమ్మదిగా చెపుతోంటే వినబట్టం లేదా? వెళ్ళండి. మునులు కాబట్టే యింత వరకు ఉపేక్షించాము. మర్యాదగా వెళ్ళిపోండి" అంటూ గద్దించాడు విజయుడు. తన గదను అడ్డంగా పెట్టాడు. స్వాములకు కోపం వచ్చింది. కమండలంలో నీళు తీసారు. వారి నేత్రాలు అగ్నిగోళాలయ్యాయి. నొసలు చిట్లించి ఉగ్రంగా ద్వారపాలకుల వంక చూస్తూ –

"ఓరి మూర్ఖులారా! సకల చరాచర జగత్తుకి పితృపాదుడైనటువంటి శ్రీమహావిష్ణువు మీ ఒక్కరి సొత్తనుకుని గర్వంతో విఱ్ఱవీగుతున్నారు. ఆ స్వామిని దర్శించుకుని, అర్చించి తరించే అవకాశం సర్వజీవులకు వుంది. విష్ణు దర్శనం మాకు దక్కనివ్వకుండా అడ్డగించిన మీకు కూడా అది కరువై అలమటిస్తారు. యిదే మా శాపం". అంటూ వారి మీద నీళ్ళు జల్లి లోనికి వెళ్ళిపోయారు. ఈ హఠాత్పరిణామానికి జయవిజయులు నిర్ఘాంత పోయారు. వారు ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపే ఋషులు విష్ణుదర్శనం చేసుకుని మరలి వెళ్ళిపోయారు.

అశ్రుపూరిత నయనాలతో యిద్దరూ పాలకడలి వైపు పరుగుపెట్టి శేషతల్పంపై శయనించిన శేషశాయి మ్రోల వాలారు. మునులు శపించిన విషయం చెప్పి తరుణోపాయం చూపమని శ్రీమహాలక్ష్మిని విష్ణువును వేడుకున్నారు. స్వామి మెల్లగా కళ్ళు తెఱచి మందహాసం చేసారు. ఆయన విశాలనేత్రాలు తెఱచి చూడగానే "స్వామీ! రక్షించండి అంటూ బావురు మన్నారు జయవిజయులు.

"విచారించకండి! మునుల శాపాలు తిరుగులేనివి.

"మీరు అనుభవించక తప్పదు. మీ యజమానిగా మిమ్మల్ని రక్షించక నాకు

తప్పదు."

"మిమ్మల్ని, మాత లక్ష్మీదేవిని వదలి దూరంగా వుండలేము మాకు తరుణోపాయం చూపండి".

"మీరు నా భక్తులుగా భూలోకంలో జన్మించి నిరంతరం మమ్మల్నే స్మరించుకుంటూ ఆరు జన్మలు ఎత్తి తిరిగి వైకుంఠం చేరుకుంటారు. ఆ మాటలు వారికి అశనిపాతాల్లా తగిలాయి. ఆరు వందల మానవ సంవత్సరాలు హృషీకేశునికి దూరంగా మనుగడ సాగించడం మాటలా! ఒకరి ముఖాలొకరు చూచుకుని ఏడుస్తూ కౌగలించుకుని మళ్ళీ స్వామివారి పాదాలపై వాలిపోయారు తెగనరికిన అరిటి చెట్లలా. మాత శ్రీలక్ష్మికి జాలి వేసింది.

"స్వామీ! వీరింతగా విలపిస్తున్నారు. మనల్ని వదలి ఏ ఒక్కదినము వుండలేదు. మనతో వీరి బంధం విడదీయరానిది. కరుణించండి".

"అవును ప్రభూ మేము మిమ్మల్ని వదలి అంత సుదీర్ఘ కాలం వుండలేము. మా శిక్ష తగ్గించండి"

శ్రీమహావిష్ణువు మందహాసం చేసారు. లక్ష్మి ఆయన పాదాలు వత్తుతోంది. లేచి అదే అదనుగా భావించి జయవిజయులిద్దరు దగ్గరగా వచ్చి ఆయన పాదాలు పట్టేసుకుని కన్నీటితో తడిపారు. దీనంగా తలలెత్తి ఆయన కన్నుల్లోనికి సూటిగా చూస్తున్నారు. నారాయణుడు దీర్ఘంగా నిట్టూర్చారు. లక్ష్మి ఆయన భుజం మీద ఉత్తరీయం సరిచేసి వేస్తూ -

"మీరే యింత కఠినంగా వ్యవహరిస్తే వారికి దిక్కెవరు. కనికరించండి. మరో సులభోపాయం సూచించి వారిని ఆదుకోండి".

"లేవండి! మూడు జన్మలలో నాకు శత్రువులుగా వుండి నన్ను ద్వేషిస్తూ రాక్షస ప్రవృత్తిపరులై నా చేత నిర్జింపబడి వైకుంఠం చేరుకుంటారు. దీనికి సమ్మతిస్తారా".

"ప్రభూ మీకు శత్రువులుగానా?" అంటూ ఆశ్చర్యపోయి చూస్తున్నారు.

"ఇంతకంటె సులభ మార్గం లేదా స్వామి" ప్రశ్నించింది మాత.

"లేదు జయవిజయులారా చింతించకండి, నాకు శత్రువులైనా నిరంతరం నా నామస్మరణే చేస్తుంటారు. మీరు అమేయ బల సంపన్నులుగా యశస్సు గడిస్తారు. అనితర సాధ్యమైన పరాక్రమవంతులుగా కీర్తి గడిస్తారు. మానవ కళ్యాణం కోసం మీతో పాటు నేను, దేవేరి కూడా మానవులుగా జన్మించి పూర్ణావతారమూర్తులుగా భాసిల్లి ధర్మ సంస్థాపన చేస్తాము. మీ వలన కలిగిన నా అవతారమూర్తులే నా కంటె ప్రసిద్ధి పొంది భూలోకంలో దైవాలుగా పూజింపబడుతారు. ఈ జగన్నాటకంలో మీరు చక్కని పాత్రధారులై లోకకళ్యాణం కోసం పాటు పడతారు." స్వామి మృదువుగా

గంభీరంగా పలికిన పలుకులు మాత లక్ష్మిని, జయవిజయుల్ని సంతృప్తి పరిచాయి.

"ధన్యులముస్వామి. శలవు" అంటూ వారు శిరస్సు వంచి లక్ష్మీ నారాయణుల పాదాలకు మరోసారి వంగి ప్రణమిల్లారు నారాయణుడు వార్ని - ఉద్దేశించి -

"కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులుగా త్రేతాయుగంలో రావణకుంభకర్ణులుగా; ద్వాపరంలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించండి. శుభం". అని ఆశీర్వదించారు.

శ్రీమహాలక్ష్మి "నాయనలారా! క్షేమంగా వెళ్లి, లాభంగా రండి" అని దీవించింది.

"మాతాపితరులకు నమస్సుమాంజలులు. శలవు" అంటూ వారు అంతర్ధానమయ్యారు. దూరంగా నారాయణ నామ సుధారస గానం వినిపిస్తూ అది అంతలోనే దగ్గరైంది. నారద మహర్షి వచ్చి లక్ష్మీనారాయణులకు ప్రణమిల్లారు.

"ఉపవిష్టుడవుకమ్ము నారదా!" అన్నారు స్వామి. నారదుడు కూర్చున్నాడు ఉచితాసనం పైన.

"ఏమిటయ్యా! విశేషాలు" ప్రశ్నించింది లక్ష్మీమాత

"జగన్నాధుడు శలవిస్తే తెలుస్తుంది; జననీ!"

"త్రిలోక సంచారివి, నువ్వు చెప్పవయ్యా నారదా!"

"కైలాసంలో శివపార్వతులు ప్రమధ గణాలు క్షేమం. సత్యలోక ప్రభువు బ్రహ్మదేవులు సరస్వతీదేవి సంతోషంగా వున్నారు. యిదంతా మీకు తెలియనిదా స్వామీ!"

"ఔనవును క్రొత్తవిశేషాలు స్వామి వారే శలవియ్యాలి" అన్నది లక్ష్మీదేవి.

"సరి సరి! మనవడు రాగానే అతని పక్షంలో మాట్లాడుతావా నారీశిరోమణి!"

"మాత యెప్పుడు పిల్లల పక్షపాతియే!"

"నారదా సమయానికే వచ్చావు. జయవిజయులు సనకసనందనాదుల నధిగించి శాపగ్రస్తులైనారు. వారికి నా యెడబాటు తప్పని సరైంది. మూడు జన్మలు భూలోకంలో రాజస తామస ప్రవృత్తితో లోకకంటకులుగా వ్యవహరిస్తారు. వారికోసం నేను సమయానుకూలంగా అవతరిస్తాను. శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాలు పూర్ణావతారాలు. నేను శ్రీరామచంద్రుడిగా త్రేతాయుగంలో దశరథుని యింట జన్మించినపుడు ఆదిలక్ష్మి సీతాదేవిగా భూజాతగా, అయోనిజగా జన్మిస్తుంది. జనకమహారాజు ఆమెను పెంచి పెద్ద చేసి నాకిచ్చి వివాహం చేస్తాడు. ఆదిశేషుడు లక్ష్మణునిగా శంఖుచక్రాలు భరత శత్రుఘ్నులుగా జన్మించి నాకు తమ్ములై సేవ చేస్తారు. దేవతల అంశలతో పుట్టిన వానర భల్లూక గోలాంగూలాలు లంకేశుడైన రావణవధలో నాకు సహకరిస్తారు. శివభక్తుడుగా అమితబల పరాక్రమాలుగల దశకంఠునిగా జయుడు, అతని అనుజుడు

కుంభకర్ణునిగా విజయుడు జన్మించి, నాచేత రణరంగంలో నిర్జింపబడతారు. సీతామాత ఉత్తమ నారీమణిగా, పతివ్రతగా, శ్రీరాముడు పితృవాక్యపరిపాలకుడుగా, సుందరమూర్తిగా, ధర్మవరుడుగా మానవ జీవకోటికి ఆదర్శదంపతులై కీర్తి గాంచుతారు"

అని రామకథ సంక్షిప్తంగా శ్రీమహాలక్ష్మికి, నారదునకు వివరిస్తాడు స్వయంగా నారాయణుడు.

"ధన్యోస్మి దేవా! నీ లీలలు ముందుగా తెలుసుకునే భాగ్యం నింపుకుని నా ఉదరం భారమైంది. ఈ బరువు తగ్గాలంటే నేను రామకథను మరొకరికి చెప్పాలి. శలవు మరి" అంటూ నారాయణ నామస్మరణం చేస్తూ నారద మహర్షి నిష్క్రమిస్తాడు. లక్ష్మీ నారాయణులాయన్ని చూసి నవ్వుకుంటారు. యిదంతా జరిగి చాలా కాలం గడిచింది. మత్స్య, కూర్మ, వరాహ నారసింహాది అవతారాలు అయిపోయి త్రేతాయుగం రానే వచ్చింది. రమ్యమైన రామావతారం యీ యుగంలోనే అనుకుంటూ తనపాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ భూలోక సంచారం చేస్తున్న నారదమహర్షి అరణ్యం మీదుగా వెడుతున్నారు. మేఘమండలంలో లీలగా ప్రతిధ్వనిస్తోంది రామనామం. శ్రీమహావిష్ణువు ద్వారా విన్న రామకథ తనకన్న ముందుగా ఎవరికి తెలిసిందబ్బా అనుకుంటూ క్రిందికి దిగుతూ ఆలోచించారాయన. సప్తఋషులు త్రికాలజ్ఞులు. విష్ణుఅవతార రహస్యం గ్రహించగల సమర్థులు. వారే ఋక్షునికి రామనామం చెప్పినట్లు, ఋక్షుని చరిత్రయావత్తు ఆయన కవగతమైనది. భావితరాలకు రామకథ తెలియాలంటే అది సుందరకావ్యంగా వ్రాయబడాలి. యుగయుగాలుగా మానవులు ఆదివ్య కథామృతాన్ని గ్రోలి తమ జీవితాలు చరితార్థం చేసుకోవాలి. మానవాళి యావత్తు ధర్మపరులై తమ నడవడిని దిద్ది తీర్చుకోవడానికి ఒక చక్కని ఆలంబనగా రామకావ్యం వ్రాయబడాలి. అది వ్రాయగల సామర్థ్యం ఎవరికుంది అని ప్రశ్నించుకుంటూ అరణ్యంలో రామనామం వినిపిస్తున్న పుట్ట దగ్గర దిగారు ముని.

మహావటవృక్షచ్ఛాయలో నిలువెత్తు వల్మీకం. చుట్టూ గిరిమల్లె పూలు రాలివున్నాయి. అనాన పొదలు, రమ్యంగా ఫలాలు కాచి అవి ఘుమఘుమలాడుతున్నాయి. సంపెంగ వృక్షాల గుత్తుల పూలు పసిడిచ్ఛాయలు సువాసనలు వెదజల్లుతున్నాయి. అమడ దూరంలో సెలయేరు గలగలలతో ప్రవహిస్తోంది. నలుపు తెలుపుల గళ్ళున్న మెట్టతాబేళ్ళు అటూ ఇటూ నెమ్మదిగా తిరుగుతుంటే, దూది మూటల్లాంటి తెల్లకుందేళ్ళు తామ్రవర్ణపుముక్కులు చెవులు కదలిస్తూ ఎగిరి దుముకుతున్నాయి. నెమళ్ళు క్రేంకారాలు చేస్తూ నీలిమెడలు నిక్కించి చూస్తూ చెట్టు కొమ్మల పైన దూకుతున్నాయి. మంచు ఆకులను తడిపి బిందువులుగా

టపటపా క్రిందికి రాలి పడుతోంది. రాబోయే రామావతారంలో తమదే ప్రధాన పాత్ర అని ఊహించుకుంటున్న వానరాలు చెట్ల ఫలాలారగిస్తూ, తేనెపట్టుల మకరందం గ్రోలుతూ మహోత్సాహంతో కేరింతలు కొడుతున్నాయి. నిత్యం దేవలోకాల వైభవాలు వీక్షించే నారదుల వారు సైతం భూలోక ప్రకృతి అందాలను క్షణం ఆస్వాదించి రామశబ్దం వినిపిస్తున్న పుట్టవైపు అడుగులు వేసి పుట్ట ప్రధాన రంధ్రం వద్ద శిరస్సువంచి మృదువుగా -

"బుక్షకా!....... నాయనా బుక్షుకా!" అంటూ పిలిచారు. సంవత్సరాల తరబడి నిరాటంకంగా సాగిన రామ నామ జపం క్షణం ఆగింది. కొన్ని క్షణాలు గడచిపోగా మళ్ళీ "రామ...... రామ....... రామ" అని పుట్టలో నుండి వినిపిస్తోంది.

నారదులవారు -

"నాయనా! బుక్షుకా! నేను బ్రహ్మమానస పుత్రుడనైన నారదమహర్షిని వచ్చాను. నీకు రామకథనంతా ఉపదేశం చేస్తాను. లేచి రా నాయనా!" అని కొంచెం బిగ్గరగా పుట్టదగ్గర అరిచారు. వెంటనే రామనామం గట్టిగా మరీ గట్టిగా వినపడుతూంది. మహర్షి గ్రహించారు. తన చేతి నుండి జలధార వెలువరించి పుట్టయావత్తు కరిగింపచేసారు. చిక్కి శల్యమై, పద్మాసనంతో పొడవాటి గడ్డంతో, లోతైన చక్కిళ్ళు, గుంటలు పడ్డ కళ్ళతో ఎముకల పోగులా వున్న బుక్షుడు కనిపించాడు. పద్మాసనం విడదీసి లేవాలని ప్రయత్నం చేస్తున్నాడు. మహర్షి తన తపోబలం వల్ల అతనికి ఆరోగ్యమైన శరీరం అక్షరజ్ఞానం ప్రసాదించారు.

"బుక్షకా! నీ జన్మధన్యమైనది నాయనా! సప్తఋషులు త్రికాలజ్ఞులు. వారి క్రాంతదర్శిత వలన భవిష్యత్తును తెలుసుకున్నారు. అష్టాక్షరి మంత్రంలోని 'రా' అక్షరాన్ని పంచాక్షరిలోని 'మ' కారాన్ని జతచేసి నువ్వు సౌలభ్యంగా పలకటం కోసం రామ మంత్రాన్ని "మరా" అని ఉపదేశించారు. సుదీర్ఘకాలం నువ్వు "రామ" నామం జపం చేసి కొత్త జీవితాన్ని ప్రారంభించావు. నువ్వు పుట్ట నుండి జన్మించిన సందర్భంగా నిన్ను "వాల్మీకి" అని పిలుస్తున్నాను. పరమ క్రూరుడవైన నిన్ను రామనామం పరమ సాత్వికునిగా మార్చివేసింది. శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి, ఈ పృథివిపై సీతారాములుగా అవతరించి ఆదర్శ దంపతులుగా నిలుస్తారు. వారి కథను "రామాయణం" పేరున నువ్వు రచిస్తావు. ఆచంద్రతారార్కం యశోవంతుడవై ఆదికవివై వేనోళ్ళ శ్లాఘించబడతావు" అని దీవించాడు. వాల్మీకికి ఆయన దివ్యజ్ఞానం ప్రసాదించారు. రామకథనంతా ఆయన మస్తిష్కంలో నిక్షిప్తంచేసి అంతర్ధానమయ్యారు. వాల్మీకి తమసానదీ తీరాన కుటీరం యేర్పరచుకుని శిష్యగణంతో ప్రశాంత జీవితం ఆరంభించాడు. ఆయన శుద్ధసాత్విక వర్తనంతో ప్రతిరోజు రామకథను మననం చేసుకుని ఆనందిస్తూ కాలం గడుపుతున్నాడు.

ఒకరోజు భరద్వాజాది శిష్యగణంతో ఉదయాన్నే తమసా నదికి వెడుతున్నారు వాల్మీకిముని పుంగవులు. పక్షులు కిలకిలా రావాలతో గూళ్ళబైటకు వచ్చి బారులు తీరి వేటకు బైలుదేరి వెడుతున్నాయి. ఉదయభానుని లేత పసిడికిరణాలు చెట్ల సందుల నుండి మంచును దూసుకుంటూ వస్తున్నాయి. మర్కటాలు చెట్లకొమ్మలపైనే తెల్లవార్లు నిద్రించి అప్పుడప్పుడే లేచి గెంతుతున్నాయి. వాటిపిల్లలు పొట్టలు పట్టుకు వ్రేలాడుతుండగా పళ్ళుకోసి పెడుతున్నాయి. కీరములు ఎర్రని ముక్కులతో దోరజామకాయలను కొరుకుతూ విహరిస్తున్నాయి. ఒక చెట్టుపై రెండు క్రౌంచ పక్షులు కూర్చుని వున్నాయి. యింతలో రివ్వున ఒక బాణం వచ్చి వాటిలో ఒక దానికి తగిలింది. ఉత్తరక్షణంలో అది రక్తం కార్చుకుంటూ రెక్కలు టపటపా కొట్టుకుంటూ నేలకొరిగి మృతి చెందింది. ఆ వెనుకనే విల్లంబులు ధరించిన ఒక బోయవాడు వస్తున్నాడు. తన ప్రియుడు మరణించగా ఆ క్రౌంచపక్షి దిగివచ్చి చుట్టూ తిరుగుతూ రోదిస్తోంది. శిష్య బృందంతో వస్తున్న వాల్మీకి ఈ దృశ్యాన్నంతా కన్నార్పకుండా చూస్తున్నారు. ఆయనలో నిద్రాణమైవున్న కరుణ రసం పెల్లుబికింది. సరస్వతీ మాత ఆయన జిహ్వాపై తాండవించింది.



శ్లో॥ మా నిషాద ప్రతిష్ఠాం
త్వ మగమః శాశ్వతీః సమాః
యత్ క్రౌంచ మిథునా దేక
మవధీ కామ మోహితమ్.

ఋషీశ్వరుడైన వాల్మీకి వాగ్దేవీ కటాక్షపాత్రుడై కవీశ్వరుడై సృష్టిలో తొలి శ్లోకం విరచించాడు. ఆ శ్లోకం శోక జనితం. లౌకిక సంస్కృత వాఙ్మయంలో ఆదికావ్యం ఆ శ్లోకం. క్రౌంచ పక్షి దుఃఖాన్ని తాను అనుభవించి; ఆశ్లోకం గ్రంథస్థం చేసే ప్రయత్నం అప్రయత్నంగా చేసారాయన. అదివిన్న శిష్యగణం విస్మయంతో ఆయన వంక చూసారు. బోయవాడు ఏమీ అర్థం కాక ఆ పిట్టను సంచిలోవేసుకొని మౌనంగా వెళ్ళిపోయినా, వాల్మీకి హృదయం శోకం నుండి తేరుకొనలేదు. జంట క్రౌంచ పక్షులలో మరొకటి దుఖంతో విలవిలా కొట్టుకుంటూ మూర్ఛిల్లింది. వాల్మీకి కంటి వెంట జలజలా అశ్రువులు రాలి ఆయన పాదాలను తడుపగా కొన్నిక్షణాలు స్థాణువులా నిలబడి పోయారు అంతా.

భరద్వాజుడనే శిష్యుడు "గురువర్యా! ఉదయసంధ్యా వందనానికి వేళ అతిక్రమిస్తోంది. భానుబింబం నింగి కెగస్తోంది. స్నానానికి వెడదాం పదండి" అన్నాడు ధైర్యం చేసి –

వాల్మీకి క్షణం ఆగి అడుగు తడబడగా ముందుకు అడుగులు వేస్తుంటే

శిష్యులాయన భుజాలు చెరివైపుల పట్టుకుని నడిపించారు. ఆయన అంతరంగం చనిపోయిన జంట పక్షికై విలవిల్లాడుతున్న మూర్ఛిల్లిన క్రౌంచం లాగానే వున్నది. ఒకనాడు బాటసారుల తలలు బ్రద్దలు కొట్టి ద్రవ్యం కోసం రాక్షసునిలా ప్రవర్తించిన పాషాణ హృదయుడీ నాడు; మరో బోయవాడు ఒక పిట్టను చంపితే చూడలేని ఒక అహింసామూర్తిగా కరుణాంతరంగునిగా పరివర్తన చెందాడు. ఎంత ఆశ్చర్యం; రామనామ జపప్రభావం అది. పాషండుని నవనీత హృదయునిగా మార్చిన పరమతారక మంత్ర ప్రభావం అట్లాంటిది. విష్ణుతత్వ సాత్విక ప్రభావం సాటి లేనిది.



మూకమ్ కరోతి వాచాలమ్
పంగుమ్ లంఘయతే గిరిమ్
యాత్కృపా తమహం
వందే పరమానంద మాధవమ్.

మాధవుని అనుగ్రహం వుంటే మూగవానికి మాటలు పాటలు వస్తాయి. కుంటి వాడు నడక నేర్చిగిరులు దాటగలడు. గొడ్రాలు గర్భవతియై పండంటి పిల్లల్ని కనగలదు. "పరమ పురుష నీదు కరుణ పరుగు తీయు కుంటివాడు, మాత యౌను గొడ్రాలె" అని ఒక సినీకవి తెలిగించారు పై శ్లోకార్థాన్ని. సాహిత్యపరంగా చూస్తే ప్రతి రామాయణ శ్లోకానికి బాహ్యార్థం, అంతరార్థం వుంటాయి. అవి పరిశీలించి తెలుసుకున్న నాడే మహర్షుల అంతరంగం అవగత మవుతుంది. వాటిని పరిశీలిద్దాము

ఆదిశ్లోకానికి బాహ్యార్థం :-

నిషాద = ఓ బోయవాడా! యత్ = ఎందు వలన, క్రౌంచ మిథునాత్ = క్రౌంచ పక్షుల జంట నుండి, కామ మోహితమ్ = కామ పరవశమై యున్న, ఏకమ్ = ఒక దానిని, అవధీః = చంపితివో, అందు వలన, త్వమ్ = నీవు, శాశ్వతీః సమాః = చాలా సంవత్సరములు, ప్రతిష్ఠాం = నిలుకడను, మగమః = పొంద కుందువు గాక.

తాత్పర్యము :- ఓ బోయవాడా! నీవు కామ పరవశమై యున్న క్రౌంచ పక్షుల జంట నుండి ఒక దానిని చంపి జంటను విడదీసినావు. కావున ఎక్కువ కాలం జీవించకుందువుగాక! అని బోయవానిని వాల్మీకి శపించారు.

ఇదే శ్లోకాన్ని మరొకలాగ పదవిభాగం చేసి చెప్పుకుంటే అది వ్యంగ్యార్థం అవుతుంది. స్థూలంగా చెప్పుకుంటే ధ్వని, అంతరార్థం, వ్యంజనం, శ్లేష అనే పర్యాయ పదాలున్నాయి దీనికి.

అంతరార్థము :-

మా నిషాద = శ్రీనివాసా! యత్ = ఎందు వలన, క్రౌంచ మిధునాత్ = వక్ర గమనముగల రాక్షస ద్వంద్వము నుండి, కామ మోహితమ్ = కామ పరవశుడైన, ఏకమ్ = ఒకనిని (అనగా దశకంఠ రావణుని); అవధీ = చంపితివో, అందువలన; త్వం = నీవు, శాశ్వతీ స్సమాః = అనేక సంవత్సరములు, ప్రతిష్ఠాం = నిలుకడను, ఆగమ = పొందితివి.

భావము :-

శ్రీనివాస స్థానముగా గల లక్ష్మీపతీ! వక్రగతి గల రాక్షస ద్వయము నుండి కామ మోహితుడైన ఒకనిని (రావణుని) సంహరించితివి. అందువలన చాల సంవత్సరములు నిలుకడను పొందితివి.

క్రౌంచము అనేది పక్షి. "క్రుంచ్ కౌటిల్య అల్పీ భావయోః" అను ధాతువు నుండి క్రౌంచ శబ్దము పుట్టినది. ఈ పక్షి వంకర టింకరగా నడిచే స్వభావం గలది. రామాయణ కథా ప్రతినాయకుడైన రావణుడు కూడా వక్ర ప్రవర్తనను గలవాడు. అందుకే పరుని భార్య అయిన సీతాసాధ్విని పొందాలని విఫల ప్రయత్నం చేసాడు. వక్రగమనం గల క్రౌంచపక్షి; వక్ర నడవడిగల రావణునికి సంకేతము. కామక్రోధలోభ మోహమదమాత్సర్యాదులు వ్యక్తిప్రవర్తనపై ప్రభావం చూపిస్తాయి. మనసు చంచలస్వభావం గలది. బుద్ధి మనస్సుపై వుండి పెత్తనం చెలాయించి, మనస్సును చెడుత్రోవలో పోకుండా నియంత్రిస్తుంది. అందుకే విదేశీ తత్త్వవేత్త అయిన సోక్రటీసు యిలా చెప్పాడు. మనస్సులో చెడుతలంపులనేకం పుడుతుంటాయి. బుద్ధి చేత వాటిని అణగద్రొక్కుకుని సమాజ ఆమోదయోగ్యం కానివి, అవినీతి, అధర్మం అనిపించుకునే పనులు చేయకుండా తనను తాను నిగ్రహించుకునేవాడే మంచివాడు. ఆ మనో నిబ్బరం లేక మనసులో పుట్టిన దుష్టచింతనలన్ని నిస్సంకోచంగా ఆచరించి చూచేవాడే చెడ్డవాడు. అంటే దీనినిబట్టి మనకు అర్థం అయ్యేది ఏమిటంటే మనస్సులో వచ్చే ఆలోచనల్ని వడగట్టాలి. యధాతధంగా వాటిని అమలు పరిస్తే అనర్థం తప్పదు. చెడ్డతలంపుల్ని సైతం అంతరంగంలోనికి రాకుండా నిరోధించగలిగే శక్తి అభ్యాసం వలన వస్తుంది. ఋగ్వేదం ఇలా చెపుతోంది. "Let noble thougths come to your mind from all sides"

"అన్ని కోణముల నుండి నీ మనస్సులోనికి ఉదాత్తమైన ఆలోచనల్నే రానిమ్ము" అని భావము. "మనస్సు చంచల స్వభావం కలది" అని సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మ

కూడా ఒప్పుకున్నారు. దానిని ఎలా లొంగదీసుకోవాలి, ఋజువర్తనం ఎలా అలవర్చుకోవాలో చాలా సూక్ష్మంగా ఉపదేశించారు.

భగవద్గీత : 6వ అధ్యాయము, ఆత్మసంయమ యోగము 34వ, శ్లోకము.



అసంశయం మహాబాహో !
మనో దుర్నిగ్రహం చలమ్.
అభ్యాసేన తు కౌన్తేయ
వైరాగ్యేణ చ గృహ్యతే.

తాత్పర్యము :- అర్జునా! మనస్సు నిరోధించడానికి వీలుకానిది, చంచలమైనది. అందులో సందేహంలేదు. అయినప్పటికి అభ్యాసం చేత, వైరాగ్య భావంచేత దానిని నిరోధించవచ్చు.

మనం ఎంచుకున్న సన్మార్గాన్ని అభ్యాసం చేయటం, చేస్తున్న కర్మను (పని) ఫలాపేక్షరహితంగా వైరాగ్యభావంతో చెయ్యటం ఈ రెంటివల్ల మనస్సు యొక్క చంచల స్వభావాన్ని తగ్గించి, ధృఢంగా వుండవచ్చు. యిక వైరాగ్య భావాలనే ఆకళింపు చేసుకుని వాటినే అభ్యాసం చెయ్యగలిగిన వాడు ధన్యుడే! శ్రీరామాయణం అట్టి వైరాగ్య భావాన్ని యిస్తుంది. రామాయణ పారాయణం, రామనామ సంకీర్తనం, రామకథాశ్రవణం వీటిలో యేది చెయ్యగలిగినా యిష్టకామ్య ఫలసిద్ధి జరుగుతుంది. వైరాగ్యభావం; అభ్యాసం రెంటికి ఆలంబన రామాయణము.



4. శ్రీరామచంద్రమూర్తి

"రామో విగ్రహవాన్ ధర్మః" రాముడు ధర్మస్వరూపుడు. ధర్మము అంటే ఏమిటి? "ధర్మము అనగా జీవన విధానము" అని స్వామి వివేకానంద చెప్పారు. ప్రతిమానవుడు క్రమబద్ధంగా జీవితం నడుపుకుంటే అతనికి ఆర్థిక, సాంఘిక అభివృద్ధి లభించి జీవితం సుఖశాంతులతో గడుస్తుంది. వాయువు యొక్క ధర్మం శక్తికొలది వీచడం. జలం యొక్క ధర్మం దప్పి తీర్చటం. అగ్ని యొక్క ధర్మం దహించి వేయటం. భూమి యొక్క ధర్మం సహనంతో ధరించడం. మరి మానవుని యొక్క ధర్మం ఏమిటి? మానవ జీవితం బాల్యయౌవన కౌమార వార్ధక్యాలతో నిండివుంది. ఒక్కొక్క స్థాయిలో ఒక్కొక్క రీతిగా ప్రవర్తించడమే మానవుని ధర్మం. బాల్యంలో తల్లితండ్రుల చాటున వుంటూ విద్యాభ్యాసం ప్రారంభించడం ధర్మం. యౌవనంలో తగిన కన్యను వివాహం చేసుకుని సంతానం కనటం ధర్మం. గృహస్థుడుగా వుంటూ వృద్ధులైన జననీజనకుల్ని

కడదాకా పోషించడం ధర్మం. అతిధి అభ్యాగతుల్ని, భార్యాపిల్లలను ఆదరంగా చూసుకుంటూ ధనార్జన చేయటం ధర్మం. యిలా మనిషి ప్రవర్తించవలసిన తీరునే ధర్మము అన్నారు పెద్దలు. ఆ ధర్మాన్ని ఆశ్రయించిన కామము, ధర్మబద్ధంగా సంపాదించిన అర్ధము వ్యక్తి జీవితానికి ఆనందాన్నిస్తాయి. ధర్మబద్ధుడైన జీవి రామచంద్రునిలా సుఖిస్తాడు. ధర్మ విరుద్ధంగా ప్రవర్తించిన వాడు అసురుడై రావణునిలా నశిస్తాడు. యిదే ఇహలోక రామాయణం. ఇంటింటి రామాయణం.

ప్రతి వ్యక్తికి, జాతికి, దేశానికి ఒక జీవన సరళి వుంటుంది. అనేకమంది ప్రజలకు ఆమోదయోగ్యమైనది, ఎక్కువ మందికి న్యాయం చేసేది, పక్షపాత రహితమైనది ధర్మం. ఒక జాతి ప్రజలు అనాది నుండి కొన్ని కట్టుబాట్లకు నియామాలకు బద్ధులైవుంటారు. వాటివల్ల ఆ సమాజంలో ఎక్కువ మంది స్వేచ్ఛగా, సుఖంగా జీవిస్తుంటారు. ఆ జీవన విధానమే వారికి ధర్మం. ఉదాహరణకు భారతదేశంలో ఒక పురుషుడు ఒక స్త్రీని వివాహం చేసుకొని జీవితాంతం గడపటం ఒక సంప్రదాయం. అదే యిక్కడి ఆచారం. అది ఉల్లంఘించిన వారు ఏదో ఒక నష్టం పాలవుతారు. అదే అధర్మం. భగవంతుడులేడనే నాస్తికులుండవచ్చు. కాని నీతి నియమాలు అవసరం లేదనే వారుండరు. అంటే మనిషి సుఖజీవితమనే పూలదండలో అంతర్లీనంగా వుండే ఆధారభూతమైన దారమే ధర్మము. శిష్యులకు గురువు మార్గదర్శి, ఆదర్శప్రాయుడు కావాలి. అలాగే భగవంతుడు సర్వ మానవాళికి, జీవకోటికి మంచి చెడులను చూపించి మంచివైపు నడిచే సులువైన మార్గం చూపించాలి. పసిపిల్లవాడికి అడుగులు వేయటం నేర్పాలంటే ముందు నేర్పేవాడు అడుగు చక్కగా, దృఢంగావేసి నిలబడగలిగే వాడుకావాలి కదా! అటువంటి ప్రయత్నమే శ్రీమన్నారాయణుడు రామావతారంలో చేసాడు. ఆదిలక్ష్మి, శంఖుచక్రాలు, ఆదిశేషువు, దేవతలు, ప్రతినాయక పాత్రలలో జయవిజయులు పోషించి చూపిన బృహన్నాటకమే త్రేతాయుగ శ్రీరామచంద్రుని కథ.

పార్వతీపరమేశ్వరులు ముచ్చటగా సంభాషించుకుంటున్నారు కైలాసంలో. ఉమాదేవికి సందేహం వచ్చింది "ప్రాణనాథా" విష్ణుదేవుని ప్రార్థించడానికి విష్ణుసహస్రనామం పఠించాలి! అది సామాన్యులకు సాధ్యపడేదేనా?" అని ప్రశ్నించింది. శివుడు మందహాసం చేసి -

శ్రీరామ రామ రామేతి
రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం
రామ నామ వరాననే !



దేవీ ఈ శ్లోకం స్మరించుకుంటే విష్ణు సహస్రనామం చదివినంత ఫలితం వస్తుంది. రామనామంలోని శక్తి అద్వితీయమైనది అని శలవిచ్చారు శంకరులు. శ్రీరామావతారానికి దైవకార్యం, దశరథకార్యం ఆలంబనలు. దశరథుడు అరణ్యంలో వేటాడుతుండగా, తల్లిదండ్రుల దాహార్తి కోసం తటాకంలో నీరు పడుతున్న శ్రవణకుమారుడ్ని మృగమనుకుని శబ్దాన్ని బట్టి శరం వేస్తాడు. ముని బాలుడు బాణంగుచ్చుకుని పడిపోతాడు. శ్రవణకుమారుడి దగ్గరకు దశరథుడు వెళ్ళి తాను చంపినది మృగాన్ని కాదని ఒక అమాయక దంపతుల పుత్రుడినని గ్రహిస్తాడు. దిక్కులేని తన మాతాపితరులకు జలం అందించి దప్పితీర్చవలసినదిగా మునిబాలుడు రాజును కోరి మరణిస్తాడు. దశరథుడు కుండతో నీరుతీసుకు వెళ్ళి అంధులైన ఆ బాలుని తల్లిదండ్రుల దప్పితీరుస్తాడు. కాని వారు రాజును గుర్తించి తమ కుమారుడేమైనాడని అడుగగా తన తప్పిదం వల్ల మరణించినట్లు దశరథుడు చెపుతాడు. ఆ వృద్ధదంపతులు తమ పుత్రుని కోసం ఆక్రోశించి –

"రాజా! నువ్వు మా వలె పుత్రశోకంతోనే మరణిస్తావు" అని శపించి అశువులు బాస్తారు. రాజుకు ఆశ్చర్యం వేస్తుంది. వయస్సు మీరిపోయి ముగ్గురి భార్యల వలన సంతానం పొందలేకపోయిన తనకు పుత్రశోకం ఎలా సంభవిస్తుందో ఆయనకు అర్థంగాక అయోధ్యకు తిరిగి వచ్చి కులగురువు వశిష్ఠులకు జరిగినదంతా విన్నవించగా ఆయన త్రికాలజ్ఞుడు గనుక రాజు చేత పుత్రకామేష్టి చేయిస్తారు. యజ్ఞపురుషుడు దశరథునికి పాయసాన్ని ప్రసాదిస్తాడు. రాజు పాయసాన్ని రెండుగా విభజిస్తాడు. మొదటి అర్ధభాగాన్ని కౌసల్యకు, రెండోభాగం కైకకు యిస్తాడు. వాటిని పునర్విభజన చేసి కౌసల్య, కైకేయిల భాగాలలో సగం సగం గ్రహించి సుమిత్రకిస్తాడు. వారు పాయస భాగాలను భక్షించి గర్భవతులవుతారు. పన్నెండు నెలల అనంతరం చైత్రమాసశుక్ల పక్ష నవమి నాడు పునర్వసు నక్షత్రం, కర్కాటక లగ్నంలో సూర్య గురు శుక్ర కుజ శనిగ్రహాలు ఉచ్ఛస్థితిలో వుండగా కౌసల్యాదేవి కుమారుడ్ని ప్రసవిస్తుంది. దశమినాడు కైకేయి ఒక బాలుని ప్రసవిస్తుంది. ఆ తర్వాతి రోజు సుమిత్రకు కవలు జన్మిస్తారు. నామకరణం రోజువస్తుంది. వశిష్ఠమహర్షి కౌసల్యా సుతుని ముందుగా తన వడిలోనికి తీసుకుని బాగా ఆలోచించి 'రామ' అంటారు. దశరథుడు ప్రశ్నార్థకంగా చూస్తాడు.

"రాజా! 'ఓం నమో నారాయణాయ' అన్న అష్టాక్షరి మంత్రంలోని 'రా' అక్షరం, 'నమశ్శివాయ' అన్న పంచాక్షరిలోని 'మ' అక్షరాన్ని జతచేసి విష్ణు శివతత్త్వాలను మేళవించాను. ఈ బాలుడు రామునిగా ప్రశిద్ధుడై అసురసంహారం చేసి పితృవాక్య పాలకునిగా నీపేరు నిలబెడతాడు అని ఉపదేశిస్తారు. తరువాత భరతుడు అని కైకేయి తనయునకు, లక్ష్మణశత్రుఘ్నులని సుమిత్రానందనులిరువురికి పేర్లు పెట్టి ఆశీర్వదిస్తారు.

రాముడు ధర్మం, లక్ష్మణుడు శ్రద్ధ, భరతుడు అనన్యభక్తి, శత్రుఘ్నుడు తిరుగులేని శక్తి. ధర్మానికి అండ శ్రద్ధ అందువల్ల లక్ష్మణుడు అరణ్యవాసానికి వెడుతున్న రాముని అనుసరిస్తాడు. కైకేయి మంథరా ప్రేరితురాలై భరతునికి రాజ్యం కోరుతుంది. కాని భరతునికి అన్న అంటే ప్రాణం. ఆయన లేని సందర్భంలోనే ఈ తతంగమంతా జరిగిపోయింది. అయోధ్యకు భరతుడు వచ్చేసరికే రామయ్య సీతాలక్ష్మణులతో వనాలకు వెడతాడు. తండ్రి పరలోక గతుడౌతాడు. ఇంక భరతుని వేదన చూడండి తల్లి మీద విరుచుకుపడి, అన్నకోసం సర్వరాజలాంఛనాలను, గురువులను తల్లులను తీసుకుని అన్నను ఆహ్వానించడానికి వెడతాడు అడవికి. ఆయన పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేసి తీరతాను అంటాడు. యీయన రామ పాదుకలనే నెత్తిన బెట్టుకు వచ్చి; వాటి ప్రతినిధిగా వుండి రాజ్యాన్ని సంరక్షిస్తాడు. యిది భక్తి.

ఈ భక్తిలో అహంకార త్యాగం; ఐశ్వర్యం, రాజభోగాలపట్ల విముఖత, రామన్నపై గౌరవం, అనురాగం వున్నాయి. రాజభక్తి, దైవభక్తి భావాలకలబోత భరతుడు. నిజానికి అరిషడ్వర్గాలను జయించాలనుకునే వారికి భరతుడ్ని మించిన గురువు లభించడు. ఆ భక్తికి అండగా శక్తి స్వరూపుడు శత్రుఘ్నుడున్నాడు. భక్తికి యితర దుష్టశక్తుల వల్ల భంగం కలుగకుండా కవచంగా శక్తి రూపధరుడుగా సుమిత్రానందనుడు నిలబడతాడు. అవతార పురుషుడు రాముడ్ని, విరాగియై రాజ్యం చేస్తున్న భరతుడ్ని, కాపాడటానికే సుమిత్రాదేవి యిద్దరు కవలల్ని కన్నది. ఆమె మాతృత్వం ధర్మానికి, భక్తికి, శ్రద్ధగా, శక్తిగా ఆలంబనలనిచ్చినది. దశరథమహారాజు క్రాంతదర్శి. ఆయన చేసిన పాయస విభజనలోని అంతరార్థం ఈ పరమార్థ సాధనమే. శ్రీమహావిష్ణువు తన చతుర్భుజాలతో ధర్మార్థకామమోక్షములనే చతుర్విధ పురుషార్థాలు భక్తులకు ప్రసాదిస్తాడు. ఆ చతుర్విధ పురుషార్థాలను ఉత్తమమైన రీతిగా ప్రతి మానవుడు ఎలా సాధించుకోవాలో తిరిగి ఆయనే మానవావతారం ధరించి రాముడిగా సాధించి చూపించాడు. యిది చక్కటి సన్నివేశాల సంకలనం. శ్రీమహావిష్ణువు యొక్క మహాసంకల్పం. మరి ఈ కథనంతా గ్రంథస్థం చేసి విశ్వాన్ని నిత్యం ఉత్తేజపరిచే పనిచేయగలవాడు ఎవ్వడు? పరమ కిరాతునిగా పుట్టి సప్తఋషుల అనుగ్రహం వల్ల పావనమూర్తిగా మారిన వాల్మీకి. నారదమహర్షి భూలోక సంచారం చేస్తూ ఒకనాడు తన శిష్యుడైన వాల్మీకి ఆశ్రమానికి విచ్చేసారు. వాల్మీకి సాదరంగా ఆహ్వానించి అర్ఘ్యపాద్యాదులిచ్చి సేవించి ఉన్నతాసనంపై కూర్చుండబెట్టి, నారదుని అనుజ్ఞ మేరకు తను కూడా ఆశీనుడై -

"ఓ నారదమునీంద్రా! లోకంలో అత్యుత్తమ నడవడి గల నాయకుడు ఎవరు? గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్యుడు, దృఢవ్రతుడు,

సర్వజీవహితుడు, విద్వాంసుడు, సమర్ధుడు ఎవరు? అటువంటివాని చరిత్ర జగత్ప్రసిద్ధం చెయ్యటానికి ఇతిహాసంగా వ్రాస్తాను" అని ప్రశ్నించాడు.

నారదమహర్షి మందహాసం చేసి, వాల్మీకీ! నీకు ఆ మహాపురుషుడెవరో తెలుసు. ఆయన నామోచ్చారణ వల్లనే నీవు ఋక్షకునిగా జన్మించి, ఈ జన్మలోనే పునర్జన్మ ఎత్తావు. "ఇక్ష్వాకు వంశ ప్రభవో, రామో నామ జనశ్శ్రుతః" కళ్యాణ గుణ పూర్ణుడు, ఇక్ష్వాకు వంశంలో జన్మించిన శ్రీరామచంద్రుడే మహాగుణ సంపన్నుడు. రాముని మించిన లోకోత్తర గుణ సంపన్నుడు లేడు. కావున రామచరితాన్నే వ్రాయి. నువ్వు ప్రశ్నించావు గనుక రామచంద్రుని గుణాలను వివరిస్తాను. అవధరించు" అన్నారు. భరద్వాజాది శిష్యబృందం కూడా వాల్మీకి వెనుక తుంగచాపలపై కూర్చుని శ్రద్ధగా ఆలకిస్తున్నారు.

నారదుడు ఉపదేశించిన రామచంద్రుని సుగుణాల సారాంశము యిది

"రామ శబ్దానికి చంద్ర శబ్దం జోడించాలి. రామునిలో సాక్షాత్తు విష్ణువులోని అనేక గుణాలు వున్నప్పటికి ముఖ్యంగా చెప్పుదోదగ్గవి పదహారు గుణాలు వున్నాయి. చంద్రునికి పదహారు కళలు. రామచంద్రునికి పదహారు గుణాలు. రామచంద్రుడు విష్ణుని పూర్ణావతారం. చంద్రుడు తన చల్లని వెన్నెల చేత లోకాన్నంతటిని ఆహ్లాద పరచినట్లు, రామచంద్రుడు త్రేతాయుగంలోని ధర్మ పరులయిన ఋషులు, మునులు, బ్రాహ్మణులు, ప్రజలు వీరందరిని సుఖపెట్టి వారికి రక్షణ, ఆనందం కలుగ చేయటం కోసం తన గుణాలతో ధర్మసంస్థాపన చేసి మానవ, వానర, భల్లూకాది జాతులకు అసురుల వల్ల కలిగే బాధలను పోగొడుతాడు. సర్వులను ఆహ్లాద పరుస్తాడు. వినండి.

1. గుణవంతుడు : గుణములలో ఉత్తమమైనది సౌశీల్యము. శీలవంతుడైన మానవునే నరుడు అంటారు.

"జాతి, సంపద, విద్య ఈ మూడింటిలో గొప్పవాడై వుండి, ఆ మూడు లేనివారితో అరమరికలు లేకుండా కలిసిపోయే గుణాన్ని సౌశీల్యం" అంటారు. శ్రీరాముడు సూర్యవంశోద్భవుడు. క్షత్రియుడు. ఐశ్వర్యం చేత అయోధ్యానగర ధనకనకవస్తు వాహన రత్న భాండాగారాలకు వారసుడు. అధికారం చేత దశరథమహారాజు తనయుడు. యువరాజు. విద్య అంటారా! వశిష్ఠమహర్షి వారికుల గురువు. ఆయనే రాముని తొలిగురువు. తొలి యౌవన దశలో విశ్వామిత్ర మహర్షి వచ్చి యాగ రక్షణార్థం రామలక్ష్మణులను వనాలకు తోడ్కొని వెళ్ళాడు. వశిష్ఠవిశ్వామిత్రులు పరస్పర విరుద్ధ భావాలు గల యిద్దరు మహాతపస్సంపన్నులు. వశిష్ఠుడు శాంతస్వభావి. విశ్వామిత్రుడు కోపిష్ఠి. అయినా వశిష్ఠుల వారే దశరథునికి నచ్చచెప్పి విశ్వామిత్రుని వెంట వారిని పంపారు. బల అతిబల విద్యలు, మహాస్త్రశస్త్రాల ప్రయోగ ఉపసంహారాలు నేర్పి,

తాటక వధతో అసుర సంహార యజ్ఞం రామునిచే ఆరంభింపజేసినది విశ్వామిత్రులే కదా!

జాతి, సంపద, విద్వత్తులలో గొప్ప అయిన రాముడు వాటిలో తన సముడు కాని సుగ్రీవునితో మైత్రి చేసాడు. సుగ్రీవుడు వానరుడు. రాముడంత విద్య, సంపద, బలం యేమీ ఆయన వద్ద లేవు. కాని రాముని వలెనే భార్యను; రాజ్యాన్ని పోగొట్టుకుని పరమ దుఃఖంలో వుండి హనుమద్దౌత్యం వల్ల రామ శరణాగతి పొంది రాజ్యాన్ని, దారాపుత్రులను పొంది సుఖించాడు. నదిని దాటించిన ఆటవికుడు గుహుడు. శత్రుసోదరుడు, రాక్షస జాతి వాడు విభీషణుడు. ఆ యిద్దరికి కూడా రాముడు శరణు యిచ్చి వారితో స్నేహం చేసాడు. అందువల్ల రాముడు గుణవంతుడు, సౌశీల్యవంతుడు.

ఇది విష్ణువు యొక్క లక్షణం. పిపీలికాది బ్రహ్మ పర్యంతం శ్రీవారికి సములే. పిపీలికం అంటే చీమ అది ఎక్కడ పద్మసంభవుడైన చతుర్ముఖ బ్రహ్మ ఎక్కడ. కాని విష్ణువు అందర్నీ సమానంగా కాపాడుతాడు.

శ్రీ బమ్మెర పోతన భాగవతము నుండి :-

ఓ కమలాక్ష ! యోవరద ! యో ప్రతిపక్ష విపక్షదూర !
యో కవి యోగ వంద్య ! సుగుణోత్తమ ! యో శరణాగతా !
సురానోకహా ! యోమునీశ్వర ! మనోహర ! యోవిమల
ప్రభావ ! రావే కరుణింపవే తలపవే శరణార్థిని నన్ను గావవే !

అంటూ ప్రార్థించిన గజేంద్రుని మొర ఆలకించారు దేవతలంతా. కాని శీఘ్రంగా వెళ్ళి కాపాడే సామర్థ్యం సర్వవ్యాపకత్వం ఒక్క విష్ణువుకే వుంది.

విశ్వమయత లేమి వినియు నూరకయుండి
రంబుజాసనాదు లడ్డపడక;
విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతుని కడ్డ పడ దలంచె

గజరాజు మకరిచే నీడ్వబడుచు పెట్టిన ఆర్తనాదం బ్రహ్మ మొదలగు దేవతలందరికి వినపడింది. కాని వారికి అన్ని ప్రదేశాలలో వ్యాపించి వుండే సర్వవ్యాపకత్వము (Omni Presence) లేదు. అందువల్ల మిన్నకున్నారట. అన్ని వేళల అన్ని దిక్కుల వ్యాపించివున్న జయశీలుడైన విష్ణువు వైకుంఠపురంలో తన భామినితో సరససల్లాపాలాడుతూ, ఆమెకు మాటైనా చెప్పకుండా, ఆమెపైట కొంగు కూడా విడువ కుండా బయలు దేరాడే. ఎలాగ?

సిరికిం జెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింప, డే
పరి వారంబును జీర, డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్క నొత్తడు, వివాద ప్రోత్థిత శ్రీకుచో
పరి చేలాంచలమైన వీడడు గజప్రాణావనోత్సాహియై.

తన భక్తులను తరతమ భేదాలు లేకుండా కాపాడే గుణమే శ్రీమహావిష్ణువు సౌశీల్యము.

2. వీర్యవంతుడు : అరణ్యకాండలో ఖరుడు, దూషణుడు అనే రావణ సోదరులిద్దరు పద్నాలుగు వేల మంది రాక్షస సైన్యాన్ని తీసుకుని సమస్త శస్త్రాస్త్రాలు దాల్చి రథగజతురంగ పటాలంతో వచ్చి ఎదిరించగా, రామచంద్రుడు ఒక్కడే ఏరకమైన యుద్ధరథాలు పరివారం లేకుండా కేవలం ధనుర్బాణాలతో నేలమీద నిలబడి పోరాడి అంతమందిని అంతమొందిస్తాడు. చుట్టూచేరి రాక్షసమూక అన్ని దిక్కులా ముట్టడిస్తే అందరికీ కరకుబాణాలతో సమాధాన మిచ్చాడు కోదండపాణి. చివరికి ఐంద్రాస్త్రంతో ఖరదూషణుల్ని యమపురికి పంపుతాడు. అందుకే అసహాయ శూరుడైన రాముడు వీర్యవంతుడు.

3. ధర్మజ్ఞుడు : పుత్రకామేష్టి యజ్ఞఫలం రాముడు. యాజ్ఞవాటిక కోసం భూమిని దున్నుతున్న జనకునికి లభ్యమైన జానకిని పెండ్లాడుతాడు. అరణ్యవాసం చేస్తునపుడు ఆర్యావర్తంలోని తాపసులు, రాక్షసుల బారినుండి యజ్ఞవిధ్వంసం జరుగుతున్నదని కాపాడమని వేడుకుంటారు. అసురులను సంహరించి యజ్ఞవిధులకు ఆటంకం లేకుండా చేసి భావిసామ్రాట్టుగా రాజ్యంలో సుఖశాంతులు స్థాపించడమే అరణ్యవాసంలోని అంతరార్థం.

విశ్వామిత్రుని వెంటవెళ్ళినది శిష్యధర్మం, కైకవరాలను సంతృప్తి పరచినది తండ్రి దశరథుని యెడల పుత్రధర్మం, జనస్థానంలో రాక్షస వధ చేసినది ఋషులను కాపాడటం కోసం రాజధర్మం, రాముడు అయోధ్యానగరంలో పట్టాభిషిక్తుడు కాకున్నా క్షాత్రధర్మాన్ని అడవిలో పాటిస్తూనే వున్నాడు. భరతునికి పాదుకలిచ్చినది భక్తవాత్సల్యం, భ్రాతృధర్మం; వాలిని వధించి సుగ్రీవునితో మైత్రిసల్పడం మిత్రధర్మం, రాజధర్మం కూడా!

వాలివధ పట్ల చాలామందికి రాముడు చేసినది అధర్మం అనిపిస్తుంది. ఈ వివరణ పరిశీలించండి :-

రామబాణానికి గురై మొదలునరికిన మహావటవృక్షంలా నేలకొరిగిన వానరరాజు వాలి రాముడ్ని అశ్రుపూరిత నయనాలతో చూస్తూ యిలా ప్రశ్నిస్తాడు.

"రామభద్రా! అయిదు గోళ్ళ జంతువులలో బ్రాహ్మణులకు, క్షత్రియులకు

తినదగ్గవి ఏదుపంది, అడవిపంది, ఉడుము, కుందేలు, తాబేలు మాత్రమే. మిగిలిన పంచనఖజంతుజాలం వారు భక్షించరాదు. నేను వానరాన్ని, పైగా సామాన్య అడవిమృగాన్ని కాదు. ఈ కిష్కింధకు, వానరజాతికి రక్షకుడను. వానరనాయకుడను. నువ్వు తండ్రి ఆజ్ఞాపాలనకోసం అరణ్యవాసం చేస్తున్న నరనాయకుడవు. మనిద్దరి మధ్య రాజధర్మం సమానం. పోనీ జంతువునే అనుకున్నా నా చర్మము, ఎముకలు, మాంసం యివేవీ నీకు అనుభవైకవేద్యం కాదు. ఇన్ని నిషిద్ధాలున్నప్పటికి నన్ను చెట్టు చాటు నుండి నిష్కారణంగా ఎందుకు సంహరించావు? తార సర్వజ్ఞురాలు. ఆమె వారిస్తున్నా వినకుండా వచ్చినందుకు నాకు నీవలన; ఈ దుష్టసుగ్రీవుని వలన తగిన శాస్తి జరిగింది. రామా నువ్వు తడిపాతతో గొంతుకోసే శఠుడవు. వీరుడవై నన్నెదిరించినా, నాతో మైత్రి చేసి సీతను తెచ్చి పెట్టమన్నా నీమాట కాదందునా? అన్నాడు వాలి.

రామచంద్రమూర్తి ఈ ప్రశ్నకు మందహాసం చేసాడు.

"వానరరాజా వాలీ! నువ్వు చెప్పిన వన్నీయదార్థాలే! నువ్వు రాజువన్న సంగతి నీకిప్పుడు గుర్తుకు వచ్చిందా? వానరజాతికి నాయకుడవైవుండి, వారందరినీ రక్షించే భారం వహించవలసిన నువ్వు నీకు కోడలితో సమానమైన రుమను అంటే సుగ్రీవుని భార్యను మరదలిని చెఱపట్టావు. సుగ్రీవుడు నువ్వు గుహ నుండి ఎంతకాలానికి బైటకు రాకపోగా, మరణించావని భావించి కిష్కిందకు వచ్చి నువ్వులేని సమయంలో ఆపద్ధర్మంగా రాజ్యం చేసాడు. తిరిగి వచ్చిన నువ్వు ఆ పరిస్థితులు అవగతం చేసుకోకుండా అతనిని తన్ని తరిమేసావు. నీది దీర్ఘకోపం, అజన్మశత్రుత్వం. అవి నిరపరాధియైన నీ తమ్ముని పట్ల తగవు. నేను అడవిలో వున్న అయోధ్య రాజునని చెప్పావు. అదిసత్యం. అసురత్వాన్ని కడతేర్చడానికే అడవులకు వచ్చాను.

నువ్వు చేసిన పరదారాపహరణం, సహజాతపై వైరం ఈ దోషాలకు రాజునైన నేను శిక్షించాలి. అందుకే మరణదండన విధించాను. మనుధర్మశాస్త్రం యిలా చెపుతోంది. 'పాపాలు చేసిన నరవానరులు రాజుచేత శిక్షింపబడితే వాళ్ళు పాపఫలం నుండి విముక్తులవుతారు. మరణానంతరం ఆపాపానికి పునశ్శిక్షలుండవు. పుణ్యలోకాలకు వెడతారు. రాజు దొంగను క్షమించి విడిచి పెట్టినా, దండన విధించినా ఆ దొంగ పాప విముక్తుడే అవుతాడు. రెండూ చేయక విస్మరిస్తే ఆ పాపం రాజుకు చుట్టుకుంటుంది. అందువల్ల నీవు శిక్షార్హుడవే!" గంభీరంగా పలికిన మాటలకు వాలి చేతులు జోడించి నమస్కరించి శ్రీరామ మనోహర విగ్రహాన్నే వీక్షిస్తూ పరమపదించాడు.

ఈ సన్నివేశాన్ని బట్టి "రామో విగ్రహవాన్ ధర్మః" అని విశదమవుతోంది.

4. కృతజ్ఞుడు :- మనం అవసరంలో వున్నపుడు ఒకరి చేత పొందబడిన మేలు చిరకాలం గుర్తు పెట్టుకుని వుండటమే కృతజ్ఞత. చేసిన ఉపకారం

మరచిపోవటమే కృతఘ్నత. అయోధ్యాకాండలో నగరప్రజలు రాముని గురించి యిలా చెప్తారు.



అయోధ్యాకాండ, ప్రథమ సర్గ, 11వ శ్లోకము :-

"కథంచి దుపకారేణ
కృతేనైకేన తుష్యతి
న స్మర త్యపకారాణాం,
శతమ ప్యాత్మవత్తయా.

దశరథ మహారాజా! శ్రీరామచంద్రుడు తనకెవరైనా ఉపకారం చేస్తే సంతోషించి పదేపదే వివిధ సందర్భాలలో దానిని గుర్తు చేసుకుని ఆనందిస్తాడు. ఎవరివల్లనైనా తను పొందిన కీడును మాత్రం వెంటనే మఱచి పోతాడు" అని విన్నవించగా ఆ తండ్రి హృదయం ఉప్పొంగి పోతుంది.

విష్ణుపరంగా గమనిస్తే "కృతం జానాతీతి కృతజ్ఞః" జీవులు చేసే కర్మనే 'కృతము' అంటారు. మనకోసం మన కుటుంబం కోసం బంధుమిత్రుల కోసం చేసే పనులన్నీ కర్మలే. స్వలాభాపేక్షతో అన్యుల పట్ల మెలిగే ప్రవర్తనా విధానం, పరుషోక్తులు, వంచనలు, అర్థకామాల కోసం అత్రులు చాస్తూ చేసే అన్యాయాలు ఖువ్వన్నీ పరమాత్మ చిట్టాలో లిఖించబడి వాటి కనుగుణ్యమైన మరుజన్మ వస్తుంది. ఐశ్వర్యవంతుల యిండ్లలో పుట్టి భోగభాగ్యాలు అనుభవించినా, దరిద్రుడై అష్టకష్టాలు అనుభవించినా అన్నీ కర్మఫలితాలే! అందుకే 'బుద్ధి కర్మాను సారిణే' అన్నారు పెద్దలు.

5. సత్య సంభాషణా చతురుడు :- "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ", సత్యం పరమాత్మ స్వరూపం తెలియజేస్తుంది. "సత్" అనగా ఆత్మ – ఇది నిత్యమైంది. "తి" అనగా చంచల స్వభావం గల ప్రకృతి. నిత్యం మార్పుచెందేది ప్రకృతి. స్థిరము, సత్యము అయిన ఆత్మను; చంచలమైన ప్రకృతిని కలిపి నియంత్రించే వాడు "యమ్". ఆయనే పరమాత్మ.

"రామో ద్విర్నాభి భాషతే" రామభద్రుడు రెండు మాటలు మాట్లాడే వాడు కాడు. తెల్లవారితే తన పట్టాభిషేకం. అన్ని పనులు సుముఖంగా జరుగుతూ నగర ప్రజలు; రాజప్రసాదం అంతా సందడిగా వుంటుంది. కైకేయి మందిరం నుండి దాశరథికి సత్వరం రమ్మని కబురు వస్తుంది. వెళ్ళి పినతల్లికి నమస్కరించి, నిస్తేజంగా పడివున్న తండ్రిని చూసి వినమ్రంగా చేతులు జోడించి నిలబడతాడు రాముడు. ఇన్నాళ్ళు కన్నకొడుకు కన్న తనను అల్లారుముద్దుగా పెంచిన పినతల్లి నిప్పులు చెరుగుతున్న కళ్ళతో చూస్తూ కఠినంగా పలుకుతుంది.

"రామా! సూర్యోదయం కాగానే నీకు బదులు నా కుమారుడు భరతునికి

పట్టాభిషేకం జరగాలి. అదే ముహూర్తానికి నువ్వు పద్నాలుగువత్సరాలు అరణ్యవాసానికి వెళ్ళాలి".

"జననీ ఈ మాటలు తండ్రిగారెందుకు చెప్పలేదు?"

"నన్ను చెప్పమన్నారు"

"చిత్తం. అవశ్యం బయలుదేరుతాను. భరతునికిదే రేపు ఉదయానికి రమ్మని వేగులను పంపుతాను శలవు" అని నిద్రించివున్న దశరథునికి, కైకేయికి ప్రణమిల్లి బయలుదేరుతాడు. కౌసల్యాదులు ప్రాధేయపడినా, చివరికి భరతుడే అడవికి వచ్చి అయోధ్యకు ఆహ్వానించినా వనవాసకాలం పూర్తయేవరకు రాడు. ఒకే బాణం, ఒకే మాట, ఒకే భార్య రామునికి. అందుకే ఆయన సత్యసంభాషణా చతురుడు.

6. దృఢవ్రతుడు : శరణాగతులను రక్షిస్తానని శ్రీరామచంద్రుడు దృఢ సంకల్పం చేసుకున్నాడు. అదే ఆయన వ్రతము. అందులో రాజీలేదు.


యుద్ధకాండ, 18వ సర్గ, 33వ శ్లోకము :-

సకృదేవ ప్రపన్నాయ
తవాస్మీతి చ యాచతే
అభయం సర్వ భూతేభ్యో
దదా మ్యేతద్వ్రతం మమ.

"నేను నీవాడను అని (రాముని) శరణుజొచ్చినవాడు శత్రువర్గం నుండి వచ్చిన వాడైనా సరే అతనిని రక్షించి తీరుతాను" అని రాముని ప్రతిజ్ఞ. విభీషణుడు సీతాసాధ్విని రామునకిచ్చి శరణువేడమని రావణునికి హితం చెపుతాడు. ఆయన వినడు. వెంటనే నలుగురు మంత్రులను వెంటబెట్టుకొని ఆకాశ మార్గాన వచ్చి రాముని శరణువేడుతాడు. సుగ్రీవ హనుమదాదులు విభీషణుని అంతగా నమ్మటం తగదు అంటారు. అప్పుడు రామచంద్రుడు -

యుద్ధకాండ, 18వ సర్గ, 3వ శ్లోకము :-

మిత్రభావేన సంప్రాప్తం
న త్యజేయం కథంచన,
దోషో యద్యాపి తస్యస్యాత్
సతా మేత దగర్హితమ్.



"శరణాగతుడై వచ్చిన వాని యందెంత దోషమున్నను; ఎట్టి పరిస్థితిలో కూడ విడిచిపెట్టను. ఇలా చేయటం శిష్టులామోదించింది కూడ" అంటాడు. ఇక్కడ మిత్రభావమనగా శరణాగతతత్వము. వానరమంత్రులు, సుగ్రీవుడు; విభీషణునిలో దోషములు సూచించారు. ఆ దోషాలు విభీషణునిలో లేవని రాముని నమ్మకం. పైగా

దుష్టుడుకాని వాణ్ణి స్వీకరించడంలో గుణమేముంది? దుష్టభావంతో వచ్చి శరణువేడినా అటువంటి వానిని స్వీకరించడమే నాకిష్టం అంటాడు దాశరథి. అదే ఆయన దృఢవ్రతం.

7. మంచి చరిత్ర గలవాడు : చరిత్ర వ్యక్తి పరంగా చూస్తే నడవడి. ఒక వ్యక్తి స్వభావం తెలుసుకోవాలంటే అతని చరిత్రే ఆధారం కదా! అయోధ్య నుండి సపరివారంగా బయలుదేరి భరతుడు రామచంద్రుని కలిసి అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడవు కమ్మని కోరగా ఆయన తిరస్కరిస్తాడు. జాబాలి అనే బ్రాహ్మణుడు రామునితో నాస్తికవాదం ప్రారంభిస్తాడు. ఎవరు నీకు తండ్రి? తల్లి ఎవరు? పుట్టినపుడు ఎవరూ వెంటపుట్టరు? పోయేటప్పుడూ ఏకాకులమే! దశరథుడనేది ఒక దేహం. అది శిధిలమై పంచభూతాల్లో కలిసి పోయింది. ఎదురుగా వున్న కైకేయి తన వరాలు ఉపసంహరించుకుంటాను అయోధ్యకు రమ్మంటోంది. యింకా ఎందుకు ఈ అరణ్యవాసం? సుకుమారి, సౌందర్యవతి అయిన సీతను కష్టపెట్టడం ఎందుకు? రాజకుమారుడవైయుండి ఈ నారబట్టలేవిటి? కందమూల ఫల భక్షణం, పర్ణశాల వాసం యేమిటి? మాతో వచ్చి రాజువై సకల భోగభాగ్యాల్లో తేలియాడు" అంటాడు. రామభద్రుడు మందహాసం చేసి గంభీర వదనుడై –"



అయోధ్యాకాండ, 109వ సర్గ, 4వ శ్లోకము :-

కులీన మకులీనం వా
వీరం పురుషమానినమ్,
చారిత్ర మేవ వ్యాఖ్యాతి
శుచిం వా యది వా2 శుచిమ్.

ఒక వ్యక్తి ఉత్తమ వంశమున పుట్టిన వాడో, హీన వంశమున పుట్టినవాడో, వీరుడో, భీరుడో, పవిత్రుడో, అపవిత్రుడో అనే విషయం అతని నడవడిని బట్టే తెలుస్తుంది.

అయోధ్యాకాండ, 109వ సర్గ, 13వ శ్లోకము :-

సత్యమే వేశ్వరో లోకే
సత్యం పద్మాశ్రితా సదా,
సత్య మూలాని సర్వాణి
సత్యా న్నాస్తి పరంపదమ్

సత్యమే ఈశ్వరుడై లోకాన్ని నియంత్రిస్తుంది. పద్మాలయమైన లక్ష్మి సత్యాన్నే సదా ఆశ్రయించి వుంటుంది. లోకంలోని యితర ధర్మాలన్నింటికి మూలమైనది

సత్యము. సత్యం కన్న గొప్పదైన పరమపదము లేదు. కావున జాబాలీ! నేను సత్య సంధతను వీడను. సత్యశీలుడే లోకాన్ని పాలిస్తాడు. దానము, యాగము, హోమము, తపస్సులు, వేదములు అన్ని సత్యాశ్రితాలే. నాది చంచల స్వభావం కాదు. తండ్రిగారు జీవించి వుండగా ఒకమాట; వారు గతించాక మరొకమాట నాదగ్గర లేవు. వేదబాహ్యునిగా ప్రసిద్ధుడైన నాస్తికుడు నిరాకరింపతగినవాడు, కావున నిన్ను నీ నాస్తిక వాదాన్ని త్రోసిపుచ్చుతూ నా అరణ్యవాసాన్ని కొనసాగిస్తాను. అంటాడు రామచంద్రుడు.

"రామా! నాస్తిక వాదం తగదని నాకు తెలుసు. కాని అన్నదమ్ములిద్దరూ రాజ్యత్యాగం చేస్తే ధర్మసంకటం యేర్పడుతుందని ఊహించి నాస్తికవాదం చేసాను. పైగా ఈ వాదన చేయటం వల్ల నీ దృఢ నిశ్చయం, సత్యసంధత, వేదమార్గం రాముడు వీడడనే మంచి విషయాలు లోకానికి వెల్లడయినాయి' అంటాడు జాబాలి.

8. సర్వ భూత హితైభిలాషి : అయోధ్యానగరవాసులు శ్రీరాముని గుణాలను యిలా వర్ణిస్తారు.

అయోధ్యాకాండ, 2వ సర్గ, 40వ శ్లోకము :-

వ్యసనేషు మనుష్యాణాం
భృశం భవతి దుఃఖితః
ఉత్సవేషు చ సర్వేషు
పితేవ పరితుష్యతి.

పట్టణంలోని పౌరుల కెవరికైనా ప్రమాదం సంభవిస్తే, ఆ ఆపద కలిగిన వారికంటె రామభద్రుడే మిక్కిలి దుఃఖిస్తాడు. పౌరులెవరికైనా ఆనందకర విషయాలు, సంపదలు కలిగితే వారి తండ్రి వలె సంతోషిస్తాడు.

వీరు, వారు, తనవారు, పైవారు అనే భేదం రామునికి లేదు. అందరి దుఃఖాలు ఆయన పంచుకుంటాడు. ఎవరు సుఖంగా వున్నా ఆయన ఆనందిస్తాడు. తన పరోక్షంలో సీతకోసం పోరాడి, తన యెదుట ప్రాణం వదిలిన జటాయువు మరణించినా ఆయన దుఃఖించి –

"రాజ్యం పోయింది. తండ్రి గతించాడు. సీత జాడ తెలియటం లేదు. నాకోసం జటాయువు కూడా ప్రాణత్యాగం చేసింది. యిది నాదురదృష్టం" అని వాపోతాడు తప్ప ఎవరిని నిందించక పోవటం ఆయన సౌజన్యం.

9. విద్వాంసుడు: శ్రీరాముడు విద్వాంసుడు. వేద వేదాంగములయందు పరినిష్ఠుడు. ధనుర్వేదము నందు సుశిక్షితుడు. మంత్రాంగము, రహస్య సేకరణ, నీతి శాస్త్రము, యుద్ధ వ్యూహ రచన, జగస్కంధము, అశ్వపృష్ఠము అనే విద్యలన్నిటియందు ప్రావీణ్యతగల వాడాయన.

"యః సర్వజ్ఞః సర్వవిత్" అని ఉపనిషత్తు చెపుతోంది. వ్యష్టిగాను, సమిష్ఠిగాను పరమాత్మ సర్వం ఎరిగినవాడు. "పశ్యత్యచక్షుః సశ్రుణోతకర్ణః" కన్ను లేకుండా చూడగలడు. చెవిలేకుండా వినాగలడు భగవంతుడు. అందువల్ల ఆయనను "స్వాభావికీ జ్ఞాన, బలక్రియాచ" ఇంద్రియాధీనముకాని సహజజ్ఞానము గల వాడు పరమాత్మ అన్నారు పెద్దలు. మరి అంత కంటె ఉత్తమ విద్య ఏముంటుంది? అందువల్ల రామునివలె పరమాత్మ, పరమాత్మ వలె రాముడు విద్యావంతులు.

10. సమర్థుడు దాశరథి : చదివిన విజ్ఞానం, శాస్త్రజ్ఞానాలను కార్యరూపంలో ఆచరించగలగడమే సామర్థ్యం. రాముడు తను నేర్చిన విద్యలను కూలంకషంగా చర్చించగలడు. అస్త్రశస్త్రాలను రణభూమిలో వినియోగించి జయశీలుడని పించుకోగలడు. భండనపండితుడై రావణకుంభకర్ణులను సంహరిస్తాడు. రావణునికాయం వద్ద స్త్రీలు విభీషణుడు ఏడుంటారు. రాముడు విభీషణుని పిలిచి యింక స్త్రీలను అంతపురానికి పంపి, నీ అన్నకు చరమ సంస్కారం చెయ్యి అంటాడు. అప్పుడు విభీషణుడు రామునితో -

ఈ రావణుడు నాకు సోదర రూపములో వున్న శత్రువు. అందరికి కీడు చేసాడు. అన్నకు సంస్కారము చేయటం కూడా నాకు ఇష్టం లేదు. అంతా నన్ను నిందించినా సరే!" అని బదులిస్తాడు.

రామభద్రుని కాయన మాటలు సంతృప్తి నీయలేదు. శత్రువుపట్ల కూడా ఆయనకు ద్వేషం లేదు.



యుద్ధకాండ : 114వ సర్గ, 101 శ్లోకము :-

మరణాంతాని వైరాణి
నిర్వృత్తం నః ప్రయోజనమ్
క్రియతా మస్య సంస్కారో
మమాప్యేష యథా తవ

విభీషణా! పగలన్నియు మరణము వరకే. మన పని నెరవేరింది (సీతను, సాధుజనులను రక్షించడము, ధర్మాన్ని పునః ప్రతిష్ఠించటం జరిగినవని భావం) ఇప్పుడితడు నీకు వలె నాకును బంధువు." అంటాడు దాశరథి. ధర్మాన్ని రక్షించడమే ఆయన ప్రధాన ఉద్దేశ్యం. తనకున్న ధనుర్విద్యతో రావణుని సంహరించాడు. కార్యం నెరవేరింది. యిప్పుడిక విద్యలను సమయానుకూలంగా సార్థకం చేసుకోవడమే సామర్థ్యం. పరమాత్మ తత్త్వము కూడా అదే! బలిచక్రవర్తిని పాతాళానికి పంపి, ఇంద్రునికి స్వర్గాధిపత్యం యిచ్చాడు వామనావతారంలో, ఇంద్రునిపై మిక్కిలి ప్రేమకాదు. బలిపై ఆయనకు ద్వేషమూ లేదు. ఎవరు ధర్మపరంగా ఎక్కడ వుండాలో అక్కడ వుంచుతాడు

శ్రీహరి.

11. ఏకప్రియ దర్శనత్వము : సుందరకాండలో హనుమంతుడు సీతాసాధ్వి ముందుకు వచ్చి నేను రామదూతను అని చెపుతాడు. లంకలో అనేక రాక్షస మాయలతో విసిగి పోయిన ఆమె అతనిని నమ్మదు. రావణుడో, మరో రావణభటుడో ఆ రూపంలో వచ్చి తనను బాధిస్తున్నారనుకుంటుంది. నీవు నిజంగా రామదూతవే అయితే ఆయన రూపం వర్ణించు అంటుంది. వెంటనే హనుమ -



సుందరకాండ : 35వ సర్గ, 8 శ్లోకము :-

> **"రామః కమల పత్రాక్షః**
> **సర్వ సత్త్వ మనోహరః**
> **రూపదాక్షిణ్య సంపన్నః**
> **ప్రసూతో జనకాత్మజే.**

ఓ జనకరాజపుత్రీ! రాముడు తామర రేకుల వంటి కన్నులు గలవాడు. సకల జీవుల మనస్సులు ఆనందింపజేసేటంత సౌందర్యం గలవాడు. రాముడు రూపంలోనూ అందం కలవాడు. దయాదాక్షిణ్యాది గుణాలు కల ఆత్మ సౌందర్యం కూడా కలవాడు.

అని విన్నవిస్తాడు వినమ్రంగా హనుమ. అనగా హనుమ చూచిన రాముడు సౌందర్యవంతుడు. మరి అరణ్యంలో రాముని కామించి వచ్చిన రక్కసి భామిని శూర్పణఖ, లక్ష్మణునిచే భంగపడి, ముక్కు చెవులు కోసివేయబడగా ఖరదూషణాదుల వద్దకు వెళ్ళి రోదిస్తుంది. ఎవరు నిన్ను బాధించారని వారడిగినపుడు -



అరణ్యకాండ : 19వ సర్గ, 14 శ్లోకము :-

> **"తరుణౌ రూపసంపన్నౌ**
> **సుకుమారౌ మహాబలౌ,**
> **పుండరీకవిశాలాక్షౌ**
> **చీరకృష్ణాజినాంబరౌ.**

"రామలక్ష్మణులిద్దరు మంచి యౌవ్వనంలోవున్న యువకులు. అందమనే సంపదగలవారు. సుకుమారులు, మహాబలవంతులు, తామర రేకుల వంటికన్నులు గలవారు, నారవస్త్రములు ధరించినవారు." అని చెపుతుంది. దుఃఖిస్తూ కూడ ఆమె రామ సౌందర్యాన్ని విస్మరించలేదు. మిత్రులకు, శత్రువులకు కూడ చూడచక్కనివాడు రాముడు. యిదే ఏకప్రియ దర్శినత్వము.

12. ఆత్మవాన్: ప్రశస్తమైన మనస్సు గలవాడు శ్రీరాముడు. దశరథమహారాజు రామపట్టాభిషేకానికి అన్నియేర్పాట్లు చేయిస్తున్నాడు. సీతారాములకు దీక్షయిచ్చారు.

అయోధ్య అంతా రాముడే యువరాజు అనుకుంటున్న సమయంలో కైక వరాలు కోరింది. దశరథుడు మూర్ఛిల్లగా సుమంత్రునిచే రామునికి కబురంపి విషయం తెలిపింది. రామచంద్రుడు ఏరకమైన మనోవికారం పొందలేదు. లక్ష్మణుడు, మరికొందరు కైకను దూషించినా, రాముడు మాత్రం పినతల్లి యెడల పరుషవాక్యాలు పలుకలేదు. క్షమాశీలి దాశరథి.

పరమాత్మ ఆత్మవంతుడు. జీవులందరు ఆయనకు చెందిన వారు. శరీరములు ఆత్మలకు యదేచ్ఛగా వినియోగించుకోడానికి వీలవుతుంది. అలాగే ఆత్మల్ని పరమాత్మ సృష్టికి వినియోగించుకుంటాడు. చివరకు అవి ఆయనలోనే లయమవుతాయి.

13. జితక్రోధుడు : కోపాన్ని తన ఆధీనంలో వుంచుకొనగలవాడు జిత క్రోధుడు. కోపం తెచ్చుకోవటం, దాని అవసరం తీరగానే ఎవరి బోధ లేకుండా స్వయంగా కోపాన్ని ఉపసంహరించుకోవడం కోపాన్ని జయించడం అవుతుంది. అది రామచంద్రుని సొత్తు. వాలిని చంపి కిష్కింధ రాజ్యానికి సుగ్రీవుని రాజును చేస్తాడు. సుగ్రీవుడు వర్ష ఋతువు వెళ్ళగానే సీతాదేవిని వెతికించుతానని మాటయిస్తాడు. అనేక కష్టాలు అనుభవించిన మీదట కొత్తగా రాజ్యభోగాలు అనుభవిస్తూ రామునకిచ్చిన మాటే మరిచిపోతాడు సుగ్రీవుడు. ప్రస్రవణగిరిపై గుహలో వర్షాకాలమంతా రామలక్ష్మణులు గడుపుతారు. సుగ్రీవుని నుండి ఏ కబురురాదు. రామచంద్రునికి భార్యావియోగం వల్ల రోజురోజుకీ దుఃఖం ద్విగుణీకృతమవుతుంది. అది సౌమిత్రి గమనించి ఓదారుస్తూంటాడు. వర్షాలు వెనకట్టి పండువెన్నెల శరదృతువు రానే వస్తుంది. ఒకనాడు రాముడు తమ్ముని పిలిచి -

కిష్కింధాకాండ : 30వ సర్గ, 81 శ్లోకము :-

నచ సంకుచితః పంథా
యేన వాలీ హతో గతః
సమయే తిష్ఠ సుగ్రీవ
మా వాలి పథ మన్వగాః

'సుగ్రీవా! వాలి నాచే హతుడై వెళ్ళిన మార్గమింకా మూసివేయబడలేదు నువ్వు నాకిచ్చిన వాగ్దానం తప్పకుము. వాలి వెళ్ళిన త్రోవలో పోవద్దు'.

కిష్కింధాకాండ : 30వ సర్గ, 82 శ్లోకము :-

ఏక ఏవ రణేవాలీ
శరేణ నిహతో మయా,
త్వాంతు సత్యా దతిక్రాంతం
హనిష్యామి స బాంధవమ్ !

నువ్వు యేర్పాటు చేసిన ద్వంద్వ యుద్ధంలో నేను బాణం వెయ్యటం వలన వాలి ఒక్కడే కన్నుమూసాడు. కాని సత్యం తప్పిన నిన్ను సపరివారంగా సంహరిస్తాను.

"కురుష్వ సత్యం మయి వానరేశ్వరా"

ఓ వానరరాజా సుగ్రీవా! సీతను వెతికించి పెడతానని నాకు చేసిన వాగ్దానం నిలబెట్టుకో! అని లక్ష్మణుని చేత కబురంపుతాడు. సుగ్రీవుడు వచ్చి తన వల్ల కలిగిన జాప్యానికి క్షమాపణలడిగి సీతాన్వేషణకై నలుదిక్కులకు వానరభల్లూకాలను పంపుతాడు. మైత్రి చెడకుండా మాటనిలబెట్టుకుంటాడు. రామచంద్రుడు కోపం ఉపసంహరించుకుని ప్రయత్న సాఫల్యం పొందాడు. ఎవరికోపమైనా వారి ఆధీనంలో వుంటే రామచంద్రుని వలె సఫలీకృతులమౌతాము.

14. ద్యుతి మానుడు : పరమాత్మ శ్రీహరి తేజస్వి "పరంజ్యోతిః" అని కీర్తించబడినవాడు.

"తస్యభాసా సర్వ మిదం విభాతి" పరమాత్మ నివసించే స్థానంలో సూర్యచంద్రనక్షత్ర ఉల్కాదు లేవి ప్రకాశించలేవు. అవి పరమాత్మ దివ్య తేజస్సు ముందు వెలవెల పోతాయి. అది చర్మచక్షువులకు అందని ప్రకాశత్వం.

పరమాత్మ లాగే శ్రీరాముడు కాంతిస్వరూపుడు. కాని ఈయన ప్రకాశం శశాంకుని వలె చల్లనిది, ఆహ్లాదకరమైనది. దండకారణ్యంలో సీతాలక్ష్మణులతో రాముడు ప్రవేశించి మునిఆశ్రమాలు తిరుగుతుంటాడు. ఆ మునులు దాశరథిని చూచి -

"తేతం సోమ మివ వోద్యంతం దృష్ట్వా"

ఉదయమానుడైన చంద్రుని వలె వున్న రామచంద్రుని చూచినారు. రాముని శరీరావయవ సంస్థాన విశేషము, పుష్పహాసతుల్య కోమలత, లావణ్యము, సాముదాయిక శోభ ముఖప్రసాదము దర్శించి ధన్యులైనారు.

అరణ్యకాండ : 1వ సర్గ, 13 శ్లోకము :-

వైదేహీం లక్ష్మణం రామం

నేత్రై రనిమిషై రివ.

ఆశ్చర్య భూతాన్ దదృశు

స్సర్వే తే వనచారిణః

సీతారామలక్ష్మణులను విప్పారిన నేత్రాలతో కనురెప్పవేస్తే ఎక్కడ ఆ సుందర రూపాలను చూడలేమో అన్నంత ఆనందంతో మునులు చూచారు. వారికి మున్నెన్నడు అటువంటి రూపసౌందర్యం చూడకపోవటం వల్ల ఆశ్చర్యం వేసింది. వైకుంఠ ధాముడైన శ్రీమహావిష్ణువు, ఆదిలక్ష్మి, వారు శయనించే శేషుడు, మరి యే రూపు దాల్చినా ఆ సౌందర్య వైభవం భూలోక వాసులకు కన్నులవిందు చేస్తుంది కదా!

15. అనసూయుడు : శ్రీమన్నారాయణుడు అసూయ లేనివాడు. అసూయ అంటే ఇతరుల ఔన్నత్యాన్ని చూచి ఓర్వలేకపోవటం, ఎదుటివారి సుగుణాలను దుర్గుణాలుగా భావించటం. వీటికి అతీతుడు పరమాత్మ. మనం దైనందిన జీవితంలో చేసే పుణ్యపాపాలన్నీ భగవంతుని దేవతాగణ పరివారంచే లెక్కింపబడతాయి. మనం ఆపదలలో వుండి శరణు వేడినపుడు అంతవరకు చేసిన పాపపుణ్యాలనే పరమాత్మ గణనలోనికి తీసుకుంటాడు. మూడు రకాలైన సుకృతాలను పరిశీలించి ఆయన మనల్ని రక్షిస్తాడు.

(i) అనుషంగిక సుకృతము :- దైనందిన జీవనపోరాటంలో మానవుడు తెలిసి తెలియక తెలుసుకుని చేసే అవకాశమూ లేక అనేక పనులు చేస్తుంటాడు. ఒక పని ఉద్దేశంగా పెట్టుకుని చేస్తుంటే మరికొన్ని జరుగుతుంటాయి. అవన్నీ కర్మలుగానే పరిగణింపబడతాయి.

ఒక గొల్లవాడు తప్పిపోయిన మేకను వెతుక్కుంటూ తిరుగుతుంటాడు. గ్రామమంతా తిరిగి ఎక్కడా దొరక్కపోతే రామాలయ ప్రాంగణంలోకి వెళ్లి వెతుకుతాడు. అక్కడ మొక్కలు మేస్తూ ఓమూల కనబడుతుంది మేక. మేకను వెతకటం కోసం చెప్పులు బైట విడిచి వచ్చాడు. వెతుకుతూ గుడికి ప్రదక్షిణం చేసాడు. ఈలోగా అక్కడున్న భక్తులందరూ లేచి నిలబడి తీర్థప్రసాదాలు తీసుకుంటుంటారు. ప్రక్కనే నూతివద్ద కాళ్ళు చేతులు కడుక్కుని తనూ వెళ్ళి వరసలో నిలబడి తీర్థప్రసాదాలు తీసుకుని స్వామికి నమస్కరించుకుని బైటకు వస్తాడు. మేకను పట్టుకుని గుడి బైటకు వస్తాడు. నిజానికి అతను బయలుదేరినది తప్పిపోయిన మేక కోసం కాని అనుకోకుండా దైవదర్శనం, తీర్థప్రసాదాలు లభించాయి. కొన్నాళ్ళకు అతనికి కాలులో మేకు దిగబడింది. కాలంతా వాచి లేవలేని స్థితిలో వున్నాడు. అప్పుడు రామచంద్రుని శరణువేడాడు. భార్యాపిల్లలు వైద్యుని తీసుకువచ్చి బాగుచేయించారు. కొన్నాళ్ళకు నయమై మళ్ళీ వ్యాపారం చేసుకోగలుగుతున్నాడు. ఆపద సమయంలో వేడుకున్న భక్తుని రాముడు వైద్యుని రూపంలో వచ్చి ఆదుకున్నాడు. దైవం మనిషి రూపంలో వచ్చి సహాయం చేస్తాడు అని కదా ఆర్యోక్తి. అనుకోకుండా గుడికి వెళ్లి దర్శనం చేసుకున్నదే అనుషంగిక సుకృతము.

(ii) ప్రాసంగిక సుకృతము :- పుణ్యక్షేత్రాల పేర్లు, దేవతల పేర్లు, ఉత్తమ శీలురైన భక్తులు, గురువుల పేర్లు అనుద్దేశ పూర్వకంగా ఉచ్చరించినప్పటికి అవి మనకు పుణ్యఫల ప్రసాదితాలే!

'ఓరే విశ్వనాథ్, తిరుపతి వెళ్ళి వచ్చావా?' అని ప్రశ్నిస్తాడు ఒకాయన స్నేహితుడ్ని.

'ఆ వెళ్ళి వచ్చాము రా, నాభార్య మీనాక్షి కూడా వచ్చింది తీరా బయలు దేరేక వాళ్ళన్నయ్య సత్యనారాయణగారు కూడా వస్తానన్నారు. తీసుకెళ్ళాం.' అన్నారు విశ్వనాధ్‌గారు ఫోనులో. ఈ కుశల ప్రశ్నల్లోని దైవ నామోచ్ఛారణ వల్ల వారికి పుణ్యఫలం సిద్ధిస్తుంది. అందుకే ఆడపిల్లలకి లక్ష్మి, సీత, సావిత్రి, అనసూయ, రమ, బాలాత్రిపురసుందరి, దుర్గ, గాయిత్రి యిలాంటి పేర్లు; బాలురకు రామారావు, వెంకట్రావు, అప్పలనరసింహం, సూర్యనారాయణ, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, గణేష్ లాంటి దైవ సంబంధమైన పేర్లు పెట్టుకోండి. నామకరణం చేసేందుకు జాతకరీత్యా అక్షరాలు, గణితం, జ్యోతిషం చూస్తారు. మంచిదే! కాని ఆ పెట్టబోయే పేరు యొక్క అర్ధాన్ని కూడా గమనించండి. అర్ధం లేని చదువు వ్యర్ధం అన్నట్లు, అర్ధంలేని పేరూ వ్యర్ధమే. ఉదాహరణకు పద్మజ అనిపేరు. పద్మము నుండి పుట్టినది లక్ష్మి అనే భావం వుంది. అది దైవ పరమైనదే. మనోజ అని పాపపేరు పెట్టారనుకోండి. మనసు నుండి పుట్టినది అని అర్ధము. మనోసంకల్పం వల్ల పిల్లల్ని కనే శక్తి మానవులకు లేదు. సరికదా ఆ పేరులో దైవనామము కూడా లేదు. ఈ పేరులో దైవపరంగా అర్ధం చెప్పుకోడానికి ఏమీ లేదు. కనుక పద్మజ అన్న పేరు శ్రేష్ఠమైనది. అది పదే పదే ఉచ్ఛరించడం వల్ల లక్ష్మీదేవిని మీరు పిలుచుకున్న పుణ్యం దక్కుతుంది. అదే ప్రాసంగిక సుకృతము.

మరొక పేరు శిల్ప. శిల్పమంటే రాతిబొమ్మ. సజీవమైన పాపకు నిర్జీవమైన పేరు. బహుశా శిల్పంలా అందంగా వుంటుందని ఆమె తల్లిదండ్రుల భావన. కాని ఆ శిల్పం నంది కావచ్చు. పంది కూడా కావచ్చు. నిర్దిష్టత, దైవీభావము రెండూ లేవు.

నిజానికి వేదసంస్కృతి అంతా మన పేరులోనే వుంది. కట్టు బొట్టు జుట్టు తీర్థ యాత్రాసందర్శనం వీటితోనే మన భారతీయ హైందవ సంస్కృతీజ్వాల నిరంతరం ప్రజ్వలిస్తూ – 'తమసోమా జ్యోతిర్గమయ'గా వుంది. పేరుతో పిలవగానే స్ఫురించే దైవనామం మన నాలుకను పునీతం చేస్తుంది. అందుకే మీ బిడ్డలకు, మనుమలు, మనుమరాండ్రకు దైవనామాలనే పేర్లుగా పెట్టి ప్రాసంగిక పుణ్యం సునాయాసంగా సంపాదించుకోండి. తరించండి.

(iii) యాదృచ్ఛిక సుకృతము :- నరసింహారావుగారు సింహం లాంటివారు. నిత్యం గంభీరంగా వుంటారు. ఒక పెద్ద హోదాలో వున్న ప్రభుత్వ అధికారి. రైలు ప్రయాణం చేస్తున్నారు. అదే రైలు పెట్టెలో పదిమంది ఇరుముడి కట్టుకున్న అయ్యప్పస్వాములు కూడా చెన్నై బయలు దేరారు. రద్దీగా వుంది రైలు. స్వాములు సామాన్లు సర్దుకుంటుంటే ఒక స్వామి 'ఇరుముడి' జారి క్రింద పడిపోయింది. ప్రక్కనే వున్న నరసింహారావుగారు చదువుతున్న ఆంగ్లపత్రిక పక్కన పెట్టి ఆ యిరుముడి తీసి

కళ్ళకద్దుకుని ఓసారి స్వామి శరణం అయ్యప్ప అనుకుని ఆ స్వామికి అందించారు. అనుకోని సంఘటన ద్వారా ఆయన దైవకార్యం చేసి స్వామిని శరణువేడారు. దీనివల్ల ఆయనకు పుణ్యం ప్రాప్తించింది. ఇదే యాదృచ్ఛికసుకృతము.

పరమాత్మ భక్త పరాధీనుడు. నాలుగు విధాల వ్యక్తులు ఆయన్ను నిత్యం స్మరించుకుంటూ వుంటారని ఆయనే శలవిచ్చారు.

భగవద్గీత, 7వ అధ్యాయము, జ్ఞానవిజ్ఞాన యోగము : 16వ శ్లోకము :-



చతుర్విధా భజన్తే మాం
జనా స్సుకృతినోర్జున
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ
జ్ఞానీ చ భరతర్షభ.

ఆర్తులు (ప్రమాదంలోవున్నవారు), జిజ్ఞాసువులు (పరమాత్మ గురించి తెలియగోరేవారు). ధనాన్ని కోరేవారు, జ్ఞానులు ఈ నాలుగు రకాల పుణ్యాత్ములు నన్ను ధ్యానిస్తుంటారు అని గీత. అందువల్ల ఈ నాలుగు రకాల్లో ఏదో ఒక రకంలో మీరు చేరడానికి ప్రయత్నించండి. సర్వేశ్వరుడు సదా మిమ్ము కాపాడుతాడు.

16. సర్వభూత భయంకరుడు :-పరస్పర విరుద్ధ భావావేశం, విరుద్ధరూపాలు గలవాడు పరమాత్మ. ఆయన ఏ రూపం ధరించినా ఏ భావావేశం ప్రకటించినా సాధుజన సంరక్షణార్థం, దుష్ట శిక్షణార్థమే అని మనం గ్రహించాలి.

భగవద్గీత, 4వ అధ్యాయము, కర్మసన్యాసయోగము, 7వ శ్లోకము :-

యదా యదా హి ధర్మస్య
గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య
తదాత్మానం సృజామ్యహమ్.

ఎప్పుడెపుడు ధర్మానికి హాని జరగుతుందో, అధర్మం వృద్ధి పొందుతుందో, ఆయా సమయాల్లో నన్ను నేనే సృష్టించుకుంటాను, అన్నారు శ్రీకృష్ణపరమాత్మ. యిక్కడ సృష్టించు కోవడం అంటే ఆ కాలానికి, అవసరానికి తగ్గ రూపం ధరించడం అని. దశావతారాల ఆంతర్యం యిదే. వేదాలు నీటి నుండి రక్షించవలసినపుడు ఆయనే పెను చేప. అమృతమధనం కోసం దేవాసురులు సముద్రం చిలికినపుడు ఆయనే మహాకూర్మం. భూమిని రక్షించ వలసి వచ్చినపుడు ఒంటి కొమ్ముగల బృహద్వరాహం ఆయనే. చిన్నారి భక్తుడు ప్రహ్లాదుని రక్షించడానికి ఆ బాలుని మాట నిలబెట్టడానికి

స్థంభాన్నే ఆశ్రయించిన మహా ప్రళయకాల భయంకర రూపం దాల్చిన నరసింహుడు ఆ శ్రీహరే. ఏది ఏమైనా ఆయన లక్ష్యం మాత్రం ఒకటే సాధుసంరక్షణం. మంచివారిని రక్షించడానికి ఎలాగూ అవతరించాను గనుక చెడ్డవాడిని శిక్షిస్తాను అనే సిద్ధాంతం ఆయనది.

భగవద్గీత, 6వ అధ్యాయము, ఆత్మ సంయమ యోగము, 5వ శ్లోకము



ఉద్ధరే దాత్మ నా22 త్మానం
నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బన్ధు
రాత్మైవ రిపురాత్మనః

ఏ మానవుడయినా తనను తన చేత ఉద్ధరించుకోవాలి. తనను తన చేత నాశనం చేసుకోరాదు. తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు. విశదీకరించి చూస్తే మన బుద్ధి, అంతరంగం మనల్ని ఎప్పటికప్పుడు సన్మార్గంలో పెడుతూంటుంది. దానిమాట మనం త్రోసిరాజని చెడుమార్గం వైపువెడితే నాశనం కోరితెచ్చుకుంటాము.

భగవద్గీత, 9వ అధ్యాయము, రాజవిద్యా రాజగుహ్య యోగము : 30వ శ్లోకము :



అపి చేత్సు దురాచారో
భజతే మా మనన్యభాక్
సాధురేవ స మన్తవ్య
స్సమ్యగ్వ్య వసితో హి సః

ఎలాంటి దుర్మార్గుడైనా సరే ఇతరులను ఆశ్రయించక నన్నే (శ్రీకృష్ణుని) సేవించునో అతను శ్రేష్ఠుడనే తలంచవచ్చు. ఎందువల్లనంటే అతనికి 'పరమేశ్వర అనుగ్రహం చేత మాత్రమే కృతార్థుడ నౌతాను' అనే నిశ్చయం అంతర్లీనంగా వుంటుందట. అందువల్ల భగవంతుని ప్రళయకాల రూపమైన నరసింహ రూపం హిరణ్యకశిపునికి భయంకరమైనది. ప్రహ్లాదునికి ప్రీతికరమైంది. భక్తునికి ఆయన ఏ రూపంలో వున్నా ఆనందాన్నిస్తాడు. రావణకుంభకర్ణుల లాంటి దుష్టులకు శ్రీరాముని వంటి పరమ శృంగార కోమలమూర్తియైనా, భయంకరుడుగానే కనిపిస్తాడు. చూచే వారి భక్తి భావం ప్రధానము.

పరమాత్మ శ్రీహరి యొక్క ఆగ్రహానికి వెఱచి దేవేంద్రుడు, యముడు, పంచభూతాలు, సూర్యచంద్రాది దేవతలు, గ్రహాలు తమ తమ విధులను చక్కగా నిర్వర్తిస్తుంటారు.

భీషాస్మా ద్వాతః పవతే

భీషో దేతి సూర్యః

భీషాస్మా దగ్నిశ్చేంద్రశ్చ

మృత్యుర్ధావతి పంచమ ఇతి

వాయువు పరమాత్మ భయం వలన వీస్తుంది. సూర్యుడాయన భయంవలన క్రమం తప్పక ప్రకాశిస్తున్నాడు. అగ్ని ఆయనకు వెఱచి వస్తువులను దహిస్తున్నాడు. ఇంద్రుడు సకల దేవతాగణాన్ని అదుపులో వుంచుతున్నాడు. మృత్యువు క్షణం తేడాలేకుండా జీవుల్ని కడతేరుస్తుంది.

వాల్మీకికి నారదుల వారు శలవిచ్చిన శ్రీరామచంద్రమూర్తి గుణగణాల సారాంశం మనం నేటి పరిస్థితికి అన్వయించుకుని మననం చేసుకున్నాము. సర్వేజనాస్సుఖినోభవస్తు.



౭. సీతాసాధ్వి

జనకుని పుత్రిక సీత. మిథిలా నగరానికి రాజు జనకుడు. ఆయన రాజర్షి, అనపత్యుడు. యాగం చేసే నిమిత్తం భూమిని దున్నుతుండగా నాగేటి చాలున మందసంలో లభించిన శ్రీమహాలక్ష్మి అవతారమే సీత. ఆమె పేరులోనే ఆ అర్థం వుంది. ఆమె సౌందర్యరాశి. అల్లారు ముద్దుగా పెరిగి ఆట పాటలాడుతున్న సమయంలో బంతి శివధనుస్సు వుంచిన పెట్టెక్రిందికి దొర్లిపోగా; మహా బలాఢ్యులు సైతం ఎత్తలేని దానిని ఆ బాలిక అవలీలగా త్రోసి బంతి తీసుకుంది. ఈ విషయం జనకునికి తెలిసి ఆమె సామాన్య బాలిక కాదని గ్రహించాడు. విశ్వామిత్రుని వెంట వనాలకేగి, విద్యలునేర్చి, ఆయన యాగసంరక్షణం చేసి తిరిగి వస్తున్న తరుణంలో రామచంద్రుడు శివధనుర్భంగం గావించి ఆమె పాణిగ్రహణం చేసాడు. సీతారాముల కళ్యాణం అతి వైభవంగా జరిగి, అయోధ్యలో దశరథుని పెద్దకోడలిగా ఆమె మెట్టినింటి కొచ్చింది. రాజలాంఛనాలతో పుట్టిపెరిగింది. మహారాజు కోడలైంది. కైకకాఠిన్యవరాల వల్ల వనగమనం చేసింది. అయినా భర్త వున్న అడవినే స్వర్గమనుకుంది. చిత్రకూటంలో, పంచవటిలో, ముని పల్లెలలో రాముని భుజస్కంధమే ఆలంబనగా మరది సేవలందించగా ఆనందంగా కాలంగడుపు తున్నది. అలాంటి తరుణంలో శూర్పణఖ దురాగతం వల్ల దశకంఠుని కపట వేషానికి లోనై, చివరికి అశోక వనంలో బందీ అయింది. రక్కసి స్త్రీమూకల చేత అనరాని మాటలు పడుతున్నది. సుందరకాండలో ఆమె దయనీయ స్థితిలో వుంది. హనుమ ఆమెను అన్వేషిస్తూ లంకంతా గాలించి ఎట్టకేలకు అశోకవనం చేరి ఆమె కూర్చున్న శింశుపావృక్షాగ్రంలో ఆకుల మధ్య బాలకపి రూపంలో కూర్చుంటాడు.

ప్రభాత సమయం, యింకా సూర్యుడు ఉదయించలేదు. శింశుపా వృక్షకాండం చుట్టూ కట్టబడిన అరుగుమీద సీతాసాధ్వి కూర్చుని వుంటుంది. తెల్లని కైలాసగిరి వంటి సహస్రస్థంభాల మంటపం సమీపంలో వుంది. పక్షులు కలకలారావాలు చేస్తూ బారులు తీరి నింగికెగసి పయనిస్తున్నాయి. శుష్కించిన శరీరంతో తైలసంస్కారం లేని కేశపాశాలతో నీరసించి వుంది ఆమె. అయినా సౌందర్యం యినుమడిస్తోంది. ఆమెను చూడగానే ఆంజనేయస్వామి.



సుందరకాండ, 15వ సర్గ, 50వ శ్లోకము :

అస్యా దేవ్యా యథా రూపమ్
అంగ ప్రత్యంగ సౌష్ఠవమ్.
రామస్య చ యథా రూపమ్
తస్యేయ మసితేక్షణా !

సీతాసాధ్వి శరీరాకృతి రాముని ఆకృతి వలె వుంది. అవయవముల అమరిక, నల్లని కలువకన్నులు రాముని వలె ఈమెకూ వున్నాయి. అన్నీ రాముని పోలికలే! తల్లీ కొడుకులు, తండ్రీ కూతుళ్ళు, మేనత్త మేనమామ బిడ్డలు వీరే రూప సాదృశ్యం కలిగి వుంటారు. వివాహ పూర్వం యే రక్తసంబంధమూలేని సీతారాములు ఒకే పోలికలో వుండటం విశేషము. భార్యాభర్తల మధ్య యింత దగ్గర పోలికలు అసాధారణం అనుకుంటాడు.



సుందరకాండ, 15వ సర్గ, 51వ శ్లోకము:

అస్యా దేవ్యా మనస్తస్మిన్
తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్.

రామచంద్రుని మనస్సు సీత యందు లగ్నమైనట్లుగానే ఆమె అంతరంగం కూడా భర్తయందే లయించి వున్నదని హనుమ గ్రహించాడు. బింబప్రతిబింబాలుగా మనశ్శరీరాలు ఏకమైన సీతారాముల దాంపత్యం, వారి ఎడబాటు గమనించిన ధీశాలి హనుమ.

"రామా యన చపలాక్షుల పేరు
రామ యన బ్రహ్మమునకు పేరు"

అని త్యాగరాజస్వామి పాడుకున్నారు. పేరులోను తీరులోను జానకీ దాశరథులకు సాదృశ్యం వుంది. 'రామా' శబ్దానికి అందమైన స్త్రీ అనే అర్థం వుంది. సర్వాంగసుందరియైన రమ (లక్ష్మి)ని రామాయనటంలో సౌందర్యం మరింత యినుమడిస్తుంది కదా! అరణ్యవాసం కోసం సుమంత్రుడు సీతారామలక్ష్మణులను దిగవిడచి తిరిగి అయోధ్య వచ్చి దశరథ మహారాజుతో యిలా శలవిస్తాడు.

అయోధ్యాకాండ, 60వ సర్గ, 10వ శ్లోకము:

బాలేవ రమతే సీతా2
బాలచంద్ర నిభాననా,
రామా రామే హ్యదీనాత్మా,
విజనే2 పి వనే సతీ !



బాలచంద్రుని వంటి వదనంతో శోభిల్లుతున్న సీతమ్మ పసిపిల్లలా చలాకీగా విహరిస్తూ మహారణ్యాన్ని కూడా మధువనంగా భావిస్తున్నది అంటాడు. సీతమ్మకు రామసాన్నిధ్యమే ఆనందదాయకము. అరణ్యవాసం కైక కోరిక ప్రకారం ఒక్క రామచంద్రునికే! కాని రాముడు లేని అయోధ్యానగరం, భోగభాగ్యాలు ఆ పతివ్రతకు తృణప్రాయము. భర్త సాన్నిధ్యమే స్వర్గధామము. భర్త తప్ప అన్యభావ మెరుగని అనసూయ నారదుడిచ్చిన ఇనుప గుగ్గిళ్ళను ఉడికించి రుచికరమైన శనగలుగా మార్చింది. రేణుకాదేవి ఇసుకతో కుండను చేయగలిగింది. ఆ కోవకు చెందినదే సీతాసాధ్వి. పదమూడు వత్సరాల అరణ్యవాసం ఆవగింజత లోటు లేకుండా ఆనందంగా గడిచి పోయింది. ఆమె కోరినదే ఒక్క కోరిక. అదే బంగారు వన్నెగల లేడికూనని. అది సృష్టి విరుద్ధమైనదని; రాక్షస మాయ కావచ్చునని లక్ష్మణుడు ముందే గ్రహించి సందేహం వెలిబుచ్చుతాడు. అయితే భార్య యెడల అనురాగం, తను ధనుర్విద్యా పాండిత్యం గలవాడననే ఆత్మవిశ్వాసం, సాధించాలనే పట్టుదల, రామచంద్రుని ముందుకు నడిపిస్తాయి. నిజమైన లేడిపిల్ల అయితే తెచ్చి మీ వదినెకిస్తాను. రాక్షస మాయే అయితే ఛేదిస్తాను అంటూ దాని వెంట పరుగు పెడతాడు. అది ఎంతకీ చిక్కకపోతే బాణం వదలగా మారీచుడు నిజరూపం దాల్చి "హా ! లక్ష్మణా! హా సీతా! "అని అరవటం, సీత విని రామునికే ప్రమాదం సంభవించింది అనుకోవటం ఇదంతా మానవ సహజమైన అనుమానము. అంతటితో ఆమె ఆగలేదు. తన భర్త ప్రాణాపాయస్థితిలో వున్నాడని భావించి, వెళ్ళి కాపాడమని మరిదిని అడుగుతుంది. ఆయన రాక్షసమాయ గమనించిన వాడు కావటంతో నిబ్బరంగా వుండమని అన్నకు అపాయం రాదని చెప్తాడు. భరతుడు రాజ్యం కబళిస్తే నువ్వు అన్న ఆలి పైనే కన్ను వేసావా? అది సాధ్యపడదు అని అపనింద వేస్తుంది. ఖిన్నుడై కన్నీళ్ళు పెట్టుకుంటాడు సౌమిత్రి. అమ్మా! ప్రతిదినము నీ పాద సందర్శనం చేసుకుని, మీ దంపతుల్నే జననీజనకులుగా భావించాను; అన్నమాట అతిక్రమించిన పాపం చుట్టు కున్నా సరే వెడతాను అంటూ ధనుర్బాణాలు ధరించి అన్నకోసం బయలుదేరుతాడు. ఇక్కడ సీతాసాధ్వి సాధారణ స్త్రీవలె ప్రవర్తించడం, మరదిపై నిందలు వేయటం ఆశ్చర్యం, అసమంజసం అనిపిస్తుంది. కాని రామలక్ష్మణుల సమక్షంలో దశకంఠుడు ఆమెను అపహరించజాలడు. సీతాపహరణం జరుగనిదే రామచంద్రునితో రావణునికి వైరంకలుగదు. సుందరకాండలో శింశుపావృక్షం క్రింద

కూర్చొని సీతాసాధ్వి తను మరిదిని అన్న మాటలకు పశ్చాత్తాపం చెంది; ఆ పాప ఫలమే తనకాదుర్గతి తెచ్చినదని వాపోతుంది. తప్పు చేయటం పశ్చాత్తాపపడటం లోకసహజమైన మానవ ప్రవృత్తి. మానవావతార పాత్ర పోషణలో రామయ్యను మించి పోయింది సీతమ్మతల్లి.

సీతాపహరణంలో రావణుడు ధీరునివలె, వీరుని వలె ప్రవర్తించలేదు. కపటిలా తస్కరించాడు. రామపత్నిని లంకలో వుంచుతాడు. ఆమె ఆదిలక్ష్మి అవతారం. దేవతలను క్రూర చర్యలతో భయపెట్టిన రావణునిపతనానికి మార్గం సుగమమైనదని ఇంద్రుడు ముదమంది; తమకోసం శ్రమపడుతున్న మాతకు అమృతప్రాయమైన పాయసం సమర్పించుకుని; ఆకలిదప్పులు లేకుండా చేస్తాడు. అందువల్ల ఆమె దానవేంద్రుని యింట అన్నపానాలు ముట్టదు. కామవశుడైన రావణుడు....... ఉ దయాన్నే తన భార్య ధ్యానమాలిని; కొందరు మహిళల్ని వెంట బెట్టుకుని రుసరుసలాడుతూ సీత కూర్చున్న వృక్షం వద్దకు వస్తాడు. తనను వరించి పట్టమహిషివి కమ్మని కోరుతాడు. తన కోరిక తీర్చకపోతే ఉదయపు ఫలహారం క్రింద తన వంటవాళ్ళు సీతను వండి వడ్డించేస్తారని బెదిరిస్తాడు. వైదేహి వాని భీకర వచనాలకు భీతిల్లదు. గడ్డిపరక నడ్డంపెట్టుకుని మాట్లాడుతుంది. తనను రామచంద్రునికి సమర్పించి, క్షమాభిక్ష వేడుకుని ఆయనతో స్నేహం చెయ్యమని హితం చెపుతుంది. నువ్వు రాజువుకదా సాటి రాజుల భార్యలను గౌరవించడం నేర్చుకోమంటుంది. రావణుడు ఆగ్రహించగా ఆయన భార్యలు శాంతబరిచి అంతఃపురానికి తీసుకుపోతారు.

దశకంఠుడు నిష్క్రమించేక రక్కసి మూకలు చేస్తున్న అల్లరి, ఆగడాలకు విసిగి, తన కేశపాశాలనే ఉరిత్రాడుగా బిగించుకుని దీనత్వంతో, పరమ దుఃఖంతో ఆత్మహత్యకు పూనుకుంటుంది. చెట్టుపై నుండి రామకథాగానం ఆరంభిస్తాడు మారుతి. అది విని నలుదిక్కులా చూస్తూ, లంకలో రాముని కీర్తన యేమిటాని పరిశీలిస్తుంది. ఆమెలో వున్న నిరాశానిస్పృహలు పూర్తిగా మటుమాయం చేస్తాడు ఆంజనేయస్వామి. అందుకే ఆయనకు జగమంతా గురుస్థానం యిచ్చి కొలుస్తున్నారు. ఈ విషయం లోకానికి నేర్పింది విశిష్టాద్వైతమే. సీతాశోకవినాశకారకుడని హనుమను శ్లాఘిస్తున్నారు అందుకే!

హనుమ రూపం చూచి ఆమె సంశయిస్తుంది. తన విశ్వరూపం చూపి తాను అల్పవానరాన్ని కాదని నమ్మిస్తాడు. నాకంటె వీరులు సముద్రమవతల వేనవేలుగా సుగ్రీవుని కొలువులో వున్నారంటాడు. కుశల ప్రశ్నలు; ఆనవాళ్ళు, యిచ్చిపుచ్చుకోవడాలు పూర్తవుతాయి. "నా వీపుమీద ఎక్కుతల్లీ! రాముని సన్నిధానంలో దింపుతాను", అని విన్నవిస్తాడు".

'హనుమా నా భర్త వచ్చి నన్ను తీసుకు వెళ్ళటం నాకు ఆయనకు గౌరవం. రామలక్ష్మణులు లేని తరుణంలో కపటియై నన్ను తస్కరించాడు రావణుడు. నేను

నీతో వస్తే అదే పని రాముడు చేయించినట్లు లోకం భావిస్తుంది. అయినా రాక్షసుల కంట బడకుండా నువ్వు నన్ను తీసుకు వెళ్ళటం, తీరా వెడుతుంటే వారు నీతో యుద్ధం చేయటం జరుగుతుంది. నేను నీ వీపుపై నుండి జారి సముద్రంలో పడిపోవచ్చు. యివన్నీ అటుంచి నేను రాముని తప్ప అన్య పురుషస్పర్శకు అంగీకరించను' అని సీత చెపుతుంది. అది ఆమెకే చెల్లింది. అమ్మలగన్నయమ్మ, సర్వదేవతాగణ స్త్రీలకు మహారాజ్ఞి, ఐశ్వర్యప్రదాత, విష్ణుప్రియ అయిన మహాలక్ష్మియే రూపంతో వున్నా లోకారాధ్యనీయురాలు. ఆమె ఆ తీరుగానే ప్రవర్తించి సకల నారీలోకానికి నడవడిలో మంచి మార్గం చూపాలి కదా! పురుషులకు శ్రీరాముడాదర్శప్రాయుడైతే, సాధ్వీమతల్లులకు సీత శిరోరత్నం. వాల్మీకి సీతపాత్రచిత్రణ అమోఘం. అనితర సాధ్యం. భర్త యొక్క పరాక్రమానికి గాని. వంశగౌరవానికి గాని అప్రతిష్ఠ తెచ్చే పనులు ఆమె చెయ్యదు. భారత స్త్రీలకు యీనాటికి, యేనాటికి వైదేహి ఆదర్శమూర్తి, పతివ్రతాశిరోమణి.

వనసంచారం చేస్తున్న సీతారామలక్ష్మణులు సుతీక్షణమహర్షి ఆశ్రమానికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకుని మళ్ళీ ప్రయాణం సాగిస్తుంటారు. సీతాసాధ్వి స్నేహపూర్వకంగా రామచంద్రునితో యిలా అంటుంది. లోకంలో మూడు వ్యసనాలున్నాయి. ఒకటి అసత్యం పలకడం, రెండు పరస్త్రీలను కామించడం, మూడవది నిష్కారణవైరం మొదటి రెండు మీ యందు లేవు.

అరణ్యకాండ 9వ సర్గ, 9వ శ్లోకము :



తృతీయం య దిదం రౌద్రం
పరప్రాణాభిహింసనమ్
నిర్వైరం క్రియతే
మోహా త్తచ్చ తే సముపస్థితమ్

విరోధము లేకుండానే యితరుల ప్రాణాలు తియ్యడమనే రౌద్రవ్యసనం పామరులకు మాత్రమే తగింది. కాని రామచంద్రా నీ కది ఈ అరణ్యవాసంలో తటస్థించింది. దండకారణ్యంలో రాక్షసులను నిష్కారణంగా సంహరిస్తున్నావు. రాజ్యాన్ని శాశ్వతంగా పరిత్యజించి మునివృత్తి యందే ఉండిపోతే అత్తమామలు కూడా ఆనందిస్తారు. అగ్నిసంబంధం యెట్లా వినాశహేతువో ఆయుధసంయోగం కూడా మనోవికారం తెప్పించి మనిషిని హింస వైపు పురికొల్పుతుంది. తపోవనంలో క్షాత్రధర్మం చూపి పరస్పర విరుద్ధాలైన పనులు చేస్తున్నావు. మన దేశ ధర్మము తపోవన ధర్మమే అంటుంది జానకీదేవి.

అరణ్యకాండ, 10వ సర్గ, 30వ శ్లోకము:

ధర్మా దర్థః ప్రభవతి

ధర్మాత్ప్రభవతే సుఖమ్
ధర్మేణ లభతే సర్వం
ధర్మసార మిదం జగత్.



ధర్మం వలన ధనం లభిస్తుంది. ధర్మం వలన సుఖం కలుగుతుంది. ధర్మం చేత సర్వమూ చేకూరుతుంది. ఈ ప్రపంచమే ధర్మసారము. సారవంతము. బుద్ధి కుశలత గలవారు చాంద్రాయణాది వ్రతాలు చేసి, శరీరాన్ని కృశింప జేసి ధర్మాన్ని సంపాదిస్తారు. సుఖ పడటం వల్ల సుఖం ఎన్నడు లభ్యంకాదు. కాబట్టి! ఓ సౌమ్యుడా! ఈ తపోవనంలో నిర్మల మనస్కుడవై ధర్మాన్ని ఆచరించు." అని సీతాసాధ్వి భర్తకు ధర్మాన్ని ఉపదేశిస్తుంది. జానకీదేవి అన్నీ విశదీకరించి చివరగా యిలా ఉద్బోధిస్తుంది-

"ఓ రామచంద్రా! ముల్లోకాలలోని సకలవిషయాలు నీకు యాథాతథంగా తెలుసు. నేను స్త్రీని, నీయందలి ప్రీతితోను, గౌరవంతోను ఈ విషయాలు చెప్పాను కాని నీకు తెలియదనికాదు. స్త్రీత్వప్రయుక్తమైన చాపల్యంతో చెప్పాను. మీ అన్నదమ్ములిద్దరు ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అంటుంది. శ్రీరామచంద్రుడు ఆమె చెప్పిన తీరుకి మురిసిపోతాడు. అది అనురాగ చిహ్నమైన ప్రబోధంగా భావిస్తాడు.

"నెచ్చెలీ! ఎవరిమీద అనురాగం వుంటుందో వారికే ఉపదేశిస్తాం కాని అన్యులకు చెప్పం కదా! దండకారణ్యంలోని మునులు తమ యాగాలను రాక్షసులు ధ్వంసం చేస్తున్నారని, తపో భంగం కలిగిస్తున్నారని ఆ క్రూరుల బారి నుండి తమని కాపాడమని వేడుకున్నారు. ఆర్తులను కాపాడటమే క్షాత్రధర్మం. నిస్సహాయ స్థితిలో వున్న వారిని ఎవరు బాధిస్తారో వారే రాక్షసులు. అటువంటివార్ని హతమార్చడం కోసమే క్షత్రియులు ఆయుధాలు ధరించక తప్పదు"; అని ఆమెకు నచ్చజెపుతాడు రామచంద్రుడు.

భర్త పట్ల మీదుమిక్కిలి అనురాగం గల ఆమెను రావణుడు బలవంతంగా తస్కరించే సందర్భంలో

అరణ్యకాండ 49వ సర్గ, 17వ శ్లోకము

వామేన సీతాం పద్మాక్షీం
మూర్ధజేషు కరేణ సః
ఊర్వోస్తు దక్షిణే నైవ
పరిజగ్రాహ పాణినా

రావణుడు తన ఎడమ చేతితో పద్మాక్షియైన సీతజుట్టు పట్టుకొని, కుడి చేతితో ఆమె తొడలను పట్టుకున్నాడు. యిది పరపురుష స్పర్శయే. కాని ఆమెకు అంగీకారమైనదికాదు. ఒకడు బజారులో భార్యతో వెడుతూంటాడు దొంగవచ్చి భార్య భుజం పట్టుకుని మెడలో నగలు లాక్కొని పోతాడు. పెనుగులాటలో ఆమె

హృదయభాగం వాడి చేతికి తగులుతుంది. ప్రక్కనే వున్న భర్త గమనించేలోపే యిదంతా జరిగిపోతుంది. ఆ స్థితిలో నగ పోగొట్టుకున్న భార్యను సముదాయిస్తాడా? లేక పరపురుషస్పర్శ వల్ల నీ పాతివ్రత్యం పోయిందంటాడా? రెండవ మాట అంటే జనం అతన్ని పిచ్చి వాడిగా భావిస్తారు. సందేహం లేదు. పురాణ పాత్రల పవిత్రత, ఔన్నత్యం అర్థం చేసుకోవాలంటే కాస్త ఇంగితజ్ఞానం వుండి తీరాలి. అది లేని వాళ్ళే కువిమర్శ గ్రంథాలు వ్రాస్తారు.

జానకీమాత పవిత్రతకు మరో ఉదాహరణ లంకాదహన ఘట్టం. అంజనేయస్వామివాలానికి పాతగుడ్డలు చుట్టి నూనెపోసి నిప్పంటించి లంకంతా తిప్పుతున్నారు. ఆ విషయం రాక్షసాంగనలు సీతామాతకు చెప్పారు. రాముని కుశలవార్త తెచ్చి, తనకు ధైర్యం చెప్పి, దుఃఖం నుండి తనకు ఊరట కలిగించిన పుత్రసమానుడు హనుమ. అతనికి ఆపద వచ్చినందుకు ఆమె శోకించి అగ్నిదేవుని ధ్యానించింది.

సుందరకాండ - 53వ సర్గ, 29వ శ్లోకము :



యది చాస్త్యేకపత్నీత్వం
శీతో భవ హనూమతః
యది కించి దనుక్రోశ
స్తస్య మ య్యస్తి ధీమతః

ఓ అగ్నిభట్టారకా! నేను పతివ్రతనైతే హనుమశరీరం కాల్చకుండా; అతనికి చల్లగా వుండు' అని ప్రార్థించింది. ఆమె హనుమకు బాధ కలుగకుండా వుండటం కోసం తన పాతివ్రత్యాన్నే సాధనంగా ఉపయోగించుకుంది. శ్లోకంలోని రెండవ పాదమొక్కటే చదివి చూడండి. "శీతో భవ హనూమంతః" అది ప్రార్థనకాదు నిజానికి అగ్నికి జగదంబ శాసనమే! హనుమకు చల్లగా వుండాలి. లోక మాత వాత్సల్యానికి నోచుకున్న హనుమ ఎంత భాగ్యవంతుడో కదా!

ఆంజనేయుడు లంకంతా కాల్చి వేస్తాడు. మంటలు మిన్ను ముట్టి రాక్షసప్రజ అంతా వీధినబడి అంతా గగ్గోలుగా వుంటుంది. అయ్యో! నాలుగంగుళాల జాగా కూడా వదలకుండా నిప్పంటించేసేనే! సీతమ్మకు ప్రమాదం వాటిల్ల లేదుకదా! అని పరిపరి విధాల తన అవివేకానికి నొచ్చుకుంటుండగా ఆకాశమార్గాన కబుర్లు చెప్పుకుంటూ వెడుతున్న చారణులమాటల వల్ల ఆమె క్షేమంగా వుందని గ్రహిస్తాడు.

సుందరకాండ 55వ సర్గ. [illegible]వ శ్లోకము :

తపసా సత్యవాక్యేన
అనన్యత్వాచ్చ భర్తరి


అపి సా నిర్దహే దగ్నిం

నతా మగ్నిః ప్రధక్ష్యతి

'తపస్సుచేత, సత్యవచనంచేత, పతియందుగల అనన్య భక్తిచేత సీతామాతయే అగ్నిని దహింపగలదు. అగ్ని ఆమెను దహింప జాలదు;' అని హనుమ అనుకొని తిరిగి ఆమెను క్షేమంగా చూసి, పలకరించి వెనుదిరుగుతాడు లంక నుండి. ఆయన ఊహించినది యుద్ధానంతరం అగ్ని పరిక్ష ద్వారా నిరూపింపబడింది.

విభీషణపట్టాభిషేకం ముగిసిన తరువాత హంసచిత్రాలు, అందమైన లతాంగుల శిల్పాలు, దివ్యమైన రెక్కలు గల పుష్పకవిమానం పై రామచంద్ర ప్రభువు, సీతాదేవి, సుగ్రీవహనుమదాది వానరులతోను; విభీషణాది మిత్రరాక్షస గణంతోను అయోధ్యకు బయలు దేరుతారు. రామచంద్రుడు తన ప్రియసఖికి క్రింది పరిసరాలు చూపిస్తున్నాడు. విమానం వేగం పుంజుకుంది.

"సీతా త్రికూట పర్వతం మీదనున్న లంకానగరం శోభ చూడు. అదిగో అదే విశాలమైన రణభూమి. రక్తమాంసాలతో ఎలా భయంకరంగా వుందో చూడు" అదిగో సేతుబంధన రేవు. పూజనీయము, పావనము అయినది. అని ఈ రకంగా వారు మాట్లాడుకుంటుండగా కిష్కింధ వచ్చింది. అక్కడ వానరులు, అంతఃపురస్త్రీలను ఎక్కించుకొని చివరికి భరతుడు నివశించే నంది గ్రామం చేరుకుంటారు. సీతాదేవి మనసు శాంతి పొందుతుంది.



యుద్ధకాండ 129వ సర్గ. 2వ శ్లోకము :

కల్యాణీ బత గాథేయం

లౌకికీ ప్రతిభాతి మే,

ఏతి జీవంత మానందో

నరం వర్ష శతాదపి.

"మానవుడు ఎన్ని కష్టాలు ఎదురైనా జీవించి వుంటే నూరేండ్లకయినా తప్పక ఆనందం పొందుతాడు" అని భావిస్తుంది జానకి. లోకానికి సీతామాత సందేశం కూడా అదే! మరి సీతారాములను ప్రార్థించి మీరు శీఘ్రంగా సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో – వర్ధిల్లండి!



శ్రీ ఆంజనేయస్వామివారి చరిత్ర సుందరకాండతో సహా

6. రాక్షసుల స్వైర విహారము – దేవతల కలవరపాటు

ఆర్యావర్తంలో అనేక మునిఆశ్రమాలు వున్నాయి. జనపదాలు వున్నాయి. నగరాలు రాజధానులు సరేసరి. ఎక్కడ చూచినా ప్రశాంత వాతావరణం కరువై పోయింది. శ్రీమన్నారాయణుని భక్తులకు రాక్షసుల వల్ల అనేక బాధలు వస్తున్నాయి. వారు చేసుకునే యజ్ఞయాగాది హోమగుండాల్లో నింగిపై నుండి సంచరిస్తూ మానవరక్తం కుమ్మరిస్తున్నారు. జంతువులను తిని ఎముకలు వేస్తున్నారు. మునులను, సత్త్వగుణసంపన్నులను రక్షించే నాధుడు కరువయ్యాడు. మధ్యలో ఆగిపోతున్న క్రతువుల వల్ల హవిస్సులు అందక దేవతలు ప్రీతి చెందటం లేదు. అనేక రాజ్యాలలో కరువు కాటకాలు సంభవిస్తున్నాయి. మానవ జాతిని రక్షించే నవ నాయకుడు కావాలి. రాక్షససంహారానికి అంకురార్పణ జరగాలి. ఋషులంతా తమ తపశ్శక్తితో స్వర్గలోకం వెళ్ళి ఈ విషయాలన్ని దేవతలసభలో కొలువుతీరిన దేవేంద్రునికి మొఱపెట్టుకున్నారు. రావణ కుంభకర్ణఖరదూషణాదులైన రాక్షసులను నేనుమాత్రం యేమి చెయ్యగలను. మీతో పాటు వారి వలన బాధలు మేమూ పడుతున్నాము' అని దేవతలన్నారు.

''అయితే మనమంతా కలిసి సృష్టికర్త బ్రహ్మదేవుల వారినే శరణువేడుకుందాము. మాకు సహకరించండి" అన్నారు ఋషీశ్వరులు.

"మీ వాక్కును ఆజ్ఞగా శిరసావహించటమేగాని ఎన్నడైనా ఎదురు చెప్పామా. మనమంతా కలిసే వెడదాము పదండి" అన్నారు దేవతలు. అందరూ కలిసి బ్రహ్మలోకం చేరుకున్నారు. చతురాననుడు శారదాంబతో ఉల్లాసంగా వేదాంతచర్చ చేస్తున్నారు. వీరి ఆగమనాన్ని గమనించి –

"రండి దేవేంద్రా! రండి మునీశ్వరులారా! అంతా సుఖాసీనులు కండి" అని ఆయనే ముందు ఆహ్వానించారు.

అంతా చేతులు పైకెత్తి ప్రణామం చేస్తూ "విధాతా! భూలోకంలో రాక్షసులు స్వైరవిహారం చేస్తున్నారు. యజ్ఞాలు పాడుచేస్తున్నారు. దేవతలకు హవిస్సులు అందక, సకాలంలో వర్షాలు లేక, కరువు సంభవిస్తోంది. మునులకు, హరిభక్తులకు అండగానిలిచి కాపాడే రాజులే కరువై పోయారు. ఉన్న కొద్దిమంది సాహసవంతులు రాక్షసుల ముందు నిలువలేక వీరస్వర్గం అలంకరిస్తున్నారు. రక్కసి మూకలను ఎదిరించటం ఎవరికీ సాధ్యపడటంలేదు. వారంతా మీ నుండి, త్రినేత్రుని నుండి

వరములు పొంది యుక్తాయుక్త విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. మహానుభావా! వారిని కడతేర్చి భూభారాన్ని తగ్గించి, ధర్మ ప్రతిష్ఠాపన చేయవలసిన అవసరం కనిపిస్తోంది. తరుణోపాయం చూపండి దేవా!" అని వేడుకున్నారు. పరమేష్ఠి వారి ప్రార్ధనలు ఆలకించారు. వారి మాటల అంతర్యం కూడా గ్రహించారు. నాలుగు శిరస్సులతో ఆలోచించి సృష్టికార్యం నెఱవేరుస్తున్న మహామేధావి ఆయన. మునులు, దేవతలు పడే యిక్కట్లు, వాటికి పూర్వాపరాలు గ్రహించగలరు.

"ఋషీశ్వరులారా! దేవేంద్రా! సకల దేవతలారా! సకలజీవరాశుల సృష్టికర్తను నేను అయినందున అందరిని సమానంగా చూడవలసిన బాధ్యత, జీవులు చేసిన కర్మఫలం అందించవలసిన కర్తవ్యం, వారు చేస్తున్న మంచి పనులకు, తపస్సులకు వరములు యివ్వవలసిన అగత్యం మాపైనే వుంటుంది. సృష్టి, స్థితి, లయకర్తలమైన మా త్రిమూర్తులు ముఫ్ఫురం ఒకరి వలన నెఱవేరని కార్యం మరొకరుచేసి ధర్మ పరిరక్షణ యెప్పుడూ చేస్తూనే వుంటాము. దేనికైనా కాలం కలిసిరావాలి. రాక్షసులు ఘోరతపస్సులు చేసి వరములు పొంది, అవి లోకకళ్యాణానికి వినియోగించకుండా, వినాశకారకులై దుశ్చర్యలకు పాల్పడినపుడు మేము తప్పక వారిని అరికట్టగలము. మీరు చెప్పిన అసురులకు నా వలన మరణం లేదు. శంకరుని ఆశ్రయిద్దాము పదండి. నేను కూడా మీతోపాటు కైలాసం వస్తాను అన్నాడు చతుర్ముఖుడు. అంతాకలసి కైలాసం చేరుకున్నారు.

"పరమ శివశంకరులకు, మాత పార్వతీదేవికి దేవ ఋషుల నమస్సుమాంజలులు" అంటూ వారంతా నమస్కరించారు. బ్రహ్మదేవులు పరివారంతో రావటం అది దంపతులకు ఆనందాన్నిచ్చింది. వారిరువురూ స్వాగతం పలికారు. అందరు సుఖాసీనులై కుశల ప్రశ్నలు ముగిశాయి.

"ఓ బ్రహ్మాది దేవతలారా! మీ ఆగమనానికి కారణం యేమిటి? నేను; నా ప్రమథగణాలు మీకేమయినా చెయ్యగలము. శలవియ్యండి" అని శంకరులు గంభీరంగా పలికారు.

"మహాదేవా! తమకు తెలియనది యేమున్నది. రాక్షసుల వలన బాధలు మెండయినాయి. వీరంతా నన్ను అసుర సంహారం చెయ్యమంటున్నారు. ఆ పని మీ వలన జరిగితే బాగుంటుందని వీరందరిని యిక్కడకు తీసుకొని వచ్చాను" అన్నాడు బ్రహ్మదేవుడు.

"అసురుల దుష్కృత్యాలు అధికమైనమాట అసత్యం కాదు కాని వారికి నాయకత్వం వహిస్తున్న దశకంఠుడు నాకు పరమ భక్తుడు. పదిసార్లు తన శిరస్సులను ఖండించుకొని ఘోరతపస్సు చేసి యక్షరాక్షస గంధర్వ కిన్నెర కింపురుషాది దేవగణాల

వలన మరణం లేకుండా మిమ్ములను ప్రసన్నులను చేసి వరములు పొందాడు. అందువలన మన యిద్దరి వలన సాధ్యం కాని పనికి శ్రీమహావిష్ణువును ఆశ్రయిద్దాము. అంతా వైకుంఠం వెడదాము పదండి" అని బయలు దేరుతుండగా నారదుల వారు వచ్చారు. పరిస్థితి తెలుసుకొని -



7. బదరికాశ్రమములో లక్ష్మీ నారాయణులు

"శ్రీమన్నారాయణులు, ఆదిలక్ష్మి యిప్పుడు వైకుంఠంలో లేరు"

"మరి ఎక్కడున్నారు నారదా!" అన్నాడు శివుడు.

"హిమవత్పర్వత ప్రాంతాలలోని బదరికాశ్రమములో విడిది చేసి యున్నారు! నేను మీతో వస్తాను".

"త్రిలోక సంచారివి నిన్ను ఎవరాపగలరు. వెడదాము పదండి" అన్నారు బ్రహ్మ. అంతాకలిసి బయలుదేరారు.

హిమాలయశిఖరాలు ఉదయ సూర్య కిరణాలకు బంగరు కొండల్లా పచ్చగా ప్రకాశిస్తున్నాయి. నింగిని సంచరించే మేఘమాలలు కాసేపు పర్వతశిఖరాలపై ఆగి విశ్రమించి; హిమవంతుని పలకరించి ముందుకు సాగుతున్నాయి. హరిత వర్ణంతో విశాలంగా వ్యాపించిన కొమ్మలు రెమ్మలతో తరువులు సకల మృగపక్షిగణాలకు ఆలవాలమై ప్రకృతిని శోభాయమానం చేస్తున్నాయి. మానససరోవరంలో హంసలు తామరతూండ్లు తిని సరస్వతీ దేవికి తామే వాహనమైనందుకు; ఆమె భర్త సృష్టికర్త బ్రహ్మదేవుడు సపరివారంగా వస్తున్నందుకు ఆహ్లాదంగా ఎదురొచ్చి స్వాగతం పలుకుతున్నాయి. మత్తేభాల గుంపులు కదులుతున్న బండరాళ్ళవలె భ్రమింపజేస్తూ చెట్ల గుబురుల్లోంచి రాసుకుంటూ లేతగడ్డి పొదల్ని తొండాలతో పెల్లగించి తింటూ ముందుకు సాగుతున్నాయి. ముని ఆశ్రమాలలోని నిత్యాగ్నిహోత్రాలలో స్వాహాకారాలు

పలుకుతూ మునులు వేస్తున్న అవునెయ్యి పొగలు చిమ్మి, పొగమంచుతో కలసి అదృశ్యరూపులై వస్తున్న దేవఋషిగణాలకు పవిత్రసువాసనలతో అనందింపజేస్తున్నాయి. ఒక విశాలమైన మైదాన భూమి. చుట్టూ వరుసలుగా పెంచిన తులసి, మందారం, మల్లె, సంపెంగ పొదలు, మధ్యలో ఒక పెద్ద రెల్లుగడ్డి కుటీరం, దానికిరువైపులా ముగ్గులు దిద్దిన అరుగులు; ఆవరణ చుట్టూ కొబ్బరి, పనస, మామిడి చెట్లు, ఈశాన్యమూల చిన్నసరోవరం, అందులో వికసించిన తెల్ల ఎఱ్ఱ కమలాలు, ఆకు పచ్చని పత్రాలు, కొమ్మలమీద రామచిలుకలు, కింధికి పైకి దుముకుతూ నెమళ్ళు, గడ్డి పొదల్లో దూరి ఒక దాని వెంట ఒకటి పరుగులిడే కుందేళ్ళు, క్రూరమృగాల బాధలు లేకుండా నిర్భయంగా పచ్చికమేస్తున్న జింకలు, నైరుతిమూల గోవులశాల, తెల్లని, ఎఱ్ఱని, గోవులు, వాటి దూడలు, మేటలుగా వేసిన పచ్చిక, బదరికాశ్రమ ప్రాంతం మానవులనే కాదు దేవతలనే ఆకర్షించింది. ప్రశాంత వాతావరణంలో ఈ ఆశ్రమం వైకుంఠ నగరానికే పోటీగావుంది. శ్రీమన్నారాయణ తపోవనంలో సింహశార్దూలాలకు కూడా సత్వగుణం అబ్బినట్లు ఎక్కడా వాటి గర్జనలు లేవు.

శ్రీహరి యొక్క అలంకారప్రియత్వానికి, భోగలాలసత్వానికి, వైభవానికి ధనకనకవస్తువాహనాలకు, వైకుంఠం నిలయంగాభాసిల్లుతోంది. అది లక్ష్మి నివాసం గనుక. ఆదినారాయణుని వేదాంత స్వరూపానికి, నిరాడంబరతకు ప్రతీకగా వుంది, ఈ బదరికాశ్రమము. పరిసరాలలో యింకా అనేక ఆశ్రమాలు వున్నాయి. నరనారాయణులిద్దరూ యిక్కడే తపస్సు చేస్తుంటారు. వారి దర్శనం కోసం, ఋషులు, వేదాంతులు, దేవతలు, వచ్చి స్వామిని దర్శించుకుని వెళ్ళటం అనాదిగా వస్తున్నదే. అయితే ఈ సారి లక్ష్మీఅమ్మవారు కూడా స్వామితో ఆశ్రమ సందర్శనానికి రావటం విశేషమే మరి. యిలాంటి తరుణంలో భూలోకవాసులు వార్ని దర్శించుకోవటం సులభం కదా! అయితే అందుకు అర్హులు కొందరే వుంటారు. రవితేజఃపుంజాలు ఆకుపచ్చని వనాలను శోభాయమానం చేస్తున్నాయి. సగం గడ్డకట్టుకు పోయిన సెలయేళ్ళలోను, నదీముఖద్వారాలలోను, తాపసులు స్నాన సంధ్యావందనాలు పూర్తి చేసుకొని సూర్యభగవానునికి అర్ఘ్యం యిస్తున్నారు. ప్రకృతి రమణీయతకు ఆలవాలమై, విరాగుల ఆశ్రమ జీవితానికి ఆలంబనమై, శ్రీహరి చిద్విలాసాలకు, శివపార్వతుల విహారానికి విభిన్న గిరిశిఖరాలు లోయలతో విరాజిల్లుతూ దివికి భువికి మధ్య ఆధ్యాత్మిక విడిదిగా వుంది హిమాలయ ప్రాంతం. యిందరికి యిన్ని విధాలుగా ఆశ్రయమివ్వటం, హిమవంతునికే చెల్లింది. దేవతలు ఋషులు ఆశ్రమానికి చేరుకోగానే గవాక్షం నుండి శ్రీమన్నారాయణుడు చూసాడు. ప్రక్కనే వున్న మహాలక్ష్మితో నవ్వుతూ –

"మన కుమారుడు బ్రహ్మ విచ్చేసాడు. మహేశ్వరుడు, దేవ ఋషులు కూడా వస్తున్నారు. నేను వెళ్ళి విషయం తెలుసుకొని వస్తాను. నీవు వారికి ఆతిధ్యమిచ్చే యేర్పాట్లు చూడు" అన్నాడు.

"కుమారుడు మన వాడైనా కన్నది మీరే కదా! ఆ యేర్పాట్ల యిక్కట్లు మీరే పడండి" అంది నవ్వుతూ లక్ష్మీదేవి.

"ఆ..ఆ...యిక్కట్లు పడటం నాకేమైనా కొత్తనుకొంటున్నావా. అర్ధాంగి ఆదిలక్ష్మి సుకుమారురాలివి కదా! నవమాసాలు బిడ్డని మొయ్యలేవని, పురిటి నొప్పులకు తాళలేవని; నా నాభికమలం నుండి నేను కన్నాను బ్రహ్మను".

"ఆహా! అయ్యగారికి సపర్యలు చేసి పురుడు పోసిన వైద్యురాలిని నేనే కదా! మీరెంత కలవరపడ్డారో నాకు చెప్పకండి. సంకల్పమాత్రం చేత సృష్టికర్తనే సృష్టించిన మీరు యిక్కట్లు పడ్డారంటే నేనెలా నమ్ముతాను. అమ్మపుట్టిల్లు గురించి మేనమామ దగ్గరా వర్ణించటం" అన్నది లక్ష్మీమాత స్వామిని ఎద్దేవా చేస్తూ. ఆయన ముసిముసి నవ్వులు నవ్వుతూ ద్వారం వరకు వచ్చారు. ఇంతలో బ్రహ్మాదేవుడు లోనికి రానేవచ్చాడు.

"జననీజనకులకు ప్రణామములు అంటూ పాదాభివందనం చేసాడు".

"కోడలు కుశలమేనా?" ప్రశ్నించింది. రమాదేవి.

"కుశలమే తల్లి! క్షేమకరంగా లేనిదల్లా భూలోకవాసులు, దేవగణాలే".

"ఏమి జరిగింది?" అన్నాడు విష్ణువు. "త్రికాలజ్ఞులు మీకు చెప్పాలా తండ్రి. రాక్షసబాధలు పడలేని మునులు, దేవతలు నన్ను శరణుకోరితే, అంతాకలసి శంకరుల వారిని తీసుకొని యిక్కడికి వచ్చాము. బైట అరుగు మీద ఆసీనులయ్యారు అందరూ".

"అయితే పద" అన్నారు నారాయణుడు. అందరూ ఆయనకు అభివందనం చేసారు. కుశల ప్రశ్నలయ్యాయి.

"ఏమిటి చెప్పండి. పార్వతీపతి" అన్నాడు శివుణ్ని ఉద్దేశించి శ్రీహరి.

"రావణకుంభకర్ణాది దానవుల వల్ల మీ భక్తులకు, దేవతలకు, ఋషులకు, నవగ్రహాలకు, దిక్పాలకులకు, రవిచంద్రులకు సైతం కష్టాలు ఎదురౌతున్నాయి. తగిన ఉపాయం చెప్పి అందరిని రక్షించవలసిన బాధ్యత మన త్రిమూర్తులపైనే వుంది".

"సరే! అసురులను తప్పక అంతమొందించాలి. కాని యింకా కొంత సమయం పడుతుంది. దశకంఠుని వరాల సంగతి మీకు తెలిసినదే కదా! నరవానరులు తప్ప అన్యులెవరు అతనిని వధించలేరు. నేను నరావతారం దాల్చడానికి యింకా సమయమాసన్నం కావాలి. ఈ లోగా భూమి మీద అసురశక్తికి దీటుగా నిలబడి ఎదిరించగల పరివారాన్ని ఏర్పాటు చేసుకుందాము. ఒక్కొక్క ప్రయత్నమే ఆరంభిస్తేనే గాని వాని చరమదశకు రంగం సిద్ధం కాదుకదా! ఆ ప్రయత్నం యిప్పుడే ప్రారంభిద్దాము"

అని అరుగు క్రిందికి దిగి నాలుగుడుగులు వేసి విశాలమైన ఆవరణలో అశ్వత్థవృక్షం క్రింద నిలబడి నేత్రాలు మూసుకుని క్షణకాలం అలాగే వున్నారు. అంతా వెళ్ళి ఆయన చుట్టూ చేరారు. శ్రీహరి తన కుడిచేతిని హృదయం వద్ద వుంచుకొని మరల తీసి దోసిలి పట్టి, తన రాజీవనేత్రాలు తెరిచారు. ఆశ్చర్యం ధగధగ మెరుస్తున్న దబ్బపండంత గోళం ఆయన చేతుల్లో ప్రత్యక్షమైంది. అది శంకరునకిచ్చారు. ఆయన తన దోసిట్లోనికి దానిని గ్రహించి, శ్రీహరిలాగే హృదయం వద్ద వుంచుకొని తన తేజస్సు జోడించి, బ్రహ్మదేవునికిచ్చారు. చతుర్ముఖుడు కూడా వారిలాగే తన తేజస్సును గోళానికి జతచేసి దానిని ఒక పండుగామార్చి వేసారు. ఇంద్రాది దేవతలు, ఋషులు బ్రహ్మచేతిలోవున్న ఫలానికి తమ శక్తులు పంపించారు. వేదమంత్రోచ్ఛారణలమధ్య శంకరభగవానులు ఆ ఫలాన్ని మ్రింగి వేసారు.

"శివునిలో నిక్షిప్తం చెయ్యబడిన ఈ సర్వ దేవతాశక్తి వలన గొప్ప బల పరాక్రమాలు, యిచ్ఛారూపధారణశక్తి గలవాడు, విష్ణుప్రీతికలిగిన శివాంశసంభూతుడు, అసురుల్ని దోమలవలె నలిపి వేయగల బలిష్టుడు అయిన ఒక వానర మహావీరుడు జన్మిస్తాడు. యిక నిశ్చింతగా వుండండి" అని శ్రీహరి పలికారు. వచ్చిన వారంతా లక్ష్మీనారాయణుల ఆతిధ్యం స్వీకరించి, సంతృప్త స్వాంతనులై యధాస్థానాలకు వెడలిపోయారు.





8. శేషాచలము పై శివపార్వతుల ప్రణయము

పార్వతీపరమేశ్వరులు ఆకాశసంచారం చేస్తున్నారు. కష్టాలలో తమను ప్రార్థించుకుంటున్న భక్తుల్ని గమనించి వారి కష్టాలు తొలగించి, వరములిచ్చి కాపాడుతూ ధర్మప్రతిష్ఠాపన చేస్తున్నారు. కొండలు, గుట్టలు, పర్వతాలు, లోయలు నదీనదాలు పరిశీలిస్తూ జంతుసంతతిని కూడా ఆదుకుంటూ విహారం చేస్తున్నారు.

అత్యంత సుందరమైన వనములతో కూడినది, ఏడు గిరిశిఖరములుగలది; మృగపక్షిగణాలతో అలరారుతూ ఫలపుష్పశోభితమైనది; వివిధ ఔషధాలకు నెలవైనది అయిన శేషాచలం కనిపించింది. పార్వతీదేవి గిరిశిఖరాలను, వాటిపై సేదతీరుతున్న మేఘమాలికలను చూస్తూ –

"నాథా! ఈ పర్వతప్రాంతం వీక్షించండి. ఎంత సుందరంగా ఉన్నదో" అంది.

"దేవీ! భవిష్యత్తులో కలియుగంలో శ్రీమహావిష్ణువు భక్తులకు సులభలభ్యుడై ఈ కొండలపైనే శ్రీనివాసునిగా అవతరిస్తాడు. మానవులు; అహంకారానికి మూలమైన తమ వెంట్రుకలను తీసివేసి, ఊర్ధ్వపుండ్రములు ధరించి, శాంతచిత్తులై, భక్తిప్రపత్తులతో గోవింద నామ స్మరణ చేసుకుంటూ ఏడుకొండలు ఎక్కి స్వామిని దర్శించుకుని తమ పాపాలను పోగొట్టుకుని తరిస్తారు. ఈ ప్రదేశమంతా కలియుగ వైకుంఠంగా విరాజిల్లుతూ నిత్యకళ్యాణం పచ్చతోరణంగా భక్తుల కోర్కెలు తీర్చే వేంకటేశ్వరుని ఆనందనిలయంగా ఖ్యాతిగాంచుతుంది"

"అయితే శ్రీమన్నారాయణుడు త్వరలో శ్రీ వేంకటనాథుడౌతారన్నమాట"

"దాని కంటె ముందు నరావతారం యెత్తి దశకంఠుని దునుమాడవలసి వుంది. మేమంతా ఈ మధ్యనే బదరికాశ్రమం వెళ్ళినప్పుడు నారాయణులు ఆ ప్రస్తావనే తెచ్చారు".

"రావణుడు మీ అంతరంగ భక్తుడు కదా! అతని సంహారాన్ని మీరెలా అంగీకరించారు, మరి?" చక్రాల వంటి తన సుందరమైన కళ్ళలో ఆశ్చర్యం ప్రకటిస్తూ ప్రశ్నించింది ఉమాదేవి.

"మమ్మల్ని ప్రార్థనలు చేసి వరములు పొందే వరకు వారు సామరస్యంగా ఉంటారు. తర్వాత శివభక్తులు విష్ణుద్వేషులై ప్రజాకంటకులుగా, దేవతలకు శత్రువులుగా వ్యవహరిస్తారు. యిదే అసుర ప్రవృత్తి. దీనిని బట్టి రాక్షసకులానికి చెడ్డ పేరు వస్తోంది. మా చేత వరములు పొంది ఎవరైతే లోక కళ్యాణానికి వినియోగిస్తారో వారే మా భక్తులు. వారే కాలక్రమంలో స్వర్గాధిపత్యం వహించి దేవతలౌతారు. దేవతలైనా, గంధర్వులైనా, రాక్షసులైనా, మానవులైనా, జంతువులైనా వారి కర్మఫలాన్ని బట్టే వారి జన్మలుంటాయి. వీరందరూ మా దృష్టిలో సమానులే, అయినా ఆదిశక్తివి నీకు బోధించవలసిన అవసరం లేదనుకుంటాను" అన్నారు. ఆమె శంకరుని మూడవ నేత్రం వంక చూస్తూ, ఆయన నీలకంఠాన్ని, నాగాభరణాలను చూస్తూ మౌనంగా వుండిపోయింది.

"అయినా దేవీ! దశకంఠుడు మహా గర్విష్ఠి! మన నివాసస్థానమైన కైలాసగిరినే తన భుజస్కంధాలపైకి ఎత్తుకునే ప్రయత్నం చేసాడు. నందీశ్వరునిది వానర ముఖం

అని ఎగతాళిచేసి అతని శాపానికి గురయ్యాడు. కోడలి వరుసైన రంభను బలాత్కరించినందులకు నలకూబరునిచే శపించబడ్డాడు. హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్న వేదవతిని కామించి, ఆమె ఆగ్రహానికి కారకుడయ్యాడు. తన అనుచరులచే హరిభక్తుల్ని బాధలకు గురిచేస్తున్నాడు. అంతేకాదు నా ఏకాదశరుద్రరూపాలలో ఒక రూపాన్ని పూజించడం విస్మరించి హేళన చేసాడు". అని ఆమె సౌందర్యం వంక ఆనందంతో చూస్తూ అడుగులు ముందుకు వేస్తున్నాడు శివపరమాత్మ.

"దశకంఠుని వలన యిన్ని అనర్థాలు వచ్చి పడ్డాయన్నమాట. పూర్వం మీ వలన భస్మాసురుడు వరాలు పొంది మిమ్మల్నే యిబ్బంది పెట్టిన సంగతి గుర్తుకువస్తోంది. యిక నారాయణులే శరణ్యం".

"ఔను దేవి! త్రిపురాసురసంహారం కోసం మేరుపర్వతాన్ని ధనుస్సుగా చేసి నేను భీకర పోరాటం చేస్తుంటే విష్ణుదేవుడే అదృశ్యరూపుడై విల్లమ్ములలో నిలబడి నాకు విజయం చేకూర్చిపెట్టారు. ఈసారి ఆయన చెయ్యబోయే అసురసంహారానికి నేను సహకరించి కృతజ్ఞత తెలుపుకుంటాను".

"స్వామీ! అయితే నన్ను కైలాసంలో ఒంటరిగా వదిలేసి వెడతారా?"

"నువ్వు ఒంటరి దానవేమిటి దేవి! నీ ముద్దుల పుత్రుడు గణపతే నీకు రక్ష. కార్తికేయుడు, షణ్ముఖుడు, నంది, భృంగి, ప్రమథగణాలు, స్త్రీ జనం యింతమందికి మాతవు నువ్వు. అయినా నేను ఈ రూపంలో వెళ్ళనవసరం లేదు. రావణసంహారానికి కావలసినది నరవానరులే కదా! నా రుద్రాంశతో ఒక వానరమహావీరుని తయారు చేసి, శ్రీరామచంద్రుని పూర్ణావతారం పరిసమాప్తి, అయ్యేవరకు ఆయన వెంట వుండి సేవించుకునేలా చేస్తాను. ఒకవేళ నేనే స్వయంగా వెళ్ళినా నువ్వు స్నానం చేసే నలుగుపిండితో బొమ్మను చేసి, దానికి ప్రాణం పోసి నేను తిరిగి వచ్చేసరికి నా మీదకే ఉసిగొలుపుతావు"- అని ఆయన అనగానే ఫక్కున నవ్వింది జగన్మాత పార్వతి. ఆమె పగడపు పెదిమల మధ్య ముత్యాల్లా మెరిసిన పలువరుస చూసి ఋగ్గ గిల్లాడు ఉమాపతి.

"పోండి! మీ సరసాలకు కైలాసగిరి చాలలేదా!"

"ఎక్కడి ముచ్చట్లు అక్కడే ఆనందం. పద ఈ కొండల క్రిందికి దిగి పాతాళగంగను చూసి వద్దాము"

"భూలోకానికి వచ్చినా సవతిపోరు తప్పలేదన్నమాట" అన్నది పార్వతీ దేవి మూతి ముడుచుకొని, ప్రక్కనే ఉన్న ముద్దమందార పువ్వుకోసి ఆమె శిగలో అలంకరించాడు శివుడు. బండరాళ్ళను దాటుకుంటూ క్రిందికి దిగుతున్నారు యిద్దరూ.

అవసరమైనచోట సతీదేవి చెయ్యి పట్టుకుని దింపుతున్నాడు ఉమానాధుడు. అల్లంత దూరంలో జలపాతం సన్నగా సెలయేరులా క్రిందికి దిగుతూ పారుతోంది.

"అదిగో చూడు నిశ్శబ్దంతో ప్రవహిస్తున్నది గంగ, హోరు పెడుతున్నది నువ్వు" నవ్వుతూ అన్నాడాయన.

"నా చమత్కారం నాకే త్రిప్పి కొట్టారన్నమాట శబ్దార్ధసంపన్నులు; కళాకోవిదులు కదా మరి!"

"రమణులు రణవిదుషీమణులై మహిషాసురాదుల్ని మర్దన చేస్తుంటే భర్తలు సుకుమారులై కళాస్వాదన చేయక తప్పుతుందామరి?"

"ఢమరుక శబ్దంచేత భాషాసూత్రాలు పలికించిన పండిత ప్రకండులతో వాదించి గెలవగలనా?"

"హిమవంతుని పుత్రికవు. నీకు అసాధ్యమేముంది"

"గంగను శిఖముడిలో చుట్టిన శివశంకరులు మీకు మాత్రం యేమసాధ్యం" యిద్దరూ స్వరం కలిపి పకపకా నవ్వుకున్నారు.

వీరిని చూచి చెట్ల కొమ్మలపై కోతులు కిచకిచలాడుతున్నాయి. ఒక మగమర్కటం, ఆడమర్కటంతో సరసశృంగారచేష్టలు చేస్తోంది. వాటి వంక పార్వతీ దేవి కన్నార్పకుండా గమనిస్తోంది. శంకరులు ఆమె వంక చూచారు. ఆమె సిగ్గుపడి తలదించుకుంది. ఆయన ఆమెను తన కౌగిట చేర్చుకున్నారు. ఆమె ఆయన వదనంకేసి క్రీగంట చూచింది. ఆ భావం ఆయనకు అర్ధం కాలేదు. అది గమనించిన ఆమె చేయి చాపి చూపుడు వ్రేలితో కోతుల శృంగారచేష్టలు చూపింది. అవి రెండు క్రీడిస్తున్నాయి. శంకరునికి అర్ధమై ఆమెను గాఢంగా హత్తుకుని నడుముపై చెయ్యివేసి నడిపించుకుంటూ పచ్చిక ఒత్తుగా ఉన్న వటవృక్షపు ఛాయలోనికి తీసుకువెళ్ళాడు. ఆమె మళ్ళీ ఆయన వంక అర్ధనిమీలిత నేత్రాలతో చూస్తోంది. ఆయన ఆమె శిగలోని మల్లెల సువాసనలు ఆఘ్రాణిస్తున్నాడు.

"స్వామీ!"

"ఏమిటి దేవీ!" నీ కోరిక యేమిటో విపులంగా చెప్పు".

"అబ్బ! నా అంతరంగంలో యేముందో గ్రహించలేరా!"

"నేను గ్రహించడం కంటె, నువ్వే చెప్తే విందామని"

"ఇందాక మీరు మీ దృష్టిలో దేవగంధర్వకిన్నెరకింపురుషులు, మానవులు చివరికి జంతువులు కూడా సమానమే నన్నారుగదా!"

"అవును"

"అయితే మనం ఆ రూపాలు ధరించి........" అని ఫక్కున నవ్వింది. ఆయనా నవ్వుతూ ఆమెను ఆలింగనం చేసుకున్నాడు.

"జాణవే! సరసానికి యేరూపమైతేనేం ...... నీ మాట ఎందుకు చెల్లించరాదు" అని వెంటనే ఆయన మర్కటరూపం ధరించారు. ఆమె కూడా మర్కటమే అయి యిద్దరూ చెట్లెక్కి శృంగార క్రీడలు ప్రారంభించారు. శివపరమాత్మ, ఉమాదేవి యే పనిచేసినా అది లోక కళ్యాణం కోసమే. అందుకే వారు జగత్తుకే మాతాపితరులు. సర్వదేవతల తేజోఫలాన్ని మ్రింగివేసిన శివుడు దానిని ఆమె గర్భంలో నిక్షిప్తం చేసాడు.

వారిద్దరూ చాలా సంవత్సరాలు కపిరూపాలలో వుండి వెంకటాచలంపై ప్రకృతినంతా ఆస్వాదిస్తున్నారు. కృత్రిమ కపిదంపతుల ఆగమనంతో వానరలోకంలో క్రొత్త ఆనందం వెల్లివిరిసింది. వానర భల్లూక గోలాంగూలాలన్ని గుంపులుగా చేరి వారికి పూలు పళ్ళు తెచ్చి యిస్తున్నాయి. వాటిని దంపతులు అలంకరించుకుంటున్నారు, ఆరగిస్తున్నారు. శివపార్వతులు కపిరూపాలలో ఉండి ఎక్కడెక్కడి వానర యోధుల్ని సమీకరిస్తుంటే శ్రీరాముని అవతార ఆరంభానికి సమయం ఆసన్నమైందని దేవతలు సంతసిస్తున్నారు. పార్వతీమాత వెయ్యి సంవత్సరాలు ఆ శక్తిని తన గర్భంలో భరించి యింక తన వల్ల కాదనుకుని శివునికి తెలుపకుండానే, అడవిలో బడబాగ్ని రగులుతుంటే అందులో వదిలివేసింది. ఆ నాటి నుండి అగ్నిదేవుడే శివతేజాన్ని భరిస్తూ తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.



౯. అహల్యాగౌతముల వివాహము

బ్రహ్మలోకంలో చతుర్ముఖుడు సరస్వతీదేవి వీణానాదం వింటూ సంగీత రసాస్వాదనలో మహానందంగా తన కుడిచేత్తో తొడపై తాళం వేస్తూ, అర్ధనిమీలిత నేత్రుడై, పులకితగాత్రుడై లయబద్ధంగా తన నవరత్నఖచితమకుట సహిత శిరస్సులను సైతం మైమరపుగా ఆడిస్తూ పారవశ్యంలో వున్నారు. ఎప్పుడూ నిరాటంకంగా సృష్టికార్యంలో తలమున్కలై ఉండటం తప్ప యింత చక్కగా సంగీతామృతపానం చేస్తున్న భర్తను చూసి ఎరుగదు శారదాంబ. ఆయన వింటున్న శుభతరుణానికి మురిసిపోతూ మరింత శ్రావ్యంగా వీణవాయిస్తున్నదామె. ఆ ఆనంద పారవశ్యంతో ఒక్కసారి తన దక్షిణహస్తాన్ని గాలిలో పైకి ఎత్తి లీలగా కదిలించారు బ్రహ్మదేవులు. ఒక అపురూప సౌందర్యరాశి దివ్యాలంకారభూషితయై ఆయన పాణితలం నుండి పుట్టి రెప్పపాటులో యౌవ్వనం సంతరించుకుని ఎదురుగా నిలబడి దంపతులకు పాదాభివందనం చేసింది. ఈ చిత్రం చూసి వాగ్దేవి వీణానాదం ఆపి -

"స్వామీ! ఎవరీ లోకోత్తర సౌందర్యవతి"

"ఈమె నా మానసపుత్రిక అహల్య. జననీజనకులుగా మనమీ సుందరాంగికి

తగిన వరుణ్ణి చూసి పరిణయం చెయ్యాలి"

వీరి మాటలు వింటూనే నారదమహర్షి ప్రవేశించారు. "నారాయణ! నారాయణ! మాతాపితరులకు ప్రణామములు తండ్రీ! ఎవరీ త్రిలోకసుందరి".

"నారదా! ఈమె నీకు సహోదరి. తక్షణం తగిన వరుణ్ణి చూసి వివాహం చేసే బాధ్యత నీకు అప్పగిస్తున్నాను."

"స్వయంవర నియమాలేమిటి జనకా?"

"ముల్లోకాలను ముందుగా ప్రదక్షిణ చేసి వచ్చిన శీఘ్రగమనశాలియైనవాడే ఈ కన్యకు తగిన వరుడు. సర్వులకు ఈ విషయం ప్రకటించి, కార్యోన్ముఖుడివిగా తిరిగిరావాలి"

"ఆజ్ఞ! మరి శలవు. తగిన వరునితోనే పునర్దర్శనం చేసుకుంటాను. నారాయణ" అంటూ ఆయన అదృశ్యమైనారు. ఇంద్రసభ చేరుకుని ఈ స్వయంవర విషయం యమవరుణ మహేంద్రాదులందరికి తెలియచేసి భూలోకం చేరుకున్నారు. ఆయన మస్తిష్కంలో గౌతమమహర్షి మెదిలారు. వెంటనే గౌతముని ఆశ్రమ ప్రాంగణం చేరుకున్నారు. గౌతముడు ఉదయ సంధ్యావందనం చేస్తూ సూర్యునికి తర్పణాలు అర్పిస్తున్నాడు. ఆ పని పూర్తి చేసుకుని ఎదురుగా వస్తున్న నారదమునికి స్వాగతం పలుకుతూ పాదాభివందనం చేసాడు.

"శుభమస్తు, కళ్యాణమస్తు, వంశాభివృద్ధిరస్తు" అని దీవించారు నారదులవారు. విస్తుపోయాడు గౌతముడు.

"మహాత్మా! ఈ ఘోరారణ్యంలో వేదాధ్యయనం, సంధ్యావందనాదులు, గోసేవ చేసుకుంటూ తాపసిలా జీవితం గడుపుతున్న నాకు కన్యనెవరిస్తారు. మీ ఆశీర్వాదపు అంతర్యం యేమిటి మునీంద్రా! శలవియ్యండి. ఆశీసులు కండి" అంటూ మర్యాద చేయబోయాడు గౌతముడు.

"కన్య సిద్ధంగా వుంది. నువ్వు త్వరగా గోప్రదక్షిణం ముమ్మారు చేసి నాతో బయలుదేరి రావాలి. బ్రహ్మలోకం చేరుకోవాలి మనం. మార్గమధ్యంలో సవిస్తరంగా మాట్లాడుకుందాము" అని ఆయన అనగానే గౌతముడు గోవుకు ప్రదక్షిణలు చేసి ఆయనతో బయలుదేరాడు.

రెప్పపాటుకాలంలో యిరువురూ బ్రహ్మసరస్వతుల ముందున్నారు.

"పరమేష్టీ! యిడిగో ఈ సుందరికి తగిన వరుడు ఈ గౌతముడే! ముల్లోకాలు చుట్టి ముందుగా యిక్కడకు చేరిన యుక్తిపరుడు, వేదవేదాంగాలు చదివి నిత్యానుష్ఠానం చేస్తున్న మహర్షి".

"అదెట్లా సాధ్యం నారదా? ఏ వాహనంలేని పాదచారి యింత వేగంగా ఎలా రాగలిగాడు" అన్నది శారదాంబ.

"అవును కుమారా! దేవగంధర్వయక్షగణాలవారే యింకా ప్రదక్షిణలు చేస్తుంటే ఈ బడుగుబాపడు ముల్లోకాలు ఎలా తిరిగి రాగలిగేడు. ఆశ్చర్యంగా వుందే!"

"మాతాపితరులారా, మీకు తెలియనిది కాదు. యితడు తన ఆశ్రమంలో వున్న కామధేనువు వంటి కడివెడు పాలిచ్చే గోమాతకు మూడుమార్లు ప్రదక్షిణం చేసి మూడులోకాలకు ప్రదక్షిణ చేసిన ఫలితాన్ని సాధించాడు. గోవు సకల దేవతలకు తన దేహంలో ఆశ్రయం యిచ్చిన సంగతి తమకు తెలిసినదే కదా!"

"లెస్స యోచన చేసావు నాయనా! ఈ సుందరిని సృష్టించాను గాని ఆమె తలరాత ఆమె చేసుకున్న పూర్వపుణ్యఫలమే కదా! అది మార్చటం ఎవరితరం. మరి యింకెందుకు ఆలస్యం, వివాహం జరిపించు" అని పరమేష్ఠి అంటుండగా ఇంద్రుడు ప్రవేశించి –

"ముందుగా త్రిలోకప్రదక్షిణలు ముగించి వచ్చింది నేను. కన్యను నాకిచ్చి కళ్యాణం జరిపించండి" అన్నాడు. వెంటనే యముడు, వరుణుడు, యితర దేవతలు వచ్చారు.

"ఇంద్రాది దేవతలారా! శాంతించి ఆశీనులు కండి. నారదుడు చెప్పిన ప్రకారం గోవుకు ప్రదక్షిణలు చేసిన; గౌతముడే ఈమెను పొందదానికి అర్హుడు. కళ్యాణం చూచి మునిదంపతులను ఆశీర్వదించండి" అని బ్రహ్మ చెప్పగానే అంతా కూర్చున్నారు. మహేంద్రుడు అక్కసునంతా దిగమ్రింగుకుని పళ్ళు పటపటలాడించాడు. నారదుల వారే వివాహపురోహితుడై నిర్విఘ్నంగా పెళ్ళితంతు పూర్తి చేసారు. నూతన దంపతులకు దేవతల ఆశీస్సులు లభించాయి. వారు తమ ఆశ్రమానికి వెళ్ళిపోయారు. దేవతలు యధాస్థానాలకు చేరుకున్నారు. అహల్య యొక్క సుందరరూపం మహేంద్రుని మనస్సులో ముద్రవేసుకుంది.

అహల్యాగౌతముల సంసారం మునిలోకానికే ఆదర్శవంతంగా సాగుతోంది. గౌతముడు సూర్యోదయానికి పూర్వం వేకువఝామునే నదీస్నానానికి వెడుతుంటాడు. ఆయన వెళ్ళగానే సతీశిరోమణి అహల్య ఆశ్రమ వాకిళ్ళు ఊడ్చి గోమయం కలిపిన కళ్లాపి జల్లి, యజ్ఞవాటిక వద్ద సమిధలు పేర్చి, గోవులకు మేతవేసి, శిష్యులను లేపి వారికి కావలసినవి సమకూరుస్తుంది. ఆమె స్నానం చేసి తులసికోట వద్ద పూజచేసి దీపం పెట్టే సమయానికి ముని తిరిగివస్తారు. అదీ వారి దినచర్య. నల్లేరు మీద బండిలాగ సజావుగా సాగిపోతోంది వారి సంసారం. ఆ దంపతుల అన్యోన్యతకు ఫలితంగా శతానందుడు అనే కుమారుడు, అంజన అనే కుమార్తె కలిగారు. అహల్య సౌందర్యాన్ని పొందుదామని భావించిన ఇంద్రునికి బ్రహ్మ ముందు నిరాశే ఎదురైంది.

పరమేష్ఠి చెప్పిన ధర్మసూక్ష్మాన్ని ఆయన తిరస్కరించలేకపోయాడు. గౌతమునితో తనను పోల్చుకుని అన్ని విధాలా తనే అధికుడైనా అహల్యను కైవసం చేసుకొనలేక పోయాననే బాధ ఆయనలో నివురుగప్పిన నిప్పులా వుంది.



10. కామాంధ సంక్రందనుడు



పట్టుదలగా ఏదైనా కార్యసాధనలో వున్నవానికి నిద్ర, సుఖం వుండవు. పరస్త్రీ పై వ్యామోహం పెంచుకున్న వారు ఎంత ఉన్నతస్థానంలో వున్నా సరే వారికి సిగ్గు, లజ్జ, వుండవు. కావటానికి దేవతలందరికి ప్రభువే ఆయన. అయినా అహల్యపై వ్యామోహంతో అదృశ్యరూపుడై ఆమె కోసం వచ్చి ఆ నిశీధిలో చెట్ల క్రింద నిలబడి ఉపాయం ఆలోచిస్తున్నాడు ఇంద్రదేవుడు. గౌతముని ఆశ్రమం దగ్గరగా వచ్చి కోడి రూపం ధరించి బిగ్గరగా 'కొక్కురోకో' అని కూయసాగాడు. మునిదంపతులు మేల్కొన్నారు.

"అహల్యా! యింకా రాత్రిలాగానే వుంది. ఈ కోడికూత యేమిటి?"

"నాథా! తమరు అడివంతా సమిధల కోసం తిరిగి డస్సిపోయారు. బాగా నిద్రపట్టి సమయం తెలియలేదు. అదిగో మళ్ళీ కోడి కూత. యివిగో దండకమండలాలు, దర్భలు. నదీస్నానానికి బయలు దేరండి."

"సరే వెళ్ళివస్తాను. ఆశ్రమ ప్రాంతాలలో కూడా ఈ మధ్య పులులు సంచరిస్తున్నట్లున్నాయి. వెంటనే తలుపు వేసుకో, పిల్లలు జాగ్రత్త"

"ఈ రోజు క్రొత్తగా అప్పగిస్తున్నారేమిటి? మీ పిల్లల్ని. శాపానుగ్రహ సమర్థులు, నిత్యవేదానుష్ఠానతపస్సంపన్నులు మీ ఆశ్రమచ్ఛాయలకు రాక్షసులే రాలేరే యింక శార్దూలమృగరాజాలు యేమి చేయగలవు?"

"అవుననుకో, కానీ సామాన్యంగా జరిగే దైనందిన జీవితానికి జాగ్రత్త పడాలే తప్ప, తపశ్శక్తిని వినియోగించరాదు. అది సరే! నేను వెళ్ళివస్తాను. శతానందుని లేపుతావా"

"నిన్నంతా మీతో తిరిగి అలసిపోయి నిద్రిస్తున్నాడు. ఈ రోజుకు విశ్రాంతి తీసుకోనివ్వండి"

"సరే ! నేను వెళ్ళిరానా మరి"

"ఏమండీ! అని ఆయన కళ్ళలోనికి సూటిగా చూస్తూ నిలబడింది తప్ప ప్రక్కకు తప్పుకోలేదు"

"ఏమిటి?........ సందేహించక విషయం చెప్పు"

"ఈ రోజేదో కీడు శంకిస్తోందండి. కుడి కన్ను అదురుతోంది"

"అమాయకురాలా! నిరంతర భగవన్నామ సేవలో నిమగ్నమైన నిస్వార్థకర్మిష్టిని నేను. జగత్కళ్యాణం కోసం పాటుపడే మునిపల్లెలు రక్షించుకునే భారం ఆ శ్రీహరే చూసుకొంటాడు. అయినా యిప్పుడే అన్నావుగా నేను శాపానుగ్రహ సమర్థుడనని. నిర్భయంగా వుండు."

అంటూ గౌతముడు చకచకా అడుగులు వేసుకుంటూ తమస్సులోకి వెడుతుంటే ఆమె చూస్తూ నిలబడిపోయింది. మరొకసారి కోడికూత దగ్గరగా వినపడి ఉలిక్కిపడింది. తలుపు జార్లావేసి పిల్లలవైపు నడిచి యిద్దరికి మధ్యగా పడుకోబోతున్న ఆమె జబ్బ పట్టుకున్నారు ఎవరో. గుండె ఝల్లుమంది. తలత్రిప్పి ఒక్కసారి చూసేసరికి గడ్డం నిమురుకుంటూ వెకిలినవ్వుతో చిలిపిగా చూస్తున్న గౌతముడు. విస్మయం నుండి తేరుకునేలోగా తనను ఎత్తి పర్యకం వైపు తీసుకువెళ్లాడాయన.

"నాథా!..."

"ఊ!......"

"స్నానానికి వెళ్ళలేదా?"

"నీ సౌందర్యం నన్ను వెనక్కులాగుకొచ్చింది"

"పిల్లలు మేల్కొనే సమయమైంది" అంటూ సన్నగా వెలుగుతున్న నూనె దీపం వైపు చూస్తోంది. మాయాగౌతముడు తన కుడి హస్తాన్ని ఎత్తి దీపం వైపు త్రిప్పాడు. రెపరెపలాడి అది ఆరిపోయింది. గాఢాంధకారంలో అహల్య పాతివ్రత్యం మంటగలిసిపోయింది. ఇంద్రుని గాఢాలింగనంలో తనను తాను మైమరచిపోయింది అహల్య. మరి సంక్రందనుని చిరకాల వాంఛ తీరటంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. గాలి కూడా చొరలేనంతగా వారు ఐక్యం చెందారు.

నిశ్శబ్ద నిశీధిలో గౌతముడు నది వరకు వెళ్ళాడు. ప్రక్క ఆశ్రమాలలోని మునులెవ్వరూ స్నానానికి వచ్చిన జాడలేదు. పక్షుల కలకలారావాలు లేవు. ఆకాశంలో ఎక్కడా సూర్యోదయపు జాడలు కానరావటంలేదు. సమీప తటాకాలలోని పద్మాలు యింకా వికసించటం లేదు. కీచురాళ్ళ కూతలు, పులుల గాండ్రింపులు వినిపిస్తున్నాయి. గుడ్లగూబలు అశుభంగా కూస్తూ రెక్కలు టపటపలాడిస్తూ ఆయన తలపై నుండి వలయంగా తిరిగాయి. మంచు బిందువులు ఎండుటాకులపై రాలుతున్న టపటపల శబ్దం. ఎడమ కన్ను వేగంగా అదురుతోంది. మోకాళ్ళవరకు నదిలో దిగిన మునికి స్నానం చెయ్యబుద్ధికాలేదు. ఒడ్డునవుంచిన దండకమండలాలు, ఉత్తరీయం, పొడిబట్టలు తీసుకుని వెనుదిరిగి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ, ఆశ్రమానికి వస్తున్నాడు. పాదానికి రాయి తగిలి తూలి పడబోయి నిగ్రహించుకొన్నాడు. చీకటిలో తడుముకుంటే

బొటనవ్రేలికి దెబ్బ తగిలి రక్తం కవోష్ణంగా చేతికంటుకుంది. నరాలు జివ్వునలాగి మంట బయలుదేరింది. "అమ్మా! జగన్మాతా!!" అనుకున్నాడు. విసురుగా వీచిన చలిగాలికి ఉత్తరీయం ఎగిరి చీకటిలో పడిపోయింది. దానిని అలాగే వదిలివేసి వడివడిగా నడిచి ఆశ్రమం చేరుకుని –

"అహల్యా! యింకా తెల్లవారలేదు" అంటూ తలుపు తోసుకుని లోపలికి వచ్చిన ఆయనకు చూడరాని దృశ్యం కంటపడింది. తన రూపంలోనే వున్న పరపురుషుని కౌగిలిలో తన సతి అహల్య. స్థాణువులా నిలబడిపోయి చీకటిలో కళ్ళు చిట్లించుకుని మరీ చూసాడు. వారిద్దరూ ఉలిక్కిపడిలేచారు. గవాక్షం నుండి ఎగురుతున్న మిణుగురుల వెలుగులో అహల్య వణుకుతూ కనిపించింది. అప్పటికే ఆమెకు అర్థమైంది తను మోసగింపబడ్డానని.

"నా రూపం ధరించి, నా భార్య శీలం హరించిన కామాంధుడా ఎవరు నువ్వు? నిజరూపం ధరించు" అంటూ గద్దించగానే ఇంద్రుడు గజగజవణుకుతూ నిజరూపం ధరించాడు.

"ఛీ పాతకుడా! సర్వదేవతలకు ప్రభువువైన నీకే యింత నీచపు బుద్ధి పుట్టిందా? సృష్టిలో ప్రకృతిశక్తులకు, పంచభూతాలకు అధిపతివై అందరికి ఆదర్శమూర్తిగా వుండవలసిన నువ్వే పరకాంతా వ్యామోహంలో పడి మునిపత్నినే మోసగించావు. నువ్వు చేసిన తప్పుకు ఆధారమైన నీ వృషణాలు తక్షణం భూపతనమగుగాక" అంటూ శపించి కమండలం నుండి జలం తీసి జల్లగా ఆయన వాక్కు వెంటనే ప్రభావం చూపింది. రెప్పపాటులో జారిపడిన తన అవయవాలను ఒక్కసారి శిరస్సు వంచి చూసుకుని ఎటు వెళ్ళటానికి తోచక అదృశ్యుడైపోయాడు మహేంద్రుడు.

చంద్రనిప్పులు కక్కుతున్న గౌతముని ముఖంలోనికి సూటిగా చూసి, జలజలా రాలుతున్న అశ్రువులు తన స్తనద్వయాన్ని తడిపివేస్తుండగా అహల్య భర్త పాదాలపై బడి దీనంగా రోదిస్తూ –

"ప్రాణనాథా! మీ రూపంలో వచ్చి నన్ను మోసగించాడు ఇంద్రదేవుడు. యిందులో నా తప్పులేదు. క్షమించండి. ఈ దీనురాల్ని కనికరించండి" అంది.

"నిప్పును తెలిసి తాకినా తెలియక తాకినా చుర్రుమంటుంది. ఆ కామాంధుని సంపర్కంతో శీలం చెడిన నిన్ను భార్యగా ఆమోదించి సంసారం కొనసాగించటం నా వల్ల కాదు. పాషాణసదృశంగా పడివుండు" అంటూ ఆమెనూ శపించాడు గౌతముడు. ఆయన అంతరంగం అగ్నిగోళంలా రగులుతోంది. అహల్య ఆయన పాదాలను గట్టిగా పట్టుకుని –

"కనికరించండి. పిల్లలు అనాథలైపోతారు. మీ దాసిగా పడివుండి ఆశ్రమ

సేవలు చేసుకుంటూ పిల్లల్ని పెంచుకునే భాగ్యం కల్పించండి" అని బిగ్గరగా రోదిస్తుంటే పదుకున్న శతానందుడు, అంజన ఉలిక్కిపడి లేచారు. తల్లిరోదన తండ్రి క్రోధం తప్ప వారికి యేమి అర్థం కావటం లేదు.

"నాయనా శతానందా! నా చిన్నారి తల్లీ అంజనా! ఒక్కసారి దగ్గరకు రండి. ఈ అమ్మ దూరమైపోతోంది. మీకు గోరుముద్దలు తినిపించే భాగ్యానికి యింక నేను నోచుకోలేదు. రా నాయనా! నా చిట్టితల్లీ రా!" అంటూ వార్ని దగ్గరకు తీసుకుంది. వారు తల్లితో కలసి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే తాపసి గుండె కరుణతో ద్రవించింది. మహాత్ముల కోపం క్షణకాలం అన్నారు పెద్దలు. గౌతముని క్రోధాగ్ని క్రమంగా చల్లారుతోంది. అహల్య కంఠస్వరం బొంగురుపోతోంది. రోదనలో పిల్లల్ని హత్తుకుని తల్లడిల్లిపోతున్న ఆమె స్థితి చూసి ముని అంతరంగం దయతో నిండింది. అహల్య తన వళ్ళంతా బిగుసుకుపోవటం గమనించింది. నోరు పెగలటం లేదు. వినికిడిశక్తి తగ్గుతోంది. పెనిమిటి శాపఫలం తనను ఉత్తుంగతరంగంలా ముంచెత్తుతున్నదని గ్రహించి పిల్లల్ని దూరంగా విసిరింది. రెండు చేతులూ జోడించి, భర్త పాదాలపై శిరస్సు పెట్టింది.

"కాపాడండి, క్షమించండి" అని మాత్రం చివరిసారిగా ప్రాధేయపడుతున్నది. యింతకాలం తనకు చేదోడువాదోడుగా ఉండి యిద్దరు పిల్లలకి జన్మనిచ్చిన అర్ధాంగి, తన క్రోధావేశాలకు బలైపోతుంటే గౌతముని హృదయం సూర్యతాపానికి కరిగిన మంచుగడ్డలా ప్రవహిస్తున్న నదీమతల్లి గంగలా గంభీరంగా మారింది.

"నీవు నిష్కళంకమైన అంతరంగ శుద్ధికలదానవైతే, రాబోయే త్రేతాయుగంలో శ్రీహరి రాక్షసవధ కోసం, శ్రీరామునిగా అవతరిస్తారు. ఆయన కరస్పర్శ వలన శాపవిముక్తి పొందెదవుగాక!" అని మంత్రజలం ఆమెపై జల్లాడు. అహల్య ఆ మాటలు వింది. సంతృప్తిగా ఆమె వినీల నయనాలు ఆనందాశ్రువులు రాల్చాయి. వెంటనే స్థాణువులా మారిపోయింది. పిల్లలు ఆమెను తడిమిచూచుకుంటూ బావురుమన్నారు. వారిని ఓదార్చటానికి ముని పుంగవుడు అక్కున జేర్చుకున్నాడు. తూర్పున బాలభానుడుదయిస్తున్నాడు.

తొలికోడి కూసింది. మలికోడీ కూసింది. మహా తపస్సంపన్నుడైన ముని సంసారాన్ని మలినం చేసిన కపట కుక్కుటము మాయమైంది. కానీ ఆ మాయకోడి చేసిన మాయవలన పచ్చని సంసారం వీధిన పడింది. మునిపల్లెలోని వారంతా నదీస్నానాలకు బయలుదేరి రోదనలు వినిపిస్తున్న గౌతముని కుటీరానికి వచ్చారు. దివ్యదృష్టితో జరిగినది తెలుసుకుని, ఆయనను, పిల్లలను సముదాయిస్తున్నారు. ఎవరూ తీర్చలేని సమస్య వచ్చిపడింది. పిల్లల్ని తాము సాకుతామని కొందరు మునిపత్నులు

వచ్చి అడిగినా గౌతముడు యేమీ చెప్పలేదు. ఆయన కూడా ఆవేదన తట్టుకోలేకపోయాడు. కొంతసమయానికి క్రమంగా నిభాయించుకుని పిల్లలను ఓదార్చాడు. శతానందుడు పదేళ్ళబాలుడు. అంజనకు ఆరేళ్ళు. ఆ వయస్సులో తల్లికి దూరమవటం బాధాకరమే. తనతోనే వుంచుకుందామని ఆయన ఆలోచన చేసాడు.

"నాయనా! శతానందా! మనం కొంతకాలం దేశాటన చేసివద్దాము. మన దుస్తులు మూటగట్టు" అని చెప్పగానే బాలుడు తండ్రి ఆజ్ఞ మేరకు ముగ్గురి బట్టలు మూటగట్టి సిద్ధం చేసాడు.

"ఎక్కడకు వెడతావు గౌతమా. మేమంతా పిల్లల్ని పెంచుతాము నాయనా! యిక్కడే వుండండి" అని ఒక వృద్ధురాలు వచ్చి బ్రతిమాలింది.

"లేదు జననీ! ఈ పరిసరాలన్నీ అహల్య మసిలినవి. నా శాపం వలన ఆమె పాషాణమైపోయింది. నిత్యం యిక్కడే వుండి పిల్లలు, నేను విచారించడం కన్నా కొన్నాళ్ళు తిరిగి రావటం మంచిదని బయలుదేరుతున్నాము. గోవులను లేగదూడ్ళను మాత్రం మీ ఆశ్రమాలకు తీసుకుపొండి. ఆమె శాపవిమోచనం నాటికి తిరిగి వస్తాము" అన్నాడు గౌతముడు.

అవ్వ మాతృహృదయం గౌతముని, పిల్లల్ని చూసి కరిగిపోయింది. ఆ పిల్లలిద్దర్ని అక్కున చేర్చుకుని కన్నీరు కార్చింది.

"మనవడా శతానందా! తండ్రి మాట విను. ఆయనకు కోపం తెప్పించే పని చెయ్యకు నాయనా! అంజన చిన్నపిల్ల. దాని బాగోగులు నువ్వే చూసుకుంటూ నీ జనకునికి శ్రమ తగ్గించు. జాగ్రత్తగా వెళ్ళిరండి" అంది ఆమె కుటీరం దాటి బయటకు వెడుతూ. యింకా బయట అరుగుల మీద వృద్ధులు, వేదాంతులు, తపస్సంపన్నులు అయిన వారు ఆశీనులై వున్నారు. వారిని సమాధానపరిచి, తను బయలుదేరాలి, అని యోచిస్తూ పిల్లలతో వెలుపలికి వచ్చాడు గౌతముడు. గోశాలకు వెళ్ళి పిల్లలు ఆయన వాటిని చివరిసారిగా గంగడోలు నిమిరి పచ్చిక వేసి లాలించారు. అంజన వారం క్రితం పుట్టిన తెల్లదూడను గట్టిగా రెండు చేతులతో మెడపట్టుకుని ముద్దు చేసింది. వాటన్నింటిని యిరుగుపొరుగు వారికి యిచ్చేసారు. పెద్దలంతా వుండిపొమ్మని. నచ్చచెపుతున్నారు. అందరికి గౌతముడు పాదాభివందనాలు చేసి తన అభిప్రాయం చెప్పనారంభించాడు.

"మహా వేదాంతవేత్తలారా! తాపసులారా! మునులారా! ప్రశాంతంగా సరయూనదిలాగ మీ అందరి ఆదరణతోపాటు సాగిపోయేనా సుఖసంసారంలో ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది. అదంతా నేను చెప్పకుండానే మీ తపశ్శక్తితో గ్రహించగలిగిన మహానుభావులు మీరు. ఎంతటి వారమైనా విధి వ్రాతను

ఎదిరించలేమనేది సత్యం. మా సంసారం యిలా అర్థాంతరంగా భ్రష్టుపట్టడానికి కారణం ఒక పరదారాపహరుడు. అదీ సామాన్యుడు కాదు. మహేంద్రుడు. మనం చేసే యజ్ఞయాగాది కర్మల ఫలితాన్ని స్వీకరించి, పంచభూతాలను అదుపులో ఉంచి, సకలదేవతాగణాలను సమీకరించి జీవకోటిని పరిపాలించే దేవేంద్రుడే క్షణిక సుఖం కోసం అహల్య పాతివ్రత్యానికి భంగం కలిగించాడు. కంచే చేను మేసినట్లయింది. రాక్షసులవల్ల బాధలు మనకెప్పుడూ ఉన్నాయి. హవిస్సులు స్వీకరించే ఇంద్రాది దేవతలు కూడా ఈ విధంగా ప్రవర్తిస్తే మానవాళికి దిక్కెవ్వరు? శాపానుగ్రహ సమర్థులమైన మనమే యిన్ని యిక్కట్లు పడుతుంటే, సామాన్యమానవుల గతియేమిటి? మనం నిత్యం ఆరాధించే శ్రీమన్నారాయణుడే మనను రక్షించగలిగిన సమర్థుడు.

త్రేతాయుగంలో ఆ లక్ష్మీనారాయణులే సీతారాములుగా భువిపై అవతరించి, ఆదర్శదంపతులుగా ఖ్యాతిగాంచుతారు. నారాయణుడు సంపూర్ణావతారం దాల్చి, సక్రమమైన ధర్మబద్ధమైన జీవితం గడిపి, ఆర్యావర్తంలోని రక్కసి మూకలను దునుమాడి, మునులకు రక్షణ కల్పిస్తాడు. సీత మహాపతివ్రతగా నిలిచి, పరదారాపహరణం వల్ల ఎంతటివారికైనా వినాశనం తప్పదు అని చెప్పే రామకథలో ప్రధానపాత్ర వహిస్తుంది. లోకకళ్యాణం కోసం వారు చెప్పే సందేశం మహాకావ్యంగా అవతరిస్తుంది. వారి యెడబాటును రూపుమాపే సంధానకర్తగా ఒకానొక వానరవీరుడు జన్మిస్తాడు. సాక్షాత్తు శంకరుల వారే ఆ రకంగా జన్మిస్తారు. మన మునిపల్లెలకు యేర్పడే ముప్పులన్ని తొలగిపోయే శుభతరుణం త్వరలోనే వస్తుంది. మునిపత్నులారా! మీరంతా అప్పటి వరకు నా భార్య అహల్య చలనరహితమైన పాషాణసదృశదేహాన్ని ఓ కంటకనిపెట్టుకుని వుండవలసినదిగా వేడుకుంటున్నాను. మునిదంపతులందరికి యివే గౌతముని చివరి ప్రణామములు" అని సౌమ్యంగా పలికి పిల్లల్ని తీసుకుని ఆయన బయలుదేరాడు.

గౌతముడు బిడ్డలను తీసుకుని వెడుతుంటే మునులు, మునిపత్నులు కంటతడిపెట్టుకున్నారు. కనుచూపు మరుగయ్యేవరకు వార్ని చూసి విచారంగా స్వగృహాలకు వెళ్ళిపోయారు.



11. [illegible]భక్తుడు [illegible]

అదొక విశాలమైన వనం. దాని మధ్యలో ఒక పర్ణశాల ప్రత్యేకంగా వుంది. దాని చుట్టూ అనేక చిన్న పర్ణశాలలు కూడా వున్నాయి. వాటికి ఈశాన్యదిక్కులో సమతలంగా వున్న విశాలమైన మైదానభూమి. దాని నిండా వరుసలుగా పూలమొక్కలు, చామంతులు, బంతులు, సంపెంగలు విరబూసిన పరిమళం. ఎత్తైన ఫలవృక్షాలు,

మధ్యలో సుందర పాలరాతి వేదికలు నాలుగుదిక్కుల మెట్లు అవి ఎక్కితే విశాలమైన అరుగులు. వాటికి మోకాలి ఎత్తులో నల్లరాతి పలకల సుందరమైన లతా శిల్పాలతో ముగ్గులతో వేదిక. దానిమీద నిలువెత్తు స్ఫటికలింగం, ఎదురుగా నందీశ్వరుడు. ప్రక్కనే మహాగణపతి విగ్రహం. అదంతా కుంజరుని సామ్రాజ్యం. గదలు, శూలాలు ధరించిన కపివీరులు, పెద్ద పర్ణశాల వద్ద పహారా కాస్తున్నారు. ఆలయం వద్ద నాలుగువైపులా ఆయుధపాణులైన భటులు. కొందరు కపులు వారి కుటుంబాలతో వచ్చి శివునికి ప్రక్కనే ఉన్న నిర్మల తటాకోదకం తెచ్చి అభిషేకం చేసి, పూలు, మారేడు దళాలతో పూజ చేసుకుని, ఫలాలు నైవేద్యం పెట్టి వెడుతున్నారు. ఆ ప్రాంతమంతా శివమయశోభితంగా ఉంది. కొన్ని కుటీరాల్లోంచి "ఓం! నమశ్శివాయ" పంచాక్షరి జపం వినపడుతోంది. ఈ లోగా పర్ణశాల వద్ద మేళతాళాలు వినపడుతున్నాయి. ఒక వానరయోధుడు తన అర్ధాంగితో బయలుదేరాడు. కూడా భటులు, సుందరాంగులు ముందుగా నడుస్తున్నారు. సుందరీమణుల చేతులలో బంగారు వెండి పళ్ళెరాలు. వాటి నిండా పసుపు, కుంకుమ, గంధం, ఎఱ్ఱచందనం, రంగురంగుల పువ్వులు వున్నాయి. భటులు కొందరు ఆయుధాలు ధరించి ముందు నడువగా కొందరు క్షీరదధిభాండాలు మోసుకువస్తున్నారు. భటులు కొందరు ముందుగా ఆలయం వద్దకు వచ్చి సామాన్య ప్రజల్ని వేగంగా పూజలు చేయించి పంపివేసారు. కొందరు అర్చకులు వచ్చి ముందుగా శివలింగం వద్ద యేర్పాట్లు చేసి వానర రాజు కుంజరుని ఆగమనం కోసం నిరీక్షిస్తూ నిలబడ్డారు. యిద్దరు కపులు లాగుకుని వస్తున్న రెండు చక్రాల బండిపై వికసించిన సహస్రకమలాలు, ఆ వెనుక మరొక శకటం పై మారేడు దళాలు. అవి వచ్చి శివలింగానికి దగ్గరగా ఆగాయి.

కపిరాజు తన పత్నులతో వచ్చి అర్చకులు వేదమంత్రాలు, నమకం, చమకం చదువగా శివలింగానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చివరిగా నిర్మలోదకంతో అభిషేకాలు, తరువాత శాస్త్రోక్తంగా పశుపతినాథుని పూజ చేసి, సహస్రనారికేళాలు కొట్టి, నైవేద్యం పెట్టారు. బారులు తీరిన మానవులు, కపులు, తీర్థప్రసాదాలు స్వీకరించి వెళ్ళారు. ప్రతిరోజు యిదే తీరున శివార్చన జరుగుతుంది. తరువాత దూరంగా వున్న వంటశాలలో అన్న సంతర్పణ జరుగుతుంది. దూరప్రాంతాల నుండి కూడా ప్రజలు వచ్చి కుంజరుని శివపూజలలో పాలుపంచుకుని సుష్టుగా భోంచేసి వెడుతుంటారు. అదొక శైవక్షేత్రంగా విరాజిల్లుతోంది. వానరయోధుని భక్తిప్రపత్తులు మానవలోకానికి ఆదర్శప్రాయంగా అందరూ చెప్పుకుంటారు.

పూర్తిగా ఒకపూట శివపూజకు, అన్నదానానికి సరిపోతుంది. ఆ ప్రాంతానికంతకు ఆయనే వానరరాజు కావటం వల్ల పరిపాలనా విషయాలన్నీ మధ్యాహ్నం నుండి రాత్రి ప్రొద్దుపోయేవరకు సచివుల సహాయంతో చూసుకుంటాడు కుంజరుడు. అతని పరివారమే

వేల సంఖ్యలో వుంటుంది. ధనకనకవస్తువాహనాలకు లోటులేదు. నరవానరకన్యలు అనేక మంది భార్యలున్నారు. దేనికీ లోటెరగడాయన. ఒక్క సంతానం లేదన్న బాధమాత్రం ఆయనను కలచి వేస్తోంది. భార్యలంతా ఎవరికైనా ఒక్క మగబిడ్డ కలిగితే బాగుండునని ఒకరిపై ఒకరు పోటీపడుతున్నారు. రాజోద్యోగులు సచివులు, ఈ కపిరాజ్యానికి వారసుడుంటే బాగుండునని యోగ్యమైన కన్యనల్లా తెచ్చి రాజుకిచ్చి వివాహం చేస్తున్నారు. అయినా ఎవరి కోరికా సఫలం కావటం లేదు.

ఒక తెల్లవారుఝామున ఆయనకు ఉమామహేశ్వరులు ప్రత్యక్షమయ్యారు.

"శంకరా! నాకు సంతానం ప్రసాదించండి" అని వేడుకున్నాడు.

"భక్తశిఖామణీ! కుంజరా! నీ భక్తిప్రపత్తులకు మెచ్చుకుంటున్నాను. సకలైశ్వర్యాలు, రాజ్యాధికారం, పూర్ణాయుర్దాయం అన్నీ యిస్తున్నాను."

"నేను అడిగింది సంతానం కదా ప్రభూ. ఆ విషయం శలవియ్యండి. జగన్మాతా! స్వామికి నువ్వయినా చెప్పుతల్లీ!"

"నాయనా! నీ పూర్వజన్మ కర్మఫలం వలన ఈ జన్మలో నీకు సంతానం కలిగే యోగం లేదు. అయితే నా కృపవలన నీకొక ఆడుబిడ్డ లభ్యమౌతుంది. ఆమె కారణజన్మురాలు. మీ వానరకులానికి పేరుప్రతిష్ఠలు యినుమడింపజేసే వీరునికి జన్మనిస్తుంది. శుభం జరుగుతుంది" అని కుంజరుని దీవించింది మాత. పార్వతీపరమేశ్వరులు అదృశ్యమయ్యారు. కుంజరుని ఆనందానికి అవధులు లేవు. తన భార్యలందరికి ఈ విషయం చెప్పాడు. తమ వల్ల పొందలేకపోయిన ఆనందాన్ని మరొకరి సంతానం వల్లనైనా కలుగుతున్నందుకు వారు ఉప్పొంగిపోయారు. సచివులు, రాజోద్యోగులు తమ రాజు తరువాత, ఆయన పెంపుడు కుమార్తె, అల్లుడు తమకు నేతలు అవుతారని సంబరపడుతున్నారు. ఆ రోజు నుండి కుంజరుడు ఆయన పరివారం తమకు లభ్యం కాబోయే పాపకోసం నిరీక్షిస్తున్నారు.



12. గౌతముడు అంజనను కుంజరునకు పెంపకమునకిచ్చుట



భార్యావియోగంతో దుఃఖిస్తూనే గౌతముడు పిల్లలను తీసుకుని అరణ్యాలలో ప్రయాణం చేస్తున్నాడు. మధ్య మధ్య జనపదాలలోను, మునిపల్లెలలోను ఆగి ఆకలిదప్పులు తీర్చుకుంటూ, తల్లికోసం మారాము చేస్తున్న పిల్లల్ని ఓదారుస్తూ ఒకరోజు సాయంత్రానికి విశాలమైన వటవృక్షం దగ్గరకు చేరుకున్నారు. పిల్లలు తల్లికోసం తల్లడిల్లిపోతుండటం గమనించిన ఆయనకు వారిని ఎలా పెంచి పెద్దచెయ్యాలో అర్థం

కావటం లేదు. శతానందుడు మగబిడ్డ. తనవలె ముని ఆశ్రమధర్మాలు, వేదాధ్యయనం, సంధ్యావందనాదులు, క్రతునిర్వహణ తెలిసినవాడు. పదేళ్ళ పైబడ్డ వాడు గనుక అకలి దప్పులకు నిగ్రహించుకోగలుగుతున్నాడు. కానీ అంజన అరేళ్ళయినా నిండని పసిపాప. అందమైన ముద్దులొలికే పాలబుగ్గలు. నల్లని పొడవాటి కురులు. దొండపండు పెదిమలు. తల్లి సౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని పుణికి పుచ్చుకుంది. ఈ పాపనెలా పెంచగలను? వయస్సువచ్చి పెద్దదైతే వరుని చూసి వివాహం చెయ్యాలి. సహధర్మచారిణీ, పతివ్రత అయిన అహల్యను దూరం చేసుకున్న నేను కన్యాదానం ఎలా చెయ్యగలను? భగవంతుడు తప్ప నాకున్న బంధుజనం ఎవరూ లేరే? వేదాధ్యయనం, తపస్సు తప్ప లౌకిక ప్రజాజీవనం, పెళ్ళిలాంటి సరదాలు, వేడుకలు ఎన్నడూ తెలియని జీవితం నాది. బాహ్యప్రపంచం చూస్తుంటే బహుసంపన్నమైనదిగా కనిపిస్తోంది. ఈ లోకంలో ఆడపిల్లకు వైభవంగా పెళ్ళిచెయ్యాలంటే ధనం కూడా కావాలి కదా! నేను తపస్సంపన్నుడనే గాని, సంపన్నుడను కానే! చేత వరహాలేని నేను అంజనకు ఎలా పెళ్ళి చెయ్యగలను? అదంతా పాప ఎదిగాక చెయ్యవలసిన ఉత్తమ సంస్కారం. కానీ ఈ లోగా ఈ పిల్లకు సుశ్రూషచేసి పెంచడం ఎలాగ?" యిలా పరిపరివిధాల ఆలోచనా తరంగాలలో తలమున్కలవుతున్నాడు గౌతముడు. పిల్లలిద్దరు ప్రయాణబడలిక వల్ల త్వరగా నిద్రపోయారు.

బ్రహ్మదేవులు సౌందర్యరాశియైన అహల్యను సృష్టించడం, నారదమహర్షికి తనపై అభిమానం కలిగి ధర్మసూక్ష్మం చెప్పి తనకు ఆమెనిచ్చి వివాహం చేయించటం ఒక అద్భుతదైవలీల. పరమేష్ఠి అనుగ్రహం లేకపోతే అంతటి సౌందర్యవతిని తను ఎలా చేపట్టగలిగేవాడు? ఈ లోకంలో తనకు పిల్ల నిచ్చే దెవరు ? తలవని తలంపుగా జరిగిన సంఘటనలన్ని గౌతముని అంతరంగంలో ప్రశ్నలుగా మిగిలిపోగా, చివరిగా ఆయనకు సమస్యగా మిగిలిపోయింది ఒకటే! అంజన పెంపకం, పెళ్ళి ఈ ఆలోచనలన్నీ ప్రక్కకు పెట్టి శివనామస్మరణ చేసుకొని గాఢంగా నిద్రపోయాడు గౌతమముని. కలలో పరమ శివశంకరులు దర్శనమిచ్చారు.

"గౌతమమునీంద్రా! నువ్వు నీ కుమార్తె గురించి దిగులు చెందకు. ఆమె కారణజన్మురాలు. పూర్వజన్మలో పుంజికస్థలి అనే అప్సర ఆమె. శాప వశాన మానవజన్మ ఎత్తింది. ఇక్కడ నుండి తూర్పు దిక్కుగా వెళ్ళు. కుంజరుడనే వానరరాజు నివాసం వస్తుంది. నీ కుమార్తెను అతనికి కానుకగా సమర్పించు. మిగిలిన కార్యభారమంతా అతనే వహిస్తాడు. నువ్వు శతానందుని తోడ్కొని దేశాటన చెయ్యవచ్చు. నీ కుమారుడు కూడా నీ అంత పాండిత్యం గడిస్తాడు. శ్రీరామ ఆవిర్భావం మీకు సకల శుభములను తిరిగి యిస్తుంది. స్వస్తి" అని ఆశీర్వదించి అదృశ్యమయ్యారు ఉమాపతి. గౌతమునికి మెలుకువ వచ్చి హఠాత్తుగా ఉలిక్కి పడిలేచాడు. కలా నిజమా? అని కళ్ళు

ృ నులుపుకుని చూసాడు. తెలతెల్లవారుతోంది. మింట పక్షులు బారులు తీరి ఎగురు తున్నాయి. తూర్పున సూర్యుని అరుణకిరణాలు మేఘాలను ఎఱ్ఱ బారుస్తున్నాయి. పిల్లలిద్దరు హాయిగా నిద్రిస్తున్నారు. సదాశివుని కటాక్షం వలన నా సమస్యకు పరిష్కారం లభించింది; అనుకుని ఆయనకు మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు. పిల్లల్ని లేపి కాలకృత్యాలు పూర్తి చేసుకుని తూర్పు దిక్కుగా నడక ప్రారంభించాడు. వెళ్ళగా వెళ్ళగా సుందరమైన చామంతి, గులాబి తోటలు, మామిడి తోటలు, యింకా దూరం వెడితే నిమ్మ నారింజ బత్తాయి తోటలు పచ్చగా పండిన ఫలాలతో చూడముచ్చటగా వున్నాయి. ఆయుధ పాణులైన వానరులు కాపలాకాస్తున్నారు. దూరంగా పర్ణశాలలలు కనిపిస్తున్నాయి. యిరువురు కాపలా భటులు గౌతముని ముందుకు వచ్చి ప్రణామము చేసి -

"మహాత్మా! తమరెవరు యిది వానరయూధపతి కుంజరుని రాజ్యం. అనుమతి లేనిదే ప్రవేశించరాదు" అని సవినయంగా మనవి చేసారు.

"నేను గౌతముడనే తపస్విని. మీ రాజుకోసమే వస్తున్నాను. ఆయనకు నేను వస్తున్నాని తెలియ జేయండి. మమ్మల్ని అడ్డగించి మా ఆగ్రహానికి గురి కాకండి" అని గంభీరంగా చెప్పాడు.

"చిత్తం మహాత్మా! మేము వేగంగా వెళ్ళి తమరు వస్తున్నట్లు మా నేతకు విన్నవిస్తాము" అంటూ వారు చెట్లకొమ్మలు ఊడలు పట్టుకుని ముందుకు సాగారు. కొంతదూరం వెళ్ళేసరికి ఎత్తైన పర్ణశాల కనిపిస్తోంది. మేళతాళ ధ్వనులు వినిపిస్తున్నాయి. వేదమంత్రాలు చదువుతున్న విప్రవరేణ్యులు పూర్ణకుంభంతో వస్తున్నారు. వెనుక నవరత్న ఖచిత స్వర్ణకిరీటం, భుజకీర్తులు, నేలను జీరాడుతున్న ఎఱ్ఱని పట్టు కండువా, తెల్ల మేఘం వంటి పట్టుపంచె ధరించిన విశాల వృక్షస్థలం గల వానరవీరుడు; ఆయన చుట్టూ సుందరనారీమణులు, సచివులు పరివారమంతా ఎదురు వస్తోంది. గౌతమునికి ఆనందం వేసింది. ఆయన ఈ మర్యాదకు అచ్చెరువందుతున్నాడు. యిద్దరు సేవికలు ముందుగా వచ్చి బంగరు పళ్ళెం వుంచి అందులో ఆయన పాదాలుంచమని కాళ్ళు కడిగారు. విప్రులు స్వాగతం పలికి చందనం రాసి, పూలదండలు వేసి సత్కరించాక వానరరాజు ముందుకు వచ్చి -

"మహర్షీ తమరి రాక వలన నా రాజ్యం పావనమైంది. నేను కుంజరుడను. రండి నా రాజమందిరంలోకి వెళ్ళి మాట్లాడుకుందాము. వీరంతా నా పత్నులు. మీ సేవకు మేమంతా సిద్ధమై వున్నాము. రండి" అంటూ అంతరంగ మందిరంలోనికి తీసుకువెళ్ళాడు. కొందరు లలనామణులు పిల్లల్ని తమతో తీసుకువెళ్ళారు.

అతి సుందరమైన విశాలమందిరంలోకి మునిని తీసుకువెళ్ళి ఉన్నతాసనంపై

కూర్చుండబెట్టాడు కుంజరుడు. తను ప్రక్కనే కూర్చుని మంత్రుల్నీ, ఆస్థాన పండితుల్నీ పరిచయం చేసాడు. వారు వెళ్ళి సేవకులతో ఫలాలు, పుట్టతేనెలు, ఆవుపాలు, నదీజలం పంపిచారు. రాజు అభ్యర్థనపై ముని వాటిని ఆరగించి స్వాంతనుదయ్యాడు. ఈ లోగా పిల్లలకి స్నానాలు చేయించి, మంచి ఆహారం పెట్టించి, క్రొత్తదుస్తులు తొడిగి స్వర్ణాభరణాలు అలంకరించి గౌతముని సముఖానికి తెచ్చారు రాణులు.

"మునీంద్రా ! నా భాగ్యం చేత మీ దర్శనం ప్రాప్తించింది. సకల శుభములను ఒసగే మునివరేణ్యులు మీరు. కబురు పంపితే నేనే తమ ఆశ్రమానికి వచ్చేవాడిని. యింత ప్రయాస పడి నా రాజ్యంలో తమ పవిత్ర పాదాలుంచి నన్ను ధన్యుణ్ణి చేసారు. నేను తమకు యేమి చెయ్యవలసి వున్నదో శలవియ్యండి. నేను నా పరివారము మీ వంటి మహాత్ములకు యే రకంగా సేవ చేయగలమో ఆజ్ఞాపించండి" అన్నాడు; కుంజరుడు వినమ్రంగా ఆయన ముందు కేల్మోడ్చి. గౌతముడు గంభీరంగా మారిపోయాడు. ఆయన కన్నుల్లో తపోకాంతి మెరుస్తోంది. ఆయన ఫాల భాగంపై చతుర్వేదాలు నాట్యమాడుతున్నాయి. బవిరిగడ్డంలో ఉపనిషత్తుల రహస్యాలు నిబిడీకృతమై తేజస్సునిస్తున్నాయి. శిరస్సుపై శిఖముడిలో సరస్వతీకటాక్షం నిక్షిప్తమై ఇంద్రుని సహితం శపించగల సామర్ధ్యాన్నిస్తోంది. భ్రుకుటి ముడివడి ముచ్చెమటలు పోసాయి. మానసికంగా ఆయన జరిగిన విపత్కర సంఘటనను జ్ఞాపకం చేసుకుని యేమీ మాట్లాడలేకపోతున్నారు. అది గమనించిన కుంజరుడు చెలికత్తె చేతిలోని వింజామరను తీసుకుని దగ్గరగా నిలబడి వీవన వీస్తున్నాడు. పరిచారికలను బైటకు వెళ్ళమని సైగచేసాడు. శతానందుడు, అంజన తండ్రి గాంభీర్యానికి భయపడి బిక్కుబిక్కుమని చూస్తున్నారు. కపిరాజు వారికేసి లాలనగా చూసి కనుచూపుతోనే ధైర్యం చెప్పాడు.

"కుంజరా ! నేను నీ సహాయం కోరి వచ్చినమాట వాస్తవమే. విధి వశం చేత నేను నా అర్ధాంగి అహల్యను దూరం చేసుకున్నాను. వీళ్ళు నా సంతానం. కుమారుడు శతానందుడు నా వెంట తపోవనాలకు వస్తాడు. అంజన యింకా చిన్నపిల్ల, ఘోరారణ్యాలలో మాతో పాటు సంచరించ జాలదు. ఈ విపత్కర పరిస్థితులలో ఈ చిన్నారిని పెంచి పెద్దచేసి వివాహం చేసే సామర్ధ్యం నాకు లేదు".

"ఎంత మాట ! మీకు ధనకనక వస్తు వాహనాలు, అగ్రహారాలు దానమిసాను. నా పరివారమంతా మీకు దాసులమై సేవ చేసుకుంటాము".

"నీ వంటటి దానశీలివే. యిలా మాట్లాడగలగడం, నిస్వార్ధసేవ చేయటం, మానవాళికి విపత్కర పరిస్థితుల్లో అండగా నిలవడం మీ వానరజాతికి సహజ లక్షణం. యింత గురుభక్తి వినయసంపన్నత గల వాడివి గనుకనే నన్ను నీవద్దకు పంపాడు

పరమశివుడు. ఆయన అనుగ్రహం వల్ల నిన్ను శీఘ్రంగా కలుసుకోగలిగాను. తాపసులం మాకు ధనాపేక్ష వుండదు. ప్రాపంచిక జీవనం మీద మక్కువ వుండదు. స్థిరంగా ఒక చోట వుండనూ లేము. ఈ బాలికను నీకు పెంపుడు కుమార్తెగా యిస్తున్నాను. స్వీకరించు". గౌతముని కళ్ళు ఆర్ద్రమైనాయి.

"మహద్భాగ్యం స్వామి" కుంజరుని ఆనందానికి అవధులు లేవు. మునికి పాదాభివందనం చేసాడు. అంజనను రమ్మని సైగ చేసాడు ముని. శతానందుడు చెల్లిని పట్టుకొని తీసుకువచ్చాడు. గౌతముడు పాపను గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు. పాప తండ్రి ఒడిలో ఒదిగి బిక్కమొహం వేసి జలజలా కన్నీరు కారుస్తోంది. శతానందుడు కూడా చెల్లిని పట్టుకొని కన్నీరు కార్చాడు.

"అమ్మా అంజనా! యిక ఈ కుంజరుడే నీకు తండ్రి". ఈయన పత్నులే నీకు తల్లులు. వారిని గౌరవిస్తూ సుఖంగా వుండు" అని పాపను వానరరాజుకు అప్పగించాడు ముని.

"మహాభాగ్యం స్వామీ ....." అని కుంజరుడు పాపను ప్రేమగా ముద్దాడి ఎత్తుకున్నాడు. అయితే ఆయన మనస్సులో ఒక సందేహం జనించింది. అంజన మానవ బాలిక. తను తన పరివారం చాలామంది కపులు. ఆ పాపను తమతో సహచర్యం చేయించడం వలన యేమైనా యిబ్బందులుంటాయని ఆలోచిస్తున్నాడు. గౌతముడు అదిగ్రహించాడు ---

"ఏమిటి సందేహిస్తున్నావు వానరవీరా?

"మునీంద్రా! మేము కపికులానికి చెందినవారము. ఈమె నరజాతి బాలిక. నేను న్యాయం చెయ్యగలనా? తగిన వరుడ్ని వెతకటం ఎలాగ?

"కుంజరా! నీ సందేహం సరియైనదే! ఈ బాలికకు స్వేచ్ఛారూపం ధరించగల శక్తి యిప్పుడే ప్రసాదిస్తున్నాను. మీ వానరులలోనే పెంచి పెద్దజేసి, నీకు నచ్చిన వానరవీరునికే యిచ్చి కళ్యాణం జరిపించు. అవసరాన్ని బట్టి ఈమె నరవానర రూపాలు రెంటినీ ధరించగలదు. ఈమె గర్భాన నారాయణ సేవకు నోచుకునే పరమ భక్తాగ్రగణ్యుడు, వీరుడు, చిరంజీవి అయిన వానరవీరుడు జన్మిస్తాడు. మన యిరువంశాలకు అతని వలన యశస్సు లభిస్తుంది.

"చిత్తం".

"శతానందా! మనం వెడదాము బయలుదేరు"

"అలాగే నాన్నగారూ" అంటూ శతానందుడు తాపసివేషం ధరించి బయలు దేరాడు.

"కుంజరా! నీ ఆతిధ్యం మరువలేనిది,. శుభమగుగాక!" అని దీవించి బయలు

దేరారు గౌతమశతానందులు. కుంజరుడు పాపను రాణులకప్పగించి పొలిమేర వరకు వారిని రథంలో దిగబెట్టాడు. అంజన రాణివాసంలో అల్లారుముద్దుగా పెరుగుతోంది. ఆమె ఆటపాటలు చూసి కుంజరుడు మురిసి పోతున్నాడు.



13. కేసరి శంబసాదుల పోరాటము



అంజన నవయవ్వనంలో అడుగుపెట్టింది. సుమారు అయిదున్నర అడుగుల పొడగరి. చంద్రబింబం వంటి గుండ్రని ముఖం, ఎఱ్ఱని దొండపండు పెదిమలు, అల్లనేరేడుల వంటి కన్నులు, నువ్వుపువ్వులా కోటేరు ముక్కు, మరి ముత్యాల వరుసే దంతాలు, నల్లత్రాచులా పిరుదులు తాకే కేశసంపద, సన్నని నెన్నడుము, విశాల కటిస్థలం, మరో అహల్యలా వుంది అంజన. కపిరాజు కుమార్తె సౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని, సద్గుణసంపదను గ్రహించాడు. అన్ని రకాల ఆమెకు తగిన వరుని కోసం చారులను పంపి వెతికిస్తున్నాడు. యింక పెళ్ళిళ్ళ పేరయ్యలు సరేసరి. దేశదేశాల వానర రాకుమారుల చిత్తరువులుతెచ్చి రాజుకు చూపిస్తున్నారు. సుపర్వగిరి ప్రాంతంలో ఒక చక్కని కపిరాజు వున్నట్లు కుంజరునికి తెలిసింది. స్వయంవరం ప్రకటిద్దామా లేక స్వయంగా వెళ్ళి అతని గుణగణాలు, శౌర్యప్రతాపాలు పరిశీలించి వద్దామా అని సచివులతో చర్చలు చేస్తున్నాడు కపిరాజు. సమయం కోసం నిరీక్షిస్తున్నాడు.

అది సుపర్వగిరి. విశాలమైన ప్రదేశం. ఎత్తైన కొండ శిఖరాలు. దూరంగా సెలయేళ్ళు, వివిధఫల వృక్షాలతో కూడిన లోయలు, పూపొదరిళ్ళు, వృక్షాల మధ్య పచ్చిక మేస్తున్న జింకలు, పొదరిళ్ళలో దూరి దోబూచులాడుతున్న తెల్లకుందేళ్ళు, గోధుమ రంగు కుందేళ్ళ గుంపులు, వయ్యారపు నడకలు నడుస్తూ మధ్య మధ్య ఎగిరి చెట్ల కొమ్మలపై దూకుతున్న నెమళ్ళు, పక్వ ఫలాలను తమ ఎఱ్ఱముక్కులతో కొరుకుతూ ఆకుల మధ్య ఆడుకుంటున్న రామచిలుకలు. అది వసంత ఋతువేమో శ్రావ్యంగా పాడగలమని గొంతెత్తి కూస్తున్న కోయిలలు. అలాంటి ప్రదేశంలో విశాల మైదానం. అక్కడ అనేక పర్ణశాలలున్నాయి. అందంగా తీర్చిదిద్దిన కాలిబాటలు. వరుసగా పెరిగి మల్లెలలతో గుబాళిస్తున్న మల్లెపొదలు, సువాసనల రాజుగా తమ ఉనికిని తెలియకుండా తెలియజేసే ఆకుపచ్చ సంపెంగలు. అనాస ఫలాల పొదలు, వీధుల్లో సంచరించే వానర భటులు. దూరంగా అందమైన రాజప్రాసాదం. దాని అందం వర్ణనాతీతం. ఆ మేడ ముందు ముత్యాల ముగ్గులు. బారులుగా తీర్చిదిద్దిన రకరకాల పూలమొక్కలు. సౌధాగ్రంలో కాపలా భటులు, ద్వార పాలకులు, వెండి మంగళ తోరణాలు కట్టిన దారుశిల్పశోభితమైన సింహద్వారం. ఆ ప్రాంతానికి ఏలిక

కేసరి అనే వానర రాజు. దూరంగా కొండపై ఒక శివాలయం. అక్కడికి వచ్చి పోతున్న భక్తుల సందోహం. దూరంగా అడవులలో అనేక జనపదాలు. మధ్యమధ్య పంట పొలాలు. యివన్నీ ఆకాశం నుండి వీక్షిస్తూ కొందరు దేవతలు, ఋషులు దిగి వచ్చి రాజప్రాసాదం ముందు దిగారు. వెంటనే శూలాలు, బల్లెములు ధరించిన రాజభటులు వచ్చి వారికి నమస్కరించి –

"ఆర్యులారా! తమరు వచ్చిన కారణం తెలుసుకో వచ్చునా" అని వినమ్రంగా అడిగారు.

"మేము బృహస్పతిపుత్రుడు కేసరి అనే కపిరాజును వెత్తుక్కుంటూ ఈ భూమండలానికి వచ్చాము. ఆయనను తక్షణం కలుసుకోవాలి. మా రాకను వారికి తెలియజేయండి" అన్నారు దేవతలు.

"చిత్తం! తమరంతా లోపలికి వచ్చి మార్గాయాసం తీర్చుకోండి. మేము రాజా వారికి మీరు వచ్చినట్లు తెలియపరుస్తాము" అంటూ లోపలికి ఆహ్వానించారు భటులు. వారంతా అక్కడ ఉచితాసనాలపై ఉపవిష్ఠులయ్యారు. ఒక వానరుడు రెండవ అంతస్థులోని రాజమందిరానికి వెళ్ళి మంత్రులతో రాజ్య వ్యవహారాలు ముచ్చటిస్తున్న కేసరికి దేవతల ఆగమనం గురించి విన్నవించాడు.

ఆయన, భటులు తెచ్చిన వార్త విని వెంటనే మంత్రులను తోడ్కొని క్రిందికి వచ్చి సమావేశమందిరంలో ఆశీనులైవున్న మహాఋషులు, దేవతలను చూచి ఆశ్చర్యపోయి వినమ్రుడై శిరస్సు వంచి నమస్కరిస్తూ –

"పూజ్యులైన దేవతలకు, ఋషీశ్వరులకు వానరరాజు కేసరి శత సహస్ర వందనములు సమర్పించుకుంటున్నాడు. మీలో యే ఒక్కరు వర్తమానం పంపినా నేనే వచ్చి మీ ఆజ్ఞ పాటించేవాడిని. తమరంతా విచ్చేసిన కారణం తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాను. శలవియ్యండి" అన్నాడు కేసరి. అతని వినయానికి వారంతా ప్రసన్నులయ్యారు. వరుణుడు కేసరివైపు చూసి –

"వానరరాజా కేసరీ! నీ వినయ సంపన్నతకు మేమంతా సంతసిస్తున్నాము. నీ పరాక్రమం బ్రహ్మలోకం వరకు ప్రఖ్యాతి పొందింది. మేమంతా శంబసాదుడనే రాక్షసుని వలన పడరాని యిడుములు పడుతున్నాము. అతడు మహా తపస్సు చేసి బ్రహ్మవరములు పొందాడు. దేవతల వలన అతనికి మరణం లేదు. ఋషిశాపాలు కూడా అతన్ని కడతేర్చజాలవు. వీరు చేసే యజ్ఞయాగాది క్రతువులు రక్తసిక్తం చేసి పాడు చేయిస్తున్నాడు. హవిస్సులు మాకు దక్కనివ్వటం లేదు" అన్నాడు. ఒక మహర్షి వానరరాజు వంక చూచి –

"నాయనా! నా నియమనిష్ఠలకు వాని అనుచరుల వల్ల భంగం వాటిల్లుతోంది.

అష్టకష్టాలు పడుతున్నాము. అష్టాక్షరీ మంత్రజపం చేసుకోనివ్వటం లేదు. వాని అండ చూసుకుని పెట్రేగిపోతున్న రాక్షసులు మునిపత్నుల యెడల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. శంబసాదుడు జీవించి వుండగా ఈ అరాచకాలు ఆపగలిగే శక్తి మాలో ఎవరిలోను లేదు. పుట్టుకతోటే వాడు విష్ణు ద్వేషి, క్రూరుడు, మహాదుష్టుడు. ఏ బ్రహ్మవలన అతను సృష్టించబడి శక్తి సంపన్నుడయ్యాడో ఆ చతుర్ముఖుణ్ణే తరుణోపాయం అడిగాము"

"ఏమన్నారు మహర్షీ"

"ఆ శంబుసాదుని మరణం నీ చేతిలో వుందని, నువ్వు తప్ప అన్యులెవరు అతన్ని వధించజాలరని తెలిపి నీ వద్దకు పంపారు మమ్మల్ని".

"సాక్షాత్తు చతుర్ముఖ బ్రహ్మదేవుల ఆజ్ఞ, మీ ఆశీస్సులు వుంటే శంబసాదుని వధించటం నా వశమవుతుంది. మీరంతా నిశ్చింతగా మీ నిజనివాసాలకు వెళ్ళిరండి. మహాత్ములారా! నేను ఉత్తరక్షణంలో ఆ అసురుని కడతేర్చుతాను".

"మహాకపిశ్రేష్ఠా! మేమంతా నీ పరాక్రమం చూడటానికి శంబసాదుని గుహ వద్దకు చేరుకుంటాము. విజయోస్తు" అని వారు అదృశ్యులయ్యారు.

సేనానులు, సచివులు కేసరి ఆజ్ఞకోసం వేచి చూస్తున్నారు. వారి నుద్దేశించి "యోధులారా! శంబసాదుని పై యుద్ధానికి సిద్ధంకండి. మన కోట, ధనాగారం విశిష్టయోధుల రక్షణలో వుంచి కొందరు మాత్రమే రణరంగానికి నాతో రండి. సాధ్యమైనంత వరకు రక్తపాతం జరుగకుండా నేను అతనితో ద్వంద్వ యుద్ధమే చేస్తాను. కాని రాక్షసుల మనఃప్రవృత్తులను నమ్మలేము. ఏక్షణంలోనైనా వారంతా అర్థాంతరంగా మన రాజధాని పైన; సామాన్య ప్రజలపైనా విరుచుకు పడవచ్చు. అందుకని అప్రమత్తంగా వుండాలి. అవసరాన్ని బట్టి ఏ రకమైన పోరాటానికైనా మనం సిద్ధంగా వుండాలి".

"చిత్తం మహా ప్రభూ ! తమరికి రథం సిద్ధం చెయ్యబడింది. మీతో తక్కువ బలగాలని పంపుతున్నాము. మిగిలిన వారంతా మన రాజ్యం యొక్క రక్షణ భారం వహిస్తాము. తమరికి విజయం ప్రాప్తించాలని మేమంతా కోరుకొంటున్నాము" అన్నాడు ప్రధానసచివుడు.

మహాకపిశ్రేష్ఠుడు, బలశాలి, బ్రహ్మచారి, శివభక్తుడు, రణపండితుడు, గదాయుద్ధప్రవీణుడు, మీదు మిక్కిలి ధర్మవీరుడు అయిన కేసరి యుద్ధానికి బయలు దేరుతుంటే కోట ప్రాకారంపై రణభేరి మ్రోగించారు. కొమ్ముబూరలు ఊదుతున్నారు. ముత్తయిదువలు గుంపుగా వచ్చి మంగళహారతి యిచ్చారు. విప్రులు వేదపఠనంతో శుభం పలికారు. తలపాగ, తెల్లని పంచె, నడుముకు ఎఱ్ఱటి కండువా చుట్టిన వీరుడు ముందుకు వచ్చి ఎఱ్ఱనీళ్ళుంచిన కూష్మాండం పగులగొట్టి తన ఖడ్గాన్ని తిప్పుతూ

నైపుణ్యం ప్రదర్శించి, రాజు ఎదుట నిలబడి తన కుడి చేతి బొటనవ్రేలు చురకత్తి చేత గాయ పరుచుకొని రాజుకు రక్తతిలకం దిద్దాడు. భట్రాజులు వచ్చి -

"మహాకపిరాజు కేసరికి జయము జయము"

"ధర్మవీరుడు కేసరికి మంగళము"

"ద్వంద్వయుద్ధప్రవీణ కేసరి మహరాజుకి విజయోస్తు"

అని బిగ్గరగా పలుకగానే సారధి ఆయన వుండే రథం సముద్రతీర అటవీప్రాంతం గోకర్ణం వైపు బయలుదేరదీసాడు. నాలుగు గుఱ్ఱాలు మందగమనంతో ప్రారంభించి పరుగు లంఘించుకుంటున్నాయి. ముందు కొన్ని రథాలతో సైన్యం, తరువాత కాల్బలకపియోధులు, శంబసాదుని గుహ వెతుకుతూ మార్గం తెలుపుతున్నారు. రాజు రథం వెనుక ఆయుధశకటాలు, అశ్వికదళాలు, కొన్ని గజరాజులు బయలుదేరాయి. కొండలు గుట్టలు దాటి అపరాహ్ణం వేళకు ఒక విశాల మైదానం చేరుకున్నారు. గూఢచారులు అదే శంబసాదుని ప్రదేశమని దూరంగా కనిపించే గుహలోనే అతని నివాసమని రాజుకు తెలియజేసారు. పరివారాన్నంతా ఆహారం తీసుకుని వృక్షాల కింద విశ్రాంతి తీసుకోమని రాజు తెలియజేసి కొందరు యోధుల్ని, స్వల్పంగా ఆయుధాలను తీసుకుని ఆయనే ముందు నడచి గుహ వెలుపల దాకా వచ్చి శంఖం పూరించాడు. యోధులు సింహగర్జనలు చేసారు. ఆ నాదాలకు దశదిశలు మారుమ్రోగాయి. దేవ, ముని గణాలన్నీ అంబర చుంబిత గిరిశిఖరాలే ఆసనాలుగా చేసుకుని ఆసీనులై ఉత్కంఠతో చూస్తున్నారు. రణభేరులు మ్రోగించారు. కేసరి ఒక్కసారి గాలిలోకి చెయ్యియెత్తి అన్నీ ఆపమని సంజ్ఞ చేసాడు. తక్షణం నిశ్శబ్దం ఆవురించింది. కొండ గుహలోంచి బండరాళ్ళు రెండు ఎగిరి పడ్డాయి. సైనికులంతా ఒడుపుగా ప్రక్కలకు తప్పుకున్నారు. భీకర గర్జన వినపడింది. ఈ సారి వానరరాజు ఒక్కడే మళ్ళీ శంఖారావం చేసాడు.

"ఎవడురా వాడు. నా స్థావరానికి వచ్చి రణభేరి మ్రోగించి శంఖం పూరించాడు. ఈ శంబసాదుని ఎదిరించే ధైర్యం ఎవరికి వుంది" అంటూ మాటలు వినపడుతూనే పది అడుగుల ఎత్తు గల రాక్షసుడు బయటకు వచ్చాడు. తలపై రెండు తెల్లని కొమ్ములు; పెదాల చివర్న బైటకు వచ్చిన కోరలు, మెడలో కపాలహారం చింత నిప్పుల్లాంటి నేత్రాలు, పెద్ద పెద్ద మీసాలు గల శంబసాదుడు ఒక్కొక్క అంగ వేస్తుంటే బండరాళ్ళ మార్గమై నేల అదురుతోంది. అతను తిన్నగా కేసరి రథం ముందు నిలబడి సింహనాదం చేయసాగాడు. వానరరాజు మందహాసం చేసి శంఖం రథంలో వుంచి రెండు పిడికిళు బిగించి, ధీరుని వలె స్థిరంగా నిలబడి వాడి కన్నులలోకి చూసాడు.

"ఎవరురా నువ్వు ! నాతో నీకేమి వైరంలేదే? నా అనుమతి లేకుండా నాప్రదేశంలోనికి ఎందుకింత పరివారంతో వచ్చావు" అని ప్రశ్నించాడు.

"వీరు సుపర్ణగిరి ప్రాంతాన్ని పాలించే వానరరాజు కేసరి. నీతో ద్వంద్వ యుద్ధానికి వచ్చారు. వీర ధర్మం పాటించి యుద్ధానికి సిద్ధంకా...." అన్నాడు సర్వ సైన్యాధ్యక్షుడు రాక్షసునితో.

"కోతులతో కయ్యమేమిటి. నాతో నిష్కారణ వైరం తెచ్చుకొని సర్వనాశనం కావద్దు. చాలా ప్రయాసపడి వచ్చినందుకు నా వనాల నిండా పక్వఫలాలున్నాయి. కావలిస్తే తిని వచ్చిన దారినే వెనక్కు పొండి. చేతులు తీటగావుంటే చెట్లెక్కి గంతులేసుకోండి, పొండి" అని అరిచి తన గుహ వైపు మరలిపోతున్నాడు.

"రాక్షసాధమా నిలు! తిండి కావలిస్తే, నీకు కావలసినన్ని మృగాలు నా అడవుల్లో వున్నాయి, వచ్చి తినిపో, అంతేగాని ధర్మం తప్పి ప్రవర్తించకు. నువ్వు మునుల క్రతువులు పాడు చేస్తున్నావు. నీ అనుచరులతో వారి కుటుంబాలను మట్టుబెట్టిస్తున్నావు".

"ఆ సన్యాసులంతా మీ కోతులను శరణు వేడేరా! సరిసరి! వానరాధమా నువ్వా నన్ను ప్రశ్నించేది? నాకు కోపం రాకముందే వెళ్ళిపో. పోరుకు, పెండ్లికి సమ ఉజ్జీవుండాలంటారు. నీతో తలపడితే నా పరువేం కావాలి. దేవతలనే గడగడ లాడిస్తున్నాను. నీతో తలపడి తలవంపులు తెచ్చుకోలేను. వెళ్ళు వెళ్ళు".

"ఆ... అది తెలిసే నీ మదమణచడానికి వచ్చాను యికనుండి దేవతలను, ఋషులను శ్రీహరిభక్తులను బాధించడం మానుకుంటావని నాకు ప్రమాణం చేసి ప్రాణం దక్కించుకో".

శంబసాదుడు వికృతంగా నవ్వాడు. దేవతల మాట దేవుడెరుగు, ముందు నీ ప్రాణం దక్కించుకో అంటూ ఒక పెద్ద బండరాతిని విసిరాడు. కేసరి తన పిడికిలిని దృఢంగా బిగించి చేతిని దూరంగా చాపి పైకెత్తాడు. ఆ రాయి ఆయన పిడికిలికి తగిలి ముక్కలై నాలుగు మూలలా పడింది. వెంటనే తన గదను అందుకుని రథం మీద నుండి మైదాన ప్రదేశంలోనికి దుమికాడు. శంబసాదుడు ఎండిన రక్తపు మరకలు, మాంసఖండాలు అంటుకున్న తన యినుప ముళ్ళ గద తీసుకుని ఒక్క దుముకు దుమికి వానరరాజుతో తలపడ్డాడు. రణం ప్రారంభమైంది. ఖణేల్ ఖణేల్ మనే శబ్దాలతో వీరుల ఆస్ఫోటనలతో ఒక పూటంతా గదా యుద్ధమే జరిగింది. సూర్యుడు పశ్చిమ గిరిశిఖరాల వైపు క్రిందికి దిగుతున్నాడు. పశువుల మందల్ని తోలుకుని కాపరులు యింటిముఖం పట్టారు. 'నిశాచరులకు రాత్రి బలం ఎక్కువవుతుంది. సూర్యాస్తమయంలోగా వీడిని కడతేర్చాలి' అనుకుని రెండు చేతులతో గదను దృఢంగా పట్టుకుని వాడి శిరస్సుపై మోదాడు, కాని వాడు తప్పించుకోవడం వల్ల భుజం మీద తగిలింది దెబ్బ. రక్తం చివ్వున చిమ్మింది. అయినా లక్ష్య పెట్టకుండా కేసరి తొడలకు గురిచేసి తన గదను విసిరాడు. సహజంగా కపిజాతివాడు కావున

పైకెగిరి వటవృక్షాన్ని పట్టుకున్నాడు కేసరి. ఒక భటునికి తగిలి అతను హతుడైనాడు. వానరరాజుకు మితిమీరిన కోపం వచ్చింది. మైదానంలోకి దూకాడు. రాక్షసుడు చేతులతో ముష్టియుద్ధం ప్రారంభించాడు. యిరువురూ చేతులు పట్టుకుని బలాబలాలు చూపించుకుంటూ వలయంలా తిరిగారు. వారి పదఘట్టనలకు ధూళిరేగి మేఘమండలం వరకు వ్యాపిస్తోంది. కేసరి ఒడుపుగా వాడి నడుము పట్టుకుని పైకెత్తి గిరగిరా తిప్పి విసిరేసాడు. పదిగజాల దూరంలో పడ్డ వాడి గదకు, వాడి శిరస్సే తగిలి; వక్కలై ఆర్తనాదం చేస్తూ, రక్తం కక్కుకుని; నేత్రాలు రాలి పడగా; భీకరంగా అరిచి చనిపోయాడు శంబసాదుడు. ఎప్పుడైతే రాక్షసనాయకుడు మరణించాడో అప్పుడే మిగిలిన రాక్షస పరివారాన్ని, కపిసేన, గుహలు కొండలు, వెతికి దొరికిన వారినల్లా తుదముట్టిస్తున్నారు. చాలామంది కపిసేనానాయకుని ముందు లొంగిపోయారు. కేసరి తన రథాన్ని విశాలమైన రాక్షససేన వంక పోనిచ్చాడు. వారంతా బారులు తీరి నిలబడి, తలలు వంచి, చేతులు జోడించి –

"వానరరాజా కేసరి ! మమ్మల్ని కాపాడండి" అని వేడుకున్నారు.

"శరణార్థులపై కత్తిదూసే కఠినుడ్ని కానునేను. మీ రాక్షసులంతా యికపై మునులకు, మానవులకు, కపులకు హాని చెయ్యవద్దు. అరణ్యాలలో వుంటూ వన్య మృగాలను తిని బ్రతకండి. మీరాజుకు కపులపై చిన్నచూపు వుంది. అతని దృష్టిలో నరవానరులు అల్పులని చులకనభావం. భావితరాలలో మేమే ధర్మ స్థాపన చేస్తాము. వెళ్ళండి ధర్మబద్ధంగా జీవించండి" అని హెచ్చరించి వదిలివేసాడు. వారంతా బ్రతుకుజీవుడా అని కొండల్లోకి; గుహలలోకి వెళ్ళిపోయారు. దేవతలు, మునులు ముందుకు వచ్చి కపిరాజుకు ముత్యాలహారాలు, వజ్రమాలలు వేసి సత్కరించాడు. వరుణుడు ఒక దివ్య ఖడ్గాన్ని బహుకరించాడు. వారందరి మధ్యలో నుండి మరొక వానరవీరుడు ముందుకు వచ్చాడు. ఆయన కేసరిని గాఢాలింగనం చేసుకుని –

"నాయనా! నేను కుంజరుడనే వానరరాజును, నీ శౌర్యప్రతాపాల గురించి గూఢచారుల వలన గతంలో విన్నాను. ఈ రోజు స్వయంగా చూచాను. కడు సమర్థుడవు, శక్తిశాలివి. ధర్మపరుడవు. మన వానరకులానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చావు. ఆయుష్మంతడవై వర్ధిల్లు" అని తన మెడలోని కెంపులహారం తీసి కేసరి మెడలో వేసాడు. తనను దీవించ వచ్చిన దేవతలకు, మునులకు, కుంజరునికి పాదాభివందనాలు చేసాడు కేసరి.

ఒక వృద్ధ తపస్సంపన్నుడు ముందుకు వచ్చి –

"నాయనా! నీ వీరత్వానికి సార్థకత యేర్పడింది. సాధుసంరక్షణతో శ్రీహరి అంతటి ఘనత వహించు. యుక్త వయస్సులో వున్నావు. శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు.

శుభమస్తు." అని దీవించాడు. సూర్యాస్తమయమైంది. దేవతలు మునులు అదృశ్యులయ్యారు.

14. అంజనా కేసరుల కమనీయ కళ్యాణము :



"మార్గం బాగోలేదు. యిప్పుడే పరివారమంతా ప్రయాణం చేయటం కష్టం. యిక్కడే గుడారాలు యేర్పాటు చేసి ఈ రాత్రికి విశ్రమించి రేపు ఉదయాన్నే బయలు దేరుదాము" అన్నాడు కేసరి సేనానులతో, వారంతా యెదో చెప్పటానికి సందేహిస్తున్నారు. చివరికి ఒక సచివుడు దగ్గరగా వచ్చి "మహారాజా! మనం బయలుదేరే హడావిడిలో ఆహార శకటాలు తీసుకురావటం...."

"మర్చిపోయారు...." అన్నాడు కేసరి.

"చిత్తం...." అని మౌనం వహించారంతా. ఈ సంభాషణ అంతా కుంజరుడు విన్నాడు.

"విచారించకు కపిరాజా! యిక్కడికి సమీపంలోనే మా రాజ్యం వుంది. అక్కడికి వెళ్ళే రహదారి కూడా ఈ మధ్యనే వేయించాను. అదిగో ఆ కనిపించే కొండ వద్ద మలుపు తిరిగితే మా పొలిమేరలు వచ్చేస్తాయి. నేను మిమ్మల్నందర్ని నా రాజ్యానికి ఆహ్వానించడానికే వచ్చాను. నేను వచ్చేసరికి శంబసాదునితో తీవ్రంగా పోరుడుతున్నావు. దేవతలతో పాటు మీ యుద్ధం చూస్తూ వుండిపోయాను".

"ఆర్యా! మీ కెందుకు శ్రమ. ఈ అడవిలో ఆకులు, అలమలు తిని వుంటారు లెండి".

"ధర్మవీరుడవు. సాటి వానరరాజువు. నీకంటె వయసులో పెద్ద వాడిని. నా ఆహ్వానం మన్నించి రావటం నీకు శుభం చేకూరుస్తుంది".

కేసిరి మందహాసం చేసి "నేను నా ప్రధాన పరివారం వస్తాము".

"అలా కుదరదు. నిత్యాన్నదానం చేయటంలో మా వంట వారికి మంచి పేరుంది. మీ అందర్ని ఆదరించటం నాకొక సమస్య కాదు. బయలు దేరండి".

"సరే వదండి" అన్నాడు కేసరి. రథాలన్ని కుంజరుని రాజ్యం వైపు పరుగుతీసాయి. ఆ రాత్రికి మంచి పక్వాన్నాలు, పిండివంటలు, బూరెలు, గారెలు, పులిహోర, పండిన ఫలాలు, పట్టుతేనె, రకరకాల కూరలు, పచ్చళ్ళు అన్నీ సిద్ధం చేసి వండి వడ్డించారు. కేసరి పరివారమంతా సుష్ఠుగా భోజనాలు చేసి చక్కని కుటీరాల్లో ఆరామాల్లో విశ్రమించారు. కుంజరుడు కేసరికి అతని ముఖ్యసచివులు, సేనానులకు వేరే భవనం కేటాయించాడు. ఆ రాత్రి ప్రొద్దు పోయేవరకు కుంజరుడు కేసరి యొక్క

మంత్రులతో సమాలోచనలు చేసాడు. వారంతా తమరాజుకు కుంజరునికి మధ్య వియ్యం కుదిరితే బాగుంటుందని యోచించారు. అయితే కేసరి రాకుమార్తె అంజనను వివాహం చేసుకోవడాన్కి అంగీకారం తెలుపవలసి వుంది.

తూర్పున తెల్లవారింది. కేసరి ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకొని పరివారంతో శివాలయానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో అంతఃపురం రాణి వాస భవనాలు ఉన్నాయి. ఒక సుందరాంగి మేడపై నిలబడి ఉషోదయంలో ఆహ్లాదంగా పచార్లు చేస్తున్నది. ఆమె చుట్టూ సేవికలు చేరి కబుర్లు చెపుతున్నారు. క్రిందుగా రాజవీధిని వెడుతున్న కేసరి ఆమెను చూసి ముగ్ధుడయ్యాడు. ప్రక్కనున్న సేనానితో "ఎవరీ లోకోత్తర సౌందర్యవతి"

"రాజా ! ఆమె కుంజరుని పెంపుడు కుమార్తె అంజన. అనపత్యుడైన కుంజరుడు శివుని ప్రార్థించడం వలన, ఆ పరమాత్మ అనుగ్రహం కలిగి, గౌతమముని ఈమెను పెంపకానికి యిచ్చినట్లు ఆయనే రాత్రి మాకు చెప్పారు".

"వివాహం అయిందా?"

"లేదు రాజా! ఆమెను తమకిచ్చి కళ్యాణం జరిపిద్దామని కుంజరుని వాంఛ. బహుశా ఈ రోజు భోజనాలయ్యేక; శుభ ఘడియలు చూసుకుని తమకు కన్యను చూపిద్దామనుకుంటున్నారు".

"ఈలోగానే రాజావారి పెళ్ళిచూపులయిపోయాయి. ఈ రోజు తిధివారనక్షత్రాలన్నీ మంగళప్రదంగా వున్నాయి. తమరు అంగీకరిస్తే యింక ఏకంగా వివాహం చేసుకునే వెళ్ళవచ్చు" అని మరొక సచివుడు ఉన్న విషయం బయట పెట్టేశాడు.

"సరే! మన ఆస్థానజ్యోతిష్కునికై కబురు పెట్టండి. మా యిరువురి జాతక చక్రములు పరిశీలించమనండి".

"చిత్తం ప్రభూ! యిపుడే వర్తమానం పంపిస్తాను".

"ముందు శివదర్శనం చేసుకుందాం పదండి".

"రాజావారికి ఈ రోజు శివదర్శనం కంటె ముందే కన్యా దర్శనమైంది" అని ఓ మంత్రి చమత్కరించాడు. రాజు మందహాసం చేసాడు. అంతా సౌమ్యంగా నవ్వారు. ఆ రోజు సాయంత్రానికి సుపర్వగిరి నుండి దైవజ్ఞులు వచ్చారు. యిరువురి నక్షత్రాలు, రాశులు పరిశీలించారు. వెంటనే శుభఘడియల్లో అంజనను రాజుకు చూపించి మూడురోజుల్లో మంచి ముహూర్తం చూసి వివాహం నిశ్చయించారు. యిక కుంజరుని ఆనందానికి అవధులు లేవు. ఉమాదేవి కృపవలన పిల్లలులేని తనకు కన్యాదానం చేసే భాగ్యం కలిగింది. ఏర్పాట్లన్నీ శీఘ్రంగా జరిగాయి. సుపర్వగిరి నుండి రావలసిన

బంధుమిత్రులు ప్రజలు తరలి వచ్చారు. కుంజరుని పరివారం, ప్రజలు, అంతా కష్టపడి పని చేసి వివాహం కడు వైభవంగా జరిపించారు. రణానికి బయలు దేరిన కేసరికి రమణీలలామ అంజనతో పాణిగ్రహణం జరిగింది. కుంజరుడు తన పరివారంతో బయలుదేరి వెళ్ళి అంజనను అల్లునింట అప్పజెప్పి వారి సత్కారాలు పొంది సందడిగా తిరిగి వచ్చాడు.

అంజనాకేసరుల సంసారం సుఖంగా సాగి పోతోంది. కపిరాజు అంజనాదేవిని తన రాజ్యానికి రాణిని, హృదయసామ్రాజ్యానికి పట్టమహిషిని చేసుకుని ప్రజానురంజకంగా పాలిస్తున్నాడు. చాలా సంవత్సరాలు గడిచాయి. వారికి సంతానం కలుగలేదు. కేసరి తన అస్థానవైద్యులను, జ్యోతిష పండితులను పెద్దలను సంప్రదించాడు. వైద్యులు శరీర రుగ్మతలు తొలగడానికి ఔషధాలు యిచ్చారు. దైవజ్ఞులు అంజనాదేవికి పంచాక్షరి మంత్ర జపం సూచించారు. వారిచ్చిన సలహాలన్ని దంపతులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు.

ప్రతిరోజు అంజనాదేవి సకల దేవతారాధనలు చేస్తున్నది. దంపతులిద్దరు శివనామస్మరణ చేస్తున్నారు. వానరరాజు రాజ్యవ్యవహారాలతో ఎంత తలమున్కలై వున్నా వీలు చిక్కినపుడల్లా అంజనాదేవిని వినోదాలకు విహారాలకు తీసుకువెడుతున్నాడు. రాజమందిరంలో ఆమెను సంతృప్తి పరచడానికి చుట్టు ప్రక్కల కళాకారులు వచ్చి నృత్య గాన వాద్య కచ్చేరీలతో అలరిస్తున్నారు. ఉద్యానవనాల్లో యిద్దరూ ఏకాంతంగా విహరిస్తున్నారు. కొండలు, జలపాతాలు పచ్చిక బయళ్ళు, లోయలలో విహరిస్తున్నారు. వానరులు పెంచుతున్న అరటి, మామిడి, నిమ్మ, నారింజ, పనస నేరేడు మొదలైన తోటలలో తిరుగుతూ కబుర్లు చెప్పుకుంటూ ఫలాలారగిస్తున్నారు. కేసరి పూలుకోసి ఆమె శిగనలంకరిస్తున్నాడు. ద్రాక్ష గుత్తులు, దానిమ్మ పండ్లు నడుస్తూ తింటున్నారు. పనసకాయను ఒక్క గుద్దుతో బ్రద్దలుకొట్టి తొనలు తీసి దేవేరి చేత తినిపిస్తున్నాడు. భర్త అనురాగంతో ఆమె పులకించిపోతోంది. అయితే సంతానం లేదనే తలంపు వస్తే అదిమాత్రం మధ్య మధ్య యిద్దరిని చింతింప జేస్తోంది.

ఉమామహేశ్వరులకు వీరి ప్రార్థనలు రోజూ వినిపిస్తున్నాయి. పార్వతీదేవి నాధునితో -

"ప్రాణనాధా ! ఆ నాడు దేవతల కోరిక మేరకు మీరు, బ్రహ్మదేవులు బదరికాశ్రమంలో వున్న నారాయణుని కలసినపుడు సర్వదేవతల యొక్క తేజస్సును ఒక చోట నిక్షిప్తం చేసారు".

"ఔను. గుర్తుంది. "తరువాత మనం వానరరూపంలో వెంకటాచలం మీద సంచరించాము అదీ గుర్తుంది" అని ఆదిశంకరులు అనగానే ఆమె బుగ్గలు సిగ్గుతో

ఎత్తబడ్డాయి. కొన్ని క్షణాలాగి ఆమె –

"మీ పరిహాసం చాలుగాని ఆ శక్తి యిప్పటికీ అలాగే వుందా".!

"మన ప్రణయసంచారం తరువాత నీ గర్భంలోవున్న శక్తిని వెయ్యి సంవత్సరాలు భరించి, యిక తాళలేక అరణ్యంలో రగులుతున్న బడబాగ్నిలో వదలివేసావు. ఆ విషయం నీకు గుర్తుందా".

"గుర్తుంది. మీ కిప్పటి వరకు చెప్పక పోవటం కేవలం సిగ్గుపడి మాత్రమే సుమండి"!

"ఆ విషయం నేను గ్రహించే ఆ ప్రస్తావన తేలేదు. సరే. తరువాత అగ్నిదేవుడు దానిని భరించ లేక వాయువుకు అప్పగించాడు".

"నిత్యం మనల్ని ప్రార్థిస్తూ సంతానం కోసం విచారిస్తున్న కపిదంపతులు కేసరిఅంజనలకిస్తే...."

"లెస్స యోచన! పరమేశ్వరుని భార్యవే కాకుండా జగన్మాతవుగా కూడా పూజింపబడుతున్నావు అందుకే! ఆ వానరదంపతులను అనుగ్రహించమని వాయుదేవుని యిప్పుడే ఆజ్ఞాపిస్తాను" అని ఒక్కసారి కనులు మూసుకుని తెరిచారు శంకరులు. వాయుదేవుడు చేతులు జోడించి.


"ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరులకు వాయువు ప్రణామములు. నన్ను పిలిచిన కారణం తెలిపి ధన్యుణ్ణి చెయ్యండి ప్రభూ".

"సమీరా ! నీలో నిక్షిప్తమైవున్న సర్వదేవతల ఓజోసారఫలాన్ని వానరరాజ పత్ని అంజనాదేవికి తక్షణం అనుగ్రహించు. లోకకళ్యాణకారకుడు జన్మిస్తాడు".

"చిత్తం ప్రభూ ! సత్వరం ఆ పని నెఱవేరుస్తాను. మరి శలవియ్యండి" అని ఆయన అదృశ్యుడయ్యాడు.



15. శ్రీ ఆంజనేయ స్వామి వారి శుభజననము



ఒక రోజు రాజకార్యాలన్ని ముగించుకుని సాయంత్రం భార్య అంజనతో వాహ్యాళికి బయలుదేరాడు కేసరి. కొంతదూరం రథం మీద దిగబెట్టి సారథి అక్కడే వుండిపోగా భార్యాభర్తలిద్దరూ మందగమనంతో నడిచి వెడుతున్నారు. గాలి ఒకసారి విసురుగా వచ్చి ఆమె పైటకొంగు ఎగిసింది. ఆమె సర్దుకొంది. కేసరి ఆమె వంక లాలనగా చూస్తున్నాడు. యింతలో ఒక చెట్టుపండు రాలి ఆమె ముందుపడగా రాజుతీసి ఆమె కిచ్చాడు.

"మీరు తినండి" అన్నది అంజన.

"కాదు నువ్వే తినాలి. అది నీ దగ్గర పడింది".

"లేదు ముందు మీరు తీసుకున్నారు. మీరేతినండి".

"పోనీ చెరి సగం తిందాము" అని కేసరి జామపండును తన హస్తాల మధ్య వుంచి రెండుగా చెయ్యబోయాడు. వాయుదేవుడు అదృశ్యంగా అక్కడే వున్నాడు. శివాజ్ఞ నెఱవేరాలని కంగారు పడుతూ వారి ఎదుట ప్రత్యక్షమై -

"వానరరాజా! కేసరీ!! నీ భార్య ముందు పండిన జామపండు వేసినది నేను, వాయుదేవుణ్ణి! మీరు సంతానం లేక చింతిస్తున్నారని శివదేవులు నాకు చెప్పారు. వారి ఆజ్ఞానుసారం సర్వదేవతల శక్తిని నిక్షిప్తం చేసిన పండును నీ భార్యకు కానుకగా యిస్తున్నాను. దానిని ఆమె మాత్రమే భక్షించాలి. మీకు శుభం జరుగుతుంది. పుత్రప్రాప్తిరస్తు" అని వారిని ఆశీర్వదించి అదృశ్యమైనాడు. దంపతుల ఆనందం మిన్ను ముట్టింది. వెంటనే ఆ పండు ఆమె ఆరగించింది. తమ పూజలు ఫలించినందుకు రాజదంపతులు సంతోషంగా వుంటున్నారు. ఆమె గర్భవతి అయిందని రాజవైద్యులు ప్రకటించారు. దైవజ్ఞులు వచ్చి వీర్యవంతుడు, తేజశ్శాలి, భాగవతోత్తముడు అయిన కుమారుడు పుట్టబోతున్నాడని తెలియజేసి దంపతులను ఆశీర్వదించి వెళ్ళారు. రాజు పండితులకు ప్రజలకు ధనకనకవస్తువస్త్రదానాదులను దండిగా చేస్తున్నాడు.

అంతఃపురమంతా నూత్న శోభ విరాజిల్లుతోంది. పరిచారికలు, కుంజరుడు పంపగా వచ్చిన అంజన నెచ్చెలులు ఆమెకు పర్యంకం దిగకుండా సపర్యలు చేస్తున్నారు. నెలలు నిండాయి. అంజనాదేవికి గర్భంలో శిశువు కదలికలు స్పష్టంగా తెలుస్తున్నాయి. వైద్యులు నాడీ పరిక్ష చేసి సుఖప్రసనం అవుతుందని అనారోగ్య సమస్యలు వుండవని రాజుకు ధైర్యం చెప్పారు. కపికుమారుడు పుట్టబోతున్నాడేమో కదలకుండా వుండదాయె. రామదూత ఆవిర్భవించ బోతున్నాడేమో జగత్తంతా రమణీయంగా ప్రకృతి శోభతో కళకళలాడుతోంది. సీతాశోకవినాశకుడు పుట్ట బోతున్నాడేమో స్త్రీజనానికి ఈతి బాధలు లేవాయె. సౌమిత్రీప్రాణదాత పృధివికి రానున్నాడేమో ఆర్యావర్తమంతా శుభసూచనలు కనబడుతున్నాయి. శాఖామృగచక్రవర్తి ఉద్భవించబోతున్నాడేమో వనాలన్నీ విరబూసిన పుష్పాలతో మితిమీరి కాసిన ఫలాలతో కనువిందు చేస్తున్నాయి. రామభక్తి మాధుర్యాన్ని తను చవిచూచి యితరులకు ప్రబోధించే మహాత్ముడు జన్మించబోతున్నందుకు వనాలనిండా నిలువెత్తు తేనెపట్లు పట్టాయి. ప్రకృతి అంతా అంజనాతనయునికి స్వాగతం పలుకుతోంది. అంజనాదేవికి ప్రసవవేదన ప్రారంభమైంది.

శుభతరుణం రానే వచ్చింది. వైశాఖమాసం, కృష్ణపక్షం, దశమితిధి, శనివారం, పూర్వాభాద్ర నక్షత్రం, వైధృతినామ యోగం, మధ్యాహ్నం వేళ పండంటి మగ బిడ్డను

ప్రసవించింది రాణి. వానరరాజదంపతులకు వానరకిశోరం పుట్టాడు. జ్యోతిష పండితులు జాతకచక్రం లిఖించి మంచి యశోవంతుడు, బలశాలి, సర్వ విద్యావిశారదుడు, రామభక్తుడు, త్రిమూర్త్యాత్మకుడు అని యితని లక్షణాలు వర్ణించి చెప్పారు. రాజు వారికి చీనిచీనాంబరాలు రత్నాలరాశులు కానుకగా యిచ్చాడు. కుంజరుడు తన రాణులతో వచ్చి మనవడిని చూసి పొంగిపోయాడు. అనేక స్వర్ణాభరణాలు బాలునికి చేయించి తెచ్చారాయన. చాలకాలం క్రితం రాక్షసుల బాధలు పడలేక తామంతా కలసి శ్రీహరికి మొరపెట్టుకోగా ఆయన చేసిన ప్రయత్నం యిప్పుడు అంకురించిందని దేవతలు మహదానందం పొందుతున్నారు. దశకంఠ దమనకాండకు సహకరించే ఒక వానర వీరుడు పుట్టిన శుభతరుణం వారికి శాంతి నిచ్చింది.



వైశాఖే మాసి కృష్ణాయాం
దశమీ మంద సంయుతా!
పూర్వాభాద్రా కుంభ రాశౌ.
మధ్యాహ్నే కర్కటాంశకే!

మారుతి జననం గురించి పై శ్లోకం విపులీకరిస్తుంది.


కౌండిన్య వంశే సంజాతో
హనుమ నంజనోద్భవః -

శ్రీ ఆంజనేయస్వామి వారిది కౌండిన్య గోత్రము. అని శాస్త్రాలు చెపుతున్నాయి. శివపరమాత్మకు గల అష్టమూర్తులతో వాయుదేవుడు ఒకరు. రుద్ర తేజస్సు యితర దేవతల అంశలను తనలో మిళితం చేసుకుని పార్వతీమాతలో నిక్షిప్తమై ఆమె ద్వారా అగ్నికి అప్పగించబడి, సర్వ వస్తువులను దహింపజేసే అగ్నిదేవుడు కూడా శివతేజస్సును భరించజాలక, ఆయన వాయుదేవున కియ్యగా; ఆ వాయుదేవులు శివాజ్ఞ మేరకు అంజనాదేవి గర్భాన ప్రవేశపెట్టగా, ఆమె క్షేత్రమై, శివతేజోబీజం ఫలించింది. ఆయనే ఆంజనేయస్వామి వారు. అదే ***శివాంజనేయము.*** అందువలన ఈయనలో బ్రహ్మవిష్ణుమహేశ్వరుల అంశలు, యితర దేవతల అంశలు కూడా వున్నాయి. అందుకే ఆయన -

దుష్టానాం శిక్షణార్థాయ
శిష్టానాం రక్షణాయ చ!
రామ కార్యార్థ సిద్ధ్యర్థం
జాతః శ్రీ హనుమాన్ శివః!!

సత్పురుషులను కాపాడటానికి, అధర్మవర్తనులైన దుష్టులను శిక్షించడానికిని,

శ్రీరామచంద్రునిగా అవతరించనున్న శ్రీమహావిష్ణువుకు రాక్షస సంహారంలో సహాయం చెయ్యడానికి సాక్షాత్తూ శంకరభగవానులే ఆంజనేయునిగా అవతరించినట్లు పరాశర సంహిత విశదీకరిస్తోంది. మారుతి జనన వృత్తాంతము, బాల్యక్రీడలు పద్మ, అగ్ని, నారద, స్కాంద, మార్కండేయ పురాణములలో వున్నాయి. అగస్త్య, శౌనక, సుదర్శన, పరాశర సంహితలు, ఉత్తర రామాయణము కూడా సమీరపుత్రుని ప్రతిభను వర్ణిస్తున్నాయి.



16. బాలాంజనేయుని పరాక్రమము



ఎఱ్ఱని ముఖం, బలిష్టమైన చిరుకండరాలు, పొడవైన తోక, బాదం డిప్పల వంటి చెవులు, ప్రకాశించే కళ్ళు, వంటినిండా బంగరు వన్నె బొచ్చుతో బాలాంజనేయస్వామి తల్లి వడిని వదలి అంతఃపురాల్లో నడక ప్రారంభించాడు. రాజుగారి కార్యాచరణ మందిరం, సచివుల సమావేశ మందిరాలు ఒకటేమిటి ఆయన బుడిబుడి నడకలు వేస్తూ వెడుతుంటే స్వాగతించి ఎత్తుకుని ముద్దాడి అంతా లోపలికి తీసుకు వెళ్ళి పాలు, పళ్ళు, యిచ్చి గారాబం చేసే వారే! వానర రాజకుమారుడు, రాజదంపతులకు లేక లేక పుట్టిన బిడ్డాయె! ఎవరడ్డగిస్తారు అతనిని.

పరిచారికలు అందించే ద్రాక్షపళ్ళన్నీ అమాంతం గుత్తులుగానే మింగేస్తున్నాడు. బుట్టల కొద్దీ మామిడి పళ్ళు రైతులు తెచ్చియిస్తుంటే మర్నాటికి గుటకాయ స్వాహా చేస్తున్నాడు. రాశిగా పోసిన పనసపళ్ళు స్నేహితులతో కలసి తినేస్తున్నాడు. ఇరుగుపొరుగు పిల్లలంతా బాలకపిరాజు చుట్టూ చేరటం మొదలు పెట్టారు. మహా బలవంతులైన కండలు తిరిగిన యిద్దరు వస్తాదుల్ని బాలుని ఎత్తుకోవడాన్కి పురమాయించాడు రాజు. వాళ్ళ భుజాలపై ఎక్కి పిడిగుద్దులు గుద్దుతూ వారి వళ్ళు హూనం చేస్తున్నాడు. ఎదిగే కొద్దీ అతని అల్లరి పెరిగిపోతోంది. యిక యింటి పట్టున వుండటం తగ్గించి రాజవీధులు, సందులు, తోటలు తిరగటం మొదలు పెట్టాడు. చిన్నాచితక పిల్లలంతా చేరి కనిపించిన పండ్ల చెట్లు, పూల మొక్కలు పీకిపారవేయటం పళ్ళు సగం సగం తిని పారవేయటం, వస్తాదులకు దొరకకుండా పారిపోవటం చేస్తున్నారు. బాలకపిరాజు ఎక్కడికి వెళ్ళినా ఎవరో ఒకరు బుజ్జగించి అంతఃపురానికి తెచ్చి అంజనాదేవికి అప్పజెపుతున్నారు. అంతఃపుర స్త్రీలు కట్టిన దండలన్నీ తనే వేసుకుని తిరుగుతున్నాడు. బుట్టలకొద్ది శివపూజకు తెచ్చిన చామంతులు, సంపెంగలు, మారేడు దళాలు, తనే ఒక చోట కూర్చుని నెత్తిన పోసుకుని మందిరాల్లో విరజిమ్ముతూ అల్లరి చేస్తుంటే రాజదంపతులు మురిసి పోవటం మినహాయించి యేమీ అనటం లేదు.

ఒక్కొక్కసారి పూలు తెస్తున్న తోటమాలి మీదే అవి గుమ్మరించి వాడి నెత్తిన ఎక్కి గుద్దులు గుద్ది కేరింతలు కొడుతున్నాడు కపికుమారరత్నం. ఒక్కొక్కరోజు రాజోద్యోగుల పిల్లలను వెంటవేసుకుని తోటలు, మునిపల్లెలు తిరిగి సూర్యాస్తమయ సమయానికి యింటిముఖం పడుతుంటే బిడ్డ యింటికి వచ్చాక స్నానం చేయించి దుస్తులు మార్చి, సాంబ్రాణి వేసి, దృష్టి తీసి రాణిగారికి అప్పగిస్తున్నారు అంతఃపుర దాసులు.



17. బాలభానునితో బాలాంజనేయస్వామి



తూర్పుదిక్కున ఉదయాద్రిపై సూర్యబింబం ఎఱ్ఱ గుమ్మడి పండులా కనిపిస్తోంది. పక్షులు బారులు తీరి మింట నెగురుతున్నాయి. ప్రకృతి అంతా ప్రశాంతంగా వుంది. చెట్ల కొమ్మల సందుల్లోంచి సూర్యకిరణాలు ప్రసరితమై చీకటిని తరిమికొడుతున్నాయి. మంచుబిందువులు వికసించిన మందారాలపై వడి ఎఱ్ఱరంగు సంతరించుకుంటున్నాయి. సంగీతవిద్వాంసులు దూరంగా కోవెలలో సన్నాయి పాటలు శ్రావ్యంగా ఆలపిస్తున్నారు. విప్రుల వేదమంత్రాలు సృష్టిని శబ్దతరంగాలతో పవిత్రీభూతం చేస్తున్నాయి. తటాకాలలోని పద్మాలు వికసించి శివపూజకు మేము సిద్ధం అంటున్నాయి. పాలేర్లు గోశాలలకు వెళ్ళి గోవులకు మేత వేసి పాలు తీస్తున్నారు. గృహిణులు భర్తల కంటె ముందే లేచి కాలకృత్యాలు పూర్తి చేసుకుని ముంగిళ్ళు వూడ్చి కల్లాపి జల్లి రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. అంతఃపురాంగనలు లేచి విధులు నిర్వహిస్తున్నారు. ప్రధాన రాజమందిరం, మహారాజు, రాణి శయనించే గది నుండి ముందే లేచి వచ్చిన బాలాంజనేయులు మెట్లన్నీ ఎక్కి సౌధాగ్రంలో నిలబడి ప్రకృతిని వీక్షిస్తూ ఎఱ్ఱ నారింజలా కనిపించే బాలభానుని వంక తదేక దృష్టితో కన్నార్పకుండా చూస్తున్నాడు. ఆరోజు సూర్యగ్రహణం కూడా కావటంతో చుట్టు ప్రక్కల గ్రామాలలోని విప్రులంతా నదీస్నానాలు చేస్తున్నారు. అడవిమృగాలకు, పక్షులకు గ్రహణం ముందే పసిగట్టగల శక్తి వుంది. అందువల్ల రోజూకంటె వాటి ప్రవర్తన భిన్నంగా వుంది.

సూర్యబింబాన్ని వీక్షిస్తున్న కపికిశోరానికి కడుపులో ఆకలిగా అనిపించింది. క్రిందికి వెళ్ళి ఫలశాలలు తిరిగి ఆకలి తీర్చుకుందామనిపించింది. కాని ఎందుకు? ఎదురుగా ఒక పెద్ద పండుకనిపిస్తోందికదా! నేను బాగా ఎత్తులోనే వున్నాను మరికొంచె ఎగిరితే ఆకాశఫలాన్నే తెచ్చి స్నేహితులతో కలసి సుష్ఠుగా భోంచెయ్యొచ్చు' అనుకున్నాడు. ఈలోగా అంజనాదేవి లేచి ప్రక్కలో బాలుడు లేక పోవటం చూచి, పరిచారికలు తీసుకు వెళ్ళి వుంటారని భావించింది. ఆంజనేయుడు సౌధాగ్రంపై గోడ ఎక్కి నిలబడి ఆకాశం వంక చూస్తున్నట్లు కిందతిరుగుతున్న కాపలా భటులు చూచారు. కింద

నుండి అరవటం మొదలు పెట్టారు.

"కుమారరాజా! గోడ దిగండి. ఎందుకంత దూరం వెళ్ళారు కిందికి రండి, గోడ దిగండి, పడిపోతారు" అంటూ అరుస్తున్నా; వారి మాటలు లక్ష్యపెట్టటంలేదు. యిద్దరు సైనికులు గబగబా ఏడంస్తుల మేడ ఎక్కనారంభించారు.

"నన్ను పట్టుకోండి చూద్దాం" అంటూ ఒక్కసారి శక్తినంతా కూడగట్టుకుని మేఘమండలంలోకి లంఘించాడు. అతని పాదాల ఒత్తిడికి పిట్టగోడ కొంత భాగం విరిగి రాళ్ళు పహరా సైనికులపై పడ్డాయి. అమ్మబాబో కొంప మునిగింది అనుకుంటూ వారంతా మేడపైకి హడావిడిగా పరుగులెడుతున్నారు.

ఆంజనేయుడు అలా ఎగిరి ఎగిరి ఎంతో దూరం వెళ్ళిపోయాడు. భూమండలం గోళంలా కనిపిస్తోంది. ముందుకు వెళ్ళేకొద్దీ సూర్యతాపం ఎక్కువై వళ్ళంతా చెమటలు పట్టాయి. అయినా పట్టువదలకుండా యింకా పెద్దగా కనిపిస్తున్న సూర్యగోళం వైపే ప్రయాణిస్తున్నాడు. అంజనేయుని అంతరిక్షయానం వాయుదేవుడు గమనించాడు.

'నా కుమారుడు ఎందుకీ సాహసం చేస్తున్నాడు. అయినా అతని పరాక్రమం ఎంతటిదో గమనిద్దాం' అనుకుని సూర్యుని వేడి తగలకుండా అదృశ్యరూపంలో అతనిని వెంబడిస్తూ చల్లని వీవనలు వీస్తున్నాడు. అంతవేడి తట్టుకుని ముందుకు సాగుతున్న కపికిశోరానికి అకస్మాత్తుగా చల్లగాలులు వీచడంతో మరింత ఉల్లాసంగా ముందుకు సాగుతున్నాడు. సూర్యదేవుడు బాలకపిని అతనిని అనుసరించి వస్తున్న వాయుదేవుని చూచి తన దారుణమైన వేడిని వారివైపు పడకుండా తీక్షణత తగ్గించాడు. బాలాంజనేయులు తన రూపం పెంచి సూర్యగోళాన్ని మింగటానికి నోరుతెరిచి ముందుకు సాగుతున్నాడు. గ్రహణసమయం ఆసన్నమైంది. రాహువు సూర్యగోళాన్ని తన అధీనంలోనికి తీసుకోవడానికి సమీపిస్తున్నాడు. ఆశ్చర్యం. ఎన్నడూ కనీవినీ ఎరుగనిది. ఒక మహాబాలకపి తనకంటె ముందే సూర్యగోళాన్ని కబళించడానికి నోరు తెరిచి చేతులు బలంగా ముందుకు చాపుతూ వెడుతున్నాడు. అయితే దేవగణాధిపతి తనకు యిచ్చిన మాట ప్రకారం ఈ రోజు సూర్యుని గ్రహించవలసినది తను కదా! ఈ విషయం యింద్రునికి తెలియజేయాలి.

"నవగ్రహసంధానకర్తా! సర్వదేవగణాధిపతీ! దేవేంద్రా! త్రిమూర్తులు నిర్ణయించిన నియమానుసారంగా ఈ రోజు రవిబింబాన్ని కబళించడం నావంతు. కాని నా కంటె ముందుగా మరొక మహాకాయంగల బాలకపివీరుడు ఆ పని చేస్తున్నాడు. ఏమిటీ విడ్డూరం? విధాత నిర్ణయానికి నీ ఆధిపత్యానికి భంగం వాటిల్లుతోంది. శీఘ్రంగా సమస్య పరిష్కరించు దేవా!" అంటూ బిగ్గరగా అరిచే సరికి మహేంద్రుడు అతని మొర ఆలకించి ఐరావతం ఎక్కి బయలుదేరాడు. సూర్యబింబం మరీ వేడిగా వుండటంతో అలాంటిదే మరొకటి రాహువు, మరొక పండులా భావించి ఆంజనేయుడు

యినుప గుదియల్లాంటి తన భుజాలు చరుచుకొని ముందుకు వస్తూ రాహుగ్రహాన్ని పట్టుకోబోతున్నాడు. నక్షత్రాలు, నవగ్రహాలు, ఆకాశగమనం చేస్తున్న దేవతలు అంతా ఈ వింత చూస్తూ ఆశ్చర్యపోతున్నారు. ఎవరీ అసాధారణ కపికుమారుడు? రవిచంద్రులకే గ్రహణం పట్టించగల రాహువుకే గ్రహణం పట్టిస్తున్నాడు. ఏమి వింత? యిదంతా విధాతకు తెలిసే జరుగుతోందా! లేకమరో ప్రళయమే సంభవిస్తోందా అని ముక్కున వేలేసుకుని ఆశ్చర్యంగా వీక్షిస్తున్నారు. ఆంజనేయుడు తనకు మరీ దగ్గరకు వస్తుండటంతో మరొకసారి బిగ్గరగా అరిచాడు రాహువు.

శ్వేతకాంతులతో నభోమండల చీకట్లు పారదోలే, అలంకృత ఐరావతంపై వజ్రాయుధం, దివ్యఆభరణాలు, సూర్యతేజస్సుతో వెలిగే మణిరత్నఖచిత స్వర్ణకిరీటంతో పసుపురంగు పట్టుపంచె, ఎఱ్ఱని ఉత్తరీయం గంభీర వదనంతో ఇంద్రుడు ప్రత్యక్షమై కపిబాలుని వంక నివ్వెరపోయి చూస్తూండి పోయాడు. ఆంజనేయుడు రాహువు కంటె దగ్గరలో కొండంత వెన్నముద్దలా వున్న ఐరావతాన్ని పట్టుకోవడానికి యిటువైపు తిరిగాడు. ఇంద్రునికి ఆశ్చర్యం వేసింది. దేవతలంతా తన వైపే చూస్తున్నారు. ఎప్పుడైతే ఆంజనేయుడు కరములు సాచి మీదకు లంఘిస్తున్నాడో అప్పుడే ఐరావతం బెదిరిపోయి పరుగు పెట్టింది. పైనుండి ఇంద్రుడు అదుపుచేయలేకపోతున్నాడు. ఈ చిత్ర సంఘటన చూసి నవగ్రహాలు, తారలు, దేవతలు ఫక్కున నవ్వటంతో దేవరాజుకు అవమానంగా తోచింది. ఆగ్రహం వచ్చి వెంటనే ఆంజనేయునిపై వజ్రాయుధం ప్రయోగించాడు. అది ఆంజనేయుని ఎడమ దౌడపై బలంగా కొట్టడంతో అతను స్పృహ కోల్పోయి గిరగిరా తిరుగుతూ భూమి కక్ష్యలోకి ప్రవేశించి సువర్ణగిరికి కొంచెం దూరంగా వున్న కొండపై పడిపోయాడు. వాయుదేవుడు కపికుమారుడు తన బిడ్డ అని ఇంద్రునికి చెపుదామనుకునే లోపున రెప్పపాటులో ఈ సంఘటన జరిగిపోయింది. యింక దేవేంద్రునికి చెప్పుకుని యేమి ప్రయోజనం? ముందు బిడ్డను కాపాడుకోవాలి అని బాలుని వెంట వాయుదేవుడు బయలుదేరి కొండపై పడిన బాలుని ఎత్తుకుని భుజాన వేసుకుని సమీపంలో వున్న కొండ గుహలోనికి వెళ్ళిపోయి; తన గమనాన్ని స్థంభింపజేసి లోపలే బిడ్డకు సపర్యలు చేస్తున్నాడు. కపికుమారుని వడిలో పరుండబెట్టుకుని విషణ్ణవదనంతో కూర్చుని విచారిస్తున్నాడు. బాలుడెవరో తెలుసుకోగల శక్తి యింద్రదేవునకు వుందికదా! కనీసం పూర్వాపరాలు ఆలోచించకుండా పసివానిపై ప్రతాపం చూపిస్తాడా, అని మధన పడుతున్నాడు.



18. ఆంజనేయునకు "హనుమ" బిరుదు – దేవతల వరప్రదానము



ఎప్పుడైతే వాయుసంచారం వాయుదేవుని చేత స్థంభింప చేయబడిందో సృష్టిలోని జీవులన్నీ ఊపిరి తీసుకోవటం కష్టమై విలవిల్లాడుతున్నాయి. అడవి మృగాలు దిక్కుతోచక సొమ్మసిల్లి పడిపోతున్నాయి. మానవులు ఊపిరి అందని కారణం తెలియక హాహాకారాలు చేస్తున్నారు. భూమండలంలో ఎక్కడ అగ్ని వున్నా అది ఆరిపోతోంది. గృహిణులు వంట చేస్తూ ఇటు పొయ్యిలు ఆరిపోయి, అటు ఊపిరి సలపక ప్రాణసంకటంలో పడ్డారు. యజ్ఞ యాగాది క్రతువుల్లో ఎంత ఘృతంపోసినా ప్రజ్వరిల్లటం లేదు. ఆలయాలలోని నూనె దీపాలు, కాగడాలు, విప్రుల యిండ్లలోని నిత్యాగ్నిహోత్రాలు ఆరిపోయాయి. దేవేంద్రుడు, నభోమండలంలో కపికుమారుని చూస్తున్న సర్వదేవతలు ఈ హటాత్పరిణామం చూసి బెంబేలెత్తి పోయి బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి మొర పెట్టుకున్నారు. ఆయన పరిస్థితి గమనించి వెంటనే తను పూనుకొనక పోతే మహాదేవుని ప్రమేయం లేకుండానే మహాప్రళయం సంభవించి జీవరాశులన్నీ క్షణాల మీద మృతి చెందుతాయని గ్రహించి, లిప్తపాటు కాలంలో సర్వదేవతలను తీసుకుని వాయువు, ఆంజనేయునితో వున్న గుహ వద్దకు చేరుకున్నారు. దేవేంద్రుడు మొత్తం తప్పిదనమంతా తన మీద పడుతుందని కంగారు పడుతూ

బ్రహ్మదేవునితో –

"పరమేష్ఠీ! శీఘ్రంగా వాయుదేవుని పిలవండి. మరికొన్ని క్షణాలు ఆలస్యమైతే యముని ప్రమేయం, చిత్రగుప్తుని చిట్టాలు లేకుండానే జగత్తులయమై మీ మీద పునఃసృష్టి భారం పడుతుంది. శ్రీమన్నారాయణుడు మీపై ఆగ్రహిస్తారు. కర్మసిద్ధాంతం పుణ్యపాపఫలాల అనుభవం లేకుండానే కాలచక్రం తిరిగిపోతుంది". అని చేతులు జోడించి ప్రార్థించాడు.

"ఇంత విచక్షణా జ్ఞానం కలవాడవి తొందరి పడి వజ్రాయుధం ఎందుకు ప్రయోగించావు. ఆ బాలుడు ఎవరో ఎందుకలా చేస్తున్నాడో అని ముందే తెలుసుకుని వుండవలసింది. పిల్లలతో పాటు మనమూ తొందర పడతామా! నీకు యేం చెప్పినా ప్రయోజనం లేదు నువ్వు ధర్మ బద్ధంగా ప్రవర్తించి వుంటే వృషణ హీనుడివి ఎందుకవుతావు. మళ్ళీ దేవతలు మునులు కలిసి నీకు మేష వృషణాలు అతికించినా నీ తొందరపాటు పనులు మానుకోలేదు". అని బ్రహ్మదేవులు ఇంద్రుని సున్నితంగా మందలించారు. ఆయన తను గౌతమముని చేత పొందిన శాపం గుర్తించి మాట్లాడినారని

తెలుసుకుని సిగ్గుపడుతూ తల దించుకున్నాడు మహేంద్రుడు. బ్రహ్మదేవులు గుహాద్వారం వద్దకు వెళ్ళి –

"నాయనా! వాయుదేవా! గుహ నుండి వెలుపలికి రా! నీ కష్టం నేను తీరుస్తాను. జరిగిన దానికి ఇంద్రుని మందలించాను. నీ కుమారుని తీసుకుని తక్షణం బయటకు రావాలి". అని ఆయన పిలవగానే, అంజనేయుని భుజాన వేసుకుని ఉత్తరీయం సవరించుకుని, బయటకు వచ్చి, బ్రహ్మకు పాదాభివందనం చేసి నిలబడ్డాడు వాయుదేవుడు.

చతుర్ముఖుడు బాలుని శిరస్సుపై తన దక్షిణ హస్తముంచి లాలనగా నిమరగానే బాలకపి కనులు చిట్లించి, నిద్రపోయిన వానివలె ఆవులించి, వళ్ళువిరుచుకుని లేచాడు. వజ్రాయుధఘాతం వలన ఎడమ దవడపై దెబ్బతగిలింది. ఎఱ్ఱబారి బొప్పికట్టింది. బ్రహ్మదేవుడు గాయంపై నిమరగానే దెబ్బ తగ్గిపోయి గంటు మాత్రం మిగిలిపోయింది. వాయువు బిడ్డను క్రిందికి దింపి, బ్రహ్మకు పాదాభివందనం చేయించాడు. తన వాయుసంచారాన్ని పునఃప్రారంభించాడు. అకారణ ప్రళయం తప్పి జీవులన్ని 'హమ్మయ్య' అనుకుని సుష్ఠుగా ప్రాణవాయువు పీల్చుకున్నాయి. ప్రాణులతో పాటు దేవేంద్రునికి అదే స్థితి తొలగి పోయి ఆయనా ఊపిరి పీల్చుకున్నాడు.

ఇదంతా జరిగేసరికి అగ్నిదేవుడు, కుబేరుడు, యముడు, వరుణుడు సాక్షాత్తు శివపరమాత్మ అంతా అక్కడికి చేరుకున్నారు. కపిబాలునికి గండం తప్పినందుకు ముదమొందారు. చతుర్ముఖుడు వారి వికసితవదనాలు వీక్షిస్తూ –

"దేవతలారా! దిక్పాలకులారా! పంచభూతముల అధిదేవతలారా! ఈ కపిబాలుడు కారణజన్ముడు. ధర్మంకోసం, దేవకార్యాల కోసం శ్రమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం నారాయణుడు శ్రీరామచంద్రునిగా అవతరించే సమయమాసన్నమైంది. పూర్ణమానవావతార పురుషునిగా రాక్షస సంహారం కోసం ఆయన పడే శ్రమలన్నింటిలోను ఈ ఆంజనేయుడు అండగా నిలుస్తాడు. ఇతని వల్ల లోకకళ్యాణం జరుగుతుంది. మన సమీరదేవుడు సంతసించే లాగున మీరీ బాలునికి వరములివ్వండి" అన్నాడు. పరమశివశంకరులు బాలుని వద్దకు వచ్చి అతని తలపై బీజాక్షరాలు లిఖించి–

"వాయుదేవా! నీ కపిబాలునికి నా త్రిశూలం వలన నా మూడవ నేత్రం వలన ఎటువంటి హాని జరుగదు. ఇంద్రుని వజ్రాయుధఘాతమే తన ఎడమదవుడపై వీర చిహ్నంగా గలిగిన ఈ బాలుడు యికపై హనుమంతుడు అనే బిరుదుతో ప్రసిద్ధుడౌతాడు". అని దీవించారాయన.

"యుద్ధంలో యమదండం వలన గాని, కాలాతీత సమయంలో మృత్యుభయం గాని, నా యమపాశం వలన గాని యితనికి చెరుపు వుండదు" అని యమధర్మరాజు

వరములిచ్చాడు.

కుబేరుడు బాలుని ముద్దాడి, "నా గదవలన ఇతనికి మరణభయం వుండదు" అని దీవించాడు.

"భయభీభత్సాలను సృష్టించే నా వర్షపాతం వలన ఆంజనేయునికి ఏ యిబ్బందీ వుండదు. నీటి గండాలుండవు" అని వరుణదేవుడు వరమిచ్చాడు.

"నా చేత నిర్మించబడి దేవతలందరూ ధరించిన ఏ ఆయుధం వలన యితనికి బాధ, పీడ, గాయం, మృత్యుభయం వుండవు" అని విశ్వకర్మ మయుడు వరమిచ్చాడు. యింతలో దేవవైద్యులు అశ్వనీదేవతలు వచ్చారు. విషయమంతా తెలుసుకుని ఆంజనేయుని ఎత్తుకుని ముద్దాడి, వాయుదేవునికి అందిస్తూ -

"సమీరదేవా ! నీ పుత్రునికి యే రోగమురొష్ఠు వుండవు. నిత్య యౌవ్వనంతో సంపూర్ణ ఆరోగ్యవంతుడై ఎల్లకాలం ఉత్సాహంగా వుంటాడు" - అని వరమిచ్చారు. యిన్ని వరముల ప్రభావం వలన ఆంజనేయునికి నూత్న తేజస్సు, బలం, ధైర్యం, పట్టుదల వచ్చాయి.

బ్రహ్మదేవుడు చాలా ఆనందించాడు. వాయుదేవుని వదనం ఉదయ కమలంలా ప్రఫుల్లమైంది. సూర్యుడు ముందుకు వచ్చి బాలుని ఆశీర్వదించి నా వద్ద సర్వ విద్యలు నేర్పిస్తాను. అని మాటయిచ్చాడు. బ్రహ్మగారు మరొకసారి బాలుని ముద్దాడి -

"కపికులానికి పేరు తెస్తావు ఆంజనేయ. సమరంలో నిన్ను ఎదిరించే వాడుండడు. కామగమనం, కామరూపధారణం, అన్నీ నీకిస్తున్నాను. ద్వాపర యుగంలో అర్జునుని రథకేతనం అధిరోహించి ధర్మవిజయం తెచ్చిపెడతావు. శ్రీరామభక్తులకు అండగా నిలుస్తావు. చిరంజీవివై వర్ధిల్లి నా అనంతరం బ్రహ్మపదవిని అలంకరిస్తావు, నాయనా!".

"కలియుగంలో రామభజన జరిగే ప్రతిచోట నువ్వుంటావు. నిన్ను సేవించిన మానవులకు భూతప్రేతపిశాచ బాధలు తొలగి కోరికలు నెఱవేరుతాయి. చిరంజీవివై వర్ధిల్లు !" అని దీవించి బాలుని వాయువుకు యిచ్చివేసారు. ఇంతలో గుఱ్ఱాలపై కొందరు సేనానులు, వెనుక రథంలో అంజనాకేశరులు వచ్చి దేవతల దర్శనభాగ్యం దొరికినందుకు ముదమొందారు. వాయుదేవుడు జరిగిన దంతా చెప్పి బాలుని వారికప్పగించాడు. దేవతలంతా అదృశ్యులు కాగా, రాజదంపతులు బాలుని తీసుకుని రాజధాని చేరారు.



19. హనుమ బాల లీలలు – మహర్షుల శాపము



వాల్మీకిరామాయణంలో రాక్షసబాధలు పడలేక విశ్వామిత్రుడు తన యజ్ఞయాగాది క్రతువులు జయప్రదంగా నిర్వర్తించడం కోసం శ్రీరామచంద్రుని తనకు రక్షణగా యిమ్మని కోరుతాడు దశరథమహారాజును. పుత్రవాత్సల్యంచేత, రాముడు శ్రీహరి అవతారమని గ్రహించ లేక రాజు సంశయిస్తాడు. కులగురువు వశిష్ఠులవారు దశరథునికి నచ్చజెప్పి ఋషితో పంపడం వలన రామునికి ఆయన అస్త్ర విద్యలు నేర్పుతారు. గాధేయునిమాటనెదిరించి ఆయనకు ఆగ్రహం తెప్పించవద్దు అని నచ్చ జెప్పటంతో చివరికి రామలక్ష్మణులను ఆయన వెంట పంపిస్తాడు రాజు. గాధిసుతుడే స్వయంగా క్షాత్రతేజం గలవాడు. ధనుర్విద్యలో ఉద్దండుడు. రాజ్యపాలన చేసి, తపస్సంపన్నుడై రాజర్షి బిరుదు పొందిన అసామాన్యుడు. ఆయనే విల్లంబులు చేత బట్టి రాక్షస సంహారం చేసి మునికులాన్ని రక్షించుకోగల సమర్థుడు. లేదా ఖడ్గధారణ, రక్తపాతం, హింసాకాండ యివ్వన్నీ లేకుండా తన తపశ్శక్తి వలన శపించి రాక్షసులను మాడ్చి మసి చేయగల శక్తిమంతుడు. మరి యింత సమర్థుడైన విశ్వామిత్రుడు, అంతఃపురంలో తండ్రిగారాబంలో గోరుముద్దలు తినటం తప్ప ఏమీ ఎరుగని, సుకుమార సుందరాంగుడైన రామచంద్రుని అండ కోరటం యేమిటి? యిందులో అంతరార్థం వుంది.

శ్రీమహావిష్ణువు యొక్క అవతారం రామచంద్రమూర్తి. ఆదిలక్ష్మి సీతాదేవి. లోకంలో ఎంతటి విద్వాంసులు, తపస్సంపన్నులు, మునులు అయినా శ్రీహరికి ప్రత్యామ్నాయం కాలేరుకదా ! దుష్టులైనా రాక్షసులు ఆయన చేతిలో మరణిస్తే వారికి కైవల్యం ప్రాప్తిస్తుంది. తన చేతమరణిస్తే మరణానంతరం ఉత్తమలోక ప్రాప్తి జరుగదని విశ్వామిత్రునికి తెలుసు. నారాయణుడే దుష్టశిక్షణ కోసం అవతరించి అందుబాటులో వున్నప్పుడు రాక్షసులకు దండన విధించే కార్యక్రమం ఆయన చేత చేయించడమే సబబు. అందుకని గాధిసుతుడు దశరథుని దగ్గరకు వెళ్ళి రాముని పంపమని కోరాడు. మహాత్ముల ఆలోచనా విధానంలో ఒక ధర్మ నిష్ఠ, క్రమత్వం, సర్వప్రాణి శ్రేయస్సు, లోకకళ్యాణం, శాశ్వత ప్రయోజనం యివ్వన్నీ నిబిడీకృతమై వుంటాయి. భగవంతుడైన శ్రీహరిగాని, జగత్కళ్యాణం కోరే ఋషులుగాని, దేవతలు గాని వారి దృష్టిలో సర్వ సమత్వం ఒక అంతర్లీన భావము. ఏదీ దుర్వినియోగం కారాదు. ఏశక్తి ధర్మేతర కార్యాలకు వెచ్చింపబడరాదు. అలా జరిగిన నాడు యేదో ఒక సత్పురుషుడు దానిని నిరోధించి, భౌతిక, మనో, ఆత్మబలములన్నింటిని ధర్మబద్ధంగా వినియోగపడేలా క్రమబద్ధీకరిస్తాడు. రాక్షసుల భౌతికబలం దుష్టకార్యాలకు వినియోగింప బడింది కనుక అది శిక్షింపబడి వారి శరీరాలు మాత్రం శస్త్రాస్త్రాలచేత ఛిద్రంచేయబడతాయి.

శ్రీరామచంద్రుని చేతిలో, మరణం పొందినందుకు మోక్షం ప్రసాదించబడుతుంది. వారి ఆత్మలు పవిత్రమైనవి గనుక పరమాత్మ ఆ రకమైన తీర్పు యిస్తాడు. ఇది విశ్వామిత్రుని అంతరంగము. ఋషులు, దేవతలు, సత్పురుషుల చర్యలన్నీ శ్రీమన్నారాయణుని ధర్మసంస్థాపనకు ఆలంబనగా నిలుస్తాయి.

ఆంజనేయుడు పుట్టుకతోనే మహాబలశాలి. కాకుంటే సూర్యగోళం వరకు వెళ్ళగలడా? దానికితోడు సర్వదేవతల ఆశీస్సులు వరములు తలవని తలంపుగా లభ్యమయ్యాయి. యింక అతని అల్లరి చేష్టలకు తిరుగేముంది ! రాజప్రాసాదంలో పుట్టినా అతనికి అడవులు, ఉద్యానవనాలు, మునిపల్లెలు ఆటస్థలాలైనాయి. మిత్రబృందం అతను లేచేసరికే రాజవీధిలో పొంచివుంటుంది. కొండలు, గుట్టలు, లోయలు, సెలయేళ్ళు, మహావృక్షాలు, మునిఆశ్రమాలు యివే అతని క్రీడాస్థావరాలు. చెట్లెక్కుతారు ఫలాలు తిన్నన్ని తింటారు. మిగిలినవి కొరికిపారేస్తారు. తోటయజమానులు, కాపలాదార్లు రాజకుమారుని యేమీ అనలేక వచ్చి అంజనాదేవి వద్ద, మంత్రుల వద్ద మొరపెట్టుకుంటారు. పంటకు తగిన ప్రతిఫలంగా బంగారుకాసులు, రత్నాలు వారికి చెల్లిస్తే వారు సంతోషంగా వెళ్ళిపోతారు. కొందరైతే రాకుమారుడు వచ్చి తమ తోటలు పాడుచేస్తే చాలు పండ్లు అమ్ముకోవటం కంటె రెట్టింపు ప్రతిఫలం లభిస్తుందని ఆరాటపడుతుంటారు. యిక వారి అల్లరి ఆపేదెవరు.

వనాల మధ్య ప్రశాంతతకు నిలయాలైన ముని ఆశ్రమాలకు దండుతో వెళతాడు హనుమ. వారు ఆరవేసుకున్న మడిపంచెలు తెచ్చికపులకు కడతాడు. ఆడి ఆడి చివరకు చింపి పారవేస్తారు. యజ్ఞవాటికల్లో చెత్త చెదారం వేస్తారు. అక్కడ పేర్చుకున్న సమిధలు, నవధాన్యాలు చిందర వందర చేస్తారు. ఋషులు పూజ కోసం పెంచుకుంటున్న మొక్కల పూలు కోసి పాడుచేస్తారు. ఫలాల్ని తినేస్తారు. తపస్సు చేసుకునే మునుల వడిలో కూర్చుని వారి గెడ్డాలు, మీసాలు లాగి తపోభంగం చేస్తారు. ఆశ్రమ వాకిళ్ళలో పెంచుకుంటున్న దుప్పులు, లేళ్ళు, కుందేళ్ళు, నెమళ్ళ పట్టుకొని ఆడుకుంటారు. వాటిని పరుగులెత్తించి దూరంగా తరిమి వేస్తారు. ఒకసారి యివన్నీ రాజు దృష్టికి తీసుకువచ్చారు మునులు. అంజనాకేసరులు వారికి యజ్ఞానికి వనికి వచ్చే సామాగ్రి, దుస్తులు, శాలువలు యిచ్చి మర్యాదలు చేసి పంపివేసారు. హనుమను మందలించి చూసారు. అయినా అతనిలో మార్పు రావటం లేదు. విద్యాభ్యాసం కోసం సూర్యదేవుని వద్దకు పంపే వయసు వచ్చింది. ఆయన వద్దకు పంపించే మంచి ముహూర్తం కోసం వేచివున్నారు రాజదంపతులు.

అయితే హనుమ ఆగడాలు మాత్రం జననీజనకులు కూడా అరికట్ట లేకపోతున్నారన్న సంగతి ఋషులు గ్రహించారు. "దేవతలు ప్రసాదించిన వరముల ప్రభావమే యిదంతా" అని ఒక మునీశ్వరుడన్నారు.

"అతనికి హాని జరగకుండా, మన ఆశ్రమాలు పాడవకుండా, మనం బాధపడకుండా యేమి చేస్తే బాగుంటుంది" అని ఒకాయన యోచించారు.

"అతని భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని అతని అల్లరి అరికట్టే ఉపాయం చూడాలి" అని ఒక ముని. యిలా వారు చాలా సేపు సామూహికంగా చర్చించుకుని చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు. ఏ వరబలం చేత యితడు మనల్ని గాని, తల్లిదండ్రులనుగాని, ప్రజల్ని గాని లక్ష్యపెట్టకుండా వ్యవహరిస్తున్నాడో ఆ శక్తి తగిన సమయం, వచ్చేవరకు యితనికి తెలియ కుండా చెయ్యాలి' అని నిర్ధారించుకుని...

"ఆంజనేయా! నేటి నుండి నీ వరగర్వం తొలగి పోవుగాక! నీశక్తి సామర్థ్యాలు నీకు యితరులు గుర్తు చేసినపుడు గాని తెలియవు. ఆ తరుణం ఆసన్నమైన నాటి నుండి నువ్వు లోకకళ్యాణం కోసం ఉపయోగపడే అద్భుత కార్యాలు చేస్తావు. నీ సహజ కపిస్వభావం కొంతతగ్గి బుద్ధిమంతుడవు అనిపించుకుందువు గాక!" అని శపించారు. ఆ రోజు నుండి హనుమ నిజంగా బుద్ధిమంతుడే అయిపోయాడు. తమ నాయకుడు అల్లరి మానివేసినందున తాము కూడా మానివేసి కపిబృందమంతా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. మంచి ముహూర్తం చూచి ఆంజనేయుని సూర్యుని వద్దకు పంపారు రాజదంపతులు. భానుడు హనుమకు నవవ్యాకరణ శాస్త్రాలు నేర్పాడు. హనుమ మంచి పాండిత్యంతో పాటు వాక్కును, చర్యలను స్వాధీనంలో వుంచుకుంటూ ఎవరిని నొప్పించకుండా కార్యసాధన చేసుకోవటం అలవర్చుకున్నాడు. విద్యాభ్యాసం చేసి తిరిగి వచ్చిన యువకపిరాజును రాజదంపతులు ఆలింగనం చేసుకుని మురిసిపోయారు.

మరొక వానర రాజ్యానికి ఋక్షరజుడు రాజు. ఆయనకు వాలి సుగ్రీవులు పుత్రులు. ఆంజనేయుడు తండ్రి ఆజ్ఞతీసుకొని సుగ్రీవుని వద్దకు వెళ్లి అతనితో స్నేహంగా వుండేవాడు. మాయావి అనే రాక్షసుని వధించడం కోసం గుహలో ప్రవేశించిన వాలి మరణించాడనుకుని బిలానికి రాతిని అడ్డంపెట్టి సుగ్రీవుడు రాజ్యానికి తిరిగి వచ్చేసాడు. రాజులేని రాజ్యం శత్రువుల పాలవుతుందని సుగ్రీవునికి పట్టాభిషేకం చేస్తారు కపిసచివులు. వాలి తిరిగి వచ్చి తమ్ముని అపార్థం చేసుకుని, రాజ్యాన్నే కాకుండా అతని భార్య రుమను కూడా చేజిక్కించుకుని సుగ్రీవుని కొట్టి తరిమేస్తాడు. తిరిగి తన రాజ్యంలో అడుగు పెట్టవద్దని శాసిస్తాడు. విధిలేని సుగ్రీవుడు భూమండలమంతా తిరగటం మినహా ఏమీ చెయ్యలేడు. వాలిని ఎదిరించి పోరాడగల శక్తి హనుమకు వున్నా తన బలం తనకు తెలియని కారణంగా ఆయన మిత్రుని కష్టాలు చూస్తూ సమయం కోసం వేచి వుంటాడు. ఋష్యమూక పర్వతం మీదకు సీతాదేవిని వెతుక్కుంటూ రామలక్ష్మణులు వస్తారు. అప్పుడు అంజనేయస్వామి వారే వారితో మాట్లాడి రామసుగ్రీవులకు మైత్రీబంధం యేర్పాటు చేస్తారు. అక్కడి నుండి హనుమ

విజయపరంపరలు ప్రారంభమవుతాయి.



౨౦. కిష్కింధా కాండము – శ్రీరామ సుగ్రీవుల సంధాన కర్త హనుమంతుడు

ఋశ్యమూక పర్వతంపై మతంగమహర్షి ఆశ్రమముంది. అక్కడ ఆయన శిష్యులతో కలసి ప్రశాంతంగా జీవిస్తూ పర్వతం పైన యజ్ఞ నిర్వహణకు అవసరమయ్యే వృక్షాలు, పూలమొక్కలు, ఓషధులు పెంచుతూ వేదాంతచర్చ, యజ్ఞయాగాలు నిర్వర్తిస్తూ బ్రహ్మానందకరమైన అలౌకిక జీవితాన్ని జీవిస్తున్నారు. దేవఋషి గణాలలో ఆయనకు సుప్రతిష్ఠితమైన యశస్సు గౌరవము వున్నాయి. మాయావి అనే రాక్షసుని, బిలంలో చంపివేసాక వేయి ఏనుగుల బలముగల అతని అన్న దుందుభియనే మహిషాసురుడు వాలిపై యుద్ధానికి వస్తాడు. వానరకులంలో మహేంద్రుని అంశవలన పుట్టినవాడు వాలి. ఒకానొక సమయంలో మహేంద్రుడు వాలికి ఒక కాంచనమాల ప్రసాదిస్తాడు. అది మెడలో ధరించి రణమునకు వెడితే ఎవరైతే ఎదురుగా వచ్చి వాలితో పోరాటం చేస్తారో వారి బలమంతా వాలికే సంక్రమిస్తుంది. అందువల్ల ఎంతటి వీరుడైనా వాలిని ఎదురుగా వెళ్ళి జయించటం సాధ్యపడదు. ఆ కాంచనమాలను ధరించి వాలి దుందుభితో పోరాడుతాడు. దుంధుభి కైలాసగిరియంత మహాకాయం అమేయ శక్తిసంపద గలవాడవటంతో ఎంతకీ అతనిని కడతేర్చటం కష్టమవుతుంది. బలంగా అతనిని పైకెత్తి నేలపై విసురుగా కొట్టటంతో రాక్షసుని నోటి వెంట రక్తం కారుతుంది. ఆస్థితిలో శక్తికోలది రాక్షసుని పైకెత్తి విసిరేస్తాడు వాలి. అతని నోటి నుండి వెడలుతున్న రక్తం ఆశ్రమప్రాంగణంలో పడుతుంది. దుందుభి కళేబరం విసురుగా ఆశ్రమ వృక్షాలను విరగగొట్టుకుంటూ వెళ్లి యోజన దూరంలో పడుతుంది. యిదంతా మతంగమహర్షి స్వయంగా గమనించి–

"ఎవరీ అసుర శరీరమును యిక్కడికి బలగర్వంతో విసిరివేసేరో, ఈ తపోవనంలో రక్తం చిందించి, వృక్షాలు విరగి పోవటానికి కారణమెవరో అతడీ ఆశ్రమం చుట్టుప్రక్కల ఆమడ దూరంలో ప్రవేశించినట్లయితే మృతినొందుతాడు. వాలి అతని సచివులు ఎవరైనా సరే ఈ ఒక్క రోజులో దూరంగా పోయి బ్రతకాలి. చెట్ల ఆకులు, పువ్వులు, దుంపలు ఓషధులు గల ఈ వనాన్ని నేను కన్నబిడ్డ వలె వృద్ధిపొందిస్తున్నాను. నా మాట విని దూరంగా పోయినవారు బ్రతుకుతారు. రేపు ఉదయం నుండి వాలి పరివారంలో ఏ వానరమైనా యిక్కడ కనబడిందో అది అనేక వేల సంవత్సరములు పర్వతమై పడి ఉంటుంది". అని శపిస్తాడు. ఈ వార్త వాలికి తెలిసి మహర్షిని శరణు వేడి శాపవిమోచనం కోరినా ఆయన అతని మాట లక్ష్యపెట్టడు. అందువలన సుగ్రీవుడు తన ప్రధాన సచివుడు, మిత్రుడు, ఆంతరంగికుడు, మహా బలశాలి, బుద్ధిమంతుడు, పండితుడు అయిన ఆంజనేయస్వామితో ఆ ఋశ్యమూక పర్వతం మీద మునుల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా నివసిస్తూ తన భార్య కోసం, రాజ్యభాగం కోసం పరితపిస్తూ కాలం గడుపుతూ వుంటాడు. అన్నతో నిష్కారణవైరం వచ్చి దారాపుత్రాదులను; ఐశ్వర్యాన్ని దూరం చేసుకున్న వానరుడు సుగ్రీవుడైతే, కైకేయి వరముల వలన రాజ్యానికి దూరమై దుష్ట రాక్షసుల వలన భార్య సీతను పోగొట్టుకున్న నరుడు శ్రీరామచంద్రుడు, సమానావస్థ యందున్న వారికి మైత్రి సులభంగా లభిస్తుంది. సీతాన్వేషణ చేస్తూ కొండలు, గుట్టలు, వనములు తిరుగుతున్న రామలక్ష్మణులు కబంధుడనే భీకరాకారంగల రాక్షసుని బారిన పడతారు. యిద్దరూ కలసి అతనిని గెలుపొందుతారు. ప్రాణాలు పోయేముందు ఆ కబంధుడే రామునికి, సుగ్రీవుడనే వానరరాజును ఆశ్రయించమని అతని సహాయం వలన సీతాన్వేషణ జరుగుతుందని చెప్పి మరణిస్తాడు.

సుగ్రీవుని సహాయం కోరటానికి అతనిని వెతుక్కుంటూ ధనుర్ధారులైన రామలక్ష్మణులు ఋశ్యమూక పర్వతప్రాంతానికి వస్తారు. పరస్పరం ప్రేయసీప్రియుల్లా పెనవేసుకున్న జాజితీగెలు, మల్లెతీగలు నిండా పూచి పరిమళం వెదజల్లుతున్నాయి. పూవుగురువిందలు, మొల్లపొదలు, బొట్టుగు చెట్లు, నాగమల్లెలు, పూచిన కడిమిచెట్లు, ఫలాలగుత్తులతో నిండిన ఖర్జూరపు చెట్లు, పద్మక వృక్షములు, లొద్దుగ చెట్లు, గొజ్జెగచెట్లు, పూర్ణక చెట్లు, కలిగొట్టు చెట్లు, కాంచనపుచెట్లు, చంద్ర, బూరుగు, మోదుగ, ఎఱ్ఱగోరంట్ల చెట్లు, చందన వృక్షములు గల ఆ ప్రాంతమంతా కడుప్రశాంతంగా వుంది.

పొడవైన చేతులు, వీపున కట్టుకున్న అమ్ముల పొదులు, కుడిచేతులలో పట్టుకున్న ధనుస్సులు, మొలను ఖడ్గాలు ధరించిన సుందర శరీరులు రామలక్ష్మణులు వస్తుంటే దూరం నుండి కపుల గుంపు వారిని పరిశీలిస్తోంది. విశాలమైన ఫాల భాగం తామర రేకుల వంటి నేత్రాలు, పొడవైన నాసికలు, గంభీర బంధుర వదనాలతో

యిద్దరు వీరులు వస్తున్నారు. దేహచ్ఛాయ ఒకరు నీలమేఘ శ్యాముడు, మరొకరు బంగరు పసిమి వన్నె. వీరు వాలి నా ప్రాణాలు తీయటం కోసం పంపిన యోధులై వుంటారు. అని సుగ్రీవుడు భయపడుతుంటే ఆంజనేయస్వామి అతనికి ధైర్యం చెపుతూ వారి విషయం తెలుసుకుని రావటానికి భిక్షురూపము ధరించి దూతకృత్యానికి ఉపక్రమిస్తాడు.

వాల్మీకి రామాయణము; కిష్కింధాకాండము, తృతీయసర్గ - 2వ శ్లోకము



కపిరూపం పరిత్యజ్య
హనుమాన్ మారుతాత్మజః
భిక్షురూపం తతో భేజే
శఠబుదితయా కపిః

వాయునందనుడైన హనుమంతుడు వంచనాబుద్ధి కలవాడై, తన సహజ కపిరూపాన్ని మరుగు పరచి సన్యాసి వేషము ధరించెను. అని పై శ్లోకపు భావము.

విశేష వ్యాఖ్యానము :-

ఆంజనేయస్వామి తన రూపాన్ని మరుగు పరచుకొని సన్యాసిగా మారి రామలక్ష్మణులను కలుసుకోవటం వలన స్వామిని "శఠుడు" అని వ్రాసారు వాల్మీకి. 'శఠ' శబ్దానికి వంచకుడు, మోసగాడు, బుద్ధిలేనివాడు, మూర్ఖుడు, సోమరి, అలసుడు, శృంగారనాయకులలో ఒకడు అనే అర్థాలున్నాయి. కాని యివేమి హనుమస్వామికి ఏ సందర్భంలోను అన్వయించరాని పదములు. శఠుడు అంటే "మధ్యవర్తి" అనే అర్థము కూడా వున్నది. అది మాత్రమే ఈ సందర్భంలో వాయునందనునికి సరిపోయే శబ్దము. సుగ్రీవుడు హనుమకు రాజు, మిత్రుడు. ఆయనకు తనే ప్రధానమైన అండదండ. ఈ సందర్భంలో మిత్రశ్రేయస్సే ప్రధాన లక్ష్యం. ధర్మసూక్ష్మం తెలిసిన వాడుగనుక, వచ్చిన వారు శత్రువులో మిత్రులో నిర్ధారణగా తెలియదు కాబట్టి తనకు; రాజుకు క్షేమకరంగా వుంటుందని రూపం మార్చుకుని వెళ్ళాడు మారుతి. అపరిచితులైన రామలక్ష్మణులకు ఆపదలోవున్న మిత్రునికి మధ్యవర్తిత్వం వహించాడు. పైగా, రాజు క్షేమం కోరిన మంత్రి, రాజు తరపున గూఢచర్యం చేయటం రాజనీతిజ్ఞునిగా అతని కర్తవ్యం కూడా! స్వరూపం మారింది కాని హనుమ యొక్క సాత్వికస్వభావం మార్చుకోకుండా, దూత కృత్యం నెరవేర్చుకు రావటం ఆయన బుద్ధికుశలతకు, నిర్మలత్వానికి దర్పణం పడుతుంది. హనుమది ఈ సన్నివేశంలో ఆత్మసంరక్షణా విధానమే కాని పరవంచనాతత్వం కాదని ఆయన వాక్కుల ద్వారా తేటతెల్లమవుతుంది. పరిశీలిద్దాము.

21. మంచి వక్త, ఆచార్యుడు – మారుతి

భిక్షురూపధారియైన హనుమ రామలక్ష్మణులకు తనే ముందుగా నమస్కరిస్తాడు. లోకంలో బ్రహ్మచర్య దీక్ష వహించి సన్యాసం తీసుకున్న మహానుభావులు గృహస్థులకు ప్రణమిల్లరు. సంసారలంపటంలో వున్న వ్యక్తులే వారికి వందనములర్పించి జీవన్ముక్తులు కావటానికి సన్యాసుల ద్వారా మార్గాన్వేషణం చెయ్యటం పరిపాటి. మారుతి యిక్కడ బ్రహ్మచారేగాని నిజమైన భిక్షువు కాదు. ఆయన సన్యాసాశ్రమము స్వీకరించనూ లేదు. అందువల్ల దశరథనందనులకు నమస్కరించాడు. శ్రీమన్నారాయణుడు రాముడు, ఆదిశేషువు లక్ష్మణుడు ఆ తేజస్సు గ్రహించగలిగినవాడు హనుమ. అందువలన మారుతి ప్రణమిల్లటం సబబు.



కిష్కింధాకాండము. 3వ. సర్గ. 4వ శ్లోకము :

సంపూజ్య విధివ ద్వీరో

హనుమా న్మారుతాత్మజః

ఉవాచ కామతో వాక్యం

మృదు సత్యపరాక్రమౌ.

వాయునందనుడైన హనుమ సత్యపరాక్రములైన రామలక్ష్మణులను యదావిధిగా పూజించి, సుగ్రీవుని ఉపదేశమునకు విరుద్ధము కానట్టి స్వేచ్ఛతో మృదువుగా చెప్పనారంభించాడు.

"పంపానదీతీరంలో వ్యాపించిన విశాలవృక్షాలను చూస్తున్న మీ రూపాలు నిగనిగలాడుతున్నాయి. ఇంద్రధనుస్సుల వంటి విల్లంబులు, పొడవాటి కత్తులు ధరించిన మిమ్మల్ని చూచి మత్తేభవ్యాఘ్రాది మహామృగాలు బెదిరిపోతున్నాయి. నారవస్త్రములు ధరించి వనసంచారం చేస్తున్న మిమ్మల్ని చూచి సింహములు తమ కంటె బలపరాక్రమాలు గల్గిన వారొచ్చారని దూరంగా తొలగిపోతున్నాయి. శత్రుగర్వమంతరింపజేయువారు; కాంతిమంతులు, సుందరమూర్తులు, శ్రేష్ఠములైన ఆబోతులవలె గంభీర గమనులు, ఏనుగు తొండముల వలె బలిసిన భుజాలు గలవారు అయిన మీ రెవరు? మీ దేహ కాంతిచే ఈ ఋశ్యమూకపర్వతం ప్రకాశిస్తోంది.

తామరరేకుల వంటి విశాలనేత్రములు, జటామండలాలు మృగరాజుకు వలె పొడవైన మూపు, వెడద యురములు గలిగి ఒకరి కొకరు సాటియైన వీరులు మీరు. దేవలోకం నుండి దిగి వచ్చినారా? సూర్యచంద్రుల ప్రకాశం, అజాను దీర్ఘములైన భుజములు నిరలంకారంగా వుండటానికి హేతువేమిటి ?

సముద్ర పరివేష్టితమై, బహుజన సహితమై, బహు జనపద నగర విశేషములు, వింధ్యమేరు పర్వతాలు కూడిన ఈ ధరాతలాన్ని రక్షించే సామర్థ్యం మీకుందని తలుస్తున్నాను. కుబుసం విడిచిన పాముల్లా పొడవైన కత్తులు, బుసలు కొట్టే సర్పాల్లా ప్రాణాంతకములైన బాణములు గల తూణీరములు, బంగరు పూతతో దేవేంద్రుని వజ్రాయుధంలా ప్రకాశించే ధనుస్సులు మీ పరాక్రమమునకు ఆలంబనలై మీరు మునివేషం కట్టిన రాజకుమారులేనని చెప్పక చెపుతున్నాయి.

20వ శ్లోకము :-

సుగ్రీవో నామ ధర్మాత్మా
కశ్చి ద్వానర యూథపః
వీరో వినికృతో భ్రాత్రా
జగద్భ్రమతి దుఃఖితః

సుగ్రీవుడనే వానరగణనాయకుడు తన అన్న వాలిచే తరిమికొట్టబడి దుఃఖం పొందుతూ భూమండలమంతా తిరుగుతున్నాడు. అతడు ధర్మాత్ముడు. నేను ఆంజనేయుడనే పేరుగల వానరుడను. కేసరి అంజనులనే కపిదంపతుల కుమారుడను. సుగ్రీవుని మంత్రిని. అతను పంపగా వచ్చినవాడను. మీతో స్నేహం కోరుతున్నాడాయన.

23వ శ్లోకము.

భిక్షు రూప ప్రతిచ్ఛన్నం
సుగ్రీవ ప్రియ కామ్యయా
ఋశ్యమూకా దిహ ప్రాప్తం
కామగం కామరూపిణమ్.

“సుగ్రీవునకు మంచి చేయగోరి భిక్షువేషం ధరించి ఋశ్యమూకం నుండి యిక్కడికి వచ్చాను. వాయుకుమారుడనైన నేను ఎక్కడికైనా వెళ్ళగలను. కోరిన రూపమూ దాల్చగలను” అని ఆంజనేయస్వామి తన సామర్థ్యం గురించి, తన నామధేయాదుల గురించి సంక్షిప్తంగా విన్నవించి తను మారు వేషంలో వచ్చానని ఆయనే ఎఱింగించి సత్యవ్రతుడైన రామచంద్రమూర్తి ముందు తన సత్యసంధతను చాటుకున్నాడు. నిష్కాపట్యానికి, నిర్మలత్వానికి హనుమ కంటె మంచి ఉదాహరణ మరొకరుండరు. తాను చెప్పవలసినది అంతా చెప్పి తనకు తానే సంభాషణ ఆపివేస్తాడు. అది మంచి వక్త యొక్క లక్షణం. శ్రీరామచంద్రప్రభువు అంతా సావధానంగా విన్నాడు. మందహాసం చేసి లక్ష్మణునితో యిలా అంటున్నాడు.

“తమ్ముడూ! మనకు కబంధుడు తెలిపిన సుగ్రీవుడు యితని రాజే. ఆయనే ఈ

హనుమ ద్వారా మనకు చేరువయ్యాడు. ఈ కపివరుడు తన రాజుయందు మనయందు కూడా స్నేహాన్నే వాంఛిస్తున్న సహృదయుడు. మధురభాషణా సామర్థ్యం గలవాడు.

28వ శ్లోకము :-

నానృగ్వేద వినీతస్య
నాయజుర్వేద ధారిణః
నాసామవేద విదుష శ్శక్య
మేవం ప్రభాషితుమ్.

శత్రు దమాన్ని అణచివేయగల సౌమిత్రీ ! ఋగ్వేదంలో శిక్షితుడు కాని వానికి, యజుర్వేదం మనస్సునందు ధారణ చేయని వానికి, సామవేదంలో పాండిత్యం లేని వానికి యిలా (హనుమంతుని వలె) మాట్లాడటం సాధ్యపడదు.

29వ శ్లోకము :-

నూనం వ్యాకరణం కృత్స్న
మనేన బహుధా శ్రుతం.
బహు వ్యాహరతాఽ నేన
నకించి దపశబ్దితమ్.

ఈ హనుమంతుడు వ్యాకరణశాస్త్రం ఆమూలాగ్రంగా, అనేక పర్యాయములు గురుముఖంగా వినియుంటాడు. ఎక్కువ సేపు మాట్లాడినా ఒక్క అపశబ్దం కూడా యితని నోటి వెంట వెలువడక పోవటానికి కారణం అదే!

30వ శ్లోకము :-

న ముఖే నేత్రయో ర్వాపి
లలాటే చ భ్రువో స్తథా
అన్యేష్వపి చ గాత్రేషు
దోషః సంవిదితః క్వచిత్.

హనుమ మాట్లాడేటప్పుడు ముఖమందుగాని, కళ్ళయందుగాని, కనుబొమల యందుగాని, తక్కిన అవయవములతో గాని ఎట్టి వికారము లేదు. పలికిన శబ్దము యొక్క విస్తరత అధికంగా లేదు. ప్రతి శబ్దము, అక్షరము ఏమిటా అనే సందేహం లేకుండా స్పష్టముగా వుంది. శబ్దము రొమ్మునందు పుట్టి మంద్రస్థాయిలోను; కంఠగతమైనపుడు మధ్యమస్థాయిలోను వుంది. గుణవంతము, మనోహరము అయిన వాక్యాలు చెప్పాడు. కులగోత్రములు, నామధేయము, పదకౌశలము గల నీతిమంతుడు

దూతకృత్యం నిర్వర్తిస్తే రాజుకు క్షేమకరము. కత్తిఎత్తి నరకబోయే శత్రువైనా యిటువంటి దౌత్యకార్యం వలన బుద్ధికుశలత వలన, సంతోషం, కలిగి విరోధం తొలగిపోతుంది. కార్యసిద్ధి కలుగుతుంది. అని రామచంద్రుడు లక్ష్మణునితో చెప్పాడు. హనుమ సంభాషణాచతురత, అన్న విశ్లేషణ సౌమిత్రిని ముగ్ధుణ్ణి చేసాయి. ఆయన కపివరుని వంక పరిశీలనగా ప్రసన్నవదనంతో చూస్తూ –

"విద్వన్మణీ! కపికుల శిరోభూషణా! హనుమా! శాపవశాన దనుజ జన్మనెత్తి మాచే ఖండించబడి శాపవిముక్తుడైన కబంధుడు; సుగ్రీవుడు సీతాన్వేషణకు సహాయ పడతాడని తెలిపాడు. మేము మీ రాజును కలుసుకునేందుకు బయలు దేరాము. మేమిరువురం అయోధ్యాపతి దశరథుని పుత్రులము. మా జనకుడు తేజస్వి, ధర్మపరుడు, యశోకాయుడు. ఒకరిని ద్వేషించడం, పరులచే ద్వేషించబడటం రెండూ ఆయనకు తెలియవు, అగ్నిష్టోమాది యాగములొనర్చి సకల జీవులలో బ్రహ్మవలె శ్రేష్ఠుడని పేరు తెచ్చుకొన్నారాయన. శ్రీరామచంద్రుడు అనే నామధేయంగల ఈయన ఆ దశరథుని పెద్దకుమారుడు. వీరుడు, గుణవంతుడు, రాజలక్షణసంపన్నుడు, తండ్రి ఆజ్ఞ మేరకు పదునాలుగేళ్ళు రాజ్యత్యాగం చేసి వనవాస దీక్షలో వుండగా, సాధ్వియైన మా వదిన సీతను ముష్కరులు తస్కరించారు.

త్యాగశీలి, పరాక్రమశాలియైన రాముని తమ్ముడను నేను. ఈయన సద్గుణములకు ఆకర్షితుడనై దాసునిగా సేవచేయటానికి అరణ్యానికి వచ్చాను. ఎవని తండ్రి ధర్మవత్సలునిగా ఎల్లరకు శరణ్యుడైనాడో, అటువంటి రాజనందనుడైన శ్రీరాముడే విపత్కాలములో మీ కపిరాజు సుగ్రీవుని శరణు జొచ్చి వచ్చాడు. సకల పురుషార్థములను జనులు ఎవరి వలన పొంది సుఖింతురో, అటు వంటి రామ భద్రుడే భార్యాన్వేషణ నిమిత్తం మీ కపిరాజు అనుగ్రహం కోరి ఆశ్రయిస్తున్నాడు. హనుమా! సుగ్రీవుని నియోగం చేత నువ్వు ఏమి చెప్పావో దానినే మేము చెయ్యగలము" అని సౌమిత్రి సౌమ్యంగా, గంభీరంగా చెప్పగా కపిసచివుడు శ్రద్ధగా ఆలకించాడు. తమ్ముని సంభాషణా చతురతకు రాముడు మనసులోనే మురిసిపోతున్నాడు.

ఆంజనేయస్వామి రామచంద్రుని వదనారవిందము వీక్షిస్తూ "ప్రభూ! జితేంద్రియులు, బుద్ధిమంతులు, జితక్రోధులు అయిన మీ వంటి రాజకుమారులను మా సుగ్రీవుడే అన్వేషించి, శరణుకోరాలి. మా కపికులం యొక్క భాగ్యం చేత మీరే దర్శనమిచ్చారు. సూర్యపుత్రుడైన సుగ్రీవకపిరాజు సీతాన్వేషణలో శీఘ్రమే మీకు చేయూతనిస్తాడు. వాలి సుగ్రీవులిరువురు అన్నదమ్ములు. మాయావి అనే రాక్షసుని వధించటం కోసం వాలి వెళ్ళి ఎంతకాలానికి తిరిగి రాకపోవటం వలన, సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేసారు మంత్రులు. ఆయన తిరిగి వచ్చి తమ్ముని అపార్థం చేసుకుని

అతని భార్య రుమను చెరపట్టి రాజ్యంనుండి బహిష్కరించాడు. సుగ్రీవుని తప్పులేక పోయినా అతనిపై నిష్కారణ వైరం పెంచుకున్నాడు. అప్పటి నుండి సుగ్రీవుడు దుఃఖితుడై భూమి అంతటా సంచారం చేస్తున్నాడు. అయినా పరిష్కారం దొరకలేదు.

రామచంద్రా! తమ సతీమణి ఎచట వున్నదో జాడ తెలిస్తే మీరు వైరుల్ని జయించి ఆమెను తెచ్చుకోగల సమర్థులు. కాని మా సుగ్రీవుడు భార్య కిష్కింధలో వాలి వద్ద వుందని తెలిసినా శత్రు సంహారం చేసి ఆమెను పొందలేని అసమర్థుడు. నర శార్దూలమైన మీరు వానర శార్దూలమైన వాలిని సంహరించి మా రాజుకు న్యాయం చెయ్యాలి. అందువల్ల ప్రభూ! మా రాజు, మేము కూడా మిమ్ములను శరణువేడుతున్నాము. రండి! నా భుజములపై కూర్చుండబెట్టుకుని సుగ్రీవుని కడకు తీసుకు వెడతాను" అని నిజరూపం ధరించి మోకాళ్ళపై ఆని కూర్చున్నాడు హనుమ. కుడి భుజంపై రాముడు, ఎడమ భుజంపై సౌమిత్రి ఎక్కి కూర్చున్నారు.

గిరులు, బారులు తీరిన తరువులు, సుందరమైన సెలయేళ్ళు, అరవిరిసిన చామంతి, గులాబి తోటలు, మల్లెపొదలు మొగలి డొంకలు, అనాస ఫలాలు దాటించి బండరాళ్ళపై విచారంగా కూర్చున్న వానర పరివారం మధ్య గల సుగ్రీవుని వద్దకు తీసుకువెళ్ళాడు వారిని. ఒండొరుల పరిచయాలు జరిగాయి. కష్టసుఖాలు చెప్పుకున్నారు రామసుగ్రీవులు. అగ్నిసాక్షిగా వారికి స్నేహ సంబంధం కలిపాడు హనుమ.

ఆంజనేయస్వామి జన్మతః కపికుమారుడు. అయినా ఆయన కార్యనిర్వహణా చాతుర్యం శ్లాఘనీయము. స్వామి శిక్షా పారంగతుడు. ఎందుకనగా.

గీతీ శీఘ్రీ శిరఃకంపీ

తథా లిఖితపాఠకః

అనర్థజ్ఞోఽల్పకంఠశ్చ

షడేతే పాఠకాధమాః

సాగదీస్తూ మాట్లాడే వాడు, వేగంగా మాట్లాడేవాడు, తల ఊపుతూ భాషించేవాడు; వ్రాసినది చదివే వాడు, అర్థము తెలియక చదివే వాడు, కీచుగొంతుతో సంభాషించేవాడు ఈ ఆరుగురూ పాఠకాధములు. తల, కంఠము కనుబొమలు, నేత్రములు, యివి కదుపుతూ వికారము వెలిబుచ్చేవారు హీన పాఠకులు. ఈ దోషములు ఏవీ లేకుండా మాట్లాడాలని శిక్ష చెపుతున్నది. "శిక్ష" వేదాంగములలో ఒకటి. వీటిని అనుసరించేవాడు శిక్షాపారంగతుడు. హనుమ ఉత్తమ శిక్షాపారంగతుడు.

సాక్షాత్తు శ్రీరామచంద్రుడే ఆంజనేయుని ఋగ్వేదశిక్షితుడు అని శ్లాఘించాడు. గురువు యొక్క అనుగ్రహము వలన, బోధనల వలన చేతనోజ్జీవనము లభిస్తుంది. ఆచార్యుల వలన కలిగే లాభము అమితమైనది. మారుతి ఆ లాభము పొందినవాడు.

విశిష్టాద్వైతులు ఆంజనేయస్వామినే ఆచార్యునిగా భావించి కొలవటం శ్లాఘనీయము.



ఆచార్యో వేద సంపన్నో
విష్ణు భక్తో విమత్సరః
మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ
సదా మంత్రార్థత శ్శుచిః

గురుభక్తి సమాయుక్తః
పురాణజ్ఞో విశేషతః
ఏవం లక్షణ సంపన్నో
గురురిత్యభిధీయతే!

ఆచార్యుడు వేద విజ్ఞానము దండిగా కలిగి వుండాలి. ఆస్తికుడై విష్ణు భక్తుడై వుండాలి. మత్సరం వుండకూడదు. మంత్రజ్ఞుడు, మంత్రార్థము తెలిసినవాడు, శుచిగావుండేవాడు అయివుండాలి. పురాణజ్ఞానము,. తన గురువుల యెడలభక్తి కలిగి వుండాలి. ఈ లక్షణములన్ని వున్నవాడే ఆచార్యుడు అని శాస్త్రం చెపుతున్నది. హనుమ దూత కృత్యం కిష్కింధకాండలో ఆరంభమై, అది సుందరకాండలో దశకంఠునికి హితోపదేశం చేసే వరకు కొనసాగుతుంది.

22. తారాదేవి విలాపము – హనుమద్గీత

హనుమంతుని దౌత్యం ఫలించి రామసుగ్రీవులకు మైత్రి కుదిరింది. ఇక వాలిని సంహరించి, సుగ్రీవునికి పట్టాభిషేకము చేసి కిష్కింధారాజ్యానికి వానరరాజును చేస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞచేసాడు. అయితే వాలిని సంహరించగల సమర్థత రాముని వద్ద వున్నదా అని సుగ్రీవుని సందేహము. లక్ష్మణుడది గ్రహించాడు.

"సుగ్రీవా! ఏపని చేస్తే మా అన్న వాలిని సంహరించగలడని నువ్వు నమ్మగలవు" అని ప్రశ్నించాడు. రామలక్ష్మణులను సుగ్రీవుడు ఏడు సాల వృక్షముల వద్దకు తీసుకుపోయి

"మా అన్న విలువిద్యకాడు కాదు. అయినా బాణం చేతితో విసరితే అది ఒక సాలవృక్షం నుండి మరొక దానిలోనికి దూసుకుపోయేది. తను చంపిన మహిషాసురుని శరీరం యోజనదూరం విసిరాడు. అట్లే రామచంద్రుడు తన విలువిద్యను, శక్తిని ప్రదర్శించాలి" అన్నాడు. రామచంద్రుడు మందహాసం చేసి ధనస్సుతో బాణాన్ని ఏడు సాలవృక్షముల గుండా పోవునట్లు కొట్టాడు. సుగ్రీవుడు ఆశ్చర్యపోయాడు. వెంటనే దుందుభి ఎముకల గూడు తన పాదం కదలకుండా బొటనవ్రేలితో నెట్టగా అది పది

ఆమడల దూరం వెళ్ళిపడింది. సుగ్రీవుడు ఆశ్చర్యపోయి రాముని పాదాలపై పడి సమస్కరించాడు. వాలి సుగ్రీవులు ఘోరంగా పోరాడారు. యిద్దరిలో భేదం గుర్తించలేని రాముడు మొదటిసారి బాణప్రయోగం చెయ్యలేదు. సుగ్రీవుడు అన్న దెబ్బలకు తాళలేక ఋశ్యమూకం మీదికి పారిపోగా వాలి తన రాజమందిరానికి వెళ్ళిపోయాడు.

రామచంద్రుడు తాను యిరువురి అన్నదమ్ముల మధ్య భేదం గుర్తించడానికి గజపుష్పమాలను తెచ్చి సుగ్రీవుని మెడలో అలంకరించమని చెప్పగా లక్ష్మణుడట్లే చేసాడు. వాలిని రెండవసారి పోరాటానికి వెళ్ళవద్దని తారాదేవి చెప్పినా ఆయన వినిపించుకోకుండా వచ్చి సుగ్రీవునితో తలపడగా, చెట్టు చాటునుండి బాణం వేసి రాముడతనిని హతమార్చాడు.

తార వాలిభార్య. వాలి యుద్ధంలో నేలకొరిగాడని తెలియగానే కుమారుడు అంగదుని తీసుకుని రణభూమికి వస్తుంది. మహావృక్షాన్ని నరికితే దానిని అల్లుకున్న తీగకూడా నేలపై పడిపోతుంది. మహాబాహుడు, జితశ్రముడు, వానరేంద్రుడు, ఇంద్రపుత్రుడు అయిన వాలి నేలపై పడివుంటే తార అతన్ని కౌగలించుకుని ఏడుస్తూంటుంది.

'పండితుడైనవాడు తన కుమార్తెను శూరునకిచ్చి పెండ్లి చెయ్యకూడదు. నా భర్త శూరుడవటం వల్లనే రణభూమిలో రక్తపుమడుగులో దొర్లుతూ నేలపై పడివున్నాడు. నాకు వైధవ్యం ప్రాప్తించింది. కపటయుద్ధం తెలియనివాడు నా పెనిమిటి.' అని బావురుమని ఏడుస్తోంది. మెడలో కాంచనమాల ధరించిన వాడవటం చేత యింకా ప్రాణం పోలేదు. వాలి భార్యాపుత్రుల ఆగమనం గమనించి కళ్ళు తెరిచి మెల్లగాచూసాడు. తార ఏడుస్తోంది –

"నాథా దుమ్ము, రక్తం నీ శరీరం నిండా అలుముకున్నాయి. నిన్ను ఆలింగనం చేసుకునే వీలులేకుండా ఈ బాణం నన్ను యిబ్బంది పెడుతోంది. ప్రాణేశ్వరా ! నీ శరీరం నుండి వెలువడిన రక్తం, ఇంద్రగోపపు వన్నెలాగ ఎఱ్ఱనైన శయ్యపై నువ్వు పడుకున్నట్లు వుంది. పతిగతించిన ఆడుదానికి కుమారులున్నా, ధనధాన్యాలున్నా, మేడలు, మిద్దెలు, రాజభోగాలు, అన్నీవున్నా ప్రజలచేత 'విధవ' అనే పిలువబడుతుంది కదా ! నాకెందుకీ శిక్ష" అని బాధపడుతోంది. తారాదేవి వాలి శరీరం మీద పడి అమితంగా రోదిస్తోంది. ఆమె సాధ్వీ శిరోమణి. పతివ్రతగా లోకంలో పేరుంది. వాలి వలన బలశాలియైన అంగదుడ్ని కన్నది. తారకాక వాలికి అనేకమంది భార్యలున్నారు. వారందరిని తోబుట్టువులుగా ప్రేమించి ఆదరించేది. అందరూ వచ్చి వాలిచుట్టూ చేరి ఘొల్లుమన్నారు. నాథుని ప్రతాపాలు చెప్పుకుంటూ గుండెలవిసేలా రోదిస్తోంది అమె. వాలి నెమ్మదిగా తెప్పరిల్లి ఓపికనంతా కూడగట్టుకుని

సుగ్రీవుని పిలిచాడు. కన్నీరు మున్నీరుగా యేడుస్తున్న ఆయన వాలి వద్దకు వచ్చాడు. అంగదుని సుగ్రీవునికి అప్పగించాడు. రాజ్యాన్ని యేలుకోమని చెప్పి తన మెడలోని కాంచనమాలను సుగ్రీవుని మెడలో వేసి కన్నుమూసాడు. ఎప్పుడైతే దివ్య ప్రభావంగల మాలను తీసివేసాడో అప్పుడే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. తారాదేవి రోదనం తార స్థాయికి, చేరుకుంది. ఆమె దుఃఖానికి అవధుల్లేవు.

"వీరుడా! ప్రియుడా! సుగ్రీవునితో తలపడవద్దని, అతని భార్య రుమను అతనికిచ్చివేయమని ఎన్నోసార్లు హితం చెప్పినా వినకుండా ఈ దుస్థితి తెచ్చుకున్నావు. నన్ను వదలి ఈ భూమిని కౌగలించుకున్నావు. నీకింత నిర్దయ తగునా?" అంటూ జుట్టు విరబోసుకుని వంటిమీద తొలగిన పైట కూడా సరి చేసుకోకుండా రోదిస్తుంటే ప్రక్కనున్న సవతులు ఆమెను ఊరడిల్లజేసి పైటకొంగు సర్దుతున్నారు. దూరంగా నిలబడి చూస్తున్న ఆంజనేయునికి ఆమెను చూసి జాలి వేసింది. దగ్గరగా వెళ్ళి తారను ఓదారుస్తున్నాడు. మామూలు మాటలు ఆమె చెవికెక్కటం లేదు. ఆమె దృష్టిని తాత్విక చింతన వైపు మరల్చాలని -

శ్రీ హనుమద్గీత

వాల్మీకి రామాయణము, కిష్కింధాకాండము. 21వ సర్గ, 2వ శ్లోకము :

గుణదోషకృతం జంతుః
స్వకర్మఫలహేతుకం
అవ్యగ్రస్తదవాప్నోతి
సర్వం ప్రేత్య శుభాశుభమ్.



తనకు తెలిసియో తెలియకయో తాను చేసిన పూర్వకర్మలను బట్టి వాటి మంచి చెడ్డలకు తగిన సుఖదుఃఖాలను ప్రతిప్రాణి పరలోకంలో అనుభవిస్తాడు. వాలి తాను చేసిన పురాకృత కర్మనుబట్టి శ్రీరామచంద్రుని వంటి ధర్మపరుని చేతిలో హతుడయ్యాడు. అతనికి మోక్షం ప్రాప్తిస్తుంది. ఈతని మరణంలో సుగ్రీవుడు నిమిత్తమాత్రుడు. వాలి చేసుకున్న కర్మలే అతని మరణానికి కారణంగాని అతని సోదరుడు కాదు.

3వ శ్లోకము :-

శోచ్యా శోచసి కం శోచ్యం
దీనం దీనానుకంపసే.
కస్య కో వాఽస్య శోచ్యోఽస్తి
దేహేఽస్మిన్ బుద్బుదోపమే.

తల్లీ తారాదేవి! నేను ఏయే కర్మలను చేసి ఏ లోకములకు పోవలసివున్నదో? - అని నిన్ను గురించి నువ్వే శోకింపవలసిన తరుణం వచ్చింది. నువ్వే యిప్పుడు దీనురాలవై వుండి వేరెవరి కొరకో జాలిపడతావెందుకు? ఈ శరీరము నీటి బుగ్గవంటిది. ఎప్పుడది పగిలిపోతుందో ఎరుగము. అటువంటి శరీరంపై వ్యామోహం కలిగి ఒకరికొకరు దుఃఖింపవలసిన పనిలేదు.

4వ శ్లోకము :-

అంగదస్తు కుమారో౽ యం

ద్రష్టవ్యో జీవపుత్రయా,

ఆయత్యాం చ విధేయాని

సమర్థాన్యస్య చింతయ.

మహారాణీ! నీ కుమారుడు అంగదుడు వున్నాడు. అతని కొరకు నువ్వు జీవించు. వాలితో సహగమనం చెయ్యరాదు. నీ కుమారుని కోసం తరువాత ఏమి చెయ్యవలసివుందో ఆ హితమును గురించి ఆలోచించు.

5వ శ్లోకము :-

జానా స్యనియతా మేవం

భూతానా మాగతిం గతిం,

తస్మా చ్ఛుభం హి కర్తవ్యం

పండితే నైహలౌకికమ్.

ప్రాణుల రాకపోకలు, అనగా జననమరణాలను గురించి నీవెరుగుదువు. బుద్ధిమంతులైన మానవులు ఈలోకానికి చెందిన దుఃఖాన్ని విడిచిపెట్టి శాశ్వత శుభాన్నిచ్చే ఔర్ధ్వదైహిక క్రియలను ఆచరించాలి.

అని ఆంజనేయస్వామి తారాదేవిని ఓదార్చటం "హనుమద్గీత" గా చెప్పుకోవచ్చు. త్రేతాయుగంలోని రామాయణ కాలానికి; ద్వాపర యుగంలో జరిగిన మహాభారత యుద్ధ సన్నివేశంలో అంతర్భాగమైన శ్రీకృష్ణభగవానుడు చెప్పిన భగవద్గీతలోని కొన్ని శ్లోకాల భావాలతో చక్కగా పోలికవుంది. సత్యం ఒకటే. అది ఏ యుగంలో ఎవరినోట వెలువడ్డా దాని స్వరూప స్వభావాలలో పోలిక వుంటుంది. ఆ సత్యాన్నే విభిన్న పాత్రల ద్వారా విభిన్న ప్రాంతాలలో విభిన్న కాలాలలో చెప్పించటం; మానవునిలో ధర్మ ప్రవర్తన పెంచడానికి భగవంతుడు, సత్పురుషులు చేసే ప్రయత్నాలు.


శ్రీ భగవద్గీత : సాంఖ్యయోగము, 11వ శ్లోకము :-

అశోచ్యానన్వశోచస్త్వం
ప్రజ్ఞావాదాంశ్చ భాషసే.
గతాసూనగతాసూంశ్చ
నానుశోచన్తి పణ్డితాః

శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు చెప్పుతున్నాడు. నువ్వు దుఃఖింపరాని భీష్మద్రోణకర్ణాది వీరుల కోసం పరితపిస్తున్నావు. ప్రాజ్ఞులు చెప్పవలసిన ప్రజ్ఞావాదములు పలుకుతున్నావు. పండితుడైనవాడు మృతి నొందిన వారి కొఱకుగాని, జీవించి వున్న వారికొఱకు గాని దుఃఖించరు.

వ్యాఖ్య: ప్రజ్ఞావాదమంటే బుద్ధి యుక్తమైనమాట. లోక సంబంధమైన పలుకు. ప్రాపంచిక బంధనాలతో కూడిన మాటల్ని ప్రజ్ఞావాదం అంటారు. ప్రతి మానువుడు తన కుటుంబీకుల కోసం, మిత్రుల కోసం తాపత్రయ పడుతుంటాడు. వారికి అపదవస్తే తనే అపదలో వున్నట్లుభావిస్తాడు. దీనినే మమకారమని కూడా అంటాము. రణరంగంలో మమకారం చూపించి ప్రయోజనం లేదు. విల్లమ్ములు వదలి యుద్ధభూమిలో నిలబడితే అది అవతలివారు మమకారమను కోరు. పిరికితనమే అంటారు. అందువల్ల సవ్యసాచికి మమకారం తగ్గించేందుకు భగవానుడు ప్రయత్నిస్తున్నాడు. మరి హనుమ త్రేతాయుగంలోనే అసంగతి తారకు చెప్పాడు.

సాంఖ్యయోగము 27వ శ్లోకము :-



జాతస్య హి ధ్రువో మృత్యు
ర్ధ్రువం జన్మ మృతస్య చ.
తస్మాద పరిహార్యే2 ర్థే
నత్వం శోచితు మర్హసి.

పుట్టిన వస్తువుకు నాశము నిశ్చయము. నశించిన వస్తువుకు పుట్టుకా నిశ్చయమే. కాబట్టి తప్పించడానికి వీలులేని కార్యము విషయమై నువ్వు దుఃఖించరాదు.

వ్యాఖ్య: తారాదేవికి హనుమంతుడు చెప్పింది కూడా యిదే! వాలి మరణానికి సుగ్రీవుడు కారకుడు కాదు. వాలి చేసుకున్న కర్మయే కారణం అంటాడు. సుగ్రీవుడు అనివార్య పరిస్థితులలో రాజ్యపట్టాభిషిక్తుడై కపిరాజ్యాన్ని అన్న తిరిగి వచ్చేసరికి కాపాడాడు. అది విస్మరించిన వాలి అతనిపై అమిత క్రోధం వహించి; సుగ్రీవుని భార్యను హస్తగతం చేసుకుని, అతనిని కట్టు బట్టలతో తరిమి కొట్టడమే వాలి చేసుకున్న పాపకర్మ. ధర్మాన్ని రక్షించవలసిన రాజే పరభార్యను చేపట్టడం తప్పిదమేకదా! ఆ పాతకకృత్యానికి ధర్మపరుడైన శ్రీరామచంద్రుడు శిక్షవిధించాడు. తనను అన్యాయంగా

చంపాడని చివరి క్షణాల్లో వాలి అడిగినపుడు రామచంద్రుడు యిలా బదులిచ్చాడు.

"మానవులు అనేక పాపాలు చేసి వాటికి తగిన దండన రాజువలన పొంది; ఆ పాపాన్ని పోగొట్టుకుని పుణ్యపురుషులై స్వర్గానికి వెడతారు. పూర్వం నీవలెనే శ్రమణకుడనే పౌరుడు పాపకర్మ చేయగా మా వంశపు రాజు మాంధాత అతనికి ఘోర దండన విధిస్తాడు. అందువల్ల పరకాంతా కాముకత్వం గలనిన్ను దండించే హక్కు నాకుంది. నేను ప్రస్తుతం రాజును కాకపోయినా ఈ ఆర్యావర్తాన్ని ఏలే భరతుడు నా సోదరుడు. అతని ప్రతినిధిగా ధర్మసంస్థాపన చేస్తున్న నాకు నిన్ను సంహరించటం విధి నిర్వహణమే అవుతుంది. నీచేతే చేయబడిన పాపకృత్యానికి శిక్షను యిక్కడే అనుభవించావు గనుక నీకు స్వర్గం ప్రాప్తిస్తుంది" అని విశదీకరిస్తాడు.

మరణమనేది జీవికి ఎలాగూ తప్పనప్పుడు అది భగవదవతారమైన రాముని చేత నిర్జింపబడటం వాలిచేసుకున్న పుణ్యఫలమే కదా!

భగవద్గీత. కర్మయోగము. 8వ, శ్లోకము :-


నియతం కురు కర్మ త్వం
కర్మ జ్యాయో హ్యకర్మణః
శరీర యాత్రా2 పి చ తే
న ప్రసిద్ధ్యేదకర్మణః

అర్జునా! నువ్వు నిత్యం కర్మలను చెయ్యి, కర్మలను (పనులను) చేయకుండా వుండటం కంటె, ఏదో ఒక పనిని చేస్తూ వుండటమే శ్రేష్ఠమైనది. ఏ పని చెయ్యకపోవటం వలన శరీర యాత్ర కూడా సిద్ధింపదు.

వ్యాఖ్య : కౌరవులతో వైరం యేర్పడి యుద్ధభూమి వరకు వచ్చాక రణమనే కర్మను చేసితీరాలి. అక్కడ వెనుదిరిగితే అర్జునుడు పిరికిపంద అనిపించుకుంటాడుగాని బంధుప్రీతి వున్నవాడు; అహింసాపరుడు అని ఎవరూ ఆయనను కీర్తించరు. అలానే వాలి మరణించిన తరువాత అతని కోసం దుఃఖిస్తూ సతీసహగమనం చేయటం కంటె; కుమారుడు అంగదుని సంరక్షించుకోవటమే తారాదేవికి ఉత్తమమైనకర్మ. అందుచేత కపికులరాణికి వేదాంత తత్వం బోధించిన ఆదిగీతాచార్యుడు శ్రీ ఆంజనేయస్వామి వారు.

ధనమునకు దానము చేయు
గతులుండును. ఎవడు దానము
మూడవగతి పట్టును.

శ్రీఆంజనేయుడు



సుందరకాండ

23. హనుమ ఆకాశ గమనము

శత్రునాశన సమర్థుడైన హనుమంతుడు, రావణాపహృత అయిన సీతామహాసాధ్విని అన్వేషించడం కోసం చారణులనే దేవతలు సంచరించే ఆకాశమార్గాన పయనించడానికి ఉద్యుక్తుడై శిరస్సు పైకెత్తి చూసాడు. స్వచ్ఛంద సంచరణ శీలియైన మృగరాజులా అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. ఆయన ఉత్సాహంతో పదఘట్టనలు చేస్తున్నాడు. గిరిమీది మహావృక్షాలు ఫెళఫెళా విరిగి పడుతున్నాయి. మృగ, పక్షిగణాలు ప్రాణభయంతో దిక్కుతోచక పారిపోతున్నాయి. గ్రద్దలు రివ్వున ఎగిరి పోతున్నాయి. వివిధ ధాతురజ శోభితమైన వస్త్రాలు ధరించి కామరూపులైన కిన్నెర, యక్ష, గంధర్వ గణాలతో మత్తేభయూథాలతో విరజిల్లే మహేంద్రగిరిపై హనుమంతుడు తామర కొలనులో గంధగజంలా శోభిల్లుతున్నాడు.

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన హనుమ, రావణుడు నివసించే లంకను చేరుతాను, సీతాదేవిని ఎక్కడ వుంచాడో కనిపెడతాను ఈ సముద్రాన్ని దాటటం నాకెంత పని, అని శుభసంకల్పం చేసుకొని సూర్యుని, ఇంద్రుని, బ్రహ్మను, భూతగణాలను, శివపార్వతులను ధ్యానించి నమస్కరించాడు. దృష్టి నిశ్చలంగా నిల్పి తూర్పుదిక్కుకు తిరిగి తన తండ్రి వాయుదేవునికి ప్రణామాలర్పించాడు. తన శరీరాన్ని యింకా

పెంచుకొని దక్షిణ దిశ కడలివంక చూసాడు. పర్వతశిఖరం మీద పదఘట్టనలు చేసి ఒక సారి ముందుకు వంగి చేతులతో దభీమని తట్టాడు. కొండంతా బురదలో పడిన రాయిలా ఊగిసలాడింది. అంగద, జాంబవంతాది వానరవీరులంతా దూరంగా చేరి హర్షధ్వానాలు చేయగా సాధారణ వానరులు సంభ్రమాశ్చర్యాలతో కుప్పిగంతులు వేస్తున్నారు. ఏనుగు గండ స్థలం నుండి మదజలం స్రవించినట్లు కొండ పగుళ్ళు వారి కొత్తసెలయేళ్ళు ప్రవహించసాగాయి. పసుపు, ఎరుపు, నలుపు వర్ణాల్లో సత్వరజస్తమో గుణాల్లా ధాతువులు పెల్లుబికాయి. మ్రానుల మొదళ్ళలో నిలువెత్తు పెరిగిన ఎర్రమట్టి పుట్టల్లోంచి కాలకూటవిషసర్పాలు కస్సున లేచి పడగలు విప్పి శత్రువుకానరాక బండశిలల్ని కాటు వేయగా నిప్పు కణాలు మిణుగురు పురుగుల్లా తూలిపడ్డాయి. హనుమంతుడు నిటారుగా నిలబడి రోమాలు విదిలించి, తోకపైకెత్తి నేలను బలంగా కొట్టగా ధూళిరేగి మేఘమండలం వరకు వ్యాపించింది.

సింహనాదం చేసి, శరీర పూర్వభాగాన్ని కుంచించి, రొమ్ము నిండా గాలి పీల్చి వక్షం అంతరిక్షంలా విశాలం చేసి, ఊపిరి బిగబట్టి పాదాలు దృఢంగా అన్చి, చెవులు ముడుచుకొని, గదను కుడి భుజంపై బలిష్ఠంగా పట్టుకొని, ఒక్కసారి కుప్పించి ఎగిసి పైకిలేచాడు. గరుత్మంతునిలా ఆకాశంలోకి చొచ్చుకు పోతున్నాడు. రామబాణంలా జవంతో వెళుతున్నాడు. ఆ వేగానికి మద్దిమానులు, క్రానుగ చెట్లు, గంధపు చెట్లు, సంపెంగ చెట్లు, వటవృక్షాలు పెళ్ళగించుకొని గాలిలోకి లేచి ఆకులు పువ్వులు రాలుస్తూ సుగంధాలు విరజిమ్ముతూ ఆకాశాన కొంత దూరం ఎగిరి బంధువును సాగనంపినట్లుగా హనుమను సాగనంపి ఒకటొకటే సముద్రంలో పడుతూ జలచరాలను భీతిల్లజేస్తున్నాయి. ఎర్రని పచ్చని పువ్వులు నీలి సాగర తరంగాలపై పడి ఆకాశంలోని నక్షత్రాల్లా కడు రమణీయంగా వున్నాయి. పవన వేగం పుంజుకొని నభోమండలంలో ప్రవేశించిన మారుతి చేతులు అయిదు తలల ఫణిరాజులా భాసిల్లుతున్నాయి. జలధి కల్లోలితమై ఉత్తుంగతరంగాలతో లేస్తున్నది. మీదికి ఎగిసి అయన వక్షాన్ని తాకే గాలి వాయుదేవుడే స్వయంగా వచ్చి లోకకళ్యాణం కోసం బయలు దేరిన పుత్రుడ్ని గాఢాలింగనం చేసుకుంటున్నట్లుగా వుంది. జలనిధిలోని జలచరాలు, సర్పాలు గరుత్మంతుడే వస్తున్నాడని కంపిస్తూ అట్ట అడుక్కి పోతున్నాయి. కార్యదీక్షలో విజృంభించిన హనుమ కన్నులు ఎర్రబారి చింతనిప్పుల్లా వున్నాయి. పగడపు రంగు నాసిక సంధ్యాసమయ మార్తాండతేజంతో వెలుగొందుతోంది. లాంగూలం యింద్రచాపమైంది. ఆ పెనుతోకవలయం మధ్యలో వున్న మారుతి పరివేష మధ్యగత సూర్యసదృశంగా వున్నాడు. తామ్రవర్ణంతోడి జంఘలు గైరిక ధాతుపూరితాలైన మహాగిరుల్లా వున్నాయి. వాయుమండలంలో దూసుకుపోతూ మేఘగర్జనతో ఉత్తరదిశ

నుండి దక్షిణంగా వెళ్ళే ఉల్కలా వున్నాడు. ధూమకేతువులా వున్న అంజనాతనయుని నీడ పది యోజనాల వెడల్పు, ముప్పది యోజనాల పొడవు వుండి సముద్రంలో సుందరంగా కనిపిస్తోంది.

రావణ దుష్టకార్యాలతో విసిగి వేసారిన దేవతలు, ఋషులు, యక్షులు, గంధర్వులు, విద్యాధరులు, శ్రీమహావిష్ణువును ప్రార్థించారు కదా అతని పీడవదల్చమని వారి శ్రేయస్సుకోరి లక్ష్మీనారాయణులు సీతారాములుగా అవతరించి అవనిపై సాధారణ మానవుల్లాగా అడవికి వెళ్ళారు. దుష్టదానవరాజు వైదేహిని అపహరించాడు కాముకుడై. సీతారాములు వియోగం అనుభవిస్తున్నారు. ఇవన్నీ గమనిస్తూనేవున్నారు పై వారంతా. తమ కోసం యిడుములు బడుతున్న సీతారాముల్ని తిరిగి కలిపే ప్రయత్నంలో సాధ్వీసీత క్షేమం తెలుసుకుని శ్రీరామ భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించడంలో ఆంజనేయస్వామి తన సర్వశక్తుల్ని వినియోగించి ఏకాగ్రచిత్తంతో గగనవీధిని ప్రయాణం చేస్తుంటే ఆ ఋషి దేవతా గంధర్వగణమంతా అంబరవీధిని బారులు తీరి నిలబడి హనుమను సంభ్రమాశ్చర్యాలతో ప్రేమతో తిలకిస్తూ ఆశీస్సులు పలికి సౌగంధి పారిజాత మందార చంపకాదీ పుష్పవర్షం కురిపిస్తున్నారు.

రాఘవుని పూర్వీకులు సముద్రునికి ఉపకారాలు చేసారు. అందుకని ప్రత్యుపకారబుద్ధితో సాగరుడు, తనలో దాగివున్న మైనాకపర్వతంతో యిలా అన్నాడు.

"ఓ గిరిశేఖరా! దేవేంద్రుని ఆజ్ఞానుసారం పాతాళబిలవాసులు నా గర్భం నుండి పైకి రాకుండా యిక్కడ విడిది చేసి, నిర్విరామ జగత్కళ్యాణ దీక్షాకంకణ బద్ధుడవై వున్నావు నీవు. దుష్టసంహారం కోసం ఇక్ష్వాకువంశంలో రామచంద్రునికి బాసటగా నిలిచిన వానర వీరుల్లో శ్రేష్ఠుడైన హనుమ రామదూతగా లంకాద్వీపం వైపు వెడుతున్నాడు. నీకు యదేచ్ఛగా పైకి ఎగిరే శక్తివుంది. కనుక వివిధ ఫలపుష్పాదులతో నిండిన రూపం ధరించి, పైకి లేచి ఆయనకు ఆతిథ్యం యియ్యి", అన్నాడు.

"అవశ్యం సాగరా ! అంటూ సుందర ఫలపుష్ప వనాలతో స్వాదుజల పూరిత సెలయేళ్ళతో, విశ్రమించడానికి వీలైన మహావృక్షాల నీడతో, మెత్తని ఆకుపచ్చని పచ్చికబయళ్ళతో మకరందభాండాల్లా తరుశాఖలకు వ్రేలాడే తేనెపట్టులతో కడు రమణీయంగా పైకి లేచాడు మైనాకుడు.

హఠాత్తుగా పర్వతశిఖరాలు తన మార్గాని కడ్డంగా పైకి లేవటం చూసిన హనుమ అది దుష్ట రాక్షస పన్నాగం అయివుంటుందని భావించి ఝుంఝూ మారుతం మేఘాలను కొట్టినట్టు రొమ్మునిండా గాలి పీల్చుకొని వక్షంతో గిరిశిఖరం కొట్టాడు. కొన్ని బండశిలలు గుండయి సముద్రంలో రాలి మైనాకుడు మజ్జిగలో కవ్వంలా సముద్రంలో తూలాడు. వెంటనే లీలగా సాకార రూపం దాల్చి "నాయనా! నేను

మైనాకపర్వతాన్ని సాగరవంశంలో జన్మించిన రామచంద్రుని కార్యంలో పాలుపంచుకుందామని నీకు ఆతిధ్యం యివ్వవలసినదిగా సాగరుడు నన్ను పంపాడు. ఈ బాంధవ్యాన్ని గౌరవించి నీవు నాపై కొంతసేపు నిల్చి ఫలహారం చేసి దప్పిక తీర్చుకొని విశ్రమించి వెళ్ళు. సాగరుని ఆదేశమేకాదు సుమా! యిది నా మనః పూర్వకమైన ఆహ్వానం. చిరంజీవీ! ఒకప్పుడు పర్వతాలకు రెక్కలుండేవి. అవి యదేచ్ఛగా విహరించి జనులను, మునులను, జానపదాలను ధ్వంసం చేస్తున్నాయని మహేంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల పక్షాలు తెగనరకడం ప్రారంభించాడు. అతని బారినుండి నేను తప్పించుకుని ఈ సముద్ర గర్భం చేరడానికి నీతండ్రి పవన దేవుడు సహాయం చేసాడు. ఆ రకంగా నువ్వు నాకు మిత్రపుత్రుడివి. నా ఆతిధ్యం స్వీకరించి నన్ను కృతార్థుడ్ని చెయ్యి" అని ప్రాధేయ పడ్డాడు.

హనుమ సంతోషించి, కొంచెం వేగం తగ్గించి "పర్వతరాజా మైనాకా! నా జనకుని మిత్రుడవు నాకు పూజ్యుడవు. శ్రీరామకార్యం మధ్యలో ఆగరాదు. ఈ పగలు గడవకుండా నేను లంక చేరాలి. నీ ఆదరవాక్కులు అమృత ప్రాయమై నా మనస్సును ఉల్లాసపరిచాయి. ఆతిధ్యం స్వీకరించినట్లే భావించు" అని గిరిశిఖరం ప్రేమతో స్పృశించి ముందుకు సాగాడు.



24. నాగమాత–సురస, ఛాయాగ్రాహిణి సింహిక



రివ్వురివ్వున కొంత దవ్వు వేగంగా వెళ్ళేసరికి కుడి ఎడమల ఏనుగుదంతాల వంటి కోరలతో రక్తారుణిమ నాలుక ముందు వ్రేలాడగా, క్రోధారుణిత నేత్రయుగళంతో తన వైపే చూస్తూ నొసలు చిట్లించి కొండగుహలాంటి నోరు తెరిచింది ఒక రక్కసి – "కపిశ్రేష్ఠుడా! దేవతలు ఈ రోజు నిన్నునాకు ఆహారంగా యిచ్చారు. నా వదన గహ్వరంలో ప్రవేశించి నా ఆకలి తీర్చు" అంది.

"నేను దాశరథియైన శ్రీరామునిభార్య, సీతాసాధ్విని, రావణుడు అపహరించగా ఆమె జాడ తెలుసుకోడానికి వెదుతున్నాను. నన్ను అడ్డగించకు" అని వినయంగా బదులిచ్చాడు.

"వీలు లేదు నానోట ప్రవేశించి తీరవలసిందే అంది రాక్షసి.

హనుమ తన దేహాన్ని అపారంగా పెంచేసాడు. కాని రాక్షసికూడా అతన్ని మింగేంత నోరు వికృతంగా వ్యాపింపచేస్తోంది. రెప్పపాటు కాలంలో ఆంజనేయుడు అంగుష్టదేహుడై ఆమె నోటి గుండా ఉదరం వరకు వెళ్ళి ఈ వలకు వచ్చేసి సాధారణ రూపం దాల్చి –

"తల్లీ! నీ నోటినే కాదు ఉదరం కూడా చూసివచ్చాను. నీ పంతం నెగ్గింది కదా! నమస్కారం మరి నేను వెళ్ళి రానా" అన్నాడు.

"అంజనీ నందనా! నేను సురస అనే నాగమాతను. దేవతల కోరిక మేరకు నీ కార్య దీక్ష పరీక్షించాను. శ్రీరామకార్యంలో విజయం పొందుదువు గాక! అని ఆశీర్వదించి అదృశ్యమైంది. ఈ పరీక్షతో కాలయాపన అయిందని వేగం పెంచి వెడుతున్నాడు వాయుసూనుడు. అయితే తను ఎంత వేగం పెంచినా ముందుకు వెళ్ళలేకపోతున్నానని తనను ఎవరో పట్టిలాగుతున్నారని గ్రహించి నలుదిక్కులా చూసాడు. ఎవరూ కానక క్రిందికి చూసాడు. సముద్రంలో ఒక పెద్ద భూతం కనిపించింది. అది తన నీడను పట్టిలాగడం వల్ల వేగం తగ్గిందని తెలుసుకున్నాడు. సుగ్రీవుడు ముందే హెచ్చరిక చేసాడు సుమా, సింహిక అనే ఛాయాగ్రహణి ఈ ప్రాంతంలో వున్నదని" అనుకున్నాడు. అంతలోనే ఆ భూతం క్రూరంగా అరుస్తూ -


"నీ కోసమే చూస్తున్నాను రా! నాకు చాలా ఆకలిగా వుంది" అని గుహలాంటి నోరు తెరిచింది సింహిక, హనుమ వెంటనే దాని నోట్లో సూక్ష్మ రూపుడై దూకి గోళ్ళతో దాని గుండెను చీల్చి, యింకా క్రిందికి పోయి మర్మ స్థానాలు కూడా ఛేదించి బైటకు వచ్చేసాడు. యితరులను హింసించడమే స్వభావంగా గల సింహిక తానే హింసకు గురై నశించింది.

"హా! వానరా! చంపావురా" అని భీకరంగా అరుస్తూ భూతం సముద్రంలో పడిపోయి నక్రతిమింగలాలలకు ఆహారమైపోయింది. గ్రహణం విడిచిన పూర్ణ శశిబింబంలా ప్రకాశిస్తూ ప్రయాణం వేగంగా సాగిస్తున్నాడు. అవతలి గట్టు సువిశాలమైన ఇసుక తిన్నెలతో మత్స్యకారుల పడవలతో కనిపిస్తోంది. వేగం తగ్గించి సూటిగా చూసాడు. అరటితోపులు, కొబ్బరితోటలు కనిపిస్తున్నాయి. దూరంగా పర్వత పంక్తులు కనిపించాయి. కొంచెం ఎత్తు ఎగిరి చూసాడు. ధవళకాంతులతో మెరిసే భవనాలు కోట ప్రాకారాలు కనిపించాయి. సంపాతి చెప్పగా విన్న వివరాలతో పోల్చుకొని అదే లంకాద్వీపమని యెంచి ఉల్లాసంగా క్రిందికి దిగాడు. సామాన్య రూపం ధరించి, లంకాతీరంలో మెల్లగా అడుగులు వేస్తూ నదీ సాగరసంగమ స్థలం చూసాడు. త్రికూటపర్వతం వైపు నడక సాగిస్తున్నాడు. ఆకాశంలో వ్రేలాడుతున్నట్లుగా కడుశోభాయమానమైన అమరావతిలా లంకానగరం కనిపిస్తోంది. త్రికూటగిరి మీద గిరిమల్లెపూలు, పగడచెట్లు, సంపెంగలు మల్లెపొదలు విరబూసి పరిమళాలు వెదజల్లుతున్నాయి. సెలయేటిలో నీలికలువలు, మీనాలు సుందరంగా కనిపిస్తున్నాయి. రకారకాల పూలు గాలికి రాలిపడుతూ హనుమరోమాల మధ్యపడి వళ్ళంతా సుగంధాలు విరజిమ్ముతున్నాయి. నూరుయోజనాలు దాటివచ్చినా మార్గాయాశంగాని, శ్రమగాని

అనిపించలేదాయనకు. ఖర్జూర, కర్ణికార, కుటజ, సరళ, ప్రియాంశు, కోవిదార, కరవీర, మహాగని మొదలైన వృక్షాలు చూస్తూ, స్వచ్ఛజల సరోవరాల్లోని సారస, హంస, కారండాది జల పక్షుల రెక్కల చప్పుడు వింటూ వాటి సోయగాలు చూస్తూ ముందుకు సాగుతున్నాడు. అపరాహ్ణం అయింది.



25. వాయునందనుని లంకా ప్రవేశము



లంకానగర ప్రాకారం సమీపిస్తున్నాడు హనుమ. చతుర్ముఖప్రజాపతి అనుగ్రహంతో కుబేరుడు ఆ నగరాన్ని పాలించాడు. మరింత సుందరము, పటిష్టము శత్రు దుర్భేధ్యము గావించాడు కుబేరుడు. ఏడు ప్రాకారాలతో కోట, గిరిశిఖరాలంత మహాభవనాలు, కాంచనద్వారతోరణాలతో ఇంద్రుని పట్టణం లాగేవుంది. నగరం చుట్టూ కందకం వుంది. ప్రాకారాలపై రక్షకయంత్రాలు, అగడ్తలు అంబరచుంబిత జయకేతనాల రెపరెపలు, శతఘ్నులు వున్నాయి. కోట బురుజులు విశాలంగా దృఢంగా కట్టబడ్డాయి. ధనుర్విద్యావిదులు, శూల పాణులు, గదాధరులైన రాక్షసులతో కూడిన సేన కోటను అప్రమత్తంగా కాపలా కాస్తోంది. పగటి పూట ప్రవేశిస్తే ఈ సేన సులువుగా కనిపెట్టగలదు. నిష్కారణకలహం తప్ప కార్యసాఫల్యం జరుగదు' అని సూర్యాస్తమయం వరకు ఆగాడు హనుమ. నేను యేరూపుతో ప్రవేశిస్తే సులువుగా వుంటుంది? రాక్షసులు చూసినా, సందేహించడానికి వీలుకాని చిన్నరూపుతో వెడతాను అని హనుమ ఆలోచిస్తుండగా చీకటి పడింది. ఫాల్గుణ శుద్ధ త్రయోదశి చంద్రోదయ మైంది. కడు రమ్యంగా వెన్నెల విరజిమ్ముతున్నాడు రేరాజుపిండి ఆరబోసినట్లు. ఒక తరుశాఖ చివరికంటా ఎక్కి ప్రాకారంలోపలికి చూసాడు. లంకాపురి రేయెండలో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. అకాశం అంటే భవనాలు బంగారు, వెండి పూత పూయబడి, వైడూర్య నీలి గోమేధికాది రత్నాలు పొదగబడి శిల్పకళా కౌశలంతో అందంగా శోభిస్తున్నాయి.

"అహో! ఎంత ఐశ్వర్యం! ఎంత సొగసుగా వుంది రావణరాజ్యం; అనుకున్నాడు. చీకటి పడటంతో శూలపట్టిసాలు దాల్చి, కోరలు వ్రేలాడుతుండగా, బానవంటి కడుపులు, విశాలవక్షస్థలాలు గల రాజసైనికులు; కాగడాలు పట్టుకొని మరికొన్ని పటాలాలు బైలుదేరాయి. రాజవీధుల్లో కోటపై పహారా మరింత కట్టు దిట్టమైంది

'రావణుడు ఘోరమైన శత్రువు. మా వానరవీరులేకాదు రాముడే యుద్ధానికి వచ్చినా యేమిచేయగలడు? రాక్షసుల విషయంలో సామవచనాలతో కార్యసాఫల్యం జరుగదు. దానభేదోపాయాలకు వశపడరు. యుద్ధమునకు అవకాశములేదు.

అంగదుడు, నీలుడు, సుగ్రీవుడు నేను తప్ప మరియెవరం సముద్రతరణం చేసి ఈ లంకాప్రాకారం చేరుకోవటం కూడా కష్టమే. దీని పేరే 'లంకా' అంటే తమోగుణం అని అంతరార్థం. యిక్కడ రాక్షసులంతా తమోగుణ ప్రధానులే. లంకా శబ్దాన్ని తిరగవేస్తే "కాలం" అవుతుంది. అలా చెప్పుకున్నా సమయం అనీ నలుపు అనీ అర్థం వస్తుంది. రావణుడు, రాక్షసులు నల్లని వారే! రావణుని యేలుబడిలో వారు చల్లగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఏరకంగా చూసినా లంకా అనే ఈ రాజ్యానికి పేరు సార్థకమైనది. యింతకీ రావణుని కాలం బాగుంది. యిక నా రాకతో ఈ రాక్షస రాజు కాలం మారిపోతుంది. నేను కూడా రాక్షసరూపంతోనే కోటలోకి ప్రవేశిస్తే? వద్దు. సూక్ష్మరూపం అనుకూలం అనుకుంటూ చెట్టు దిగి కోటవైపు నడుస్తున్నాడు.

సాయంసంధ్యా తూర్యారావాలు వినిపిస్తున్నాయి. కామరూపుడైన హనుమ దేహం కుచించుకొని చిన్న పిల్లి అంత వానరం అయిపోయాడు. బుల్లితోక ఎఱ్ఱమూతి, నిక్కబొడిచిన చెవులు, ఆకుపచ్చని బొచ్చు, ఎఱ్ఱని కాసెకోక బిగింపు, రూపానికి తగిన తేలికైన పొట్టిగద. చూడముచ్చటైన సుందరాంగుడు హనుమ. అంజనాదేవి చూసి వుంటే మళ్ళీ బాలహనుమను ఎత్తుకొని ముద్దుల్లో ముంచెత్తేది. కోట ఉత్తర ద్వారం సమీపించగానే సర్పాలతో నిండిన అగాధమైన అగడ్త ఎదురైంది. దాన్ని అవలీలగా గంతేసి దాటాడు. ప్రాకారం వైపు రెండడుగులు వేసాడో లేదో -



26. హనుమ – లంకిణి

"ఎవరునువ్వు! కోతీ ఇక్కడికెలావచ్చావు? నా కన్ను గప్పి లంకలో అడుగు పెట్టగలవా? నిజం చెప్పి ప్రాణాలతో బయటపడు" పలికింది. ఓ రాక్షస స్త్రీ, కంఠం మేఘం ఉరిమినట్లు వుంది. ఆగాడు హనుమ.

"నేను వానరాన్నే, సరే! విశాలంగా వున్న ఈ ఉత్తర ద్వారం పట్టనంత లావుగా వికారంగా వున్న నువ్వెవరు? తిరిగి ప్రశ్నించాడు హనుమ.

"నేను లంకానగరాధిదేవత లంకిణిని. రాక్షస రాజేంద్రుడు రావణుని ఆజ్ఞానుసారం నగర రక్షణ చేస్తుంటాను.

"నేనీ నగరం చూసిపోదామని వచ్చాను అంతే," "రావణ పాలిత ప్రాంతంలో నా అనుమతి లేకుండా ప్రవేశిస్తావా! ప్రాణాల మీద ఆశవుంటే తిరిగివెళ్ళు."

"నగరం చూడకుండా వెళ్ళను" అని హనుమ దృఢంగా పలకగానే లంకిణి కనులెర్రచేసి తన అరచేతితో ఒక్క చరుపు చరిచింది. దోమలా నలిగి పోతాడనుకుంది. హనుమ చాకచక్యంగా తప్పించుకుని నిజరూపం ధరించి, పిడికిలి బిగించి ఆడదికదాని సంశయిస్తూ మృదువుగా దాని పొట్టపై గుద్దాడు.

"అబ్బా" అంటూ ముష్టిఘాతం తగిలిన చోట చేత్తో పట్టుకొని బాధతో ముడుచుకు పోయి కింద పడింది లంకిణి. క్షణం ఆగి తెప్పరిల్లింది. హనుమకు జాలి వేసి చెయ్యిచ్చి లేవ నెత్తాడు.

"ఓ వానరోత్తమా! మహాత్ములు ప్రసన్నహృదయంతో దీనుల్ని చూస్తారు. నీ పరాక్రమం సాటిలేనిది. నన్నెవడు జయిస్తాడో వాని వల్లనే లంక నాశన మౌతుందని బ్రహ్మనాకు ఎప్పుడో చెప్పాడు. ప్రజాపతి బ్రహ్మవాక్కు వ్యర్థమవుతుందా!. సీతాపహరణ ఫలంగా దశకంఠుని శిరస్సులు భూపతన మయ్యే రోజు దగ్గర పడింది. నీకీ నగరంలో ఎదురు లేదు. జానకిని అన్వేషించు" అంటూ వినయంగా నమస్కరించి వంగి చేతులుచాపి మార్గం చూపింది. క్షణం ఆలోచించాడు హనుమ. వెనక్కి వెళ్ళి ప్రాకారం పైకి ఎక్కి ఒక్క కుప్పిగంతుతో లోనికి దూకాడు. అదీ ఎడమకాలు ముందు అన్నాడు. లంకిణి బుగ్గలు నొక్కుకొని విస్తుపోయి చూసింది. శత్రునాశనం కోరేవాడు అద్వారం గుండా ప్రవేశించాలని పండితుడయిన హనుమకు తెలుసు గాని ఆ రక్కసికేం ఎరుక!



27. లంకా నగర వర్ణనము

మనస్సంతా ఏకాగ్రచిత్తంతో ఒక్కసారి సీతాసాధ్వి రూపం స్ఫురణకు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. రావణుడు గగన వీధిని ఆమెను ఎత్తుకు పోతుంటే ఋష్యమూక పర్వతం మీద నున్న తనకు లీలగా కనిపించిన సీతాదేవిరూపం గుర్తొచ్చింది. ఉల్లాసంగా అడుగులు ముందుకు వేస్తున్నాడు హనుమ.

కోటలు, ప్రాకారాలు, మిద్దెలు, మేడలు, వీధులు, ఉద్యాన వనాలు, విహార ప్రదేశాలు, జలపాతాలు, వినోద ప్రదర్శన శాలలు అన్నీ చూసుకొంటూ ఒక భవనం మీది నుంచి మరో దానిమీదికి దూకుతూ వెడుతున్నాడు. అసలే మర్కటం అందులోనూ చిన్న పిల్ల కోతి రూపం. రాత్రి వేళ అయన్ని ఎవరూ గుర్తించ లేకపోతున్నారు. పైగా అనంత వాయుమండలంలో ఎగరగలడు, అగాధంలోకి దిగా గలడు. సందుల్లో

యిరుకుల్లో దూరుకుంటూ, జారుకుంటూ చూడముచ్చటగా వెడుతున్నాడు. మధ్య మధ్య నాలుగు కాళ్ళపై పాకుకొంటూ మొక్కల పువ్వులు కోసి చెవుల్లో అలంకరించుకుంటూ కాయలు కొరికి తింటూ వెడుతుంటే సుందరంగా వుంది ఆయన రూపం.

కొన్ని భవన సముదాయాలు పద్మాకారంలో వుండి తామర రేకుల రంగుతో మల్లెల దండలతో, వెండి తోరణాలతో ధగధగలాడుతున్నాయి. వీధుల కూడళ్ళలో భుగభుగ మండే నూని దీపాల వెలుగు, శీతాంశుని ధవళ కాంతి మిశ్రమంగా నగరం అంతా దేదీప్యమానంగా వెలిగి పోతోంది. స్వస్తికాకారంగా మరికొన్ని పసిమి వెల్లవేసిన బంగారు తోరణాలు గట్టి, చామంతి దండలతో అలంకృతమైన భవనాలు, నీలం, పచ్చ, ఎరుపులు, ఊదా; రంగు రంగుల అద్దాలు అమర్చబడిన గవాక్షాలతో చూడముచ్చటగా వున్నాయి.

నయనానందకర హర్మ్యాల నుండి మంద్ర మధ్యమ తారస్థాయిల్లో శాస్త్రీయ రసవత్తర గీతాలు, వీణామృదంగాది వాద్య రమణీయ సమ్మేళన ధ్వనులు శ్రవణానందకరంగా వినిపిస్తున్నాయి. మరికొన్ని గవాక్షాల గుండా నర్తకీమణులు నృత్యం చేస్తుంటే చూస్తూ వెడుతున్నాడు. నూపురధ్వనులు, కాంచీనినాదాలు, అందెల రవళులు వింటూ ముందుకు సాగుతున్నాడు హనుమ. సంధ్యావందనం చేసుకొంటున్నవారు, వేదాధ్యయనం చేస్తున్న కొందరు విప్రవరులు, మంత్రపాఠాలు వల్లె వేస్తున్నారు. రావణ స్తోత్రం చేస్తున్న మరికొందరు కనిపిస్తున్నారు కపిశేఖరునికి. మరో రాజవీధిలో ప్రవేశించాడు. విశాలమైన భవన మందిరాలు, రక్షక భటదళాలు కనిపించాయి మల్లుల ఆస్ఫోటన ధ్వనులు విని తనూ జబ్బలు చరిచి చిరుగంతులు వేస్తూ రాజమార్గం చేరాడు. సైనిక స్థావరం కనిపించింది. ప్రక్కనే హేషారవాలతో హయశాలలు, శ్రేణులుగా తీర్చిన రథాలు, యింకా ముందుకు నడిచాడు గజఘీంకృతులు వినిపించాయి. ఎత్తయిన స్థంభాల విశాల మండపాలు, అందులో రాశులుగా పేర్చిన చెఱకు గడలు, ఆకు అలాలు, అప్పుడే కోసిన పచ్చగడ్డిరాశులు వాటి మధ్య స్థంభాలకు యినుప గొలుసుతో కట్టి మేత మేస్తున్న నల్ల బండల్లాంటి ఏనుగుగున్నలు, వాటిని సాకుతూ, నాకుతూ కరిణులు, కొంచెం ముందుకు వెడితే ఇంద్రుని ఐరావతాన్ని మించిన అలంకృతమైన తెల్లఏనుగులు వాటికి సంరక్షణ చేస్తున్న మావటి వాళ్ళు కనిపించారు.

పదాతిసేన ఈటెలు, బల్లాలు, ఒడిశలు, కత్తులు, ముసలాలు, విల్లమ్ముల రాశులు, ఖడ్గాలు, రథచక్రాలు, కవచాలు, శిరస్త్రాణాలు, శూలాలు యివ్వన్నీ అమరికగా పేర్చిన గిడ్డంగులు దాటుకుంటూ ప్రతి అంగుళం పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నాడు. జటాధారులు, ముండితశిరస్కులు, అగ్నికుండాయుధాలు, ముష్టి ప్రహణశీలురు, ఏకాక్షులు, అనేకాక్షులు, లంబోదరులు, వికటముఖులు, వామన దేహుల్లు, ఖడ్గ,

ధనుర్ధారులు, విచిత్ర కవచ భూషణులు, స్థూలదేహులు, గౌరవర్ణులు, కృష్ణవర్ణులు యిన్ని రకాల రక్షకభటులను చూస్తూ ముందుకు సాగుతుంటే –

'ఆహా! ఏమి సంపద! ఏమి ఆయుధ శక్తి, ఎంత సైనిక బలం' అనుకొంటున్నాడు, సాగుతున్నాడు. కొందరు రాక్షసులు శత్రువులను హతమార్చే చారకర్మలు చేస్తున్నారు. మరో వీధికి నడిచాడు. అది వివిధ రాక్షస వీరుల భవనాలతో నిండినది. ప్రహస్త, మహాపార్శ్వ, త్రిశిర, జంబుమాలి, అతికాయ, నరాంతక, ఇంద్రజిత్తు కుంభ కర్ణాది మహామహుల అంతఃపురాలు శయన మందిరాలు చూస్తున్నాడు. ఒక చోట నుండి దివ్యమైన కాంతిపుంజాలు వస్తున్నాయి. వింతైన పరిమళం వస్తోంది. అటు వెళ్ళాడు పుష్పకవిమానం వుంది. సువర్ణమయమై, శిల్పశోభితమై, విశాలమైన రెక్కలున్న విమానం అది. దాని స్థంభాలు మణిరత్నాలతో పొదగబడ్డాయి. బ్రహ్మ కుబేరునకు కానుకగా యిచ్చిన అమరలోకవాయువాహనం అది. రావణుడు కుబేరుని జయించి లంకకు తెచ్చాడు దాన్ని. ఎంత మంది ఎక్కినా మరొకనికి చోటు వుంటూ వుంటుంది. అదీ దాని ప్రత్యేకత. వసిష్ఠుని నందినీ ధేనువువలె కోరిన వస్తు సంపద యిచ్చే శక్తి దానికుంది. "ఎంత రమణీయంగా వుంది" అనుకుని ముందుకు సాగుతున్నాడు. యింక అంతఃపురాలు శయన మందిరాలు ఎదురైనాయి. లంకా నగర రక్షక గణం అప్రమత్తంగా వుంది. ఇంకా ముందుకు సాగుతున్నాడు.



28. రావణాంతఃపుర దర్శనము



రాత్రి ప్రొద్దుపోతోంది. లోకపు పాపాలను నశింపజేసే చంద్రుడు ఆకాశ మధ్యానికి వస్తూంటే కడలి తరంగాలు ఉప్పొంగి పోతున్నాయి. చెలియలికట్ట దాటి పైపైకి పోతున్నాయి. సర్వ వస్తు జాలాన్ని ప్రకాశవంతం చేస్తున్న జ్యోత్స్నాకరుడు ఆవులమందలలో వృషభరాజులా, వెండి పంజరంలో రాయంచలా వున్నాడు. నిశాదోషాలు వైదొలగి కాంతి పవిత్రితమైంది. రౌద్ర ప్రవృత్తిగల కొందరు నిశాచరులు, రక్షకభటులు తప్పిస్తే మిగిలిన రాక్షస ప్రజలంతా నగరసంచారం ముగించి తమ తమ భవనాలు చేరుకుంటున్నారు. సుందరీమణులైన వారి భార్యలు భర్తలకెదురై వారి స్నానపాన భోజనాదులకేర్పాట్లు చేస్తున్నారు. భర్తలు రాగానే దరహాసవదనాలతో లోపలికి గొనిపోయే కాంతలు కొందరు. భర్త రాగానే గాఢ పరిష్వంగమిచ్చి చెయ్యి పట్టుకు తీసుకు వెళ్ళే కామినీకాంతలు కొందరు. నిట్టూర్పులతో భర్త ఆగమనాభిలాషులై చకోరపక్షుల్లా ఎదురు చూస్తున్న లలనామణులు కొందరు.

అంతరిక్షంలో నక్షత్రాల వలె స్వచ్ఛ శీలంతో లజ్జావతులైన మరికొందరు యిల్లాంద్రను చూసి అబ్బురపడుతున్నాడు హనుమ. రజితకాంతలు, చంద్రవదనలు, విశాలాక్షులు, మృగరాజమధ్యమలు, విరహోత్కంఠలు, మదవతులు, గజగమనలు

యిలా కనబడ్డ ప్రతి స్త్రీని కన్నార్పకుండా తిలకిస్తూ వారెవరిలోను సీతాసాధ్వి లేదని, మెల్లమెల్లగా ముందుకు సాగుతున్నాడు.

ఆ భవనాలన్నిటికి మధ్య ఒక పెద్ద దివ్యభవనం లంకాపురికి శిరోభూషణంలా ప్రకాశిస్తోంది. అదే రాక్షసేంద్రుడు రావణుని రాచనగరు. అందులో ప్రవేశించాడు హనుమ. అక్కడ ప్రతీదీ ఒక అద్భుతం. బంగారపు గోడలు, వజ్ర వైడూర్యనీలిగోమేధికమౌక్తికాది రత్నాలు అంచులుగా పొదగబడి వున్నాయి. చిలుకల వరుసలు, ద్రాక్షగుత్తులు, పక్వఫలాలు లతలు, నాట్యకత్తెలు, సన్నాయి, మృదంగ వీణావాదనసంగీతకారులు, మత్తేభాల కుంభస్థలాలపై లంఘించిన సింహరాజాలు యిలాంటి శిల్పాలు గోడలకున్నాయి. మంచి ముత్యాలు, పగడాలు గట్టిన తోరణాలు కిటికీలకు ద్వారాలకు వ్రేలాడుతున్నాయి. ఎరుపు, ఆకుపచ్చ, పసిమి రంగుల్లో మిలమిలలాడే తెరలు ద్వారాలకు అమర్చబడినాయి. కొంతసేపు తాను వచ్చిన పని మరచిపోయి అచ్చెరువందుతూ చూస్తున్నాడు హనుమ.

'ఈ మందిరాల్లో సీతాస్వాధ్వి ఎక్కడ వుందో కనిపెట్టాలి మెల్లమెల్లగా తెరలు తొలగించి చూడక తప్పదు'. అని సకల్పించుకొని అడుగు చప్పుడు కాకుండా నడుస్తున్నాడు. సందుల్లోంచి చూసాడు. రత్నదీపకాంతులతో నారీజనం అత్యంత సుందరంగా వున్నారు. స్వర్ణమయ రత్నభూషణాలు, ఉద్యాణాలు, పుష్పమాలలు, దండకడియాలు, చంపస్వరాలు, ముక్కెరలు, వజ్రతాపితమైన పాపిడిబొట్టుతో అలంకృత నారీమణులు వివిధ భంగిమల్లో నిద్రిస్తున్నారు. అగరుధూపవాసనలు గుమ్మెత్తిస్తున్నాయి. మధుపాత్రలు, ఫలహారాల పళ్ళెరాలు సగం సగం ఖాళీగా వున్నాయి. పద్మగంధశోభిత వదనాలతో ఆదమరచి నిద్రపోతున్నారు కొందరు. అరుణ కమలాలు నిండిన సరోవరంలావుంది, ఆ మందిరం. మరో మందిరం దగ్గర చేరాడు. అదే రావణుని విలాసకేళీశయనమందిరం. అప్పుడే అర్ధరాత్రి అయిపోయింది అనుకున్నాడు.

రావణుడు ముల్లోకాల నుండి బలాత్కరించి తెచ్చిన నవలావణ్య సుందరీ భామిను లెందరో అక్కడ శయనించి వున్నారు. నక్షత్రశోభితగగనవీధిలా వుంది మందిరం. బాగా మద్యం సేవించి, నృత్యగానవినోదాలతో అలసిపోయి నిద్రిస్తున్నారంతా. నుదుట తిలకం చిరుచెమటతో తడిసి ప్రక్కలకు పారింది కొందరికి. కంఠహారాలు అస్తవ్యస్తంగా వున్నాయి కొందరు లతాంగులకు. మదవతులు కొందరు బలిసిన వక్షోజాలపై ఆచ్ఛాదన లేకుండానే నిద్రిస్తున్నారు. చంద్రకాంతులు జల్లే హారాల మధ్యస్తన మండలాలు రాయంచలను తలపింప చేస్తున్నాయి. వేరొకచోట ఇసుక తిన్నెల వలె పిరుదులు, బలిసిన ఊరువులు, ఎర్రతామరను బోలిన పాదాలు గల స్త్రీలను పరిశీలించి చూస్తున్నాడు హనుమ. కొందరి చీరచెంగులు పతాకాల వలె పిల్లగాలికి రెపరెపలాడుతున్నాయి. కొందరు కుచమధ్యంలో తలదిండ్లు, మృదంగాలు

పెట్టుకు నిద్రిస్తున్నారు. ఒక నారి తన ప్రక్క నిద్రించే సవతినే రాక్షసేంద్రునిగా భావించి ఆమెను పెనవేసుకుంది. మరొకతి యింకొకతెను ముద్దాడుతూ పరుంది. ఒకరి భుజం ఒకరు ఒరుసుకొంటూ వరుసగా కొందరు లలనామణులు పడుకున్నారు. కొందరి వస్త్రాలు అడ్డదిడ్డంగా వున్నాయి. అర్ధ నగ్నంగా వున్నారు. కొందరు యువతులు. పానపాత్రలు, పూమాలలు, ఫలాలు అక్కడక్కడ సగం త్రాగబడి, నలిపివేయబడి, సగం కొరకబడి చిందరవందరంగా వున్నాయి. భవనమంతా అప్సరోభామినులను తలదన్నే అందం గల కొందరు తమ సఖుల భుజాలనే తల దిండ్లుగా అన్చి నిద్రిస్తున్నారు.

ఇందరు నారీమణులను తనకోసం తెచ్చుకున్న రావణుడు సీతాపహరణం చేసాడంటే ఆమె అతిలోకసౌందర్యవతి అయి, సర్వ శుభలక్షణాలు గలదై వుండితీరాలి, అనుకుంటూ నడుస్తున్న ఆంజనేయునికి కాంచన నిర్మితమైన పర్యంకం గోచరించింది. దివ్యమాలలతో చంద్రకాంతులీనే ఛత్రం, సూర్యకాంతుల పాదపీఠం, ఆ తల్పాని కిరువంకల ఇద్దరు సుందరీమణులు చమరీవాలంతో నిర్మితమైన కుచ్చులతో రావణునికి వీవన వీస్తున్నారు. సుగంధ సౌరభం మత్తుగా వస్తున్నది.

రత్నకుండలాలంకృత కర్ణాలతో, పుష్పమాలా బంధిత బాహువులతో, ధవళవస్త్ర ధారణుడై, చందనానులేపదేహంతో, సుందర పర్వతసముడైన రావణుడు నిద్రిస్తున్నాడు. సుష్టుగా షడ్రసోపేతమైన విందారగించి, మధుపానం చేసి, రసక్రీడలు ముగించి, కామినీజనపరివేష్టితుడై హాయిగా నిద్రిస్తున్న లంకేశ్వరుని పరిశీలించి చూడడానికి, మరొక స్థంభం ఎక్కి గవాక్షపు తెరలు చూపుడు వ్రేలితో తొలగించి చూస్తున్నాడు హనుమ.

మినుములు రాసి పోసినట్లున్న నల్లని దేహం రావణునిది. ఐరావత దంత ప్రూతవ్రణచిహ్నాశోభిత బాహుద్వయం. చక్కగా రూపొందించిన పరిఘాయుధాల వలె, మదించిన ఏనుగుతొండాలవలె బలిష్టమైనహస్తాలు. నవరత్నఖచిత సువర్ణాంగుళీయకాలతో అయిదుపడగల పాముల్లా వున్నాయి అరచేతులు. తెల్లని హంసతూలికాతల్పం మీద నల్లనిరావణుడు. నల్లని ఆకాశంలో తెల్లనిచంద్రబింబానికి వ్యతిరేకంగా. శశాంకుడు తన శైత్య కిరణాలతో సర్వజనాల్ని ఆహ్లాదపరుస్తుంటే ఈ రాక్షస రావణుడు తన దుష్టకార్యాల ద్వారా సర్వులను బాధిస్తున్నాడు సుమా! అనుకున్నాడు హనుమ. కారుమేఘంలో మెరుపుల్లా ఆయన దేహం మీద మణి రత్నభూషణకాంతులు.

దశగ్రీవుని పద సన్నిధానంలో నిద్రించే ఒక ప్రియురాలు రావణవీణనే ప్రియునిగా భావించి కౌగలించుకుని నిద్రిస్తోంది. ఇంకొక రత్నాంగి ఉప్పొంగుతున్న స్తనద్వయాన్ని మృదంగానికి వేసి నొక్కుతూ మధుమైకంలో అలాగే ఉండి పోయింది. రావణుని

ప్రక్కనే పసిమి వర్ణమేనిఛాయతో, ఎర్రపట్టుచీర, ఆకుపచ్చరవికె ధరించిన కమలవదన నిద్రిస్తోంది. ఆమెయే రావణరాజ్యపట్టమహిషి మండోదరి. ఆమె అలంకారాలన్నీ విశేషంగా ఉన్నాయి. కంఠం, విశాలనేత్రాలు, తుమ్మెదరెక్కల్లాంటి నల్లని రెప్పవెంట్రుకలు, పగడపుపెదిమలు, కాలసర్పంలాంటి నల్లని పొడవాటి జడలో తెల్లని మల్లెలమాలలు. సమున్నతమైన వక్షోజాలు, సన్నని నెన్నడుము, ఆకాశ సదృశ జఘన భాగం. ఆమె చేతుల నిండా శ్రీచందనం పూసుకొని వుంది. రత్నాల గాజులు కిటికీ గుండా పడే వెన్నెలలో వింతకాంతులిస్తున్నాయి. ఆమె తెల్లతామర పువ్వులా వికసిత వదనంతో వుంది. ఒక చెయ్యి భర్త గుండెలపై వేసి ఆయనవైపు తిరిగి ఆదమరచి నిద్రిస్తోంది. సర్వశుభలక్షణ శోభితమైన మండోదరిని బాగా పరిశీలించి చూచి, ఒక్కసారి ఒళ్ళు విరిచి, తోక ముద్దుపెట్టుకొని క్రిందికి దూకి ఎగిరి గంతులేస్తున్నాడు హనుమ. ఆమెయే సీతామాత అనుకొని -

'అవును నా మతిమంద, ఈమె సీత కాదు. భర్తకు దూరమై విచారంగా ఉంటుంది గాని, యిలా రావణుని ప్రక్క వుంటుందా! ఎంత చెడ్డగా భావించాను శ్రీరామచంద్ర! క్షమించు తండ్రి!' అని చింతిస్తూ భోజనశాలలు, పాకశాలలు, వినోద మందిరాలు అన్నీ పరిశీలించి విచారంతో నడుస్తున్నాడు.

'వైదేహిని వెతకటం కోసం అడుగు పెట్టరాని చోటల్లా తిరిగి చూసాను. స్త్రీల శయనగారాల్లో ప్రవేశించి ధర్మహాని కూడా చెయ్యక తప్పింది కాదు. రామకార్యంపై గూఢచారిగా వచ్చి లంకానగరం అంతా వెదికాను. ఎక్కడా రామపత్ని జాడ కనిపించటం లేదు. ఇంక నా కొక్కటే మార్గం. ఇక్కడే ప్రాణాలు విడుస్తాను అదే నేను చేయగల్గింది అని దుఃఖిస్తున్నాడు హనుమ, ఒక చెట్టు కింద కూర్చుని.

ఏం చెయ్యడానికి పాలిపోవటం లేదు. మనస్సు క్షీణిస్తోంది. కార్యం సిద్ధించలేదని కిష్కింధ చేరితే వారి ప్రశ్నలకు నేనేం బదులు చెప్పాలి? జానకి కనిపించలేదంటే రాముడి గతేం కావాలి? ఆయన ప్రాణం విడుస్తారేమో? ఆప్త మిత్రుని కార్యం నెరవేర్చలేదంటే సుగ్రీవరాజు పరువేం కావాలి. అనమాన బలంగల యింతవానర సేనావాహినికి రాజైన సుగ్రీవుడు పరాజయాన్ని అంగీకరిస్తాడా? అన్నింటికన్న ముందు నా మీదే ఆశ పెట్టుకొన్న యువరాజు అంగదుడు, జాంబవంతుడు, వానరవీరులు; సీత కానరాలేదంటే మరల ప్రాయోపవేశ ప్రయత్నం చేస్తారేమో! రిక్తహస్తాలతో వెనుదిరిగి వెళ్ళటం కన్న యిక్కడే ఏ సముద్ర తీరానో, అడవిలోనో గడపటం మంచిది. అంతెందుకు? ఆత్మహత్య చేసుకోవడమే పరిష్కారం' అనుకుంటున్నాడు హనుమ. ఎంత ఆలోచించినా యేమీ తోచటంలేదు.



29. హనుమ – అశోక వన ప్రవేశము



"ఆ నాడు గగన మార్గంలో సీతను తస్కరించుకు పోయిన మాట వాస్తవం, స్వయంగా చూచాను. సంపాతి; సీత లంకలోనే వుందని చెప్పాడు. ఒక వేళ తన కోరిక నెరవేర్చ లేదని దుష్ట దశకంఠుడామెను చంపేసాడేమో! లేక రాక్షసస్త్రీలో, రక్షకభటులో తినేసివుంటారా! ఛీ... ఛీ! అమంగళం ప్రతిహతమౌగాక! యిలా **మనస్సును కలవర పెట్టుకుంటే కార్యసాధన కాకపోగా చెడ్డ తలంపులే వస్తాయి. నిర్వేదం అనర్థదాయకం. సర్వ కార్యఫలసిద్ధికి మనస్సు మూలం. అది దృఢంగా వున్ననాడు; ఉత్సాహంగా పనిచేసిన నాడు; యేదైనా సాధించగలము'**– అనుకుంటూ ముందుకు నడుస్తున్నాడు హనుమ.

'సీత కనిపించకపోతే లంకను విడిచిపెట్టేది లేదు. అంగుళం అంగుళం వెతుకుతాను. ఆమె కానరాకుంటే ఆ ధూర్తుడు రావణుణ్ణి పిడిగుద్దులు గుద్ది, నా వాలంతో బంధించి ఈడ్చుకుపోయి రామ పాదపద్మాలపై పడేస్తాను'. అని సకల్పించుకున్నాడు. కుడిభుజం అదిరింది. గాలి బలంగా వీచి ఆయన కూర్చున్న చెట్టునుండి పచ్చనిపూలు రాలాయి. తన తండ్రి వాయుదేవుడే అక్కున చేర్చుకున్నట్లు పులకించిపోయాడు ఆంజనేయుడు. దృష్టి నలుదిక్కులా సారించాడు. కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నాడు ఏకాగ్రతతో. దూరంగా ఎత్తైన ప్రాకారాలతో, మేఘమండలం వరకు ఎదిగిన చెట్లతో ఉద్యానవనం కనిపించింది. దాని చుట్టూ ఎత్తైన ప్రహరీగోడ.

'ఆ ప్రదేశం వెదకనే లేదు' అనుకొని గంభీరంగా అడుగులేసుకుంటూ ముందుకు నడిచాడు హనుమ. ప్రాకారం ఎక్కబోతున్న హనుమ ఆగాడు. ఒక్కసారి శాంత చిత్తంతో శ్రీరామచంద్రమూర్తిని స్మరిస్తూ అంజలి ఘటిస్తూ శ్లోకం పాడుతున్నాడు.



సుందరకాండము 13వ సర్గ, 59వ శ్లోకము :-

"నమో2స్తు రామాయ స లక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమో2స్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమో2స్తు చంద్రార్క మరుద్గణేభ్యః ॥

లక్ష్మణునితో కూడిన శ్రీరామచంద్రునికి నమస్కారము. రామపత్ని సీతామాతకు నమస్కారము. రుద్రునికి, ఇంద్రునకు నమస్కారములు. యమునికి, అగ్నిదేవునకు, సూర్యచంద్రులకు సకలదేవతాగణానికి నమస్కారములు – అని ప్రార్థించిన ఆయన పునరుత్సాహంతో అశోకవన ప్రాకారం మీదికి ఒక్క దుముకు దుమికి; ప్రాకారంపై నిలబడి ఉద్యానవన మంతా కలియజూస్తున్నాడు. కారుచీకట్లో కాంతిరేఖలా

కనిపించిందావనం. వెన్నెల్లో అశోకవనం చూడముచ్చటగా వుంది. సాల, చూత, నాగ, అశోక తరుపంక్తులు గోచరించాయి. మామిడిపండ్లు పచ్చగా పండి, అగ్నిపూలు ఎర్రగా విరబూసి, పారిజాతాలు గుబాళించగా, కీరసమూహాలు, తెల్లపావురాలు, నెమిళ్ళు, ఒకటేమిటి రకరకాల పక్షిజాతులతో రమణీయంగా వుంది తోట. ఎఱ్ఱ, నీలి, తెల్ల కలువల సరోవరంలో స్వచ్ఛజలాలు; తామరకోనేరులో రాజహంసలు "అహో! రావణుడు తన విహారం కోసమే యేర్పాటు చేసుకొని వుంటాడు ఈ ఉద్యానవనాన్ని" అనుకున్నాడు హనుమ. ప్రాకారంమీద నుండి చెట్టుపైకి దూకాడు.

ఒక కొమ్మ మీద నుండి మరోకొమ్మకు, ఒక చెట్టు మీది నుండి మరో చెట్టు మీదికి లంఘిస్తుంటే గూళ్ళలోని పక్షులు గాఢనిద్రలోంచి త్రుళ్ళిపడి లేచి కలవరపడి కలస్వనాలు చేస్తూ ఎగురు తున్నాయి. పువ్వులు హనుమ శరీరం నిండా రాలగా ఆయన వసంతుని వలెవున్నాడు. చెట్లగుంపుల నడుమ, లతానికుంజాలలో దిగుడు బావుల దగ్గర, తటాకతీరాల్లో, క్రీడాపర్వత గుహల్లో, సెలయేటి తిన్నెల మీద, అన్వేషించి, అన్వేషించి, సీతాసాధ్వి కానరాక దిగులుతో వనమధ్యంలో మహోన్నతంగా వున్న శింశుపావృక్షం అధిరోహించాడు. అప్పటికి తెలతెల్లవారుతూంది. శశాంకుడు పశ్చిమాద్రికి చేరాడు.

హనుమ ఎక్కిన శింశుపావృక్షం చుట్టూ బంగారపు అరుగు వేసివుంది. వృక్షకాండానికి సన్నజాజి తీగ అల్లుకొని తెల్లని పూలతో సుగంధం గుబాళిస్తోంది. అక్కడ ఫలవృక్షాలకు శింశుపావృక్షంలాగే వెండి, బంగారు అరుగులు చాలా కట్టివున్నాయి. చిరుగంటలు కూడా కట్టారు. అవి గాలికి గలగలమోగుతున్నాయి. హనుమ ఎక్కిన వృక్షానికి అల్లంత దూరంలో కైలాసగిరి వలె తెల్లగా వున్న రాజ ప్రాసాదం ఉంది. దాని మెట్లు పసిడితో చేయబడి పగడాలముగ్గులతో శోభిస్తున్నాయి. ఆ సౌధసమీపంలో ఒక (అశోక) వృక్షం క్రింద ఒక స్త్రీమూర్తి కృశీభూత దేహంతో నెలవంకలా కనిపించింది. చుట్టూ రాక్షసస్త్రీలు వివిధ ఆయుధాలు ధరించి వికృతరూపాలతో కాపలా కాస్తున్నారు. దట్టంగా వున్న ఆకు గుబురులోంచి తల పైకెత్తి మెదరిక్కించి గాజుగోళాల్లా ప్రకాశించే కళ్ళతో నిశితంగా ఆ స్త్రీమూర్తి వంక చూస్తున్నాడు మారుతి.

తపస్విని, యశస్విని, రామమనోహారిణియైన జానకీమాత ఆమెయే అయివుంటుందని ఆంజనేయుడు పరికించి చూస్తున్నాడు. శత్రువుపై ఆగ్రహించి బుసలు కొడుతున్న బక్కచిక్కిన భుజంగంలా వుండి వేడి నిట్టూర్పులు విడుస్తోంది ఆ సౌశీల్యవతి. నలిగి మాసిన పసుపుపచ్చ చీర కట్టుకుంది. పట్టు ఉత్తరీయం మాసివుంది. శరీరం ధూళిదూసరితమైనా సువర్ణ కాంతులీనుతూంది. ఆమె శిరోజాలు చిక్కుపడి, అంటలు

గట్టి వ్రేలాడుతున్నాయి. దివ్యతేజస్సు విరజిమ్ముతున్న ఆమె ముఖకమలంలో తీరని దుఃఖచ్ఛాయలు పరికిస్తున్నాడు వాయునందనుడు.

'ఆనాడు రావణుడు ఎత్తుకు పోతుండగా ఋష్యమూకం మీద నుండి చూచాను. ఆమె ఈమె ఒకరే. నగలమూట విసిరింది గదా! ఇప్పుడీమె ధరించిన చీర, మూటకు గట్టిన వస్త్రం ఒకే రంగులోనివి. ఈమె వంటిపై ఎక్కువ నగలున్నట్లు లేదు. పైగా రామచంద్రుడు వర్ణించి చెప్పిన శుభలక్షణాలున్నాయి. తప్పక యీమె సీతాసాధ్వియే' అనుకుంటున్నాడు హనుమ.

౨౦. రావణుడు సీతాసాధ్విని ప్రార్థించడము

వేకువజాము కావటంతోనే పక్షులు బారులు తీరి మింటి కెగుస్తున్నాయి. సూర్యుని ఎర్రకాంతులు మేఘాలను రక్తంతో తడిసిన యుద్ధ భూమిలా చేస్తున్నాయి. నగరు సన్నాయిమేళం, మంగళతూర్యారావాలు ఆలపిస్తోంది. దేవాలయాల్లో వేదమంత్రోచ్చారణలు మొదలయ్యాయి. రాజమహలులో నిద్రలేచిన రావణునికి వందిమాగధులు స్తోత్రపాఠాలు పలికారు. ప్రాతఃకాల కార్యక్రమాలు ముగించుకున్నాడు రాక్షసరాజు. బాగా అలంకారాలు చేసుకొని వందమంది సుందర పత్నులు, పరిచారికాగణం, ఛత్రచామరాలతో, మంగళజలకలశాలతో వెంటరాగా అశోకవనానికి తరలి వస్తున్నాడు. హనుమ రావణుని దర్పం, తేజస్సుచూసి అబ్బుర పడి, చెట్ల గుబురుల్లో దాక్కొని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాడు.

విశ్రవసుని పుత్రుడు రావణుడు. ఘోరతపస్సు ఆచరించి బ్రహ్మసాక్షాత్కారం కోసం తన తలను పదిసార్లు ఖండించుకున్నాడు రావణుడు. బ్రహ్మ పదితలలు అనుగ్రహించగా, నరవానరులచే తప్ప ఎవరివల్ల మృత్యుభయం లేకుండా చేసుకొన్న యుక్తిపరుడు రావణుడు. శంకరుని అనుదినం అర్చించే రావణుడు. ఆ పరమేశ్వరుని అనుగ్రహవీక్షణం కోసం తన భుజస్కంధాలతో కైలాసగిరినే గడగడలాడించిన బలశాలి రావణుడు. తన ప్రేగులనే వీణాతంత్రులుగా మీటి, కరుణరససంగీతంతో నటరాజును మెప్పించి ఆత్మలింగం పొందిన మహా కళాకారుడు రావణుడు. శివస్తోత్రం విరచించిన గీర్వాణభాషాపండితుడు రావణుడు. ఇంద్రునితో పోరుసల్పి అతని వజ్రాయుధ ఘాతచిహ్నాలు రొమ్మున అలంకారాల మధ్య వీరచిహ్నాలుగా ప్రకాశిస్తున్న దశకంఠ రావణుడు. విష్ణుమూర్తి సుదర్శనచక్రం వల్ల తగిలిన దెబ్బల గుర్తులతో ఎంతటి వారినైనా ఎదిరించగలను అని విర్రవీగే రావణుడు. భుజస్కంధాలపై ఐరావతం కుమ్మగా యేర్పడిన గాట్ల వల్ల దండకడియాలు కొద్దిగా కిందికి జారినా, పరాక్రమమే అలంకారమైన రావణబ్రహ్మ! దేవ, గంధర్వ, యక్ష, రాక్షస సుందరీమణులెందరినో తన బాహుపరాక్రమంతో వశపరుచుకున్న రావణుడు - కామాతురుడై తన సర్వవినాశనం

కోరితెచ్చుకునే ప్రయత్నంగా ఉదయాన్నే వస్తున్నాడు. పాతివ్రత్య బడబానలాన్ని సమీపించే రాక్షసకామశలభంలా వున్నాడు రావణుడు. అమృతాన్ని మథించగా వచ్చిన నురుగులాంటి తెల్లని పట్టుపంచె, బంగారు జలతారు గల పసుపుపచ్చని ఉత్తరీయం ధరించాడు. హుందాగా నడుస్తూ సీత ముందు నిలబడి నేలను ఉత్తరీయం జీరాడగా దాన్ని విలాసంగా కుడిచేతిపై వేసుకొని వక్షం విశాలం చేసి వికటాట్టహాసం చేసాడు.

సీత తన ఊరువులతో ఉదరాన్ని, చేతులతో స్తనయుగళాన్ని కప్పుకొని వంటి నిండా చీర సర్దుకొని, అతిదీనదృక్కులతో అవనతవదనయై కూర్చుంది. ఆమె కాళ్ళు ఝుంఝూమారుతంలో అరటిపువ్వుల్లా కంపిస్తున్నాయి. శ్రీరామవియోగంతో కృశించిన ఆమె వేళ్ళు నీరసంతో కొంకర్లు పోతున్నాయి. భయంతో వళ్ళంతా చెమట పట్టింది. రావణుడామెను పరికించి చూస్తూ -

"మోహనాంగీ! ఎందుకు భయపడతావు? నీ సుకుమార సౌందర్యాన్ని అచ్ఛాదించుకుంటావు దేనికి? ఉత్తపుణ్యానికి దుఃఖంతో ఉపవాసం చేస్తున్నావు. నగలు పెట్టుకోక, పట్టుకోక కట్టక, ఇంద్రనీలాల్లాంటి కనులకు కాటుక పెట్టుకోక, నల్లనికురులకు అత్తరులు రాసి దువ్వుకోక ఏకవేణితో ఎన్నాళ్ళిలావుంటావు? మణిరత్న ఖచితహంసతూలికాతల్పంపై శయనించవలసిన నువ్విలా శీతోష్ణబాధలు భరిస్తూ ఎందుకిలా కృశించిపోతున్నావు?

మనోహర సుందరాంగీ వైదేహి! యవ్వనం, సౌందర్యం, లావణ్యం శాశ్వతంగా వుండవు. సాగరాభిముఖంగా సాగే ప్రవాహజలం వెనుదిరిగి నదికి వస్తుందా? అందుకని యౌవ్వనముండగానే సుఖాలు అనుభవించాలి.

"ఓ శీతాంశుసదృశవదనా! గరుత్మంతుడు మహాభుజంగాలను పట్టినట్లు నువ్వు నీ సౌందర్యం చేత నా మనస్సును పట్టిలాగేసావు. మాసినచీరతో అలంకార రహిత దేహంతో, తైలసంస్కారం లేని కురులతో వున్నా, నా మనస్సు నిన్నే వాంఛిస్తోంది సుమా! నా పట్టమహిషి మండోదరి మహా సౌందర్యవతి, సౌశీల్యవతి, ఆమె వరకు ఎందుకు ఒక్కసారి తలఎత్తి నా చుట్టూ వున్న మదవతులు, రూపవతులు, లావణ్యవతులు అయిన ధ్యానమాలాది స్త్రీజానాన్ని వీక్షించు వీరంతా నీ అంత సౌందర్యవతులే. అయినా నీ పొందుకై ఈ రాక్షసేంద్రుడు ఉదయాన్నే వచ్చి, ప్రేమభిక్ష అడుగుతున్నాడంటే నీకు ఎంత విలువ యిస్తున్నానో యోచించు," అన్నాడు రాక్షసేంద్రుడు రావణుడు. రావణుడు తన కామాతురతనంతా వెల్లడించి సూర్యుని ముందు దివిటీలా నిలబడ్డాడు. సీతాసాధ్వి అగ్ని వంటిది. చండప్రచండమార్తాండుని వంటిది. ఆమె సంకల్పిస్తే తన పాతివ్రత్య ప్రభావం చేత అతన్ని మాడ్చి మసి చెయ్యగలదు. అయినా స్త్రీలకు సహనం ఎక్కువ. స్త్రీలు, గోవులు జాతి మాత్రం చేత గౌరవింప దగ్గ

సౌజన్యవంతులు. రావణుడు మాట్లాడటం కాగానే ఒక గడ్డి పరకను సుతారంగా ముని వ్రేళ్ళతో లాగి తనకు రావణునికి మధ్య పరచి, నిష్కళంకంగా నవ్వి మెల్లగా మాట్లాడ నారంభించింది.

"ఈ క్షణంలోనే నువ్వు నన్ను గురించిన తలంపును త్యజించు. నువ్వన్నట్లు నీ భార్యామణులెందరో సుందరీమణులు నీ వెంట వున్నారు. వారిని ప్రేమించి వారిపై నీ మనస్సు నిలుపుకో. పాప బుద్ధులుగల నీ లాంటి నీచులు పుణ్యసిద్ధులు పొందలేరు. నువ్వు చేసేది అధర్మం అని నీకు తెలియదంటావా? ఆత్మబోధను, నీతి మార్గాన్ని విడిచి అధర్మవర్తనం చేస్తున్నావు. నీ సర్వసంపదలు నశించిపోతాయి. దూరదృష్టి లేకుండా పరదారాపహరణం చేసావు. నీ చిత్తం వచ్చినట్లు ప్రేలుతున్నావు. అయినా సహిస్తున్నాను.

సూర్యుని విడిచి ఛాయాదేవి, ఇంద్రుని విడిచి శచీదేవి ఎట్లు వుండలేరో; అట్లే నేను రామభద్రుని విడిచి మనజాలను. నువ్వు రాజువి. రాక్షసేంద్రుడివి. నీ భార్యలను నువ్వు రక్షించుకుంటున్నట్లే యితరుల భార్యలను రక్షించి వారికి అప్పగించవలసిన బాధ్యత కూడా నీ మీద వుంది. నీ సంపదలను చూచి భ్రమ పడతానను కోకు. నువ్వూ, నీ సకలైశ్వర్యాలు నాకీగడ్డిపోచతో సమానం.

రాజర్షి జనకమహారాజు పుత్రికను. దశరథుని పెద్దకోడలిని. నీకు సాటి రాజైన శ్రీరామచంద్రుని అర్ధాంగిని. ఆ లోకనాథుని భుజదండం ఉపాదానంగా విశ్రమించే ఉత్తమకులసంజాతను. మరొకరిని కన్నెత్తి చూస్తానని ఎలా అనుకుంటున్నావు? వ్రతస్నాతుడైన విప్రవరేణ్యునికి ఉత్తమ వేదవిద్య వలె నేను శ్రీరామాంకిత మైపోయాను.

రావణా! నీకు ఉపదేశం చేస్తున్నాను విను. ఎందుకిలా పాడు పనులు చేసి లంకారాజ్యానికి, నీ బంధుమిత్రులకు, ప్రజలకు అనర్థం తెస్తున్నావు? నీ వెంతటి బలశాలివి! తపశ్శాలివి! ఐశ్వర్యవంతుడవు!! పరాక్రమ వంతుడివి. ఈ ఒక్క దోషం వల్ల నాశనం కోరి తెచ్చుకుంటున్నావు. ఈ లంకారాజ్యంలో నీకు హితవు చెప్పేవారే లేరా?

ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీకు వివేకం మిగిలివుంటే నన్ను ఉత్తరక్షణంలో భద్రంగా తీసుకువెళ్ళి రామభద్రునికి అప్పగించు. ఆయన ఎంత శత్రు భయంకరుడో, ఎంతటి అసమానరణపండితుడో, అంతటి దయాళువు. శరణాగత వత్సలుడు. నన్ను యిచ్చివేసి ఆయన శరణు పొందు. బ్రతికి బట్టకడతావు. మహేంద్రుని వజ్రాయుధం, యముని కాలపాశం నిన్ను యేమీ చెయ్య లేవని గర్వించకు. రామబాణం అంతకన్నా మహాశక్తివంతమైనది. రాముడు ధనుష్టంకారం చేస్తేనే నీ లంకాద్వీపం

గడగడలాడిపోతుంది. రాముడనే గరుత్మంతుడు నీ సర్వ రాక్షససేనా సర్పసమూహాలను గరళం కక్కించి తన బాణాల గోళ్ళతో చీల్చి చెండాడ గల రణధీరుడు. ఆనాడు రామలక్ష్మణులు ఆశ్రమంలో లేని తరుణం చూసి నన్ను తస్కరించావు. లేకుంటే అప్పుడే నీ జీవితం పరిసమాప్తం అయివుండేది. శార్దూలాన్ని నక్క ఎదిరించగలదా! ఆయన నరశార్దూలం... నువ్వు జిత్తులమారి నక్కవు. మరొక సారి చెపుతున్నాను. నన్ను నా పతికి అప్పగించి సర్వవినాశనం నుండి తప్పించుకో! లేదా! శ్రీరామక్రోధాగ్నికి ఎదురేగిన మిడుతల దండులా దగ్ధమై పోతావు" అని గంభీరంగా మాట్లాడింది వైదేహి.

సీత యిలా జవాబిచ్చేసరికి లంకేశ్వరుడు ఆగ్రహంతో జ్వలించిపోయాడు. ఆమె హితోక్తులు అతనికి రుచించలేదు. పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా అన్నారు పెద్ద ు. కామాంధుడైన రావణుడు రోషం తెచ్చుకుని కనులెఱ్ఱజేసి పళ్ళు పటపటాకొరికాడు. అతని రూపం చూడటం యిష్టం లేక జానకి తలవంచుకుంది.

"సీతా! కామం చాలా చెడ్డది. అయినా అది దయాస్నేహాలకు ఆధారభూమి. అందువల్లనే నీ మెట్టవేదాంతం వింటూ కూడా దయార్ద్ర హృదయంతో ఊరుకుంటున్నాను. నా నిశిత కరవాలానికి నిన్ను ఎరవేయలేకకాదు. నీ మాటలు నాకు కోపం తెప్పించినా, నీ మీద వున్న అపారమైన ప్రేమే నిన్ను రక్షిస్తోంది. రాజ్యభ్రష్టుడై, జటావల్కలాలు ధరించి తాపసిలాగా తపోవనాలు తిరుగుతున్న ఆ రాముడు లంకారాజ్యం వైపు కన్నెత్తి చూడలేడు. సరే! నీకు వత్సరం గడువు యిచ్చాను. అందులో రెండుమాసాలే మిగిలి వున్నాయి. ఆ లోగా నీ మనస్సు మార్చుకొని ఈ రాక్షసేంద్రుని శయ్యనలంకరించి సుఖించు. త్రైలోక్యసామ్రాజ్యాలను నీ పాదాల ముందుంచుతాను. అలా జరుగని నాడు మా పాకశాలాధికారులు నీ శరీరాన్ని కోసి, నాకు ఉదయఫలహారంగా వండి వడ్డిస్తారు" అని మేఘంలా గర్జించాడు. సీత గజగజ వణికి, భయపడి దీన దృక్కులతో చూస్తోంది. రావణుని వెనుక వున్న దేవగంధర్వకాంతలు నేత్ర; హస్త సంజ్ఞలు చేసి భయపడవద్దని సూచించారు. అంతలోనే ఆమె తేరుకొని-

"రావణా! ఈ విశాల లంకారాజ్యంలో నీ శ్రేయఃకామిలేడను కుంటాను. నీకు హితం చెప్పి సన్మార్గానికి త్రిప్పగల మిత్రులే కరువయ్యారు. ఓ రాక్షసాధమా! నా భర్త గుణగణాలను, సత్ప్రవర్తనను లోకమంతా ప్రశంసిస్తోంది. జనస్థానంలో వున్న నీ మందిమార్బలాలను అసహాయశూరుడైన రాముడు నిశ్శేషంగా నిర్మూలించడం ఎరుగవా? మహారణ్యంలో మత్తేభంతో వైరం తెచ్చుకున్న కుందేలువు నువ్వు. ఆయన కంటపడేవరకు నీ ప్రగల్భాలు; దురహంకారం చెల్లుతాయి. శ్రీరామచంద్రుని ఎదుట పడ్డావో నీకు భూమిపై నూకలు చెల్లినట్టే!

భర్త ఆజ్ఞ లేనిదే స్త్రీ స్వతంత్రించి శత్రువుతో తలపడరాదనేది; ఆర్యధర్మం. అందువల్ల ఆగేను గాని నా పాతివ్రత్య బలంతో నిన్ను బూడిద చేయ్యలేక కాదు. నన్ను అపహరించిన క్షణంలోనే మృత్యుముద్ర నీ వెన్నుపై పడి, నీకు అవసాన కాలం ప్రాప్తిస్తోంది. కాకపోతే సర్వరాక్షసాధిపతివి, కుబేరుని సోదరుడవు, బ్రహ్మ సాక్షాత్కారం పొందిన వాడివి. శ్రీరామచంద్రుని యిల్లాలిని కబళించాలనే దుర్బుద్ధి ఎందుకు పుట్టింది నీకు, "అని కఠినంగా పల్కి తలదించుకుంది జానకి. కళ్ళనుండి అశ్రువులు జలజలా రాలి ఆమె కూర్చున్న అరుగుపై పడ్డాయి. పై నుండి హనుమ యిదంతా చూస్తూ, వారి మాటలన్నీ చెవులు రిక్కించుకుని వింటున్నాడు.





31. ధ్యానమాలి

రావణుడు హుంకరించి ఒక్క అడుగు ముందుకు వేసాడు. ఆయన భార్య ధ్యానమాలి కొండచిలువలాంటి అతని భుజం రెండు చేతులతో గట్టిగా పట్టుకొని ఆపింది.

"ఓసీ మూర్ఖురాలా! నోటికి వచ్చినట్లు వదరుతున్నావు. నిన్నీక్షణంలోనే చిటికలో సంహరించగలను". అని రంకెవేసాడు. సీత చుట్టూ వున్న రాక్షసస్త్రీల వంక కొరకొరా చూసి -

"ఓసే ఏకాక్షి, హస్తికర్ణీ, దంహముఖీ మీ రంతా నయానా భయాన దీని మనసు మార్చి మమ్మువరించేటట్లు చెయ్యండి" అని ఆజ్ఞాపించాడు. ధ్యానమాలి రావణుని కళ్ళలోకి మోహపారవశ్యంతో చూస్తూ - "రాక్షసేంద్రా! దీనురాలు, దుఃఖితురాలు, కృశించి రూపహీనయైన ఈ మానవి నీ కెందుకు? నీ మీద వాంఛలేని దానితో నీకు సుఖం వుండదు ప్రియా! పైగా తాపం మిగిలుతుంది. నీయందు అనురాగభరితులమై రాగరంజిత రసకేళిలో క్రీడిస్తూ నిన్ను తృప్తిపరచే నేనుండగా ఈ పురుగుతో పని యేమిటి! మన శయనమందిరానికి పోదాం పదండి!" అంటూ అతన్ని ప్రసన్నుడ్ని చేయగా రావణుడు అమెతో కలిసి వెళ్ళిపోయాడు. పరివారమంతా అనుసరించింది. సీతా సాధ్విని దుర్భాషలాడుతుంటే హనుమ ఆగ్రహం పట్టలేకపోయాడు. ఒక్క సారి విశ్వరూపం ధరించి రావణుడ్ని హతమారుద్దామా అనుకున్నాడు. కాని సుగ్రీవాజ్ఞ ఎంతవరకూ వుందో అంతవరకే కార్యసాధన సాగించాలి అని మిన్నకున్నాడు. కొమ్మల్లో సర్దుకొని కూర్చున్నాడు.



32. రాక్షస స్త్రీలు సీతాదేవిని భయపెట్టడము



రావణుడు నియమించిన భయంకరాకారులైన రాక్షససేవికాగణం వికృత చేష్టలతో సీతను భీతిల్లజేస్తున్నారు. ఆమె రామచంద్రునిపై మనస్సు లగ్నం చేసుకొని ధైర్యం తెచ్చుకుంటూ యోచిస్తోంది. హరిజట అనే రక్కసి తన కోరల మధ్య నాలుకను నాగుపాములా త్రిప్పుతూ ఎగిరిగంతులు వేసి చేతులు ముందుకు చాచి భయపెడుతూ -

"ఒసే సీతా! మా లంకేశ్వరునికి యేమితక్కువని తిరస్కరిస్తున్నావు. ఆయన ఎవరను కుంటున్నావే! బ్రహ్మమానసపుత్రులు. ఆరుగురు ప్రజాపతులలో; నాల్గవవాడు పులస్త్య ప్రజాపతి. ఆయన కుమారుడు విశ్రవసువు. విశ్రవసువుకు కైకసి వల్ల జన్మించిన వాడు రావణచక్రవర్తి. త్రింశత్కోటి దేవతలు మా ప్రభువు చేత పరాజితులైనవారే! రణరంగంలో ముందు చూపేగాని వెనుకంజ వేసి యెరుగడు. అంతటివాడు నిన్ను భార్యగా పొందాలనుకోవడం నీ అదృష్టం. తెలివి తక్కువ దానా! ఆయన అభిమానాన్ని వదులుకోకు" అని వికారంగా నవ్వింది.

వికట అనే యువ రక్కసి తన పిల్లికళ్ళను త్రిప్పుతూ, సీతను గేలిచేసి నవ్వుతూ-

"దేవతలేకాదు, నాగ, గంధర్వ, దానవ గణాలు మా ప్రభువుల పాదాల ముందు తలలు వంచి నిలబడ్డారు. అటువంటి మహావీరుని కాదనకు మూర్ఖురాలా! అంది.

"మా ప్రభువు పేరు వింటే వాయువు స్థంభించాలి. గ్రీష్మభానుడు ఆయన కోసం లంకలో శైత్యకిరణాలు ప్రసరిస్తాడు. మా ఉద్యానవనాలలో లతలు, వృక్షాలు ఋతు నిమిత్తం లేకుండా పుష్పఫలాలిచ్చి ఆయన అనుగ్రహం పొందుతాయి. అటువంటి మహామహుని కౌగిలి చేరే అదృష్టం కాలదన్నుకోకు" అంది దుర్ముఖి అనే రాక్షసి.


మొలకు ఎలుగుచర్మం కట్టి అనాచ్ఛాధితస్థనద్వయం మధ్య ఎముకలదండ ధరించి శూలం త్రిప్పుతూ - "వినిపించిందా మానవాంగనా! త్వరగా తేల్చుకో! హాయిగా రావణహృదయరాణివై, లంకారాజ్యమహారాజ్ఞివై మా అందరి సేవలు పొందుతావా? లేక...................... హ.! హ.! హ.! నీ గుండెల్లో ఈ శూలం గుచ్చి పచ్చిరక్తం తాగుతూ నీమాంసం మంటల్లో ఉడికించి తినెయ్యమంటావా!" అని శూలం ముందుకు దూసి బెదిరిస్తోంది ప్రఘస. దాన్ని ప్రక్కకు తోసుకుంటూ నల్లనిరోమాలు గప్పిన పిక్కలతో లోతుకుపోయి, ఎఱ్ఱబారిన కళ్ళతో నీలిరంగు చింకి పాత కట్టిన అజాముఖి సీత ముందుకు వచ్చి -

"ఎందుకే దీనితో మాటలు. దీని అందమైన విశాలనేత్రాలు, అదురుతున్న పయోధరాలు, ఆకాశసదృశజఘనం, ఒక్కొక్క అవయవం ఎంత రుచిగా వుంటాయో, బాగా నమిలి నమిలి మింగేద్దాం" అంటూ రంకెవేయగా సీతాసాధ్వి శ్రీరామునే మనసులో ధ్యానిస్తూ దిక్కుతోచక దీనవదనయై పులిని ఎదుటపడిన హరిణంలా బెదిరిపోతోంది.

శూర్పణఖ అట్టహాసం చేస్తూ రాగానే సేవికారాక్షసగణం ప్రక్కకు తప్పుకుంది –" హు! నీవల్లే కదా రాముడు నన్ను చేపట్టలేదు. ఆ నాడు దండకారణ్యంలో నిన్ను రక్షించిన నీ పెనిమిటి, మరిది, యిప్పుడు లేరు. ఒసే నిన్ను యిప్పుడే చంపి తినేస్తాను" అని రాక్షసస్త్రీల వంక తిరిగి కల్లుకుండలు తెప్పించండే, దీన్ని గుడిలో అందరం కలిసి తినేసి కల్లుత్రాగి నికుంభిలాదేవి గుడిలో కరాళనృత్యం చేద్దాం. నేను అన్నతో దీని జీవిత పరిసమాప్తికి అనుమతి పొంది వస్తాను అంటూ ఎనుబోతులా నడిచి అంతఃపురం వైపు వెళ్ళింది. రాక్షసస్త్రీలంతా చేరి వికటాట్టహాసాలు చేస్తూ, ఎఱ్ఱని నాలుకలు బైటపెట్టి భయపెడుతూ, గుడ్లురిమి గుడ్లగూబల్లా చూస్తూ సీతాసాధ్వి కూర్చున్న అరుగు చుట్టూ నృత్యం చేస్తున్నారు. వారి పాదతాడనలకు ఆమె కూర్చున్న వృక్షం, అరుగు కంపిస్తున్నాయి. ఆ ప్రక్కనే హాయిగా నిద్రిస్తున్న త్రిజట అనే రాక్షస స్త్రీ వీరి గందరగోళానికి ఆవులిస్తూ కళ్ళు తెరచి మసగ్గా చూసి – మరొకవైపు తిరిగి పడుకుంది. రాక్షసాంగనల అల్లరి భరించలేక సీత –

"ఎందుకిలా గేలిచేస్తారు. మానవాంగన రాక్షసుడి భార్య ఎలా అవుతుంది? మీ రాజు వివాహితయైన నన్ను కోరడం అనుచితం. దండకారణ్యంలో పధ్నాలుగు వేలమంది రాక్షస సేనను; ఖరదూషణులను అసహాయశూరుడై పోరు సల్పి వధించిన నా భర్త అల్లుడైన రావణుని తృటి కాలంలో తుదముట్టించగలడు. నేను సముద్రం యివతల వున్నానన్న సంగతి ఆయన గ్రహించి తప్పక వస్తాడు. సూర్యునితో ప్రభ, ఇంద్రునితో శచి, చంద్రునితో రోహిణి, అగస్త్యునితో లోపాముద్ర, చ్యవనుని వెంట సుకన్య, సావిత్రీ సత్యవంతులు, అరుంధతీవసిష్ఠులు; నలదమయంతులు వీరందరి లాగానే మేము విడదీయరాని దంపతులం. రాముడ్ని విడచి యింతకాలం నేను మనగలగడమే నాకు ఆశ్చర్యం. అయితే ప్రాణాలు తీసుకొనే అధికారం కూడా నాకు లేదు. అందుకనే ఆత్మహత్యకు ప్రయత్నించలేక పోతున్నాను. రండి! మీరే నన్ను భక్షించండి. ప్రాణాలు పోవడమే నాకు కావలసింది" అని గోడు గోడున విలపిస్తూ ఆ చెట్టు క్రిందనుండి లేచి; హనుమ అధివసించిన శింసుపావృక్షం వైపు నడిచింది. రాక్షసస్త్రీలంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు. క్షణం ఆలోచనలో పడ్డారు. రాజు అనుమతి లేనిదే తమ యిష్టం వచ్చినట్లు ఆమెకు హాని తలపెట్టరాదని వారికి తెలుసు.

కాలం సమీపిస్తే కాని ప్రాణికి మృత్యువు రాదనే మాట వాస్తవం. కాకుంటే రాఘవుడు కనిపించకుండా ఘడియ గడుపలేని నేను యింతకాలం ఎలా జీవించగలిగాను. ఏ జన్మలో చేసిన పాపఫలమో లేకపోతే కుమారుని వంటి లక్ష్మణుని అనరానిమాటలన్నందుకు దుష్పరిణామమే అనుభవిస్తున్నాను. యింతకీ ప్రాణప్రియంగా ప్రేమించిన రాఘవుడు ప్రాణాలు విడిచాడేమో! కాదు కాదు అలా ఎన్నటికి జరుగదు. నన్ను మరిచాడేమో, ఊహు, లేదు శేషజీవితం తపస్సు చేస్తూ మునిలా గడుపుతున్నాడేమో! ఉహుహు! అదీ అయివుండదు. వీరుడు తన కర్తవ్యాన్ని విస్మరించి, సన్యాసి జీవితాన్ని స్వీకరించడు. రూపు కనుమరుగైతే ప్రేమ కూడా మరుగే అవుతుంది సుమా! అని పరి పరివిధాల యోచించి శింశుపావృక్షానికి తల వెంట్రుకలే తాడుగా కట్టి ఉరిపోసుకుని ఈ రాక్షసహింస నుండి, నిరంతర దుఃఖం నుండి విముక్తి పొందాలనుకుంటుతోంది. శింశుపావృక్షం అరుగుపైకి ఎక్కి నిల్చుని తన పొడవాటి నల్లని కురులను ముందుకు తీసుకొని చేతులతో పట్టుకుంది. నల్లని కురుల్లో నల్లనిరాముడు దర్శనమిచ్చాడు. 'ఆహా! నాథా! ఎన్నోసార్లు నువ్వీ కురులను ప్రేమగా నిమిరి లాలనగా ముద్దాడావు. నాడు నీకు ప్రియమైన ఈ కేశాలే నేడు యమపాశాలై నా పంచప్రాణాల్ని నీ చరణాల ముందుకు చేరుస్తాయి; అనుకొని క్రింది కొమ్మకు వ్రేలాడదీయడం ఎలాగా అని పరికించి చూస్తోంది. చెట్టుపై ఏదో ఆకారం కదిలినట్లయింగి. యింతలో రాక్షసస్త్రీలు ఆమె నిలబడ్డ చెట్టుదగ్గరికి వచ్చి, మళ్ళీ వికారంగా హేళనలు చేస్తున్నారు. త్రిజటకు మెళు కువ వచ్చి హఠాత్తుగా లేచి కూర్చుంది. ఒక్క సారి వళ్ళు విరుచుకుని, ఆవులించి చిటిక వేసి, భయం భయంగా పరిసరాలు గమనించింది. ఎదురుగా సీతను రక్కసులు బాధించడం గమనించి -



౩౩. త్రిజట స్వప్న వృత్తాంతము



"ఒసే పాడుముండల్లారా! సీతను చంపకండి. ఆ పుణ్యాత్మురాలిని ఏమీ అనకండి. ముందు ముందు మీకే దుర్గతి పట్టనుందో చెప్తాను ఆగండి!" అంటూ బిగ్గరగా అరిచింది. ఆమె మాటలకు రక్కసులు అవాక్కయిపోయి త్రిజటవంక చూస్తున్నారు. ఆమె లేచి వారి వద్దకు వెళ్ళి, -

"ముందు సీతను వదలి యిలా రండే రండల్లారా! నాకొక కలవచ్చింది".

"ఏమిటి! ఏమికలా! వివరంగా చెప్పు" అంటూ ముందరకు వచ్చి కూర్చున్నారు.

"ఇప్పుడు తెలతెలవారుతున్నది కదా! నాకు బాగా నిద్రపట్టి కల వచ్చింది ఆకలలో రాక్షసనాశనం, లంకాపతిపతనం, శ్రీరామవిజయం కనిపించాయే".

"సవిస్తరంగా చెప్పవే తల్లీ! యేమేం కలగన్నావు?" అందో రక్కసి.

"అది సీతకు శుభం మనకు పీడ తెచ్చేది. కలలో రామచంద్రుడు తెల్లని వస్త్రాలు ధరించి తెల్లతామరల దండలు వేసుకుని ఏనుగు దంత నిర్మితమైన తెల్లని పల్లకీ ఎక్కాడు. ఆ పల్లకిని పాలమీగడుల దొంతరల వంటి వెయ్యి హంసలు లాగుతున్నాయి. ఈ జానకి శ్వేతాంబరాలు, చెంగల్వపూదండలు ధరించి సర్వాభరణ భూషితయై, సముద్ర మధ్యంలో గల ఒక తెల్లటి గిరి శిఖరం అధివసించింది. రాముడు అక్కడికి వెళ్ళి ఆమెను పల్లకిలో యెక్కించుకున్నాడు. సూర్యునితో వెలుగు చేరినట్లు ఆమె తన పెనిమిటిని చేరింది.

మరికొంత సేపటికి రామలక్ష్మణులు తెల్లని మేఘాల వంటి నాలుగు దంతాల భద్రగజాలు ఎక్కి లంకారాజ్యం వచ్చి సీతను ఎక్కించుకున్నారు. మరో దృశ్యంగా మన రావణుని పుష్పకవిమానం మీద సీతారామ లక్ష్మణులు ఎక్కి ఉత్తరదిక్కుగా గగన మార్గాన వెడుతున్నట్లు కనిపించింది."

"ఓస్! అంతేకదా! అవేం జరిగే పనులు కావు. కలలు కల్లలన్నారు. మన ప్రభువు అసమానశక్తిసంపన్నుడు. ఒక మానవుడు ఆయన్నేం చెయ్యలేడు" అంది ఒక రాక్షసి తన రాజు పట్ల విశ్వాసం రెట్టింపుకాగా!

"ఓసి పిచ్చిదానా! తెల్లవారుఝామున వచ్చిన కలలు యదార్థమయిన సందర్భాలనేకం చూసాను. అయినా కలలో మరో కల వచ్చింది."

"ఏమిటి ?"

"మన లంకేశ్వరుడు ముండితశిరస్సుతో వళ్ళంతా నూనె పూసుకొని, ఎఱ్ఱబట్టలు నల్లఉత్తరీయం ధరించి, గిండిలో నువ్వులనూనె పోసుకు త్రాగుతూ పుష్పకం మీద నుండి క్రింద పడ్డాడు. గన్నేరుపూలదండలు వేసుకుని పదే పదే నూనె పూసుకుంటూ నేలపై పడి పొర్లాడుతున్నాడు, యింతలో కారు చీకటిని బట్టగా కట్టుకున్న ఒక వికృత యువతి మన రాజు మెడకు ఉచ్చు బిగించి లాక్కుపోతోంది."

"అమ్మ బాబోయ్! యిదేదో ఉపద్రవ సూచకమే," అంది అజాముఖి.

"అంతే కాదు! రావణుడి కొడుకులు, పరివారం; వంటికి నూనె పూసుకుని కనిపించారు. రావణుడు పంది, ఇంద్రజిత్తు మొసలి, కుంభకర్ణుడు ఒంటె ఎక్కి దక్షిణంగా వెళ్ళడం చూసాను.

"ఒక్క విభీషణుడు మాత్రం శ్వేతవస్త్రధారియై, సుగంధపరిమళ మాల్యాను లేపనాలు వంటికి రాసుకుని, మంత్రులు వెంటరాగా నాలుగు దంతాల భద్రగజం మీద ఊరేగుతున్నాడు. శంఖదుందుభినాదాలు, విజయఢంకా అతని ముందు వాయిస్తున్నారు".

"ఆశ్చర్యం!" అంది శంకువర్ణ అనే రక్కసి తన నోరును బిలంలా తెరచి.

"యిదేమి విడ్డూరం" అంది లంబోష్ఠ పెదాలు వికృతంగా తిప్పి త్రిజట మళ్ళీ చెప్పనారంభించింది.

"మేఘనాథ, కుంభకర్ణ, మహోదర, వజ్రదంష్ట్ర, ధూమ్రాక్ష, అకంపన, ప్రహస్తాదులంతా ఎఱ్ఱగుడ్డలు కట్టి పైశాచికనృత్యం చేస్తూ గోమయకూపంలో దూకుతున్నారు. బలిష్ఠుడైనవానరవీరుడు లంకంతా కాల్చి వేస్తున్నట్లు కనిపించింది." అని ఆగింది త్రిజట. రాక్షసస్త్రీలంతా ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ భయంతో గజగజ వణికిపోతున్నారు.

"మొద్దు ముండల్లారా! ఈ దుస్స్వప్నాలన్నీ మనకు మన రావణునికి, లంకారాజ్యానికి అరిష్టం సూచిస్తున్నాయి. రాముడు ధర్మాత్ముడు. ఆయన పరాక్రమం ముందు దేవాసురులు ఒక్కటై ఎదిరించినా నిలువలేరు. ఆయన భార్యయైన సీత ఉత్తమురాలు. పతివ్రత, ఈ పుణ్యాత్మురాలిని బాధించకండి. ఆమె జోలికి పోకండి. మీరు బుద్ధి తెచ్చుకొని ఆమె పాదాల మీద పడి క్షమాభిక్ష వేడుకోండి" అని గద్దించింది. వారంతా అయోమయంగా శింశుపా వృక్షం వంక, సీతవంక చూసి దూరంగా తొలగిపోయారు.

త్రిజట స్వప్నవృత్తాంతం చెప్పగా ఆత్మహత్యా ప్రయత్నంలో వున్న జానకి, శింశుపావృక్షాగ్రంలో సమయం కోసం వేచి చూస్తున్న ఆంజనేయస్వామి లీలగా విన్నారు. వైదేహి వామనేత్రం, వామభుజం, ఎడమ ఊరువు అదిరాయి. శ్రీరామచంద్రుడు ధనుర్ధారియై యెదుట నిలబడిన భావన కలిగింది. వెంటనే చేతిలోవున్న కేశాలను సుతారంగా ముడివేసి వెనుకకు వాల్చింది. కొద్దిగా దుమ్ము కొట్టిన బంగరురంగు చీరచెంగు రవంత జారింది.

34. హనుమ; సీతాదేవిని కనుగొనుట

'ఏమిటీ! హఠాత్పరిణామం. శుభశకునాలు కలుగుతున్నాయి' అని విస్తుపోతోంది శరీరానికి శక్తి; పునరుత్సాహం ప్రాప్తించి, వదనం రాహుగ్రహవిముక్త శశిబింబంలా నూత్నతేజం సంతరించుకుంది. అంతరంగ విచారం సన్నగిల్లి, గుండెలో సంతోషం చిరుదీపంలా వెలిగింది. తనంత తాను ధైర్యం తెచ్చుకొని రాతిపలకలు పేర్చిన అరుగుపై పదిలంగా కూర్చుంది. హనుమ ఆలోచిస్తున్నాడు.

'జన్మ ప్రభృతి విచారం ఎరుగని జనక రాజపుత్రి, అమిత పరాక్రమ వంతుడైన దశరథుని పెద్దకోడలు, సత్యధర్మనిష్ఠాగరిష్ఠుడు; అనమానశూరుడు, ధనుర్విద్యాపారంగదుడు అయిన శ్రీరామచంద్రుని భార్య ఈ నాడు మూర్తీభవించిన శోకదేవతలా వుంది. నేను ఈమెకు ఆశ్వాసన కలిగించి తీరాలి వెంటనే. నేను ధైర్యం చెప్పి ఆమెను యే అఘాయిత్యానికి పూనుకోకుండా చెయ్యాలి. చెట్టుదిగి ఎదుట పడితే!'

అని కొమ్మలు దిగడానికి యత్నించి తక్షణం ఆగిపోయాడు.

35. వాయునందనుని శ్రీరామకథా గానము

'ఉహూ! హఠాత్తుగా ఆమె ఎదుట పడితే యిక్కడి రాక్షసమాయలతో విసిగిపోతున్న ఆమెకు నాపై నమ్మకం కుదరదు. కేకలు పెడుతుంది. అయినా పరిసరాల్లో సంచరిస్తున్న రాక్షసులు నన్ను చూసి వస్తారు. వాళ్ళతో తలపడి యుద్ధం చెయ్యవలసి వస్తుంది. రామకార్యం సజావుగా సాగదు. ఏం చెయ్యాలబ్బా! ఉపశమనం కల్గించి, నాపై విశ్వాసం కల్గించాలి. తరువాత చెట్టుదిగి దర్శనం చేసుకుంటాను' అని శ్రీరామకథాగానం ప్రారంభించాడు మారుతి -

"దశరథుడనే మహారాజు అయోధ్యానగరానికి ఏలిక. వైవస్వతమనువు, ఇక్ష్వాకుడు, త్రిశంకుడు, దిలీపుడు, భగీరథుడు మొదలైన మహామహులు పుట్టిన సూర్యవంశం వారిది. దశరథమహారాజు తన పరాక్రమం చేత దేవాసుర సంగ్రామంలో అసురులను మట్టి గరిపించిన వీరుడు. చతురంగబల సమన్వితుడు, ధర్మపరుడు. అయినా అనపత్యుడు కావడం వల్ల పుత్రకామేష్టి యాగం నిర్వహించి శ్రీరామభరతలక్ష్మణశత్రుఘ్నులను తన ముగ్గురు రాణుల వల్ల పొందాడు.

జ్యేష్ఠుడైన రామభద్రుడు, సదాచారపరాయణుడు, సర్వజీవలోకరక్షకుడు. ఆర్తజనబాంధవుడు. పుత్రులు నల్వురు సకల విద్యా పారంగదులైనారు. దశరథునికి రామచంద్రునిపై అమితప్రేమ, వారిది తులలేని తండ్రీతనయుల బాంధవ్యం, తలవని తలంపుగా విశ్వామిత్రమహర్షి యాగసంరక్షణార్థం రామలక్ష్మణులను తీసుకువెళ్ళి, బల; అతిబల, విద్యలు నేర్పి వారి చేత రాక్షస సంహారం చేయిస్తాడు. రామకరస్పర్శ వల్ల అహల్య పునీత అవుతుంది. మిథిలాపురాన్ని యేలే రాజర్షి పుత్రిక జానకీదేవి. ఆమె నాగేటి చాలున లభించటంతో సీతగా పిలవబడుతోంది. జనకచక్రవర్తి ఆమెకు స్వయంవరం ప్రకటించగా, రామచంద్రుడు అనితరసాధ్యమైన శివధనుర్భంగం గావించి ఆమెను వివాహం చేసుకున్నాడు. నల్వురు కుమారులకు పెళ్ళిళ్ళయి కాలం గడుస్తోంది. ముదిమి మీద పడ్డ దశరథుడు తన పెద్ద కుమారునికి రాజ్యపట్టాభిషేకం నిర్ణయించాడు. కాని మంథర అనే అసూయగ్రస్త దాసి; కైక మనసు విరిచేసింది. దేవాసురసంగ్రామంలో తనకు భర్త యిచ్చిన వరాలు కోరవలసిందిగా మంథర, చిన్నరాణి కైకకు దుర్బోధ చేసింది. కైక తన కుమారుడైన భరతునికి రాజ్యపట్టాభిషేకం, కౌసల్యానందనుడైన రామచంద్రునికి పదునాలుగేళ్ళు వనవాసం కోరింది. రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై వనవాసం చేస్తుంటే రాక్షసులతో వైరం వచ్చింది. రావణుడు మాయలేడిని పంపి, మోసంతో రాముని భార్యను అపహరించాడు. శ్రీరామచంద్రుడు భార్యాన్వేషణలో

వనాలన్నీ తిరుగుతూ సుగ్రీవుడనే వానరరాజుతో మైత్రి సల్పాడు. వాలిని వధించి సుగ్రీవునికి కిష్కింధారాజ్యం అప్పగించాడు. సుగ్రీవరాజు లక్షలాది వానరవీరులను సమీకరించి నలుదిక్కులు గాలించమని, సీతామాత జాడతెలుసుకు రమ్మని పంపించాడు. దక్షిణ దిశగా వచ్చిన వానరులు, సంపాతి అనే పక్షిరాజు తెల్పడం వల్ల సీత లంకలో వుందని తెలుసుకున్నారు. వారిలో అంజనీదేవి పుత్రుడు ఆంజనేయుడ్ని నేను. సముద్రం దాటి వచ్చి ఆ సాధ్వి దర్శనం కోరుతున్నాను" అంటూ మధురంగా శ్రీరామకథాగానం సంస్కృత భాషలో చేస్తుంటే సీతాసాధ్వి వళ్ళంతా సంతోషంతో పులకరించగా శ్రద్ధగా వింటోంది.

ఈ మధురమైన మాటలు, ఛందోబద్ధ, వ్యాకరణయుక్త శ్రీరామకథా నిర్వచనంగా, గీర్వాణభాషాసౌందర్యం ఉట్టిపడేలా చెపుతున్నది ఎవరు అని ఆశ్చర్యపోయి నలుదిక్కులా పరికిస్తోంది అవనిజ. ఆ నాడు అపహరించబడిన పిదప యింత వరకు "రామ" అన్న పలుకే ఎవరినోట విని వుండలేదామె. పైగా రావణ రాజ్యంలో అతని లంకానగరంలో శ్రావ్యమైన ఇక్ష్వాకువంశీయుల సంక్షిప్త చరిత్ర చెప్పిందెవరు? అరుగుమీద నుంచి లేచిందామె. చుట్టూ పరికించి చూచింది. ఎవరూ కానరాక ఆకుల అలజడి అయితే శింశుపావృక్షం పైకి చూసింది. చల్లగాలి రివ్వున వీచగా, చిందర వందరగా ఆమె ముఖంపై పడిన జుట్టును వెనక్కు సవరించుకొని, పద్మదళాల వంటి నేత్రాలు మరింత విశాలంచేసి పరిశీలించింది.

ఆశ్చర్యం! తెల్ల వస్త్రాలు ధరించి, పగడాల ముద్ద వంటి మూతితో, గంటుపడ్డ ఎడమ దవుడతో ఒక చిన్న వానరం కనిపించింది. ఉదయాద్రి మీద భానుబింబం ప్రకాశిస్తుంటే ఆ లేత వెలుగులో ఆకుల మధ్య కూర్చుని వున్న కపిశ్రేష్ఠుడు దర్శనమిచ్చాడు. కలగంటున్నానా ! యిది నిజమా! కలలో కపిదర్శనం అశుభం అంటారు పెద్దలు. దీని ఫలం ఏమయి వుంటుంది. రామలక్ష్మణులకు శుభమగు గాక! అయోధ్యలో ముప్వురు అత్తలకు భరతశత్రుఘ్నులకు మంగళ మగుగాక! జనకమహారాజుకు మిథిలావాసులకు మంగళ మగుగాక! అనుకుంటూ శింశుపా వృక్షమూలానికి జార్లపడింది వైదేహి. ఆమె మనసులో తర్కించుకుంటోంది. పదిమాసాలుగా యీ లంకారాజ్యంలో వానరం ఎన్నడూ కనిపించలేదే? నాకు మెళుకువ వచ్చి చాలాసేపైంది నిద్రరావటం లేదు. మరి కల ఎలా వస్తుంది.

"శ్రీరామ్...... శ్రీరామ్....... శ్రీరామ్...... జానకి రామ్........ అయోధ్య రామ్..... పట్టాభిరామ్; కోదండ రామ్.........." అంటూ హనుమ రామ నామస్మరణం చేస్తున్నాడు. అది విని సందేహావస్థలో వున్న వైదేహికి తను వింటున్నది చూచినది భ్రమకాదని యదార్ధమని అవగతమైంది. మళ్ళీ పైకి చూచింది. వానరం చెట్టు దిగుతూ

కనిపించింది. పిల్లకోతి రూపంలో మార్జాల మంత వున్న హనుమ వినయంగా అంజలి ఘటించి నిలబడ్డాడు. పరీక్షగా చూసింది జానకి. లోకమాత దృష్టి తనపై పడటంతో ఆనందంతో పొంగిపోతున్నాడు హనుమ. తోకనుముద్దు పెట్టుకొని చిరుగంతు వేసి మళ్ళీ బుద్ధిగా వినయంగా నిలబడ్డాడు. చేతులు జోడించి -

"అమ్మా! నీ వెవరుతల్లీ! చంద్రుని విడిచిన రోహిణిలా వున్నావు. వశిష్ఠుని భార్య అరుంధతివా? నాగగంధర్వ కిన్నెర యక్ష జాతులలో ఏజాతి సుందరీ మణివి? నీ దివ్య స్వరూపం సర్వలోకాలకు మంగళ ప్రదం చేకూర్చేలావుంది. చూడబోతే గొప్ప రాజకుమారిలా అవుపిస్తున్నావు. ఉపస్థానంలో దశకంఠరావణుడు అపహరించి తెచ్చిన శ్రీరామచంద్రుని యిల్లాలు సీతాసాధ్విలా వున్నావు! చెప్పు తల్లీ!" అని ప్రశ్నించాడు హనుమ వినమ్రతతో -

రామ నామం, శ్రీరామకథ, విన్న సీత కమలనయనాలు రవికిరణ స్పృశితాలైనట్లు ప్రఫుల్ల మైనాయి. సర్వ దుఃఖాన్ని మరచి పరవశించి పోతోంది. కళ్ళు సంతోషంతో ఆర్ద్రమైనాయి. క్షణం మాట్లాడక కపిశ్రేష్ఠుణ్నే చూస్తూ -

"నాయనా! నేనే సీతను. ఈ భూమండలంలోని రాజన్యులలో శ్రేష్ఠుడైన దశరథుని పెద్దకోడలిని. విదేహరాజు, రాజర్షి, అయిన జనకమహారాజు కుమార్తెను. శ్రీరామచంద్రునికి అర్ధాంగిని. వివాహానంతరం అత్తవారింట పన్నెండేళ్ళు కాపురం చేసాను. పదమూడో సంవత్సరంలో దశరథచక్రవర్తి తన జ్యేష్ఠకుమారుడు శ్రీరామచంద్రునికి పట్టాభిషేకం చెయ్యదలిచాడు. అయితే మా పిన్నత్తగారు కైక మత్సరగ్రస్తురాలై పూర్వం రాజు తనకు యిచ్చిన వరాలు కోరింది. తన కుమారుడైన భరతునికి రాజ్యపట్టాభిషేకం, శ్రీరాముణ్ని పద్నాలుగేళ్ళు వనవాసం చెయ్యమనడం ఆమె కోర్కెలు; భరతునికి పట్టాభిషేకం చేస్తానన్నారుగాని ప్రాణప్రదంగా పెంచుకున్న రామచంద్రునికి వనవాసం అంగీకరించ లేకపోయారు రాజు. కాని ఆమె అన్నపానాలు మానేసి ప్రాణత్యాగం చేస్తానంది. ఈ విషయాలన్నీ కైకేయి స్వయంగా రాముడికి చెప్పి, తన కోర్కెల మేరకు ఆజ్ఞాపించింది.

'తండ్రి మాటను చెల్లించడమే నా భాగ్యం. ఈ రాజ్యభోగాలు అవసరం లేదు. మా పితురుల సత్యసంధతను కాపాడుటయే నాకు ప్రీతికరం అంటూ నా భర్త జటావల్కలాలు ధరించి అడవికి ప్రయాణమయ్యాడు. ఆయన అనుమతితో నేను, లక్ష్మణుడు అనుసరించాము. నదీనదాలు దాటుకుంటూ, ముని ఆశ్రమాలు, జనపదాలు చూస్తూ, వనసౌందర్యం వీక్షిస్తూ ముగ్గురూ దండకారణ్యంలో నివసిస్తున్నాము. నాభర్త ఒంటరిగా పోరి జనస్థానంలో రాక్షసులను శూరుడై సంహరించాడు. ఒక రోజున ఈ లంకాధిపతి రావణుడు రామలక్ష్మణులు లేని తరుణం చూసి కపట

వేషం.................." అని ఆగింది సీత. ఆమె గతాన్ని; రావణుని మాయవేషాన్ని తలుచుకొని వణికి పోయింది; ప్రభంజనంలో లేత మామిడాకులాగ.

"ఆగిపోయావేం తల్లీ ! చెప్పు "

"నువ్వు మాయారూపధారి రావణుడివికాదు కదా! నీ వాలకం చూస్తుంటే క్రొత్త రూపం ధరించినట్లున్నావు. నన్ను బాధించకు" అంటూ దూరంగా జరిగి కళ్ళు మూసేసుకుంది.

హనుమ విస్తుపోయాడు. 'ఈ తల్లిని నమ్మించడం ఎలాగ? ఆమె అనేక దినాలుగా రాక్షసమాయలకు అలవాటు పడిపోయింది. ఎవరినీ విశ్వసించడంలేదు. ఎలాగైనా నా పై నమ్మకం కల్గించుకోవాలి' అనుకొని శ్రీరామభజన చేస్తూ గంతులేస్తున్నాడు. భక్తితో చేతులు జోడించి కనులు మూసుకొని వాలం ఆడిస్తూ "శ్రీరామ జయరామ.... జయ జయరామ... రామ..." అంటున్నాడు. నృత్యం చేస్తున్నాడు హనుమ. సీత బాగా పరికించి చూస్తోంది. రావణుడు ఎంతమాయావి అయినా కామక్రోధమదమాత్సర్యాలకు బానిస, అతని అహం శత్రుసంకీర్తనం చేయనిస్తుందా! అందువల్ల యితడు రావణుడు కావడానికి వీల్లేదు, సంభాషించడానికి వానరమే, అనుకొని ప్రసన్నంగా చూసింది. మందహాసం చేసింది, ఆంజనేయుని చిలిపి చేష్టలకు. అది గమనించాడు హనుమ. నృత్యం ఆపి వైదేహి విశాలనేత్రాలలోకి దీనంగా తనను నమ్మమన్నట్లు చూస్తున్నాడు.

'ఇంత భక్తిపారవశ్యం రావణునికి కలుగదు. యితను నిజంగా శ్రీరామభక్తుడే అయివుంటాడు' అనుకుంది సీతాసాధ్వి. క్షణం ఆగి –

"నువ్వు రామచంద్రుని భజిస్తున్నావు. ఆయన దూతవే అయితే, నీది నిష్కపట రూపమే అయితే రామచంద్రుని, గుణగణాలు వర్ణించు. ఆయన రూపురేఖావిలాసాలు ఎలా వుంటాయో వివరించు, అప్పుడు విశ్వసిస్తాను" – అన్నది జానకి మృదువుగా, ఆమె అడిగిందే తడవుగా –

"జననీ జానకీ దేవి! శ్రీరామచంద్రుడు సూర్యసమ తేజస్వి. సర్వప్రాణి కోటికి ఆహ్లాదం కల్గించడంలో రేరాజును మించినవాడు. సుదర్శనచక్రం వలె విక్రమ గుణసమన్వితుడు. దేవగురువు బృహస్పతిని మించిన మధుర వాక్కులు పలుకుతాడు. ఎంతటి కఠోరసత్యమైనా ప్రియంగా చెప్పగల సమర్థుడు, సౌమ్యుడాయన. లోక మర్యాదా రక్షకుడు. దాక్షిణ్యశీలి. దివాకరుని వలె కాంతిమంతుడు. కీర్తికి దేవేంద్రుడు. తన కులాన్నీ, ధర్మాన్నీ శరణాగతులను రక్షించడంలో అప్రమత్తుడు. అగ్ని హోత్రమంత పవిత్రంగా బ్రహ్మచర్య దీక్షలో నీ విరహంతో వున్నాడు తల్లీ!" అని ఆగి –

"ఇక అంగాంగ సౌందర్య శారీరిక శుభలక్షణాలు వర్ణిస్తాను. ఆయన

బాహువులు దీర్ఘంగా దృఢంగా వుంటాయి. భుజాలు విపులం. సుమారు ఏడున్నర అడుగుల సమున్నత విగ్రహం, తలలో మూడు సుళ్ళు వుంటాయి. ఇంకా చెప్పాలంటే రాజీవాక్షుడు, కంబుగ్రీవుడు, గూఢజత్రువు, దుందుభీధ్వానగళుడు. సర్వావయవాలు సమంగా విభక్తమై వుండటం ఆయన ప్రత్యేకత. సువిశాల ఫాలభాగం దీర్ఘంగా సాగి కొనదేరిన నాసిక, లేత గులాబిరంగు ఓష్ఠద్వయం. సాముద్రిక శాస్త్రం ప్రకారం శుభలక్షణాలన్నీ వున్న పురుషోత్తముడు రామచంద్రప్రభువు" అని హనుమ చెపుతుంటే జానకి తలపంకించి వళ్ళంతా చెవులు చేసుకుని శ్రద్ధగా వింటోంది.

"తల్లీ! ఆయన తమ్ముడు సౌమిత్రి అన్ని విధాల అన్నగార్ని పోలివుంటాడు. అయితే శ్యామదేహచ్ఛాయ రామునిది, హేమద్యుతి వర్ణం లక్ష్మన్నది".

"ఆహా! ఎంత రమణీయంగా చెప్పావు హనుమ. ఈ రోజు నా నాధుని వర్ణన నీ నోట వెంట వినటం కోసమే నేనిన్నాళ్ళు జీవించి వున్నాను. బతికి వుంటేనే ఎప్పటికైనా సుఖపడవచ్చు; చస్తే యేం లేదనే పామరజనుల మాటల అర్థం అనుభవం ద్వారా చవి చూసాను నాయనా!" అన్నది సీత సంతృప్తిగా.

"జననీ విను, అగ్నిపర్వతం లోలోపల ఎలా మండుతూంటుందో రామచంద్రుడు నీ విరహాగ్నిలో ప్రస్తుతం అదే స్థితిలో వున్నాడు. భూకంపం వేళ పర్వతాలు గజగజలాడినట్లు ఆయన హృదయం నీ కోసం విలవిల్లాడుతోంది. సెలయేళ్ళు, నదీనదాలు, అందమైన నెమళ్ళు, చమరీ మృగాలు, కుందేళ్ళు, లేళ్ళు, ఎర్రతామరలు, సుగంధాలు విరజిమ్మే జాజులు, మల్లెలు, సంపెంగలు, మొగలులు; మొల్లలు, పక్వఫలాలు యివేవి చూచినా నిన్నే తలచుకుని కుమిలి పోతున్నాడు. కందమూలాలే ఒక్క పూట తీసుకుంటున్నాడు. కంటి మీద రెప్పవాలదాయనకు. నిన్ను పొందడం కోసమే నిరీక్షిస్తున్నాడు".

అని వాయునందనుడు చెప్తుంటే సీతకు ఒక రకంగా ఆనంద మనిపించింది తనను తప్ప అన్యస్త్రీలను కామించని భర్త యొక్క ప్రేమకు. అయ్యో! నాధుడు పరితపిస్తున్నాడే అని ఖేదం కూడా కల్గింది మరో రకంగా.

"అమ్మా! ఆయనకు నువ్వెక్కడ వున్నది తెలియదు. మీ క్షేమ సమాచారాలు తెలుసుకొని రమ్మని పంపగా నేను సముద్రలంఘనం చేసివచ్చాను. నా పేరు ఆంజనేయుడు. అంజనాదేవి, కేసరి అనే వానరరాజదంపతుల పుత్రుడ్ని. వానర రాజు సుగ్రీవుని మంత్రిని. నా పరాక్రమం వల్ల, వాయుదేవుని ఆశీస్సుల వల్ల మిమ్మల్ని చూడ వచ్చిన రామబంటును నేను. నన్ను విశ్వసించండి. నామాట నమ్ము తల్లీ" అని హనుమ తన ఉత్తరీయాన్ని కట్టిన రామచంద్రుని అంగుళీయకం తీసి వినయంగా వంగి ఆమె అరుణ కమలాలకందించాడు. సీత దాన్ని తీసి, కళ్ళ కద్దుకొని తన మనోహరుని చూసినంత

మోదం పొందింది. హృదయానికి హత్తుకొని నాధుని గాఢపరిష్వంగం గుర్తు తెచ్చుకుంది. స్వాంతన పొంది –

"నేను నిన్ను సందేహించానని బాధపడకు నాయనా! ఇప్పుడు నీమీద పూర్ణవిశ్వాసం కుదిరింది. యింతకీ రామలక్ష్మణులను నువ్వు ఎలా కలిసావు? కిష్కింధలో వానరరాజు సుగ్రీవునికి మా విషయాలన్నీ ఎలా తెలిసాయి?"

"అమ్మా! నిన్ను అన్వేషిస్తూ అన్నదమ్ములిరువురూ ఋష్యమూక పర్వతం చేరుకున్నారు. రాజ్యభ్రష్టుడై, భార్యను వాలి చెరపట్టగా శోకిస్తూ వనసంచారం చేస్తున్న సుగ్రీవుడు ధనుర్ధారులైన రామలక్ష్మణులను చూసి కలవరపడ్డాడు. నేను వెళ్ళి వారు మీకోసం వెతుకుతున్నారని తెలుసుకున్నాను. మిమ్మల్ని రావణుడు ఆకాశ మార్గాన తీసుకు వెడుతుండగా మీరు జార విడిచిన నగల మూట మేము జాగ్రత్త పెట్టి వుంచి వారికి చూపించాము. రామసుగ్రీవులు పరస్పర కష్టసుఖాలు వివరించుకొని అగ్నిసాక్షిగా మైత్రి కలిపారు. ధర్మం వీడి తమ్ముని భార్యను తస్కరించినందుకు రామభద్రుడు వాలిని ఒక్క బాణంతో కడతేర్చాడు. సుగ్రీవుడు కిష్కింధకు రాజయ్యాడు. మహాబలుడైన వానరసమూహాలను నలుదిశలా మిమల్ని వెతకటం కోసం పంపాడు. దక్షిణదిక్కుగా వచ్చిన నాకు మీ జాడతెలిసింది తల్లీ!"

"కేసరినందనా! విధి ఎంత బలీయమైనది. నాయనా! ప్రాణులు సుఖసంతోషాలతో తేలియాడుతున్నా; క్లేశసాగరంలో మునిగినా కాలపాశం వారి కంఠాన వ్రేలాడుతూనే వుంటుంది. సమయమాసన్నమవగానే ముడిబిగుసుకుని మృత్యువు దరి చేరుస్తుంది. రావణుడు పెట్టిన గడువు రెండు మాసాలే వుంది. ఎప్పటికి లంక చేరుతాడు నా పెనిమిటి? రాక్షసులను ఎప్పుడు సంహరించి నాకీ చెర నుండి విముక్తి ప్రసాదిస్తాడు. అనురాగబద్ధమైన మా సంసారం ఎప్పటికి చక్కబడుతుంది?"

"అమ్మా! చింతించకు, యిన్నాళ్ళు నువ్వెక్కడున్నది వారికి యిదమిత్థంగా తెలియదు. నేను వెళ్ళి మీ జాడ తెలిసినదే తడవుగా అవలి ఒడ్డునున్న వానర భల్లూకగణాలతో వచ్చి ఈ దుష్టరావణుని నమూలంగా నాశనం చేస్తాడు. అనతికాలంలోనే మిమ్మల్ని తీసుకువెడతాడు".

"రామభద్రునితో నా దీనస్థితి చెప్పి త్వరగా రమ్మను. ఆ నాడు మాయలేడిని కోరింది మొదలు యింత వరకు ఆయన్ను చూడలేదు. రావణుడు నన్నెత్తుకు వచ్చి యిక్కడ వుంచిన నాడు; దేవేంద్రుడు పాయసం పంపగా సగభాగం నా భర్తకు నివేదించి సగం తిన్నఫలితంగా నేను ఆహారం తినకపోయినా యిన్నాళ్ళూ జీవించి వున్నాను. ప్రాణాలు తీసుకునేందుకు కూడా నాకు అధికారం లేదు. నాధుని అనుమతి కావాలి. ఈ దుష్టరాక్షసులు ఘడియకో రకంగా నన్ను బాధిస్తున్నారు. రావణసోదరుడు

విభీషణుని భార్య సరమ వారి కుమార్తె కళ అప్పుడప్పుడు వచ్చి నాకు ధైర్యం చెప్తున్నారు. గంజాయి వనంలాంటి ఈ లంకారాజ్యంలో తులసి మొక్కలాంటిది, విభీషణుని కుటుంబం. నన్ను శ్రీవారికి అప్పగించమని విభీషణుడు రావణునికి పరి పరి విధాల చెప్పినా అతడు వినలేదట. అనింద్యుడనే వృద్ధసచివుడు కూడా నన్ను చెఱపట్టడం అకార్యమని హితం చెప్పినా దశకంఠుడు వినలేదట. యివ్వన్నీ కళ నా కెరింగించింది. నా వల్లభుడు తప్పకుండా వస్తాడని నా అంతరాత్మ ఘోషిస్తోంది. అందుకే వారి కోసం కనులు కాయలు కాచేలా ప్రతీక్షిస్తున్నాను హనుమా!' అంటూ జల జలా కన్నీరు కారుస్తోంది ఆమె. హనుమహృదయం ఆమె బాధ చూసి బాణపు దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడింది.

"మాతా!" అని బిగ్గరగా అరిచాడు. ఆమె తలఎత్తి చూసింది.

"సర్వరాక్షసగణాలను ఈ పిడికిలి పోట్లతో ఈ క్షణమే హతమారుస్తాను. నా వీపున ఎక్కి కూర్చోండి. ఆకాశమార్గాన వాయువేగంతో పయనించి ప్రస్రవణ గిరి మీద వున్న రామచంద్రుని వద్దకు యిప్పుడే తీసుకొని వెడతాను రండి" అన్నాడు ముందుకు వంగి వీపు చూపుతూ. అంత దుఃఖంలోనూ జానకీ దేవి ఫక్కున నవ్వింది.



38. మారుతి విశ్వరూపము

"అంగుష్ఠ మాత్రం లేవు. నన్ను కూర్చోబెట్టుకొని జలధి దాటిస్తావా! నీ ఆత్మవిశ్వాసం గొప్పదేనోయి!" అంది. అది పరాభవమో ప్రశంసయో హనుమకు బోధ పడలేదు. నా రూపం చూసి ఈ తల్లి సందేహిస్తోంది. విశ్వరూపం చూపించి నాపై విశ్వాసం పెంచుకోవాలి అనుకుంటూ అరుగు మీద నుండి క్రిందికి దూకాడు, అరుగుకు రెండడుగులు దూరంగా నిలబడి రెండుచేతులు నడుము క్రిందిభాగంలో

పిడికిలి బిగించి హుందాగా అనించి ఊర్ధ్వంగా చూస్తూ తన తల్లిదండ్రులను, వాయుదేవుని, సూర్యదేవుని స్మరించుకున్నాడు. ఆయన రూపం అనంతంగా ఎదిగిపోతూ సీతమ్మ కూర్చున్న శింశుపా వృక్షం చివరి కొమ్మలు దూసుకుంటూ ఎదుగుతున్నాడు. ఆయన భుజస్కంధాలకు తగిలిన చెట్టుకొమ్మలు ఫెళఫెళా విరిగి దూరంగా పడ్డాయి. మేఘమండలం వరకు ఎదిగిన శిరస్సు మండుతున్న అగ్నిగోళంలా వుంది. వజ్ర సమమైన దంష్ట్రలు ఏనుగుదంతాల్లా బైటకొచ్చాయి. కనులు దివిటీల్లా వున్నాయి. మారుతి వక్షం విశాలమైన పీఠభూమిలా అయింది. బాహువులు తాటిదూలాల్లా బలిసివున్నాయి. శింశుపావృక్షం హనుమ మోకాళ్ళ వరకు వచ్చింది. శిరస్సున దివ్యకాంతులీనే వజ్రాలు పొదిగిన కిరీటం ఉదయ సూర్యకాంతుల్లో రమణీయంగా వుంది. ఈ రూపం అంతా సీతమ్మ తల్లి విస్తుపోయి చూస్తోంది. ఆ రూపం సీతకే దర్శింపచేస్తున్నాడు. మిగిలిన వారికి ఆయన అదృశ్యుడు. "అమ్మా! యిప్పుడైనా నమ్మకం కుదిరిందా? నేను తమర్ని ఈ రోజే శ్రీరామసన్నిధికి చేర్చగలను. శచీదేవి ఇంద్రుని చేరినట్లు, రోహిణీనక్షత్రం చంద్రుని అంకపీఠం అలంకరించినట్లు మీరు సంతోషంగా శ్రీరామచంద్రప్రభువు సన్నిధికి ఈ క్షణమే చేరగలరు." అన్నాడు మేఘం ఉరిమినట్లు గంభీరంగా. స్వరం భీకరంగా వున్నా, వినయం ధ్వనించిన మాటలు విన్నది సాధ్వి. ఆలోచించింది.

"నాయనా! హనుమ. నువ్వు సముద్రం దాటి వచ్చేవంటే శక్తిమంతుడవే అనుకున్నాను. నిన్ను మామూలు వానరంగా భావించలేదు. నీ రూపం రాక్షసుల కంట పడరాదు. శీఘ్రంగా ఉపసంహరించు, వారితో మనకు నిష్కారణ కలహం వచ్చే ప్రమాదం వుంది" అంది.

"ఆజ్ఞ! తల్లీ" అంటూ క్షణంలో చిన్నవాడై అరుగు ముంగిట నిలిచాడు. ఆమె కనిపించడానికి అరుగు అడ్డు రావటంతో మళ్ళీ అరుగు ఎక్కాడు. సీతా సాధ్వి హనుమ వంక మాతృవాత్సల్యంతో చూస్తూ –

"హనుమా! నీ సూక్ష్మరూపం చూసి నీ శక్తి గ్రహించలేక పోయాను కుమారా! అగ్నిసదృశతేజస్వివి, వాయుగమనం, పర్వతాకారం గల ధీమంతుడివి నువ్వు. నన్ను తీసుకువెళ్ళగల సామర్థ్యం నీకుంది వత్సా! అయితే మనం బయలు దేరగానే రాక్షసులు వందలు, వేలుగా నీపై వివిధ మారణాయుధాలతో తలపడుతారు. రావణుని మంత్రులు, సేనానులు, పుత్రులు, చివరకు సాధారణ భటులు కూడా అస్త్రప్రయోగం; బాణ ప్రయోగం; మాయా విద్యలు నేర్చినవారు. వారంతా ఒక్కుమ్మడిగా నీపై యుద్ధానికి వస్తే వారి అస్త్రాలనుండి తప్పించుకుంటూ పోరాడవలసివస్తుంది. అందరినీ నిర్జించగల సమర్థుడవే. కాని నన్ను రక్షిస్తూ వారితో యుద్ధం చేయడం వల్ల ఏకాగ్రత కుదరదు. లిప్తకాలంలో నేను నీ వీపు నుండి జారి సముద్ర గర్భంలో పడిపోవచ్చు. మహామత్స్యమకరతిమింగలాలకు నేను ఆహారమై పోవచ్చు. అప్పుడు నీ సాహసం,

శ్రమవృధా అవుతుంది. నన్ను కాపాడటమే ప్రధాన యోచనగా పెట్టుకుంటే అస్త్రశస్త్రాల వల్ల దెబ్బలు తింటావు. రక్తశిక్తమైన నీ శరీరం, వారితో నీ ఒంటరి పోరాటం నేను చూడలేను. పైగా యుద్ధం మీద బుద్ధి పెట్టడం నీకు వీలు కాదు. ఎంత బలవంతులమైనప్పటికి విజయం ఖచ్చితంగా మననే వరిస్తుందని చెప్పలేం. జయాపజయాలు దైవాధీనము, విధిలిఖితము నాయనా!" మృదువుగా చెప్పింది జానకి.

ఆంజనేయస్వామి శ్రద్ధగా ఆలకిస్తున్నాడు. ఆమె మళ్ళీ చెప్పసాగింది.

"వాయుపుత్రా! నన్ను నువ్వు తీసుకు వెళ్ళినా అది నా నాధుని శౌర్యానికి కళంకమవుతుంది. శ్రీరామచంద్రుడు, సౌమిత్రి, సుగ్రీవుడు మీరంతా కలిసి వచ్చి రావణున్ని; అతని పరివారాన్ని ఎదిరించి వీరోచితంగా పోరాడిగెలిచి నన్ను తీసుకువెళ్ళడం అందరికీ సత్కీర్తినిస్తుంది. రాక్షసేంద్రుడు కపటియై నన్ను మోసగించి, రామలక్ష్మణులు లేని తరుణం చూసి దొంగ చాటుగా అపహరించాడు. శ్రీరాముడు కూడా యుద్ధం లేకుండానే నిన్ను పంపి నన్ను తీసుకు వెళ్ళటం; హీన రాక్షసుడు, పిరికిపంద చేసినపనిలాగే ఉంటుంది సుమా!

మరొక కారణం కూడా ఉంది. పతినే ప్రత్యక్షదైవంగా భావించే నేను నా భర్త దేహాన్ని తప్ప మరొక పురుషుని శరీరం తాకజాలను. మరి రావణుడు తెచ్చినపుడేం చేసావని నీ వనుకొనవచ్చు! వాడు నన్ను బలాత్కారంగా తెచ్చాడు. అబలపై పశు బలం చూపి వివశురాలను చేసి తస్కరించాడు. అది నా దోషం కాదు. ఆ సమయంలో కూడా రాముని పైనే నా మనస్సు లగ్నమై ఉన్నది. భర్త అనుమతి లేదని ఆ నాటి నుండి ఈ నాటి వరకూ నేను వానిపై ఆగ్రహించనూ లేదు శపించనూ లేదు. లేకుంటే నన్ను తాకి రావణుడు బ్రతికి ఉండే వాడు కాదు. నా సంకల్పంతో వాడి దశశిరస్సులు సహస్ర వ్రక్కలయ్యేవి. ఏ రకంగా యోచించినా శ్రీరామచంద్రుడు స్వయంగా వచ్చి నన్ను తీసుకు వెళ్ళటమే శ్రేయస్కరం" అన్నది శాంతంగా.

"తల్లీ! పతివ్రతాశిరోమణులకే తలమానికం నువ్వు. ఇటువంటి నియమ నిష్ఠలు నీకే తగును. శ్రీరామచంద్రప్రభువు తనువు తప్ప అన్యపురుషుని తాకనన్నావే, అది రామపత్ని మాత్రమే త్రికరణశుద్ధిగా చెప్పగల ధర్మవాక్కు. అటు స్వామి మీ వియోగంలో విచారంగా ఉండటం, ఇక్కడ మీరు దుష్ట రావణునిచే మాటలు పడటం, భయంకరాకారం గల రాక్షస స్త్రీలు మిమ్ము వేధించడం చూడలేక ఈ సూచన చేసేను తప్ప మరేం కాదు. సరే! మిమ్మల్ని చూసి మాట్లాడి నట్లు స్వామికి గుర్తు తెలుపు. నేను తిరిగి వెళ్ళి శ్రీరామచంద్రునికి ఏమి చెప్పాలని మీ ఉద్దేశ్యం?"



37. జయంతుని వృత్తాంతము



ఈ మాట వినగానే సీతకు పాత సంఘటనలు స్ఫురణకు వచ్చి, ఒక్కసారి కన్నీళ్ళు పెట్టుకుంది. "నాకు, ఆయనకు మాత్రమే తెలిసిన కొన్ని రహస్యాలు యితనికి చెప్పాలి. దానివల్ల నన్నీతడు కలుసుకున్నట్లు నేను వారినే మనస్సులో ధ్యానిస్తున్నట్లు స్వామికి నమ్మకం కుదురుతుంది" అనుకుంది. ఆమె దుఃఖపడటం చూసి మౌనం వహించాడు హనుమ. కొన్ని ఘడియలు ఆగి చెప్పసాగింది.

"పుత్ర సమానుడవైన నీకు కొన్ని రహస్యవిషయాలు చెబుతాను. భార్యా-భర్తల మధ్య జరిగే కొన్ని రహస్య సన్నివేశాలు వారిలో ఒకరి పై మరొకరికి గల ప్రేమానురాగాలకు ఉదాహరణలుగా కలకాలం మనస్సుల్లో నిలుస్తాయి. ఎంతో ఆత్మీయులకు గానీ, దంపతులు వాటిని ఇతరులకు చెప్పరు. శ్రీరామచంద్రునికి ఈ విషయం గుర్తు చేస్తే ఆయన నువ్వు నన్ను కలుసుకుని, మాట్లాడినట్లు విశ్వసిస్తారు. ఖేదభరితమైన ఆయన అంతరంగం నిర్మలమై నన్ను శీఘ్రంగా కలుసుకోవాలని, నేను వారినే మనోవాక్కాయకర్మలతో కోరుకుంటున్నాని స్వామికి తేటతెల్లమౌతుంది".

"అలాగే చెప్పు తల్లీ!" అన్నాడు. ఎదురుగా కూర్చోమన్నట్లు సంజ్ఞ చేసింది. హనుమ వినయంగా అరుగు చివర్న ఆసీనుడైనాడు. వినమ్రత ఉట్టిపడ్డ నేత్రాలతో అసక్తి కనబరుస్తున్నాడు.

వైదేహి గంభీరంగా చెప్పనారంభించింది. "ఒకనాడు నేను, ఆయన చిత్రకూటంలో ఏటిగట్టున విలాసంగా పుష్పాలు కోస్తూ, క్రిందపడిన బదరీఫలాలు ఏరుకుతింటూ, చెట్టాపట్టాలేసుకుని తిరిగి తిరిగి అలసిపోయాము. సెలయేటిలో నిర్మలోదకం త్రాగి దప్పిక తీర్చుకున్నాము. పచ్చటి పచ్చికపై కూర్చుని, కబుర్లాడుకుంటుండగా ఒక ధ్వాంక్ష తిన్నగా ఆకాశం నుండి ఎగిరి వచ్చి అల్లంత దూరంలో వాలడం చూశాను. ఆయన ఊసులు చెప్పుతూ, నా అంకం పై తల అన్ని పవళించారు. మాగన్నుగా నిద్రపట్టింది. ఆ వాయసం గెంతుకుంటూ, నా దగ్గరకు వచ్చి, భుజం మీద వాలి పొడవసాగింది. చేతికందిన మట్టిబెడ్డ తీసుకుని దానిని కొట్టాను. దూరంగా పోయి నన్నే చూస్తూ నిలబడింది. దగ్గరలో అనేక ఫల వృక్షాలు, చిట్టడవి; వుండగా ఆ కాకి నా మీదనే ఎందుకు వాలిందో అర్థం కాలేదు. కాసేపాగి అది మళ్ళీ వచ్చి, నా రొమ్ముపై గాయం చేసింది. రవికె రక్తంతో తడిసింది. పళ్ళు బిగపట్టి, బాధ ఓర్చుకొన్నాను. నాధునికి నిద్రాభంగం కాకుండా దానిని తరిమికొట్టాలని నా నడుముకు కట్టిన పట్టెడ లాగాను. చీర కొంచెం జారింది. అప్పుడు స్వామికి

మెళుకువ వచ్చి, చూచి విస్తుపోయారు. ఉరఃస్థలం నుండి నెత్తురు కారడం గమనించి ఎదురుగా వున్న కాకిని చూచి విషయం గ్రహించారు. కనులెఱ్ఱ చేసి, ప్రక్కనే వున్న దర్భపుల్లను తీసి మంత్రించి వదిలారు. మేము చూస్తుండగానే ఆ వాయసం వాయువేగంతో మేఘమండలాన్ని దూసుకుంటూ పోతోంది. నాధుడు విసిరిన దర్భ బ్రహ్మాస్త్రమై, దానిని తరుముకుంటూ మనోవేగంతో వెళ్ళింది. పతి లేచి ప్రక్కనే ఉన్న డొంకల్లోకి వెళ్ళి ఆకులు తెచ్చి, పసరు పిండగా నా వక్షం నుండి రక్తస్రావం గడ్డకట్టింది. కాస్త చల్లగా ఉంది. కొంత తడవైంది. మేము బయలు దేరబోతుండగా ఆకాశం నుండి "శరణు! శరణు! శ్రీ రామచంద్రప్రభో! నా తప్పిదం మన్నించి కాపాడండి" అని వినపడింది. మేము ఒకరి మొహాలు ఒకరు చూసుకుని, ఆశ్చర్యపోతుంటే అదే కాకి భయంతో పణుకుతూ, శ్రీరామపాదాల ముందు మోకరిల్లింది.

"ఎవరు నువ్వు? నా భార్యపై ఎందుకు అఘాయిత్యం తలపెట్టావు?" అని ప్రశ్నించారు పతి.

"జయంతుడు నాపేరు. దేవేంద్రుని ఏకైక కూమారుడను. మీ పరాక్రమం పరీక్షించదానికి కొందరు దేవతలు నన్నీ పని చెయ్యమన్నారు. ముల్లోకాలు తిరిగి ముక్కోటి దేవతలను శరణు వేడాను. ఎవ్వరూ నన్ను కాపాడలేదు ప్రభూ! దయతో క్షమించి, కాపాడండి" అని దీనంగా దుఃఖిస్తూ వేడుకుందా ధ్వాంక్షము.

"నేను నిన్ను మన్నిస్తాను, కానీ బ్రహ్మాస్త్రం వృధాకారాదే!"

"అయితే నా కుడికన్ను అర్పిస్తున్నాను" అని అతడనగానే శరం రివ్వున కాకి కంటిలోకి దూసుకుపోయింది. రక్తం చివ్వున చిమ్మింది. ఆ కాకి మూలుగుతూ, "శరణాగతవత్సలా!, రామచంద్రప్రభూ!, నీ దయవల్ల బ్రతికి పోయాను, శలవు" అని ఆ కాకి నభోమండలానికేగింది. ఇది మా ఇద్దరికీ తెలిసిన సంఘటన. మరొకటి ఎరింగిస్తాను హనుమా! మరొక దినం మేమిద్దరం అడవిలో నడిచి, చాలా దూరం వెళ్ళాము. నడిచి, నడిచి నాకు ఆయాసం వచ్చి, శరీరమంతా చెమటలు పట్టాయి. నుదుటి పై కుంకుమ కరిగి పోయింది. రామచంద్రుడు కొండ శిలల నుండి ఎర్రటి గైరిక ధాతువు తీసి తిలకంగా దిద్దారు. ఆ వేడుక సీత ఇప్పటికీ మరిచిపోలేదని చెప్పు. ఆయనకు నమ్మకం, ఆనందం కలుగుతాయి".



38. చూడామణి

"మరి నాకు ఏదైనా వస్తువు కూడా గుర్తుగా ఇస్తావా ? జననీ!"

"ఇదిగో! నా వివాహ సమయంలో నా తల్లి ప్రేమతో యిచ్చిన చూడామణి. దీనిని ఆ నాడు నా మామగారైన దశరథమహారాజే స్వయంగా నా తలపై అలంకరించారు" అంటూ కొంగుముడి విప్పి, వజ్రాలు, కెంపులు, పచ్చలు పొదిగిన దివ్యకాంతులీనే చూడామణిని తీసి యివ్వగా దోసిలి పట్టి స్వీకరించి, ఉత్తరీయాన్ని కట్టి, భద్రపరుచుకున్నాడు జగజట్టిహనుమ.

"మీ మాటలుగా ఏమి చెప్పమంటారు తల్లీ?" అని ప్రశ్నించాడు మారుతి.

"రామలక్ష్మణులను త్వరగా రాక్షససంహారానికి తీసుకురా, నేను పడుతున్న బాధలు కళ్ళారా చూసినవాడివి. వారిని తీసుకురావటానికి నువ్వే సమర్థుడవు. వారి మిత్రులందరినీ క్షేమం అడిగానని చెప్పు. వాయుపుత్రా!, సాగర లంఘనం, నిశిరాత్రి నా కోసం లంకంతా గాలించడం వల్ల నువ్వు బాగా అలసినట్లున్నావు. ఇక్కడి పొదలమాటున ఒకరోజు విశ్రాంతి తీసుకుని వెళ్ళరాదా? నా కోసం శ్రమపడి వచ్చావు, నీకు కనీస ఆతిథ్యం యివ్వలేని స్థితిలో వున్నాను నాయనా" అన్నది సీతాసాధ్వి, మారుతి పై పుత్రవాత్సల్యంతో చూస్తూ తన కోసం దుర్భేద్యమైన లంకకు సాహసం చేసి, సముద్రలంఘనం చేసి వచ్చిన హనుమకు ఆతిథ్యం యివ్వలేక పోయానే అని ఆమె అంతరంగం కొట్టుమిట్టాడుతోంది. "అమ్మా! నేను శీఘ్రంగా వెళ్ళి రామచంద్రమూర్తి వారికి మీ క్షేమసమాచారం అందించాలి. సముద్రలంఘనంలో నేను అలసిపోలేదు, వెళ్ళిరానా? మరి!"

సీత క్షణం మౌనం వహించింది. ఆమె మనస్సులో సందేహాలున్నాయని గ్రహించి –

"చెప్పండి తల్లీ! ఏమిటి సంకోచిస్తున్నారు"

"నిన్ను చూడగానే నాకు ఊరట కలిగి దుఃఖాన్ని మరచిపోయాను. నువ్వు వెళ్ళిపోగానే చంద్రుని రాహువు మ్రింగినట్లు విచారం నా మనస్సును ఆక్రమించేస్తుంది. నువ్వు అయితే మహాబలశాలివి, వాయుపుత్రుడివి కనుక సముద్రం పిల్లకాలువలా దాటి రాగలిగేవు. మరి మిగిలిన వానరులు, రామలక్ష్మణులు ఎలా రాగలరు?" అని ప్రశ్నించింది.

"దేవీ! మీకు ఎలాంటి సందేహము వద్దు. జలధి దాటగల వాడను నేనొక్కడనే కాదు అక్కడున్న వానరులంతా నా కన్న మిక్కిలి బలవంతులు, సమర్థులూను. సుగ్రీవుడొక్కడే కాదు, జాంబవంతుడు, అంగదుడు, నీలుడు, సుషేణుడు యింకా అతడి సేనలో చాలామంది భూమండలాన్ని చుట్టిరాగల వారున్నారు. అందరికన్నా బలశాలిని మొట్టమొదటే రాజు దూతకృత్య నిర్వహణకు పంపడు కదా! కనుక

అందరిలోనూ తక్కువ వాడినైన నన్నే ముందుగా పంపారు. రామలక్ష్మణులనే రాజసింహాలను నా మూపున ఎక్కించుకుని రోదసీని హోరెత్తిస్తూ శీఘ్రంగా వస్తాను తల్లీ! మీరు సంతోషంగా వుండండి. రాజకుమారులు విల్లమ్ములు పట్టి లంక వాకిట నిలవటం, వానర సేన ఎగురుతూ, దూకుతూ, కుప్పిగంతులు వేస్తూ లంకను సర్వనాశనం చేయటం, రాకాసిమూకలు రక్తమాంసాల బురదల్లో పొర్లాడటం త్వరలో చూస్తారు. నేను పోయి, చెప్పడమే తరువాయి, యుద్ధసన్నాహాలు వెంటనే జరుగుతాయి. మీరు ధైర్యంగా ఉండండి" అంటూ హనుమ ఆమె పాదాలంటి నమస్కరించాడు.

"నేను ప్రాణాలతో నిలిచి ఉన్నానని రామలక్ష్మణులతో చెప్పు. త్వరగా కార్యం నెరవేరేలా చూడు. నీకు మంగళమగుగాక, వెళ్ళిరా నాయనా!" అంటూ శుభం పలికింది జానకి. రివ్వున ఎగిరి చెట్టుకొమ్మలపైకి దూకుతూ, ఉత్తర దిక్కు ప్రాకారం మీదికెక్కి కూర్చున్నాడు హనుమ. ఆలోచనా తరంగాలు ఆయన మనస్సును తేనెటీగల్లా ముట్టుముట్టాయి.

౩౫. కార్యసాధకుడు – శ్రీ ఆంజనేయ స్వామి

ఒక కార్యం పై బయలుదేరినప్పుడు దానికి సంబంధించిన యితర కార్యాలు కూడా చక్కబెట్టాలి. అదీకాక సీతామాత పదిమాసాలుగా ఒంటరితనం, రాక్షస బాధలు అనుభవిస్తోంది. ఆమె చిత్తం భయగ్రస్తమైంది. రావణుడు ఆమెను దుర్భాషలాడుతూ మానసిక క్షోభపెడుతున్నాడు. రామలక్ష్మణులను చులకన చేసి మాట్లాడుతున్నాడు. అందువలన కేవలం ఈమె జాడ తెలుసుకుని వెళ్ళిపోరాదు. ఆమె మనస్సంక్షోభం; అంతరంగ భీతి పోగొట్టి, అవి రావణునికి కలిగేలా చెయ్యాలి. తన శత్రువు తనకంటె బలమైనవాడిగా భావించినప్పుడు రావణుని మనస్సులో భయం కలుగుతుంది. అందుకని రావణ శత్రుదూతగా నా పరాక్రమం చూపించాలి. ఈ రాక్షసి మూకల్ని భయపెడితే సీతామాత జోలికి పోకుండా ఆమెను ప్రశాంతంగా వుండనిస్తారు' అని యోచిస్తున్నాడు హనుమ. తన ఊహ సక్రమమైనదేనని నిర్ధారించుకున్నాడు. అయితే సామ, దాన పద్ధతుల వల్ల రాక్షసులను సన్మార్గానికి త్రిప్పడం సాధ్యం కాదు. లంకా రాజ్యంలో మితిలేని సంపద ఉంది, వీరిలో 'వీరికి తంపులు పెట్టి, బేధం కల్గిద్దామా అంటే అది కానిపని, అందువల్ల దండోపాయం తప్పదు' అని అనుకున్నదే తడవుగా తన సహజాకృతి దాల్చి, విశాల వటవృక్షం పై దభీమని దుమికాడు. దాని శాఖలు, శాఖాగ్రవాసి పదఘట్టనలకు ఫెళఫెళా విరిగి పడ్డాయి. పెద్ద శబ్దం కావటంతో కావలి వాళ్ళు వచ్చి హనుమను గమనించి, వెంటనే శూలాలు గదలు విసిరారు. వాయుపుత్రుడు వాటిని ఒడుపుగా పట్టుకుని, తిరిగి కొట్టేశాడు. శూలాలు వారి ఉదరాలను చీల్చగా, గదలు వారి తలలు పగులకొట్టగా హాహాకారాలు చేస్తూ వారక్కడే

మరణించారు. రాక్షససేనలు తరలి వచ్చి, హనుమతో పోరాటం ప్రారంభించాయి. అంజనాతనయుడు స్థిరంగా ఒకచోట నిలబడి యుద్ధం చెయ్యకుండా ఒక్కొక్క వృక్షాన్నే విరుస్తూ, సమూలంగా పెకలించి వేస్తూ, వారిపై విసురుతూ ముందుకు సాగుతున్నాడు. అతని చేత చావుదెబ్బలు తింటూ ఎలా పట్టుకోవడమా ఈ వానరాన్ని అని అంతా వెంట పడుతుంటే, కొలనులు, కృత్రిమ శైలాలు, అందమైన అరుగులు, ఉయ్యాలలు; విరిచి నేలమట్టం చేస్తున్నాడు. పక్షి సమూహాలు గూళ్ళలోని పిల్లలను సైతం వదిలి, ప్రాణభయంతో ఎగిరిపోతున్నాయి. పుట్టల్లోని పాపరేళ్ళు కస్సున బైటకు వచ్చి, పడగవిప్పి పరుగెత్తుతున్న రాక్షసుల పాదాలపై కాటేస్తున్నాయి. ఆ బాధకు తట్టుకొలేక క్రింద పడి దొర్లుతున్నారు కొందరు. దొరికిన రక్కసి బంట్లను పిడికిళ్ళతో గుద్ది, ఇనుప కమ్మెల్లాంటి తన మోకాళ్ళతో పొడిచి, తన్ని హతమారుస్తున్నాడు హనుమ. ఉద్యానవనమంతా, నాశనమైపోయింది. చావగా మిగిలిన కొందరు రాక్షసులు ఈ వార్తను తమ ప్రభువుతో చెప్పుకోవడానికి పరుగుపెట్టారు. వాయుపుత్రుడు మామిడిపండ్లను తింటూ ప్రాకారం యెక్కి కూర్చున్నాడు. రాక్షసస్త్రీలు బెంబేలెత్తిపోయి, సీత వద్దకు పరుగెత్తుకొచ్చారు.

"ఆ వానరం ఎవరు? ఎవరు పంపగా వచ్చాడు? నీతో యేమి మాట్లాడాడు? చెప్పు"

'సీతాసాధ్వి ఆలోచించింది. హనుమ సమాచారం గోప్యంగా వుంచాలి. రాముడు దండెత్తి వస్తున్న సంగతి రహస్యంగా వుంచాలి. తనకు వర్తమానం పంపిన సంగతి తెలియనీయరాదు. పైగా ఇతడు నా వాడని తెలిస్తే మిక్కిలి బాధిస్తారు. నా శ్రేయస్సు కోరి వచ్చిన హనుమను సత్యం చెప్పి ఎక్కువ బాధలకు గురిచేయటం అవివేకం. రాచకార్యాలలో అధర్మాన్ని ఎదుర్కొనే ప్రయత్నంలో గూఢచారుల సమాచారం గోప్యంగా వుంచి తీరాలి" అని అనుకున్నది ఆమె.

"పాము గమన మార్గం పాములకే తెలియాలి. అతడెవరో కామరూపుడైన రాక్షసుడు. ఇదంతా మీ మాయ. నన్ను వేధించకండి, వెళ్ళండి" అంటూ కసిరికొట్టింది. కొరకొరా చూస్తూ వారంతా ప్రభువు దర్శనం కోసం దర్బారు వైపు దారితీసారు.

హనుమంతుడు ఫలాలారగించి, ప్రాకారం మీద లేచి నిలబడి పెద్దగా సింహనాదం చేసాడు. అది నలుదిక్కులా ప్రతిధ్వనించింది. కొలువు తీర్చిన రావణునకు కూడా వినిపించింది. విస్తుపోయాడు. ఈలోగా అశోకవనం కాపలావాండ్రు, హనుమతో ప్రథమ పోరాటం జరిపి, పారిపోయిన వారు అక్కడికి బిక్కమొహాలతో చేరుకున్నారు.

"మహాప్రభో! రావణా! ఒక బృహద్మర్కటం అశోకవనంలో ప్రవేశించింది. సీతతో ఏదో మాట్లాడటం గమనించాము. అయినా ఆమెను అడిగితే తనకేమీ

తెలియదన్నది. ఆ కోతి పెనుభూతంలా పెద్దరూపం దాల్చి, అశోకవనం అంతా పాడుచేస్తోంది. మేము దాని చేత దెబ్బలు తినిపారిపోయి వచ్చాము. శరణు!శరణు! రావణా!" అని రోదించారు.

40. జంబుమాలి

మంత్రులు, దండనాధులు, సేనాపతులు, సకల పరివారంతో సభతీర్చి, వున్న రాక్షసేంద్రునికి ఇది అవమానంగా తోచింది. ఇంతలో హనుమ మరో రెండుసార్లు సింహనాదం చేసాడు. "శ్రీరామచంద్రమూర్తికి జై!, లక్ష్మణస్వామికి జై! వానరరాజు సుగ్రీవునికి జై!" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు ప్రారంభించాడు. అవి సభలో ఉన్న రావణుని చెవిన పడుతున్నాయి. అంతా విని నిర్భ్రాంతపోతున్నారు. మంత్రి ప్రహస్తుని కుమారుడు జంబుమాలి వైపు చూసాడు. ఆయన లేచి –

"జయము జయము రావణ ప్రభూ!, నేను వెళ్ళి వాడిని హతమారుస్తాను. ఆజ్ఞ" అని వినయంగా చేతులు జోడించాడు.

"మహావీరులైన భటులను తీసుకుని వెళ్ళి వాడిని ముక్కలుగా ఖండించిరా!" అన్నాడు కనులెఱ్ఱ చేసి రావణుడు. ఈలోగా హనుమ మనోహరమైన శిల్పాలు, విహారస్థలాలు, కృత్రిమ జలయంత్రాలు ధ్వంసం చేస్తూ వేయిస్థంభాల మంటపం వైపు దారితీసాడు. జంబుమాలి పరివారంతో ఎదిరిస్తూంటే ఒక్కొక్క రాక్షసుడ్ని ఒక్కొక్క స్థంభం ఊడబెరికి బాది చంపేస్తున్నాడు హనుమ. సుందరమైన ఆ ప్రదేశమంతా విరిగిన కాళ్ళు, చేతులు నుగ్గునుగ్గయిన తలలు, మొండాలతో, రక్తసిక్తమైంది. హనుమ పై జంబుమాలి బాణవర్షం కురిపిస్తున్నాడు. ఆయన ఒళ్ళంతా గాయాలయ్యాయి. రక్తం కారుతోంది. అయినా లక్ష్యపెట్టకుండా పోరాడుతున్నాడు వాయునందనుడు.

జంబుమాలి కొట్టిన మరోబాణం రివ్వున సాగి హనుమ నుదుటిపై గాయం చేసింది. రోషకషాయిత నేత్రుడై మండపం పై కప్పు నుండి ఇనుపదూలం లాగి జంబుమాలి రొమ్ముపై వేగంగా బాదాడు. వాడు రక్తం గ్రక్కుతూ తూలిపడుతూ ధనస్సు వదిలేసాడు. వాడి రథాన్ని, సారథిని నేలమట్టం చేసాడు. వాడి వీపున మరి రెండు సార్లు బాదేసరికి నిర్జీవంగా పడిపోయాడు జంబుమాలి. హనుమ కోపం రెట్టింపు అయింది.

"నేను వాయుదేవుడి కుమారుడను, వెయ్యి మంది జంబుమాలులు వచ్చినా నాతో సరికారు. శ్రీరామచంద్రప్రభువునకు జై!, సుగ్రీవ, లక్ష్మణులకు జై!" అంటూ మరోమారు సింహగర్జన చేస్తున్నాడు. వెంటనే ఏడుగురు రాక్షసులు వచ్చారు. వారినీ సంహరించాడు. మహావీరులైన రావణుని సేనానులు ఐదుగురు వచ్చారు. వారు హనుమతో పోరాడి యమసదనం చేరారు. లంకలో కలవరం పుట్టింది. రావణుని

గుండె గుభేలు మంది. తాను పంపిన విరూపాక్ష, యూపాక్ష, దుర్ధర, ప్రఘస, భాసకర్ణాది వీరులంతా దేవాసుర సంగ్రామంలో విజయం సాధించినవారే, ఒక్క వానరం ముందు ఇంతమంది నేలకూలడం ఆశ్చర్యం వేసింది సభలోని వారందరికీ.

41. అక్ష కుమారుడు

"మనం వాలి, సుగ్రీవ, నీల, జాంబవంతులం ఎరుగుదుము. వీడెవడో వారిని మించిన వానరంలా ఉన్నాడు. అప్రమత్తంగా వుండండి" అని తన చిన్న కుమారుడు, బాలవీరుడు అయిన అక్ష కుమారుని వైపు దృష్టి సారించి-

"కుమారా! నువ్వు వెళ్ళి వాడి సంగతి చూడు" అనగా అక్షకుమారుడు తండ్రికి ప్రణమిల్లి మరింత సైన్యం వెంటనిడుకొని, వాయుపుత్రుని వైపు వచ్చాడు. రావటంతోనే మూడు శరాలు వదిలి ఆంజనేయుని ముఖంపై మూడు గాయాలు చేసాడు.

'అబ్బా! వీడు బాలుడైనా, రణపండితుడల్లే వున్నాడు' అనుకుంటూ అతని బాణాల నుండి తప్పించుకుంటూ కొన్నింటిని లాఘవంగా పట్టుకుని, త్రిప్పికొడుతూ యుద్ధం చేస్తున్నాడు హనుమ. ఆంజనేయ పర్వతం మీద రాక్షస బాలవీరఅక్షుడు బాణశిలావర్షం కురిపిస్తుంటే దేవగణాలు, వినువీధిలో అచ్చెరువొంది చూడనారంభించారు. హనుమ తన అరచేతిని చాచి శత్రురథాన్ని ఒక్క చరుపు చరిచాడు. గుఱ్ఱాలు బోర్లాపడి, కాళ్ళు విరగ్గా, చక్రాలు సగం వరకు భూమిలో కూరుకుపోయి, రథం విరిగి అక్షుడు క్రిందపడ్డాడు. సారథి నేలకరుచుకుని, తల బ్రద్దలై మరణించాడు. అక్షకుమారుడు నేల పై నిలబడి హనుమ పై శరాలు కురిపిస్తుంటే అతని పరాక్రమానికి మనస్సులోనే మెచ్చుకుంటూ, గగనవీధిలో విహరిస్తూ బాణాల నుండి తప్పించుకుంటున్నాడు.

'ఈ బాలుడిని చంపక తప్పేలా లేదు. వీడు పట్టువదలకుండా విజృంభిస్తున్నాడు' అనుకుంటూండగా అక్షకుమారుడు కూడా రాక్షసమాయ చేత హనుమకు దగ్గరగా వచ్చి, బాణప్రయోగం చేస్తూ ఆయన ఒళ్ళంతా తూట్లు కొడుతున్నాడు. మనస్సు గట్టి చేసుకుని, ఘోరమైన యుద్ధం చేస్తున్నాడు హనుమ. చివరకు వాడి రెండు కాళ్ళు పట్టుకుని గిరగిరా త్రిప్పుతూ నేలపై విసిరికొట్టడంతో తల వ్రక్కలై గుడ్లు బయటకు వచ్చి, నేలకంటుకుపోగా సంధుల్లోంచి రక్తధారలు స్రవించి భయంకరంగా అరచి, ప్రాణం వదిలాడు అక్షుడు. వెంటనే ఈ వార్త రావణునికి తెలిసింది.



42. మారుతి – మేఘనాథుడు



"హా! కుమారా!...." అన్నాడు. నిండు సభలో తన హుందాతనాన్ని సైతం మరచి విలపించాడు. పరిస్థితి గమనించిన రావణ జ్యేష్ఠపుత్రుడు మేఘనాధుడు తండ్రిని సమీపించాడు. బలవంతం మీద దుఃఖాన్ని దిగమ్రింగుకున్న రావణుడు -

"మేఘనాథా! శస్త్రాస్త్ర ప్రయోగాలన్నీ చక్కగా అభ్యసించినవాడవు. ఇంద్రుని చిత్తు చేసిన వాడవు. అలసట ఎరుగని వీరుడవు నువ్వే వెళ్ళి ఆ దుష్టవానరాన్ని ప్రాణాలతో వుండగా బంధించి తీసుకురా!" అంటూ గర్జించాడు దశకంఠుడు.

"అవశ్యం జనకా!" అంటూ తల వూపాడు ఇంద్రజిత్తు.

"మరొక్క మాట అవధరించు. నేను పంపిన కింకరులు, జంబుమాలి, సేనాపతులు, నీ ప్రియసోదరుడు అక్షయుడు ఇంతమందీ ఆ వానరంతో పోరి నిహతులైనారు. అది అసాధారణ వానరం. సేనా బలంతో వాడ్ని బంధించడం సాధ్యపడదు. బాహాబాహి యుద్ధమూ వ్యర్థమే. అందువల్ల నువ్వు అఖండ తపస్సు చేసి సాధించిన అస్త్రపాండిత్యం వల్లనే విజయం చేకూరుతుంది. నీ బుద్ధి చెదరకుండా బాణప్రయోగం చెయ్యి. వెళ్ళిరా!, విజయోస్తు!" అంటూ రావణుడు ఆశీర్వదించగా ఆయనకు ప్రదక్షిణం చేసి, పాదాభివందనం చేసి నాలుగు బలిసిన సింహాలు పూన్చిన ధగధగమెరిసే రథం ఎక్కి ధనుష్ఠంకారం చేస్తూ బయలుదేరాడు ఇంద్రజిత్తు. అతడి రథం పెనుగాలిలాగ రొదపెడుతోంది. తామరరేకులలాంటి అతని నేత్రాల్లో విజయ కాంతులు తొణికిసలాడుతున్నాయి. బలిష్ఠమైన భుజాలు శరసంధానం చేయడాన్కి సిద్ధమౌతున్నాయి. రాక్షసేంద్ర కుమారుడి రథం అలజడి చేస్తూ వడివడిగా రావటం చూసి హనుమ సమరోత్సాహంతో చిందువేసాడు. తన శరీరాన్ని బాగా పెంచాడు. మరోసారి సింహనాదం చేసి, పిడికిళ్ళు బిగించి, కాళ్ళు ఎడంగా పెట్టి, బిగించిన పిడికిళ్ళు జఘనభాగం పై ఆన్చి తీక్షణంగా ఇంద్రజిత్తు వంక చూసాడు. అతడు మాట్లాడకుండా బాణప్రయోగంతో సమాధానం చెప్పాడు. హనుమ అతని శరాల నుండి తప్పించుకుంటూ క్రమంగా ఆకాశానికి లేస్తున్నాడు. ఒక్క బాణం కూడా తగలకుండా చిత్రవిచిత్రగతులతో మెరుపులా తిరుగుతున్నాడు. ఇంద్రజిత్తు తన ధనుర్విద్యాకౌశలం అంతా చూపిస్తూ ఆలోచిస్తున్నాడు.

'ఎన్ని బాణాలు వేసినా ప్రయోజనం లేదు. తగిలినవి కూడా అతను లక్ష్యపెట్టడం లేదు. దులిపిపారేస్తున్నాడు ఈనుపుల్లల్లా. తండ్రి చెప్పిన మాట నిజం. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, మత్తేభాన్ని ఉక్కుగొలుసులతో బంధించినట్లుగా యితన్ని కట్టెయ్యాలి' అని భావిస్తూ మనస్సులో దాని మంత్రం ఏకాగ్రతతో పఠించి, బ్రహ్మకు

హృదయపూర్వకంగా నమోవాకాలర్పించి అస్త్రం ప్రయోగించాడు.

"ఓహో! పితామాహుని అస్త్రం, ముహుర్తకాలం వినయంగా వుండి, దానికి కట్టుబడాలి" అని బ్రహ్మాస్త్రానికి బుద్ధిపూర్వకంగా లొంగిపోయాడు హనుమ. అంతవరకు భయంతో దూరంగా నిలిచిన రాక్షసులంతా వచ్చి, అతడి చూట్టూ మూగేసారు. ఇంద్రజిత్తు ఈ వార్త స్వయంగా తండ్రికి తెలియచేయడానికి వెళ్ళు తుంటే, "రాజకుమార! మహావీర ఇంద్రజిత్తుకి జై!" అంటూ నినాదాలు చేసి అతని పై పూలవర్షం కురిపించారు భటులు. రాక్షసాంగనలు అతనిని చామంతి, గులాబీల పూలమాలలతో అలంకరిస్తున్నారు.

నిశ్చేష్టుడై పడివున్న హనుమ చుట్టూ చేరిన రాక్షసులు 'వీడ్ని ముక్కలుగా కోసుకు తినేద్దాం', వద్దు తాళ్ళతో పగ్గాలతో బంధించి, ఇలాగే ఈడ్చుకుపోదాం ప్రభుసన్నిధికి' అంటూ ఆలోచనలు చేస్తున్నారు. కొందరప్పుడే ఇనుప గొలుసులను దృఢంగా పేనిన జనపనార పగ్గాలను తెచ్చి హనుమను కదలకుండా బంధించేస్తున్నారు. రావణునికి కబురు చెప్పి, తిరిగి వస్తున్న మేఘనాధుడు చూసి, "ఓరి మూర్ఖుల్లారా! బ్రహ్మాస్త్రంతో బంధించి వెళ్ళాను, యితడిని తాళ్ళతో కట్టగానే ఆ అస్త్రం వ్యర్థమైపోయింది" అంటూ వారిపై విరుచుకుపడ్డాడు. "అయ్యో! మళ్ళీ బ్రహ్మాస్త్రం ప్రయోగించ వీలులేదే" అని వాపోతున్నాడు.

వాయుపుత్రునికి స్పృహ వచ్చింది. రావణకుమారుని మాటలు వినిపించాయి. 'అయితే బ్రహ్మాస్త్రం పట్టు వదిలేసి వుంటుంది. ఇక ఈ బంధనాలు, శృంఖలాలు నన్ను బంధించగలవా అయినా రావణుని సన్నిధికి వెళ్ళేవరకూ ఇలాగే కట్టుబడి వుంటాను' అనుకుంటున్నాడు. హనుమ నిశ్చేష్టుడుగానే నటిస్తున్నాడు. ఒక పెద్ద చెక్కశకటం తెచ్చి, దాని పై హనుమని నిలబెట్టి కట్టేసారు. ఆ బండిని లాక్కుంటూ, మేఘనాధునికి జయం పలుకుతూ, మహోత్సాహంగా లంకానగర వీధుల వెంట త్రిప్పుతూ, హనమను తిడుతూ, కొడుతూ, అవమానపరుస్తూ తీసుకువెడుతున్నారు. అన్నింటినీ అత్యంత సహనంతో ఓర్చుకుంటున్నాడు స్వామి ఆంజనేయుడు.

43. దశకంఠునికి హనుమంతుని హితోపదేశము

రాక్షసులు బండిని రాజవీధి గుండా ఈడ్చుకుంటూ పెద్దభవనం ముందు ఆపారు. శకటానికి కట్టిన త్రాళ్ళు మాత్రం తీసేసి హనుమను ఇంద్రజిత్తు వెనకే నడిపించుకుంటూ కొలువుకూటం మధ్యలో రాక్షస సార్వభౌముని ముందు నిలిపారు. అంతవరకూ కనులు మూసుకుని వున్న హనుమ తాను రావణుని ముందు నిలబడ్డానని క్రీగంట చూచి, నిద్ర నుండి మేల్కొన్న వానివలె అవులించి, ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నాడు. రక్కసిమూక కట్టిన త్రాళ్ళు, గొలుసులు తెగి క్రిందకు జారిపోయాయి.

రాజమహాలంతా మంత్రులతో, సేనాపతులతో, రాక్షసవీరులతో రక్షకభటుల కాపలాతో చీమ దూరలేనంత కట్టుదిట్టంగా వుంది. విశాలమైన మందిరంలో చక్కని శిల్పాలుగల ఎత్తైన స్థంభాలు, గోడలకు అలంకారాలు, రావణుని పరాక్రమం తెలిపే చిత్రకళాపటాలు, వెండి ఆసనాలు, నిలువెత్తు గవాక్షాలకు పసుపుపచ్చని పట్టుతెరలు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలిరంగు అద్దాలతో శోభాయమానంగా వుంది కొలువుకూటం. హనుమ ఎదురుగా వున్న బంగారు సింహాసనం మీద నల్లని దేహచ్ఛాయతో దివ్యాభరణభూషితుడైన దశకంఠుని సూటిగా చూస్తున్నాడు. అతడి శిరస్సుపై వజ్రవైఢూర్య గోమేధిక, పుష్యరాగాలు పొదిగిన ధగధగలాడే మకుటం; దానికి వ్రేలాడే ఆణిముత్యాలసరాలు, భుజకీర్తులు, మెడలో రత్నాలహారాలు, తెల్లని పట్టుపీతాంబరం, ఎఱ్ఱని ఉత్తరీయంతో మేరుగిరిమీద కారుమొయిలులా వున్నాడు. రక్తచందన లేపనం, లేపన మధ్యంలో విచిత్ర రేఖలు, అంబనాది సానువులవలె వక్షస్థలం, ఒక ప్రఖ్యాత శిల్పి తీర్చిన సజీవ విగ్రహంలా ఉన్నాడు రావణుడు. నుదుటిపై విభూతి రేఖలు, నడుమ కుంకుమ అతని శివభక్తిని చాటుతున్నాయి. ఐశ్వర్య సూచకాలైన ఎఱ్ఱ జీరలతో నేత్రద్వయం చిట్లించి హనుమ వంక చూస్తున్నాడు. తన పట్టమహిషి మండోదరి ముద్దుల చిన్న కుమారుడిని పొట్టనబెట్టుకున్నది ఈ వానరాధముడేనా? అని రావణుని మనస్సు ఒక్కసారి కలుక్కుమంది. హనుమ క్షణకాలం రెప్పవేయకుండా రావణుని వీక్షించి –

'అహెూ! ఏమి ఈ రావణుని వైభవం! ఏమి రూపం, ఏమి తేజస్సు, ఇతనికి ధర్మబుద్ధి, సత్ప్రవర్తన వుండి, పర స్త్రీ వ్యామోహమే లేకుండా వుంటే ఇంద్రుని మించిన వాడే! ముల్లోకాలు ఇతని పాదాక్రాంతమై వర్థిల్లేవాడు' అని అనుకుంటున్నాడు.

దీర్ఘ బాహువులతో బలిష్టమైన వక్షస్థలంతో పగడాల ముద్ద వంటి ఎఱ్ఱని మూతితో, సూర్యతేజంతో వెలుగొందుతున్న హనుమను చూచి, రావణునికి కూడా పుత్రవియోగ ఖేదం సన్నగిల్లి, సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. 'ఆనాడు నేను కైలాస పర్వతం వద్ద పరమశివుని ప్రత్యక్షం కోసం వేచి వున్నప్పుడు నేను చూచి పరిహసించిన నందీశ్వరునిలా వున్నాడు. మర్కటాలే వచ్చి పడతాయని శపించింది యితడేనా? లేక శివుడిని తన వాకిట నిలుపుకున్న బాణాసురుడా? అని తనలో తను వితర్కించుకుంటూ మంత్రి ప్రహస్తుని వైపు చూచాడు. తన కుమారుడు జంబుమాలిని హతమార్చినది ఈ వానరమేనని కోపంగా చూస్తున్న ప్రహస్తునికి రాజాజ్ఞ లభించడంతో–

"ఓ దుష్ట వానరుడా! ఎవరు నువ్వు? ఇంద్రుడు పంపేడా? లేక కుబేరుని బంటువా? ఎందుకు వచ్చావిక్కడికి? నిజం చెప్పు. అశోకవన విధ్వంసం, రాకుమారుల హత్య; ఎందుకు చేసావు? ఎవరి ప్రోద్భలంతో రాక్షసేశ్వరుని పై కయ్యానికి వచ్చావు?

సత్యం వచించు, దేవేంద్రుడా! వరుణుడా! కుబేరుడా!, యముడా! లేక విష్ణువే విజయవాంఛతో పంపించాడా? నిన్ను, నీ శక్తి, రణకౌశలం, తేజస్సు చూస్తుంటే కేవలం వానరం అని విశ్వసించలేకపోతున్నాము. శీఘ్రంగా సత్యం వచించి, రాక్షసేశ్వరుని శరణు వేడి ప్రాణాలు దక్కించుకో" అని గంభీరంగా హెచ్చరించిన ప్రహస్తుని వంక సూటిగా చూసాడు హనుమ. ప్రహస్తుడు ఆ దృక్కుల శరాల నుండి తలవంచుకుని తప్పించుకుంటూ ఉత్తరీయం సవరించుకుని కూర్చున్నాడు.

"మీ ఊహాలేవీ సరికావు. నేను జన్మతః వానరుణ్ణే. మీ లంకేశ్వరుని చూడాలనే కోరికతో వచ్చాను. రాజును చూచే అవకాశం కోసమే ఉద్యానవనాన్ని ధ్వంసం చేసాను. మీ అనుచరులు కయ్యానికి కాలు దువ్వితే ఆత్మరక్షణార్థం వారిని కడతేర్చక తప్పలేదు. బ్రహ్మపితామహుని అస్త్రానికి గౌరవసూచకంగా కట్టుబడ్డాను" అని అన్నాడు.

"ఇంతకీ నువ్వెవరవు?" అని సూటిగా ప్రశ్నించాడు ప్రహస్తుడు మళ్ళీ.

హనుమ రావణుని వంక నేరుగా చూస్తూ "లంకేశ్వరా రావణా! సూర్యుని వంటి తేజస్సు గలవాడు, చంద్రునిలా నయనానందకరంగా ప్రజలకు దర్శనమిచ్చేవాడు, కుబేరునిలా రాజులందరి మన్ననలు బడసినవాడు, అందానికి మన్మథుడు, బుద్ధిలో బృహస్పతి, ఎల్లప్పుడూ సత్యవాక్కునే పలికేవాడు, మధురమందస్మితవదనుడు, కరుణాంతరంగుడు, మహావీరుడు, దశరథతనయుడు అయిన శ్రీరామచంద్రుని దూతను నేను. మీకు సోదర తుల్యుడైన సుగ్రీవుడు నన్ను పంపగా వచ్చాను. మా వానరరాజు మీ యోగక్షేమాలు అడగమన్నాడు" అని అన్నాడు.

"అది సరే! నువ్వొచ్చిన పని చెప్పు" అంటూ కనులెఱ్ఱ చేసి హుంకరించాడు దశకంఠుడు.

"నేనొక రాజకార్యం నిర్వర్తించడానికి లంకకు వచ్చాను. ఓ రాక్షసేశ్వరా! రావణప్రభూ! నీ హితం కోరిచెబుతున్నాను విను." "అయోధ్యాపతి దశరథుని కుమారుడు శ్రీ రామచంద్రునికి విధి వశంచేత రాజ్యపట్టాభిషేకానికి బదులు వనవాసం చెయ్యవలసివచ్చింది. పితృవాక్యపాలన కోసం రామభద్రుడు తన భార్య సీతతో, అనుజుడు లక్ష్మణునితో వనవాసం చేస్తుంటే, రాక్షసులతో వైరం వచ్చింది. ఖరదూషణులను అమిత పరాక్రమవంతుడైన రాముడు తన నిశిత శరాలతో జనస్థానంలో కడతేర్చాడు. రామలక్ష్మణులు ఇంట లేని సమయం చూచి, ఎవరో జానకీదేవిని అపహరించారు. ఆమెకై అరణ్యమంతా తిరిగి వెదుకుతూ ఋష్యమూక పర్వతంపై దిక్కుతోచని స్థితిలో, రాజ్యభ్రష్టుడై భార్యావియోగం అనుభవిస్తున్న సుగ్రీవుడిని రామలక్ష్మణులు కలిసారు. పరస్పర దుఃఖ కారణాలు తెలుసుకుని, ఒకరికొకరు బాసటగా నిలుస్తూ సఖ్యం చేయసాగారు".

"లంకేశ్వరా! నువ్వు బాగా ఎరుగుదువు సుగ్రీవుని అన్న వాలిని. ఆ వానరవీరుని చేత భంగపడ్డావు కూడా, నిన్ను చిత్తు చేసిన ఆ వానరేశ్వరుని శ్రీరామచంద్రమూర్తి ఒక్క బాణంతోనే సంహరించాడయ్యా!" అని హనుమ సభామంటపం దద్దరిల్లేలా గర్జిస్తున్నాడు. దశకంఠుడు ఆ మాటకు నోరు తెరచి నిశ్చేష్టుడై, ఖిన్నుడై చూస్తూండిపోయాడు. అయన ఒళ్ళు గగుర్పొడిచి, రోమాలు నిక్కబొడిచి, ఒకసారి భయకంపితుడైనాడు. అంతలోనే సభామంటపం నలువైపులా కంగారుగా చూచి, నిగ్రహించుకున్నాడు. హనుమ అది గ్రహించి, మందహాసం చేసి మళ్ళీ చెపుతున్నాడు.

"సుగ్రీవునికి రాజ్యపట్టాభిషేకం చేసి అతని సహాయంతో రామచంద్రుడు సీతాన్వేషణ ప్రారంభించాడు. నేల నాలుగు చెరగులా నన్ను మించిన వానర వీరులు సీతాసాధ్వి కోసం అన్వేషిస్తున్నారు. దక్షిణ దిక్కుగా సముద్రలంఘనం చేసి వచ్చిన నాకు నీ అశోకవనంలో శోకతప్తహృదయంతో, సాధ్వీశిరోమణి సీత గోచరించింది. సీతాపహరణదుష్కార్యానికి బాధ్యుడవు నువ్వేనని తెలిసి కూడా నేను శాంతంగానే ఉపదేశిస్తున్నాను. నా ప్రభువు శ్రీరాముని మాటగా కూడా విన్నవిస్తున్నాను. ఇది అకార్యం. ధర్మవిరుద్ధం. ఇది నీ వంశనాశన హేతువు. నీ వంటి పండితుడు, ధర్మప్రభువు, పరాక్రమవంతుడు చేయగూడని నీచకార్యం చేసి, రఘువీరునితో వైరం తెచ్చుకున్నావు. పరాయి స్త్రీని కోరటం మహాపాపం. దుంపనాశనం చేస్తుంది నిన్ను ఆ ఒక్క తప్పిదము. శ్రీరామచంద్రమూర్తి ఒక్కరు మాత్రమే ధరించగల ఎఱ్ఱకలువలదండ సీతాసాధ్వి. ఆమెను ఇతరులు ధరించాలని చూస్తే, జ్వాలాతోరణమై దహించివేస్తుంది.

రావణా! నువ్వు తపస్సంపన్నుడవు, ధర్మపరుడవు, ఆ ధర్మఫలం ఇప్పటి వరకు నిన్ను సంరక్షిస్తున్నది. అయితే అధర్మం చేసావు. సీతాపహరణ అధర్మఫలం, ధర్మఫలంతో కలియదు. ధర్మం అధర్మాన్ని పోగొడుతుందే గాని, అధర్మం ధర్మాన్ని నశింపచేయజాలదు. నీ ధర్మఫలమంతా అంతరించిపోయింది. కనుక శీఘ్రమే అధర్మఫలం అనుభవించనున్నావు. ఈ తరుణంలో శ్రీరామపాద శరణాగతియే నీ తక్షణ కర్తవ్యం. నీతో సమబలులైన ఖరదూషణాదులు శ్రీరాముని చేతిలో నాశనమైయున్నారు. నిన్ను మించిన బలశాలి వాలి ఒక్క రామబాణంతోనే నేలకొరిగాడు. వివేకవంతుడివయితే నీ బలపరాక్రమాలు రాముని ముందు చాలవని ఈ రెంటివలన తెలుసుకోలేవా!

భూమ్యాది సకలలోకాలను, పంచమహాభూతాలను, బ్రహ్మసృష్టియైన స్థావరజంగమరాశిని, ప్రళయావసానంలో రుద్రుని ద్వారా లయింపచేయడానికి, మహాయశస్వి అయిన రామచంద్రుడు సమర్థుడు సుమా! దేవతలు, దైత్యులు, గంధర్వులు, విద్యాధరులు, ఉరగులు, యక్షులు, వీరెవ్వరూ రణక్షేత్రంలో రాముని

ఎదుట నిలువలేరు. స్వయంభువగు చతుర్ముఖబ్రహ్మ, పరమైశ్వర్యసంపన్నుడగు దేవేంద్రుడు, త్రిపురాసురసంహారియైన రుద్రుడు వీరెవ్వరూ రామచంద్రునికి విరోధియై నిన్ను కాపాడలేరు. కనుక మర్యాదగా సీతాసాధ్విని రామునికి అప్పగించి, ఆయన పాదాలపై పడి, శరణు వేడి ప్రాణాలు దక్కించుకో, సుందరమైన ఈ లంకారాజ్యం కలకాలం ఏలుకో!" అన్నాడు గంభీరంగా హనుమ.

మారుతి ప్రసంగం విన్న దశకంఠుడు తోక త్రొక్కిన త్రాచులా కస్సుమన్నాడు. కళ్ళు అగ్నిగోళాలైనాయి.

"ఈ వానరాధముడిని ముక్కలు ముక్కలుగా ఖండించండి" అని ఆజ్ఞాపించాడు రాక్షసేశ్వరుడు. వెంటనే విభీషణుడు లేచాడు. వలదన్నట్లు వారిస్తూ- "అన్నా! సత్పురుషులు దూతకు మరణదండన సూచించలేదు".

"మరేం చెప్పారు?"

"అంగవైరూప్యము, కొరడా దెబ్బలు, శిరోముండనము చేయించుట, కాల్చిన ముద్రలు వేయుట ఇవి ఏవైనా చేయవచ్చును.



44. అంతా దహనము

"................" రావణుడు ఆలోచనలో పడ్డాడు. 'వానరుని చంపించడంలో గుణవిశేషమేం లేదు. ఇతడు యోగ్యుడైనా అయోగ్యుడైనా ఇతరుల చేత పంపబడిన దూత మాత్రమే. అసలు శత్రువు సముద్రం అవతల వున్నాడు. ఇతడు అక్కడికి చేరితే గాని నా బలపరాక్రమాలు శత్రువులకు తెలిసిరావు'.

"ఐతే! కోతులకు తోక అలంకారం ఈ వానరవాలానికి నిప్పంటించి, లంకానగరమంతా త్రిప్పి, ప్రజలకు వినోదం కలిగించండి" అంటూ ఆజ్ఞాపించాడు రావణుడు. వెంటనే రాక్షసభటులు హనుమను దండశాలకు తీసుకొనిపోయారు. పాతబట్టలు గుట్టలుగా తెచ్చి, తోకకు చుట్టుతున్నారు. హనుమ తన వాలాన్ని మరింత పెంచేస్తున్నాడు. తోక పెరిగిన కొద్దీ గుడ్డలు అందరి ఇళ్ళల్లోంచి తెచ్చి చుడుతున్నారు. ఈ రకంగా లంకలోని అందరి ఇళ్ళల్లోని పాతబట్టలు సరిపోవడంలేదు. చివరకు విసుగెత్తి భాండాలతో ఆవిశెనూనె తెచ్చి, కుమ్మరించారు. తోకకు నిప్పంటించారు. అప్పటి వరకు ఏమి చేసినా సహించిన హనుమ; ఒక్కసారిగా తిరగబడ్డాడు. చుట్టూ ఉన్న రాక్షసుల మెడలు పట్టి విరిచేస్తున్నాడు. తీవ్రకోపంతో బాలభానునిలా ఎఱ్ఱబారినది మారుతి వదనం. తోకతో చుట్టూ ఉన్న రాక్షసుల్ని అంటించేసి, చావ మోదుతుంటే

వారి బట్టలు తగలబడుతుండగా హాహాకారాలు చేస్తూ, పరుగు లంఘించారు. మరికొందరు రాక్షసులు వచ్చి పట్టుకుంటున్నారు హనుమను. త్రాళ్ళతో హనుమని కట్టి లంకాపురి వీధుల్లో తప్పెటలు, తాళాలు వాయిస్తూ తిప్పుతూంటే నగరపరిశీలన కోసం తిరుగుతున్నాడు హనుమ. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, వృద్ధులు అంతా చూస్తుండగా "ఇదిగో! మన నగరానికి వచ్చిన దొంగ" అని అంటున్నారు భటులు. చింపిరిజుట్టు, చీమిడి ముక్కులతో కొందరు రాక్షస పిల్లకాయలు చిందులు వేస్తూ గేలి చేస్తూ కేరింతలు కొట్టి హనుమ వెనుక గుంపులుగా చేరి పరుగులెడుతున్నారు. దాదాపు నగరంలోని ప్రముఖసచివుల గృహాలన్నీ గమనించాడు హనుమ. 'ఈ లంకా నగర దుష్టులకు తగిన బుద్ధి చెప్పాలి' అనుకుంటున్నాడు. తోక చురచురా కాలుతుంటే మంట పుడుతున్నా సహిస్తున్నాడు.

అశోకవనంలోని సీత వద్దకు కొందరు రాక్షస స్త్రీలు వెళ్ళి, "నీతో మాట్లాడిన దొంగకోతిని రాక్షసవీరులు పట్టి బంధించి, తోకకు నిప్పు పెట్టి, నగరమంతా త్రిప్పుతున్నారు. అది మంటల్లో కాలుతోంది. దొంగకోతి చస్తుంది కాలి కాలి" అని ఎద్దేవా చేసారు. సీతామాతకు ఒక్కసారి ఉప్పెనలా దుఃఖం పెల్లుబికింది. కంటనీరు జలజలా రాలింది. ఆమె స్థిరంగా పద్మాసనం వేసుకుని, దృష్టిని భ్రూమధ్యంలో నిల్పి, అగ్నిదేవుని ధ్యానిస్తోంది.

"పావకా! నేను రామ సమాగమానికి పరితపిస్తున్న పతివ్రతనైతే, ధీమంతుడైన నా పతికి నా యందు దయుంటే, సత్యప్రతిజ్ఞ గల సుగ్రీవుడు నన్నీ ప్రమాదం నుండి తప్పించే ప్రయత్నంలో వుండటం సత్యమే అయితే హనుమంతుని బాధించకు;. ఆ చిరంజీవిని చల్లగా చూడు స్వామీ!" అని వేడుకుంది. అగ్నిదేవుడు ఆమె ప్రార్థనను ఆజ్ఞగా భావించి, వాయునందనుని తోకకు చల్లదనమిచ్చాడు. ఈ పరిణామానికి అతడు అచ్చెరువొందాడు; అగ్ని నా తండ్రికి ప్రియసఖుడు, నేను శ్రీరామకార్యం చేస్తున్నాను. పైగా సీతామాత అనుగ్రహం నాకు కల్గినది. అందువల్లనే తోక ప్రజ్వలిస్తున్నా, చందనం పూసినట్లు చల్లగా వుంది అని అనుకున్నాడు. మనస్సులోనే సీతారాములను, అగ్నిదేవుని, వాయువును స్మరించి, ధన్యవాదాలు తెల్పి ఒక్కసారిగా రివ్వున ఎగసి, ఒక పెద్ద భవనం మీద నిలిచాడు. దాని స్థంభాన్ని పెరికి గిరగిరా త్రిప్పి రక్కసుల మీదికి విసిరి భవనం ద్వారాలకు నిప్పంటించాడు యమకరవాలం లాంటి తన వాలంతో. భగ్గున భవనమంతా మంటలు రేగాయి. ప్రహస్త, మహాపార్శ్వ, వజ్రదంష్ట్ర, రశ్మికేతు, సూర్యశత్రు, హ్రస్వకరణ, హస్తిముఖ, కరాళ, కుంభకర్ణ, శోణితాక్ష, మకరాక్ష, ఇంద్రజిత్తుల మహాభవనాలన్నీ తగులబెట్టేస్తున్నాడు. లంకంతా కోలాహలం. మేడల్లోని దూలాలు, వస్తువులు అన్నీ మంటలు రేగి ఫెళఫెళా గోడలు విరిగిపడుతున్నాయి. పొగలేని ప్రజ్వలనం మేఘాలను ఎల్లబారుస్తోంది. సందులు, గొందులు, వీధులు చతుష్పధాల వెంట జనం

పరుగులు పెట్టి ప్రాణాలు దక్కించుకుంటున్నారు.

మహాకపిశ్రేష్ఠమారుతి గొప్పగొప్ప విలువైన సంపన్న గృహాలన్నీ కాల్చివేస్తూ, ఒక మేడపై దుమికాడు. అక్కడ శ్రావ్యంగా విష్ణు సహస్రనామం వినిపిస్తోంది. విష్ణుచిహ్నాలైన శంఖుచక్రాలు గల ద్వారాలు కనిపించాయి. అది విభీషణుని గృహం. నిప్పుముట్టించకుండా విడిచిపెట్టాడు! పిమ్మట సకల శుభలక్షణ శోభితమైనది రత్నాల దండలచే అలంకరించబడినది, మేరు పర్వతంలా ఎత్తైనది అయిన రావణుని ప్రధానభవనం విమానం మీదికి దూకి ప్రళయాగ్ని రగిల్చాడు. అగ్నికి వాయువుతోడై మంటలు మిన్నుముట్టాయి. భవనాల్లోని వెండి, బంగారు అభరణాలన్నీ కరిగి లోహాలు ద్రవంలా వీధుల వెంట ప్రవహిస్తుంటే దీర్ఘంగా నిట్టూర్చి, ఒళ్ళంతా అలసట వలన చిరు చెమటలు పట్టగా; మోదుగ పువ్వుల్లా, బూరుగపువ్వుల్లా కుంకుమలా ప్రకాశించే మంటల్ని చు స్తూ ఒక వృక్షాగ్రం పై నిలబడి ఇంత పని చేసింది తనేనా అనుకుంటూ విస్మయంగా చూస్తున్నాడు.

"అయ్యో తండ్రీ! అయ్యో కొడుకా! అయ్యో ప్రియుడా! నాథుడా! అయ్యో మిత్రుడా!" అంటూ బావురుమంటూ పురవాసులంతా ఒకరినొకరు వెతుక్కుంటూ పరుగులిడుతూ త్రొక్కిసలాటలు, పెడబొబ్బలు, సగం కాలుతున్న బట్టలతో అర్తనాదాలు చేస్తున్న రాక్షస జన సమూహంతో, రాచనగరు నరక ప్రాయంగా మారిపోయింది. త్రికూట పర్వతం పైకి చేరి జ్వాలాతోరణంలా వెలుగుతున్న తోకతో సూర్యునిలా శోభిల్లుతూ ఉపవిష్టుడయ్యాడు వాయునందనుడు. ఎఱ్ఱని మంటల్లో కాలుతూ, తెల్లని సౌధాలన్నీ నల్లబారుతుంటే సత్వగుణం క్షీణించిన మనిషి రజోగుణ ప్రభావం వల్ల కుపితుడై సర్వసుగుణాల్ని పోగొట్టుకుని చివరికి తమస్సులోకి జారి నల్లబారుతున్నట్లు గోచరిస్తోందాయనకు లంకా నగరం. రాక్షసుల చేత బంధితుడై తను పడ్డతిట్లు, తన్నులు, అవహేళనలు అన్నీ ఓర్చుకుని, చివరికీ పనిచేసి సంతృప్తస్వాంతుడై తోకను జలధిలో ముంచి, మంటలార్పుకుంటుంటే, ఆయన మనస్సులో "అయ్యో! సీతామాత!, లంకంతా మంటల్లో కాలిపోతోందే! ఆ పెనుమంటల్లో అమె చిక్కుకుని....... హాతోస్మి!" ఇంక ఊహించనైనా లేదు. రివ్వున నింగి కెగసాడు. మహాత్ములైన చారణులు నభోమండలంలో విహరిస్తూ ఇలా అనుకుంటున్నారు.

"అహో! ఏమి ఆశ్చర్యం! అంజనేయుడు రాక్షస గృహాల్లో భయంకరాగ్ని రగిల్చాడు. మేడలు, మిద్దెలు ప్రాకారాలు, అగడ్తలు అన్నీ అంటుకున్నాయి. కానీ, సీతాదేవి వసిస్తున్న అశోకవనం మాత్రం అగ్ని రగలక ఫలపుష్పభరితంగా ఉండటం వల్ల పక్షులు అక్కడికి చేరుకుంటున్నాయి. ఆమె క్షేమంగా ఉండటం ఆశ్చర్యం" – అని.

ఈ మాటలు ఆందోళనాచిత్తుడైన హనుమ మనస్సును చల్లబరిచాయి. "హమ్మయ్య! నేను అశోకవనం వైపు మంటలు రేపలేదు. అయినా ఒకసారి ఆమెను

చూసి రావాలి అనుకుంటూ ఆ దిశగా సాగాడు. శింశుపావృక్షం క్రింద సురక్షితంగా నిర్మలవదనంతో కూర్చున్న సాధ్విని చూచి ఆనందంతో ఉప్పొంగిపోతూ ఆమె ముందు చేతులు జోడించి. -

"తల్లీ! నమస్కారం, నా భాగ్యం వల్ల తమరు క్షేమంగా ఉండటం చూస్తున్నాను. ఇక నేను వెళ్ళివస్తాను"

ఆమె హనుమ సాహసకృత్యాలన్నీ విన్నది. కళ్ళారా చూస్తోంది. రామదూత చేసిన ఈ పనులన్నింటి వల్ల ఆమెకు నిర్వేదం తొలగి, తను త్వరలో ఈ చెఱ నుండి విముక్తురాలనవుతానని నమ్మకం కుదిరింది. హనుమను విస్మయంతో చూస్తూ -

"నీవోయి నిజమైన వీరుడవు! శత్రువీరులందర్నీ మట్టుబెట్టి లంకను నాశనం చేసి నన్ను రామచంద్రుని పదసన్నిధికి చేర్చగల శక్తిమంతుడవు నువ్వు. వెళ్లిరా నాయనా! నేను క్షేమంగా ఉన్నానని రామచంద్రునికి చెప్పు"

"అట్లే చెప్తాను మాతా ! సుగ్రీవుడు కోట్లాది వానరభల్లూకసైన్యాలతో రామలక్ష్మణులను వెంటబెట్టుకుని, శీఘ్రంగా ఇక్కడికి వస్తాడు. మేమంతా రావణుడ్ని, అతడి పరివారాన్ని నశింపచేస్తాము. రఘునందనుని పొందే భాగ్యం మీకు త్వరలోనే ఉంది. నిశ్చింతగా ఉండండి. మీకు మంగళమగు గాక!" అంటూ నింగికెగయసాగాడు, మారుతి. అరిష్టమనే సుందర పర్వతం మీద కాలూనాడు. కొన్ని క్షణాలలోనే శక్తి పుంజుకుని, మత్స్యమకరమహాతిమింగలాది జలచరాలతో కల్లోలితంగా ఉన్న భయంకరసముద్రాన్ని చూస్తున్నాడు. ఒక్కసారి తన రూపం మేఘమండలం వరకు పెంచి. ఊపిరి బిగపట్టి, పాదాలచే పర్వతశిఖరాన్ని తన్ని పైకి లేచాడు. ఉత్తరదిక్కుగా ఎగురుతున్నాడు. పద్మక వృక్షసముదాయముతో నల్లని రంగు పులుముకొన్నది, శిఖరాల నడుమ మేఘాలే ఉత్తరీయంగా వ్రేలాడుతున్నది, మంగళకరమైన సూర్యకిరణాలచే మేల్కొల్పబడుతున్నది. సెలయేళ్ళ గంభీర మ్రోతయే వేదగానంగా చేస్తున్నది, దేవదారు వృక్షాలు ఎత్తుగా పెరగటంచేత చేతులెత్తి తపస్సు చేసే ముని వలె శోభిల్లుతున్నది, శ్రేష్ఠ సర్పముల బుసలే ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా గలది, మద్ది, తాడి, అశ్వకర్ణ, వెదురు బాగా పెరిగిన రోమాలుగా ధరించినది, పూచిన తీగలే అలంకారములుగా ధరించినది అయిన అరిష్టపర్వతం హనుమ తాకిడికి చలిజ్వరం వచ్చిన ముదుసలిలా వణికింది. ఫలవృక్షాల నుండి పండ్లనేకం రాలి పడ్డాయి. అతడెక్కి లంఘించిన శిలలు ఫటేలున విరిగి వ్రక్కలైనాయి. పూసిన చెట్లు హనుమ తొడల వేగంచే పీడించబడి విరిగి సముద్రంలో పడుతుంటే శ్రీమంతుడు, వాయుపుత్రుడు, ఆకాశచారి, మహాత్ముడు అయిన మారుతి చంద్రుని గోళ్ళతో గీరుచున్నవానిలా, నక్షత్రమండలాన్ని చీల్చుకుంటూ ముందుకు సాగుతున్నాడు.





45. శ్రీరామ పరిష్వంగ సౌభాగ్యశాలి - హనుమ

దారిలో మైనాకం చంద్రుని కొరకు చకోరంలా నిరీక్షిస్తూంది. తన దక్షిణ హస్తంతో మైనాకశిఖరం మృదువుగా నిమిరి బాణంలా దూసుకుపోతున్నాడు హనుమ. మహేంద్ర పర్వతశిఖరం కనుపిస్తోంది. అవతలి ఒడ్డు సమీపిస్తోందని తెలిసి విజయగర్వంతో సింహనాదం చేస్తున్నాడు. అది విన్న వానరసమూహం "అదుగో వస్తున్నాడు హనుమ" "అది హనుమ కంఠమే".

"అదుగో నల్లమేఘాల నడుమ మెరుపులా దూసుకొస్తున్నాడు".

"వచ్చేసాడు" అంటూ ఎగిరిగంతులు వేస్తున్నారు కపులు. వారి ఆనందానికి అవధుల్లేవు. చూస్తుండగానే జాంబవంతుని ముందు వాలి ప్రణమిల్లి-

"చూసాను సీతామాతను" అన్నాడు. వానరులంతా పరమోత్సాహంతో గంతులు వేయసాగారు. ఒళ్ళంతా చెవులు చేసుకుని ఆసక్తిగా వింటున్నారు

జాంబవంతాదులు -

"సవిస్తరంగా తెలుపు మారుతి. ముందు నీ మిత్రుల చెంత కూర్చుని వారు తెచ్చిన ఫలాలారగించి, మార్గాయాసం తీర్చుకుని, ఆమెను ఎలా కలుసుకోగలిగావో, ఆమె ఎట్లున్నదో వివరించు" అన్నాడు అంగదుడు యువరాజ ఠీవితో -

"మార్గాయాసం లేదు ఆకలిదప్పులు లేవు. అంతా చెబుతాను అవధరించండి" అంటూనే వానరులు తెచ్చి యిచ్చిన ఫలాలు కాదన లేక స్వీకరించి పూలగుత్తులు చేతబట్టుకుని చెప్పసాగాడు హనుమ.

"మహేంద్రపర్వతం నుండి మీరంతా చూస్తుండగా ఎగిరిన నాకు మార్గమధ్యంలో మైనాకపర్వతం ఎదురై అతిథ్యం యిస్తానంది. నేను ఆ పర్వత రాజుకు తగిన సమాధానం చెప్పి వెడుతూంటే సర్పాలకు తల్లియైన సురసాదేవి అడ్డగించి నన్నే ఆహారంగా కోరింది. నేను ఆమె పెను నోట సూక్ష్మరూపుడనై ప్రవేశించి తృప్తిపరచి, బయలుదేరాను. కొంత దూరం పోయేసరికి నా నీడ పట్టి లాగే ఛాయాగ్రాహిణి ఎదురైంది. దాని పేరు సింహిక. పెద్దరూపం దాల్చి దాని గుండెను పెరికివైచి, యమసదనం పంపించేసాను. శోభాయమానము, సుసంపన్నము శత్రుదుర్భేద్యము అయిన లంక దక్షిణ తీరం చేరాను. నగర పాలిక లంకిణి నన్నడ్డగించగా పిడికిళ్ళతో పొడిచాను. అది నాకు ప్రవేశం

యిచ్చింది. రాత్రంతా లంకానగరం ప్రతి అంగుళం సూక్ష్మరూపుడనై గాలించినా సీతమ్మ జాడ తెలుసుకోలేకపోయాను. చివరికి ఇలా ప్రార్థించాను.



నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః ॥ అని -

నా ప్రార్థన అమ్మ విన్నది. ఆమె వున్న అశోకవనం కనిపించింది. అందులో ప్రవేశించాను. శింశుపావృక్షం క్రింద తామరరేకుల వంటి కన్నులు కలది, ఉపవాస దీక్షచే కృశించిన శరీరముగలది, ధూళిదూసరమైన శిరోజాలు ఒంటిజడగా దాల్చినది, హేమంతకమలం వలె కళతప్పిన నడియవ్వన లలనా మణి గోచరించింది. చుట్టూ రాక్షసస్త్రీలు ఆమెను పలు దుర్భాషలతో బాధిస్తున్నారు. ఇంతలో రావణుడు వచ్చాడు.

తనకు రాణి కమ్మని నెలరోజులు గడువు యిచ్చి వెళ్ళాడు. ఆమె శోకించింది. నేనామెను కలిసి రామచంద్రుని అంగుళీయకం యిచ్చాను. ఊరడిల్ల జేసాను. సీతాసాధ్వి యిదిగో చూడామణి యిచ్చింది తన గుర్తుగా. తరువాత రాక్షసులతో యుద్ధం చేసి రావణసుతుడు యింద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డాను. రావణుని సభామంటపానికి వెళ్ళి సీతను రామచంద్రమూర్తికి అర్పించి, శరణువేడమని బుద్ధి చెప్పాను;" అని ఆగాడు హనుమ.

"రాక్షసరాజు అంగీకరించాడా" ప్రశ్నించాడు ఆత్రంగా అంగదుడు.

"వినాశకాలే విపరీత బుద్ధిః" నా హితోపదేశం చెవిటి వాని ముందు శంఖం వూదినట్లు వ్యర్థమైంది".

"అయితే రణం తప్పదన్నమాట" అన్నాడు జాంబవంతుడు.

"ఔను! యుద్ధం అనివార్యం".

"వెంటనే తిరిగి వచ్చేశావన్నమాట"

"లేదు! ఆ దుష్ట రాక్షసులు నన్ను బంధించి నా తోకకు నిప్పంటించారు. అగ్నిదేవుడు సీతాసాధ్వి పాతివ్రత్యప్రభావం వల్ల నన్ను చల్లగా చూసాడు. ప్రజ్వలితవాలంతో లంకానగరమంతా తగులబెట్టి, సీతాసాధ్విని అశోకవనంలో మరోసారి క్షేమంగా వుండటం చూసి మరీ వచ్చాను".

"చూచిరమ్మంటే కాల్చి వచ్చావన్నమాట" అన్నాడు నవ్వుతూ జాంబవంతుడు.

"అంతా నీ శిక్షణ ఫలితం" అన్నాడు ప్రతిస్పందిస్తూ హనుమ. వింటున్న వానరులకు ఆంజనేయుని మాటలు అమృతతుల్యమైనాయి. కపులంతా కిలకిలా నవ్వుతున్నారు.

"సుగ్రీవ రాజాజ్ఞ నెరవేర్చి మా అందరికీ ప్రాణదానం చేసావు సంతోషం

హనుమా! ప్రజాపతి వర ప్రభావం కల మన మైందద్వివిదులు చాలు లంకను ధ్వంసం చెయ్యడానికి, కాదంటే నేనున్నాను. వారు వీరన నేల మనమంతా పోయి యిప్పుడే లంకలోని రాక్షసవీరులను తుదముట్టించి సీతాసాధ్విని తెచ్చి రామునకర్పిద్దాం" అన్నాడు అంగదుడు.

"రాజపుత్రా అంగదా! నువ్వు పల్కింది యదార్థమే. కానీ మనకు సీత జాడ తెలుసుకుని వచ్చు వరకే సుగ్రీవాజ్ఞ వుంది. అదీ గాక మానధనుడైన రామచంద్రుడు తన ప్రతిష్ఠను, వీరత్వాన్ని శత్రువుకు చూపించాలనే పట్టుదలతో వున్నాడు. వానరప్రభువు కూడా రావణుని పరాజితుని చేస్తానని ఆయనకు మాట యిచ్చాడు గదా! అందువల్ల మన ప్రయాణం యిప్పుడు కిష్కింధవైపు" అంటూ వివరించాడు జాంబవంతుడు. అందరూ హనుమకు, అంగదునికి జయం పలుకుతూ, కిష్కింధాభిముఖంగా ప్రయాణం చేస్తున్నారు.

గగనతలం నుండి కిష్కింధ హద్దులు చేరుతుండగా వివిధ ఫలపుష్ప శోభితము, మనోహరము అయిన మధువనం గోచరించింది. వానరులకు నోరూరింది. నిలువెత్తు గోనెసంచుల్లా వ్రేలాడే తేనెపట్లు వార్ని రసాస్వాదనం కొరకు రెచ్చగొడుతున్నాయి. యింకేముంది ఆ వనం యావత్తు ఆక్రమించి, దొరికిన ఫలం కొరుక్కుతినేస్తూ, కొమ్మ కొమ్మకూ దూకుతూ, తేనె పట్లను పిండి మధుపానం చేస్తూ పూలు నేలరాలుస్తూ కపులంతా మహానంద సంభరితంగా గంతులేస్తున్నారు. కొందరు మాత్రమే నిజాయితీగా పోయి యువరాజు అంగదుడ్ని అనుమతి అడగ్గా –

"సరే! మీ యిష్టం ఫలాలు తిని, యథేచ్ఛగా మధుపానం చేసి మార్గాయాసం తీర్చుకోండి" అన్నాడు. ఇంకేముంది వారి ఆనందానికి పట్టపగ్గాల్లేవు. కొన్ని కోతులు చెట్ల కొమ్మల మీద నుండి దుముకుతున్నాయి. మరికొన్ని వేగంగా పైకెగురుతున్నాయి. ఇంకొన్ని పాడుతుంటే కొన్ని కోతులు రాలురప్పలు చేతబట్టి వాయిద్యాలు వాయిస్తున్నాయి. ఒకరినొకరు తోసుకుంటున్నాయి. పింగళవర్ణం గల వానరులంతా తేనె ఎక్కువగా త్రావి విపరీత చేష్టలు చేస్తుంటే హనుమ, అంగదాదులొకచోట చేరి లంక విశేషాలు రావణ సైన్య శక్తి సామర్థ్యాలు చర్చిస్తూ కూర్చున్నారు.

యింతలో దదిముఖుడు అనుచరులతో వచ్చాడు. వనసంరక్షకుడాయనే. కొందరు వానరుల్ని వనం పాడుచెయ్యవద్దని బుజ్జగిస్తున్నాడు. వనరక్షకభట వానరులకు అంగదపరివారానికి జగడం ప్రారంభమైంది. దధిముఖుడు కొందర్ని కఠినోక్తులతో గదమాయిస్తున్నాడు. మరీ అల్లరి చేస్తున్న కుఱ్ఱ ఎఱ్ఱకోతుల్ని అరిచేత్తో చరిచి చెదరగొడుతున్నాడు. అంతా ఏకమై దదిముఖుడ్ని అతడి పరివారాన్ని గోళ్ళతో గీరుతున్నారు. పళ్ళు పటపటలాడించి కరుస్తున్నారు. కాళ్ళతో మోదేస్తున్నారు. పిడికిళ్ళతో కుమ్మేస్తున్నారు.

చివరకు దధిముఖుడు తన పరివారంతో పరుగులు తీస్తుంటే చెట్లెక్కి చప్పట్లు కొడుతూ, కిచకిచ నవ్వి, తోకలు ముద్దు పెట్టుకుంటూ పిల్ల కోతుల్ని ఎగరేసి ఆడుకుంటూ సకల భక్ష్య పదార్థాలను మిగలకుండా తినేసారు. తేనె పట్లన్నీ పిండి పిల్లలకు పట్టిస్తూ తాము కడుపుల నిండా తాగి మత్తులో తూలుతూ కేరింతలు కొడుతున్నారు.

దధిముఖుడు పరివారంతో రాచనగరు కేగి సుగ్రీవుని సముఖంలో "వానర రాజా! సుగ్రీవా! దక్షిణ దిక్కుగా వెళ్ళిన వానరులు తిరిగి వచ్చి, మధువనంలో విడిది చేసారు. ఫలపుష్పాలన్ని చిందరవందర చేస్తున్నారు. తేనెపట్లు ఒక్కటీ మిగలకుండా సేవించేసారు. అంతా మత్తులో తేలియాడుతూ అడ్డగించిన నన్ను తన్ని తగిలేసారు. ఋక్షరజుడు, వాలి కూడా సంరక్షించుకుంటూ వస్తున్న వనం పాడైంది. మరింత బలగాల్ని పంపి దేవర వారు వార్ని శిక్షించాలి" అంటూ నివేదించాడు. సుగ్రీవుని ప్రక్కనే రామానుజుడు కూర్చుని వున్నాడు. ఇద్దరూ నవ్వుకున్నారు. "వెంటనే వారందర్ని యిక్కడికి రమ్మన్నానని నా ఆజ్ఞగా చెప్పు" అన్నాడు సుగ్రీవరాజు. దదిముఖుడు "చిత్తం మహాప్రభూ!" అంటూ నిష్క్రమించాడు.

"లక్ష్మణా! అంగదజాంబవంతులు, హనుమ వుండగా వానరసేన యిలా ప్రవర్తించిందంటే అది నిశ్చయంగా విజయోత్సాహమే. బుద్ధిమంతుడు, పండితుడు, తేజస్వి, శక్తిశాలి అయిన హనుమ వల్లనే కార్యసాఫల్యం జరిగి వుంటుంది".

"ఔను! మా వదిన జాడ తెలిసివుంటుంది" సంతోషంతో నేత్రాలు విప్పారగా సౌమిత్రి అన్నాడు. సమీపంలో వున్న రామభద్రుని హృదయంలో అమృతం చిలికి నట్లయింది. ఆయన మనస్సులో తన అర్ధాంగ లక్ష్మి, సీత రూపం గీసుకుంటున్నాడు. సీత దర్శనమైందనే మాట కోసం మనస్సు తహతహలాడుతోంది. అయినా శాంతగంభీరంగా వున్నాడు. అడవిలో వున్నా అయోధ్యరాజతనయుని రాజదర్పం విడుస్తుందా, బోనులోవున్నా సింహాన్ని శౌర్యం విడుస్తుందా!!

ఇంతలో ఆకాశంలో ధూళి రేగింది. కపుల కలకలం వినబడసాగింది. రాముని గుండె క్షణక్షణం వేగం పుంజుకుంటోంది. ఒళ్ళంతా గగుర్పొడిచింది. రెప్పపాటులో వానర యూధపతులంతా హనుమ, అంగదాది వీరులను ముందుంచుకుని సుగ్రీవుని ముందు బారులు తీరి నిలబడ్డారు. ఘడియ ఆలస్యం చెయ్యకుండా హనుమ రాముని ముందుకు వచ్చి కేల్మోడ్చి -

"చూశాను సీతామాతను. క్షేమంగా వుంది అశోకవనంలో మీకై ఎదురుతెన్నులు చూస్తోంది'' అన్న హనుమ మాటలను విని రామలక్ష్మణ సుగ్రీవులు పులకితగాత్రులైనారు. సుగ్రీవుడు సంతోషంతో తను రాజునన్న విషయం మరిచి చిరుగంతువేసి తోక పెంచి దండలా శిరస్సు పై నుండి ధరించాడు. లక్ష్మణుడు

ఆనందబాష్పాలు రాలుస్తున్నాడు. ఇక రామచంద్రమూర్తి స్థితి మాటలకందని మహానందంలో వుంది. ఇంత శుభసూచకమైన మాట హనుమ నోట వినటంతో బీడు వారిన నేలపై తొలకరి జల్లు కురిసినట్లయింది. సీతాదేవి గురించి తెలుసుకోవాలనే ఉత్సాహంతో రాముడు -

"వాయుపుత్రా! నా అర్థాంగి ఎలా వుంది. నా మీద ఏ అభిప్రాయంతో వుంది. వివరించు నాయనా!"

"రామభద్రా! ప్రమదావనంలో వికృతాకారులైన రాక్షస స్త్రీల మధ్య వారి దుర్భాషలు మౌనంగా భరిస్తూ పదేపదే కంట తడి పెట్టుకుంటూ భీతహరిణేక్షణలా వుంది సీతాసాధ్వి! ఒంటిజడ కలదై, దీనవదనయై, రాబందుల నడుమ రాచిలుకవలె క్షణక్షణం భయంగా, నిరాహారంగా కృశిస్తూ ఘడియొక యుగంగా గడుపుతోంది. హేమంత పంకజంలా కాంతి విహీనంగా వుంది. తనకు రాణికమ్మని బెదిరిస్తూ మాసం రోజుల గడువు అనంతరం తనకు ఫలహారంగా వండి వడ్డించమన్న రావణుని పలుకులను, అతని ఐశ్వర్యాన్ని, సార్వభౌమత్వాన్ని గడ్డిపోచగా భావించి, తనను నీకు అర్పించుకుని శరణువేడమని సలహా యిచ్చింది అమ్మ!"

నన్ను నీ బంటుగా విశ్వసించడానికి ఇక్ష్వాకువంశ కీర్తన గానం చేసాను. ఆమెకు నా పై నమ్మకం కుదిరింది. రామసుగ్రీవుల మైత్రి గురించి వివరించి మీరిచ్చిన అంగుళీయకం సమర్పించాను. మహదానందం పొందింది. మీ క్షేమ సమాచారం అడిగి తెలుసుకుంది.

రామభద్రా! రాక్షసబాధలు పడలేక ఆమె తన శిరోజాలనే ఉరిత్రాడుగా మలచి మరణించబోయే తరుణంలో నేను వెళ్ళి నీ గుణగణ కీర్తనం చేయటం వల్ల ప్రాణత్యాగ ప్రయత్నం విరమించింది"

ఆ మాటలు విన్న రాముని హృదయం వేదనతో తల్లడిల్లింది.

"ఎంత పని జరిగింది? నువ్వు వెళ్ళకపోతే నా సీత నాకు శాశ్వతంగా దూరమై వుండేది హనుమా!" అన్నాడు దగ్గుత్తికతో. క్షణం ఆగి చెప్పసాగాడు హనుమ-

"ఎందరో రాక్షసులను చంపిన నా రాముడు నేనిక్కడ పరితపిస్తూ బాధలనుభవిస్తుంటే ఎందుకు రాలేదు? వీరుడైన లక్ష్మణుడు కూడా ఎందుకు ఉపేక్షిస్తున్నాడు? నేనేం తప్పుచేసాను? నాకేమీ తెలియదే అని వాపోయింది రామా!"

"మరి నువ్వు జానకీమాతకు యేం చెప్పావు?" ప్రశ్నించాడు సుగ్రీవుడు సౌమ్యంగా.

"వీరులైన రామలక్ష్మణులు వానరరాజు సుగ్రీవునితో సఖ్యం కట్టారు. మిమ్మల్ని అన్వేషించడం కోసం అన్ని దిక్కులకు కపివీరులు వెళ్ళారు. దక్షిణ దిక్కుగా వచ్చిన నన్ను

హనుమంతుడంటారు. నన్ను మించిన మహావీరులెందరో సేనలో వున్నారు. మేమంతా వచ్చి లంకను రావణ పరివార సహితంగా ధ్వంసం చేసి మిమ్మల్ని చెర విడిపిస్తామని ధైర్యం చెప్పాను"

"హనుమా! నా సీత యింకేమన్నది. ఆమెను గురించి యింకా చెప్పి నాకు ఊరట కల్గించు నాయనా!" ఆనందం, దుఃఖం మిశ్రితమైన ముఖకవళికలతో ఉత్కంఠతో ప్రశ్నించాడు రాముడు.

"ప్రభూ! మీరు సీతావియోగ విరహంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని, ఆమె వున్న ప్రదేశం తెలియక జాప్యమైందని తెల్పాను. "ఒక నెల వరకు ప్రాణాలు నిల్పుకొని వుంటాను అంతకు మించి నా వల్ల కాదు, ఈ రాక్షస వేధింపులు భరించలేను శీఘ్రంగా వచ్చి నన్ను చేపట్టండి అంటూ మీకు చెప్పమన్నది తల్లి. ఈ దాసుడామెను కలసినందుకు గుర్తుగా ప్రాణప్రదంగా భద్రపరుచుకుంటున్న ఈ చూడామణిని మీకిమ్మన్నది" అంటూ బొడ్డున దోపుకున్న ఆభరణాన్ని తీసి వినమ్రంగా వంగి నీలికలువలాంటి రాముని చేతనుంచాడు.

చూడామణిని రొమ్మునకద్దుకొని "లక్ష్మణా!" అని ఎలుగెత్తి ఏడ్వనారంభించాడు. లక్ష్మణుడు, సుగ్రీవుడు రాముని కిరువైపులా చేరారు.

"ఊరడిల్లు రామచంద్రా! మనం శీఘ్రంగా లంకకు చేరుకుని సాధ్విని చెరవిడిపిస్తాము. యిన్ని బాధలకు మీ దంపతుల్ని గురిచేసిన ఆ దశగ్రీవుని పదితలలు తెగి పడే రోజు సమీపించింది." అంటూ రోషంగా పలికాడు వానర రాజు.

"అన్నయ్యా! ఏడ్వకు వదినె పరిస్థితి తలుచుకుంటే నాకూ దుఃఖం పొంగుకొస్తోంది. అపారమైన ఈ కపిసేన సాయంతో లంకను సర్వనాశనం చేసి వదినెను తెచ్చుకుందాం" అంటూ రాముని భుజంపై చెయ్యి వేసి ఆయన అశ్రు నయనాల్ని ఉత్తరీయంతో వత్తి సముదాయిస్తున్నాడు సౌమిత్రి.

"ఇంకేమన్నది ఆంజనేయా! వివరంగా చెప్పు" అంటూ గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు రాముడు.

"రామచంద్ర ప్రభూ! మీరుభయులు ఏకాంతంగా వున్న తరుణంలో దేవేంద్ర కుమారుడు వాయస రూపంలో ఆమెను గాయపరచగా మీరు గడ్డిపోచనే బ్రహ్మాస్త్రంచేసి విడిచిన సంగతి; ఒకనాడు చిరుచెమటలతో ఆమె నుదుటి తిలకం చెరిగిపోగా మణిశిల ధాతువును ఆమెకు బొట్టుగా వుంచిన సంగతి మీకు గుర్తు చేయమన్నది. ప్రభూ! ఒక్క నెల మాత్రమే ప్రాణాలతో వుంటానని చెప్పింది మాత!" అని హనుమ బావురుమన్నాడు. అంత వరకు దుఃఖం నిగ్రహించుకుంటున్న రాముడు యింక వుండబట్టలేక వాయుపుత్రుడ్ని గాఢాలింగనం చేసుకున్నాడు. కపులంతా సీతమ్మతల్లి కష్టాలు విని పరితపించి అంతలోనే రోషం తెచ్చుకుని -

"మేమంతా యుద్ధానికి సన్నద్ధులమైవున్నాం రాజా! సుగ్రీవా! మీరు శీఘ్రమే సముద్రతరణం గురించి వ్యూహం పన్నండి" అంటూ విన్నవించారు.

"అవును స్వామీ! యిక మీరు తక్షణ కర్తవ్యం ఆలోచించాలి" అంటూ రామచంద్రుని కార్యోన్ముఖుడ్ని చేయనుద్యమించాడు హనుమ.

"ఎవరివల్లా సాధ్యంకాని శతయోజన విస్తీర్ణమైన సముద్రం దాటి, శత్రు దుర్భేద్యమైన లంకలో ప్రవేశించి నా ప్రేయసి క్షేమం తెలుసుకుని వచ్చినందుకు నీకేం ప్రత్యుపకారం చెయ్యగలను హనుమా!"

అని రామభద్రుడు ఆనంద పారవశ్యంతో హనుమను ప్రశంసిస్తూ భుజం తట్టాడు.

"ఎదుటి వ్యక్తికి కష్టం వస్తే కదా మనం ప్రత్యుపకారం చేసే అవకాశం వస్తుంది. కానీ హనుమా! నీ ఋణం తీర్చుకోవడాన్కి నీకు కష్టం రావాలని కోరుకోను నాయనా! మహాపండితుడవు, శౌర్యవంతుడవు, ఉత్తమమైన దూతకృత్యం నెరవేర్చినవాడవు అయిన నీకు పరిష్వంగమే కానుకగా యిస్తున్నాను" అంటూ మరోసారి హనుమను తన బాహువుల్లోకి తీసుకోగా హనుమ ఆనంద బాష్పాలు రాలుస్తూ ఒదిగిపోయాడు.

ఫలస్తుతి :-

మునులు, ఋషీశ్వరులు, మోక్షగాములు ఎవ్వరికీ లభ్యం కాని శ్రీరామపరిష్వంగం హనుమకు లభించింది. మహావిష్ణువు కౌగిట నిలిచే భాగ్యం ఒక్క మహాలక్ష్మిదే. శ్రీరామ పరిష్వంగం ఒక్క జానకీ మాతకే. అది పొందగలిగిన రెండవ భాగ్యశాలి శ్రీ ఆంజనేయస్వామి. ఆ స్వామి కటాక్షం మీకు కలుగుగాక!

46. సుందరకాండ వ్రత కథ

నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు పర్ణశాలలు నిర్మించుకొని వేదాలు వల్లె వేస్తూ శిష్యగణానికి వేదార్థాలను బోధిస్తున్నారు. సూర్యోదయంలో ప్రకృతి రమణీయంగా వుంది. ఆశ్రమ వాకిళ్ళలో ముని పత్నులు గోమయంతో నిండిన కళ్ళాపి జల్లి ముగ్గులు పెడుతున్నారు. వృక్షాల సందుల్లోంచి అరుణ కిరణాలు లేళ్ళ సముదాయాలపై పడి ఆ జింకలన్నీ హిరణ్మయ మృగాల్లాగే తళతళలాడుతున్నాయి. మెత్తటి దూది ముద్దలకు ప్రాణం వచ్చి గంతులు వేస్తున్నాయా అన్నట్లున్న తెల్లకుందేలు పచ్చిక బయళ్ళలో గెంతులేస్తూ మల్లె పొదల్లో దూరుతూ సంపెంగ చెట్లను కదులుస్తూ వాటి పరిమళాల్ని మరింత వాయు సంలీనం చేస్తూ విహరిస్తున్నాయి. జింక చర్మాలపై ఆసీనులైన శిష్యులు మహర్షులు చెప్పినవి వల్లె వేస్తున్నారు. నిత్యాగ్నిహోత్రాల పొగలు రాజిల్లుతున్నాయి. అవి మంచులో కలసి సూర్యరశ్మికి ఆకాశ మేఘాలు దిగివచ్చినట్లు వన పసిరికల మధ్య నీలిరంగులు పులుముతున్నాయి. మామిడి చెట్లు పూతపూసి

పిందెలు వేసి వసంత పురుషునికి స్వాగతం చెప్తున్నాయి. కీరసమూహాలు జామఫలాలు కొరుక్కుతింటూ అటు యిటూ ఎగురుతూ తమ ఎఱ్ఱ ముక్కుల సోయగాలకు గర్వపడుతున్నట్లు చూస్తున్నాయి. తెల్ల కొంగల బారులు నింగికెగసి సూర్యకాంతికి పసిమి వర్ణంతో మెరుస్తూ ముందుకు సాగుతున్నాయి. సెలయేళ్ళ నీళ్ళ గలగల వింటున్న నెమిళ్ళు క్రేంకారాలు చేస్తూ, నీలిమెడలు నిక్కించుకొని నాట్య భంగిమలతో నడుస్తూ మునిపల్లెకు మరింత అందాల్ని అద్దుతున్నాయి. పారిజాతాల ఘుమఘుమలు మందారాల ఎఱ్ఱదనం, చందన వృక్షాల సౌరభం, అన్నీ ప్రకృతి మాత మానవాళికి ప్రసాదించిన వరాలైతే; ఆర్ష సంప్రదాయం, వేదాలు దైవ ప్రసాదితం. వేదనాదాన్ని జీర్ణించుకున్న సూతమహర్షి కుడి చేతిలో కమండలం, కుడి చంకను మడిచిపెట్టిన కృష్ణాజినం, ఎడమచేతిలో దండం ధరించి మెల్లగా నడుస్తూ వస్తున్నారు. మునులు ఆయన ఆగమనాన్ని గమనించి ముందుకు వెళ్ళి స్వాగతం చెప్పి తీసుకువచ్చి ఉన్నతాసనంపై కూర్చుండచెట్టారు. కుశల ప్రశ్నలు ముగిశాయి.

"సూత మహామునీ! పుణ్యప్రదాలైన వ్రతానుష్ఠానం గురించి తమరు ఎన్నో సార్లు వినిపించారు. అనేక పుణ్యకథలు కూడా మీ వలన విని పార్వతీ పరమేశ్వరుల లీలలు తెలుసుకున్నాము. శ్రీమహావిష్ణువుని అవతార కథలు కూడా యెరింగించారు. యింకా ఏమైనా పుణ్య కథలు చెప్పండి" అని అడిగారు శౌనకాది మహర్షులు.

"మహర్షులారా! మీరే నాకన్న సకల శాస్త్ర వేత్తలు, తపస్వులు, మేధావులు అయివుండి నన్నిట్లు ప్రశ్నించడం నా అదృష్టం. అది మీరు నా యెడల చూపుతున్న అనుగ్రహంగా భావిస్తున్నాను. లోకసంచారం చేస్తూ నేను తెలుసుకొంటున్న సృష్టి వైచిత్రి విశేషాలు మీరెచటకు వెళ్ళకనే మీ తపోబలం వలన తెలుసుకోగల సమర్థులని నాకు తెలియును. అయినా మీ అందరి యందు నాకు గల గురుభావం చేత మీ ఆజ్ఞను శిరసావహించి చెపుతున్నాను. శ్రద్ధతో అవధరించండి. అని ఆగి మళ్ళీ చెప్ప నారంభించారాయన. "ఓ మునులారా నేను చెప్పబోవు వ్రతము సుందర కాండ పారాయణ రూపమైనది. ఆదికవి వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణసారమే సుందర కాండ. యిందు శ్రీరామకథ హనుమ చేత సాక్షాత్తూ సీతమ్మవారికి చెప్పబడింది. రావణలంకలోవున్న ఆమె దీనత్వాన్ని, ఆంజనేయస్వామి రామకథ చెప్పడం ద్వారా తొలగించాడు. ఆమెలో జీవితం పట్ల ఆశ, రామ సమాగమం తిరిగి పొందాలనే తలంపు, ధైర్యం మనోనిబ్బరం కలిగాయి. ఆమె రావణునిచే అనరాని మాటలు పడి, రాక్షస మూకలచే అనేక బాధలు పడింది. ఆమె కష్టాలు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో రామభద్రుడు వచ్చి రాక్షస సంహారం చేసి తిరిగి నిన్ను పరిగ్రహిస్తాడు సుమా! తల్లీ ధైర్యంగా వుండు. అని హనుమ జానకీమాతకు ప్రబోధిస్తాడు. లోకమాతకు

ఎదురైన కడగండ్లు సైతం రామకథాశ్రవణం వల్ల తొలగిపోవటం మనకు సుందరకాండలో ద్యోతకమవుతుంది. రాక్షస వనిత త్రిజట స్వప్నంలో రామచంద్రుడు వచ్చి సీతను తీసుకువెళ్ళినట్లు, రావణ కుంభకర్ణాది రాక్షసవీరులకు అశుభం జరుగనున్నట్లు భవిషత్తు గోచరిస్తుంది. ఆమె కూడా యితర రాక్షస స్త్రీగణాలను అదుపు చేసి సీత జోలికి పోవద్దని చెపుతుంది. అందువల్ల శుభప్రదమైన సుందరకాండ పారాయణం సర్వదేవతలకు మానవాళికి శుభాన్ని కలుగజేస్తుంది. ఈ కాండ పారాయణం సర్వాభీష్టాల్ని నెరవేరుస్తుంది. సర్వారిష్టాలను తొలగిస్తుంది. గృహస్థులు, బ్రహ్మచారులు కూడా సుందరకాండ పారాయణ వ్రత మాచరించి శీఘ్ర శుభఫలితాలను పొందవచ్చు. గృహస్థులకు సంసారపరమైన చిక్కులు తొలగి, సంతానం అభివృద్ధి చెందుతుంది. బ్రహ్మచారులకు వివాహం జరుగుతుంది.

"సూతమహర్షీ! వ్రత విధానం కూడా చెప్పండి" అన్నారు శౌనకాదులు.

"ఋషులారా! చైత్ర, వైశాఖ, కార్తీక, మాఘమాసములలోగాని; ఫాల్గుణ మాసంలోగాని, శుభతిధిని, శుభవారమును, శుభనక్షత్రమును, తారాచంద్రాబలము విచారించి పారాయణ వ్రతము ప్రారంభించాలి. ముందుగా విఘ్నేశ్వర పూజ, భరతలక్ష్మణశత్రుఘ్నాదులతో కూడిన శ్రీసీతారాములను ఆంజనేయస్వామి వారి విగ్రహము గాని చిత్రపటాలు గాని శాస్త్రసమ్మతంగా పూజించి, గురువు, వాచకునికి భోజనతాంబూలాది సత్కారములు, వస్త్రదానము చేసి స్వయంగా గాని యితరుల చేత గాని పారాయణము జరిపించవచ్చును.

"శ్రీరామదూతను ప్రార్థించి ప్రతిదినము సప్తసర్గపారాయణము చేయవచ్చు. వారమునకొకసారి లేదా పక్షమునకొక పర్యాయం, మాసమునకొకసారి, 40 దినములు, 25 దినములు వీలును బట్టి చేయవచ్చు. రోజుకు ఏడు సర్గలు సుందరకాండలో చదవడాన్నే సప్తసర్గ పారాయణం అంటారు. ఆపత్కాలంలో మాసాదితిథివార నక్షత్రనియమాలు లేకుండా కూడా సుందరకాండ పారాయణం చెయ్యవచ్చును. బహుశ్రేష్ఠమైన ఫలమునిచ్చును. ప్రతిమనుజుడు తనకు తానుగ ప్రతిదినము కొన్ని శ్లోకములు చొప్పున పారాయణ చేసి ఒకసారి మొత్తం పూర్తి అయినాక వ్రత ఉద్యాపనము చేయవలెను."

"వ్రత ఉద్యాపన విధానము శలవియ్యండి" అని శౌనకుడు ప్రశ్నించాడు.

"దైవాంశ సంభూతులైన మునిపుంగవులారా! ఈ సుందర కాండ వ్రతము గొప్ప మహాత్మ్యముగలది. మీ గృహమందు ఈశాన్య భాగమును శుభ్రపరచి రంగవల్లికలతో అలంకరించాలి: బంధుమిత్రులను ఆహ్వానించాలి. మామిడి తోరణాలతో పూజాస్థానాన్ని, ఇంటిని అలంకరించాలి. నూతన వస్త్రం క్రిందపరచి ఐదు కుంచముల బియ్యం అందు

పోసి చదును చేసి, దానిమధ్య అష్టదళపద్మం వ్రాసి, దానిమీద శ్రీసీతారామచంద్రులను ఆవాహన చెయ్యాలి. హనుమంతుని బంగారు, వెండి, రాగి లేదా యిత్తడి బొమ్మనుగాని, చిత్రపటాన్ని గాని వుంచి ఆవాహన చెయ్యాలి. అష్టదిక్పాలురను సైతం ఆవాహన చేసి పూజించాలి. షోడశోపచారములు చేసిన పిదప వాయునందనుని తదేక దృష్టితో దర్శిస్తూ మనోవాక్కయకర్మలనేకీకృతం చేసి యిలా ధ్యానించాలి.

"ఓ అంజనీపుత్రా! రామదూతా! వాయునందనా! నీకు నమస్కారము. జానకీ శోక వినాశకరా! సౌమిత్రీప్రాణదాతా! నీకు శత సహస్ర వందనములు! నా మనోభీష్టమును సిద్ధింపజేయుము. ఓ అంజనాగర్భసంభవా! లంకాప్రాణాపహారకా! అశోకవననాశకా! అక్షకుమారమృత్యురూపా! రావణగర్వాపహారీ! నీకు ప్రణామములు. నా యభీష్టమును నెఱవేరజేయి. ఓ సుగ్రీవసచివా! సమీరపుత్రా! సముద్రతరణశూరా! దుష్టరాక్షససంహారకా! నీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. నా హస్తములు జోడించి ప్రార్థిస్తున్నాను. నా కోరికలు నెరవేరజేయి. ఓ! ఆపన్నివారకా! స్వామి! నీ పాదపద్మములే మోక్షసాధకములుగా నీసన్నిధిని చేరిన నన్ను కరుణించు. రక్షించు దయానిధీ! నా యెడల నా కుటుంబము యెడల ప్రసన్నుడవై రక్షించుము". అని ప్రార్థించి పురుషులు సాష్టాంగ దండ ప్రణామము చెయ్యాలి.

ప్రార్థనానంతరం పారాయణ చేసిన ద్విజునికి భోజన వస్త్ర తాంబూలాదులిచ్చి సంతుష్టుని చేయాలి. ప్రతిమా సహితంగా పూజా మంటపాన్ని ఆయనకు దానం చేసి ఆశీస్సులు పొందాలి. ఈ విధంగా చేసిన కన్యకు వివాహమగును. విద్యార్థికి విద్య, ధనార్థికి ధనము, పుత్రార్థికి పుత్ర సంతానము కలుగుతుంది.

"సూత మహర్షీ! మీకీ వ్రత విధాన మెట్లు తెలిసినది? ఎవరెవరు దీని నాచరించి ఫలితం పొందారు?" అని ఒక శిష్యుడు ప్రశ్నించాడు.

"మునికుమారా! శివుని పూజించడానికి నేను కైలాసం వెళ్ళితిని. చాలాకాలం పార్వతీపరమేశ్వరుల సేవ చేసితిని. ఒక నాడు శంకరులు ఉమాదేవికి సుందరకాండ పారాయణ వ్రతము చెప్పగా నేనును వింటిని. భక్తి హీనులకు ఈ వ్రతము గురించి చెప్పరాదు. పూర్వం త్రిపురాసుర సంహారం చేయబోయేముందు ఆదిశంకరులే స్వయంగా ఈ వ్రతం చేసి జయం సాధించారు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు తనకు గల అపవాదును తొలగించుకొనడానికి శమంతక మణికై అరణ్యానికి వెళ్ళేముందు గణపతి వ్రతంతో పాటు సుందరకాండ పారాయణ వ్రతం కూడా చేసి కార్యసాధకులయ్యారు. వేదవ్యాస మహర్షి ధర్మరాజును ప్రోత్సహించి ఈ వ్రతం ఆచరింపజేసి కురుక్షేత్ర సంగ్రామంలో విజయం పొందించారు. పార్థుని రథకేతనం పై నిలిచిన వాయుపుత్రుడే పాండవులకు రక్షయై వారికి తిరిగి రాజ్యాధికారం లభింపజేసాడు.

ఈ వ్రత విధానం ఆలకించిన వారికి, పఠించిన వారికి హనుమత్కృపవలన అష్టైశ్వర్యాలు, సమస్త కార్యసిద్ధులు కలుగుతాయి. స్వస్తి", అని శౌనకాదులకు సూతుడుపదేశించి తిరిగి ప్రయాణం మయ్యారు.

వాయు పురాణంలో గల సుందరకాండ వ్రత కల్పము సంపూర్ణము.

సుందరకాండ సమాప్తము



యుద్ధకాండ సన్నివేశములు

47. గరుత్మంతుడు శ్రీరామచంద్రునికి ఏకాదశ రుద్ర మూర్తులను గురించి విన్నవించుట

రామలక్ష్మణులు మానవ రాజకుమారులైన ధర్మపరులు, రణపండితులై వుండి కూడా రణరంగంలో ఋజువర్తనమే వారి బలము. యుద్ధ విద్యలన్నింటితో పాటు మాయ, కపటం తెలిసినవారు దశకంఠ కుంభకర్ణ మేఘనాధప్రహస్తాది రాక్షసవీరులు. రామరావణయుద్ధం సజావుగా సాగనీయలేదు వారు. అధర్మబద్ధంగానైనా శత్రువును గెలవటమే వారి ఏకైకలక్ష్యము. అందువల్ల ఎన్నో కపటోపాయాలు; మాయా కల్పిత సీతారాముల వధ లాంటి వెన్నింటినో చేసారు. విద్యుజ్జిహ్వుడనే రాక్షసుడు మాయావి. రావణప్రభువు అతనిని యుద్ధానికి పంపగా రాముని మాయా రూపం సృష్టించి శిరస్సు ఖండించి దశకంఠునికిస్తాడు. ఆ మాయా రామ శిరస్సును, రామ ధనుస్సును అశోకవనంలో వున్న వైదేహి ముందుంచి రావణుడామెను భయకంపితురాలిని చేస్తాడు. విభీషణుని భార్య సరమ సీతకు అది రావణుని మాయ అని చెప్పి ఓదారుస్తుంది. సరమ ఆకాశ మార్గాన పయనించి రావణుని తల్లి కైకసి, వృద్ధమంత్రి అవిద్ధుడు మొదలైనవారు జానకిని విడువుమని చెప్పిన హితవు కూడా రహస్యంగా విని సీతకు

చెప్పి రామలక్ష్మణులు సజీవంగా వున్నట్లు చెప్పి ధైర్యం చెపుతుంది. రామరావణ యుద్ధం జోరుగా సాగుతోంది. రాక్షసవానర సేనల మధ్య దొమ్మి యుద్ధం జరిగి రక్తమాంసాలు, అస్థులచే కాల్వలుగా యేర్పడ్డ రణభూమి బురదగా వుంది. ఇరుపక్షాల మధ్య ద్వంద్వయుద్ధాలు ప్రారంభమయ్యాయి. వానరవీరులు సరియైన ప్రత్యర్థుల్ని ఎన్నుకొని తలపడుతున్నారు.

విభీషణుని మంత్రి సంపాతి రాక్షసకులం వాడే అయినా, రావణ సేననుండి వచ్చిన ప్రజంఘునితో తలపడ్డాడు. హనుమంతుడు జంబుమాలి అనే రాక్షసవీరునితో ఘోరమైన యుద్ధం చేస్తుండగా ఇంద్రజిత్తు వానరసేనను భీతావహం చేసి చీల్చి చెండాడుతున్నాడు. అంగదుడు గదతో వెళ్ళి ఇంద్రజిత్తు నెదుర్కొని బంగారు అలంకారాలున్న అతని రథాన్ని, రథసారథిని నేలమట్టం చేయసాగాడు. జంబుమాలి తన రథం మీద రణరంగమంతా స్వైర విహారం చేస్తూ శక్తిని ప్రయోగించి హనుమంతుని వక్షస్థలంపై పెనుగాయం చేసాడు. రక్తం వోడుతున్న హనుమ రథం ఎక్కి అతనిని అరచేతులతో చరిచి మృత్యువుకు బలియిచ్చాడు. అంగదుడు శత్రువైన ఇంద్రజిత్తును ఎలాగైనా చంపాలని ప్రయత్నిస్తుండగా అతను అదృశ్యం అయిపోయాడు. రామచంద్రుడు మేఘనాధుని వెదికి పట్టుకోవడానికి సుషేణుని యిద్దరికుమారులను, నీలుని, అంగదుని, శరభుని, వినతుని, జాంబవంతుని, సానుప్రస్థుని, ఋషభుని, ఋషభస్కంధుని పురమాయించగా వారు ఆకాశమంతా తిరిగి సంచరిస్తూ మేఘనాధునికై గాలిస్తున్నారు. అస్త్రప్రయోగ కుశలుడయిన మేఘనాధుడు అదృశ్యంగా వుంటూనే వారందరిని తన నిశిత శరాలచే తూట్లు కొడుతున్నాడు. వానరవీరులందరికి గాయాలై రక్తం వర్షంలా పడుతోంది. రామలక్ష్మణులు విల్లులు చేపట్టి వానరులకు తగులకుండా మేఘనాధుని కొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఎంత ప్రయత్నించినా అతని జాడ తెలియటం లేదు. అదృశ్యరూపంలో సంచరిస్తున్నా రామలక్ష్మణుల బాణాలు ఇంద్రజిత్తుకు తగులుతూనే వున్నాయి. తన శస్త్రాస్త్ర విద్యా ప్రావీణ్యతనంతా ఉపయోగించి, పళ్ళు పటపటాకొరుకుతూ రామలక్ష్మణులపై సర్వబాణాలు ప్రయోగిస్తున్నాడు.

"రాఘవులారా! కంకపక్షి రెక్కలు కట్టిన నా నిశిత శరాలచే మిమ్మల్ని యమపురికి పంపుతాను". అని అట్టహాసంగా నవ్వి వారి ఆయువు పట్లకు గురిపెట్టి కొడుతుండగా ఒళ్ళంతా చిల్లులు పడి మర్మస్థానాలపై బలంగా దిగబడి అలాగేవున్న బాణాలు బాధించగా రక్త సిక్త దేహాలతో నేలకొరిగారు దశరథనందనులు. వానర వీరులంతా తడిసిన రక్తపు బట్టలతో నేలకు దిగి, మూర్ఛిల్లిన రాజకుమారుల చుట్టూ చేరి విషణ్ణవదనాలతో దీనంగా చూస్తున్నారు. హనుమంతుడు అందర్నీ తొలగించుకుంటూ ముందుకు వచ్చి మోకాళ్ళ మీద ఆని కూర్చుని వారి వంటినున్న బాణాలు నెమ్మదిగా

పెకలించి లాగి ప్రక్కన పడవేసి దుఃఖిస్తున్నాడు. రామలక్ష్మణులు రక్త ప్రవాహంతో తడిసి నిట్టూరుస్తూ కన్నీరు విడుస్తున్నారు.

విభీషణుడు తాను కూడా మాయా రూపం ధరించి ఇంద్రజిత్తు ఒక చోట కూర్చున్నట్లు తెలుసుకున్నాడు. నాగాస్త్రబద్ధులైన రామలక్ష్మణులను చూసి వానర వీరులంతా ఖేదపడుతూ వారి చుట్టూ కూర్చుంటే రాక్షసులు స్వైర విహారం చేస్తూ కపిసేనను విరుచుకు తింటున్నారు. బానపొట్టలు, నల్లని బండరాళ్ళ వంటి శరీరాలు, గుడ్ల గూబ కనులు, బైటకు వచ్చి పెదిమల చివర పొడవుగా వున్న కోరలతో తలపై కొమ్ములతో అర్ధనగ్న శరీరాలతో, యినుపగదలు, శూలాలు, బల్లేలు తిప్పుకొంటూ కరాళ నృత్యం చేస్తున్నారు రావణసేన. ఇంద్రజిత్తు తిరిగి విజృంభించి భల్లూకపతి జాంబవంతుని వక్షంమీద ఒక్క బాణంతో కొట్టి మూర్ఛిల్ల జేసాడు. తొమ్మిది బాణాలతో నీలుని, మూడేసి బాణాలతో మైందద్వివిదులను,మూర్ఛపోయేదాకా కొట్టాడు. హనుమపై పది బాణాలతో కొట్టగా కాళ్ళూ చేతులు రక్తసిక్తమై పట్టుతప్పి చతికిల పడ్డాడు. గవాక్షుని, శరభుని కూడా కొట్టి, యింకా అనేక మంది వానర వీరుల్ని స్పృహతప్పే వరకు బాధించి రాక్షససేన జేజేలు పలుకగా ఈ శుభవార్తలన్ని తండ్రికి చెప్పడానికి ససేనుడై కోటలో ప్రవేశించాడు మేఘనాధుడు. రావణుడంతావిని జయం సాధించినట్లు, రామలక్ష్మణులు మృతి చెందినట్లు లంకల్లో ప్రకటించాడు. ఇంత దారుణం ఎలా సంభవించిందని సీతాసాధ్వి దుఃఖిస్తోంది. మేఘనాధుడు నిష్క్రమించగానే హనుమ పరిశుభ్ర నదీ జలాన్ని తీసుకుని నిష్ఠగా మంత్రించి సుగ్రీవుని, జాంబవంతుని రామలక్ష్మణుల ముఖాలపై చిలకరించి వారి నేత్రాలు తుడిచాడు.

ఇంతలో ఒక మహా ప్రభంజనం వంటి గాలివీచింది. లంకలోని సర్పాలన్నీ పడగలు ముడిచి ప్రాణభయంతో వణుకుతూ కలుగుల్లోకి దూరి దాక్కున్నాయి. జల జంతువులన్ని ఎవరో పెద్ద శత్రువు వస్తున్నట్లుగా సముద్ర ఉపరిభాగం వత్తిడి వల్ల గ్రహించి లోతుకు చొచ్చుకుపోతున్నాయి. జలాలన్నీ కల్లోలితమాయ్యాయి. కొండకు రెక్కలు వచ్చాయా అన్నంత పెద్ద ఆకారం గల మహా ఖగరాజు వచ్చి రణభూమిలో వాలాడు. మహాబలశాలి, వినతా తనయుడైన గరుత్మంతుడు రావటం చూసి; కద్రువకు పుట్టిన భయంకరమైన వాడి కోరలు, వాటినిండా తీవ్రమైన విషముగల పాములన్నీ రామలక్ష్మణుల శరీరాలను వదలి దూరంగా పారిపోయాయి. గరుడుడు మానవ రూపం ధరించి తన రెండు చేతులతో రామలక్ష్మణుల ముఖార విందాలను ప్రేమగా నిమిరాడు. వెంటనే వారిద్దరూ కళ్ళు నులుపుకుని నిద్ర నుండి మేల్కొన్నట్లు లేచి కూర్చున్నారు. వారి శరీరం పై గాయమున్న ప్రతి చోటా తన చేతులతో పక్షిరాజు స్పృశించగానే అవి నయమయ్యాయి. అన్నదమ్ములిద్దర్ని దగ్గరకు తీసుకొని కౌగలించుకున్నాడు వైనతేయుడు. హనుమ సుగ్రీవ జాంబవంతాదులను కూడా తన

దివ్య అమృత హస్తాలతో తాకి స్వస్థులను చేసాడు మహావిష్ణువు వాహనమైన గరుడుడు. అంతా ఆయనకు వినమ్రతతో నమస్కరించారు. శ్రీరామచంద్రుడు సూర్యప్రభలతో వెలుగుతున్న పక్షిరాజును చూచి -

"ఓ మహానుభావా! భయంకరమైన సర్పపాశ బంధాలు తొలగించి నన్ను, నా పరివారాన్ని కాపాడిన మీరెవరు? మీ దర్శన భాగ్యం వలన మేము పూర్ణ ఆరోగ్యవంతుల మైనాము. నా హృదయం ప్రసన్నమైంది. నా తండ్రి దశరథుని, తాత అజమహారాజును చూచినంత మహదానందం కలుగుతోంది" అన్నాడు.

పచ్చని మేని చ్ఛాయగలవాడు సువర్ణ కిరీటి, భుజకీర్తులు మొలను పొడవాటి కృపాణము, తెల్లని ఉత్తరీయము, ఎఱ్ఱని పట్టు పంచె, యజ్ఞోపవీతము ధరించిన వాడు అయిన గరుత్మంతుడు; విశాల నేత్రుడు, పూర్ణ పురుషుడు అయిన రామునికి ప్రణామములు చేసి -

"రామచంద్రా! నేను నీ సఖుడను. ప్రియుడను. వెలుపలి ప్రాణమన బడే అంతరంగిక స్నేహితుడ్ని. గరుత్మంతుడంటారు నన్ను. వైకుంఠనగరం నుండి మీకు సహాయం చెయ్యడానికే వచ్చాను. ఇంద్రజిత్తు తన మాయాబలం చేత మిమ్మల్ని పరమ క్రూరులైన కద్రువాతనయుల చేత మంత్ర బంధనం చేయించాడు. అసురులు సంగ్రామంలో మాయలు చేస్తారు. అది వారి నైజం. కాని పరిశుద్ధ మనస్కులైన మీకు ఋజువర్తనమే శ్రేయస్కరము. దశరథ తనయా! నువ్వు భగవంతుడైన శ్రీమన్నారాయణుడవు. నేను నీ వాహనమైన గరుత్మంతుడను. నీ వెన్నంటి వున్న లక్ష్మణుడే నీవు పవళించే ఆది శేషుడు. ఆదిలక్ష్మి రావణ సంహారం కోసం సీతాదేవిగా అవతరించింది. ఇక ఈ కపిశేఖరుల చరిత్ర చెపుతాను. వీరభద్రుడు సుగ్రీవునిగా అవతరించాడు. ఈ నలుడు శంభుడు. నీలుడు గిరీశుడు. ఈ వైద్యశిఖామణి సుషేణుడు మహాయశుడు. జాంబవంతుడు అజైకపాద్దేవత. అంగదుడు సహిర్బుధ్న్యుని అవతారం. దధివక్త్రుండు - పినాకధారి; తారుడు - అయుతా జిత్తు; తరలుడు - స్థాణుడు; మైందుడు - భర్గుడు. ఈ ఆంజనేయుడే సాక్షాత్తు రుద్రావతారుడు. ఈ పదకొండు మంది మహారుద్రులు నీకు సహాయం చేయటం కొరకు కపికులవీరులుగా అవతరించారు.

శ్రీరామదేవా! దేవదానవులు అమృతమధనం కొరకు సాగర మధనం చేసినపుడు నువ్వు కూర్మావతారం ఎత్తావు. ఆ సమయంలో మూడు లోకాలలోను లూతా విస్ఫోటకాదులు, అనేక రకముల వాత, పైత్య, కఫ రోగములు వ్యాపించాయి. భూమండలాన్ని పాలించే రాజులు, సర్వజన శ్రేయోభిలాషులైన ఋషులు బ్రహ్మదేవుని శరణుజొచ్చారు. త్రిదోష సంకలితాలైన తాపజ్వర, విషమజ్వర, సన్నిపాతజ్వరాది రోగాలు

విజృంభించి ఔషధములు; మంత్రములు కూడా నిష్ఫలములైనాయి. తరుణోపాయము చూపమని బ్రహ్మదేవుని సర్వజీవులు వేడుకోగా ఆయన ఈ ఏకాదశ రుద్రులను భూలోకంలో అవతరించ వలసినదిగా ప్రార్థించాడు. ఆయన కోరిక మేరకు వీరు వానర భల్లూక రూపాలు ఎత్తి పర్వతములు, గుహలు, గర్జిస్తూ క్రీడిస్తూ సంచారం చెయ్యటం వలన ఓషధులు తిరిగి శక్తిని సంతరించుకున్నాయి. దేవగణాలు కూడా ఈ మహాకపిసేనగా అవతరించి రాక్షసవధ కోసం నీకు తోడ్పడుతున్నారు." అని ఆగి మరల చెప్పనారంభించాడు పక్షిరాజు.

"రామభద్రా! వీరికి బ్రహ్మదేవులు వరం కూడా యిచ్చాడు. వీరందరిలో మృత సంజీవని ప్రభావం అంతర్లీనంగా వుంటుంది. అందువలన ఏకాదశరుద్రులకు ఎన్ని గాయాలైనా, రక్తస్రావం బాగా జరిగినా మృత్యువు మాత్రం వీరి దరి చేరలేదు. వీరిది మనోవేగము. యుద్ధంలో మిక్కిలి సాహసవంతులై పోరాడి నీకు జయం సిద్ధింపచేస్తారు. నరులెవరైనా చిత్రతోరణ పతాకాదులలో వీరి చిత్తరువులు, ప్రతిమలు ఏర్పాటు చేసుకుంటే విజయులవుతారు. వీరి రూపాలకు పూజచేసి అగ్నిలో హోమము చేస్తే ఏకాదశ రుద్రమూర్తులు ప్రసన్నులై సకల సంపత్తులు ప్రసాదిస్తారు. తిలపాయ సాజ్యముల చేత వీరిని యజించినవారు సర్వోత్కృష్టమైన పరమ పదమునే పొందెదరు. మహారుద్ర, వైశ్వానరీగాథ, మానసోక్తి, మనోజ్యోతిర్గాయత్రి మంత్రములలో దేని చేతనైనా వీరికి యజనము చేసి సత్ఫలితములు పొందవచ్చు." అని ఆగి మళ్ళీ చెపుతున్నాడు వైనతేయుడు.

"దాశరథీ! ఈ పదునొకండు రుద్రమూర్తులలో ఆంజనేయస్వామి భద్రనాయకుడు. హనుమన్మంత్రము చేత అభిమంత్రించిన విభూతి, ఉదకము, ఔషధము వీనిలో ఏది సేవించినా సమస్త గ్రహపీడలు, తస్కర వ్యాధి బాధలు శీఘ్రంగా ఉపశమిస్తాయి. ఈ యుద్ధంలో శత్రువుల వలన మీకు కలిగిన రుగ్మతలన్నీ తొలగిపోవును గాక!" అని అందరిని ముదముతో ఆలింగనం చేసుకుని వారిని ఉత్సాహవంతులను చేసాడు. రామలక్ష్మణులు స్వస్థులై విల్లంబులు ధరించటంతో జాంబవంత సుగ్రీవ అంగద నలనీల మైంద ద్వివిదులందరు తమ గదలు, పట్టిసములు, శూలములు ధరించి, "శ్రీరామచంద్రమూర్తికి జయము జయము" అని పలికి సింహనాదాలు చేస్తుండగా గరుత్మంతుడు శలవు తీసుకుని వైకుంఠనగరానికి ఎగిరి వెళుతున్నాడు.

48. రావణ హనుమంతుల సంఘర్షణ

యుద్ధం పునఃప్రారంభమైంది. ఆంజనేయుడు ధూమ్రాక్షుని, అకంపనుని సంహరిస్తాడు. దశకంఠుని మంత్రి ప్రహస్తుడు నీలుని చేతిలో మరణిస్తాడు. అంగదుడు మహా పరాక్రమం ప్రదర్శించి వజ్రదంష్ట్రుని చంపి పేగులు మెడలో వేసుకుని స్వైరవిహారం

చేస్తుంటే రాక్షసులు భీతిల్లి కోట వైపు పరుగులు పెడుతున్నారు. వానరులు వారిని వెంటాడి చంపుతున్నారు. రాక్షస వీరులనేకమంది యమసదనానికి యేగేరని తెలుసుకున్న దశకంఠుడు స్వయంగా రణరంగానికి బయలు దేరాడు. శ్రీరామచంద్రుడు ధనుర్బాణాలు తీసుకుని రావణుణ్ణి ఎదుర్కొడానికి వస్తుంటే; లక్ష్మణుడు ఎదురై –

"అగ్రజా! మన ప్రధానశత్రువు, పదితలలు గలవాడు, పరదారాపహరణం చేసిన దుష్టుడు అయిన దశకంఠుని దునుమాడటం నీకే సాధ్యపడుతుంది. అయినా నేనతనితో యుద్ధం చేసే ఒక అవకాశమియ్యి. యిటువంటి నీచుణ్ణి తొలిసారిగ నేనెదుర్కొంటాను" అన్నాడు సౌమిత్రి.

"అయితే వెళ్ళిరా! రావణుడు ఆశ్చర్యకరమైన పరాక్రమం గలవాడు. మాయాయుద్ధం చేస్తాడు. జాగ్రత్త, విజయోస్తు" అని ఆశీర్వదించి పంపాడు. అయితే అప్పటికే మార్గమధ్యంలో రావణుని నిలువరించి పోరాడుతున్నాడు, ఆంజనేయస్వామి. రాక్షసరాజు వేస్తున్న బాణాలకు లొంగ కుండా లాఘవంగా తప్పించుకుంటున్నాడు. లక్ష్మణుడు రావటం గమనించిన హనుమ రావణునికి యింకా దగ్గరగా వెళ్ళి తన కుడి చేతిని పైకెత్తి –

"రావణా! దేవ దానవ గంధర్వుల వలన, యక్షరాక్షసుల వలన నీకు మరణ భయంలేదు. నిజమే! కాని మా వానరవీరులం నిన్ను తుద ముట్టించగలము. ఇదిగో పిడికిలి బిగించిన నా కుడి చెయ్యి చూడు. చిరకాలంగా నీదేహంలో వున్న జీవుణ్ణి పారద్రోల గల శక్తి దీనికుంది కాసుకో!" అంటూ సింహనాదం చేసాడు. రావణునికి పౌరుషం వచ్చింది. ఒక్కసారి మీసం మెలివేసి గుడ్లురిమి హనుమ ముందు కురికి హుంకరించాడు.

"ఓ వానరా! రా ముందుకు..... శీఘ్రంగా నన్ను ప్రహరించు. నీ పరాక్రమం ఏ పాటిదో చూచాకే నిన్ను కడతేరుస్తాను. మరణించే ముందు రావణుడంతటి మహావీరుని కొట్టానన్న కీర్తి దక్కించుకుందువుగాని రా.....!" అని కవ్వించాడు. వానరులు రాక్షసులు దూరంగా తప్పుకుని యిద్దరు మహావీరులు తలపడుకుంటే వళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తున్నారు. రావణుడు, హనుమ మైదాన భూమిలో కాళ్ళు ఎడంగా పెట్టి పాదాలు నేలను యీడుస్తూ, దుమ్ము రేపుకుంటూ కొంత తడవు జబ్బలు చరుచుకుని సింహగర్జనలు చేసుకున్నారు. రణభూమి బహు ఉత్కంఠ భరితంగా వీరినే వీక్షిస్తోంది.

"ఆహా! దశగ్రీవా! నీ లంకకు వచ్చి, నీ ఉద్యానవనములు పాడుచేసి, నీ ముద్దుల అక్షకుమారుణ్ణి ఈ పిడికిలి పోట్లతోనే యమపురికి పంపిన సంగతి అప్పుడే మరిచావా! నీచ రావణా! కాసుకో" అని హనుమంతుడు ముష్టి ఘాతంతో కొట్టేలోపునే తన కుమారుని చంపినది యితడేనని ఉక్రోషం తెచ్చుకుని రత్నాలు పొదిగిన ఉంగరాలతో ఐదుతలల నాగరాజు వలె ప్రకాశించే తన అరచేతితో హనుమంతుని ఉరఃస్థలంపై

గట్టిగా చరిచాడు. ఆ దెబ్బకు ఒక్కసారి కపిరాజు చలించి పోయి, అతి కష్టం మీద నిగ్రహించుకుని రెండు కాళ్ళు ఎడం చేసి తమాయించుకున్నాడు. కళ్ళు చీకట్లుకమ్మాయి. వాయుదేవుని స్మరించుకుని క్షణంలో తత్తరపాటు నుండి తేరుకున్నాడు. తన అరచేతిని చాచి అదే రీతిలో రావణుని వక్షస్థలంపై మోదాడు. భూకంపానికి వణికిన కొండలాగ దశకంఠుడు కంపించి పోయాడు. ప్రక్కనే వున్న రథ చక్రానికి వీపు చేర్చి రెండు చేతులతో చక్రాన్ని పట్టుకుని మోకాళ్ళు వంచి నేలపై పడకుండా కాసుకున్నాడు. మకుటం జారి ప్రక్కకు పడగా సారథి వచ్చి తిరిగి ఆయన తలపై వుంచాడు. కొద్ది సేపటికి తేరుకుని -

"భళిరా! వానరడింభకా! నువ్వు శత్రువువైనా నీ పరాక్రమాన్ని శ్లాఘిస్తున్నాను" అన్నాడు.

"నా చేత కొట్టబడి యింకా ప్రాణాలతో వుండి మాట్లాడుతున్నావు. యింక నాదేమి పరాక్రమంలే రావణా! అడిగో నీకు సమవుజ్జీగా బాణవిద్య చూపగల లక్ష్మణుడు వచ్చాడు. అతనితో తలపడు" అన్నాడు మారుతి. విరోధిచే ప్రశంశించబడిన సాహసవీరుడు శ్రీ ఆంజనేయ స్వామివారు.



49. సంజీవ విజయుడు – హనుమంతుడు

లక్ష్మణస్వామి చాలా సేపటినుండి అతికాయునితో పోరాడుతున్నాడు. సౌమిత్రి ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. అతికాయుడు సూర్యాస్త్ర యోజితమైన వెలుగులు చిమ్మే బాణాలు వదిలాడు. పరస్పరం ఢీకొని మేఘమండలంలో కొంపలు తగులబడినట్లు బడబాగ్నులు ప్రేలుళ్ళు చేసి నేలమీద కూడా యిరుసేనల్ని కొంత భాగం విధ్వంసం చేసాయి. రాక్షస వీరుడు ఐషీకాస్త్రం సంధించి వదలగా సౌమిత్రి ఐంద్రాస్త్రం మంత్రించి దాన్ని ఛేదించాడు. అసురుడు యామ్యాస్త్రాన్ని, రాకుమారుడు వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించారు. ఆ రెండు ఆకాశంలో పిడుగుపాటు శబ్దాలు చేసి నేలరాలాయి. వాయుదేవుడు అదృశ్యరూపుడై లక్ష్మణుని వద్దకు వచ్చి రహస్యంగా చెవిదగ్గర యిలా చెప్పాడు.

"లక్ష్మణా! ఇతడు బ్రహ్మవరం పొందాడు. ఏ అస్త్రం వలన ఛేదించ లేని కవచం

ధరించాడు. బ్రహ్మాస్త్రమే ప్రయోగించు. జయమస్తు" అని బోధించగానే; సౌమిత్రి చిత్రములైన పింజలు కట్టిన బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి, శక్తి కొలది లాగి వదిలాడు. రాక్షసుడు అనేక బాణాలు వేసి దానిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నా అస్త్రం గరుడ వేగంతో వెళ్ళి కిరీటంతో శోభిల్లుతున్న అతని శిరస్సు త్రుంచి కనుచూపు మేరలో దూరంగా విసిరేసింది. వానరులంతా "లక్ష్మణునికి జయము జయము" "శ్రీరామచంద్రునికి జయము జయము" అంటూ గంతులు వేస్తుండగా రాక్షసులు కొందరు వెళ్ళి ఈ వార్త రావణునికి తెలిపారు. ఆయన మహాదుఃఖంలో మునిగిపోయాడు. అశ్రువులు రాలుస్తూ ఏకాంత మందిరంలో ఒంటరిగా తన పర్యంకం మీద శయనించి తలదిండు తడిపేస్తున్నాడు. తను తలపెట్టిన మారణహోమంలో ధూమ్రాక్షుడు; అకంపనుడు, ప్రహస్తుడు; ప్రియసోదరుడు మహాబలసంపన్నుడు తనతో సమంగా పుట్టి, సమానంగా తపస్సు చేసి బ్రహ్మ వరాలు పొందిన కుంభకర్ణుడు బలైపోగా వారిని తలచుకుని వారు తనతో గడిపిన మధురక్షణాలు తలచుకుని కుమిలిపోతున్నాడు. రాజు ఏకాంత మందిరంలోనికి ఎవరినీ అనుమతించడం లేదని తెలిసి తానే స్వయంగా బయలుదేరాడు మేఘనాధుడు. శిపాయిలు శిరస్సు వంచి నమస్కారం చేసి త్రోవ చూపారు. కనులు మూసుకుని వేదన పడుతున్న తండ్రి ప్రక్కగా వెళ్ళి కూర్చుని ప్రేమగా ఆయన చెయ్యి పట్టుకున్నాడు. కుమారుడు రావటం చూచి నెమ్మదిగా లేచి ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు రావణచక్రవర్తి.

"పితృదేవా! తమరు బాధపడకండి. నేను జీవించి వుండగా మీకు పరాజయం సంభవించనిస్తానా? ఊరడిల్లండి. నేను వేసిన నాగాస్త్ర బంధనాలు గరుడుని వలన తొలగిపోయాయి. అయినా మించిపోయినది లేదు. నా మాయా యుద్ధం చేత శత్రువులను ముప్పుతిప్పలు పెడతాను. మీకు విజయం చేకూర్చి పెడతాను. మీరు అపహరించిన సీతను అప్పగించే ప్రశక్తే రానివ్వను. మీ పంతం నెగ్గించి మిమ్మల్ని సంతృప్తి పరచటం కుమారునిగా నా విధి, ఆశీర్వదించండి" అంటూ పాదాభివందనం చేసాడు మేఘనాధుడు. అతని మాటలకు ధైర్యం తెచ్చుకుని శాంత చిత్తుడై - "కుమారా! నీవంతటి శక్తిశాలివే. వెళ్ళి రామలక్ష్మణులను కడతేర్చి నీ పినతండ్రికి, తమ్ములకు, మన మంత్రులకు ఆత్మశాంతిని కలిగించు. మృతులైన రాక్షస వీరులందరికి నరవానరరక్తతర్పణం యిచ్చి విజయుడవై తిరిగి రావాలి" అని అతని తలపై లాలనగా నిమిరి రణానికి పంపించాడు ఇంద్రజిత్తుని. మేఘనాధుడు శ్రేష్ఠమైన గాడిదలు కట్టిన రథాన్ని ఎక్కివచ్చి సమర శంఖం పూరిస్తుంటే, రాక్షస సేన బారులుతీరి భేరులు మ్రోగించి వానరులపై విరుచుకు పడింది. పోరాటం జోరుగా సాగుతోంది. ఇంద్రజిత్తు నాయకత్వంలో రాక్షసులు తోమరములు, పుచ్చుకుని వానరులను ఖండఖండాలుగా నరుకుతూ హతమారుస్తున్నారు. వానరులు చెట్లు బండరాళ్ళు, గిరిశిఖరాలు పెకలించి

వైరులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. అయినా రాక్షసులదే పై చేయిగా పోరు సాగుతోంది. అగ్ని శిఖలు మళ్ళీ ప్రయోగిస్తూ ఇంద్రజిత్తు కపుల్ని భీతావహుల్ని చేస్తున్నాడు. వానరులు చెదిరి నలుమూలలా పారిపోతున్నారు. పద్దెనిమిది బాణాలతో గంధమాదనుణ్ణి, తొమ్మిది బాణాలతో నలుని కొట్టి మూర్ఛిల్లచేసాడు. వానర వీరులు ఒకరి తరువాత ఒకరు అతన్ని ఎదుర్కొంటున్నా మేటి విలుకాడు మేఘనాధుని ముందు నిలువ లేక పోతున్నారు.

పది బాణాల చేత జాంబవంతుణ్ణి, ముప్పది బాణాల చేత నీలుని పడగొట్టేశాడు. తరువాత సుగ్రీవ, ఋషభ, అంగద, ద్వివిదాది వీరులంతా అతని శరాఘాతాలకు వళ్ళు తెలియని స్థితిలో నేలపై పడి మూలుగుతున్నారు. రామలక్ష్మణులు వీరి వెనుక నుండి బాణాలతో ఇంద్రజిత్తును, యితర రాక్షసుల్ని కొడుతూనే వున్నారు. అయినా బ్రహ్మయిచ్చిన వరాల కారణంగా ఇంద్రజిత్తు మేఘాల చాటున దాక్కుంటూ రణం చేస్తూ శత్రువుల్ని బాధిస్తున్నాడు. రామభద్రుడు పరిస్థితిగమనిస్తూ -

"లక్ష్మణా! భగవంతుడైన బ్రహ్మ యిచ్చిన వరప్రభావం చేత యితడిలా మనల్ని బాధించగలుగుతున్నాడు. ప్రస్తుతానికి బాణ పాతాన్ని ఓర్పుతో సహించు. ఒడుపుగా తప్పించుకో....." అని అంటుండగానే వారి వళ్ళంతా బాణాలు దూసుకుపోతున్నాయి. ఆపాదమస్తకం గాయాలై రక్తం చిమ్ముతోంది. యుద్ధరన్నదమ్ములు స్పృహకోల్పోయి కిందపడిపోయారు. రాక్షసయువరాజు బ్రహ్మాస్త్రం ప్రయోగించి మిగిలిన వానర సేన నంతటిని మూర్ఛిల్లచేసాడు. కొందరు ప్రాణాలే విడిచారు. కొందరికి కాళ్ళు, కొందరికి చేతులు, కొందరికి తలలు తెగి కపులంతా హాహాకారాలు చేస్తూ నేలతల్లి వడిలో పడిపోయారు. రణరంగమంతా తెగిన వేళ్ళు రాలిపడిన కళ్ళు, విసరి దూరంగా పడిన దంతపుటెముకలు, మాంసపుముద్దలతో ఏరులై పారుతున్న వానర రక్తంతో దుర్గంధం వ్యాపించి మహా భయంకరంగా వుంది రణభూమి. రాక్షసులంతా గదలు పైకెత్తి, ఖడ్గాలు తిప్పినృత్యం చేస్తూ, వానరుల కాలుచేతులు తిని రక్తం తాగుతూ మేఘనాధుని చుట్టూ చేరి అతనికి జయం పలుకుతూ అంతాకలిసి కోటలోనికి వెళ్ళిపోయారు. సూర్యాస్తమయం అయింది. సూర్యవంశపు రాకుమారులు దిక్కులేని స్థితిలో నేలపై పడివున్నారు. కపిసేనంతా కొన ప్రాణాలతో మూలుగుతూ పడిపోయారు. ధర్మంపై అధర్మం విజయం సాధించిందా యీపరిస్థితిని ఎలా ఎదుర్కోవటం అనుకుంటూ విష్ణు భక్తుడైన విభీషణుడు మండుచున్న కొరవి చేతబట్టుకొని ఎవరెక్కడ వున్నారో గాలిస్తూ మోకాళ్ళ లోతు రక్త మాంసపు బురదను తొక్కుకుంటూ ముందుకొస్తున్నాడు. విభీషణుడు కూడా రావణపరివారం నుండి వచ్చి, రాముని శరణు వేడినవాడు కాబట్టి మేఘనాధుని మాయలనుండి తప్పించుకోవడం ఆయనకు సాధ్యపడింది. కాని రామలక్ష్మణులనైనా తప్పించడం వీలు

పడింది కాదే అని చింతిస్తూ ఒక్కొక్కవానర శవాన్నే దాటుకుంటూ బ్రతికున్న వారికి ధైర్యం చెపుతూ వస్తున్నాడు. దూరంగా ఎవరో సన్నగా మూలుగుతూ కాళ్ళూ చేతులు కదల్చటం గమనించ అటు వెళ్ళాడు. కొరివి, ముఖం దగ్గరగా పెట్టి చూచి –

"హనుమంతా! నువ్వేనా" అని పలకరించాడు. ఆ! నేనే విభీషణా! బ్రహ్మాస్త్రం ప్రయోగించటం వలన క్షణంసేపు ఆ అస్త్రాన్ని గౌరవించాను. కొద్దిగా గాయాలైనాయి. అయినా ఫరవాలేదు.

"ఆ మూలిగేది ఎవరూ! ప్రక్కనున్న మరొక భటుడా" అన్నాడు విభీషణుడు. హనుమకు చెయ్యి అందించాడు. ఆయన లేచి వంటికి పట్టిన బురద దులుపుకుని ప్రక్కనున్న నీటివసతి వద్ద శుభ్రంగా కడుక్కున్నాడు. మరొక కాగడా తీసి దానిని వెలిగించి యిద్దరూ బయలుదేరారు.

"ఇక పద రాక్షసేంద్రా! మనం అందర్ని వెతుకుదామా" అని ముందుకు సాగాడు హనుమంతుడు.

ఇద్దరూ కలిసి యుద్ధభూమి అంతా తిరిగి కొందరు వానర యోధులకు సహాయం చేసి పైకి లేపారు. అంతా కలిసిదండుగా తిరుగుతున్నారు. సుగ్రీవుడు, అంగదుడు, నీలుడు, శరభుడు, గంధమాదనుడు, గవాక్షుడు, వైద్యశిఖామణి సుషేణుడు, వేగదర్శి, మైందుడు, ద్వివిదుడు, పనసుడు, నలుడు, జ్యోతిముఖుడు మొదలైన మహాకపి వీరులే యింకా మూలుగుతూ మూర్ఛనుండి తేరుకోలేక పోతున్నారు. వైద్యుడు సుషేణుడు మాత్రం మెలుకువగా వున్నాడు. అందరిగాయాలకు తగిన చికిత్స చేయగల సామగ్రి ఎలాగ సంపాదించటం అని ఆలోచిస్తున్నాడు. విభీషణుడు, హనుమ యింకా ముందుకు వస్తున్నారు. వయోవృద్ధుడు, మహాశూరుడు, భల్లూకపతి అయిన జాంబవంతుని కోసం వెతుకుతున్నారు. కుడివైపు మూలుగు వినపడితే అటు పరిశీలించి చూస్తున్నారు. గాఢాంధకారం నల్లని శరీరం, రోమానికో బాణం గుచ్చుకుని పడివున్నాడు రక్తపుటేరులో జాంబవంతుడు. కాగడాలు బాగా దగ్గరపెట్టి చూచారు ఆయనే అని నిర్ధారించుకుని.

"అయ్యో! నువ్వేనా జాంబవంతా! అందరిజాడ తెలిసింది. నువ్వు; రామలక్ష్మణులు కనపడక వెతుకుతున్నాం ఎలావుంది" అని భుజం మీద చెయ్యివేసాడు రాక్షసవీరుడు విభీషణుడు.

"అబ్బా! ఎవరది" అని అతి కష్టం మీద ఓపిక తెచ్చుకుని – "ఎవరది తాకకండి ప్రాణాలు పోతున్నంత బాధ, నీరసం" అన్నాడు జాంబవంతుడు. విభీషణునికి జాలివేసింది. వామనావతారంలో ఒక పాదంతో భూమిని, ఒక పాదంతో ఆకాశాన్ని అక్రమించిన మహాకాయం గల శ్రీమహావిష్ణువుకు ప్రదక్షిణ చేసిన మహావేగగామి, వ్యోమగామి, శూరుడు అయిన జాంబవంతుడా ఈ స్థితిలో వున్నది. కాల ప్రభావం

చివరికి ఈ కుష్ఠు రాక్షసుడు ఇంద్రజిత్తు చేత యిన్ని దెబ్బలు తిని పడిపోయాడా! అనుకుని -

"నేను విభీషణుణ్ణి ఎలా వుంది" అన్నాడు. "ఫరవాలేదు. ఈ బాణాలు తీస్తే నెమ్మదిల్లుతుంది. నీ కంఠస్వరం గుర్తించి నువ్వే అనుకున్నాను." "అవును నేనే జాంబవంతా"

"విభీషణా! హనుమంతుడు బతికేవున్నాడా?" అని ప్రశ్నించాడు జాంబవంతుడు.

"ఆ..... యిడిగో నాతో పాటేవున్నాడు. వస్తున్నాడు. అని "ఆంజనేయా! యిడిగో జాంబవంతుడు పిలుస్తున్నాడు యిలా రా" అని అరవగానే హనుమ వానర కళేబరాలు దాటుకుంటూ మోకాళ్ళ వరకు రక్తం చిందగా వడివడిగా వచ్చాడు.

"జాంబవంతా! నేను హనుమను వచ్చాను. మహావీరా! నువ్వేనా యిలా పడివున్నది".

"నేనే నాయనా! విధి వైపరీత్యం" అంటూ హనుమ అరచేతిని తన రెండు చేతులతో పట్టుకున్నాడు. హనుమ మోకాళ్ళ మీద కూర్చుని కొన్ని బాణాలు పెకలించి లాగి పారవేసాడు. చీకట్లో రక్త స్రావం చల్లగా చేతికి తగులుతోంది. విభీషణుని వద్దనున్న ఆనపబుర్రలో నీరు తీసి ముఖం కడిగి కొంచెం నీటిని త్రాగించాడు. నెమ్మదిగా కూర్చోగలిగాడు భల్లూకపతి. రెండు చేతులతో హనుమ భుజం ఆసరాగా పట్టుకుని లేచి కూచుని తెప్పరిల్లాడు.

"భల్లూక వీరా! మిమ్మల్ని ఒకటి అడుగుతాను చెప్తారా!" అన్నాడు విభీషణుడు.

"అడుగు నాయనా! దానికేముంది. మీరిద్దరూ వచ్చి, నన్నీ సంకటస్థితి నుండి తప్పించారు."

"వానరరాజు సుగ్రీవుడు, యువరాజు అంగదుడు వీరిని వదలి హనుమను గురించే ఎందుకడిగారు. నారాయణ స్వరూపుడైన శ్రీరామచంద్రుని గురించి, లక్ష్మణుని గురించి మీకు చింత లేదా? మిగిలిన వారన వీరులు మైందద్వివిదులు, నలనీలాదులు వీరందరిని ఉపేక్షించి ఒక్క ఆంజనేయునే ఎందుకడిగారు".

అంత బాధలోనూ జాంబవంతుడు ఫక్కున నవ్వి "సరైన ప్రశ్న వేసావు విభీషణా! ఈ హనుమంతుడు మహావీరుడు. వేగంలో తండ్రియైన వాయువుకు సరియైన వారసుడు. గరుత్మంతునికి సమ ఉజ్జీ, ఆ గరుత్మంతుడే వచ్చి హనుమ రుద్రాంశ వలన పుట్టినవాడని చెప్పాడు కదా! ఇతనొక్కడు బ్రతికి వుంటే ఎన్ని ప్రయత్నాలయినా చేసి మనందర్నీ బ్రతికించగల సమర్థుడు. మారుతికే విపత్తు కలిగిననాడు జగత్ప్రళయమే సంభవిస్తుంది. అతని బాల్యంలో అదే కదా జరిగింది. బ్రహ్మదేవులు జోక్యం చేసుకొని ఆ మహా విపత్తును నివారించారు. ఇంద్రుని వజ్రప్రహారం నుండి తట్టుకుని నిలబడగల

వీరుడితడు. బ్రహ్మాస్త్రాన్ని ఇతను గౌరవించి తల ఒగ్గాలేగాని, దాని వలన హనుమకు హాని లేదు. అంజనా నందనునికే ఆపద వస్తే యిక మనం జీవించి ప్రయోజనం వుండదు." అంటూ హనుమ భుజాన్ని గట్టిగా పట్టుకొని పైకి లేచినిలబడి కాళ్ళకున్న బాణాలు లాగిపారేసాడు. వీపుమీద గుచ్చుకున్న శల్యాలు హనుమ పీకి దూరంగా విసిరేసాడు.

"నాయనా! ఆంజనేయా! శీఘ్రంగా చెయ్యవలసిన కర్తవ్యం బోధిస్తాను. అవధరించు".

"చెప్పు తాత!" అని చేతులు జోడించి నిలబడ్డాడు హనుమ.

"సమస్త వానర భల్లూక గోలాంగూల యోధులకు రక్షణ కవచమయ్యా నువ్వు, ఇప్పుడు పరాక్రమించవలసిన అవసరం వచ్చింది. సీతాన్వేషణలో సఫలీకృతుడవైన నీకు వేరే చెప్పవలసిన పనిలేదనుకో. మూర్ఛిల్లి ప్రాణసంకటంలో వున్న రామలక్ష్మణులు; సుగ్రీవ అంగదాది వానరులు శల్యాలు తొలగించుకుని స్వస్థులు కావడానికి, మరణించిన వారుకూడా పునరుజ్జీవితులు కావటానికి నువ్వు ఈ నిశిరాత్రే బయలుదేరాలి. క్షణం జాప్యం పనికిరాదు."

"నువ్వు ఆజ్ఞాపించినదే తడవుగా బయలు దేరుతాను. రామలక్ష్మణులు నిస్తేజంగా పడివుండటం భరించలేను. సమస్త వానరకోటి క్షేమానికి నేను ప్రాణత్యాగం చెయ్యమన్నా సిద్ధమే. చెప్పు మహానుభావా! ఏమి చేస్తే వీరందర్నీ ఉత్సాహవంతుల్ని చెయ్యగలము" రెండు పిడికిళ్ళు బిగించి కాళ్ళుఎడమ చేసి స్థిరంగా నిలబడి ప్రశ్నించాడు హనుమ.

"ఇక్కడికి ఉత్తరదిక్కుగా వున్న హిమాలయ పర్వతాలకు వెళ్ళి ఋషభము, కైలాసము అనే శిఖరాల మధ్యవున్న ఓషధి పర్వతం చేరుకోవాలి".

"ఊ చేరుకొని....." ఆంజనేయస్వామి వక్షంనిండా గాలి పీల్చుకొని ఊర్ధ్వంగా చూస్తూ శత్రువుల మీద నున్న ఆగ్రహం; రామలక్ష్మణులు, వానర యోధులు సంకట స్థితిలో వున్నందుకు విచారం మనస్సుకు ఆవరించగా; మహా పట్టుదలగా వున్నాడు. మరింత చురుకుదనం, ధైర్యం తెచ్చుకున్నాడు. ఆయన శరీరం రోమాంచితమై క్షణక్షణం దీర్ఘంగా పెరుగుతోంది.

"దివారాత్రములు వెలుగులు జిమ్ముతూ, సుగంధ పరిమళాలు వీచే నాలుగు రకముల ఔషధజాతి మొక్కల్ని గుర్తించి సమూలంగా పెరికి తేవాలి. మరణించిన వారిని దివ్య పరిమళం చేత బ్రతికింపజేసే మృత సంజీవని; బాణాలు, ఆయుధాలు గుచ్చుకుని అవయవాలలో దిగబడిపోతే శల్యములను వెలికితీసి, చికిత్స చేసేందుకు ఉపకరించే విశల్యకరిణి; ఆయుధ అవశేషాలు తొలగించాక చర్మాన్ని ఒకటిగా చేర్చి అతికింప జేసే సంధానకరిణి; ఈ మూడు ప్రక్రియలు పూర్తయినాక చర్మంలోని ఎగుడు

దిగుడులు పోగొట్టి పూర్వపు రంగు తెచ్చే గుణమున్న సావర్ణ్యకరణి అనే నాలుగు రకముల మొక్కలు తేవాలి. అందులో మొదటి మృతసం జీవని గనుక లభ్యమైతే చనిపోయిన వారి ముఖ్య అవయవములు సరిగా వుంటే, దాని పరిమళం ఆస్వాదించిన వెంటనే జీవం పోసుకుని నిద్రపోయి మేల్కొన్న వారిలా లేచి కూర్చుంటారు. మిగిలిన మూడింటిలో ఏ ఒక్కటి దొరికినా గాయాలకు చికిత్స సులభంగా చేయవచ్చును." అని భల్లూకపతి యింకా ఏదో ఆలోచించి చెప్పబోతుండగా హనుమ ఆయన పాదాలకు నమస్కరించి పాదాలతో నేలను బలంగా తాడించి మహావటవృక్షం దివ్యశక్తులు పొంది ఎగిరినట్లుపైకి లేచాడు.

"నాయనా! హనుమా........ క్షేమంగా వెళ్ళిరా సూర్యోదయంలోగా తిరిగి రావాలి సుమా!" అని అరిచాడు.

"క్షణంలో కనుమరుగయ్యాడు. ఎంత వేగం" అంటూ విస్తుపోయి చూస్తున్నాడు విభీషణుడు. హనుమ ఎగిరిన వేగానికి ఒక మహా ప్రభంజనంలా గాలి వీచి చెట్లన్నీ వూగాయి. లంకానగర రాజప్రాసాదాలు, సభాభవనాలు, నివాసగృహాలు అదిరినట్లయి తలుపులు కిటకిటలాడినట్లయి ఉలిక్కిపడి లేచారు జనులు. ఈ రాత్రి యే ఉపద్రవం వచ్చి పడనుందోనని విశ్రాంతి తీసుకుంటున్న భటులు, రాక్షస వీరులు బెంబేలెత్తి పోతున్నారు. లంకా రాజ్య సామాన్య పౌరులంతా హఠాత్తుగా లేచి, 'మారాజు రామచంద్రునితో నిష్కారణ వైరం తెచ్చుకున్నాడు. ఎవరెప్పుడు మరణిస్తామో' అనుకుంటూ తలుపులు తెరుచుకుని బయటకు వచ్చి ఆకాశం వంక విస్తుపోయి చూస్తున్నారు. సముద్ర సహితంగా భూమి కంపించింది. హనుమ నభోమండలానికి ఎదిగి, మేఘాల్ని చీల్చుకుంటూ, నక్షత్ర రాశుల్ని కూల్చి వేసేంత శక్తిమంతుడిగా జవంతో ప్రయాణిస్తుంటే వాయుదేవుడు ఆయన్ను అదృశ్యంగా వుండి అనుసరిస్తూ, తన వీవనదిశను తనయునికి అనుకూలం చేస్తూ రామకార్యంలో తోడ్పడుతున్నాడు.

శ్రీమహావిష్ణువు చేత ప్రయోగించబడిన వెయ్యిఅంచులు గల సుదర్శన చక్రంలా మనోవేగంతో ప్రయాణం చేస్తూ తన తపోబలం చేత దివ్యప్రదేశాలన్ని పరికిస్తూ శివకేశవుల పట్ల భక్తిభావం పెంపొందించుకుంటూ వెడుతున్నాడు. సముద్రందాటి భూభాగం ఉపరితలం మీదకు చేరగానే విశాలమైదానాలు పంట భూములు, జనపదాలు, నగరాలు, నదీనదాలు, నిర్జనారణ్యాలు గిరిశిఖరాలు వెన్నెలలో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. తన వేగం చేత పుట్టిన హోరు దశదిశలు వ్యాపించగా నిద్రిస్తున్న పశుపక్ష్యాదులకు కలవరం పుట్టిస్తూ సాగుతున్నాడు.

చంద్రదేవుడు మంచుకొండలపై వెలుగులు గుమ్మరిస్తుంటే అప్పుడే హిమశిఖరాలు గోచరిస్తున్నాయి. కొంచెం వేగం తగ్గించి పరిశీలిస్తూ వెడుతున్నాడు. దేవతలు మహర్షులు

నిర్మించుకున్న గొప్ప ఆశ్రమాల జాడలు తెలుస్తున్నాయి. నిద్రించే ఏనుగుల గుంపులు బండరాళ్ళ గుట్టల్లా కనిపిస్తున్నాయి. పచ్చిక బయళ్ళలో జింకల గుంపులు విశ్రాంతి తీసుకుంటున్నాయి. పులుల గాండ్రింపులు, పొదలు రాసుకుంటూ వెడుతున్న చప్పుళ్ళ వినిపించేత దిగువగా ఎగురుతున్నాడు హనుమంతుడు. బ్రహ్మదేవుని విడిది, ఇంద్రుడు తపస్సు చేసిన ఆశ్రమం, శివుడు బాణప్రయోగం చేసే ప్రదేశం, హయగ్రీవ క్షేత్రం, పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నాడు.

శివపార్వతుల కళ్యాణం సందర్భంలో పార్వతీదేవి సౌందర్యాన్ని తదేకంగా వీక్షించిన ఫలితానికి ముక్కంటి ఆగ్రహానికి గురై శూలం చేత తెగటార్చబడిన బ్రహ్మశిరస్సు పడిన చోటు, ప్రసిద్ధ బ్రహ్మకపాల క్షేత్రంగా విరాజిల్లుతోంది. దానిని పరికించి చూచి త్రినేత్రునికి, మాత పార్వతీదేవికి మనసులోనే ప్రణామములు సమర్పించుకున్నాడు. కుబేరుని నివాసం చూచాడు. సూర్యుని వేడికి తాళలేక పోతున్నానని ఛాయాదేవి విశ్వకర్మకు విన్నవించుకోగా; ఆయన సూర్యగోళాన్ని పట్టిబంధించి సానపట్టిన ప్రదేశం గమనించాడు. హిమవత్పర్వత ప్రాంతాన్ని రక్షించే అధికారగణమైన సూర్యకింకరులుండే ప్రాంతము, శివధనుస్సు అమర్చే చోటు, బ్రహ్మ సింహాసనం వుండే స్థానము, భూమినుండి పాతాళానికి పోయే మహాబిలాన్నీ చూచాడు హనుమ.

ఆయన వెతుకుతున్న కైలాస పర్వత శిఖరం, హిమవచ్ఛిలా ప్రదేశం, ఋషభమనే శిఖరము వాటి మధ్య సంజీవపర్వతం కనిపెట్టగలిగేడు. అనేక పొదలు, తృణ జాతులు, వృక్షాలు ఒక దివ్య తేజస్సుతో వెలుగుతూ కనిపించాయి. జాంబవంతుడు చెప్పినట్లు దివ్య పరిమళము సోకుతోంది. విశ్రమించకుండానే తన మార్గాయాశం ఉపశమించి ఒక క్రొత్త ఉత్సాహం, శక్తి పుంజుకున్నట్లయింది. అదే ఆశ్చర్యం. దేవతలకు కూడా నూతనోత్సాహాన్నిచ్చే దివ్యశక్తి సంపన్నమైన ఓషధరాజాలు అక్కడే వున్నాయని గ్రహించాడు. యిదే సంజీవి పర్వతం అని దానిపై దిగాడు. నలుదిక్కులా మొక్కల కోసం వెతుకుతుంటే వాటి వెలుగులు మాయమై మసకవెన్నెల మాత్రం మిగిలింది. ఓషధులు నరవానర సంచారం గమనిస్తే అదృశ్యమౌతాయని విన్నాడు. ఆగ్రహం వచ్చింది. యిప్పుడిక యివ్వన్నీ వెతికి మొక్కల్ని మాత్రమే తీసుకు వెళ్ళే సమయం లేదు. అవతల రామలక్ష్మణులు మూర్ఛిల్లివున్నారు. వానరయోధులు అసంఖ్యాకంగా దెబ్బలు తిని మూలుగుతూ పడిపోయారు. తెల్లవారితే రణరంగం శత్రువుల మూకలతో నిండిపోతుంది. రామసేన పరాజయం పొందిందనే అపఖ్యాతి వస్తుంది అని ఆలోచించినదే తడవుగా సింహనాదం చేసి, కళ్ళుపెద్దవి చేసి హుంకరించాడు. పాదములు ఎడమచేసి దృఢంగా నిలిపి, ముందుకు వంగి పర్వత శిఖరాన్ని పెళ్ళగించి కుడిచేతిలో

పెట్టుకుని గగన మండలంలోకి ఎగిరాడు. గరుత్మంతుని మించిన వేగంతో తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. ఈసారి వెతుక్కుంటూ రావలసిన పనిలేదు. దక్షిణ దిక్కుగా వచ్చి లంకానగరం వెలుపల వున్న రణభూమికి చేరి నారికేళవృక్షమంత ఎత్తుతో ఎగురుతున్నాడు. దివ్య అలౌకిక పరిమళం వీచగానే కోట్లాది మృత వానరవీరులు ప్రాణం పోసుకుని లేచినిలబడి – "అడిగో హనుమ, అదుగడిగో మారుతి, అదిగో ఔషధాలు తెస్తున్నాడు. ఇడిగో యిటే వస్తున్నాడు" అంటూ తనవైపే చూస్తూ గంతులు వేస్తున్నారు. ఓషధుల నుండి బలమైన గాలులు అంతట వ్యాపింపజేసాడు వాయుదేవుడు. రామలక్ష్మణ సుగ్రీవ అంగదాదులంతా నిద్రలేచినట్లు కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చున్నారు. విభీషణుడు, జాంబవంతుడు, సుషేణుడు ఆనందంతో చూస్తున్నారు.

"జాంబవంతా! పైకి వచ్చి కావలసిన మూలికలు తీసుకో, నేను వాటిని గుర్తించి తెచ్చేటప్పటికి ఆలస్యమవుతుందని, మొత్తం గిరిశిఖరాన్నే పెల్లగించి తెచ్చాను. సుషేణా! నువ్వుకూడా పైకి రావాలి. మీరిద్దరూ వీటిని ప్రయోగించి అందర్నీ ఆరోగ్యవంతుల్ని చెయ్యండి" అని అరిచాడు. జాంబవంతుడు, సుషేణుడు పర్వతం మీదికి వెళ్ళి కావలసిన ఓషధి మొక్కల్ని మోపులుగా కట్టికిందికి విసిరేసారు. చాలామంది వాటి ఘాటైన పరిమళానికే పునర్జీవితులై లేచి "జయము జయము వీర హనుమాన్".

"జయము జయము రామచంద్ర ప్రభువుకు" అని హర్షధ్వానాలు చేస్తున్నారు.

"జాంబవంతా నేను ఈ శిఖరాన్ని యధాస్థానంలో వుంచి శీఘ్రంగా తిరిగి వస్తాను" అంటూ మారుతి అనటంలో వారు నేల మీదికి దుమికారు. మారుతి మహావేగంతో ఉత్తర దిశగా వెళుతున్నాడు.

సుషేణుడు కొందరు వానరుల్ని తీసుకుని మొక్కలు నూరి అవసరమైన వారందరికి వైద్యం చేస్తున్నాడు. జాంబవంతుడు విభీషణుడు రామలక్ష్మణులను వెతుక్కుంటూ ముందుకు వెడుతున్నారు.

"ఆర్యా! జాంబవంతా! ఆ మొక్కల పరిమళం వలన రాక్షస సేనలో ఎవరూ బ్రతికినట్లు లేదే కారణం యేమిటి?" అని ప్రశ్నించాడు విభీషణుడు.

"అదంతా మీ అన్న రావణుని అతితెలివి. తన పరాజయాన్ని చనిపోయిన రాక్షసుల సంఖ్య వలన ఎవరైనా లెక్కగడతారని యేరోజుకారోజే మృతులైన తన సైనికుల కళేబరాలను సముద్రంలో వేయిస్తున్నాడు, సముద్రపు చేపలు, మొసళ్ళు, తిమింగలాలు గుంపులుగా ఒడ్డుకొచ్చి మరీ విందారగించి వెడుతున్నాయి. నువ్వూ చూస్తున్నావుగా చీకటి పడ్డాక జరిగేదిదే!" అన్నాడు జాంబవంతుడు.

"ఔను! తన గొయ్యి తనే తవ్వుకున్నట్లయింది మా అన్నకు" అన్నాడు విభీషణుడు. రామలక్ష్మణులకు చికిత్స జరిగింది. వారుభయులు పునరుత్సాహంతో లేచి ధనుర్బాణాలు

ధరించారు. తెలతెల్లవారుతుందనగా హనుమ తిరిగి వచ్చి రామలక్ష్మణులకి, జాంబవంతునికి పాదాభివందనాలు చేసాడు. వారతనిని గాఢాలింగనం చేసుకుని ఆశీర్వదించారు. మళ్ళీ యుద్ధం ప్రారంభమైంది.

విశేష వ్యాఖ్యానము : సంజీవి పర్వతం తెచ్చి మృత వానరులను పునరుజ్జీవితులను చేసిన శ్రీ ఆంజనేయస్వామి ఆరాధ్యనీయుడు. ఈ రోజులలో పై నాలుగు ఓషధులు ఎవరికీ లభ్యం కాకపోవచ్చు. కాని వాటిని తెచ్చిన హనుమ యిప్పటికీ, ఎప్పటికి చిరంజీవులుగానే వున్నారు కదా! ఆయనే భావిబ్రహ్మదేవులు. మానవకృత కర్మలదుష్ఫలాలను, శనిగ్రహాది దోషాలను, శారీరిక మానసిక రుగ్మతలను నివారించి, ఆయుష్షు ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతానం ప్రసాదించే "సంజీవ విజయుడు" ఆయనే. పర్వతం చేతపట్టి ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో ముందుకు సాగుతున్న హనుమానుని పూజించుకుంటే మీ కోర్కెలన్నీ నెఱవేరుతాయి. ఆయురారోగ్యాలు వృద్ధి చెందుతాయి. శుభమగు గాక!

౫౦. హనుమద్విలాపము - ఇంద్రజిత్తు వధ

మహూదరుడనే రాక్షసుడు అంగదుని పైకి ఏనుగులను పురికొల్పాడు. దేవాంతకుడనే రాక్షసయోధుడు అంగధుడు అంగదుడ్ని అరచేతులతో బాదుతున్నాడు. త్రిశిరుడనే పెనురాక్షసుడు అంగదుడు వృక్షాలు విసురుతుంటే వాటిని వాడి బాణాల చేత నరుకుతున్నాడు. యిలా ముగ్గురూ ఒక్క వాలినందుకునిపై పోరుతుంటే వాయునందనుడు గమనించి అటు దిశగా వెడుతున్నాడు. అంగదుడు ముగ్గురు తనపై యుద్ధం చేస్తున్నా ఏమాత్రం భయపడకుండా, ఒక ఏనుగును అరచేతితో కుంభస్థలంపై చరిచాడు. దానికళ్ళు నేల రాలిపడి రక్తం ధారలుగా కారుతోంది. అంగదుని వళ్ళంతా చిమ్మింది. బలంగా దాని దంతం ఒకటి పీకి దేవాతకుణ్ణి కొట్టగా వాడు కీళ్ళు జారి కిందపడి ఎఱ్ఱులత్తుక వంటి జిగటు నెత్తురు కక్కుకుంటూ నేలపై పడిపోయాడు. నాలుగంగలు గబగబా వేసి హనుమంతుడు పెద్ద సింహనాదం చేస్తూ వాడి తలపై పిడికిలి బిగించి కొట్టగా, పండ్లు రాలిపడి, కళ్ళు జారిపడి నాలుక బైటకు పెట్టి ఒక పెనుబొబ్బ పెట్టి వాడు మరణించాడు. నీలుడు వృక్షసమూహాలతో నిండిన కొండశిఖరం తెచ్చి మహూదరునిపై విసరగా వాడు తానెక్కిన మత్తేభంతో సహా కుప్పకూలి నేలమట్టమయిపోయాడు. తన పిన తండ్రి మహూదరుడు చనిపోవటం చూచి త్రిశిరుడు విజృంభిస్తున్నాడు. తీవ్రబాణాలతో హనుమంతుని గాయపరుస్తున్నాడు. మరో గిరిశిఖరం తెచ్చి హనుమ త్రిశిరునిపై వేయుగా వాడు వాడి బాణాలతో దానిని పిండి చేసాడు. అనేక చెట్లను పెరికి ఒక్కొక్కటి విసురుతుంటే త్రిశిరుడు అమ్ములచే చిందరపందర చేసి

తిరిగి కపులపై పడేలా కొడుతున్నాడు. హనుమ ముందుకురికి త్రిశిరుని రథసారధిని, అశ్వలను తన వాడి గోళ్ళతో గజకుంభాన్ని స్థలా సింహం చీరినట్లు చీరి పారేసాడు. వెంటనే అసురుడు శక్తిని ప్రయోగించగా అంజనేయస్వామి దానిని చేతులతో పట్టుకొని విరిచి పారేసి సింహనాదం చేస్తున్నాడు. వెంటనే త్రిశురుడు మొలనున్న ఒరలోనుంచి ఖడ్గంతీసి హనుమ ఛాతీపై కొట్టాడు. ఊపిరి బిగించి స్వామి ఖడ్గప్రహారాన్ని తట్టుకొని ఆ ఖడ్గం లాక్కుని త్వష్టపుత్రుడైన విశ్వరూపుని తలను ఇంద్రుడు వజ్రాయుధంతో నరికినట్లు త్రిశిరుని మూడు శిరస్సులు నరికి వేసాడు. రాక్షసవీరుని రక్తం ఉవ్వెత్తునలేచి హనుమ ముఖం మీద వక్షంమీద చిమ్మింది. మొండెం కిందపడగా కాళ్ళు చేతులు విలవిలా కొట్టుకుని మరణించాడు వాడు. ఈ రకంగా అనేకమంది రాక్షసవీరుల్ని మట్టి గరిపిస్తున్నారు హనుమ, అంగదుడు, మహూదర, మహాపార్శ్వ, నరాంతక, దేవాంతక, త్రిశిరస్క అతికాయాది యోధులు మరణించారని రావణుడు తెలునుకుని ఆరాటపడుతుండగా, మేఘనాధుడు తండ్రికి ధైర్యంచెప్పి, అభిచారహూమం చేసి యుద్ధానికి వస్తున్నాడు. అసంఖ్యాకమైన అసుర సేన లంక పడమటి ద్వారంగుండా వారువస్తుంటే వానరవీరులు చెట్లు, రాళ్ళు విసరటం మొదలుపెట్టారు. రాళ్ళ దెబ్బలకు తట్టుకుంటూనే ముందుకు వస్తున్నాడు ఇంద్రజిత్తు.

ఒకగిరిశిఖరం పెకలించుకు వచ్చాడు హనుమ. ఈసారి ఎలాగైనా వీడి హతమార్చాలి. 'వాయుదేవా! తండ్రీ యిది వాడి నెత్తిమిద పడవేయాలి, సహకరించు' అని మనసులో తండ్రిని స్మరించుకుని రథంవైపు నిశితంగా చూస్తున్నాడు. ఎవరోస్త్రీ ఆర్తనాదం చేస్తూ రథంలో విలపిస్తుంది. రథం సమీపిస్తుంది. పైకెత్తిన కొండగుట్టను అలాగే పట్టుకుని వళ్ళంతా కళ్ళు చేసుకుని తేరపారి చూచాడు. హనుమ ఆశ్చర్యపోయాడు.

"ఆమె సీతామాతయే రథంలో వుంది. వానరులారా, చెట్లు రాళ్ళు విసరకండి. ఆగండి" అంటూ బిగ్గరగా కేకవైచి చేతిలోని గుట్టను దూరంగా పడేసాడు. ఖిన్నుడై చూస్తూ హనుమ కపులకు వికటాట్ట హాసం చేసి మీసం మెలితిప్పుతూ బాణప్రయోగం ప్రారంభించాడు. ఏమి చెయ్యాలో వానరులకు అర్ధం కావటం లేదు. వారిలో చాలామంది సీతాదేవిని ఎరుగరన్న విషయం హనుమకు స్ఫురించింది.

"కపివీరులారా! మేఘనాధుని రథంలోవున్న స్త్రీ సీతమ్మతల్లి. ఆమె కోసమే మనమీ పోరాటం చేస్తున్నది. మీ రెవరూ రాళ్ళు విసరకండి. నిగ్రహించుకోండి. ఆమెను తప్పించి మన రాములవారికి అప్పగించే ఉపాయం ఆలోచించండి" అని బిగ్గరగా అరుస్తున్నాడు హనుమ. రథం యింకా దగ్గరకు వస్తోంది.

"రామచంద్రా! నన్ను రక్షించు. నాధా నన్ను కాపాడు" అని ఆమె రోదిస్తుంది. ఇంద్రజిత్తు హనుమ వంక చూస్తూ తొడగొట్టి వికటాట్టహాసం చేస్తూ ఆమె శిరోజాలు

ఒడసి పట్టుకున్నాడు. హనుమకు వళ్ళంతా చెమటలు పట్టి కనులెఱ్ఱజేసి. క్రోధంతో పళ్ళు పటపటా కొరికి పిడికిళ్ళు బిగించాడు.రథం మీదికి దూకబోతుండగా -

"ఓరి కోతిమూకల్లారా! ఆగండి. ఎవడైనా ఒక్క అడుగు ముందుకేసాడో ఆమె శిరస్సు ఖండించి మీ రాముడికి బహుమతిగా విసురుతాను" అంటూ సుర్రున ఖడ్గం లాగి పైకెత్తి పట్టుకోవటంతో కపులంతా అవాక్కయిపోయి చేతులలోని రాళ్ళు కింద పడేసి చూస్తున్నారు. రాక్షసులు వారిపై కత్తులు దూసి నరికేస్తున్నారు. గదలతో తలలు చితకబాది, వారి వారి గుండెకాయలు లాగి తినేస్తుంటే వానరులు హాహాకారాలు చేస్తూ కింద పడి హతులౌతున్నారు. ఆంజనేయస్వామి ఎలాగైనా వెళ్ళి సీతామాతను విడిపించి తేవాలని సంకల్పించుకుని మేఘనాథుణ్ణి మాటలలోకి దింపాడు.

"ఓరి దురాత్ముడా! బ్రహ్మఋషి వంశంలో పుట్టినా నువ్వు జన్మించినది రాక్షస యోనిలో అందులో నీ నాశనం కోరి మాతల్లి కేశాలను పట్టుకున్నావు. నీచుడా! పతివ్రతలను బాధించి నువ్వు నీతండ్రి పాపం మూటగట్టుకుంటున్నారు. తన యింటికి, పెనిమిటికి, రాజ్యానికి దూరమై ఒంటరిగా అలమటిస్తున్న రామపత్నిని తాకడానికి నీకు చేతులెలా వచ్చాయి. ఈమె నీకేఅపకారం చెయ్యలేదు. స్త్రీహత్యాశిశుగోబ్రాహ్మణ హత్యలు మహాపాతక కర్మలని ఎరుగవా? ఆమె శిఖముడిని విడు" అంటూ ఒక్కొక్క అడుగు ముందుకేస్తున్నాడు.

"ఆంజనేయా! నా తమ్ముడు అక్షకుమారుని చంపిన నాడే నిన్ను హతమార్చివుండవలసింది. నీ కుప్పిగంతులు ఈ మేఘనాథుని ముందు పనికిరావు. రామలక్ష్మణులు, సుగ్రీవుడు, జాంబవంతుడు అంగదుడు మీరంతా ఈ సీత కోసమే కదా లంకారాజ్యంపై దండెత్తి వచ్చింది. మా రాక్షస వీరుల్ని, బంధువులను మా పినతండ్రి కుంభకర్ణుని వధించినది ఈమె కోసమే కదా! మీరంతా చూస్తుండగానే సంహరిస్తాను. మీ పరివారాన్నంతా యిప్పుడే కడతేర్చి మావారందరికి రక్త తర్పణం వదులుతాను. స్వకులద్రోహి, నా తాత విశ్రవశుని చేసి వైరి పక్షంలో కలిసినవాడు నా తండ్రిపై తిరుగుబాటు చేసి వైరి తండ్రికి రక్తాభిషేకం చేస్తాను. యిదిగో చూడు నీ సీతామాత బతుకు ఆఖరు" అంటూ ఆమె మెడ పట్టి శిరస్సు ఖండించి దూరంగా విసిరికొట్టాడు. రథం నుండి పడిపోతున్న మొండాన్ని జందెపు దెబ్బ వాటంగా నిలువునా భేదించాడు. వాడిపాదాల నుండి ఛాతీవరకు నెత్తురు విరజిమ్మింది. ముక్కలై పోయిన సీతాసాధ్వి శరీరం రథం నుండి పడి ధూళి దూసరితమైపోగా గుఱ్ఱాలు తొక్కుకుంటూ రథం ముందుకు లాగి సకలించాయి. హనుమ నిలువునా కంపించి పోయి స్థాణువులా ఒక నల్లరాతి బండపై కూలబడిపోయాడు. కాళ్ళు దడదడ లాడి గుండె వేగంగా కొట్టుకుంటోంది. తన కళ్ళముందే ఘోరం జరిగిపోయినా నివారించలేక

పోయాడు. కళ్ళు చీకట్లు కమ్మి తూలిపడబోయాడు హనుమ. కన్నీరు మున్నీరుగా వానరులు విలపిస్తూ ఆయన్ని నాలుగు వైపులా పట్టుకున్నారు. కొందరు కపులు రామలక్ష్మణుల కోసం పరుగుపెట్టారు. సుగ్రీవ, అంగద జాంబవంతులకు ఈ వార్త తెలిసి వారు పరమ దుఃఖం పొందుతున్నారు. అందరూ కంగారు పడుతూ రామలక్ష్మణులు యుద్ధం చేస్తున్న దక్షిణ దిశగా పరుగులు పెడుతున్నారు.

హనుమ ముఖంపై వానరులు నీళ్ళు జల్లి ఓదార్చారు. ఆయన వెర్రి ఆవేశం తెచ్చుకుని పరమ ఉగ్రుడై తను కూర్చున్న పెద్ద బండరాతిని పెల్లగించి మేఘనాధుని రథం వైపు తిరిగి -

"ఓరీ దుష్టుడా! స్త్రీ హత్య చేసినవారు అధోలోకాలకుపోతారు. యిదిగో నిన్నిపుడే సంహరిస్తున్నాను. కాసుకో" అంటూ బిగ్గరగా అరిచి విసిరేసాడు. సారధి చాకచక్యంగా రథాన్ని మలుపుతిప్పి దూరంగా తోలటంతో కొందరు రాక్షసులు మాత్రం దానికింద పడి హతులైపోయారు. తను పెట్టుకున్న నియమం ప్రకారం ఇంద్రజిత్తు హోమం చెయ్యటానికి వేళ కావటంతో నికుంభిల అనే వటవృక్షం వైపు ససేనుడి వెళ్ళిపోయాడు. హనుమ రామలక్ష్మణులవైపు పరుగుతీసి తాను చూసినదంతా వారికి పూసగుచ్చినట్లు చెప్పగావారు మొదలు నరికిన అరటి చెట్టులా నేలమీద పడి స్పృహకోల్పోయాడు. లక్ష్మణుడు దుఃఖం పెల్లుకొని వస్తుంటే దిగమింగుకుంటూ అన్నను తన వడిలో పెట్టుకుని కూలబడిపోయాడు. జాంబవంత, సుగ్రీవ, అంగద, నల నీల, మైందద్వివిదులంతా వారి చుట్టూ చేరి గుండెలు బాదుకుని విలపిస్తున్నారు. దూరం నుండి విభీషణుడు పరుగు పరుగున వస్తూ "రామచంద్రా! దుఃఖించకు. సీతాసాధ్వి క్షేమంగా వుంది. యిదంతా మేఘనాధుని మాయ. హనుమా దుఃఖించకు. సీతాదేవి లంకలో సజీవంగా వుంది" అని రంకెలు వేస్తూ ఆయాస పడుతూ వచ్చాడు. అందరూ క్షణంలో కళ్ళు తుడుచుకుని ఆనందంగా అతని వంక చూస్తుండగా.

"ఔను నేను నా మంత్రుల్ని లంకకు పంపి చూసి రమ్మన్నాను. వారు వెళ్ళి ఆమె క్షేమంగా వుందని తెలిపారు. యిదంతా మన మనోధైర్యం దెబ్బతియ్యడానికి రావణపుత్రుడు పన్నిన కపటోపాయం." అని చెప్పగానే రామచంద్రుడు కూడా లేచాడు. హనుమ ఆనందానికి అవధుల్లేవు. ఒక్కసారి తోకముద్దు పెట్టుకుని ఎగిరి గంతేసి "వానరలారా వెళ్ళి వాడ్ని తుదముట్టిద్దాం పదండి" అని అరిచాడు. విభీషణుడు అతనిని చెయ్యిపట్టుకుని ఆపి -

"కపీంద్రా! వాడి మృత్యువు లక్ష్మణుని చేతిలోవుంది. యుద్ధంలో విజయసాధనకొరకు నికుంభిల అనే మర్రిచెట్టు దగ్గర అభిచారహోమం చేస్తున్నాడు. అది పూర్తి కాకమునుపే వాడిని సంహరించాలి. రామా! అనుజ్ఞ యిచ్చి లక్ష్మణుని నాతో

పంపు" అని అడిగిన వెంటనే లక్ష్మణుడు విల్లంబులు చేపట్టి రాముని అనుమతి పొంది ఆయనకు పాదాభివందనం చేసి బయలుదేరాడు. యిద్దరూ నికుంభిల వద్దకు చేరి మేఘనాధునితో పోరాటం ప్రారంభించారు. మూడు అహోరాత్రులు పోరాడి చివరికి ఐంద్రాస్త్రం ప్రయోగించి మేఘనాధుని హతమొందించాడు లక్ష్మణుడు. శ్రీరామచంద్రుడు విజయం సాధించుకుని వచ్చిన సౌమిత్రిని ఆలింగనం చేసుకుని అతని వీరత్వానికి పొంగిపోయాడు. రావణ సోదరుడైన విభీషణుడు ధర్మ పక్షపాతియై తనకు చేస్తున్న సహాయాలకు కృతజ్ఞతలు తెలిపాడు.

విశేష వ్యాఖ్యానము :-

వాల్మీకి రామాయణంలోని ఈ సన్నివేశంలో హనుమంతుడు ఎంతటి వీరుడు, బలశాలి, పరాక్రమవంతుడు అయినా; సీతామాత కోసం హృదయం ద్రవిస్తుంది. సీతారాములను తిరిగి ఒకటిగా చేయటానికి వానరులు పడుతున్న శ్రమ వారి ప్రాణత్యాగాలు, కిష్కింధాకాండము, సుందర కాండలలో హనుమంతుడు చేస్తున్న సాహసకార్యాలు అన్నీ సీతామాత కొరకే కదా! అలాంటి పతివ్రత నిజంగా రాక్షసుని చేతిలో మరణిస్తే సముద్రాలు ఉప్పొంగి భూభాగమే నీట మునుగుతుంది. నవగ్రహాలు పరస్పరం ఢీకొని వినాశనమే అయి పోదా! రాక్షసుల మాయలు చిత్రంగా వుండి వీరుల మనో నిబ్బరాన్ని దెబ్బతీస్తాయి. ధైర్యం తెచ్చుకొని నిజానిజాలు సావధానంగా గ్రహించి ధర్మంకోసం తుది వరకు పోరాడాలి సుమా; అని మనకు బోధించడానికే వాల్మీకిమహర్షి ఈ సన్నివేశాన్ని రూపొందించారనిపిస్తుంది. రెండు కోరలు, తలమీద కొమ్ములు, నల్లటి దీర్ఘశరీరంతో కాకపోయినా అసురప్రవృత్తితో మనల్ని నిర్వీర్యుల్ని చేసే రాక్షసులున్నారు. ఈ రోజుల్లో కూడా మనల్ని అనేక మాయలు చేస్తుంటారండోయ్. తస్మాత్ జాగ్రత్త. అలాంటి పరిస్థితే వస్తే ఆంజనేయస్వామినే శరణువేడండి.

51. లక్ష్మణ ప్రాణదాత – మారుతి



ఇంద్రజిత్తుకూడా హతమయ్యాడు. రావణుని పరివారంలో చాలా మంది స్వర్గస్థులయ్యారు. మేఘనాధుని మరణంతో చాలా కుంగిపోయాడు రావణుడు.

సహజంగానే ఎఱ్ఱనైన అతని కనులు క్రోధం వలన మరీ మండుతున్న అగ్ని గోళాలవలె వున్నాయి. మండే దీపం నుండి మంటతో కూడిన నూనెబొట్లు రాలినట్లు ఆయన నేత్రాల నుండి అశ్రువులు రాలిపడుతున్నాయి. పండ్లు పటపటమని కొరుకుతుంటే గానుగ యంత్రం ధ్వని వస్తోంది. ప్రళయకాలంలో అన్ని జీవుల ప్రాణాలను హరించే యమునిలాగ వున్న తమ రాజును చూచి ఎవరూ దగ్గరకు వెళ్ళే సాహసం చెయ్యలేకపోతున్నారు. పుత్రవధచే పీడితుడై దీనికంతటికి కారణమైన సీతను చంపడానికి పొడవాటి కృపాణం తీసుకొని పెద్ద పెద్ద అంగలేసుకుంటూ, నేలను జీరాడి మట్టి కొట్టుకుపోతున్న ఉత్తరీయాన్ని కూడా సవరించుకోకుండా, ఏ వాహనము ఎక్కకుండా తన అంతరంగిక మందిరం నుండి అశోకవనంలో సీతాదేవి కూర్చున్న స్థలం వరకూ వేగంగా నడిచి వచ్చి ఆమె పై కత్తి ఎత్తాడు. ఆయన వెనుకనే వచ్చిన మంత్రులు సీతను చంపవద్దని వారిస్తున్నారు. సీతాసాధ్వి యితని వాలకం చూచి హడిలిపోయింది. ఆనాడు హనుమంతుడు తన వీపున ఎక్కించుకుని తీసుకువెళతానన్నప్పుడు వెళ్ళి వుంటే ఈ పాటికి సుఖంగా శ్రీరామసన్నిధిలో వుండే దానిని అని దుఃఖిస్తోంది. చంద్రుని ఎడబాసి కుజగ్రహానికి చిక్కిన రోహిణి వలె రామచంద్రునికి దూరమై ఈ రాక్షసుని పంచను యింత కాలం వుండి పోయానని ఆమె కన్నీరుమున్నీరుగా ఏడుస్తోంది. మిత్రులు, మంత్రులు రావణుని చెయ్యి పట్టుకొని ఆమెను వధించటం ధర్మం కాదని బ్రతిమాలుతున్నారు. ఈలోగా సుపార్శ్వుడనే మంత్రి వచ్చి –

"రాక్షసేంద్రా! నీవు సాక్షాత్తు కుబేరుని తమ్ముడవు. ధర్మాన్ని త్రోసిపుచ్చి సీతను వధించి అపకీర్తి తెచ్చుకోవద్దు. వేదాధ్యయనము చేసి వ్రతస్నాతుడవై సదా స్వకర్మనిష్ఠుడవైన నువ్వు స్త్రీవధ చెయ్యరాదు. ఆమె మిక్కిలి రూపవతి. ఈమె పై నున్న ఆగ్రహమంతా నీ ప్రధానశత్రువైన రామునిపై చూపించి రణానికి వెళ్ళు. కృష్ణచతుర్దశీ తిథి అయిన ఈరోజే యుద్ధ సన్నాహం చేసి అమావాస్య నాడు విజయం పొందు" అని వారించగా, అతడు సీతపై కెత్తిన కృపాణాన్ని అక్కడే పడేసి వెంటనే తన నివాసమందిరానికేగి శుచిర్భూతుడై సభ తీర్చి, నలుగురి అభిప్రాయాలు తీసుకుని, సేనను సమీకరించి యుద్ధ భూమికి వచ్చి సరాసరి రామచంద్రునితో తలపడ్డాడు. ఇరువురు హోరాహోరీ యుద్ధం చేస్తున్నారు. రాముడు అలసి పోవటం లక్ష్మణుడు గమనించి" –

"అన్నా నువ్వు కొంత సేపు విశ్రాంతి తీసుకో. నేను పోరాడుతాను" అని ధనుర్బాణాలు ధరించి దశకంఠుని ఎదుర్కొంటాడు. ఏడు బాణాలను సంధించి, మానవ శిరస్సు కేతన చిహ్నంగా గల రావణుని ధ్వజాన్ని ముక్కలుగా విరిచేసాడు. ఐదు బాణాలు ప్రయోగించి ఏనుగు తొండం వంటి రావణ ధనుస్సును ముక్కలుగా ఖండించాడు. ఈలోగా విభీషణుడు మేరుపర్వత శిఖరం లాంటి తన పెనుగదతో రావణ రథాశ్వాలను కొట్టి చంపేసాడు. దశకంఠుని రథం కూలిపోతుంటే లాఘవంగా ఆయుధాలు చంకన

పెట్టుకుని విశాల భూమిలోనికి దుమికాడు రావణుడు.

"ఓరీ! విభీషణా! శత్రువుకు తోడ్పడి నా పరివారాన్నంతను నాశనం చేయించావు కదరా. యిదిగో శక్తి ఆయుధం విసురుతున్నాను. నీకింక యమసదనమే విడిది" అంటూ కాంచన మాలతో అలంకరించిన పొడవైన వజ్రాయుధం వంటి శక్తిని గిరగిరా త్రిప్పి విభీషణునిపై విసిరి చూస్తున్నాడు. కాని లక్ష్మణుడు చెంగున విభీషణుని ముందుకురికి అతనికి రక్షణగా నిలిచెను. విభీషణుని సూటిగా కొట్టడానికి రావణుడు మహా ప్రయత్నం చేస్తున్నాడు. అయితే సౌమిత్రి తన విలు విద్యాప్రావీణ్యంతో అతనిపై శరవర్షం కురిపించి బాధిస్తున్నాడు. దశకుంఠునికి ఆగ్రహం వచ్చి చండ్ర నిప్పులు కక్కుతూ గుడ్లురిమి గర్జించాడు. తన చేతిలోని శక్తిని ప్రక్కన పడేసి, మరొకటి తీసాడు.

"లక్ష్మణా! విభీషణుని కాపాడుతున్నావుకదూ. సరే వాడి సంగతి తరవాత చూస్తాను. మహాభయంకరమైనది. పూర్వం నేను అనేక మందిపై ప్రయోగించగా వారి రక్తమాంసపు మరకలే గుర్తుగా గలది, మయదానవునిచే నిర్మించబడినది. ఈ శక్తి అస్త్రాన్ని నీమీదే ప్రయోగిస్తున్నాను. నీ గుండెల్ని చీల్చేస్తుంది కాసుకో", అంటూ యినుప గుదియలాంటి నల్లని కుడి చేతిని ఒడుపుగా త్రిప్పి విసిరాడు. ఎనిమిది గంటలతో భయంకరనాదం చేసుకుంటూ అగ్నిగోళాలు చిమ్ముకుంటూ అది సూటిగా లక్ష్మణుని వక్షాన్ని ఢీకొని గుచ్చుకు పోయింది. వెంటనే సౌమిత్రి నేల కొరిగాడు. ప్రక్కనే వున్న రామచంద్రుడు ఈ హఠాత్పరిణామాన్ని చూస్తూండిపోయాడు. తమ్ముని ఉరముపై నాటిన శక్తిని లాగుతుంటే రావణుడు రామునిపై బాణాలు కురిపిస్తున్నాడు. అలా బాణపు దెబ్బలు తింటూనే లక్ష్మణునికి తగిలిన శక్తిని లాగి విరిచి దూరంగా పారేసి, సుగ్రీవాదికపుల్ని వలయంలా యేర్పాటుచేసి పరుండబెట్టి, తను రావణునితో పోరాటం సాగిస్తున్నాడు. మూర్ఛిల్లిన సౌమిత్రి చుట్టూ హనుమ అంగద జాంబవంతాదులు చేరి పరిచర్యలు చేస్తున్నారు. సుషేణుడు వైద్య సామాగ్రితో వచ్చి గాయానికి కట్టుకట్టాడు. రక్తస్రావం తగ్గింది. కాని స్పృహ రావటంలేదు. ఎఱ్ఱమందారాల గుట్టలా పడి వున్న రామానుజుని చూసి అంతా దుఃఖిస్తున్నారు. రాముని అస్త్రవిద్యాపాండిత్యానికి తట్టుకోలేక రావణుడు రణం విరమించి కోటలోనికి జారుకున్నాడు. రాక్షసరాజును రణం నుండి శీఘ్రంగా తరిమి కొట్టిన దాశరథి పెనుదుఃఖంతో తమ్ముని వద్ద కూర్చుని –

"నా బహిఃప్రాణమైన లక్ష్మణా! దాయాదుని వలన రాజ్యము నశించడం, విధి లిఖితంగా వనవాసం ప్రాప్తించడం, దండకారణ్యంలో సుకుమారి సీతతోను తిరగటం, దుష్టరావణుడు సీతను తస్కరించటం, ఆమె వియోగంలో కొండలు గుట్టలు తిరగటం; విధాత నా ముఖాన రాసిన ఈ కష్టాలన్నింటిలోను నాకు తోడుగా నిలిచిన తమ్ముడూ, నువ్వు లేనిదే ఈ యుద్ధం ఎవరికొరకు చెయ్యాలి.

యుద్ధకాండము. 102వ సర్గ. 12వ శ్లోకము :

దేశే దేశే కళత్రాణి
దేశే దేశే చ బాంధవాః,
తం తు దేశం న పశ్యామి,
యత్ర భ్రాతా సహోదరః.

ప్రతీదేశంలోను కావలసినంత మంది కాంతలను పెండ్లాడి భార్యలుగా స్వీకరించవచ్చు, వారిని బట్టి చుట్టములు కూడా లభిస్తారు. కాని ఎన్ని దేశాలు వెతికి చూచినా నీవంటి తోడబుట్టిన తమ్ముడు లభిస్తాడా! తమ్ములు లభించే ప్రదేశం అంటూ వుంటుందా! నువ్వు యిలా దుమ్ములో పడి వుండటం చూడలేను. నాకీ యుద్ధంతో గాని, సీతతో గాని యింక పనిలేదు" అని దీనవదనంతో విలపిస్తున్నాడు శ్రీరామచంద్రుడు.

సుషేణుడు ఆయన భుజంపై చెయ్యి వేసి – "రాఘవా! లక్ష్మణుని ముఖకాంతి తగ్గలేదు. కన్నులు ప్రసన్నత కలిగివున్నాయి. అరచేతులు ఎఱ్ఱ తామరల వలె రక్తవర్ణంతోవున్నాయి. శ్వాస ఆడుతోంది. యితను మృతి చెందలేదు. ఎందుకిలా డీలాపడిపోతున్నావు. ఇదిగో ఇతని హృదయం మాటి మాటికి కొట్టుకుంటూనే వుంది. అందుకని కంగారు పడవలసిన పనిలేదు" అని ధైర్యం చెప్పి – హనుమంతుని వంక చూచాడు.

"మహావీరమారుతీ! జాంబవంతుడు తెల్పిన ఓషధీపర్వతానికి శీఘ్రంగా వెళ్ళి విశల్యకరణిని తేవాలి. శక్తి గుచ్చుకున్న చోట దానిని ప్రయోగించాలి. ఎలాగ వెడుతున్నావు గనుక సువర్ణకరిణి, సంజీవని, సంధానకరణి కూడా తెస్తే లక్ష్మణుని బ్రతికించవచ్చు. జాడ తెలిసిన ప్రదేశమే కనుక వేగంగా వెళ్ళి మూలికలు తీసుకురావాలి" అన్నాడు సుషేణుడు. రామచంద్రుడు హనుమ వంక సజలనయనాలతో దీనంగా చూస్తున్నాడు. వెంటనే హనుమ ఆయన దగ్గరకు వెళ్ళి ఆయన చేతుల్ని తన చేతులలోనికి తీసుకుని –

"ప్రభూ రామచంద్రా! మీరు నిశ్చింతగా వుండండి. నేను వెళ్ళివస్తాను. మళ్ళీ మన లక్ష్మణుడు సుఖంగా లేస్తాడు" అని మారు మాటకు తావియ్యకుండా గగన తలంలోనికి దూసుకుపోయాడు. అతివేగంగా ప్రయాణం చేసి పర్వతాన్ని చేరుకున్నాడు. విశల్యకరణి కోసం గాలించాడు. ఆలస్యం అయిపోతోందన్న ఆతృత. దక్షిణపర్వత శిఖరం వైపు నడిచాడు. అక్కడంతా మరీ శీతలంగా వుంది. సరైన శిఖరం అని గుర్తించి కుడి చేతిలోపెట్టుకుని గరుడ వేగంతో ప్రయాణం చేసి యుద్ధ భూమికి చేరుకున్నాడు. లక్ష్మణుడు మూర్ఛిల్లిన ప్రదేశంలో సుగ్రీవ, అంగద, జాంబవంతాదులంతా

కాగడాలు పట్టుకుని కూర్చున్నారు. రాముని వడిలో సౌమిత్రి అలాగే వున్నాడు.

"వానర వైద్య శిఖామణీ! సుషేణుడా! త్వరగాపైకి వచ్చి మూలికలు తీసుకొని వైద్యం ప్రారంభించు" అని అరిచాడు.

"మళ్ళీ శిఖర మంతా పట్టుకొచ్చావా"

"ఏమి చెయ్యను ఈ మొక్కల్ని గుర్తించేలోగా కాలయాపన జరిగిపోతోంది గదా ! సత్వరం తీసుకో నువ్వు" అన్నాడు హనుమ.

"శభాష్! శక్తి శాలివి. యుక్తి పరుడివి. క్షణంలో సౌమిత్రిని స్వస్థుడ్ని చేస్తాను" అంటూ లాఘవంగా పైకెరిగి పర్వతం మీద నాలుగు మూలలా తిరిగి ఒక మోపెడు మొక్కలు కట్టి కిందికి విసరగా జాంబవంతుడు పట్టుకున్నాడు. హనుమ గిరిశిఖరం యధాస్థానంలో పెట్టి రావటానికి వెళ్ళాడు. సుషేణుడి కిందికి వచ్చి గుప్పెడు మొక్కలి ఆకు రాయివంటి తన పాణీతలం మీద నలిపి రసం కొబ్బరి చిప్పలో పట్టి లక్ష్మణుని నాసికా రంధ్రాలలో బొట్లుగా వేసాడు. మరొక రకం మొక్కలు విశల్యకరణిని నూరి కల్కంగా చేసి వక్షం మీద గాయంలో పెట్టి తెల్ల వస్త్రంతో కట్టుకట్టాడు. కొన్ని క్షణాలలో రక్తస్రావం కట్టింది. తల అటూ యిటూ కదిల్చి అబ్బా" అని మూలిగాడు సౌమిత్రి. సంజీవని తీసి వాసన చూపించాడు. వెంటనే కళ్ళు తెరిచి లేచికూర్చున్నాడు లక్ష్మణుడు. వానరులంతా విచారంవదలి ఆనందంతో ఎగిరి గంతులు వేస్తున్నారు. రామచంద్రుడు తమ్ముని పొదివి పట్టుకున్నాడు.

"సుషేణా, జాంబవంతా! సుగ్రీవా! మళ్ళీ మన లక్ష్మణుడు లేచాడయ్యా! మీరంతా చేస్తున్న సహాయానికి కృతజ్ఞుడను" అన్నాడు రాముడు.

"రామా! నువ్వు మా కపికులానికి చేసిన సహాయంలో యిది యేపాటిది. అయినా మనమధ్య భేదమేముంది. నీ తమ్ముడు మా అందరికి ప్రీతిపాత్రుడు కదా!" అన్నాడు సుగ్రీవుడు. ఈలోగా హనుమ వచ్చేసాడు. కపులంతా - "మహావీర! హనుమాన్‌కు జయము జయము" అని కేరింతలు కొట్టారు.

"లక్ష్మణ ప్రాణదాతగా కీర్తి నొందుతావు నాయనా! నీ ఋణం తీర్చుకోలేను" అని రామచంద్రుడు హనుమను ఆలింగనం చేసుకోగా, యిద్దరూ ఆనంద బాష్పాలురాల్చారు.



52. రామాయణ ఉపసంహారము

శ్రీరామచంద్రుడు అనేక అస్త్రశస్త్రాలు ప్రయోగించి విఫలుడై, రావణుని సంహరించడానికి చివరకు బ్రహ్మాస్త్రాన్ని తీసాడు. రెక్కలందు వాయుదేవుడు, శల్యములందు సూర్యాగ్నులు నిక్షిప్తమై సువర్ణనిర్మితమైన బ్రహ్మాస్త్రం అమ్ముల పొది నుండి బైటకు తీయగానే గగనతలంలో వీరి యుద్ధాన్ని వీక్షిస్తున్న యక్ష కిన్నెరగంధర్వదేవమునిగణాలన్నీ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని శ్రీరామ నిర్ణయం విజయం తెచ్చిపెడుతుందని ఆనందంతో, ఉత్కంఠభరితులై వున్నారు. మంచి పింజులుగలిగి; రాక్షసుల మేదోరక్తములందు తడిసి వారి ప్రాణాలు హరించిన బ్రహ్మాస్త్రం మొదట ఇంద్రుడు ఉపయోగించి రాక్షససంహారం చేసాడు. అనంతరం బ్రహ్మ దానిని అగస్త్యమహర్షికి యివ్వగా ఆయన శ్రీరామునికి అనుగ్రహించాడు. మాతలి తెచ్చిన దేవరథం నుండి దాశరథి, తన విశాలనేత్రాలతో దశకంఠుని కోపంగా చూస్తూ అస్త్రాన్ని అల్లెతాటికి సంధించి విల్లు బలంగా వంచి చతుర్ముఖ బ్రహ్మదేవుని స్మరించి, ఆకర్ణాంతము లాగి శరాన్ని వదిలాడు. రెప్పపాటు కాలంలో అది పిడుగులు పడిన శబ్దం, భూమిపై వేల సూర్యులుదయించిన మెరుపులు సృష్టిస్తూ రివ్వున వెళ్ళి రావణుని కఠిన శిలాసదృశమైన వజ్రకవచాన్ని అంతకంటె బలిష్ఠమైన నల్లని వక్షస్థలాన్ని చీల్చుకుంటూ అవతలవరకు పెనురంధ్రం చేసి, భూమిలోనికి చొచ్చుకు పోయింది. ఇంద్రుని చేత కొట్టబడిన వృత్రాసురుని వలె భీకర మృత్యురావం చేస్తూ, తన యిరవై చేతులు అల్లల్లాడిస్తూ, యిరవై కనుగ్రుడ్లు పైకి పొడుచుకు రాగా, పది నాలుకలు ముఖముల నుండి ఆడిస్తూ మొదలు నరికిన చెట్టులా ఒకప్రక్కకు నిటారుగా రథచక్రాలపై పడి ఆ వేగానికి దూరంగా కొట్టబడి కాళ్ళు చేతులు తన్నుకుంటూ దశకంఠుని దేహం ధూళిదూసరితమై భూపతనమైంది. రక్తపుమడుగులో రావణుని పదితలలు హాహాకారలు చేస్తూ చివరిశ్వాస విడిచాయి. తమ రాజు మరణించడంతో రాక్షససేనలు రోదిస్తూ నలుదిక్కులా పరుగులు పెడుతూ కకావికలైపోతున్నాయి.

కపిసేనంతా ఆనందసంద్రంలో తేలియాడుతోంది. జాంబవంత సుగ్రీవ అంగద, హనుమ, నల, నీలాదివీరులు, వానరవైద్యుడు సుషేణుడు రామలక్ష్మణులను ఆలింగనం

చేసుకొని, వారికి పాదాభివందనాలు చేస్తూ కుప్పిగంతులు వేస్తున్నారు. తాముకపినాయకులమన్న సంగతి మరచి తోకలు నిక్కబొడిచి, రామలక్ష్మణుల చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తున్నారు. దేవతలు పూలవాన కురిపించి దేవ దుందుభులు మ్రోగిస్తుండగా ఈ వార్త లంకలో సీతమ్మకు తెలిపింది, విభీషణుని భార్య సరమ. ఆమె ఆనందంతో పులకించిపోతోంది. భర్త రాకకై వేయికన్నులతో ఎదురు చూస్తోంది.

శ్రీరామదర్శనం కోసం, రామకరస్పర్శకోసం, రాముని ప్రియమైన పలకరింపు కోసం వడలెల్లా కనులై ఆశగా ఎదురుచూచిన జానకీదేవికి అశనిపాతంలా అగ్నిపరిక్ష ఎదురైంది. అయినా ఆమె భగ భగమండే జ్వాలల్లో ప్రవేశించి, శిగలో తురిమిన సంపెంగలు కసికందకుండా అగ్నిభట్టారకుని చేత పైకి తేబడి కడిగిన ముత్యంలా నిష్కళంక చరితయై రామునికి అప్పగించబడింది. లక్ష్మణ, విభీషణ సుగ్రీవ హనుమదాదులంతా సీతారాములను జయజయధ్వానాలతో శ్లాఘిస్తుండగా వారు పుష్పక విమానం ఎక్కి అయోధ్యకు బయలుదేరారు. రామచంద్రుడు వైదేహిని తన అంకపీఠం మీద కూర్చుండబెట్టుకుని, త్రికూటపర్వతంపై విశ్వకర్మ నిర్మించిన రమణీయమైన లంకానగరాన్ని, రణభూమి, సేతువు, చూపిస్తూ కిష్కింధకు చేరుకున్నారు. అక్కడ అంతఃపురస్త్రీలను, కొందరు వానరులను ఎక్కించుకుని విమానం విహంగంలా గాలిలోకి లేచింది.

అగస్త్యుని ఆశ్రమం, శరభంగుని ఆశ్రమం, నిషాదరాజు గుహుని శృంగిబేరపురము, సరయూనది ఒడ్డున యజ్ఞవాటికలు, యూపస్తంభములు, ఆకాశ భూపాతాళమార్గాలలో ప్రవహిస్తూ "త్రిపథగము" అని పేరు పొందిన సుందర గంగానదిని చూచుకుంటూ; ఋతుసంబంధం లేకుండా వివిధ ఫలపుష్పాదులతో నిత్యం రమణీయంగా వున్న వనంలోని భరద్వాజమహర్షి ఆశ్రమానికి చేరుకుని అక్కడ విడిది చేసారు, సీతారామలక్ష్మణులు సపరివారంగా. తమ రాకను తెలియజేయడానికి హనుమంతుని నందిగ్రామం పంపించాడు రాముడు. పద్నాలుగు సంవత్సరాలు శ్రీరామపాదుకలనే సింహాసనంపై వుంచి, వాటి ప్రతినిధిగా రాజ్యసంరక్షణ చేసి, అన్న రాకకోసం ఆతృతగా ఎదురుచూస్తున్న భరతుడు ఈవార్త విని పరమానంద భరితుడైనాడు. భరతుని పుష్పకవిమానం మీద ఎక్కించుకుని తన తొడపై కూర్చుండబెట్టుకుని రామచంద్రుడు తమ్ముని ఆనందపరిచాడు.

శత్రుఘ్నుని ఆధ్వర్యంలో రామచంద్రునికి సాదర స్వాగతం లభించింది. రథగజ, తురగ పదాతి సైన్యం, మేళతాళాలు, జానపద ఆటవిక నృత్యబృందాలు ఎదురొచ్చాయి. విప్రులు వేదస్వస్తి పలుకుతూ పూర్ణకుంభాలతో స్వాగతమివ్వగా రామచంద్రమూర్తి సపరివారంగా అయోధ్య చేరుకున్నాడు. అందరికి అతిథిగృహాలు యేర్పాటు చేయబడ్డాయి. నవకాయపిండివంటలతో షడ్రసోపేతమైన భోజనాలు, నృత్యగాత్రరూపక

ప్రదర్శనలు యేర్పాటుచేయబడ్డాయి. కపివీరులంతా మానవ రూపాలు ధరించి, స్వర్ణాభరణాలు చీనిచీనాంబరాలతో దేవతల్లా ప్రకాశిస్తున్నారు. శ్రీరామపట్టాభిషేక యేర్పాట్లు పూర్తయినాయి. పట్టాభిషేక శుభదినం రానేవచ్చింది. ఆనాడు ఆగిపోయిన రామ పట్టాభిషేకం మరల ఈనాడు జరుగుతున్నందుకు సామంతులు, దేశవిదేశాల చక్రవర్తులు, అంతా తరలివచ్చారు. అయోధ్యానగర ప్రజల ఆనందానికి అవధులు లేవు.

జాంబవంతుడు, హనుమ, వేగదర్శి, ఋషభుడు, గంగాయమునా సరస్వతీ సరయుబ్రహ్మపుత్రాది నదుల, పవిత్ర జలాలు తెచ్చారు. సుషేణుడు, నలుడు, గవయుడు, ఋషభుడు నలుదిక్కుల సముద్ర జలాలు తెచ్చి రత్నఖచిత స్వర్ణపాత్రలలో సిద్ధం చేసిన పవిత్రోదకంతో సీతారాములను రత్నపీఠాలపై కూర్చుండబెట్టి పురోహితులు అభిషేకించారు. అనంతరం రాజదంపతులుగా సీతారాములను, యువరాజుగా భరతుని అలంకరించి విశాల రాజమందిరానికి తీసుకునివచ్చారు.

అష్టవసువుల వంటి వశిష్ఠ, వామదేవ, జాబాలి, కాశ్యప, కాత్యాయన, సుయజ్ఞ, గౌతమ, విజయులనే పురోహితులు వేదమంత్రాలు చదువుతూ స్వర్ణకిరీటంతో శ్రీరాముని అలంకరించి మహారాజును, సీతాసాధ్విని మహారాణిని చేసారు. లక్ష్మణుడు అంగీకరించక పోవటం వలన భరతునికి యౌవరాజ్య పట్టాభిషేకం కూడా శీఘ్రంగా చేసారు.

శత్రుఘ్నుడు శ్వేతచ్ఛత్రం పట్టగా, విభీషణ సుగ్రీవులు తెల్లని వింజామరలతో వీవనలు వీచగా శ్రీరామచంద్రుడు చక్రవర్తి అయ్యాడు. దేవేంద్రుడు పంపిన నాయకమణిగల మౌక్తిక హారాన్ని శతపద్మ స్వర్ణాభరణాన్ని వాయుదేవుడు తెచ్చి కానుకగా అందించాడు. గురుపురోహితమంత్రి దండనాధులకు, కపివీరులకు సీతారాములు కానుకలనిచ్చి గౌరవించారు. పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము, అనే యాగాలు నిర్వహించి రామచంద్రుడు పదకొండువేల సంవత్సరాలు ప్రజానురంజకంగా పరిపాలించాడు. ఆయన పాలనలో అంతఃకలహాలు, స్త్రీలకు వైధవ్యం, కరువుకాటకాలు, వ్యాధులు, దొంగతనాలు, దోపిడీలు లేవు. అందరూ సుఖశాంతులతో వర్ధిల్లారు.

ఫలస్తుతి

విశ్వసాహిత్యంలో తొలికావ్యం రామాయణము. శ్రీలక్ష్మీనారాయణుల మానవావతార చరిత్ర సుందరంగా లిఖించి ఆదికవి అయ్యాడు వాల్మీకి. సీతారాముల కథ చదివినా, భక్తిశ్రద్ధాశ్రవణం, మననం, గానం చేసినా, రామనామధ్యానం చేసినా యశోఆయురారోగ్యఐశ్వర్యాలు కలుగుతాయి. పాపప్రక్షాళన జరుగుతుంది. శత్రుజయము, పుత్రసంతానప్రాప్తి విజయము లభిస్తాయి. కష్టనష్టాలు, దారిద్ర్యం

శీఘ్రంగా తొలగిపోతాయి. పుష్పవతులైన యువతులు రామాయణం పఠిస్తే వివాహమై పుత్రసంతానం కలుగుతుంది. దేశాంతరం వెళ్ళిన వారు రామనామ ధ్యానం చేసినా చాలు., మాతృదేశానికి క్షేమంగా చేరుకుంటారు.

మంగళమహత్ శ్రీశ్రీశ్రీ

ద్వావమ్భసి నివేష్టవ్యౌ . గలే బద్ధ్వా దృఢాం శిలామ్

ధనవన్త మదాతారం, దరిద్రం చాతపస్వినమ్

ధనముండి దానము చేయనివానిని, దరిద్రుడై యుండి తపస్సు (నామస్మరణము) చేసికొనని వానిని, ఈ యిద్దరిని మెడకు బండకట్టి నీటిలో పడవేయవలెను.

–విదురనీతి

అహింసావాదము

దుర్గార్గునిలోని దుష్టత్వం చావాలి. దుర్మార్గుడు సన్మార్గుడు కావాలి అని అహింసావాదులంతా కోరుకుంటారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులను ఏ వ్యక్తికావ్యక్తి స్వయంగా అభ్యాస, వైరాగ్యాల ద్వారా అణచుకోవాలని శ్రీకృష్ణపరమాత్మ చెప్పారు. ఇతరులు ఎంత బోధించినా స్వయంకృషి, పశ్చాత్తాపం లేనిదే దుష్టునిలో పరివర్తన రాదు. రావణుడు, దుర్యోధనుడు ఎవరిహితోపదేశం వినకపోవటం వలన మహాసంగ్రామాలు సంభవించాయి. అలా వినని వారున్నంత కాలం ధర్మసంస్థాపన కోసం రణాలు తప్పవు. అహింస అంటే సన్మార్గులు బలైపోవటం కారాదు.


—— Pen, dikatla ——

53. శ్రీరామచంద్ర అష్టోత్తర శత నామ పూజ

1. ఓమ్ శ్రీరామాయ నమః
2. ఓమ్ రామ భద్రాయ నమః
3. ఓమ్ రామ చంద్రాయ నమః
4. ఓమ్ రాజీవలోచనాయ నమః
5. ఓమ్ శ్రీమతే నమః
6. ఓమ్ రాజేంద్రాయ నమః
7. ఓమ్ రఘుపుంగవాయ నమః
8. ఓమ్ జానకీవల్ల భాయ నమః
9. ఓమ్ జైత్రాయ నమః
10. ఓమ్ జిత మిత్రాయ నమః
11. ఓమ్ జనార్దనాయ నమః
12. ఓమ్ విశ్వామిత్ర ప్రియాయ నమః
13. ఓమ్ దాంతాయ నమః
14. ఓమ్ శరణత్రాణ తత్పరాయ నమః
15. ఓమ్ వాలి ప్రమథనాయ నమః
16. ఓమ్ వాగ్మినే నమః
17. ఓమ్ సత్యవాచే నమః
18. ఓమ్ సత్యవిక్రమాయ నమః
19. ఓమ్ సత్యవ్రతాయ నమః
20. ఓమ్ వ్రతధరాయ నమః
21. ఓమ్ సదాహనుమదాశ్రితాయ నమః
22. ఓమ్ కౌసలేయాయ నమః
23. ఓమ్ ఖరధ్వంసినే నమః
24. ఓమ్ విభీషణ పరిత్రాత్రే నమః
25. ఓమ్ విరాధవధ పండితాయ నమః
26. ఓమ్ దశగ్రీవ శిరో హరాయ నమః
27. ఓమ్ సప్తతాళ ప్రభేత్రే నమః
28. ఓమ్ హరకోదండ ఖండనామ నమః
29. ఓమ్ జామదగ్న్య మహాదర్ప నాశనాయ నమః



30. ఓమ్ తాటకాంతకాయ నమః
31. ఓమ్ వేదాంత సారాయ నమః
32. ఓమ్ వేదాత్మనే నమః
33. ఓమ్ భవరోగస్య భేషజాయ నమః
34. ఓమ్ దూషణ శిరోహంత్రే నమః
35. ఓమ్ త్రిమూర్తయే నమః
36. ఓమ్ త్రిగుణాత్మకాయ నమః
37. ఓమ్ త్రివిక్రమాయ నమః
38. ఓమ్ త్రిలోకాత్మనే నమః
39. ఓమ్ పుణ్యచారిత్ర కీర్తనాయ నమః
40. ఓమ్ త్రిలోక రక్షకాయ నమః
41. ఓమ్ ధ్వనినే నమః
42. ఓమ్ దండకారణ్య పుణ్యకృతే నమః
43. ఓమ్ అహల్యాశాప శమనాయ నమః
44. ఓమ్ పితృ భక్తాయ నమః
45. ఓమ్ వరప్రదాయ నమః
46. ఓమ్ జితేంద్రియాయ నమః
47. ఓమ్ జిత క్రోధాయ నమః
48. ఓమ్ జిత మిత్రాయ నమః
49. ఓమ్ జనార్ధనాయ నమః
50. ఓమ్ ఋక్షవారక సంఘాతినే నమః
51. ఓమ్ చిత్రకూట సమాశ్రయాయ నమః
52. ఓమ్ జయంత త్రాణ తత్పరాయ నమః
53. ఓమ్ సుమిత్రాపుత్ర సేవితాయ నమః
54. ఓమ్ సర్వదేవాది దేవాయ నమః
55. ఓమ్ సదా వానర సేవితాయ నమః
56. ఓమ్ మహా భోగాయ నమః
57. ఓమ్ మహా భుజాయ నమః
58. ఓమ్ మాయా మారీచ హంత్రే నమః
59. ఓమ్ సర్వదేవ స్తుత్యాయ నమః



60. ఓమ్ సౌమ్యాయ నమః
61. ఓమ్ బ్రహ్మణ్యాయ నమః
62. ఓమ్ ముని సంస్తుతాయ నమః
63. ఓమ్ మహాయోగినే నమః
64. ఓమ్ మహోదరాయ నమః
65. ఓమ్ సుగ్రీవేప్సిత రాజ్యదాయ నమః
66. ఓమ్ సర్వ పుణ్యాది ఫలాయ నమః
67. ఓమ్ స్మృత సర్వాఘ నాశనాయ నమః
68. ఓమ్ ఆది పురుషాయ నమః
69. ఓమ్ మహా పురుషాయ నమః
70. ఓమ్ పురాణ పురుష స్తుతాయ నమః
71. ఓమ్ పుణ్యోదయాయ నమః
72. ఓమ్ దయాసాగరాయ నమః
73. ఓమ్ పురాణ పురుషోత్తమాయ నమః
74. ఓమ్ స్మిత వక్త్రాయ నమః
75. ఓమ్ మిత భాషిణే నమః
76. ఓమ్ పూర్వ భాషిణే నమః
77. ఓమ్ రాఘవాయ నమః
78. ఓమ్ అనంతగుణ గంభీరాయ నమః
79. ఓమ్ ధీరోదాత్త గుణాశ్రయాయ నమః
80. ఓమ్ మాయా మానుష చరిత్రాయ నమః
81. ఓమ్ మహాదేవాది పూజితాయ నమః
82. ఓమ్ సేతుకృతే నమః
83. ఓమ్ జిత వారాశయే నమః
84. ఓమ్ సర్వ తీర్ధ మయాయ నమః
85. ఓమ్ హరయే నమః
86. ఓమ్ శ్యామాంగాయ నమః
87. ఓమ్ సుందరాయ నమః
88. ఓమ్ శూరాయ నమః
89. ఓమ్ పీతవాససే నమః



90. ఓమ్ ధనుర్ధరాయ నమః
91. ఓమ్ సర్వయజ్ఞాధిపాయ నమః
92. ఓమ్ యజ్వినే నమః
93. ఓమ్ జరామరణ వర్జితాయ నమః
94. ఓమ్ శివలింగ ప్రతిష్ఠాత్రే నమః
95. ఓమ్ సర్వాభరణభూషితాయ నమః
96. ఓమ్ పరమాత్మనే నమః
97. ఓమ్ పరబ్రహ్మణే నమః
98. ఓమ్ సచ్చిదానందవిగ్రహాయ నమః
99. ఓమ్ పరస్మై జ్యోతిషే నమః
100. ఓమ్ పరస్మై ధామ్నే నమః
101. ఓమ్ పరాకాశాయ నమః
102. ఓమ్ పరాత్పరాయ నమః
103. ఓమ్ పరేశాయ నమః
104. ఓమ్ పారగాయ నమః
105. ఓమ్ పారాయ నమః
106. ఓమ్ సర్వదేవాత్మకాయ నమః
107. ఓమ్ శివపూజితాయ నమః
108. ఓమ్ దాశరథే నమః



శ్రీ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

నానావిధ పరిమళ పత్ర పుష్పాణి సమర్పయామి

అని అక్షతలు ఉదకము వదలిపెట్టవలెను.

శ్రీరామచంద్ర ప్రసాదం శిరసా గృహ్ణామి.

శ్రీరామ తారకమంత్రము యథాశక్తి జపించవలెను.

తారక మంత్రము

శ్రీ రామ

జయ రామ

జయ జయ రామ

54. శ్రీ సీతామహాసాధ్వి అష్టోత్తర శత నామావళి

1. ఓమ్ శాంతయై నమః
2. ఓమ్ మహేశ్వర్యై నమః
3. ఓమ్ నిత్యాయై నమః
4. ఓమ్ శాశ్వత్యై నమః
5. ఓమ్ పరమాక్షరాయై నమః
6. ఓమ్ అచింత్యాయై నమః
7. ఓమ్ కేవలాయై నమః
8. ఓమ్ అనంతాయై నమః
9. ఓమ్ శివాత్మనే నమః
10. ఓమ్ పరమాత్మికాయై నమః
11. ఓమ్ జానక్యై నమః
12. ఓమ్ మిథిలానందాయై నమః
13. ఓమ్ రాక్షసాంతవిధాయిన్యై నమః
14. ఓమ్ రమ్యాయై నమః
15. ఓమ్ రామ వక్షస్థలస్థాయై నమః
16. ఓమ్ ప్రాణేశ్వర్యై నమః
17. ఓమ్ ప్రాణరూపాయై నమః
18. ఓమ్ ప్రధాన పురుషేశ్వర్యై నమః
19. ఓమ్ సర్వ శక్త్యై నమః
20. ఓమ్ కాలాయై నమః
21. ఓమ్ కాష్ఠాయై నమః
22. ఓమ్ జ్యోత్స్నాయై నమః
23. ఓమ్ ఇందుమహిమా స్పదాయై నమః
24. ఓమ్ పురాత్మ్యై నమః
25. ఓమ్ చిన్మయ్యై నమః
26. ఓమ్ పుంసమాద్యై నమః
27. ఓమ్ భూతాంత రాత్మనే నమః
28. ఓమ్ కూటస్థాయై నమః
29. ఓమ్ మహా పురుష సంజ్ఞితాయై నమః



30. ఓమ్ పురుష రూపిణ్యై నమః
31. ఓమ్ స్వకార్యాయై నమః
32. ఓమ్ కార్యజనన్యై నమః
33. ఓమ్ బ్రహ్మేశాయై నమః
34. ఓమ్ బ్రహ్మ సంశ్రయాయై నమః
35. ఓమ్ వ్యక్తాయై నమః
36. ఓమ్ ప్రథమ జాయై నమః
37. ఓమ్ బ్రహ్మణ్యై నమః
38. ఓమ్ మహాత్మనే నమః
39. ఓమ్ జ్ఞానరూపిణ్యై నమః
40. ఓమ్ మహేశ్వర్యై నమః
41. ఓమ్ సముత్పన్నాయై నమః
42. ఓమ్ భుక్తిముక్తి ఫల ప్రదాయై నమః
43. ఓమ్ సర్వేశ్వర్యై నమః
44. ఓమ్ సర్వ వర్ణాయై నమః
45. ఓమ్ నిత్యాయై నమః
46. ఓమ్ ముదిత మాన సాయై నమః
47. ఓమ్ వాసవ్యై నమః
48. ఓమ్ వరదాయై నమః
49. ఓమ్ వాచ్యాయై నమః
50. ఓమ్ కర్త్ర్యై నమః
51. ఓమ్ సర్వార్థసాధికాయై నమః
52. ఓమ్ వాగీశ్వర్యై నమః
53. ఓమ్ సర్వ విద్యాయై నమః
54. ఓమ్ మహా విద్యాయై నమః
55. ఓమ్ సుశోభనాయై నమః
56. ఓమ్ శోభాయై నమః
57. ఓమ్ వంశ కర్త్ర్యై నమః
58. ఓమ్ లీలాయై నమః
59. ఓమ్ మానిన్యై నమః



60. ఓమ్ పరమేష్ఠిన్యై నమః
61. ఓమ్ త్రిలోక సుందర్యై నమః
62. ఓమ్ కామ చారిణ్యై నమః
63. ఓమ్ విరూపాయై నమః
64. ఓమ్ సురూపాయై నమః
65. ఓమ్ భీమాయై నమః
66. ఓమ్ మోక్ష ప్రదాయిన్యై నమః
67. ఓమ్ భక్తార్తినాశిన్యై నమః
68. ఓమ్ భవ్యాయై నమః
69. ఓమ్ భవభావని వాశిన్యై నమః
70. ఓమ్ వికృత్యై నమః
71. ఓమ్ శాంకర్యై నమః
72. ఓమ్ శాంత్యై నమః
73. ఓమ్ గంధర్వ యక్ష సేవితాయై నమః
74. ఓమ్ వైశ్వానర్యై నమః
75. ఓమ్ మహా శీలాయై నమః
76. ఓమ్ దేవసేనాయై నమః
77. ఓమ్ గృహ ప్రియాయై నమః
78. ఓమ్ హిరణ్యాయ్యై నమః
79. ఓమ్ మహారాత్రై నమః
80. ఓమ్ సంసార పరివర్తి కాయై నమః
81. ఓమ్ తారిణ్యై నమః
82. ఓమ్ సురూపాయై నమః
83. ఓమ్ సుమాలిన్యై నమః
84. ఓమ్ భావిన్యై నమః
85. ఓమ్ ప్రభాయై నమః
86. ఓమ్ జగత్ప్రియాయై నమః
87. ఓమ్ జగన్మూర్త్యై నమః
88. ఓమ్ అమృతాశ్రయాయై నమః
89. ఓమ్ నిరాశ్రయాయై నమః



90. ఓమ్ నిరాహారాయై నమః
91. ఓమ్ నిరంకుశాయై నమః
92. ఓమ్ రణోద్భవాయై నమః
93. ఓమ్ శ్రీఫల్యై నమః
94. ఓమ్ శ్రీమత్యై నమః
95. ఓమ్ శ్రీశాయై నమః
96. ఓమ్ శ్రీనివాసాయై నమః
97. ఓమ్ హరిప్రియాయై నమః
98. ఓమ్ శ్రీకర్త్యై నమః
99. ఓమ్ కామప్రియాయై నమః
100. ఓమ్ శ్రీధరాయై నమః
101. ఓమ్ ఈశవర్తిన్యై నమః
102. ఓమ్ శ్రీవేదవత్యై నమః
103. ఓమ్ శ్రీహనుమ దాశ్రితాయై నమః
104. ఓమ్ మహాలక్ష్మ్యై నమః
105. ఓమ్ సరసామృత ధాత్ర్యై నమః
106. ఓమ్ పట్టాభిరామ ప్రియాయై నమః
107. ఓమ్ కోదండరామ ప్రియాయై నమః
108. ఓమ్ ఇందిరావతారాయై నమః



శ్రీసీతా దేవ్యై నమః నానావిధ పరిమళ పత్ర పుష్పాది సమర్పయామి.

శ్రీ సీతారాములకు వడపప్పు, ఆవుపాలతో చేసిన క్షీరాన్నము నైవేద్యము పెట్టి, కర్పూర నీరాజనము యివ్వవలెను.

55. శ్రీ ఆంజనేయ స్వామి పూజా విధానము

ఆసేతు హిమాచల పర్యంతం ఆంజనేయస్వామి భక్తులున్నారు. ఆంధ్రులు అమెరికా, ఇంగ్లాండ్, జపాన్, జర్మనీ వంటి అనేక దేశాల్లో వున్నారు. సమయం అందుబాటులో వున్నపుడు పురోహితుడ్ని నియమించుకుని పూజ చేయించుకోవచ్చు. లేదా తమకు తాముగా ఈ పూజావిధానం చదువుకొని భక్తి ప్రపత్తులే ప్రధానంగా సమీరపుత్రుని అర్చించుకొనవచ్చు. ప్రతి నిత్యం శ్రీ సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామివారి పటాన్ని గాని విగ్రహాన్ని గాని పెట్టి పూజ చేసుకుంటే

ఉత్తమము. వైశాఖ బహుళ దశమి నాడు హనుమ పుట్టిన రోజు. ఆ రోజుగాని, మంగళ, శనివారాలలోగాని తలస్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా గాని, బంధు మిత్రులతో సామూహికంగా గాని మారుతిని అర్చించి అభీష్టసిద్ధి పొందండి. పూజ చేసేముందు లభ్యమైన పుష్పాలు ఫలాలు ఫలహారాలు సిద్ధం చేసుకోండి. కాని దాని కన్న ముఖ్యమైనది ప్రశాంతమైన మనస్సు. శుద్ధస్పటిక సదృశ నిర్మలాంతరంగము ప్రధానము. కామక్రోధలోభమోహమద మాత్సర్యాదులను దూరంగా వుంచి పూజకుపక్రమించడం వలన సత్ఫలితాన్ని పొందగలము. శివానందలహరిలో శ్లోకం చూడండి -

గభీరే కాసారే విశతి విజనే ఘోర విపినే
విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతిః
సమర్ప్యైకం చేతస్సరసిజ ముమానాథ! భవతే
సుఖే నావస్థాతుం జన ఇహ న జానాతి కిమహో!

ఓ పార్వతీమాతా! మందబుద్ధియైన మనుజుడు నీ పూజకై పూలనిమిత్తం లోతైన తటాకాల్లో తామరలు కలువలకోసం దిగుతున్నాడు. నిర్జనమైన భీకరారణ్యంలోను, పెద్ద పర్వతాలమీద క్రూరమృగాలు తిరిగేచోట కూడా తిరుగుతున్నాడు. తనలోనే వున్న ప్రధానమైన హృదయకమలాన్ని నీ కొరకు సమర్పించి సుఖంగా ఎందుకుండడు? ఇది ఆశ్చర్యము. నిర్మల హృదయం భగవదర్పితమైనచో బ్యాహ్యాడంబరములైన పుష్పఫలసుంగధాక్షత చందన కర్పూరాదులతో పనిలేదని భావము. ఈ శ్లోకం ప్రాచీనమైనది కనుక ఆనాటి మానవులు పుష్పాదుల కోసం ప్రయాసపడేవారు. యిప్పుడన్నీ బజారులో దొరుకుతున్నాయి కదా! వాటితో పాటు అంతరంగ పద్మాన్ని కూడా భగవదర్పితంచేసి పూజ కుపక్రమించండి.

ఆవునేతితో జంట వత్తులు వేసి దీపారాధన చేస్తే అది ఉత్తమము. మోక్షప్రాప్తినిస్తుంది. నువ్వుల నూనె దీపారాధన సకల సంపత్తులనిస్తుంది అది మధ్యమము. అవిశె లేదా ఆవాల నూనెతో దీపారాధన చేస్తే శత్రువులు నశిస్తారు. ఇప్పనూనె దీపం ఇహభోగాలనిస్తుంది. ఇది అధమము. ఆవునెయ్యి కలిపిన గేదె నేతితో కూడా దీపారాధన చెయ్యవచ్చును దోషము లేదు.

దీపారాధన చేసి నమస్కరించి.......

ఆచమనం

మంత్రం చదువుతూ మూడుసార్లు నీటిని ఉద్ధరిణితో తీసుకుని త్రాగుతూ........

1. ఓమ్ కేశవాయ స్వాహా
2. ఓమ్ నారాయణాయ స్వాహా
3. ఓమ్ మాధవాయ స్వాహా. . . కుడిచేతిని కడుగుకొని
4. ఓమ్ గోవిందాయ నమః
5. ఓమ్ మధుసూదనాయ నమః
6. ఓమ్ త్రివిక్రమాయ నమః
7. ఓమ్ వామనాయ నమః
8. ఓమ్ హృషీకేశాయ నమః
9. ఓమ్ పద్మనాభాయ నమః
10. ఓమ్ వాసుదేవాయ నమః
11. ఓమ్ శ్రీధరాయ నమః
12. ఓమ్ దామోదరాయ నమః
13. ఓమ్ సంకర్షణాయ నమః
14. ఓమ్ ప్రద్యుమ్నాయ నమః
15. ఓమ్ అనిరుద్ధాయ నమః
16. ఓమ్ పురుషోత్తమాయ నమః
17. ఓమ్ అధోక్షజాయ నమః
18. ఓమ్ నారసింహాయ నమః
19. ఓమ్ అచ్యుతాయ నమః
20. ఓమ్ జనార్ధనాయ నమః
21. ఓమ్ ఉపేంద్రాయ నమః
22. ఓమ్ పురుషోత్తమాయ నమః
23. ఓమ్ హరయే నమః
24. ఓమ్ శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః



భూమి శుద్ధి



ఉత్తిష్ఠంతు భూతపిశాచాః
యేతే భూమి భారకాః
ఏతేషా మవిరోధేన
బ్రహ్మ కర్మ సమారభే ॥

ప్రాణాయామము చేయవలెను :

సంకల్పము :-

మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా, శ్రీపరమేశ్వర ముద్దిశ్య శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం, శుభే శోభనే ముహూర్తే శ్రీ మహావిష్ణో రాజ్ఞాయా ప్రవర్తమానస్య అద్యబ్రాహ్మణః ద్వితీయ పరార్ధే శ్వేత వరాహ కల్పే; వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రధమపాదే, జంబూద్వీపే, భరత వర్షే, భరత ఖండే, మేరోర్దక్షిణ దిగ్భాగే, శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే, గంగా గోదావర్యోర్మధ్య ప్రదేశే, శోభనేగృహే, సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర సన్నిధౌ –


అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన, ప్రభవాది సంవత్సరాణాం మధ్యే....... నామ సంవత్సరే...... అయనే..... ఋతౌ...... మాసే...... పక్షే...... తిథౌ...... వాసరే శుభనక్షత్రే శుభయోగే శుభకరణే ఏవంగుణ విశేషణ విశిష్ఠాయాం శుభతిథౌ (వ్యక్తిగతము ఒక్కరే అయినచో) అస్మాకం (అని చెప్పుకోవాలి)... (కుటుంబమంతా అయినచో) సహకుటుంబానాం అస్మాకం, (ఎక్కుమంది అయిన) సహసమాజానాం క్షేమ, స్థైర్య విజయ, అభయ, ఆయురారోగ్య, ఐశ్వర్యాభివృద్ధ్యర్థం, ధర్మార్ధకామమోక్ష, చతుర్విధ ఫల పురుషార్ధ సిద్ధ్యర్థం; పుత్రపౌత్రాభి వృద్ధ్యర్థం, ఇష్ట కామ్యార్ధ సిద్ధ్యర్థం, సమస్త సన్మంగళ ఫలా వాప్త్యర్థం, సమస్త శత్రుపీడా వినాశనార్థం; యధాజ్ఞానం యధా మిళితోపచారైః శ్రీహనుమద్దేవతా పూజాంకరిష్యే.

తదాదౌ నిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం శ్రీమహాగణాధిపతి పూజాం కరిష్యే, తదంగ కలశారాధనం కరిష్యే. (మనం చేయదలుచుకున్న మారుతి పూజకు సంకల్పం చెప్పుకున్నాము. తరువాత ఆ కార్యక్రమం నిర్విఘ్నంగా పరిసమాప్తి కావడానికి అద్వైతులైతే గణపతిని; విశిష్టాద్వైతులైతే విష్వక్సేనుని పూజించాలి. అందులో భాగంగా కలశం పెట్టి ముందు దానికి పూజ చెయ్యాలి. కలశం అంటే వెండి, రాగి, ఇత్తడి చెంబు దేనినైనా తీసుకుని పవిత్రమైన జలంతో పూరించి, దానికి మూడు వైపులా గంధం కుంకుమలతో బొట్లుపెట్టి, మామిడాకులు చెంబులో అమర్చి దానిపై శిఖగల కొబ్బరికాయను అమర్చి ఆ పీచుపై రవికెలగుడ్డను టోపీలా అమర్చాలి. ఈ విధానం అందరికి తెలిసినదే అయినా తెలియని వారికోసం వివరించడం జరిగింది.)

కలశ పూజ

శ్లో : **కలశస్యముఖే విష్ణుః కంఠే రుద్రస్సమాశ్రితః**
మూలే తత్రస్థితో బ్రహ్మ మధ్యే మాతృగణాస్మృతా
కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపా వసుంధరాః
ఋగ్వేదో-థ యజుర్వేద స్సామవేదో హ్యథర్వణః

కలశం యొక్క ముఖ భాగమందు శ్రీ మహావిష్ణువు, కంఠ భాగమందు శివపరమాత్మ, మూలమందు చతుర్ముఖబ్రహ్మ నివసిస్తుంటారు. కలశ మధ్య భాగంలో మహాలక్ష్మి, పార్వతీ, సరస్వతులు అంటే మానవాళికి మాతృదేవతలు నివసిస్తుంటారు. కలశంలోపల అన్ని సముద్రములు, సప్తద్వీపములు, భూమి, ఋగ్వేదము, అధర్వణవేదము, యజుర్వేవేదము, సామవేదము వుంటాయి. బ్రహ్మాండానికి సూక్ష్మరూపం మనం స్థాపించుకున్న కలశము. అందువల్ల దాని స్థాపనలోను, పూజించటంలోను శ్రద్ధాభక్తులు ఉండాలి.



అంగైశ్చ సహితా స్సర్వే
కలశాంబు సమాశ్రితాః
గంగేచ యమునేచైవ
గోదావరి సరస్వతి
నర్మదా సింధు కావేర్యో
జలేస్మిన్ సన్నిధిం కురు

అయాంతు శ్రీమహాగణపతి పూజార్థం మమ దురితక్షయ కారకాః కలశోదకేన దేవం, ఆత్మానం చ పూజాద్రవ్యాణి సంప్రోక్ష్య.

శ్రీమహా గణాధిపతి పూజ



ప్రార్థన

వక్రతుండ మహాకాయం
సూర్యకోటి సమప్రభం
అవిఘ్నం కురు మే దేవ
సర్వకార్యేషు సర్వదా !

వంపుతిరిగిన తొండముగల గణపతి ప్రభూ! మహా గొప్ప శరీరముగల వాడా! కోటిమంది సూర్యుల కాంతి గలవాడా! నేను (మేము) తలపెట్టిన పనులకు ఆటంకం రాకుండా చెయ్యి, అన్ని కార్యాలు నిర్విఘ్నంగా అన్ని వేళలా కొనసాగేలా అనుగ్రహించు దేవా !

శ్రీమహాగణాధి పతయే నమః స్థిరోభవ! వరదోభవ, సుముఖోభవ, సుప్రసన్నోభవ, స్థిరాసనం కురు.

ఓం శ్రీమహాగణాధిపతయే నమః ధ్యాయామి అవాహయామి, రత్న సింహాసనం సమర్పయామి, పాదయోః పాద్యం సమర్పయామి, హస్తయోః అర్ఘ్యం సమర్పయామి,

ముఖే ఆచమనీయం సమర్పయామి, స్నానం సమర్పయామి, వస్త్రయుగ్మం సమర్పయామి, యజ్ఞోపవీతం సమర్పయామి, శ్రీగంధం సమర్పయామి, అక్షతాన్ సమర్పయామి.

పుష్పాలతో పూజ :-



1. ఓమ్ సుముఖాయ నమః
2. ఓమ్ ఏకదంతాయ నమః
3. ఓమ్ జటిలాయ నమః
4. ఓమ్ గజకర్ణాయ నమః
5. ఓమ్ లంబోదరాయ నమః
6. ఓమ్ వికటాయ నమః
7. ఓమ్ విఘ్నరాజాయ నమః
8. ఓమ్ గణాధిపాయ నమః
9. ఓమ్ ఫాలచంద్రాయ నమః
10. ఓమ్ గజాననాయ నమః
11. ఓమ్ వక్రతుండాయ నమః
12. ఓమ్ శూర్పకర్ణాయ నమః
13. ఓమ్ హేరంబాయ నమః
14. ఓమ్ స్కంధపూర్వజాయ నమః
15. ఓమ్ శ్రీమహాగణాధిపతయే నమః

ధూపమాఘ్రాపయామి, దీపం దర్శయామి, ఆచమనీయం సమర్పయామి, నైవేద్యం సమర్పయామి, తాంబూలం సమర్పయామి, నీరాజనం దర్శయామి, సువర్ణ మంత్ర పుష్పం సమర్పయామి, ఆత్మ ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

అనేన ధ్యానావాహనాది షోడశోపచార పూజయాచ భగవాన్ సర్వాత్మకః శ్రీమహాగణాధిపతి స్సుప్రీత స్సుప్రసన్నో వరదో భవతు శ్రీగణేశ ప్రసాదం శిరసా గృహ్ణామి.



శ్రీ

శ్రీ ఆంజనేయస్వామి పూజ ప్రారంభము

శ్రీరామధ్యానము

వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహా మంటపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితం

అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం

వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలం.

పుష్పక విమానంలో బంగారు మంటపము నందు, కల్పవృక్ష ఛ్ఛాయలలో వీరులు కూర్చునే మణిమయ ఆసనంమీద, మునులు, భరతాది పరివారం చుట్టూవుండగా, మంచి మాటకారియైన వాయునందనుడైన ఆంజనేయస్వామి ముందు భాగంలో రామపాదాల చెంత నమస్కరిస్తూ కూర్చుని సేవిస్తుండగా జానకీమాతతో కూడివున్న నీలిమేఘవర్ణ శరీరచ్ఛాయ గల శ్రీరామచంద్రుని భజిస్తున్నాను.

మారుతి ధ్యానము

శ్లో॥ అతులిత బలధామం స్వర్ణశైలాభదేహం
దనుజవన కృశానుం జ్ఞానినా మగ్రగణ్యం
సకలగుణ నిధానం వానరాణా మధీశం
రఘుపతి ప్రియభక్తం వాతజాతం నమామి.

అమితబల సంపన్నుడు, బంగారు రంగు మేని వర్ణంతో కొండవలె బలిష్ఠమైనదేహం గలవాడు, రాక్షసుల్ని కృశింపజేసేవాడు, జ్ఞానులలో అగ్రస్థానం గలవాడు, అన్ని మంచి గుణాలు గల దేవుడు, వానరులలో శ్రేష్ఠుడు, దాశరథికి ప్రియభక్తుడు, వాయుదేవ తనయుడు అయిన హనుమకు నమస్కరించుచున్నాను.

శ్రీసీతా సమేత శ్రీరామ పాదసేవా దురంధరాయ శ్రీఆంజనేయాయ నమః, ధ్యాయామి, ధ్యానం సమర్పయామి.

శ్లో॥ (1) ఆగచ్ఛ హనుమద్దేవ, త్వం సువర్చలయా సహ
పూజా సమాప్తి పర్యంతం, భవ సన్నిహితో ముదా

శ్రీసీతా సమేత శ్రీరామ............నమః; అని చెప్పిన పై మంత్రం ప్రతి శ్లోకం చివర పఠించాలి. శ్రీహనుమాన్ ఆవాహయామి.

శ్లో॥ (2) భవమార్గజ మహాప్రాజ్ఞ, త్వం మమాభిముఖోభవ.
శ్రీరామసేవకః శ్రీమన్ ప్రసీద జగతాం పతే

హే స్వామిన్, స్థిరోభవ, వరదోభవ, సుముఖోభవ, సుప్రసన్నో భవ, స్థిరాసనం కురు.

శ్లో॥ (3) దేవ దేవ జగన్నాథ కేసరి ప్రియనందన
రత్నసింహాసనం తుభ్యం దాస్యామి హనుమత్ప్రభో

శ్రీసీతాసమేత శ్రీరామ......, నమః; నవరత్నఖచిత స్వర్ణ సింహాసనం సమర్పయామి.

శ్లో॥ (4) యోగిధ్యేయాంఘ్రి పద్మాయ: జగతాంపతయే నమః
పాద్యం మయార్పితం దేవ: గృహాణ పురుషోత్తమ

శ్రీసీతాసమేత శ్రీరామ.... నమః, పాదయోః పాద్యం సమర్పయామి.

శ్లో॥ (5) లక్ష్మణ ప్రాణ సంరక్ష: సీతాశోక వినాశన
గృహాణార్ఘ్యం మయాదత్తం; అంజనా ప్రియనందన

శ్రీసీతాసమేత శ్రీరామ...... నమః; హస్తయోః పాద్యం సమర్పయామి.

శ్లో॥ (6) వాలాగ్ర సేతుబంధాయ: శతానన వధాయ చ,
తుభ్యమాచమనం: దత్తం ప్రతి గృహ్ణీష్వమారుతే॥

శ్రీసీతాసమేత శ్రీరామ..... నమః; ముఖే ఆచమనీయం సమర్పయామి.

శ్లో॥ (7) అర్జున ధ్వజ సంవాస; దశానన మదాపహ
మధుపర్కం ప్రదాస్యామి; హనుమన్ప్రతి గృహ్యతామ్

శ్రీసీతాసమేత శ్రీరామ....... నమః మధుపర్కం సమర్పయామి

శ్లో॥ (8) గంగాది సర్వతీర్థేభ్యః సమానీతై ర్నవోదకైః
భవంతం స్నాప యిష్యామి; కపినాయక గృహ్యతామ్

శ్రీసీతాసమేత శ్రీరామ..... నమః శుద్ధోదకస్నానం సమర్పయామి

శ్లో॥ (9) పీతాంబర మిదం తుభ్యం, తప్తహాటక సన్నిభం
దాస్యామి వానరశ్రేష్ఠ సంగృహాణ నమో2స్తుతే

శ్రీసీతాసమేత శ్రీరామ..... నమః; వస్త్రయుగ్మం సమర్పయామి.

శ్లో॥ (10) బ్రహ్మసూత్ర మిదం దివ్యం: ముక్తాదామోపశోభితం
స్వీకురుష్వంజనీ పుత్ర: భక్తరక్షణ తత్పర

శ్రీసీతాసమేత శ్రీరామ...... నమః; యజ్ఞోపవీతం సమర్పయామి

శ్లో॥ (11) ఉత్తరీయంతు దాస్యామి; సంసారోత్తార కారణ
గృహాణ రమయా ప్రీత్యా; నతోస్మిస్తవ పాదయోః

శ్రీసీతాసమేత శ్రీరామ...... నమః; ఉత్తరీయం సమర్పయామి.

శ్లో॥ (12) భూషణాని మహార్హాణి: కిరీట ప్రముఖాన్యహం
తుభ్యం దాస్యామి సర్వేశ: గృహాణ కపినాయకః

శ్రీసీతాషమేత శ్రీరామ...... నమః; ఆభరణాని సమర్పయామి.

శ్లో॥ (13) కస్తూరి కుంకుమామిశ్రం: కర్పూరాగరు వాసితం
శ్రీచందనంతు దాస్యామి: గృహ్యతాం హనుమత్ప్రభో

శ్రీసీతాసమేత శ్రీరామ..... నమః; దివ్య శ్రీచందనం సమర్పయామి.

శ్లో॥ (14) సుగంధాని సురూపాణి: వన్యానివివిధాని చ

చంపకాదిని పుష్పాణి: కమలాన్యుత్పలాని చ

శ్రీసీతా సమేత శ్రీరామ...... శ్రీఆంజనేయాయ నమః అనేక వర్ణసుగంధ పుష్పాణి సమర్పయామి.

శ్లో॥ (15)తులసీదళ బిల్వాని: మనసా కల్పితానిచ

గృహాణ హనుమద్దేవ: ప్రణతోఽస్మి పదాంబుజే

శ్రీసీతా సమేత శ్రీరామ..... నమః తులసిదళాలు, బిల్వ పత్రాలు నీ పాదపద్మముల చెంత సమర్పించుచున్నాను.

శ్లో॥ 16)శాలీయా నక్షతాన్ రమ్యాన్: పద్మరాగ సమప్రభాన్

అఖండాన్ ఖండిత ధ్వాంత: స్వీకురుష్వదయానిధే

శ్రీసీతాసమేత శ్రీరామ పాదసేవా దురంధరాయ, అంజనీపుత్ర హనుమద్దేవతాయ నమః అక్షతాన్ సమర్పయామి.

అష్టైశ్వర్య ప్రదాత ఉష్ట్రారూఢ మారుతి

అథాంగ పూజ

1. మారుతయే నమః - పాదౌ పూజయామి.
2. సుగ్రీవ సఖాయ నమః - గుల్ఫౌ పూజయామి.
3. అంగద మిత్రాయ నమః - జానునీ పూజయామి
4. రామదాసాయ నమః - ఊరుం పూజయామి.
5. అక్షఘ్నాయ నమః - కటిం పూజయామి.
6. లంకా దహనాయ నమః - వాలం పూజయామి.
7. సంజీవన గ్రాహర్త్రే నమః - స్కంధౌ పూజయామి.
8. సౌమిత్రీ ప్రాణదాతాయ నమః - వక్షస్థలం పూజయామి.
9. కుంఠిత దశకంఠాయ నమః - కంఠం పూజయామి.
10. శ్రీరామభిషేక కారిణే నమః - హస్తౌ పూజయామి.
11. మంత్రరచిత రామాయణాయ నమః - వక్త్రం పూజయామి
12. ప్రసన్న వదనాయ నమః - వదనం పూజయామి.

13. పింగళ నేత్రాయ నమః - నేత్రౌ పూజయామి.
14. శ్రుతి పారాయణాయ నమః - శ్రోత్రౌ పూజయామి.
15. ఊర్ధ్వ పుండ్ర ధారిణే నమః - కపోలం పూజయామి.
16. మణికంఠ మాలాయ నమః - శిరః పూజయామి.
17. సర్వాభీష్ట ప్రదాయ నమః - సర్వాణ్యంగాని పూజయామి.

౫౬. శ్రీ ఆంజనేయస్వామి అష్టోత్తర శతనామ పూజ

1. ఓమ్ ఆంజనేయాయ నమః
2. ఓమ్ మహావీరాయ నమః
3. ఓమ్ హనుమతే నమః
4. ఓమ్ మారుతాత్మజాయ నమః
5. ఓమ్ తత్వజ్ఞాన ప్రదాయ నమః
6. ఓమ్ సీతాదేవి ముద్రా ప్రదాయకాయ నమః
7. ఓమ్ అశోక వనికాచ్ఛేత్రే నమః
8. ఓమ్ సర్వమాయా విభంజనాయ నమః
9. ఓమ్ రక్షోవిధ్వంస కారకాయ నమః
10. ఓమ్ పరశౌర్య వినాశకాయ నమః
11. ఓమ్ పరవిద్యా పరీహారాయ నమః
12. ఓమ్ సర్వబంధ విమోక్త్రే నమః
13. ఓమ్ పరమంత్ర నిరాకర్త్రే నమః
14. ఓమ్ పరమంత్ర ప్రభేద కాయ నమః
15. ఓమ్ సర్వగ్రహ వినాశినే నమః
16. ఓమ్ భీమసేన సహాయ కృతే నమః
17. ఓమ్ సర్వదుఃఖ హరాయ నమః
18. ఓమ్ మనోజవాయ నమః
19. ఓమ్ పారిజాత మూలస్థాయ నమః
20. ఓమ్ సర్వలోక చారిణే నమః
21. ఓమ్ సర్వమంత్ర స్వరూపాయ నమః
22. ఓమ్ సర్వతంత్ర స్వరూపాయ నమః
23. ఓమ్ సర్వయంత్రాత్మికాయ నమః




24. ఓమ్ కపీశ్వరాయ నమః
25. ఓమ్ మహాకాయాయ నమః
26. ఓమ్ సర్వరోగ హరాయ నమః
27. ఓమ్ ప్రభవే నమః
28. ఓమ్ బలసిద్ధికరాయ నమః
29. ఓమ్ సర్వవిద్యా సంపత్ప్రదాయ నమః
30. ఓమ్ కపిసేనా నాయకాయ నమః
31. ఓమ్ భవిష్యచ్చతురాననాయ నమః
32. ఓమ్ కుమార బ్రహ్మచారాయ నమః
33. ఓమ్ రత్నకుండల దీప్తిమతాయ నమః
34. ఓమ్ సంచల ద్వాల సన్నద్ధలంబమాన శిఖోజ్జ్వలాయ నమః
35. ఓమ్ గంధర్వ విద్యా తత్వజ్ఞాయ నమః
36. ఓమ్ మహా బల పరాక్రమాయ నమః
37. ఓమ్ ఓంకార గృహ విమోక్త్రే నమః
38. ఓమ్ శృంఖలాబంధమోచకాయ నమః
39. ఓమ్ సాగరోత్తారకాయ నమః
40. ఓమ్ ప్రాజ్ఞాయ నమః
41. ఓమ్ రామదూతాయ నమః
42. ఓమ్ ప్రతాప వంతాయ నమః
43. ఓమ్ వానరాయ నమః
44. ఓమ్ కేసరీ సూనవే నమః
45. ఓమ్ సీతాశోక నివారకాయ నమః
46. ఓమ్ అంజనా గర్భ సంభూతాయ నమః
47. ఓమ్ బాలార్క సదృశాయ నమః
48. ఓమ్ విభీషణ ప్రియకరాయ నమః
49. ఓమ్ దశగ్రీవ కులాంతకాయ నమః
50. ఓమ్ లక్ష్మణ ప్రాణ దాత్రే నమః
51. ఓమ్ వజ్రకాయాయ నమః
52. ఓమ్ మహాద్భుతాయ నమః
53. ఓమ్ చిరంజీవినే నమః





54. ఓమ్ రామభక్తాయ నమః
55. ఓమ్ దైత్యకార్య విఘాతకాయ నమః
56. ఓమ్ అక్షహంత్రే నమః
57. ఓమ్ కాంచనాభాయ నమః
58. ఓమ్ పంచవక్త్రాయ నమః
59. ఓమ్ మహాతపసే నమః
60. ఓమ్ లంకిణీ భంజనాయ నమః
61. ఓమ్ శ్రీమతే నమః
62. ఓమ్ సింహికా ప్రాణ భంజనాయ నమః
63. ఓమ్ గంధమాదన శైల స్థాయ నమః
64. ఓమ్ లంకాపుర విదాహకాయ నమః
65. ఓమ్ సుగ్రీవ సచివాయ నమః
66. ఓమ్ ధీరాయ నమః
67. ఓమ్ సూరాయ నమః
68. ఓమ్ దైత్య కులాంతకాయ నమః
69. ఓమ్ సురార్చితాయ నమః
70. ఓమ్ మహాతేజసే నమః
71. ఓమ్ రామ చూడామణి ప్రదాయ నమః
72. ఓమ్ కామ రూపిణే నమః
73. ఓమ్ పింగళాక్షాయ నమః
74. ఓమ్ వార్ధి మైనాక పూజితాయ నమః
75. ఓమ్ కబళీకృత మార్తాండ మండలాయ నమః
76. ఓమ్ విజితేంద్రియాయ నమః
77. ఓమ్ రామసుగ్రీవ సంధాత్రే నమః
78. ఓమ్ మహా రావణ మర్దనాయ నమః
79. ఓమ్ స్ఫటికా భాయ నమః
80. ఓమ్ వాగాధీశాయ నమః
81. ఓమ్ నవ వ్యాకృతి పండితాయ నమః
82. ఓమ్ చతుర్బాహవే నమః
83. ఓమ్ దీన బంధవే నమః
84. ఓమ్ మహాత్మనే నమః





85. ఓమ్ భక్త వత్సలాయ నమః
86. ఓమ్ సంజీవన నగాహర్త్రే నమః.
87. ఓమ్ శుచయే నమః
88. ఓమ్ వాఙ్మినే నమః
89. ఓమ్ ధృఢ వ్రతాయ నమః
90. ఓమ్ కాలనేమి ప్రమథనాయ నమః
91. ఓమ్ హరిమర్కట మర్కటాయ నమః
92. ఓమ్ దాంతాయ నమః
93. ఓమ్ శాంతాయ నమః
94. ఓమ్ ప్రసన్నాత్మనే నమః
95. ఓమ్ శతకంఠమదాపహృతే నమః
96. ఓమ్ యోగినే నమః
97. ఓమ్ రామ కథాలోలాయ నమః
98. ఓమ్ సీతాన్వేషణ పండితాయ నమః
99. ఓమ్ వజ్రదంష్ట్రాయ నమః
100. ఓమ్ వజ్రనఖాయ నమః
101. ఓమ్ రుద్రవీర్య సముద్భవాయ నమః
102. ఓమ్ ఇంద్ర జిత్ప్రహితామోఘ బ్రహ్మాస్త్ర నివారకాయ నమః
103. ఓమ్ పార్థధ్వజాగ్ర సంవాసినే నమః
104. ఓమ్ శర పంజర భేదకాయ నమః
105. ఓమ్ దశ బాహవే నమః
106. ఓమ్ లోక పూజ్యాయ నమః
107. ఓమ్ జాంబవత్ప్రీతివర్ధనాయ నమః
108. ఓమ్ సీతా సమేత శ్రీరామ పాదసేవా దురంధరాయ శ్రీఅంజనేయాయ నమః





నానావిధ పరిమళ పత్ర పుష్పాణి సమర్పయామి. ధూప మాఘ్రాపయామి, దీపం దర్శయామి. ధూప దీపానంతరం అచమనీయం సమర్పయామి. పూజలో తమలపాకులు ఉపయోగించిన శ్రేష్ఠము, ఆంజనేయ ప్రీతికరము.

నైవేద్యము :-

అరటిపండ్లు, పటికబెల్లం, టెంకాయలు, పానకం, వడపప్పు, అప్పములు

మొదలైనవి పళ్ళెరాల్లో చేర్చి క్రింది మంత్రం చదువుతూ భగవదర్పితం చెయ్యాలి.

ఓం భూర్భువస్సువః తత్సవితృ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి, ధియో యోనః ప్రచోదయాత్ (అని పై పదార్థాలపై పుష్పంతో పరిశుద్ధోకం చిలకరించి) ఓం శ్రీసీతాసమేత శ్రీరామ పాద సేవా దురాంధరాయ శ్రీఆంజనేయాయ నమః, కదళీఫల; నారికేళశకల, గుడశకల, అపూపాది భక్ష్యాన్ నైవేద్యం సమర్పయామి, ఓం ప్రాణాయ స్వాహా, అపానాయస్వాహా, వ్యానాయ స్వాహా, ఉదానాయస్వాహా, సమానాయస్వాహా, మధ్యే మధ్యే పానీయం సమర్పయామి. ఉత్తరాపోశనం సమర్పయామి. హస్తౌ ప్రక్షాళయామి, పాదౌ ప్రక్షాళయామి, శుద్ధాచమనీయం సమర్పయామి.

తాంబూలము :-

శ్లో॥ పూగీఫల సమాయుక్తం; నాగవల్లీ దళైర్యుతం,
ముక్తాచూర్ణ సమాయుక్తం; తాంబూలం ప్రతి గృహ్యతామ్॥

తాంబూలం సమర్పయామి (తాంబూలము సమర్పించాలి)

నీరాజనము :-

శ్లో॥ స్వర్ణపాత్రస్థితం, చారు ప్రదీప్తం తిమిరాపహం
కర్పూర హారతిం, దివ్యం, స్వీకురుష్వ శివాంశజ॥

నీరాజనం సమర్పయామి. (అగరవత్తులు, హారతికర్పూరం వెలిగించి నీరాజనం యివ్వాలి.)

మంత్ర పుష్పం :-

శ్లో॥ మందారైః పారిజాతైశ్చ; మల్లికాభిశ్చ, చంపకైః
పుష్పాంజలిం ప్రదాస్యామి స్వర్ణపద్మైస్సమన్వితం॥

సువర్ణమంత్ర పుష్పం సమర్పయామి. (శ్రీఆంజనేయస్వామి వారికి సువర్ణమంత్రపుష్పం సమర్పించాలి)

ఆత్మప్రదక్షిణ నమస్కారము :-

1. **ప్రదక్షిణం కరోమిత్వాం, భక్తియుక్తేన చేతసా।**
   బహుజన్మార్జితం పాపం, శమయే ద్వాయునందన॥
2. **యాని కాని చ పాపాని జన్మాంతర కృతాని చ।**
   తాని తాని ప్రణశ్యంతు ప్రదక్షిణ పదే పదే॥

పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాప సంభవః

త్రాహి మాం నరకాద్ఘోరాత్ వాయుపుత్ర నమోస్తుతే॥

(జన్మ జన్మాంతరముల నుండి తెలిసి తెలియక చేసిన పాపముల నుండి నన్ను విముక్తుడ్ని చేసి రక్షించు ఆంజనేయస్వామి అని ప్రార్థించుకొనవలెను)

శ్రీఆంజనేయ ఆత్మప్రదక్షిణ నమస్కారం సమర్పయామి.

శ్రీఆంజనేయస్వామివారికి - ఆత్మ ప్రదక్షిణనమస్కారం సమర్పించుచున్నాను.

అనయా ధ్యానావాహనాది షోడశోపచార పూజయా చ భగవాన్ సర్వాత్మక శ్రీమదాంజనేయస్సు ప్రీతస్సు ప్రసన్నో వరదో భవ త్వితి జలం నిక్షిపేత్ ॥ ఏతత్ఫలం సర్వం శ్రీఆంజనేయ దేవతార్పణమస్తు, శ్రీఆంజనేయస్వామినే నమః యధాస్థానం ప్రవేశయామి. పూజానంతరము స్వామివారి కథాశ్రవణ మననాదులు చేయవలెను.

పూజ సమాప్తము



ద్వాపరయుగమున
శ్రీ ఆంజనేయస్వామివారు

57. ధర్మజ రాజసూయము

వైవస్వత మన్వంతరములోని ఇరువది యెనిమిదవ ద్వాపర యుగములో శ్రీమహావిష్ణువు దేవకీవసుదేవులకు చెఱశాలలో జన్మించాడు. అష్టమగర్భాన పుట్టిన ఆయనకు పుట్టగానే శత్రువు బెడద. ఆ శత్రువు స్వయానా మేనమామ కంసుడే.

అందువల్ల నందవ్రజంలో యశోద గారాబుబిడ్డగా వెన్నముద్దలు తింటూ పెరిగాడు. పాలిచ్చి చంపాలని చూసిన పూతన నుండి శకటాసుర కంసాది శత్రువులను దునుమాడుతూ పెరిగి పెద్దవాడై, అన్న బలరామునితోపాటు యాదవరాజుగా యశోవంతుడవుతున్నాడు. సమకాలీనులైన పాండురాజుపుత్రులు ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవులతో ఆయనకు బాంధవ్యము, మైత్రి రెండూ వున్నాయి. కాని వారు మాత్రం శ్రీకృష్ణుని భగవంతునిగా తమ రక్షకునిగా భావిస్తూ దాయుదులైన కౌరవుల వలన అనేక కష్టాలు పడుతున్నారు.

అంధరాజైన ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు ఇంద్రప్రస్థపురం రాజధానిగా రాజ్యాన్ని యేర్పాటు చేసి యిచ్చాడు. ధర్మరాజుకు వినయసంపన్నులు, వీరులు అయిన నలుగురు తమ్ములు, విష్ణువుకు చతుర్భుజాల వలె వన్నె తెస్తూ ఆయన చేస్తున్న రాజ్యపాలనలోను ధర్మకార్యాలలోను అండగా వుంటున్నారు. శ్రీకృష్ణపరమాత్మ ఆశీస్సులు కూడా కుంతీకుమారులకు మెండుగా వున్నాయి; వారు ధర్మాత్ములు కావున. మునుల ఆశీస్సులు, సామంతుల అండదండలు సజావుగా వుండి కాలం కొంత అనుకూలంగా వుంది ధర్మనందనునికి. అందువల్ల ధౌమ్యుల వారి అనుమతి తీసుకుని రాజసూయయాగం నిర్వహిద్దామని సంకల్పించాడు. జరాసంధుని భీమసేనుడు శ్రీకృష్ణుని సహాయం వలన జయించగా, మిగిలిన నలుదిక్కుల శత్రువుల్ని కూడా ఓడించారు పాండవులు.

వేదపండితులు, పురోహితులు, పరివ్రాజకులు మొదలైన వారి ఆధ్వర్యంలో యాగం సక్రమముగా నిర్వహింపబడుతోంది. విశాలమైదాన భూముల్లో వరుసలుగా అనేక పర్ణశాలలు నిర్మించారు. వాటిలో హోమగుండాలు, ఋత్విక్కుల నివాసాలు, ఉత్తర దిక్కులో అందమైన భవనాలు నిర్మించారు. యితర దేశ రాజులు, అతిధులు, సామంతులు, దూరప్రాంతాల నుండి వచ్చి యాత్రికులు అందరికి వర్ణాశ్రమ ధర్మాల ప్రకారం విశాలమైన పడకలు, విశ్రాంతి మందిరాలు యేర్పాటుచేసారు. అవన్నీ అప్పటికే నిండివున్నాయి. యింకా యాత్రికులు, దూరప్రాంత ప్రజలు వస్తుంటే క్రొత్త భవనాలు విశాలమైన పందిళ్ళు నిర్మిస్తున్నారు. ఆగ్నేయ దిక్కుగా వంటశాలలు ఆ ప్రక్కనే ఎత్తు అరుగులు కట్టి వాటిపై నున్నని తెల్ల పాలరాతి శిలాఫలకాలు అమర్చి, తాటాకు పందిళ్ళు వేసారు. మధ్యలో రెండు తటాకాలు యేర్పాటు చేసారు. మురుగు నీటికాల్వలు తవ్వి వాటిపై నల్లరాళ్ళ పలకలు ముందే నిర్మించారు. ఈ యేర్పాట్లన్ని చాలా చక్కగా మూడుమాసాల ముందునుండే జరిగాయి.

బ్రాహ్మణుల రాకపోకలతో ఇంద్రప్రస్థపురం సందడిగా వుంది. విభూతి రేఖలు నొసట కుంకుమ, వంటి నిండా గంధం పూతలు తెల్లని పట్టు పంచెలు, రాగి చెంబులు

ధర్భలు నున్నటి తలపై ముడివేసిన శిఖలతో సంచరిస్తున్న బ్రాహ్మణ్యంతో రాజవీధులన్నీ సందడిగా వున్నాయి. వాణిజ్యంలో ఐశ్వర్యంతో రాజవీధులన్నీ సందడిగా వున్నాయి. వాణిజ్యంలో ఐశ్వర్యం దండిగా సంపాదించిన వైశ్యులు నల్లరాతిబండల వంటి బొజ్జలతో నుదుట నిలువుగా దిద్దిన నామాలతో మెడనిండా బంగరు గొలుసులు, పులిహోర ఆభరణాలు ధరించి పంచె ఉత్తరీయాలు వేసుకుని బొంగురు గొంతుకలతో మాట్లాడుకుంటూ తమ భార్యపిల్లలు బంధువులతో సందడిగా తిరుగుతున్నారు. రాజులు ఖడ్గాలు, విల్లంబులు, తలపాగలు ధరించి ఠీవిగా నాలుగు గుఱ్ఱాలు, రెండు గుఱ్ఱాలు కట్టిన రధాలపై వెడుతున్నారు. కొన్ని రధాలతో బంగారు కాసుల సంచులు, రత్నాల మూటలు, ఏనుగుదంతాలు మొదలైన విలువైన బహుమానాలు తీసుకు వెళ్ళి ధర్మరాజుకు సమర్పిస్తున్నారు. ఇక పల్లె రైతాంగం రెండెడ్ల బండ్లు, గుఱ్ఱాల బండ్లు, ఒంటెలు కట్టిన బండ్లపై ధాన్యపురాసులు, తినుబండారాలు తయారు చేసేందుకు బెల్లపు కుందులు, నవధాన్యాలు, కాయలు, పండ్లు, తరలించుకుని వచ్చి రాజోద్యోగులకిస్తున్నారు. భటులు నాలుగు వీధుల కూడళ్ళలో నిలిచి ప్రజలకు సహాయ పడుతున్నారు. నేతికుండలు, ఆవు వెన్న భాండాలు, గంధపుచెక్కలు, దూరంగా అడవుల నుండి తెచ్చిన పట్టుతేనె భాండాలు, యజ్ఞవాటికలో వేయడానికి సమిధలు, కర్పూరం, కస్తూరి యివ్వన్నీ ఎప్పటికప్పుడు ఆటవికులు, వ్యాపారస్థులు తెచ్చియిస్తున్నారు.

ఇంద్రప్రస్థపురం యాగవాటికలలో వేసిన అగ్నిగుండంలోని ఆవునేతి పొగలు మేఘమండలం దాకా ఆవరించుకుంటున్నాయి. నేతి వాసనలతో వీధులు భవనాలు నిండిపోయాయి. దేవతలు అదృశ్యరూపులై ఆకాశ విహారాలు చేస్తూ హవిస్సులు ఆస్వాదిస్తున్నారు. సామంతరాజులకు, యోధులకు, అశ్వారోహణం, గజారోహణం, విలువిద్యలు, ఖడ్గనైపుణ్యం, మల్లయుద్ధాలు, ముష్టియుద్ధాలు, వివిధ అంశాలపై పది యోజనాల విస్తీర్ణంగల మైదానభూముల్లో పోటీలు యేర్పాటు చేసారు. నృత్యం, గానం, వాద్యకచ్చేరీలు, నాటకప్రదర్శనలు, జానపద నృత్యాలు, వివిధ చిత్రకళాప్రదర్శనలు అనేక వేదికలపై యేర్పాటు చేసారు. యివ్వన్నీ నకులసహదేవులు పర్యవేక్షిస్తున్నారు. అర్జునుడు అన్న గారి కూడా వుండి రాజసూయయాగం యేర్పాట్లు చూస్తున్నాడు. ఆయన వద్ద అనేకమంది మంత్రులు పనిచేస్తున్నారు.

వచ్చిన అతిధి అభ్యాగతులు యేరోజుకారోజే అసంఖ్యాకంగా వుంటున్నారు. వివిధ దేశాల రాజులు, సామంతులు, శ్రీమంతులు, ఋత్విక్కులు, విప్రులు, వేదపండితులు, నాలుగు వర్ణాల జనసామాన్యం వీరందరికి వేరువేరు పాకశాలలు

వాటి సమీపంలోనే భోజనాల విడుదులు, పందిళ్ళు, బారులు తీర్చిన పంక్తులు యేర్పాటు చేయబడ్డాయి. వంటశాలల నుండి బూరెలు, బొబ్బట్లు, పరమాన్నములు, రకరకాల కూరలు, పులిహోరలు, చక్రపొంగళ్ళు, జీలకర్ర పొంగళ్ళు, మిడి పొంగళ్ళు, నేతిమిఠాయిలు, మినపసున్నులు, అరిశలు, ఆవడలు, అప్పములు, భక్ష్యభోజ్యచోష్యలేహ్య పదార్థాలన్నీ షడ్రుచులతో వండుతున్నారు, బలవంతులు, నేర్పరులు అయిన వంట బ్రాహ్మణులు. ప్రశస్తమైన వరిఅన్నం, పున్నమి వెన్నెల వంటి పెరుగు, జున్ను, పసిపిల్లలకు చిక్కని పాలు, దాహానికి మజ్జిగలు యివ్వన్నీ అందించబడుతున్నాయి. రేయింబవళ్ళ తినేవారు తింటుంటే వడ్డించేవారు వడ్డిస్తూనేవుంటున్నారు. వంటవారికి కంటి మీద కునుకులేదు. ఈ బాధ్యతలన్నీ వంద మంది ధృఢకాయులైన నిపుణులు, ప్రవీణులు అయిన వంట వారి పర్యవేక్షణలో మహాబలశాలి భీమసేనులవారు స్వయంగా నిర్వర్తిస్తున్నారు.

ఉదయ ఫలహారాల నుండి ప్రారంభమైన ఆహార నీటి సరఫరాలు రాత్రి బాగా ప్రొద్దు పోయేవరకు సాగుతున్నాయి. మళ్ళీ మర్నాటి ఉదయానికి పలహారాలు భోజనాలు సిద్ధం చేయించడంలో భీమసేనుల వారికి విశ్రాంతి ఉండటం లేదు. ఎక్కడా ఏ ఒక్కవ్యక్తికి అసౌకర్యం కలుగ కుండా పర్యవేక్షిస్తున్నారాయన. అయితే పరిశుభ్రత కూడా ఒక సమస్యగా తయారైంది. ఎంత మంది పనివాళ్ళు విస్తర్లు తీసి మంచి నీటితో భోజనశాలలన్నీ కడుగుతున్నా దుర్గంధం బయలు దేరింది. ఈ సమస్య ధర్మరాజుల వారి దృష్టికి వెళ్ళకుండా తనే పరిష్కరించాలని భీమసేనుడు సంకల్పించాడు.

ఆయన తన పరివారాన్ని వేల సంఖ్యలో పెంచాడు. వంటశాలలు, వండే పదార్థాలు స్వయంగా కాలినడకన తిరిగి పరిశీలిస్తున్నారు. వంట బ్రాహ్మణులు, వడ్డన బ్రాహ్మణులు, అంగరక్షకులు, పరిశుభ్రం చేసేవారు. పాత్రలు శుభ్రపరిచే ఆడంగులు వీరందర్నీ కూడా సమస్యలేమిటని స్వయంగా అడిగితెలుసుకుంటున్నారు. పరిసరప్రాంతాలలోని జానపదులు, రైతులు, కుమ్మర్లు, కమ్మర్లు, సాలెవారు, యింకా అనేక చేతివృత్తులవారు కుటుంబాలతో సహా వచ్చి అవసరమైన పనులు చేస్తున్నారు. అయినా సందర్శకులు లక్షల సంఖ్యలో వుండటం వలన పరిశుభ్రతాసమస్య రోజురోజుకు జటిలమవుతోంది.

భీమసేనుడు సుమారు ఏడు అడుగులు పొడగరి. విశాలమైన వక్షస్థలం, యినుప గుదియల్లాంటి భుజాలు. పొడవాటి చేతులు. బలిష్ఠమైన కండలు తిరిగిన దేహం. అంతగుండ్రని కోల కాని ముఖం విశాలమైన నుదురు, చెవులకు వేలాడే బంగారు

మకరకుండలాలు. మెడలో మణిపూసలహారం కంఠానికి పట్టినట్లుంది. దానికింద రత్నాల హారాలు. ఎఱ్ఱరంగు పట్టుపంచె దానిపై నడుముకు బంగారు పట్టా, భుజకీర్తులు, మొలను ఖడ్గం. చురుకైన కళ్ళు. గుబురు మీసాలు. సూటిగా వున్న ముక్కు పుసుపుపచ్చని దబ్బపండు వంటి మేనిఛాయ. మహా సుందర పురుషుడాయన. బలిష్ఠుడు. యోధుడు. మల్లయుద్ధ కౌశలుడు. సుయోధనునికి సమవుజ్జీ. అన్నగారికి అనేకమంది సామంతులు, రాజులు, రథాల నిండా సంచులు మూటగట్టించుకొని బంగారు కాశులు, ఆభరణాలు, రత్నాలు కానుకలిస్తున్నారు. ఈ శుభసమయంలో తనకుగా తాను యేదో ఒక కానుక యివ్వాలి. ఆ కానుక భోజనశాలలోని అశౌచాన్ని దుర్గంధాన్ని పోగొట్టేంత పవిత్రత కలిగివుండాలి. లెస్స యోచన! ఈ భూములన్ని పవిత్రం చెయ్యాలంటే కామధేనువు వల్లనే సాధ్యపడుతుంది.

58. భీమసేనుని ప్రయాణము

భీమసేనుడు భోజనశాలలన్నీ తిరుగుతూ పునఃపరిశీలన చేస్తున్నాడు. ఎంతమంది పనివాళ్ళను పెంచినా పరిస్థితి మెరుగు పడలేదు సరికదా యాత్రికులు ఎక్కువవడంతో మరింత దుర్గంధం వస్తోంది. స్వర్గాధిపతి ఇంద్రుని అడిగి కామధేనువు తేవటం త్వరగా కుదిరే పనికాదు. అయినా కామధేనువు దేవతలకు నిత్యం అవసరమే. ఈ పరిసరాలలో తిరగి అశౌచం పోగోట్టదానికి పురుషమృగము సరిపోతుంది. ఆ పురుషమృగాన్ని తేవాలన్నా దేవేంద్రసభయైన సుధర్మకు వెళ్ళితీరాలి. తక్షణమే ప్రయాణమై ఇంద్రసభకు వెళ్ళి పురుషమృగాన్ని తెచ్చి అగ్రజుడు ధర్మరాజుకి తన బహుమతిగా యివ్వాలి. ఆ మృగం గనుక వచ్చి ఈ యాగశాలలు, వంటశాలలు, భోజనశాలలు తిరిగితే దుర్గంధంపోయి, సుగంధ పరిమళాలు వీస్తాయి. సహజసిద్ధమైన పరిశుభ్రత దానికదే ఆ మృగసంచారం వలన సంతరించుకుంటుంది. ఈ ఆలోచన వచ్చినదే తడవుగా తన ఆయుధాగారానికి వెళ్ళి సువర్ణమయ మణిఖచిత గదాయుధాన్ని భుజాన వేసుకుని ధర్మరాజు మందిరానికి వెళ్ళి ఆయన అనుమతి తీసుకుని చాలా నిరాడంబరంగా బయలుదేరాడు. భీమసేనుడు నగరం వెలుపలి వరకు రథారూఢుడై ప్రయాణం చేసి, సారథిని, రథాన్ని వెనక్కు పంపివేసి నడక ప్రారంభించాడు. ఆయన గదను కుడి చేత్తో విలాసంగా తిప్పుతూ గజానికో అడుగు వేసుకుంటూ హుందాగా వెడుతున్నాడు. రాజసూయయాగం భోజన శాలలలోను యితర ప్రదేశాలలోను

యేర్పడుతున్న అశౌచాన్ని తొలగించి పరిశుభ్రత తీసుకురాగల శక్తి పురుషమృగానికి మాత్రమే వుంది. ఆ దివ్యమృగాన్ని ఎలాగైనా ఇంద్రప్రస్థానికి తీసుకురావాలి. ఆ పట్టుదల, విశ్వాసం, ధైర్యం, భుజబలం ఆయనకు దండిగా వున్నాయి. అయితే యేమార్గం గుండా వెళ్ళాలో సరైన అవగాహన కూడా లేదు. కార్యసాధనలో వున్నవారికి నిద్రాహారాలు అవసరం లేదట. భయం అసలేవుండదట. ఆ రెండు లక్షణాలు పుణికి పుచ్చుకున్న వాడు భీమసేనుడు. కౌరవులు బాల్యం నుండే పెట్టిన అగచాట్లు, కష్టాలు స్వయంగా తట్టుకుంటూ అన్నదమ్ముల్ని అమ్మకుంతిని రక్షించు కోవడంలో ఆరితేరిన మొనగాడు ఆయన.

శ్లో: సంచారా త్పురుష మృగస్య భుక్తశాలా
స్సమ్మృష్టా స్త్రిదివని కౌతనస్య కుర్యాం
ఆనేతుం తమితి విభావ్య భీమసేనః
నిష్క్రాంతస్య వనగృహా ద్యయౌ సుధర్మాం.

స్వర్గలోకం నుండి పురుషమృగాన్ని తీసుకొనివచ్చి భోజనశాలలను పవిత్రం చేస్తాను. ఆ పురుషమృగం సంచరించిన చోట దుర్గంధం తొలగిపోయి దివ్య పరిమళం వ్యాప్తిచెంది; ప్రజలను ఆహ్లాదపరుస్తుంది. అని మననం చేసుకుంటూ దేవేంద్రసభయైన సుధర్మకు బయలు దేరాడు భీమసేనుడు.

త్రేతాయుగంలో సీతాసాధ్వి జాడతెలియడానికి దక్షిణ దిక్కుగా బయలుదేరిన శ్రీఆంజనేయస్వామివారు అలుపుసొలుపెరుగక గగనయానం చేసినట్లు భీమసేనుడు శీతోష్ణసుఖదుఃఖాదులు లక్ష్యపెట్టకుండా పాదచారియై చాలా రోజులు నడుస్తూనే వున్నాడు. హనుమ, అంజనాదేవికి వాయుదేవుని అనుగ్రహం వలన జన్మిస్తే, ఆ సమీరదేవుడే ద్వాపరయుగంలో కుంతీదేవికి ఆశీస్సులిడగా పుట్టినవాడు భీమసేనుడు. యిద్దరూ పుట్టుకలోనేకాదు పట్టుదలలోనూ సోదరులే కదా!

ఎత్తైనకొండల నడుమ విశాల సమతల ప్రదేశం గల గంధమాదన పర్వతం సమీపిస్తున్నది. భీమసేనుడు చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో మధ్య మధ్య సింహనాదాలు చేసుకుంటూ ఉల్లాసంగా వెడుతున్నాడు. మన ప్రయత్నం మంచిదయితే భగవదనుగ్రహం వల్ల మార్గం అదే గోచరిస్తుంది. ధర్మబద్ధ జీవితం గడిపే పురుషశ్రేష్ఠునికి దేవతల ఆశీస్సులు తప్పక లభిస్తాయి. విశాలమైన వటవృక్షాలు, అశ్వత్థ వృక్షరాజాలు, సాల, మద్ది, క్రానుగ చెట్లు, మామిడి, సీతాఫల, రామాఫల, పనసాది ఫలవృక్షాలు దండిగా వున్నాయి. విరబూసిన చామంతులు, మందారాలు, దిరిశెన పువ్వులు, సంపెంగలు కరివేరం, నాగమల్లి పువ్వుల ఘుమఘుమలు, మధ్యలో చిన్న సెలయేళ్ళు, గలగలాపారుతున్నాయి. ఒక పెద్ద తటాకం స్వచ్ఛమైన నీరు అందులో వికసించిన

ఎఱ్ఱ తెల్ల, నీలికలువలు యివన్నీ చూస్తూ సాగిపోతున్నాడు. దూరంగా ఒక అరటితోట ఎదురైంది. గెలలు పండి పెద్ద అరటిపువ్వులు వాటి తేనెలు జుఱ్ఱుకుని ఝుం ఝుమ్మని తిరిగే భ్రమరాలు. ఉదయభాస్కరుని బంగరు కిరణాలలో పొగమంచుతో నిండిన ప్రదేశంలో హిమబిందువులే ముత్యాలుగా పొదిగిన పచ్చికపై ధీరగంభీరవదనుడు భీమసేనుడు వెడుతున్నాడు. ఆయన నడచి వస్తుంటే ఏనుగుల గుంపులు దూరంగా తొలగిపోతున్నాయి. శార్దూలాలు పొదల్లో దూరి కాళ్ళు ముడుచుకుని బిక్కు బిక్కుమంటూ కూర్చున్నాయి. సింహాలు గుంపులుగా చేరి ప్రాణభయంతో వణికిపోతున్నాయి. క్రూరమృగాలు తొలగి పోవటంతో మమ్మల్ని కాపాడే వీరుడొస్తున్నాడు అన్న ధీమాతో పచ్చికలు మేస్తున్నాయి జింకలు. కుందేళ్ళు ముక్కులు చెవులు వణికిస్తూ రెండు కాళ్ళపై నిలబడి ఆయనకు సంతోషంతో స్వాగతం చెప్పుతున్నాయి.



58. హనుమ భీమసేనుని పరీక్షించుట

శ్రీఆంజనేయస్వామి వారు గంధమాదనపర్వతం మీద సీతారామలక్ష్మణుల విగ్రహాల ముందు కూర్చుని తారకమంత్రం జపించుకుంటున్నారు. భీమసేనుడు చేస్తున్న సింహనాదాలు ఆయన చెవిన పడ్డాయి. తన యోగ దృష్టితో చూచారు. దృఢకాయుడు, సాహసవంతుడు, పాండునందనుడు, తన వలెనే వాయుదేవుని వరప్రసాదపుత్రుడు అయిన భీమసేనుని రూపం ఆయనకు గోచరించింది. తనకు స్వయానా తమ్ముడు. త్రేతాయుగంలో తను వీరుడని పేరు తెచ్చుకుంటే ఈ ద్వాపరంలో భీమసేనుడు రాక్షసవధ చేసి యశోవంతుడయ్యాడు. పురుషమృగము తెచ్చే ప్రయత్నంలో యిలా వస్తున్నాడని గ్రహించాడు హనుమ. తమ్మునికి సరియైన సలహాయిచ్చి పంపాలనుకున్నాడు. వెంటనే ఒక ముసలికోతి రూపం, చాలాపొడవైన తోక ధరించాడు. కొండదిగి కాలిబాట వద్ద ఒక వృక్షచ్ఛాయలో తోకను దారికడ్డంగా పడవేసి చెట్టుతొఱ్ఱ దగ్గర కాళ్ళు చేతులు ముడుచుకొని ఒదిగి కూర్చున్నాడు. జ్వరరోగి వలె దీర్ఘ నిట్టూర్పులు

విడవ నారంభించాడు. శివ నామజపం చేస్తున్నాడు.

"ఎవరది! మార్గమధ్యంలో తోకనడ్డంగా పరచినది" గంభీరమైన భీమసేనుని స్వరానికి పర్వతాలు ప్రతిధ్వనించాయి. నిట్టూర్పులు తప్ప సమాధానం లేదు. ఆయనకు పౌరుషం వచ్చింది. ఒక్కసారి కళ్ళెర్రజేసి, మీసం కుడిచేత్తో దువ్వుకుని -

"ఓ వృద్ధవానరమా! బాట కడ్డంగా నీవాలాన్ని వైచి చెట్టుతొఱ్ఱలో కూర్చున్నావా?"

"శివ.... శివ..... శివా.... ఎవరు నాయనా కళ్ళు కనపడవు. మాటవిన పడదు. వార్ధక్యం, పైగా రోగాలతో, నా శక్తులన్నీ ఉడిగిపోయాయి. ఏమి కావాలి నీకు?" అన్నారు హనుమ హీనస్వరంతో.

"నాకేమీ అవసరం లేదు. మార్గానికి అవరోధంగా వున్న నీ తోకను తొలగించు. నేను శీఘ్రంగా దేవేంద్రలోకానికి వెళ్ళి సుధర్మసభను చూడాలి" అన్నాడు భీముడు. కిచకిచా నవ్వేడు మారుతి.

"ఓ వృద్ధవానరమా! నువ్వు అపహాస్యం చెయ్యడానికి నేను సాధారణ మానవుణ్ణి కాను. ఈ ద్వాపరయుగంలో భూమండలం మీద ప్రసిద్ధి పొందిన మహా బలశాలిని, భీమసేనుణ్ణి. పాండురాజ ద్వితీయ పుత్రుణ్ని. నీతికోవదుడు ధర్మరాజుకు పెద్ద తమ్ముణ్ణి. ధనుర్విద్యా నిపుణుడు, ఇంద్రపుత్రుడైన అర్జునునికి అన్నను. శాఖామృగానివి గనుక బ్రతికిపోయావు. మరే నరుడైనా అయివుంటే ఈ గదాదండంతో ఈ పాటికీ వాడితల వెయ్యివ్రక్కలయి వుండేది".

"ఆ..... ఆ..... అంత మాట అనకు నాయనా. యౌవ్వనంలో నేనూ నీలాగే వుండేవాడిని".

"అహ! వుంటే వున్నావుగాని ముందు తోక తొలగించు వేగంగా వెళ్ళాలి".

"అదిసరే! ఈ యుగంలో నీ అంత బలశాలి లేదన్నావు నిజమేసుమా! యింత బలశాలివి., ఉన్నత వంశ రాజకుమారుడివి, దేవేంద్రసభకు కాలినడకన వెళ్ళి ఎన్నాళ్ళకు చేరుకుంటావు? అసలు నీకు గగన మార్గాన ప్రయాణించాలని స్ఫురించలేదా? యింతకీ నీకు దేవలోకంతో ఏమి పని పడింది?"

"మా అన్నగారు ధర్మరాజు రాజసూయయాగం నిర్వర్తిస్తున్నారు అశేష జన వాహిని ఇంద్రప్రస్థపురం సందర్శిస్తున్నారు. వారందరికి భోజనఫలహారాలు నా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాను."

"శుభం. నాకు కూడా నీ కమ్మని భోజనం రుచి చూపిస్తావా"

"దాని కేమి భాగ్యం నువ్వు ఎప్పుడు వచ్చినా మాఆతిథ్యం ఘనంగా యేర్పాటు చేస్తాము. కాని.... ఒక చిక్కు వచ్చి పడింది?" అని నసిగాడు భీముడు.

"ఆ సమస్య యేమిటో చెప్తే తోచిన సలహా యిస్తాను".

"అక్కడ రేయింబవళ్ళు సంతర్పణలు జరుగుతున్నాయి. సేవకులు ఎంత శుభ్రం చేసినా పరిసరాలు దుర్గంధం వస్తున్నాయి. నేల చిత్తడిగా మారిపోయింది. తడి ఆరిపోయే సావకాశం కూడా వుండటం లేదు. అందుకని ఈ సమస్య సంపూర్ణంగా పరిష్కరించేందుకు స్వర్గం నుండి పురుషమృగము తేవాలని బయలుదేరి వెడుతున్నాను".

"లెస్స యోచన! కానీ నీకిది సాధ్యపడుతుందాని" అన్నాడు మారుతి. ఆయన మాటలకు భీమసేనునికి పౌరుషం వచ్చింది. వెంటనే మీసం మెలితిప్పి కళ్ళు పెద్దవి చేసి –

"ఓ వృద్ధవానరమా! సాధ్యాసాధ్యాల విషయం మేము చూచుకుంటాము గాని; నువ్వు తక్షణం దారికడ్డంగా వున్న తోక తొలగించు. అలా ముందుకు వెళ్ళి ఫలాలారగించు. ఆ తటాకం వద్ద నీకు సౌఖ్యంగా వుంటుంది వెళ్ళు" అన్నాడు గంభీరంగా.

"నువ్వు చెప్పింది నిజమే నాయనా! జ్వరం వల్ల కదల లేక పోతున్నాను. మూడు దినాల నుండి యేపండు కాయ తినలేదు; నీరు తాగనూ లేదు. నాలుగు రోజుల క్రితం నీవంటి రాకుమారుడే మార్గం గుండా వెడుతూ నా అవస్థ చూచి పండ్లు, కాయలు, మంచి తీర్థం అందించి వెళ్ళాడు. మళ్ళీ అవకాశం చిక్కలేదు. నేను శరీరంలోని యే అవయవాన్ని కదల్చలేని దయనీయ స్థితిలో వున్నారు.

"నన్నేం చెయ్యమంటావు. అతి ముఖ్యమైన పని మీద వెడుతున్నాను కదా! మళ్ళీ వచ్చేటపుడు చూద్దాము."

"అలా ఉపేక్షించి వెళ్ళిపోతే నా గతి యేమవుతుంది. భీమసేనా! –

శ్లో॥ వృద్ధస్యార్తస్య బాలస్య
స్త్రీణాం చైవ విశేషతః
హృత భావస్యవై పంథా
ఇతి శాస్త్రవిదో విదుః

ముసలి వారికి, బాలలకు, కష్టములో వున్న వారికి, స్త్రీలకు మనస్సు చెడిపోయిన వారికి మార్గమే ఆధారమని ధర్మశాస్త్రం చెపుతున్నది. అందువల్ల నీవంటి సత్పురుషుల కోసం మార్గంలో వేచి వున్నాను.

శ్లో॥ తత్త్వయా రాజశార్దూల!
జలం దేయం పిపాసతే
పాహి మా మీదృశం దీనం
గమిష్యం త్వమవో మమ.

ఓ రాజసింహమా! నన్ను దాహం బాధిస్తోందయ్యా! నోరు పిడచకట్టుకు పోతోంది.

కొంచెం మంచి తీర్థం తెచ్చిపెట్టు. ప్రాణాలు పోతున్నాయి. ఈ దీన స్థితిలో వున్న నన్ను కనిపెట్టు నాయనా!

అని హనుమ వేడుకున్నాడు. భీమసేనునికి ఆశ్చర్యం వేసింది. గీర్వాణ భాషలో యింత చక్కటి శ్లోకం ఒక వానరం చెప్పగలిగిందంటే యిది యేదో శక్తి స్వరూపిణియైన జంతువు తప్ప సాధారణ వానరం అయివుండదు. తప్పక సహాయం చెయ్యాలి. పైగా ఆర్తుల్ని వదల కూడదని కదా శాస్త్రం, అనుకుని-

"సరే! నీకు మంచి నీరు తెచ్చియిస్తాను. .క్షణం వేచివుండు"

"సంతోషం. సత్పురుషులు దీనుల కష్టాలను చూస్తూ దానికి పరిష్కారం చూపకుండా వదలి వెళ్ళలేరు. వెళ్ళిరా". అన్నాడు కపిశేఖరుడు. వడివడిగా అడుగులేసుకుంటూ తాను చూచిన ఫల వృక్షాల వైపు వెనక్కి వెళ్ళాడు భీమసేనుడు. గద అక్కడే వుంచి వెళ్ళాడు. వానరం దీనంగా ప్రాధేయ పడటంతో భీమునికి ఆగ్రహం పోయి, ఏదో తెలియని అనురాగం ఉదయించింది హృదయంలో. ఆయనకు ఆకలి దప్పులంటే బాగా తెలుసు. మృష్టాన్నభోజనప్రియుడు, పాకశాస్త్రపండితప్రకండుడు కదా మరి! కొబ్బరి చెట్లను తన హస్తాలతో తాడించి రెండు గెలలను, అరటిచెట్లు విరిచి పక్వానికి వచ్చిన నాలుగు అరటి పండ్లగెలలు భుజాలపై వేసుకుని హనుమ దగ్గరకు వచ్చి ఆయన ముందుంచి -

"ఓ పండిత వానరమా! నీరసంతో కళ్ళు మూసుకున్నట్టున్నావు. యివిగో ఈ అరటిపళ్ళు ఆరగించు, నారికేళసలిలం త్రాగు". అని అన్నీ ఆయన ముందుంచాడు. హనుమకు చాలా ముచ్చట వేసింది. తమ్ముని దయావీరత్వానికి మనసులోనే మురిసి పోతూ పైకి నీరసం నటిస్తూనే -

"మంచిది నాయనా! నాతో పాటు నువ్వు కూడా ఆరగించు" అన్నాడు మారుతి.

"నేను కార్యసాధన కోసం వెడుతున్నాను. పని పూర్తయితేనే గాని భుజించ బుద్ధి కాదు. నువ్వారగించు" అంటూ వృక్షచ్ఛాయలో కూర్చున్నాడు. హనుమ ఒక్కొక్క గుద్దు గుద్దుతూ నారికేళాలన్నీ తాగేసి క్షణాల మీద అరటిపళ్ళన్నీ తినేసాడు. విస్మయంతో చూస్తూండి పోయాడు భీమన్న. ఆయన తన అన్నగారే అని తెలియక.

"మరి నేను వెళ్ళివస్తాను. తోక తియ్యి" అంటూ లేచాడు పాండుపుత్రుడు.

"మా మంచి మారాజు బిడ్డవు. ఈ కొబ్బరి గుంజు కూడా తింటే గాని ఓపిక రాదు. అందాక తోక తియ్యలేను. ఈలోగా వెళ్ళాలంటే నువ్వే దానిని తొలగించుకుని వెళ్ళు నాయనా!" అంటూ కొబ్బరి చిప్పల గుంజు గోక్కుని తింటున్నాడు. 'క్షణాల మీద గెలలన్నీ తినేసాడు ఓపిక లేదంటున్నాడు. సరే నేనే ఆ తోక తీసేసి వెడతాను' అనుకుంటూ కిందనున్న కట్టెను తీసుకుని ఎడమ చేత్తో పట్టుకుని వాలాన్ని తోసాడు. అది కదల

లేదు. ఎడమ చేత్తో విసురుగా లాగిపారేసాడు. అది కదలలేదు సరికదా ఆ విసురుకు తనే నిలదొక్కుకోలేక మోకాళ్ళ మీద ఒరిగి పోయాడు. హనుమ యివేమీ గమనించనట్లు కొబ్బరి గుంజు తింటున్నాడు. కుడి చేత్తో బలంగా వాలాన్ని లాగి చూచాడు. ఆవగింజంత కూడా కదపలేకపోయాడు. యిక లాభం లేదనుకుని ఉత్తరీయాన్ని గట్టిగా నడుముకు చుట్టి మోకాళ్ళ మీద ఆని రెండు హస్తాలతో తోకను లాగేసాడు. అది కదలలేదు సరికదా తనే వెల్లకిలా పడిపోయాడు. కోతి కిచకిచ నవ్వింది. సిగ్గుపడి తలదించుకున్నాడు.

ఎంత చిత్రం. నిన్నగాక మొన్ననే కదా ఈ చేతులతో జరాసంధుడ్ని మట్టిగరిపించి చీల్చి పారేసాను. ఒక్క వానరవాలాన్ని కదల్చ లేకపోతున్నాను. ఇది ఇంద్రప్రస్థపురంలో తెలిస్తే ఎంత అవమానం'. అనుకుంటూ వానరం వైపు చూచాడు. మారుతి కూడా తమ్ముని వైపు చూచాడు. యిద్దరి చూపులు కలిసాయి.

"ఈ యుగంలో నీ అంత బలశాలి లేదన్న మాట వాస్తవమే. నువ్వు జరాసంధుణ్ణి సంధులు విరగగొట్టి చంపిన మాట నిజమే. కాని...." అని అర్థోక్తిగా ఆగాడు హనుమ. భీమసేనుడు యింక తోక తొలగించే ప్రయత్నం మానుకుని నేను మనసులో అనుకుంటున్న మాటలు ఈ వానరం ఎలాగ్రహించగలిగింది. అని నిశితంగా కపివరుని గమనించాడు.



౬౦. "అష్టైశ్వర్య ప్రదాత – ఉష్ట్రారూఢ మారుతి"

ఎఱ్ఱని పగడాల ముద్ద వంటి మూర్తి, దివ్య తేజస్సుతో నేత్రాలు. విశాల వక్షస్థలం, సందేహం లేదు. ఈయనే మా అన్నగారు ఆంజనేయస్వామి అయివుంటారని నిర్ధారించుకుని వినమ్రంగా చేతులు జోడించి –

"మహానుభావా! మీరే మా అగ్రజులు, వాయునందనులు, శ్రీరామభక్తులు అయిన శ్రీఆంజనేయస్వామి వారనుకుంటున్నాను. అజ్ఞానిని. నేనే బలశాలినన్న అహంకారం తొలగిపోయింది. మిమ్మల్ని గుర్తించ లేక భుజబలదర్పం చూపించినందుకు మన్నించండి. మీ నిజరూపదర్శనం సాక్షాత్కరించి నన్ను కృతార్థుడ్ని చెయ్యండి ప్రభూ!" అంటూ

ఆయన పాదాల ముందు మోకరిల్లాడు. తమ్ముడు తనను గుర్తించినందుకు మారుతి హృదయం సంతోషంతో ఉప్పొంగి పోతోంది. అప్రయత్నంగానే ఆయన దేహం మేఘమండలం వరకు ఎదిగిపోయి పది యోజనాల విస్తీర్ణం, ముప్పది యోజనాల పొడవుతో పంచముఖాలతో, ధగద్ధగాయమానంగా అలంకరించబడిన రత్న కిరీటాలు, భుజకీర్తులు దండకడియాలు స్వర్ణమాలలతో సూర్యతేజంతో విస్ఫులింగాల వంటి నేత్రద్వయంతో, విశాలఫాలభాగంతో వెలిగిపోతూ గోచరించింది.

హనుమ ప్రధానముఖం వానరముఖం. చక్కగా తీర్చిదిద్దిన ఊర్ధ్వపుండ్రాలు, మకరకుండలాలు, నవరత్నఖచిత మహావజ్రకిరీటంతో రెండవ సూర్యుని వలె దివ్యకాంతులు విరజిమ్ముతోంది. దానికి కుడి వైపు సింహముఖం, బంగారురంగు జూలు గల సింహపు ముఖంపై స్వర్ణకిరీటం, తెరచి ఉగ్రంగా వున్న ముఖంలో శ్వేత దంతాల ధవళకాంతులు, మహోగ్రంగా వున్న అగ్నినేత్రాలు వున్నాయి. దాని ప్రక్కన అశ్వవదనం హయగ్రీవుని వదనంలా జ్ఞాన ప్రదాయకంగా శాంతగంభీరంగా వుంది. ఇక ఎడమ ప్రక్క వరాహవదనుడు. ఆది వరాహమైన విష్ణువులాగే తెల్లని కోరలతో నల్లని ముఖం. దాని ప్రక్క గరుడ శిరస్సు. రాజీవి వెల్లివిరుస్తూ సూటియైన ముక్కుతో పసిమిరంగు ముఖం స్వర్ణకుండలాలు, మణిమయమకుటంతో ప్రకాశిస్తున్నాడు. అమిత వైశాల్యంగల వక్షస్థలంపై ముత్యాల, కెంపుల, వజ్రాల హారాలు, తులసి మాలలు, రుద్రాక్షమాలలు వున్నాయి. సాక్షాత్తు విష్ణుదేవుడే నరసింహావతారం ఎత్తి ప్రహ్లాదుని కాపాడినట్లు, వరాహావతారం దాల్చి హిరణ్యాక్షుని జంపి భూమిని సముద్రం నుండి పైకి తెచ్చినట్లు, గరుత్మంతుడు తల్లి దాస్యవిముక్తికి అమృత భాండం తెస్తునట్లు, హయగ్రీవుడై తనకు జ్ఞానం బోధిస్తున్నట్లు భీమసేనుడు భావించి మహానందాన్ని పొందుతున్నాడు.

పది చేతులలో ఖడ్గత్రిశూలగదాపరిఘాయుధాలు, కలశం భజన చిడతలు ధరించివున్నాడు స్వామి. బలిష్ఠమైన కండరాలు యేర్పాటుగా కనిపిస్తున్న భుజాలు వక్షస్థలం తొడలు కాళ్ళు పసిమివర్ణంతో మెరిసే వెంట్రుకలు, నభోమండలంలో అనంతంగా విస్తరించిన తోక విస్తుపోయి చూస్తున్నాడు, పాండునందునుడు. ఒక మహాకాయంగల ఒంటెమీద కూర్చుని దర్శనమిస్తున్నాడు పంచముఖ ఆంజనేయస్వామివారు. ప్రసన్నవదనంతో తన వైపే చూస్తున్నారాయన. ఒంటెకు బంగారుగొలుసులు, ఆభరణాలు మెత్తటి ఎఱ్ఱనిపట్టుశాలువా పరచబడి వుండి దాని మీద ఆశీనులైవున్నారు స్వామి. ఉష్ట్రం మెడలో చిరుగంటలు గాలికి రమ్యమైన గణగణలు వినిపిస్తున్నాయి. నాదస్వరూపుడు హనుమ. వీణామృదంగనాదస్వరాదుల మేలి సమ్మేళన స్వరంతో పాటు "శ్రీరామ జయరామ జయజయ రామ" అన్న మంత్రం మంద్రస్థాయిలో వినిపిస్తోంది. పర్వతాలలో వీనుల విందుగా ప్రతిధ్వనిస్తోంది.

ఆనందపారవశ్యంలో భక్తి భావపూరితంగా -

శ్లో॥ మనోజవం మారుత తుల్య వేగమ్
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానర యూథ ముఖ్యమ్
శ్రీరామ దూతం శిరసా నమామి

'ఓ మహానుభావా! ఆంజనేయస్వామి! వాయుదేవునితో సమానమైన వేగము, శక్తి గలవాడా, ఇంద్రియవాంఛలను జయించిన వాడా! వానరయోధులలో శ్రేష్ఠుడా, శ్రీరామదూతా నీకు శిరస్సు వంచి నమస్కారములు చేస్తున్నాను' అని భీమసేనుడు సాష్టాంగ నమస్కారము చేసి ఆనందబాష్పపూరిత నయనాలతో స్వామి విశ్వరూపాన్ని తదేకంగా చూస్తూ పారవశ్యం, పారలౌకిక దివ్యానుభూతి పొందుతున్నాడు. కొన్ని క్షణాల అనంతరం స్వామి తన విశ్వరూపాన్ని ఉపసంహరించి తన సహజ రూపం ధరించి అనుగ్రహభాషణం చేస్తున్నారు.

"సోదరా భీమసేనా! ధర్మరాజు రాజసూయయాగం నిర్వర్తిస్తుండటం, నువ్వు అతిధి మర్యాదలు పాటిస్తూ పురుషమృగాన్ని తేవడానికి బయలుదేరడం ముదావహము. లోకకళ్యాణానికి ఏ శుభకార్యం జరుగుతున్నా దాని కర్తలకు నా శుభాశీస్సులు అందిస్తాను. త్రేతాయుగంలో నేను అర్చించుకున్న శ్రీరామచంద్రుడే యిప్పుడు ద్వాపరంలో లీలామానుషవేషధారి శ్రీకృష్ణపరమాత్మగా అవతరించి మీ చేత శిష్టరక్షణ కోసం కురుక్షేత్రసంగ్రామాన్ని చేయిస్తారు. మీ అన్నదమ్ములలో అధిక భాగం శత్రుసంహారమంతా భీమార్జునులే చేస్తారు. నువ్వు రణరంగంలో సింహనాదం చేసినప్పుడల్లా నీ గళంలో నా స్వరం మిశ్రమమై శత్రుభయంకరంగా దశదిశలు మార్మోగి శత్రుహృదయాలను భీతిల్లజేసి నీకు జయం శులభతరం చేస్తుంది. నీ తమ్ముడు అర్జునుని రథకేతనంపై నా చిత్తరువులో అదృశ్యంగా వుండి అతనికి రక్షణ నిస్తాను."

"ధన్యులము మహాకపివీరా! ధన్యులము. అడుగకనే వరములు గుప్పించే త్రిమూర్త్యాత్మక స్వరూపా నీకు జయము జయము. శ్రీరామ భక్తాగ్రగణ్యా నీకు దాసానుదాసులము. మీ కృపకు పాత్రులమైన మాకిక విజయము తథ్యము, మహానుభావా! మరియిక వెళ్ళిరమ్మంటారా' అన్నాడు భీమసేనుడు గద భుజాన వేసుకుని

"ఎందుకు తొందర పాటు, సావధాన చిత్తుడవై నేను చెప్పేది విను"

"చిత్తం! శలవియ్యండి"

"ఓయి భీమసేన యువరాజా! నేను అంజనాకేసరుల పుత్రుడను. వాయుదేవుని అనుగ్రహం వలన జన్మించినాను. నువ్వు కూడా అయన వరప్రసాదివే. అందు వలన

నేను నీకు అగ్రజుడను. ఈ గంధమాదన పర్వత ప్రాంతంలోనే నా నివాసము. శ్రీరామావతార పరిసమాప్తి జరిగిన పిదప యిక్కడే నివసిస్తున్నాను, నన్ను ప్రార్థించిన వారికి శీఘ్రముగా సహాయపడతాను. ఎక్కడ రామభజన, రామసంకీర్తనాది పుణ్యకార్యములు జరుగుతాయో అక్కడకు అదృశ్యరూపుడనై వెళ్ళి రామకథాశ్రవణం చేయటం నాకు ప్రీతికరము. నీ సింహనాదం విని నువ్వు పురుషమృగం తెచ్చు సాహసము చేస్తున్నావని మనోనేత్రముతో నిన్ను తిలకించి నీకు సరియైన మార్గం చూపాలని వచ్చి నీ బాహుబల పరాక్రమం పరిక్షించాను".

"అగ్రజా నా ఆభిజాత్యాన్ని మన్నించండి".

"అదిసరే! పురుషమృగాన్ని తేవటం నీవనుకున్నంత సులభసాధ్యము కాదు. అది మనోవేగమును మించిన వేగముకలది. ఒక్క క్షణంలో లక్షలకొలది యోజనాలు తాను అనుకోకుండానే ప్రయాణం చేయగలదు. ఆ దివ్యమృగం ముందు మానవులు దానవులు మరే జాతి వారుగాని ప్రయాణం చెయ్యజాలరు. దానికి మానవులను అసురులను భక్షించి వేసే అలవాటు వుంది. దానికన్న వేగంగా నువ్వు ప్రయాణించి భూమికి తీసుకుని రాగలవా?

"సూర్యగోళాన్ని ఫలమనుకుని బాల్యంలోనే మింగబోయిన మీ వంటి వీరులకు సోదరుడను. మీ అనుగ్రహం వుంటే సాధించగలను".

"నీ ఆత్మవిశ్వాసానికి, ధైర్యసాహసాలకు అభినందిస్తున్నాను. కొన్ని పనులు శారీరిక బలంతో గాక ఉపాయంతో సాధించాలి. మహా శూరత్వంగల పురుషమృగానికి ఒకానొక మంచి శుభాచారముంది. శివపూజ చేయటంలో దానికి మిక్కిలి ఆసక్తివుంది. ఎంతటి విపత్తు సంభవించినా, చివరికి ప్రాణాపాయమే ప్రాప్తించినా శివార్చన మాత్రం చేయనిదే అది అడుగు ముందుకు వెయ్యదు. శివలింగముగాని, శివాలయముగాని కనిపించినదే తడవుగా తన వేగాన్ని తగ్గించుకుని పూజాదులు చేసి గాని ముందుకు సాగదు".

"చిత్తం".

శ్రీహనుమానువాచ :-

శ్లో॥ ఏవం మదుక్తియోగేన
కర్తవ్యం జయమిచ్ఛతా
తవ లభ్యో మృగశ్రేష్ఠః
నస్యాత్తవ పరాజయః

శ్లో॥ ఇత్యాదిశ్య హితం తస్మై
హనుమా నుష్ట్రవాహనః

నిజవాలాగ్ర రోమాణి

ప్రదదౌ ముష్టి మాత్రతః

ఇట్లు నేను చెప్పినట్లు నువ్వు చేసినట్లయితే జయాభిలాషివైన నీకు ఆ పురుషమృగం లభిస్తుంది. నీకు పరాజయముండదు అని హనుమంతుడు ఉష్ట్రవాహనము నుండి ఉపదేశించి, భీమసేనునికి తన తోక మీది రోమములు ఒక పిడికెడు ప్రసాదించాడు. భీమసేనుడు వాటిని కళ్ళకద్దుకొని స్వీకరించాడు. తన ఉత్తరీయపు చెంగుకు ముడివేసి

"నా సుదీర్ఘవాలముపైగల వెంట్రుకలన్ని శివసంబంధములైనవే. నీవు పురుషమృగాన్ని తీసుకుని వెళ్ళేటప్పుడు దాని కంటె చాలా ముందు బయలుదేరు. ఎప్పుడైతే మృగం నిన్ను సమీపిస్తుందో అప్పుడు నా వాలరోమం ఒకటి క్రిందవెయ్యి. వెంటనే శివాలయము ఆవిర్భవిస్తుంది. ప్రయాణం మధ్యలో ఆపి ఆ మృగం శివార్చన యదావిధిగా చేస్తుంది. నువ్వు ఈ లోగా చాలా దూరం వెళ్ళగలవు. మళ్ళీ అది నిన్ను సమీపించగానే మరొక వాలశిరోజం జారవిడుచు. మరొక శంకరాలయము పుడుతుంది. మళ్ళీ అర్చన చేస్తుంది మృగము. ఈ విధంగా నీ ప్రయాణం కడు జాగ్రత్తగా కొనసాగించాలి. ఎప్పుడైతే నువ్వు దానికి పట్టుబడి పోయావో దానికి ఆహారమైపోతావు.

"మహా ప్రసాదం మారుతాత్మజా!"

"మన తండ్రి వాయుదేవుని ప్రార్థించి నీకు ఆకాశగమనశక్తిని యిదే ప్రసాదిస్తున్నాను. నువ్వు ఉత్తరక్షణంలో దేవేంద్ర నగరం అమరావతి చేరుకుంటావు. విజయోస్తు!" అని ఆశీర్వదించాడు హనుమ. భీమసేనుడు చేతులు జోడించి -

"ఆర్యా! హనుమత్ప్రభూ! నీ చిత్రవిచిత్ర స్థూల రూపములను దర్శించగోరుచున్నాను".

"భీమసేనా! నా స్థూల రూపాలు అనేకం వున్నాయి. అవన్నీ యిప్పుడు చూపించడం సాధ్యపడదు. లోకములకు బాధ నీకు భీతి కలుగుతాయి. వాని గుర్తులు మాత్రం చెపుతాను. నేను ఏరూపంలో సీతాసాధ్వికి సంతోషం కలిగించానో అది సూక్ష్మాతి సూక్ష్మమైనది. సూర్యోదయ పర్వతం మీద ఒక పాదం సూర్యాస్తమయ పర్వతం మీద ఒక పాదం వుంచి సూర్యభగవానుని సన్నిధానంలో వేదాంగాలను నేర్చుకున్నానో ఆ రూపం మధ్యమ రూపమని గ్రహించు. లంకలో సీతాదేవికి నాపై నమ్మకం కలగడానికి చూపించినది స్థూల రూపము" అని వివరించి, నీవారధాన్యము మొలక యొక్క చివరంత సూక్ష్మరూపము మాత్రం భీమునికి చూపించి అబ్బురపరచి, మరల యథాస్థితిని పొంది -

"నాయనా! పురుషమృగంతో మాట్లాడవలసిన మృగభాష కూడా నీకిదే

ప్రసాదిస్తున్నాను. శుభమగుగాక!" అని అంతర్ధానమయ్యాడు, ఆంజనేయస్వామి. ఆయనకు అంజలి ఘటించి మనసులోనే తలచుకున్న రీతిగా దేవేంద్రసభలో పురుషమృగం ఎదుట వున్నాడు భీమసేనుడు రెప్పపాటు కాలంలో. దేవేంద్రునికి నమస్కరించి పరిచయం చేసుకొని, పురుషమృగాన్ని సభానంతరం తీసుకువెళ్ళడానికి అనుమతి పొందాడు. అయితే సభ అయిన వెంటనే అది మృగరూపం దాల్చి తన నివాసానికేగింది.



61. భీమసేనుడు – పురుష మృగము

హనుమంతుడు యిచ్చిన పరమ పవిత్ర శివస్వరూప రోమాలు కుడిచేత్తో గుప్పెట్లో పట్టుకుని ఎడమ భుజంమీద గదను వేసుకుని పురుషమృగం ముందు నిలబడ్డాడు భీమసేనుడు. అది ఒక విశాలమైన పాలరాతి సభామంటపం. మధ్య మెత్తటి నీలపు పరుపు. దానిపై పరుంది పురుషమృగం. చూడటానికి సింహం వలెవుంది. కాని జూలు బహుస్వల్పం శిరస్సు పెద్దదిగావుంది. రెండు తెల్లని కొమ్ములు కూడా ఉన్నాయి తలపై. గోధుమ వన్నె చర్మం. దాని ముందు కాళ్ళపై శిరస్సువుంచి కనులు మూసుకుని నిద్రపోతోంది. సాహసి భీమరాజు ధైర్యంగా అలాగే నిలబడి కొన్ని క్షణాలు యోచించాడు. గదను ఒక ప్రక్కగా గోడకు అనించి రెండు చేతులు జోడించి ఆ మృగానికి ముమ్మారు ప్రదక్షిణ చేసి వినమ్రతతో ఎదురుగా నిలబడి –

"జై వీరాంజనేయా! రామభక్తహనుమాన్!! జై వాయుపుత్రా! నమోస్తు" అని ధ్యానించాడు. ఆ మృగము తలపైకెత్తి కళ్ళు తెరిచి తీక్షణంగా తన వైపే చూస్తోంది. రక్తవర్ణజీరలు గల పెద్ద పెద్ద కళ్ళు చూచి ఆయనకు ఆశ్చర్యం, కించిత్తు భయం కలిగాయి. అయినా అన్న ధర్మరాజుని, ఆంజనేయస్వామిని, శ్రీకృష్ణ పరమాత్మను స్మరించుకుని మృగభాషలో యిలా చెప్పసాగాడు.

"ఓ పురుషమృగ రాజమా! నేను భూలోకవాసిని. ఇంద్రప్రస్థ పురానికి మహారాజైన ధర్మరాజు యొక్క తమ్ముడను. మా తండ్రి పాండురాజు. తల్లి కుంతీదేవి. మేము ఐదుగురు అన్నదమ్ములము. నా తరువాతి సోదరుడు అర్జునుడు మీ దేవేంద్రుని వరప్రభావం వల్ల జన్మించాడు. యుధిష్ఠరుడు యమధర్మరాజు కుంతికి యిచ్చిన అనుగ్రహం వలన జన్మించి, సకల ధర్మములను ఎరిగిన వాడుగా ముల్లోకాలలో ప్రసిద్ధిపొందాడు. శత్రువులను ఓడించి శ్రీకృష్ణపరమాత్మ దయతో రాజసూయయాగం నిర్వర్తిస్తున్నాడు. ఆ మహాయజ్ఞం చూడటానికి లక్షల కొలది యాత్రికులు వచ్చి ఆతిధ్యం

పొందుతున్నారు. భోజనశాలలన్నీ నేను పర్యవేక్షిస్తున్నాను. వాటి పరిశుద్ధి కొఱకు నిన్ను నా వెంట తీసుకొని వెళ్ళాలనే సంకల్పంతో వచ్చాను. నీవు మూడులోకాలను పవిత్రం చెయ్యగల సామర్థ్యం గల దానవు. నా వెంట రావలసినదిగా నిన్ను ప్రార్థిస్తున్నాను", అని మరొకసారి అంజలి ఘటించి నిలబడ్డాడు.

ఆ దివ్య పురుషమృగము గంభీరమైన భీకర నయనాలు గుండ్రంగా తిప్పి ఆగ్రహంగా సూటిగా భీముని వంక వీక్షించి, తోక గాలిలో త్రిప్పి ప్రభంజనం సృష్టించి ధభీ మని నేలమీద కొట్టింది. బిగ్గరగా గర్జించింది. అయినా భీమసేనుడు ధైర్యంగా అలాగే నిలబడ్డాడు.

"ఓ భీమసేనా! నీ మాటలకు సంతోషించాను. నీకు మేలు కలుగుతుంది. అయితే నా సహజ స్వభావం, నియమాలు మారవు. నేను నరమాంస భక్షణ చేస్తాను. నిర్దయగా ప్రవర్తిస్తాను. కఠినములు, అశ్లీలములైన పదములతో నిన్ను దూషిస్తుంటాను. మీ పట్టణం చేరే వఱకు నా కంటె ముందు నువ్వు వేగంగా వెళ్ళాలి. నాకు అందేవో నిన్ను కరకరా నమిలి మింగేస్తాను. నీ లక్ష్యం నెఱవేరాలంటే నా కంటె వేగంగా ప్రయాణం చెయ్యాలి నువ్వు. లేనిచో లక్ష్యం నెఱవేరదు సరికదా మరి ప్రాణాలు కోల్పోతావు. అందుకు అంగీకారమైతేనే నీ వెంట వస్తాను". అన్నది మేఘం ఉరిమినట్లు హుంకరించి.

"ఓ మృగరాజమా! నీ నియమాలకు అవనత శిరస్కుడనై అంజలి ఘటిస్తూ అంగీకరిస్తున్నాను. నేను సర్వసంసిద్ధుడనై వున్నాను. అనుగ్రహించి నా వెంట రావలసిందిగా వేడుకుంటున్నాను" అని ధీరోదాత్తుడైన భీమసేనుడు పలికి తన గదను భుజాన వేసుకుని బొడ్డున దోపిన హనుమ వాలశిరోజాలను కొన్నింటిని తీసి కుడి చేత్తో పట్టుకుని కళ్ళ కద్దుకుని –

'జయము జయము వీర హనుమాన్' అని వెనుదిరిగి పరుగు లంఘించాడు. పురుషమృగం వేగంగా అనుసరిస్తోంది. భీమునకు పరుగెత్తి చెమటలు పట్టి ఆయాసం వస్తోంది. వెంటనే ఒక రోమాన్ని విసిరాడు. శివలింగం ఆవిర్భవించి, రెప్పపాటులో ఆలయం, ధ్వజస్థంభం, నందీశ్వరుడు చుట్టూ ప్రాకారాలు, మారేడు చెట్లు, ఫల పుష్ప వృక్షాలు వెలిసాయి. 'ఓం నమఃశివాయ' అని నమస్కరించుకుని ముందుకు పరుగు పెట్టాడు. పురుష మృగం మాత్రం ఆగిపోయింది. అంతవరకు నాలుగు కాళ్ళ మీద పరుగు పెట్టినది రెండు కాళ్ళపై మానవునిలా నడుస్తూ తన మాయాశక్తి వలన పూజాద్రవ్యాలను సృష్టించుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి లోపలికి వెళ్ళి విష్ణుపాదోదకమైన ఆకాశ గంగతో శివునికి అభిషేకం చేసింది. పంచామృతాలతో అభిషేకం చేసింది. కామధేనుఘృతంతో దీపారాధన కల్పవృక్ష పుష్పాలతో పూజ చేసి

శంకరుని విభూతి పెట్టుకుని మళ్ళీబయలుదేరింది. మరొక వెంట్రుక తీసి 'ఓం నమశ్శివాయ' అని స్మరిస్తూ వెనక్కి విసిరాడు. వెంటనే మరొక శివాలయం వెలిసింది. పురుషమృగం రెట్టించిన భక్తి ప్రపత్తులతో మళ్ళీ అర్చన ప్రారంభించింది. ఈసారి వెనక్కి తిరిగి చూడకుండా భీమసేనుడు పరుగుపెడుతున్నాడు. అర్చనలు ముగించుకుని అతివేగంగా సమీపించింది పురుషమృగము. మళ్ళీ రోమం విసిరి శివాలయం సృష్టించాడు. యిద్దరూ పోటీలు పడి ఇంద్రప్రస్థపురం పొలిమేర వరకు చేరుకున్నారు. నగరసింహద్వారం మహా జనసందోహంతో అల్లంత దూరంలో కనిపిస్తోంది. మేఘమండల మంతా నేతి పొగతో నిండిపోయి వుంది. ఋత్విజుల స్వాహాకారాలు నమకచమకాలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. భీముడు బాగా అలసిపోయి ఆయాసపడుతూ పరుగు పెడుతున్నాడు. మృగం బాగా సమీపించిందని మొలనున్న వాలశిరోజాల కోసం తడిమాడు. అన్నీ అయిపోయాయి. గుండె ఝల్లుమని వళ్ళంతా జలదరించంది. ఒక్క అంగలో పురద్వారం వైపు దుమికి కుడి పాదం ద్వారం లోపల పెట్టేసి ఒగురుస్తూ -

"హమ్మయ్య! అన్నయా!!" అని బిగ్గరగా అరిచాడు. తమ్ముని కోసమే ద్వారం దగ్గర విడిది చేసిన ధర్మరాజు కచ్చేరి చావడి నుండి వేగంగా బయటకు వచ్చి తమ్ముని చూచాడు. పరమానందభరితుడై వేగంగా వస్తున్నాడు.



౬౨. నీతి కోవిదుడు "ధర్మనందనుడు"

"ఓ భీమసేనా! నిలు నిలు నీ జిత్తులింక సాగవు. నాకు దొరికి పోయావు. నిన్నిక్కడే హతమార్చి కడుపు నింపుకుని సుధర్మకు వెళ్ళిపోతాను" అని ఎడమ చెయ్యి పట్టుకుని నిలిపివేసింది. వృకోదరునికి వణుకుపుట్టింది. మనసులో మారుతిని తలచుకుని ధైర్యం తెచ్చుకుని -

"ఓ పురుషమృగమా! ఓ విద్వాంసుడా! ధర్మవేత్తా! నీకన్న నేను ముందుగా

పురద్వారం చేరి కుడిపాదం లోపల పెట్టితిని. నేను ముందు చేరినాను. నన్ను కబళించటం అధర్మం. తొందర పడి నన్ను భక్షించవద్దు. సత్యవాక్యము నందు నడుచుకోవాలి. మాట తప్పవద్దు. నన్ను తినటం అన్యాయం. నీవంటి యోగ్యునికి, స్వర్గలోకవాసికి అధర్మబుద్ధి కలిగితే యింక సామాన్యజనులెలా ప్రవర్తించాలి. నన్ను దయతో కాపాడి వచ్చిన పని నెరవేర్చి మా అన్నగారిచ్చే అతిథి సత్కారాన్ని, సత్కీర్తిని పొంది వెళ్ళటం సముచితం" అని ప్రాధేయపడ్డాడు.

"నువ్వు కుడి పాదం ద్వారంలోపల ముందు పెట్టడం చూచాను. కాని ఎడమ పాదం బొటనవ్రేలు ద్వారం యివతలే వుండి పోయింది. నేను వచ్చి పట్టు కోవటానికి అదే కారణం. మీ అన్నగారు యిటే వస్తున్నారు. ఆయన ధర్మపరుడు కావున వారు చెప్పినట్లు చేస్తాను" అంది మృగం. ధర్మరాజు వచ్చి తమ్ముని ఆలింగనం చేసుకుని జరిగినది తెలుసుకున్నాడు. పురుషమృగానికి నమస్కారం చేసి -

"ఓ దేవలోక పురుషమృగమా! నువ్వు ఈ కుఱ్ఱవానితో చేసుకున్న ఒప్పందం ప్రకారం యితనిని తిని వేయబూనటం సబబే. కాని యితని శరీరంలో ముందుగా చేరిన శరీరభాగాలను విడిచి పెట్టి, నీకన్న ఆలస్యంగా వెనుక చేరిన అంగాలను ఛేదించి ఆరగించు. ఇది ధర్మ సమ్మతం" అని వినమ్రతతో చేతులు జోడించి విన్నవించాడు. మృగం ఆయన ధర్మబుద్ధికి సంతోషించింది. శాంతస్వరంతో యిలా బదులు పలికింది.

"ఓ యుధిష్టరుడా! నీ అనుజుడనే పక్షపాత బుద్ధి యిసుమంతయినా లేకుండా నిక్కచ్చిగా తీర్పు చెప్పినందుకు నిన్ను ప్రశంసిస్తున్నాను. మీ అన్నదమ్ములు ధర్మాత్ములన్న కీర్తి దిగంతాల వరకు వ్యాపించింది. మా దేవేంద్రులవారు కూడా మీపట్ల మిక్కిలి అనురాగంతో వున్నారు. మీరింత ఘనంగా యజ్ఞం నిర్వహిస్తుంటే చూచి వెడదామని భీమసేనుని వెంట వస్తూ అతని ధైర్యసాహసాలు పరీక్షించాను. మీ తమ్ముని కోరిక ప్రకారం ఇంద్రప్రస్థపుర మంతా తిరిగి సహజసిద్ధమైన పవిత్రతను, అమరలోక దివ్య పరిమళాలను ప్రసాదిస్తాను. పదండి! శ్రీ కృష్ణుల వారి దర్శన భాగ్యం కూడా చేసుకుని ధన్యత పొందుతాను" అని వారి వెంట నడచింది. యాగశాలలన్నీ తిరిగి చూచింది. అశౌచం పూర్తిగా తొలగి పోయింది. యజ్ఞం చివరిరోజు వరకు వుండి యజ్ఞపురుషునిగా గౌరవసత్కారాలు అందుకుంటున్న మురళీమోహనుని చూచి పులకించి పోయింది. పుణ్యపురుష రూపం ధరించి ధర్మరాజు యిచ్చిన చీనిచీనాంబరాలు, స్వర్ణాభరణాలు ధరించి తిరిగి స్వర్గలోకం చేరుకుని ఈ వార్తలన్నీ మహేంద్రునికి విన్నవించింది.

ఇంతటి ఘనకార్యం నిర్వహించిన పరాక్రమవంతుడు, ధీశాలి, మహాబలశాలి అయిన భీమసేనుని ధర్మజుడు గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. శ్రీకృష్ణుడు

ఆశీర్వదించాడు. నకులసహదేవులు అన్న సాహసాన్ని వేనోళ్ళ పొగిడారు. అర్జునుడు ధనుర్విద్యాపాండిత్యంతో పాతాళగంగను వెలికి తెచ్చి అన్న భీమసేనుని పాదాలు కడిగాడు. కుంతీదేవి కుమారుల శౌర్యప్రతాపాలకు మురిసిపోయింది. రాజసూయం సందర్శించి మయసభలో భంగ పడ్డ సుయోధనుడు మాత్రం దురభిమానంతో క్రుంగిపోయాడు. శ్రీకృష్ణుని రక్షణలో పాండవులు క్షేమంగా వున్నారు.

విశేష వ్యాఖ్యానము :-

ధర్మరాజు పితృదేవతలను తృప్తి పరచడానికి, తన శౌర్యప్రతాపాలు, దాతృత్వం ప్రకటించడం కోసం, పరరాజులతో మైత్రీబాంధవ్యాలు పటిష్ఠ పరుకునేందుకు; ప్రజానంక్షేమం కోసం రాజసూయ యాగం తలపెట్టాడు. భీమసేనుడు బాహుబలసంపన్నుడు. కార్యశూరత్వం, దక్షత, ప్రభుత, ధైర్యం, బుద్ధిబలం, పరాక్రమం, నీతి, రాజసం గల వీరుడు

ఈ సద్గుణాలన్నింటితోపాటు -

బుగ్గను గుబురుగా పెరిగిన మీసంలో రోషం, దర్పం, ఠీవి, ఈవి, కించిత్తు అహకారం గల రాజకుమారుడు. సంపూర్ణ మానవ ప్రకృత్తికి ప్రతిబింబం ఆయన.

ఆంజనేయస్వామి త్రేతాయుంగంలో రామరావణసంగ్రామంలో లక్షలాది రాక్షసవీరులతో ఎదురొడ్డి పోరాడిన మహావానరవీరుడు. పరాక్రమశాలి. అయినా అంతా శ్రీరాముని చేతి చలువ తప్ప తన ప్రతాపం కాదని విశ్వసించిన భక్తిభావదురంధరుడు. రామపాదదాసుడు. సీతమ్మను లంకలో చూసి వేదన చెందిన కరుణాంతరంగుడు. వీరుడైనా వినయసంపన్నుడు. దైవాంశ సంభూతుడు హనుమ.

శంకరుడు పరమాత్మ. భక్తజనప్రియంకరుడు. సకల శుభంకరుడు.

పురుషమృగం పరమ పవిత్రమైనది. క్రూరమైనదికూడా. ఇంద్రాది దేవతల అధీనంలో వుంది. పరాక్రమశాలి భీమసేనుడు తన శక్తికి మించిన దానిని తెచ్చి అన్నగారికి గౌరవప్రదంగా సమర్పిద్దామనుకున్నాడు.


శ్రీఆంజనేయస్వామి వాయుపుత్రుడు. కుంతీదేవికి సమీరదేవుని అనుగ్రహం వల్ల జన్మించినవాడు భీముడు. తమ్ముని మనసులోని గర్వం తొలగించి, శివానుగ్రహం అతనికి కలగజేయటం హనుమ అభిలాష.

పురుషమృగం ఎంతటి క్రూరస్వభావం గలదైనా, పరమాత్మ శక్తికి, భక్తికి లొంగుతుంది. శౌర్యప్రతాపాలు వీడకుండా ఉపాయంతో కార్యసాఫల్యం చేసుకున్నాడు భీమసేనుడు. అయినా చివరిలో దొరికిపోయాడు. పురుష ప్రయత్నం ఎంతటిదైనా దానికి ధర్మబలం కావాలి. యుధిష్టరుని ధర్మబద్ధమైన నిష్పాక్షికమైన తీర్పు చూసి పురుషమృగం తన క్రూరస్వభావాన్ని వదులుకుంది. శాంతికి హింస ఎప్పుడూ

అణిగిమణివుంటుంది. ఎంతటి సంగ్రామమైనా శాంతి అహింసల్లో ముగియవలసిందే! పాండవులు ధర్మపరులు అనడానికి ఈ కథ ఉదాహరణ. ధర్మాన్ని సంరక్షించే వారిని ఆధర్మమే రక్షిస్తుంది. శ్రీకృష్ణమూర్తి పాండవులకు బంధువు. సఖుడు, అండ, ఆచార్యుడు. సర్వసం ఆయనే. అన్యచింతనలు లేకుండా నన్నే, (శ్రీకృష్ణునే) ఆశ్రయించే వారి యోగక్షేమాలు నేనే వహిస్తాను అన్న గీతాచార్యుని వాక్కు సత్యమని తేలింది.

సంసారలంపటంలో చిక్కుకున్న మానవుడు తన స్వశక్తితో సమస్యల్ని ఎదుర్కుంటూ ధైర్యంగా, ధర్మబద్ధంగా ముందుకు వెళ్ళాలి. ఆచార్యుని ద్వారా భక్తిప్రపత్తులు పెంచుకొని, అహంభావాన్ని వీడాలి. అటువంటి పురుషునికి తొలుత దేవతల సహాయం లభిస్తుంది. పురుష ప్రయత్నం చేస్తూ, శక్తియుక్తులతో ధర్మబద్ధంగా ముందుకు సాగే భక్తునికి భగవంతుడు సహాయపడి చతుర్విధ పురుషార్థాలను అనుగ్రహిస్తాడు. స్వస్తి.

మంగళమగుగాక ॥



౬౩. శ్రీ ఆంజనేయ దండకము

శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్య కాయం। ప్రకీర్తిప్రదాయం। భజేవాయుపుత్రం। భజే వాలగాత్రం భజేహం। పవిత్రం। భజే సూర్యమిత్రం। భజేరుద్రరూపం। భజే బ్రహ్మతేజం। బటంచున్ ప్రభాతంబు సాయంత్రమున్నీనామ సంకీర్తనల్ చేసి నీరూపు వర్ణించి నీ మీదనే దండకంబొక్కటిన్ జేయ నూహించి నీమూర్తి గావించి నీ సుందరం బెంచి నీ దాసదాసుండనై। రామభక్తుండనై। నిన్ను నే గొల్చెదన్। నీ కటాక్షంబునన్, జూచితే వేడుకల్ జేసితే నా మొరాలించితే నన్ను రక్షించితే అంజనాదేవి గర్భాన్వయా దేవ నిన్నెంచ నేనెంతవాడన్। దయాశాలివై జూచితే దాతవై బ్రోచితే దగ్గరం బిల్చితే తొల్లి సుగ్రీవుకున్మంత్రివై స్వామి కార్యంబునందుండి శ్రీరామ సౌమిత్రులం జూచి వారిన్విచారించి సర్వేశు పూజించి యబ్భానుజుం బంటు

గావించి యవ్వాలినిన్ జంపి కాకుత్స్థ తిలకుం దయాదృష్టి వీక్షించి కిష్కింధ, కేతెంచి శ్రీరామ కార్యార్థమై లంక కేతెంచియున్ లంకిణిన్ గొట్టియున్। లంకయుం గాల్చియున్। భూమిజన్ జూచి యానందముప్పొంగ యా యుంగరం బిచ్చి యా రత్నమున్ దెచ్చి శ్రీరామునకున్నిచ్చి సంతోషునిన్ చేసి। సుగ్రీవునిన్ అంగదున్ జాంబవంతాది నీలాదులం గూడియా సేతువున్‌దాటి వానరులమ్మూకలై పెన్మూకలై దైత్యులం ద్రుంచగా। రావణుం డంత కాలాగ్ని యుగ్రుండుడై పోరి బ్రహ్మాండమైనట్టి యాశక్తినిన్ వేసి యాలక్ష్మణున్ మూర్ఛ నొందింపగా, నప్పుడే బోయి సంజీవియుందెచ్చి సౌమిత్రి కిన్నిచ్చి ప్రాణంబు రక్షింపగా కుంభకర్ణాది వీరాళితో పోరి చెండాడి శ్రీరామ బాణాగ్ని వారందరిన్ రావణున్ జంపగా నంత లోకంబు లానందమై యుండ నవ్వేళలన్ నవ్విభీషణు, న్వేదుకన్ దోడుకన్వచ్చి పట్టాభిషేకంబు జేయించి సీతా మహాదేవినిన్ దెచ్చి శ్రీరామునకున్నిచ్చి యా అయోధ్యకున్ వచ్చి పట్టాభిషేకంబు సంరంభమై యున్న నీకన్న నాకెవ్వరున్ గూర్మిలేరంచు మన్నించినన్ సేవించి రామభక్తి ప్రశస్తంబుగా నిన్ను నీనామసంకీర్తనల్జేసితే పాపముల్బాయునే భయములున్దీరునే భాగ్యముల్గల్గునే సకలసామ్రాజ్యము ల్సకల సంపత్తులున్ గల్గునే వానరాకార యో భక్తమందారయో పుణ్యసంచార యోవీర యోశూర నీవే సమస్తంబు నీవే మహాఫలమ్ముగా వెలసి యాతారక బ్రహ్మమంత్రంబు పఠించుచున్ స్థిరముగా వజ్రదేహంబు నుం దాల్చి శ్రీరామ శ్రీరామ యంచున్ మనఃపూతమై ఎప్పుడున్ తప్పకన్ తలతు నా జిహ్వాయందుండి నీ దీర్ఘదేహంబు త్రైలోక్య సంచారివై రామనామాంకిత ధ్యానివై బ్రహ్మవై బ్రహ్మ తేజంబునన్ రౌద్రనీజ్వాల కల్లోల హావీర హనుమంత! ఓంకార హ్రీంకార శబ్దంబులన్ భూత ప్రేతపిశాచ శాకినీ ఢాకినీగాలి దయ్యంబులన్ నీదు వాలంబునన్ జుట్టి నేలంబడంగొట్టి నీ ముష్టిఘాతంబులం బాహుదండములం రోమ ఖండంబులంద్రుంచి, కాలాగ్ని రుద్రుండవై బ్రహ్మ ప్రభాభాసితంబైన నీ దివ్య తేజంబునుం జూపి రారోరి నా ముద్దు నరసింహ యంచున్ దయాదృష్టి వీక్షించి నన్నేలు నాస్వామి నమస్తే సదా బ్రహ్మచారీ నమస్తే! వాయుపుత్రా నమస్తే నమస్తే నమో నమః॥.

(ఉదయం, సాయంత్రం పరిశుభ్రంగా నిష్ఠగా కూర్చుని శ్రీ ఆంజనేయ స్వామివారి దండకము పఠించిన వారికి భూత ప్రేత పిశాచ చోర శాకినీ, ఢాకినీ భయములు, రోగములు గ్రహదోషములు తొలగి పోవును. ఆపద సమయంలో పఠిస్తే ఆ ఆపద నుండి బయటపడతారు).



64. ఆధునిక యుద్ధవిద్యా పితామహుడు శ్రీ ఆంజనేయస్వామివారు

బుద్ధిర్బలం యశో ధైర్యం
నిర్భయత్వ మరోగతా
అజాడ్యం వాక్పటుత్వం చ
హనుమత్ స్మరణా ద్భవేత్

శ్రీ హనుమానుని పూజించటం వలన యశస్సు, ధైర్యము, భయము లేకుండా వుండటము, చక్కని ఆరోగ్యము, దీర్ఘవ్యాధులు రాకుండుట, సంభాషణా చాతుర్యము లభిస్తాయి. మరి దేహ దారుఢ్యము శత్రువు నుండి మనల్ని మనం కాపాడుకునే శక్తి, చురుకుదనం, క్లిష్ట పరిస్థితులలో తెగించి పోరాడి ఆత్మరక్షణ చేసుకోవటం చేతనవుతుంది. దానికి కొన్ని యుద్ధ విన్యాసాలు, చాకచక్యం కూడా స్వామివారే రామాయణ సన్నివేశాలలో ఆచరించి చూపారు. ఆ ఘట్టాలలో ప్రధానమైనవి ముందు వర్ణించి చెప్పటం జరిగింది. వాటిని ఆధునిక విధానాలతో పోల్చి చూద్దాము. సత్యం మీకే తెలుస్తుంది.

రామాయణ కాలం నుండి యిప్పటి వరకు దేశంలోని పలు ప్రాంతాలలో ఈ విద్యలన్ని పలు జానపద పోరాట రీతుల్లో వున్నాయి. కేరళ రాష్ట్రంలోని మర్మకళ దీనికి ఉదాహరణ. బౌద్ధ బిక్షువులు బుద్ధగీతాలను గానం చేస్తు నిర్జనారణ్యాలలో మత ప్రచారం కోసం తిరుగుతుండేవారు. దారి దోపిడీ చేసే దొంగల బారి నుండి తమను తాము ఆయుధం లేక పోయినా రక్షించుకోడానికి ఈ విద్యలనే నేర్చుకున్నారు. నరజాతిలోనేకాక ఈ విధానాలన్నీ జంతువుల్లో కూడా త్రేతాయుగం నుండి వున్నవే. ఒక జంతువు తనమీదికొస్తుంటే మరో జంతువు సమయోచితంగా అది కొట్టే దెబ్బల నుండి రక్షించుకుంటూ పోరాడుతుంది. రెంటి మధ్య యుద్ధం జరుగుతుంది. కాని వధ జరుగదు. పులులు, సింహాలు తమలో తాము కలహించుకుంటాయి కాని చంపుకోవు. ఈ విధానమే "కల్లరీ ఫైట్స్"కి మూలం. దానికి వాలి సుగ్రీవ హనుమ అంగద నల నీలాదులైన వానరవీరులు, భల్లూకరాజు జాంబవంతుడు ఆద్యులు.

1. కరాటే : కర+టే - కరము=చేయి, టే=ఆయుధము ఖాళీ చేతినే నరాలు బిగించి

బలంగా చేసి ఎదుటి వారిపై దాడి చేయటం దీనిలో ప్రధానాంశం.

సుందరకాండ 47వసర్గ, 31వ శ్లోకము:-

స తస్య తా నష్టహయా న్మహాజవాన్
సమాహితాన్ భారసహా న్వివర్తనే
జఘాన వీరః పథి వాయు సేవితే
తలప్రహారైః పవనాత్మజః కపిః

సందర్భము :- రావణ కుమారుడు అక్షునితో హనుమ యుద్ధం చేస్తూ అతను వేసిన బాణాలు చేతితో పట్టుకుని తిరిగి విసురుతూ విసిగి వేసారి చివరకు -

శ్లోక భావము:-

ఎనిమిది గుఱ్ఱాలను, రథాన్ని సుగ్రీవ మంత్రియైన హనుమ తన అరచేతితో చరచగా అవి చచ్చి, రథము విరిగి ఆకశము నుండి నేలపై పడెను.

2. సవాటే:- సవ+టే: కాళ్ళను తొడలని ఆయుధాలుగా చేసుకొని ఆత్మరక్షణ చేసుకుంటూ పోరాడే విధానము.

సుందరకాండ :- 41వ సర్గ, 14వ శ్లోకము :-

తతో మారుత వత్క్రుద్ధో
మారుతి ర్భీమ విక్రమః
ఊరు వేగేన మహతా ద్రుమాన్
క్షేప్తు ముథారభత్

రావణచక్రవర్తి దర్శనం కోరి అశోకవనాన్ని పాడుచేయటం మొదలు పెట్టిన హనుమ తన తొడలచే మహావృక్షాలను ఢీకొట్టి విరుగగొట్టేస్తున్నాడు.

3. జూడోఫైట్:- ఎంత బలవంతుడైన శత్రువైనా మనం స్థిరంగా నిలబడి, మన మీదికి అతను వచ్చే సమయంలో ఒడుపుగా అతన్ని ఎత్తి వేసి గాలిలో త్రిప్పేస్తూ క్రింద విసరి వేసే పద్ధతి జూడో. అక్షకుమారుడు బాలుడైనా విలువిద్యలో ఉద్దండుడు. అతన్ని ఎలాగైనా సంహరించకుండా వదిలిపెడదామని మారుతి ప్రయత్నించాడు. కాని అతని విలువిద్యారణధాటికి తట్టుకోవటం కష్టమనిపించింది. విజృంభించాడు మారుతి.

సుందరకాండ 47వ సర్గ, 34వ శ్లోకము

సమేత్య తం మారుత తుల్య విక్రమః

క్రమేణ జగ్రాహ స పాదయో ర్దృఢమ్.

ఆకాశంలో విహరిస్తూ తనపై బాణప్రయోగం చేస్తున్న అక్షకుమారుని పాదాలు ఒడుపుగా పట్టుకుని వేగంగా వెయ్యి సార్లు గిరగిర త్రిప్పి నేలకేసి కొట్టి సంహరించాడు హనుమ.

4. అకిడో :- నరవానర రాక్షస శరీరాలలో సుమారుగా రెండు వందల ఆరు అస్తులుంటాయి. ఆ ఎముకల సంధిబంధనాలు డెబ్బది రెండు. వీటిని సడలింప జేసి శత్రువును చిత్తు చేయటం అకిడో విద్య.

సందర్భము :- హనుమంతుడు సాలవృక్షాన్ని పెరికి జంబుమాలి పై విసరగా అతడు నాలుగు బాణాలచేత దానిని కొట్టెను. ఐదు బాణాలచే హనుమ భుజములను, ఒక్క బాణంచేత వక్షాన్ని కొట్టి బాధించగా -

సుందరకాండ 44వ సర్గ 17వ శ్లోకము

తస్య చైవ శిరోనాస్తి

న బాహూ న చ జానునీ

న ధను ర్న రథో

నాశ్వా స్తత్రాదృశ్యంత నేషవః

ఆగ్రహించిన హనుమ పరిఘ అనే ఆయుధం తీసుకొని జంబుమాలి రొమ్ముపై బలంగా కొట్టగానే అతని తల, చేతులు, మోకాళ్ళు వేటికవి పూడిపోయి దూరంగా పడిపోయాయి. యింకా అతని రథము, గాడిదలు, విల్లంబులు కూడా చెల్లాచెదురయిపోయాయి. వాల్మీకిమహర్షి చిన్న చిన్న శబ్దములతో జంబుమాలి అవయవాలు విడిపోయినట్లుగా వ్రాసిన శ్లోకం పరిశీలిస్తే ఆయన కవితా నైపుణ్యం ంది.

సుందరకాండ 45వ సర్గలో 10 నుండి 17 శ్లోకాల వరకు ఆంజనేయస్వామి నిరాయుధుడుగానే రాక్షసులతో పోరాడినట్లు వుంది.

హనుమ పెద్ద గర్జనలు చేసి రాక్షసులను భయపెట్టాడు. కొందరు రాక్షసులను

చేతులతో, కొందరిని పాదములతో, పిడికిళ్ళతో అరచేతి చరుపులతో కొట్టి సంహరించాడు. కొందరిని గోళ్ళ చేత చీల్చి తొడల మధ్య శిరస్సు పెళ్ళున విరిచి; మోకాళ్ళతో కుమ్మి చంపివేసాడు. ఈ పద్ధతులన్నీ చాన్‌మాతో, కుంగ్‌ఫూ, నాంబాక్ అనే యుద్ధవిధానాలుగా యిప్పుడున్నాయి.. అందువలన శ్రీ ఆంజనేయస్వామిని ప్రార్థించుకున్న వారికి ఆయురారోగ్యసౌభాగ్యాలు, బుద్ధిబలం, దేహదారుఢ్యం, ముక్తి, ఆత్మసంరక్షణావాకచక్యం, శత్రుజయం అన్నీ లభిస్తాయి.



భగవద్దర్శనము

కంటికి కనిపించనిది నాలుకకు; జిహ్వాకు అందనిది ముక్కుకు; నాసికకు తెలియనిది చర్మానికి; చర్మానికి అంతుపట్టనిది; చెవికి వీటన్నింటికీ తెలియనది మనస్సుకు; ఆ మనస్సు గ్రహించలేనిది బుద్ధికి; బుద్ధికి అందనిది విశ్వాసానికి ; విశ్వాసం కంటె ఉన్నతమైనది భక్తికి తేటతెల్లమవుతుంది. భక్తివిశ్వాసాల జోడింపు వలన "భగవద్దర్శనం" కలుగుతుంది. అది అంతరంగానికి అనుభవైకవేద్యము. మహాభక్తులకు గాని ప్రత్యక్షదర్శన యోగత్య లేదు.

—— Pen, dikatla ——

మంగళ మహాశ్రీ శ్రీశ్రీశ్రీశ్రీ



స్వర్గీయ శ్రీ పెండికట్ల సూర్యనారాయణమూర్తి, శ్రీమతి పద్మావతి గార్లు
(రచయిత తల్లిదండ్రులు)



డాక్టర్ పెండికట్ల శివరామకృష్ణారావు, శ్రీమతి వరలక్ష్మి
కుమార్తె : పెండికట్ల దేవిశ్రీవల్లి



అంబేద్కర్‌గా "పెండికట్ల"




సుయోధనునిగా "పెండికట్ల"





సుభాష్ చంద్రబోస్‌గా
"పెండికట్ల"



డాక్టర్ పెండికట్ల శివరామకృష్ణారావు
డోర్ నెం. 8-43, పెండికట్లవారి వీధి, కోరుకొండ - 533 289. తూ॥గో॥జిల్లా. సెల్ : 94405 95837
శ్రీ లక్ష్మీనరసింహ ఆధ్యాత్మిక సాహిత్య పరిషత్తు, పాండురంగస్వామి గుడి, నరసన్ననగర్, కాకినాడ-4.

Padmanabha Offset Printers, Ramaraopeta, Kakinada. Ph : 6588013